SIVA PURANA
UMA SAMHITHA



KAUSIKI

9

శ్రీ శివ మహా పురాణము

ఉమా సంహితము

1 – శ్రీకృష్ణ– ఉపమన్యు సంవాదము

శ్రీగౌరీశంకరాభ్యాం నమః ।

అథ పంచమీ ఉమాసంహితా ప్రారభ్యతే ।

యో ధత్తే భువనాని సప్త గుణవాన్ స్రష్టా రజస్సంశ్రయః సంహర్తా తమసాన్వితో
గుణవతీం మాయామతీత్య స్థితః ।
సత్యానందమనంతబోధమమలం బ్రహ్మాదిసంజ్ఞాస్పదం నిత్యం
సత్త్వసమన్వయాదధిగతం పూర్ణం శివం ధీమహి ॥

గుణములకు అధిష్ఠానమగు ఏ పరమేశ్వరుడైతే రజోగుణమునాశ్రయించి ఏడు లోకములను ధరించి పాలించుచున్నాడో, తమోగుణము నాశ్రయించి సంహరించుచున్నాడో, ఏ పరమేశ్వరుడు త్రిగుణాత్మకయగు మాయకు అతీతుడై యున్నాడో, అట్టి సత్యస్వరూపుడు, ఆనందఘనుడు, సర్వపరిచ్ఛేదరహితుడు, జ్ఞానఘనుడు, సంసారదోషవర్జితుడు, బ్రహ్మ విష్ణు రుద్రులను పేర్లతో వ్యవహరింప బడువాడు, నిత్యుడు, సాత్త్వికభావమును పెంపొందించు కొనుట వలన లభించువాడు, పూర్ణుడు అగు శివుని మేము ధ్యానించుచున్నాము.

ఋషయ ఊచుః ।

సూత సూత మహాప్రాజ్ఞ వ్యాసశిష్య నమోఽస్తు తే ।
చతుర్థీ కోటిరుద్రా ఖ్యా శ్రావితా సంహితా త్వయా ॥
అథోమాసంహితాంతఃస్థనానాఖ్యాన సమన్వితమ్ ।
బ్రూహి శంభోశ్చరిత్రం వై సాంబస్య పరమాత్మనః ॥

ఋషులు ఇట్లు పలికిరి –

ఓ సూతా! వ్యాసశిష్యుడవగు నీవు మహాబుద్ధిశాలివి. నీకు నమస్కారమగుగాక! కోటి రుద్రసంహిత యను పేరు గల నాల్గవ సంహితను నీవు వినిపించి యుంటివి. ఇప్పుడు ఉమాసంహితలో ఉన్న సాంబపరమాత్మునియొక్క అనేకగాథలతో గూడిన చరితమును చెప్పుము.

సూత ఉవాచ ।

మహర్షయ శ్శౌనకాద్యాః శృణుత ప్రేమతశ్శుభమ్ ।
శాంకరం చరితం దివ్యం భుక్తిముక్తి ప్రదం పరమ్ ॥
ఇతీదృశం పుణ్య ప్రశ్నం పృష్టవాన్మునిసత్తమః ।
వ్యాసస్సనత్కుమారం వై శైవం సచ్చరితం జగౌ ॥

సూతుడు ఇట్లు పలికెను –

శౌనకాది మహర్షులారా! శుభకరము, దివ్యము, భుక్తిని మరియు ముక్తిని ఇచ్చునది, సర్వోత్కృష్టము అగు శంకరచరితమును ప్రేమతో వినుడు. వ్యాసమహర్షి ఇటువంటి పవిత్రమగు ప్రశ్నను సనత్కుమారుని యెదుట వేయగా, ఆయన శివుని సచ్చరిత్రమును చెప్పియుండెను.

సనత్కుమార ఉవాచ ।

వాసుదేవాయ యత్ప్రోక్తముపమన్యుమహర్షిణా ।
తదుచ్యతే మయా వ్యాస చరితం హి మహేశితుః ॥
పురా పుత్రార్థమగమత్కైలాసం శంకరాలయమ్ ।
వసుదేవసుతః కృష్ణస్తపస్తప్తుం శివస్య హి ॥
అత్రోపమన్యుం సందృష్ట్వా తపంతం శృంగ ఉత్తమే ।
ప్రణమ్య భక్త్యా స మునిః పర్యపృచ్ఛత్కృతాంజలిః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఓ వ్యాసా! ఉపమన్యుమహర్షి వాసుదేవునకు చెప్పియున్న మహేశ్వర చరితమును మాత్రమే ేనేను చెప్పుచున్నాను. వసుదేవుని కుమారుడగు శ్రీకృష్ణుడు పూర్వము పుత్రుని గోరి శివుని గురించి తపస్సును చేయుట కొరకై కైలాసమునకు వెళ్లెను (?). అచట శ్రేష్ఠమగు హిమవత్పర్వతశిఖరముపై తపస్సు చేయుచున్న ఉపమన్యుమహర్షిని చూచి, మననశీలుడగు ఆ కృష్ణుడు భక్తితో చేతులను జోడించి ప్రణమిల్లి ఇట్లు ప్రశ్నించెను.

శ్రీకృష్ణ ఉవాచ ।

ఉపమన్యో మహాప్రాజ్ఞ శైవప్రవర సన్మతే ।
పుత్రార్థమగమం తప్తుం తపోఽత్ర గిరిశస్య హి ॥
బ్రూహి శంకరమాహాత్మ్యం సదానందకరం మునే ।
యచ్ఛ్రుత్వా భక్తితః కుర్యాం తప ఐశ్వరముత్తమమ్ ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను :

ఓ ఉపమన్యూ! నీవు మహాబుద్ధిశాలివి, శివభక్తులలో అగ్రగణ్యుడవు మరియు సద్బు ్బుద్ధి గలవాడవు. నేను పుత్రుని గోరి శివుని కొరకై తపస్సును చేయుటకు ఇచ్చటకు వచ్చియుంటిని. ఓ మహర్షీ! సర్వదా ఆనందమును కలిగించే శంకరుని మహిమను గురించి చెప్పుము. నేను దానిని భక్తితో విని, శివుని గురించి ఉత్తమమగు తపస్సును చేసెదను.

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య వాసుదేవస్య ధీమతః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా హ్యుపమన్యుస్స్మరన్ శివమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

బుద్ధిశాలియగు వాసుదేవుని ఈ వచనములను విని ఉపమన్యుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై శివుని స్మరించి ఇట్లు బదులిడెను.

ఉపమన్యురువాచ ।

శృణు కృష్ణ మహాశైవ మహిమానం మహేశితుః ।
యమద్రాక్షమహం శంభోర్భక్తివర్ధన ముత్తమమ్ ॥
తపః స్థోఽహం సమద్రాక్షం శంకరం చ తదాయుధాన్ ।
పరివారం సమస్తం చ విష్ణ్వాదీనమరాదీకాన్ ॥
త్రిభిరం శైశ్శోభమానమజస్ర సుఖమవ్యయమ్ ।
ఏకపాదం మహాదంష్ట్రం సజ్వాలక బలైర్ముఖైః ॥
ద్విసహస్రమయూఖానాం జ్యోతిషాఽ తివిరాజితైః ।
సర్వాస్త్ర ప్రవరాఢమనేకాక్షం సహస్రపాత్ ॥
యశ్చ కల్పాంతసమయే విశ్వం సంహరతి ధ్రువమ్ ।
నావధ్యో యస్య చ భవేత్ త్రేలోక్యే సచరాచరే ॥
మహేశ్వరో భుజోత్సృష్టం త్రైలోక్యం సచరాచరమ్ ।
నిర్దదాహ ద్రుతం కృత్స్నం నిమేషార్థాన్న సంశయః ॥
తపఃస్థో రుద్రపార్శ్వస్థం దృష్ట వానహమవ్యయమ్ ।
గుహ్యమస్త్రం పరం చాస్య న తుల్యమధికం క్వచిత్ ॥
యత్తచ్ఛూలమితి ఖ్యాతం సర్వలోకేషు శూలినః ।
విజయాభిధమత్యుగ్రం సర్వశస్త్రాస్త్ర నాశకమ్ ॥
దారయేద్యన్మహీం కృత్స్నాం శోషయేద్యన్మహోదధిమ్ ।
పాతయేదఖిలం జ్యోతిశ్చక్రం యన్నాత్ర సంశయః ॥
యౌవనాశ్వో హతో యేన మాంధాతా సబలః పురా ।
చక్రవర్తీ మహాతేజాస్త్రైలోక్యవిజయీ నృపః ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను :

గొప్ప శివభక్తుడవగు ఓ శ్రీ కృష్ణా! ఉత్తమమగు భక్తిని పెంపొందించే మహేశ్వరుని మహిమను నేను చూచితిని. ఆ శంభుని మహిమను వినుము, నేను తపస్సును చేయుచుండగా, సమస్తపరివారముతో కూడియున్న శంకరుని, ఆయనయొక్క ఆయుధములను, మరియు విష్ణువు మొదలగు దేవతలను చూచితిని. తన స్వరూపమునందు మూడు అంశలతో ప్రకాశించువాడు, నిత్యానందస్వరూపుడు, వినాశము లేనివాడు, ఒక అంశచే జగద్రూపముగా ప్రకటమై యున్నవాడు, పెద్ద కోరలు గలవాడు, మంటలను ఖ్రింగుచున్న నోళ్లు గలవాడు, రెండు వేల కిరణముల కాంతిచే అతిశయించి ప్రకాశించుచున్నవాడు, శ్రేష్ఠమగు అస్త్ర ములన్నింటితో నిండియున్నవాడు, అనేకనేత్రములు గలవాడు, అసంఖ్యాకమగు పాదములు గలవాడు అగు శంకరుని చూచితిని. ఆయన కల్పాంతము నందు జగత్తును నిశ్చయముగా ఉపసంహరించును. చరాచరప్రాణులతో కూడియున్న ముల్లోకములలో ఆయనచే సంహరింప బడని వాడు లేడు. ఆ మహేశ్వరుడు తన భుజములనుండి సృష్టించబడే, స్థావరజంగమాత్మకమగు ప్రాణులతో కూడి యున్న ముల్లోకములను

క్షణకాలములో దహించి వేయుననుటలో సందేహము లేదు. తపస్సును చేయుచున్న నేను రుద్రుని ప్రక్కనే యున్న పరమరహస్యమగు ఆ శూలమనే ఆయుధమును చూచితిని. దానికి వినాశము లేదు. దానితో సమమైనదీ కాని, దానికంటే అధికమైనది గాని ఆయుధము మరియొకటి లేదు. అతిభయంకరమైనది, సకలశస్త్రములను మరియు అస్త్రములను వినాశము చేయునది, విజయము అను పేరు గలది అగు ఆ ఆయుధమునకు శూలము అనియు, దానిని ధరించే శివునకు శూలి అనియు ముల్లోకములలో ప్రసిద్ధి కలిగినది. అది భూమినంతనూ పగులగొట్ట గలదు; మహాసముద్రమును ఎండింప జేయగలదు; నక్షత్రసమూహమునంతనూ కూల్చగలదు; ఈ విషయములో సందేహము లేదు. యువనాశ్వుని కుమారుడు, మహాతేజశ్శాలి, ముల్లోకములను జయించిన వాడు అగు మాంధాత చక్రవర్తిని అది సైన్యముతో సహా పూర్వము వధించినది.

దర్పావిష్టో హైహయశ్చ నిఃక్షిప్తో లవణాసురే ।
శత్రుఘ్నం నృపతిం యుద్ధే సమాహూయ సమంతతః ॥
తస్మిన్ దైత్యే వినష్టే తు రుద్రహస్తే గతం తు యత్ ।
తచ్ఛూలమతి తీక్ష్ణాగ్రం సంత్రాసజననం మహత్ ॥
త్రిశిఖాం భ్రుకుటీం కృత్వా తర్జయంతమివ స్థితమ్ ।
విధూమ్రానలసంకాశం బాలసూర్య మివోదితమ్ ॥
సూర్యహస్తమ నిర్దేశ్యం పాశహస్తమి వాంతకమ్ ।
పరశుం తీక్ష్ణధారం చ సర్పాద్యైశ్చ విభూషితమ్ ॥
కల్పాంతదహనాకారం తథా పురుష విగ్రహమ్ ।
యత్తద్భార్గవరామస్య క్షత్రియాంతకరం రణే ॥
రామో యచ్ఛలమాశ్రిత్య శివదత్తస్య వై పురా ।
త్రిస్సప్తకృత్వో న క్షత్రం దదాహ హృషితో మునిః ॥
సుదర్శనం తథా చక్రం సహస్రవదనం విభుమ్ ।
ద్విసహస్రభుజం దేవమద్రాక్షం పురుషాకృతిమ్ ॥
ద్విసహస్రేక్షణం దీప్తం సహస్ర చరణాకులమ్ ।
కోటిసూర్య ప్రతీకాశం త్రైలోక్య దహనక్షమమ్ ॥
వజ్రం మహోజ్జ్వలం తీక్ష్ణం శతపర్వ మనుత్తమమ్ ।
మహాధనుః పినాకం చ సతూణీరం మహాద్యుతిమ్ ॥
శక్తిం ఖడ్గం చ పాశం చ మహాదీప్తం సమాంకుశమ్ ।
గదాం చ మహతీం దివ్యామన్యాన్యస్త్రాణి దృష్టవాన్ ॥

పొగరుమోతు లవణాసురుడు శత్రుఘ్న మహారాజును యుద్ధమునకు ఆహ్వానించగా ఆయన ఆ రాక్షసుని సంహరించెను. మిక్కిలి వాడి కోరగలది, అతిశయించిన భయమును కలిగించునది అగు ఆ శూలము ఆ రాక్షసుడు నశించగానే రుద్రుని చేతియందు చేరినది. పొగలేని అగ్ని వలెనున్నది, ఉదయించే

సూర్యుని పోలినది అగు ఆ శూలము మూడు అగ్రములను కనుబొమలుగా చేసుకొని భయపెట్టుచున్నదా యన్నట్లు ఉండెను, అతిశయించిన కాంతిని కలిగియుండుటచే ఇదమిత్థముగా నిర్దేశించ శక్యము కాని ఆ శూలమును శివుడు ధరించినప్పుడు మృత్యుపాశమును చేతబట్టిన యమునివలే, సూర్యుని చేతితో పట్టుకున్నవాని వలె ప్రకాశించును. పదునైన ధార గలది, సర్పములు మొదలగు వాటిచే అలంకరింప బడినది, ప్రలయకాలాగ్నిని పోలియున్నది, పురుషాకారముతో సమమగు పొడవు గలదీ అగు గండ్రగొడ్డలిని కూడ చూచితిని. భార్గవరాముడు యుద్ధములో దానితో క్షత్రియులను సంహరించినాడు. పూర్వము దీనిని ని శివుడు భార్గవరామునకు ఈయగా, ఆయన దానితో ఇరువది ఒక్క పర్యాయములు క్షత్రియులను సంహరించి లోకములో క్షత్రియులు లేకుండగా చేసి ఆనందించేను వేయి ముఖములు గలది, సర్వ సమర్థమైనది, రెండు వేల భుజములు రెండు వేల నేత్రములు మరియు వేయి పాదములు గల పురుషుని రూపమును దాల్చి కోటిసూర్యుల కాంతితో వెలిగిపోవుచున్నది, ముల్లోకములను దహించే సామర్థ్యము గలది అగు సుదర్శనచక్రమును చూచితిని, అతిశయించిన ప్రకాశము గలది, వంద వాడి అంచులు గలది, సర్వోత్తమమైనది అగు వజ్రమును, అంబులపొదితో గూడి గొప్పగా ప్రకాశించే పినాకమనే గొప్ప ధనస్సును, శక్తిని, కత్తిని, గొప్ప కాంతులు గల పాశమును, అంకుశమును, దివ్యమైన గొప్ప గదను మరియు ఇతరములగు అస్త్రములను చూచితిని.

తథా చ లోకపాలానామ స్త్రాణ్యేతాని యాని చ ।
అద్రాక్షం తాని సర్వాణి భగవద్రుద్రపార్శ్వతః ॥
సవ్యదేశే తు దేవస్య బ్రహ్మా లోకపితామహః ।
విమానం దివ్యమాస్థాయ హంసయుక్తం మనోపమమ్ ॥
వామపార్శ్వే తు తస్యైవ శంఖచక్ర గదాధరః ।
వైనతేయం సమాస్థాయ తథా నారాయణః స్థితః ॥
స్వాయంభువాద్యా మనవో భృగ్వాద్యా ఋషయస్తథా ।
శక్రాద్యా దేవతాశ్చైవ సర్వ ఏవ సమం యయుః ॥
స్కందశ్శక్తిం సమాదాయ మయూరస్థస్సఘంటకః ।
దేవ్యాస్సమీపే సంతస్థౌ ద్వితీయ ఇవ పావకః ॥
నందీ శూలం సమాదాయ భవాగ్రే సమవస్థితః ।
సర్వభూతగణాశ్చైవ మాతరో వివిధాః స్థితాః ॥
తేఽభివాద్య మహేశానం పరివార్య సమంతతః ।
అస్తువన్ వివిధైః స్తోత్రైర్మహాదేవం తదా సురాః ॥
యత్కించిత్తు జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽథ వా ।
తత్సర్వం భగవత్పార్శ్వే నిరీక్ష్యాహం సువిస్మితః ॥
సుమహద్ధైర్యమాలంబ్య ప్రాంజలిర్వివిధైః స్తవైః ।
పరమానంద సంమగ్నోఽభూవం కృష్ణాహమద్వరే ॥

సమ్ముఖే శంకరం దృష్ట్వా బాష్పగద్గదయా గిరా ।

అపూజయం సువిధివదహం శ్రద్ధాసమన్వితః ॥

అంతే గాక, రుద్ర భగవానుని ప్రక్కన నేను లోకపాలకుల అస్త్రముల నన్నింటినీ చూచితిని. ఆ దేవుని ఎడమ ప్రక్కన లోక పితామహుడగు బ్రహ్మ హంసలను పూన్చిన, మనోవేగము గల దివ్యవిమానమును అధిష్టించి యుండెను, మరియు ఆయనకు ఎడమ ప్రక్కనే నారాయణుడు శంఖచక్రగదలను ధరించి గరుడునిపై కూర్చుండి యుండెను. స్వాయంభువుడు మొదలగు మనువులు, భృగువు మొదలగు ఋషులు, మరియు ఇంద్రుడు మొదలగు దేవతలు అందరు అచటకు చేరిరి. కుమారస్వామి శక్తిని మరియు ఘంటను చేతబట్టి, నెమలిపై కూర్చుండి పార్వతీదేవికి సమీపములో రెండవ అగ్నివలె ప్రకాశించుచుండెను. నంది శూలమును పట్టుకొని శివుని యెదుట నిలబడెను. భూతగణములు, మరియు మాతృగణములు అందరు నిలబడియుండిరి. అపుడా దేవతలు మహేశ్వరుడు, మహాదేవుడు అగు శివుని ప్రణమిల్లి చుట్టూ నిలబడి వివిధస్తోత్రములతో స్తుతించిరి. ఈ జగత్తులో కానవచ్చే మరియు వినవచ్చే సర్వపదార్థములను నేను ఆ భగవానుని ప్రక్కన చూచి మిక్కిలి ఆశ్చర్యమును పొందితిని. ఓ శ్రీ కృష్ణా! అచట జరిగే యజ్ఞములో నేను గొప్ప ధైర్యమును చిక్కించుకుని చేతులను జోడించి వివిధస్తోత్రములతో స్తుతించి పరమానందములో మునిగిపోతిని. శ్రద్ధావంతుడనగు నేను నా యెదుట శంకరుని చూచి కన్నుల వెంబడి నీరు స్రవించుచుండగా, బొంగురు కంఠముతో ఆయనను యథావిధిగా పూజించితిని.

భగవానథ సుప్రీతశ్శంకరః పరమేశ్వరః ।

వాణ్యా మధురయా ప్రీత్యా మామాహ ప్రహసన్నివ ॥

న విచాలయితుం శక్యో మయా విప్ర పునః పునః ।

పరీక్షితోఽసి భద్రం తే భవాన్ భక్త్యాన్వితో దృఢః ॥

తస్మాత్తే పరితుష్టోఽస్మి వరం వరయ సువ్రత ।

దుర్లభం సర్వదేవేషు నాదేయం విద్యతే తవ ॥

స చాహం తద్వచః శ్రుత్వా శంభోస్సత్త్రేమ సంయుతమ్ ।

దేవం తం ప్రాంజలిర్భూత్వాబ్రువం భక్తానుకంపినమ్ ॥

భగవన్ యది తుష్టోఽసి యది భక్తిః స్థిరా మయి ।

తేన సత్యేన మే జ్ఞానం త్రికాలవిషయం భవేత్ ॥

ప్రయచ్ఛ భక్తిం విపులాం త్వయి చావ్యభిచారిణీమ్ ।

సాన్వయస్యాపి నిత్యం మే భూరి క్షీరౌదనం భవేత్ ॥

మమాస్తు తవ సాన్నిధ్యం నిత్యం చైవాశ్రమే విభో ।

తవ భక్తేషు సఖ్యం స్యాదన్యోన్యేషు సదా భవేత్ ॥

ఏవముక్తో మయా శంభుర్విహస్య పరమేశ్వరః ।

కృపాదృష్ట్యా నిరీక్ష్యాశు మాం స ప్రాహ యదూద్వహ ॥

పరమేశ్వరుడగు శంకరభగవానుడు అప్పుడు మిక్కిలి సంతోషించి చిరునవ్వుతో ో మధురమగు వచనముతో ప్రీతిపూర్వకముగా నాతో నిట్లనెను. ఓ బ్రాహ్మణా! నేను పలు మార్లు ప్రయత్నించినప్పటికీ నీలో చలనము కలుగలేదు. నేను నిన్ను పరీక్షించుట పూర్తి అయినది. నీ యందు దృఢమగు భక్తి గలదు. గొప్ప వ్రతము గలవాడా! కావుననే నేను చాల సంతసించితిని, దేవతలందరికి లభ్యము కాని వరమును కోరుకొనుము. నీకు ఈయదగనిది లేదు. శంభుని గొప్ప ప్రేమతో కూడిన ఆ మాటలను విని నేను భక్తులయందు దయను చూపే ఆ దేవునకు చేతులు జోడించి ప్రణమిల్లి ఇట్లు పలికితిని. ఓ భగవాన్! నీవు సంతోషించినచో, నాయందు దృఢమగు భక్తి యున్నచో, ఆ సత్య ప్రభావముచే నాకు మూడు కాలములయందలి విషయములు తెలియుచుండు గాక! నీయందు అచంచలమైన విస్తృతమగు భక్తిని ఇమ్ము, మరియు నాకు నా వంశమునకు నిత్యము పాలు, అన్నము సమృద్ధిగా లభించుగాక! ఓ విభూ! నా ఆశ్రమములో నీ సన్నిధి నిత్యము ఉండుగాక! నీ భక్తులకు సర్వకాలములలో పరస్పరప్రేమ కలుగు గాక! ఓ శ్రీ కృష్ణా! నేను ఇట్లు పలుకగా, శంభుపరమేశ్వరుడు నవ్వి, నన్ను దయాదృష్టితో చూచి వెంటనే నాతో నిట్లనెను.

శివ ఉవాచ ।

ఉపమన్యో మునే తాత వర్జితస్త్వం భవిష్యసి ।
జరామరణజైర్దోషైస్సర్వకామాన్వితో భవ ॥
మునీనాం పూజనీయశ్చ యశోధనసమన్వితః ।
శీలరూప గుణైశ్వర్యం మత్ప్రసాదాత్పదే పదే ॥
క్షీరోదసాగరస్యైవ సాన్నిధ్యం పయసాం నిధేః ।
తత్ర తే భవితా నిత్యం యత్ర యత్రేచ్ఛసే మునే ॥
అమృతాత్మకం తు తత్ క్షీరం యావత్సంయామ్యతే తతః ।
ఇమం వైవస్వతం కల్పం పశ్యసే బంధుభిస్సహ ॥
త్వద్గోత్రం చాక్షయం చాస్తు మత్ప్రసాదాత్సదైవ హి ।
సాన్నిధ్యమాశ్రమే తేఽహం కరిష్యామి మహామునే ॥
మద్భక్తిస్సుస్థిరా చాస్తు సదా దాస్యామి దర్శనమ్ ।
స్మృతశ్చ భవతా వత్స ప్రియస్త్వం సర్వథా మమ ॥
యథాకామసుఖం తిష్ఠ నోత్కంఠం కర్తుమర్హసి ।
సర్వం ప్రపూర్ణతాం యాతు చింతితం నాత్ర సంశయః ॥

శివుడు ఇట్లు పలికెను –

వత్సా! ఓ ఉపమన్యుమహర్షీ! నీకు ముసలితనము, మరణము అనే దోషములనుండి విముక్తి ి కలుగగలదు. నీ కోర్కెలు అన్నియు ఈడేరును. కీర్తియే ధనముగా గల నీవు మునులకు కూడ పూజనీయుడవు. నా అనుగ్రహముచే నీకు ప్రతి పదమునందు శీలము, రూపము, సద్గుణములు, ఐశ్వర్యము లభించును. ఓ మహర్షీ! నీవు కోరిన ప్రతిస్థలమునందు పాలసముద్రముయొక్క నిత్యసన్నిధి నీకు

సిద్ధించగలదు. సృష్టి ఉన్నంతవరకు నీకు అమృతరూపములగు ఆ పాలు లభించగలవు. మరియు, నీవు బంధువులతో సహా ఈ వైవస్వతకల్పమును చూచెదవు. నా అనుగ్రహముచే నీ గోత్రము అక్షయమగుగాక! ఓ మహర్షీ! నేను సర్వదా నీ ఆశ్రమములో నివాసమును చేయగలను. నీకు నాయందలి భక్తి సుస్థిరముగా నుండుగాక! ఓ కుమారా! నీవు స్మరించిన వెంటనే నేను నీకు దర్శనమీయగలను. నీవు నాకు అన్ని విధములుగా ప్రియమైన వాడవు. నీవు నీకు నచ్చిన విధములో సుఖముగా నుండుము. ఆదుర్దాను చెందకుము. నీవు కోరుకునే సర్వము నీకు పూర్ణముగా లభించగలదు. దీనిలో సందేహము లేదు.

ఉపమన్యు రువాచ ।

ఏవముక్త్వా స భగవాన్ సూర్యకోటీ సమప్రభః ।
మమేశానో వరాన్ దత్త్వా తత్రైవాంతరధీయత ॥
ఏవం దృష్టో మయా కృష్ణ పరివారసమన్వితః ।
శంకరః పరమేశానో భుక్తిముక్తి ప్రదాయకః ॥
శంభునా పరమేశేన యదుక్తం తేన ధీమతా ।
తదవాప్తం చ మే సర్వం దేవదేవ సమాధినా ॥
ప్రత్యక్షం చైవ తే జాతాన్ గంధర్వాప్సరసస్తథా ।
ఋషీన్ విద్యాధరాంశ్చైవ పశ్య సిద్ధాన్ వ్యవస్థితామ్ ॥
పశ్య వృక్షాన్ మనో రమ్యాన్ స్నిగ్ధపత్రాన్ సుగంధినః ।
సర్వర్తుకుసుమైర్యుక్తాన్ సదా పుష్పఫలాన్వితాన్ ॥
సర్వమేతన్మహాబాహో శంకరస్య మహాత్మనః ।
ప్రసాదాద్దేవదేవస్య విశ్వం భావసమన్వితమ్ ॥
మమాస్తి త్వఖిలం జ్ఞానం ప్రసాదాచ్ఛూలపాణినః ।
భూతం భవ్యం భవిష్యం చ సర్వం జానామి తత్త్వతః ॥
తమహం దృష్టవాన్ దేవమపి దేవాసురేశ్వరాః ।
యం న పశ్యంత్యనారాధ్య కోఽన్యో ధన్యతరో మయా ॥
షడ్వింశకమితి ఖ్యాతం పరం తత్త్వం సనాతనమ్ ।
ఏవం ధ్యాయంతి విద్వాంసో మహత్పరమమక్షరమ్ ॥
సర్వతత్త్వవిధానజ్ఞః సర్వతత్త్వార్థ దర్శనః ।
స ఏవ భగవాన్ దేవః ప్రధానపురుషేశ్వరః ॥
యో నిజాద్దక్షిణా త్పార్శ్వాద్బ్రహ్మాణం లోకకారణమ్ ।
వామాదస్యసృజద్విష్ణుం లోకరక్షార్థమీశ్వరః ॥
కల్పాంతే చైవ సంప్రాప్తేఽసృజద్రుద్రం హృదః ప్రభుః ।
తతస్సమాహరత్కృత్స్నం జగత్ స్థావరజంగమమ్ ॥
యుగాంతే సర్వభూతాని సంవర్తక ఇవానలః ।
కాలో భూత్వా మహాదేవో గ్రసమానస్స తిష్ఠతి ॥

సర్వజ్ఞస్సర్వభూతాత్మా సర్వభూత భవోద్భవః ।

ఆస్తే సర్వగతో దేవో దృశ్యస్సర్వైశ్చ దైవతైః ॥

అతస్త్వం పుత్రలాభాయ సమారాధయ శంకరమ్ ।

శీఘ్రం ప్రసన్నో భవితా శివస్తే భక్తవత్సలః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం కృష్ణోపమన్యు సంవాదో నామ ప్రథమోఽధ్యాయః ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను –

కోటి సూర్యులతో సమానమగు కాంతి గల ఆ ఈశానభగవానుడు ఈ విధముగా పలికి నాకు వరములనిచ్చి అచటనే అంతర్ధానమాయెను. ఓ శ్రీ కృష్ణా! భుక్తిని మరియు ముక్తిని ఇచ్చువాడు, పరమేశ్వరుడు అగు శంభుని పరివారముతో కూడి యుండగా నేను ఈ విధముగా చూచియుంటిని. ఓ దేవదేవా ! శ్రీకృష్ణా ! పరమేశ్వరుడు, ప్రజ్ఞానస్వరూపుడు, అగు శంభుడు చెప్పినవాటిని అన్నింటినీ నేను ధ్యానప్రభావముచే పొందితిని. నీ యెదుటనే యున్న గంధర్వులను, అప్సరసలను, ఋషులను, విద్యాధరులను, మరియు సిద్ధులను నీవు ప్రత్యక్షముగా చూడుము. మనస్సునకు ఆహ్లాదమును కలిగించునవి, దట్టమగు ఆకులను కలిగియున్నవి, సుగంధమును వెదజల్లుచున్నవి, ఋతువులన్నింటియొక్క పుష్పములతో ప్రకాశించునవి, సర్వదా పుష్పములతో మరియు ఫలములతో కూడియున్నవి అగు ఈ వృక్షములను చూడుము. ఓ మహాబాహో! ఈ జగత్తు అంతయు మహాత్ముడు, దేవదేవుడు అగు శంకరుని అనుగ్రహము చేతనే ఉనికిని కలిగియున్నది. శూలపాణి యగు శంకరుని అనుగ్రహముచే నాకు సర్వము తెలియును. భూతభవిష్యద్వర్తమానవిషయములన్నింటియొక్క స్వరూపము నాకు తెలియును. దేవతలు, లోకపాలకులు ఏ ఈశ్వరుని దర్శనమును ఆయనను ఆరాధించకుండగా పొందజాలరో, అట్టి దేవుని నేను చూచితిని. నాకంటె ధన్యుడు మరియెవరు గలరు? ఇరువది ఆరు లక్షణములను కలిగియున్నది, సనాతనము, మహత్తత్త్వముకంటే ఉత్కృష్టమైనది, వినాశము లేనిది అగు పరమతత్త్వమును పండితులు ఈ శివుని రూపముగా ధ్యానించుచున్నారు. తత్త్వములన్నింటియొక్క విధానమును తెలిసిన వాడు, తత్త్వములన్నింటియొక్క సారమును దర్శించువాడు, ప్రకాశస్వరూపుడు అగు ఆ భగవానుడు మాత్రమే ప్రకృతి పురుషులకు ప్రభువు అగుచున్నాడు. ఆ ఈశ్వరుడు తన కుడి ప్రక్కనుండి లోకములను సృష్టించు బ్రహ్మను, ఎడమ ప్రక్కనుండి ఆ లోకముల రక్షణ కొరకై విష్ణువును సృష్టించెను. ఆ ప్రభుడు ప్రళయకాలము రాగానే తన హృదయమునుండి రుద్రుని సృష్టించగా, ఆయన చరాచరజగత్తునంతనూ ఉపసంహరించెను. ఆ మహాదేవుడు ప్రళయ కాలమునందు సంవర్తక అగ్నియై మరియు మృత్యుస్వరూపుడై ప్రాణులనన్నిటినీ మ్రింగివేసి తాను మాత్రమే మిగిలియుండును. సర్వము తెలిసినవాడు, సర్వప్రాణుల ఆత్మరూపుడు, సర్వప్రాణుల ఉత్పత్తికి కారణమైనవాడు అగు ఆ దేవుడు సర్వదేవతలచే దర్శింపబడు చున్న వాడై సర్వమును వ్యాపించి యున్నాడు. కావున నీవు పుత్రుని పొందుట కొరకై శంకరుని చక్కగా ఆరాధించుము. భక్తవత్సలుడగు శివుడు శీఘ్రముగా నీపై ప్రసన్నుడు కాగలడు,

2 - శివభక్తి-మాహాత్మ్యము

సనత్కుమార ఉవాచ ।

ఇత్యా కర్ణ్య మునేర్వాక్యముపమన్యోర్మహాత్మనః ।
జాతభక్తిర్మహాదేవే కృష్ణః ప్రోవాచ తం మునిమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

మహాత్ముడగు ఉపమన్యుమహర్షియొక్క ఈ మాటను విని మహాదేవునియందు ఉదయించిన భక్తి గల శ్రీకృష్ణుడు ఆ మహర్షితో నిట్లనెను.

శ్రీకృష్ణ ఉవాచ ।

ఉపమన్యో మునే తాత కృపాం కురు మమోపరి ।
యే యే శివం సమారాధ్య కామానాపుశ్చ తాన్ వద ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ ఉపమన్యుమహర్షీ! తండ్రీ! నాపై దయను చూపుము. శివుని ఆరాధించి తమ కోరికలనీడేర్చుకున్నవారిని గురించి చెప్పుము.

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్యోపమన్యుస్స మునిశ్శైవవరో మహాన్ ।
కృష్ణవాక్యం సుప్రశస్య ప్రత్యువాచ కృపానిధిః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

శివభక్తాగ్రగణ్యుడు, మహాత్ముడు, దయానిధి అగు ఆ ఉపమన్యుమహర్షి శ్రీకృష్ణుని ఆ మాటను విని ఆయనను కొనియాడి ఇట్లు బదులు చెప్పెను.

ఉపమన్యురువాచ ।

యైర్యైర్భవారాధనతః ప్రాప్తో హృత్కామ ఏవ హి ।
తాంస్తాన్ భక్తాన్ ప్రవక్ష్యామి శృణు త్వం వై యదూద్వహ ॥
శర్వాత్సర్వామరైశ్వర్యం హిరణ్య కశిపుః పురా ।
వర్షాణాం దశలక్షాణి సోఽలభచ్చంద్రశేఖరాత్ ॥
తస్యాథ పుత్ర ప్రవరో నందనో నామ విశ్రుతః ।
స చ శర్వవరాదింద్రం వర్షాయుతమధోనయత్ ॥
విష్ణుచక్రం చ తద్ఘోరం వజ్రమాఖండలస్య చ ।
శీర్ణం పురా భవత్కృష్ణ తదంగేషు మహాహవే ॥
న శస్త్రాణి వహంత్యంగే ధర్మతస్తస్య ధీమతః ।
గ్రహస్యాతిబలస్యాజౌ చక్రవజ్రముఖాన్యపి ॥
అర్ద్యమానాశ్చ విబుధా గ్రహేణ సుబలీయసా ।
దేవదత్తవరా జఘ్నురసురేంద్రస్సురాన్ భృశమ్ ॥

తుష్టో విద్యుత్ప్రభస్యాపి త్రైలోక్యైశ్వరతామదాత్ ।

శతవర్షసహస్రాణి సర్వలోకేశ్వరో భవః ॥

తథా పుత్రసహస్రాణామయుతం చ దదౌ శివః ।

మమ చానుచరో నిత్యం భవిష్యస్య బ్రవీదితి ॥

కుశద్వీపే శుభం రాజ్యమదదాద్భగవాన్ భవః ।

స తస్మై శంకరః ప్రీత్యా వాసుదేవ ప్రహృష్టధీః ॥

ధాత్రా సృష్టశ్శతమఖో దైత్యో వర్షశతం పురా ।

తపః కృత్వా సహస్రం తు పుత్రాణామలభద్భవాత్ ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను –

ఓ యదువంశశ్రేష్ఠా! ఏయే భక్తులు శివుని ఆరాధించి తమ హృదయములోని కోర్కెలను పూర్ణము చేసుకొనిరో, ఆయా భక్తులను గురించి చెప్పగలను. నీవు వినుము. పూర్వము హిరణ్యకశిపుడు సంహారకారకుడగు చంద్రశేఖరునినుండి పది లక్షల సంవత్సరముల కాలము వరకు దేవతల ఐశ్వర్యమునంతనూ పొందెను. తరువాత నందనుడు అను ప్రఖ్యాతిని గాంచిన ఆతని శ్రేష్ఠుడగు కుమారుడు శివుని వరము వలన పది వేల సంవత్సరములు ఇంద్రుని తన ఆధీనములో పెట్టుకొనేను. ఓ శ్రీకృష్ణా! పూర్వము మహాయుద్ధములో ఆ భయంకరమగు విష్ణుచక్రము మరియు ఇంద్రుని వజ్రము వాని అవయవములకు తగిలి విరిగిపోయినవి. అతి బలుడు, బుద్ధిశాలి అగు గ్రహుడను రాక్షసుని దేహమునందు యుద్ధములో ధర్మబద్ధముగా ప్రయోగించబడిన ఆయుధములు ప్రభావమును చూపజాలవు. దేవతలు మహాబలశాలియగు గ్రహునిచే పీడించ బడిరి. ఈ విధముగా రాక్షసరాజులు శివునినుండి వరములను పొంది దేవతలను అధికముగా హింసించిరి. సర్వలోకములకు ఈశ్వరుడగు శివుడు సంతసిల్లి విద్యుత్ప్రభునకు లక్ష సంవత్సరములు ముల్లోకముల ఆధిపత్యమునొసంగెను. అంతేగాక, కోటిమంది పుత్రసంతానమునిచ్చి, నీవు నిత్యము నాకు అనుచరుడవై ఉండగలవు అని పలికెను. ఓ వాసుదేవా! సదనుడగు శంకరభగవానుడు మిక్కిలి సంతసించిన మనస్సు గల వాడై వానికి కుశద్వీపమునందు మంగళకరమగు రాజ్యమును ప్రేమతో నిచ్చెను. పూర్వము బ్రహ్మచే సృష్టింబడిన శతమఖుడనే రాక్షసుడు వంద సంవత్సరములు తపస్సు చేసి శివుని అనుగ్రహముచే వేయి మంది పుత్రులను బడసెను.

యాజ్ఞవల్క్య ఇతి ఖ్యాతో గీతో వేదేషు వై మునిః ।

ఆరాధ్య స మహాదేవం ప్రాప్తవాన్ జ్ఞానముత్తమమ్ ॥

వేదవ్యాసస్తు యో నామ్నా ప్రాప్తవానతులం యశః ।

సోఽపి శంకరమారాధ్య త్రికాలజ్ఞానమాప్తవాన్ ॥

ఇంద్రేణ వాలఖిల్యాస్తే పరిభూతాస్తు శంకరాత్ ।

లేభిరే సోమహర్తారం గరుడం సర్వదుర్జయమ్ ॥

ఆపః ప్రణష్టాస్సర్వాశ్చ పూర్వరోషాత్కపర్దినః ।
శర్వం సమకపాలేన దేవైరిష్ట్వా ప్రవర్తితమ్ ॥
అత్రేర్భార్యా చానసూయా త్రీణి వర్షశతాని చ ।
ముశలేషు నిరాహారా సుప్త్వా శర్వాత్తతస్సుతాన్ ॥
దత్తాత్రేయ మునిం లేభే చంద్రం దుర్వాససం తథా ।
గంగాం ప్రవర్తయామాస చిత్రకూటే పతివ్రతా ॥
వికర్ణశ్చ మహాదేవం తథా భక్తసుఖావహమ్ ।
ప్రసాద్య మహతీం సిద్ధిమాప్తవాన్ మధుసూదన ॥
చిత్రసేనో నృపశ్శంభుం ప్రసాద్య దృఢభక్తిమాన్ ।
సమస్తనృపభీతిభ్యోఽ భయం ప్రాపాతులం చ కమ్ ॥
శ్రీకరో గోపికాసూనుర్నృపపూజావి లోకనాత్ ।
జాతభక్తిర్మహాదేవే పరమాం సిద్ధిమాప్తవాన్ ॥
చిత్రాంగదో నృపసుతస్సీమంతిన్యాః పతిర్హ్వరే ।
శివానుగ్రహతో మగ్నో యమునాయాం మృతో న హి ॥

వేదములలో కీర్తించబడి ప్రసిద్ధిని గాంచిన యాజ్ఞవల్క్యమహర్షి మహాదేవుని ఆరాధించి ఉత్తమమగు జ్ఞానమును పొందెను. సాటిలేని కీర్తిని పొందిన వేదవ్యాస మహర్షి కూడ శంకరుని ఆరాధించి త్రికాలజ్ఞానమును పొందెను. ఇంద్రునిచే పరాభవించబడిన వాలఖిల్యమహర్షులు శంకరుని అనుగ్రహము వలన ఎవ్వరికైననూ జయింప శక్యము కానివాడు, అమృతమును తెచ్చిన వాడు అగు గరుడుని పొందిరి. పూర్వము జటాజూటధారియగు శివుని కోపముచే జలములు అన్నియు ఎండిపోగా, దేవతలు ఏకకాలములో శివుని ఉద్దేశించి కపాలముతో ఆహుతులను సమర్పించి నీటిని మరల ప్రవహింపజేసిరి. అత్రి భార్య, పతివ్రత అగు అనసూయ మూడు వందల సంవత్సరములు ఆహారము లేకుండగా రోకళ్లపై నిద్రించి, తరువాత శివుని అనుగ్రహము వలన దత్తాత్రేయమహర్షిని, చంద్రుని మరియు దుర్వాసుని పుత్రులుగా పొంది, చిత్రకూటపర్వతమునందు గంగను ప్రవహింప జేసెను. ఓ మధుసూదనా! ఇంతేగాక, వికర్ణుడు భక్తులకు సుఖమునొసంగు మహాదేవుని ప్రసన్నునిగా జేసుకొని గొప్ప సిద్ధిని పొందెను. దృఢమగు భక్తి గల చిత్రసేనమహారాజు శంభుని ప్రసన్నునిగా జేసుకొని అందరు రాజుల భయమునుండి విముక్తుడై సాటి లేని సుఖమును పొందెను. గోపిక యొక్క కుమారుడగు శ్రీకరుడు రాజు చేయుచున్న శివపూజను చూచి మహాదేవుని భక్తి ఉదయించుటచే శ్రేష్ఠమగు సిద్ధిని పొందినాడు. ఓ హరీ ! రాజకుమారుడు, సీమంతిని భర్త అగు చిత్రాంగదుడు యమునలో మునిగిననూ శివుని అనుగ్రహముచే మరణించలేదు.

స చ తక్షాలయం గత్వా తనైత్రీం ప్రాప్య సువ్రతః ।
ఆయాతస్స్వగృహం ప్రీతో నానాధన సమన్వితః ॥
సీమంతినీ ప్రియా తస్య సోమవ్రత పరాయణా ।
శివానుగ్రహతః కృష్ణ లేభే సౌభాగ్యముత్తమమ్ ॥
తత్ప్ర భావాద్ధ్రుతే తస్మిన్నేకో ద్విజసుతః పురా ।
కశ్చిత్ స్త్రీత్వం గతో లో భాత్కృతదారాకృతిశ్ఛలాత్ ॥
చంచుకా పుంశ్చలీ దుష్టా గోకర్ణద్విజతః పురా ।
శ్రుత్వా ధర్మకథాం శంభోర్భక్త్యా ప్రాప పరాం గతిమ్ ॥
స్వస్త్యను గ్రహతః పాపీ బిందుగో చంచుకాపతిః ।
శ్రుత్వా శివపురాణం చ సద్గతిం ప్రాప శాంకరీమ్ ॥
పింగలా గణికా ఖ్యాతా మదరాహ్వో ద్విజాధమః ।
శైవమృషభమభ్యర్చ్య లేభాతే సద్గతిం చ తౌ ॥
మహానందాభిధా కాచిద్వేశ్యా శివపదారతా ।
దృఢత్పణాత్ను ప్రసాద్య శివం లేభే చ సద్గతిమ్ ॥
కైకేయీ ద్విజబాలా శ్చ సాదరాహ్వో శివ వ్రతా ।
పరమం హి సుఖం ప్రాప శివేశవ్రత ధారణాత్ ॥
విమర్షణశ్చ నృపతిశ్శివభక్తిం విధాయ వై ।
గతిం లేభే పరాం కృష్ణ శివానుగ్రహతః పురా ॥

గొప్ప వ్రతము గల ఆ చిత్రాంగదుడు తక్షుని (విశ్వకర్మ) గృహమునకు వెళ్లి ఆయనతో స్నేహమును చేసి, వివిధరకముల సంపదతో గూడి ఆనందముతో స్వగృహమునకు మరలి వచ్చెను. ఓ శ్రీ కృష్ణా ! ఆతని ప్రియురాలగు సీమంతిని శివుని వ్రతమును శ్రద్ధగా చేసి శివుని అనుగ్రహముచే ఉత్తమమగు సౌభాగ్యమును పొందెను. పూర్వము ఆ వ్రతమునందు ఒక బ్రాహ్మణబాలకుడు లోభముచే భార్య వేషమును దాల్చి మోసము చేయబోయి ఆ శివుని మహిమచే స్త్రీత్వమును పొందెను, పూర్వము చంచుక యను దుష్టురాలగు వేశ్య గోకర్ణమునందలి బ్రాహ్మణుని నుండి శంభుని ధర్మకథను భక్తితో విని పరమగతిని పొందెను. చంచుకయొక్క భర్త, పాపాత్ముడు అగు బిందుగుడు తన భార్య యొక్క అనుగ్రహముచే శివపురాణమును విని సత్పురుషులు పొందే శివలోకమును పొందెను. పింగళ యను వేశ్య మరియు మదరుడను బ్రాహ్మణాధముడు శివుని వాహనమగు నందీశ్వరుని ఆరాధించి సద్గతిని పొందిరి. మహానంద అనే ఒకానొక వేశ్య శివుని లోకమును పొందవలెననే ఆసక్తి గలదై దృఢమగు శపథముచే శివుని సంతోషపెట్టి, సద్గతిని పొందెను. కైకేయి, బ్రాహ్మణబాలకులు మరియు, శివవ్రతమునందు నిష్టగల సాదర అనునామే పరమేశ్వరుడగు శివుని వ్రతమును అనుష్ఠించుట వలన పరమసుఖమును పొందిరి. ఓ శ్రీకృష్ణా! పూర్వము విమర్షణుడను మహారాజు శివునియందు భక్తిని చేసి శివుని అనుగ్రహముచే పరమగతిని పొందెను.

దుర్జనశ్చ నృపః పాపీ బహుస్త్రీలంపటః ఖలః ।
శివభక్త్యా శివం ప్రాప నిర్లిప్తస్సర్వకర్మసు ॥
సస్త్రీకశ్శబరో నామ్నా శంకరశ్చ శివవ్రతీ ।
చితా భస్మరతో భక్త్యా లేభే తద్గతిముత్తమామ్ ॥
సౌమినీ నామ చాండాలీ సంపూజ్యాజ్ఞానతో హి సా ।
లేభే శైవీం గతం కృష్ణ శంకరానుగ్రహాత్పరాత్ ॥
మహాకాలాభిధో వ్యాధో కిరాతః పరహింసకః ।
సమభ్యర్చ్య శివం భక్త్యా లేభే సద్గతిముత్తమామ్ ॥
దుర్వాసా మునిశార్దూలశ్శివానుగ్రహతః పురా ।
తస్తార స్వమతం లోకే శివభక్తిం విముక్తిదామ్ ॥
కౌశికశ్చ సమారాధ్య శంకరం లోకశంకరమ్ ।
బ్రాహ్మణోఽ భూత్ క్షత్రియశ్చ ద్వితీయ ఇవ పద్మభూః ॥
శివమభ్యర్చ్య సద్భక్త్యా విరించిశ్శైవసత్తమః ।
అభూత్సర్గకరః కృష్ణ సర్వలోక పితామహః ॥
మార్కండేయో మునివరశ్చిరంజీవీ మహాప్రభుః ।
శివభక్తవరః శ్రీమాన్ శివానుగ్రహతో హరే ॥
దేవేంద్రో హి మహాశైవస్త్రైలోక్యం బుభుజే పురా ।
శివానుగ్రహతః కృష్ణ సర్వదేవాధిపః ప్రభుః ॥
బలిపుత్రో మహాశైవశ్శివానుగ్రహతో వశీ ।
బాణో బభూవ బ్రహ్మాండనాయక స్సకలేశ్వరః ॥

పాపి, అనేక స్త్రీ వ్యామోహము గలవాడు, దుష్టుడు అగు దుర్జనమహారాజు కర్మలన్నింటియందు ఆసక్తిని వీడి శివభక్తిని చేసి శివుని పొందెను. శంకరుడను బోయ వాడు శివవ్రతమును అనుష్ఠించి భస్మను శ్రద్ధతో ధరించి భార్యతో సహా ఉత్తమమగు శివలోకమును పొందెను. ఓ శ్రీకృష్ణా ! సౌమిని యను చండాల స్త్రీ తెలియకుండగనే శివుని పూజించి శంకరుని ఉత్తమమగు అనుగ్రహముచే శివలోకమును పొందెను. ఇతరులను హింసించే మహాకాలుడను కిరాతుడు శివుని భక్తితో చక్కగా పూజించి ఉత్తమమగు సద్గతిని పొందెను. పూర్వము దుర్వాసమహర్షి శివుని అనుగ్రహముచే, శివభక్తి మోక్షమునిచ్చుననే తన మతమును లోకములో ప్రచారము చేసెను. క్షత్రియుడగు విశ్వామిత్రుడు లోకములకు మంగళములనిచ్చే శంకరుని బాగుగా ఆరాధించి బ్రాహ్మణుడై రెండవ సృష్టికర్తవలె భాసించేను. ఓ శ్రీకృష్ణా ! శివభక్తాగ్రగణ్యుడగు బ్రహ్మ గొప్ప భక్తితో శివుని ఆరాధించి సృష్టికర్తయై లోకములన్నింటికీ పితామహుడు ఆయెను. ఓ శ్రీహరీ ! గొప్ప సమర్థుడు, శివభక్తులలో శ్రేష్ఠుడు అగు మార్కండేయమహర్షి శివుని అనుగ్రహము వలన చిరంజీవియై సంపదలను పొందెను. ఓ శ్రీకృష్ణా ! పూర్వము మహాశివభక్తుడు, సమర్థుడు అగు దేవేంద్రుడు శివుని అనుగ్రహముచే దేవతలందరికీ అధీశ్వరుడై త్రిలోకాధిపత్యమును అనుభవించెను. బలియొక్క

కుమారుడు, గొప్ప శివభక్తుడు, జితేంద్రియుడు, సర్వసమర్థుడు అగు బాణుడు శివుని అనుగ్రహము వలన బ్రహ్మాండమునకు నాయకుడైనాడు.

హరిశ్శక్తిశ్చ సద్భక్త్యా దధీచశ్చ మహేశ్వరః ।
శివానుగ్రహతోఽభూవంస్తథా రామో హి శాంకరః ॥
కాణాదో భార్గవశ్చైవ గురుర్గౌతమ ఏవ చ ।
శివభక్త్యా బభూవుస్తే మహా ప్రభవ ఈశ్వరాః ॥
శాకల్యశ్శంసితాత్మా చ నవవర్షశతాన్యపి ।
భవమారాధయామాస మనోయజ్ఞేన మాధవ ॥
తుతోష భగవానాహ గ్రంథకర్తా భవిష్యసి ।
వత్సాక్షయ్యా చ తే కీర్తిస్త్రైలోక్యే ప్రభవిష్యతి ॥
అక్షయం చ కులం తేఽస్తు మహర్షిభిరలం కృతమ్ ।
భవిష్యసి ఋషిశ్రేష్ఠస్సూత్రకర్తా తతస్తతః ॥
ఇత్యేవం శంకరాత్ప్రాప వరం మునివరస వై ।
త్రైలోక్యే వితతశ్చాసీత్పూజ్యశ్చ యదునందన ॥
సావర్ణిరితి విఖ్యాత ఋషిరాసీత్కృతే యుగే ।
ఇహ తేన తపస్తప్తం షష్టిర్వర్షశతాని చ ॥
తమాహ భగవాన్ రుద్రస్సాక్షాత్తుష్టోఽస్మి తేఽనఘ ।
గ్రంథకృల్లోక విఖ్యాతో భవితాస్యజరామరః ॥
ఏవంవిధో మహాదేవః పుణ్యపూర్వతరైస్తుతః ।
సమర్చితశ్శుభాన్ కామాన్ ప్రదదాతి యథేప్సితాన్ ॥
ఏకేనైవ ముఖేనాహం వక్తుం భగవతో గుణాః ।
యే సంతి తాన్న శక్నోమి హ్యపి వర్షశతైరపి ॥
ఇతి శ్రీశివమహాపురాణే ఉమాసంహితాయాం శివభక్తిమాహాత్మ్య వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥

విష్ణువు, మాయాశక్తి, సర్వసమర్థుడగు దధీచుడు, శివభక్తుడగు రాముడు, కణాదుడు, శుక్రాచార్యుడు మరియు గౌతముడు శివునియందలి పవిత్రమగు భక్తిచే గొప్పవారు మరియు సర్వసమర్థులు కాగల్గినారు. ఓ మాధవా! శుద్ధమగు అంతకరణము గల శాకల్యుడు తొమ్మిది వందల సంవత్సరములు ఉపాసనారూపమగు యజ్ఞముతో శివుని ఆరాధించెను. అప్పుడు శివుడు సంతోషించి ఇట్లు పలికెను : ఓ వత్సా ! నీవు గ్రంథమును నిర్మించగలవు. ముల్లోకములలో నీకు అక్షయమగు కీర్తి లభించగలదు. నీ కులము మహర్షులచే అలంకరింపబడి అక్షయము కాగలదు. నీవు మహర్షిచే సూత్రములను రచించగలవు. ఆ మహర్షి శంకరుని నుండి ఈ విధమగు వరమును పొందెను. ఓ శ్రీకృష్ణా ! ఆయన కీర్తి ముల్లోకములలో వ్యాపించెను. ఆయనను అందరు పూజించిరి. కృతయుగములో సావర్ణి అనే ప్రసిద్ధిని గాంచిన ఋషి ఉండెడివాడు. ఆయన ఇచట అరవై వేల సంవత్సరములు తపస్సును చేసెను. అపుడు రుద్రుడు సంతోషించి స్వయముగా ప్రత్యక్షమై ఇట్లు పలికెను : ఓయీ పుణ్యాత్మా ! నేను నీ తపస్సుచే సంతోషించితిని. నీవు గ్రంథములను రచించి లోకములో ప్రఖ్యాతిని పొందుటయే గాక, వృద్ధాప్యము నుండి మరియు మరణము నుండి విముక్తిని పొందెదవు. ఈ విధముగా పుణ్యాత్ములగు పూర్వీకులచే ఆరాధింపబడిన మహాదేవుని పూజించినచో, ఆయన మనస్సులోని శుభకరమగు కోర్కెలను ఈడేర్చగలడు. భగవానునకు గల గుణములనన్నింటినీ ఒకే ఒక నోరు గల నేను వందల సంవత్సరములు ప్రయత్నించిననూ చెప్ప జాలను.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు శివభక్తిమాహాత్మ్య వర్ణనమనే రెండవ అధ్యాయము ముగిసినది.

3 – శివభక్తి మాహాత్మ్య వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య సోఽ బ్రవీత్తం మహామునిమ్ ।
విస్మయం పరమం గత్వోపమన్యుం శాంతమానసమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

శాంతమైన మనస్సు గల ఆ ఉపమన్యుమహర్షి యొక్క ఈ మాటలను విని ఆ శ్రీకృష్ణుడు అత్యాశ్చర్యమును పొందినవాడై ఆయనతో నిట్లనెను.

వాసుదేవ ఉవాచ ।

ధన్యస్త్వమసి విప్రేంద్ర కస్త్వాం స్తోతుమలం కృతీ ।
యస్య దేవాదిదేవస్తే సాన్నిధ్యం కురుతే శ్రమే ॥
దర్శనం మునిశార్దూల దద్యాత్స భగవాన్ శివః ।
అపి తావన్మమాప్యేవం ప్రసాదం వా కరోత్యసౌ ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను –

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! నీవు ధన్యుడవు, కృతార్థుడవు. దేవతలకు ఆదిదేవుడగు శివుడు నీ ఆశ్రమములో నివసించుచున్నాడు. అట్టి నిన్ను పొగడుటకు ఎవనికి శక్యమగును ? ఓ మహర్షీ! ఆ శివభగవానుడు నాకు కూడ అదే విధముగా దర్శనమునిచ్చునా ? నాపై అనుగ్రహమును చూపునా ?

ఉపమన్యురువాచ ।

అచిరేణైవ కాలేన మహాదేవం న సంశయః ।
తస్యైవ కృపయా త్వం వై ద్రక్ష్యసే పురుషోత్తమ ॥
షోడశే మాసి సువరాన్ ప్రాప్స్యసి త్వం మహేశ్వరాత్ ।
సపత్నీకాత్కథం నో దాస్యతే దేవో వరాన్ హరే ॥
పూజ్యోఽ సి దైవతైస్సర్వైః శ్లాఘనీయస్సదా గుణైః ।
జాప్యం తేఽహం ప్రవక్ష్యామి శ్రద్దధానాయ చాచ్యుత ॥
తేన జపప్రభావేణ సత్యం ద్రక్ష్యసి శంకరమ్ ।
ఆత్మ తుల్యబలం పుత్రం లభిష్యసి మహేశ్వరాత్ ॥
జపో నమశ్శివాయేతి మంత్రరాజమిమం హరే ।
సర్వకామప్రదం దివ్యం భుక్తిముక్తి ప్రదాయకమ్ ॥

ఉపమన్యుడు ఇట్లు పలికెను –

ఓ పురుషోత్తమా! నీవు నిస్సందేహముగా తొందరలోనే ఆ మహాదేవుని అనుగ్రహముచే మాత్రమే ఆయనను దర్శించగలవు. ఓ హరీ ! నీవు పార్వతీసమేతుడగు మహేశ్వరునినుండి పదునారవ మాసమునందు మంచి వరములను పొందగలవు. ఆ దేవుడు వరములను ఏల ఈయడు ? సద్గుణములచే

కొనియాడదగిన నీవు సర్వదా సర్వదేవతలకు పూజనీయుడవగుచున్నావు. ఓ అచ్యుతా ! శ్రమంతుడవగు నీకు జపించదగిన మంత్రమును నేను ఉపదేశించేదను. నీవు ఆ మంత్రజపప్రభావముచే శంకరుని నిశ్చయముగా దర్శించగలవు. నీవు మహేశ్వరుని అనుగ్రహముచే నీతో సమానమగు బలము గల పుత్రుని పొందగలవు. ఓ శ్రీ హరీ! మంత్రములలో గొప్పది, కోర్కెలనన్నిటినీ ఈడేర్చునది, దివ్యమైనది, భుక్తిని మరియు ముక్తిని ఇచ్చునది అగు నమశ్శివాయ అను మంత్రమును జపించుము.

సనత్కుమార ఉవాచ ।

ఏవం కథయతస్తస్య మహాదేవాశ్రితాః కథాః ।
దినాన్యష్టౌ ప్రయాతాని ముహూర్తమివ తాపస ॥
నవమే తు దినే ప్రాప్తే మునినా స చ దీక్షితః ।
మంత్రమధ్యాపితం శార్వమాథర్వశిరసం మహత్ ॥
జటీ ముండీ చ సద్యోఽసౌ బభూవ సుసమాహితః ।
పాదాంగుష్ఠోద్ధతతనుస్తేపే చోర్ధ్వభుజస్తథా ॥
సంప్రాప్తే షోడశే మాసి సంతుష్టః పరమేశ్వరః ।
పార్వత్యా సహితశ్శంభుర్దదౌ కృష్ణాయ దర్శనమ్ ॥
పార్వత్యా సహితం దేవం త్రినేత్రం చంద్రశేఖరమ్ ।
బ్రహ్మాద్యైః స్తూయమానం తు పూజితం సిద్ధకోటిభిః ॥
దివ్యమాల్యాంబరధరం భక్తినమ్రైస్సురాసురైః ।
ప్రణతం చ విశేషేణ నానాభూషణ భూషితమ్ ॥
సర్వాశ్చర్యమయం కాంతం మహేశమజ మవ్యయమ్ ।
నానాగణాన్వితం తుష్టం పుత్రాభ్యాం సంయుతం ప్రభుమ్ ॥
శ్రీకృష్ణః ప్రాంజలిర్దృష్ట్వా విస్మయోత్ఫుల్లలోచనః ।
ఈదృశం శంకరం ప్రీతః ప్రణనామ మహోత్సవః ॥
నానావిధైః స్తుతిపదైర్వాఙ్మయేనార్చయత్తదా ।
సహస్రనామ్నా దేవేశం తుష్టావ నతకంధరః ॥
తతో దేవాస్సగంధర్వా విద్యాధర మహోరగాః ।
ముముచుః పుష్పవృష్టిం చ సాధువాదాన్మనోఽనుగాన్ ॥
పార్వత్యాశ్చ ముఖం దృష్ట్వా భగవాన్ భక్తవత్సలః ।
ఉవాచ కేశవం తుష్టో రుద్రశ్చాథ బిడౌజసా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! ఈ విధముగా ఆయన మహాదేవునకు సంబంధించిన గాథలను చెప్పుచుం ండగా ఎనిమిది రోజులు ముహూర్తకాలము వలె గడచినవి. తొమ్మిదవ నాడు ఆ మహర్షి శ్రీకృష్ణునకు దీక్షను ఇచ్చి అథర్వవేదముయొక్క ఉపనిషత్తులోని శంకర మంత్రమును ఉపదేశించెను. జటలను కలిగియున్న శ్రీకృష్ణుడు వెంటనే ముండనము చేయించుకొని కాలి బొటనవేలిపై శరీరముయొక్క బరువును నిలిపి చేతులను పైకెత్తి మనస్సును సమాహితము చేసి తపస్సును చేసెను. ఈ విధముగా పదునారు మాసములు గడువగా, సంతసిల్లిన పరమేశ్వరుడు పార్వతితో కలిసి శ్రీకృష్ణునకు దర్శనమునిచ్చెను. పార్వతితో కూడియున్నవాడు, చంద్రుడు శిరో భూషణముగా గలవాడు, బ్రహ్మాదులచే కొనియాడబడుచున్నవాడు, కోట్లమంది సిద్ధులచే పూజింపబడుచున్నవాడు, దివ్యమగు వస్త్రములను మరియు మాలను దాల్చినవాడు, భక్తులైన దేవతలచే మరియు రాక్షసులచే నమస్కరింపబడుచున్నవాడు, విశేషించి అనేకభూషణములను ధరించి యున్నవాడు, సర్వవిధముల ఆశ్చర్యములకు నిధానమైనవాడు, సుందరమైనవాడు, మహేశ్వరుడు, పుట్టుక లేనివాడు, అనేకగణములతో మరియు పుత్రులతో గూడి ఆనందముగా నున్నవాడు, సర్వసమర్థుడు అగు ముక్కంటి దైవమును చూచి, శ్రీకృష్ణుడు ఆశ్చర్యముతో విప్పారిన నేత్రములు గలవాడై అట్టి శంకరునకు మహోత్సాహముతో ప్రీతితో చేతులను జోడించి నమస్కరించెను. అపుడు ఆయన తలను వంచి అనేకరకముల స్తోత్రములతో స్తుతించి మరియు సహస్రనామములను పఠించి ఆ దేవదేవునకు వాగ్రూపమైన అర్చనను చేసెను. అపుడు దేవతలు, గంధర్వులు, విద్యాధరులు మరియు పన్నగులు పుష్పవృష్టిని కురిపించి తమ మనస్సునకు నచ్చిన సాధువచనములను పలికిరి. భక్తవత్సలుడగు రుద్రభగవానుడు పార్వతికేసి చూచి సంతోషించి తన తేజస్సు సర్వత్రా వ్యాపించుచుండగా, అపుడు కేశవునితో నిట్లనెను.

మహాదేవ ఉవాచ ।

కృష్ణం జానామి భక్తం త్వాం మయి నిత్యం దృఢవ్రతమ్ ।
వృణీష్వ త్వం వరాన్మత్తః పుణ్యాం స్త్రైలోక్య దుర్లభాన్ ॥

మహాదేవుడు ఇట్లు పలికెను -

నీవు నాయందు నిత్యము భక్తి గల మరియు దృఢమగు వ్రతము గల శ్రీకృష్ణుడవని నాకు తెలియును. నీవు నానుండి పవిత్రమైన, ముల్లోకములలో దుర్లభమైన వరములను కోరుకొనుము.

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా కృష్ణః ప్రాంజలిరాదరాత్ ।
ప్రాహ సర్వేశ్వరం శంభుం సుప్రణమ్య పునః పునః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

సర్వేశ్వరుడగు శంభుని ఆ మాటను విని శ్రీకృష్ణుడు పలుమార్లు ఆయనకు ఆదరముతో చేతులను జోడించి చక్కగా నమస్కరించి ఇట్లు పలికెను.

కృష్ణ ఉవాచ ।

దేవదేవ మహాదేవ యాచేఽహం హ్యుత్తమాన్వరాన్ ।
త్వత్తోఽష్ట ప్రమితాన్నాథ త్వయోద్దిష్టాన్మహేశ్వర ॥
తవ ధర్మే మతిర్నిత్యం యశశ్చా ప్రచలం మహత్ ।
త్వత్సామీప్యం స్థిరా భక్తిస్త్వయి నిత్యం మమాస్త్వితి ॥
పుత్రాణి చ దశాద్యానాం పుత్రాణాం మమ సంతు వై ।
వధ్యాశ్చ రిపవస్సర్వే సంగ్రామే బలదర్పితాః ॥
అపమానో భవేన్నైవ క్వచిన్మే శత్రుతః ప్రభో ।
యోగినామపి సర్వేషాం భవేయమితి వల్లభః ॥
ఇత్యష్టౌ సువరాన్దేహి దేవదేవ నమోఽస్తు తే ।
సర్వేశ్వరస్త్వమేవానీ మత్ప్రభుశ్చ విశేషతః ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ దేవదేవా ! మహాదేవా ! నాథా ! మహేశ్వరా ! నేను నీనుండి నీవు సూచించిన విధముగా ఎనిమిది ఉత్తమమగు వరములను కోరుచున్నాను. నిత్యము నీ ధర్మమునందు బుద్ధి నిలుచుట, అచలమైన గొప్ప కీర్తి, స్థిరమైన నీ సన్నిధి, నాకు నీయందు నిత్యభక్తి కలుగుగాక ! నా మొదటి కుమారులకు ఒక్కొక్కరికి పదిమంది పుత్రులు కలిగెదరు గాక ! బలముచే గర్వించియున్న శత్రువులు అందరు సంగ్రామములో వధింపబడుదురు గాక ! ఓ ప్రభూ ! నాకు ఎక్కడనైననూ శత్రువుల వలన అవమానము కలుగకుండు గాక ! నేను యోగులందరికి ప్రియుడను అగుదును గాక ! ఓ దేవదేవా ! నాకు ఈ ఎనిమిది మంచి వరములనిమ్ము, నీకు నమస్కారమగు గాక ! నీవు సర్వేశ్వరుడవు. విశేషించి నాకు ప్రభుడవు నీవే.

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా తమాహ భగవాన్ భవః ।
సర్వం భవిష్యతీత్యేవం పునస్స ప్రాహ శూలధృక్ ॥
సాంబో నామ మహావీర్యః పుత్రస్తే భవితా బలీ ।
ఘోరసంవర్తాకాదిత్య శ్శప్తో మునిభిరేవ చ ॥
మానుషో భవితాసీతి సతే పుత్రో భవిష్యతి ।
యద్యచ్చ ప్రార్థితం కించిత్తత్సర్వం చ లభస్వ వై ॥
ఏవం లబ్ధ్వా వరాన్ సర్వాన్ శ్రీకృష్ణః పరమేశ్వరాత్ ।
నానావిధాభిర్బహ్వీభిః స్తుతిభిస్సమతోషయత్ ॥
తమాహాథ శివా తుష్టా పార్వతీ భక్తవత్సలా ।
వాసుదేవం మహాత్మానం శంభుభక్తం తపస్వినమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను :

శూలధారియగు శంభుభగవానుడు అతని ఆ మాటలను విని, సర్వము అటులనే కాగలదని పలికి మరల ఇట్లు పలికెను. నీకు మహాపరాక్రమశాలి, బలవంతుడు అగు సాంబుడనే పుత్రుడు కలుగగలడు. ఆతడు పూర్వజన్మలో భయంకరుడగు ప్రళయకాలమునందలి ఆదిత్యుడు. మునులు ఆతనిని మనుష్యుడవు కమ్మని శపించియున్నారు. అతడు నీకు. పుత్రుడు కాగలడు. నీవు కోరిన వరములనన్నింటినీ పొందగలవు. శ్రీకృష్ణుడు ఈ విధముగా పరమేశ్వరునినుండి వరములనన్నింటినీ పొంది, అనేకరకములైన బహుస్తోత్రములతో ఆయనను సంతోషపెట్టెను. అపుడు భక్తులయందు అనురాగము గలది, శివుని పత్నియగు పార్వతి సంతోషించి మహాత్ముడు, శంభుభక్తుడు, తపశ్శాలి అగు ఆ శ్రీకృష్ణునితో నిట్లనెను.

పార్వత్యువాచ ।

వాసుదేవ మహాబుద్ధే కృష్ణ తుష్టాస్మి తేఽనఘ ।
గృహాణ మత్తశ్చ వరాన్ మనోజ్ఞాన్ భువి దుర్లభాన్ ॥

పార్వతి ఇట్లు పలికెను –

ఓ వాసుదేవా ! శ్రీకృష్ణా ! నీవు మహాబుద్ధిశాలివి మరియు పుణ్యాత్ముడవు. నేను నీ విషయములో సంతోషమును పొందితిని. నీవు నానుండి కూడ మనస్సునకు నచ్చినవి, భూలోకములో పొంద శక్యము కానివి అగు వరములను స్వీకరించుము.

సనత్కుమార ఉవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్యాః పార్వత్యాస యదూద్వహః ।
ఉవాచ సుప్రసన్నాత్మా భక్తియుక్తేన చేతసా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

యదువంశశ్రేషుడగు ఆ శ్రీకృష్ణుడు పార్వతీదేవియొక్క ఈ మాటలను విని మిక్కిలి ి ప్రసన్నమైన హృదయము గలవాడై భక్తితో నిండిన మనస్సుతో ఇట్లు పలికెను.

శ్రీకృష్ణ ఉవాచ ।

దేవి త్వం పరితుష్టాసి చేద్దదాసి వరాన్ హి మే ।
తపసానేన సత్యేన బ్రాహ్మణాన్ ప్రతి మా స్మ భూత్ ॥
ద్వేషః కదాచిద్భద్రం తు పూజయేయం ద్విజాన్ సదా ।
తుష్టౌ చ మాతాపితరౌ భవేతాం మమ సర్వదా ॥
సర్వభూతేష్వానుకూల్యం భజేయం యత్ర తత్రగః ।
కులే ప్రసూతిరుచితా మమాస్తు తవ దర్శనాత్ ॥
తర్పయేయం సురేంద్రాదీన్ దేవాన్ యజ్ఞశతేన తు ।
యతీనామతిథీనాం చ సహస్రాణ్యథ సర్వదా ॥
భోజయేయం సదా గేహే శ్రద్ధాపూతం తు భోజనమ్ ।
బాంధవైస్సహ ప్రీతిస్తు నిత్యమస్తు సునిర్వృతిః ॥
దేవి భార్యాసహస్రాణాం భవేయం ప్రాణవల్లభః ।
అక్షీణా కామ్యతా తాసు ప్రసాదాత్తవ శాంకరి ॥
ఆసాం చ పితరో లోకే భవేయుస్సత్యవాదినః ।
ఇత్యాద్యాస్సువరాస్సంతు ప్రసాదాత్తవ పార్వతి ॥

శ్రీకృష్ణుడు ఇట్లు పలికెను -

ఓ దేవీ! నా సత్య వ్రతముచే మరియు ఈ తపస్సుచే నీవు సంతోషించినచో, నా ాకు ఈ వరములనిమ్ము. నాకు బ్రాహ్మణులపై ఎన్నడైననూ ద్వేషము కలుగకుండుగాక ! మంగళకరమగు బ్రాహ్మణపూజను నేను సర్వదా చేసెదను గాక ! నా తల్లిదండ్రులు సర్వకాలములలో సంతోషముగా నుందురు గాక ! నేను ఎచ్చటనున్ననూ సర్వప్రాణులయందు అనురాగమును కలిగియుందును గాక! నీ దర్శనభాగ్యముచే నా కులములో యోగ్యమగు సంతానము కలుగుగాక ! నేను వంద యజ్ఞములను చేసి ఇంద్రుడు మొదలగు దేవతలను సంతోషపెట్టెదను గాక ! నేను ఇంటిలో సర్వదా వేల సంఖ్యలో యతులకు మరియు అతిథులకు శ్రద్ధచే పవిత్రమైన భోజనమును సమర్పించెదను గాక! ఓ దేవీ ! నేను వేల సంఖ్యలో భార్యలకు ప్రియమగు భర్తను అగుదును గాక! ఓ శంకరగృహిణీ ! నాకు వారియందు నీ అనుగ్రహముచే క్షీణించని అనురాగము కలుగుగాక! వారి తల్లిదండ్రులు లోకములో సత్యవాక్యములను పలుకువారు అగుదురు గాక ! ఓ పార్వతీ ! నీ అనుగ్రహముచే నాకు ఇటువంటి మంచి వరములు లభించుగాక !

సనత్కుమార ఉవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా దేవీ తం చాహ విస్మితా ।
ఏవమస్త్వితి భద్రం తే శాశ్వతీ సర్వకామదా ॥
తస్మింస్తాంశ్చ వరాన్ దత్త్వా పార్వతీపరమేశ్వరౌ ।
తత్రైవాంతశ్చ దధతుః కృత్వా కృష్ణస్య సత్కృపామ్ ॥
కృష్ణః కృతార్థమాత్మానమమన్యత మునీశ్వర ।
ఉపమన్యోర్మునే రాశు ప్రాపాశ్రమమనుత్తమమ్ ॥
ప్రణమ్య శిరసా తత్ర తం మునిం కేశిహా తతః ।
తథా వృత్తం చ తస్మై తత్సమాచష్టోపమన్యవే ॥
స చ తం ప్రాహ కోఽన్యస్స్యాచ్ఛర్వాద్దేవాజ్జనార్దన ।
మహాదానపతిర్లోకే క్రోధే వాతీవ దుస్సహః ॥
జ్ఞానే తపసి వా శౌర్యే స్థైర్యే వాపద్ధ్య ఏవ చ ।
శృణు శంభోస్తు గోవింద దేవైశ్వర్యం మహాయశాః ॥
తచ్ఛ్రుత్వా శ్రద్ధయా యుక్తోఽభవచ్ఛంభోస్తు భక్తిమాన్ ।
పప్రచ్ఛ శివమాహాత్మ్యం స తం ప్రాహ మునీశ్వరః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఆతని ఆ మాటలను విని శాశ్వతురాలు, కోర్కెలనన్నింటినీ ఈడేర్చునది అగు పా ార్వతీ దేవి మిక్కిలి ఆశ్చర్యమును పొంది, అటులనే అగుగాక ! నీకు మంగళమగుగాక ! అని పలికెను, పార్వతీపరమేశ్వరులు ఆ శ్రీకృష్ణునకు ఆ వరములనిచ్చి మంచి దయను చూపి అచటనే అంతర్ధానము చెందిరి. ఓ మహర్షీ ! శ్రీకృష్ణుడు తాను కృతార్థుడనైతినని తలపోసి వెంటనే సర్వోత్తమమగు ఉపమన్యు మహర్షియొక్క ఆశ్రమము చేరుకొనెను. కేశియను రాక్షసుని సంహరించిన శ్రీకృష్ణుడు ఆ ఉపమన్యుమహర్షికి తల వంచి నమస్కరించి తరువాత ఆ జరిగిన వృత్తాంతమును చెప్పెను. అపుడు ఆ మహర్షి ఆయనతో నిట్లనెను : ఓ జనార్దనా ! లోకములో శివుని మించి గొప్ప వరములనీయగల వా డు గాని, కోపములో సహింప శక్యము కానివాడు గాని మరియొకరు ఎవరు గలరు ? గొప్ప కీర్తి గల ఓ గోవిందా! జ్ఞానములో, తపస్సులో, శౌర్యములో మరియు స్థైర్యములో శివుని మించినవారు ఎవరు గలరు ? ఆపదలనుండి రక్షించే శివుని దివ్యమగు ఈశ్వరత్వమును గురించి శ్రవణము చేయుము. ఆ మాటను విని ఆయన శంభుని యందు భక్తి గలవాడై శ్రద్ధతో గూడి శివుని మాహాత్మ్యమును చెప్పుడని కోరగా, ఆ మహర్షి ఆయనతో నిట్లనెను.

ఉపమన్యురువాచ ।

భగవాన్ శంకరః పూర్వం బ్రహ్మలోకే మహాత్మనా ।
స్తుతో నామసహస్రేణ దండినా బ్రహ్మయోగినా ॥
సాంఖ్యాః పఠంతి తద్గీతం విస్తీర్ణం చ నిఘంటువత్ ।
దుర్జ్ఞానం మానుషాణాం తు స్తోత్రం తత్సర్వకామదమ్ ॥
స్మరన్నిత్యం శంకరం త్వం గచ్ఛ కృష్ణ గృహం సుఖీ ।
భవిష్యసి సదా తాత శివభక్త గణాగ్రణీః ॥

పూర్వము బ్రహ్మలోకములో మహాత్ముడు, సమాహితచిత్తుడు అగు బ్రహ్మమయోగి దండమును పట్టుకొని శంకర భగవానుని సహస్రనామములతో స్తుతించెను. నిఘంటువు వలె విస్తారమగు ఆ గీతరూపములో నున్న స్తోత్రమును సాంఖ్యశాస్త్రపండితులు పఠించెదరు. కోర్కెలనన్నింటినీ ఈడేర్చే ఆ స్తోత్రమును తెలియుటలో మనుష్యులకు క్లేశము గలదు. ఓ శ్రీకృష్ణా! నీవు సర్వదా శివుని స్మరిస్తూ సుఖముగా ఇంటికి వెళ్లుము. ఓ వత్సా! నీవు సర్వదా శివభక్తులలో అగ్రేసరుడవు కాగలవు.

సనత్కుమార ఉవాచ ।

ఇత్యుక్తస్తం నమస్కృత్య వాసుదేవో మునీశ్వరమ్ ।
మనసా సంస్మరన్ శంభుం కేశవో ద్వారకాం యయౌ ॥
ఏవం కృష్ణస్సమారాధ్య శంకరం లోకశంకరమ్ ।
కృతార్థోఽ భూన్మునిశ్రేష్ఠ సర్వాజేయోఽ భవత్తథా ॥
తథా దాశరథీ రామశ్శివమారాధ్య భక్తితః ।
కృతార్థోఽ భూన్మునిశ్రేష్ఠ విజయీ సర్వతోఽభవత్ ॥
తపస్తప్త్వాతి విపులం పురా రామో గిరౌ మునే ।
శివాద్ధనుశ్శరం చాపం జ్ఞానం వై పరముత్తమమ్ ॥
రావణం సగణం హత్వా సేతుం బద్ధ్వాంభసాం నిధౌ ।
సీతాం ప్రాప్య గృహం యాతో బుభుజే నిఖిలాం మహీమ్ ॥
తథా చ భార్గవో రామో హ్యారాధ్య తపసా విభుమ్ ।
నిరీక్ష్య దుఃఖితశ్శర్వాత్పితరం క్షత్రియైర్హతమ్ ॥
తీక్ష్ణం స పరశుం లేభే నిర్దదాహ చ తేన తాన్ ।
త్రిస్సప్తకృత్వః క్షత్రాంశ్చ ప్రసన్నాత్పరమేశ్వరాత్ ॥
అజేయశ్చామరశ్చైవ సోఽద్యాపి తపసాం నిధిః ।
లింగార్చనరతో నిత్యం దృశ్యతే సిద్ధచారణైః ॥
మహేంద్రపర్వతే రామః స్థితస్తపసి తిష్ఠతి ।
కల్పాంతే పునరేవాసౌ వృష్టిస్థానమవాప్స్యతి ॥
అసితస్యానుజః పూర్వం పీడయా కృతవాంస్తపః ।
మూలగ్రామేణ విశ్వస్య దేవలో నామ తాపసః ॥

ఆ మహర్షి ఇట్లు పలుకగా, వసుదేవకుమారుడగు కేశవుడు ఆయనకు నమస్కరించి మనస్సులో శివుని స్మరిస్తూ ద్వారకకు వెళ్లెను. ఓ మహర్షీ ! ఈ విధముగా శ్రీకృష్ణుడు లోకములకు మంగళములను కలిగించే శంకరుని ఆరాధించి కృతార్థుడాయెను. మరియు ఆయనను శత్రువులు జయించలేక పోయిరి. ఓ మహర్షీ ! దశరథకుమారుడగు శ్రీరాముడు కూడ ఇదే విధముగా శివుని భక్తితో ఆరాధించి కృతార్థుడగుటయే గాక, సర్వత్రా విజయమును పొందెను. ఓ మునీ! పూర్వము శ్రీరాముడు కొండపై కఠినమైన తపస్సును చేసి శివుని నుండి ధనస్సును, బాణమును, అస్త్రమును మరియు సర్వోత్తమమగు జ్ఞానమును బడసెను, ఆయన సముద్రముపై సేతువును నిర్మించి రావణుని పరివారముతో సహా సంహరించి సీతను పొంది ఇంటికి వెళ్లి చక్రవర్తి ఆయెను. అదే విధముగా. భార్గవరాముడు తన తండ్రి క్షత్రియులచే సంహరింపబడుటను గాంచి దుఃఖించి సర్వేశ్వరుడగు శంకరుని తపస్సుచే ఆరాధించి, ప్రసన్నుడైన ఆ పరమేశ్వరునినుండి వాడియైన గండ్రగొడ్డలిని సంపాదించి, దానితో ఇరువది ఒక్క పర్యాయములు ఆ క్షత్రియులను సంహరించెను. తపోనిధి, పరాజయమును ఎరుగని వాడు, మృత్యువు లేనివాడు అగు ఆ మహర్షి ఈనాటికీ నిత్యము లింగార్చనయందు నిమగ్నుడై యుండగా సిద్ధులకు మరియు చారణులకు కనబడుచున్నాడు. ఆ పరశురాముడు మహేంద్రపర్వతముపై నుండి తపస్సును చేయుచున్నాడు. ఆయన కల్పము పూర్తి అయిన పిదప మరల ఋషిస్థానమును బడయగలడు. అసితుని సోదరుడగు దేవలమహర్షి పూర్వము జగత్తును మూలములో పట్టుకొని పీడించుచూ (?) తపస్సును చేసెను.

పురందరేణ శప్తస్తు తపస్వీ యశ్చ సుస్థిరమ్ ।
అధర్మ్యం ధర్మమలభల్లింగమారాధ్య కామదమ్ ॥
చాక్షుషస్య మనోః పుత్రో మృగోఽ భూత్తు మరుస్థలే ।
వసిష్ఠశాపాద్భృత్సమదో దండకారణ్య ఏకలః ॥
హృదయే సంస్మరన్ భక్త్యా ప్రణవేన యుతం శివమ్ ।
తస్మాన్మృత్యుముఖాకారో గణో మృగముఖోఽ భవత్ ॥
అజరామరతాం నీతస్త్ర్యా శాపం పునశ్చ సః ।
శంకరేణ కృతః ప్రీత్యా నిత్యం లంబోదరానుగః ॥
గార్గ్యాయ ప్రదదౌ శర్వో మోక్షం చ భువి దుర్లభమ్ ।
కామచారీ మహాక్షేత్రం కాలజ్ఞానం మహర్ధిమత్ ॥
చతుష్పాదం సరస్వత్యాః పారగత్వం చ శాశ్వతమ్ ।
న తుల్యం చ సహస్రం తు పుత్రాణాం ప్రదదౌ శివః ॥
వేదవ్యాసం తు యోగీంద్రం పుత్రం తుష్టః పినాకధృక్ ।
పరాశరాయ చ దదౌ జరామృత్యు వివర్జితమ్ ॥
మాండవ్యశ్శంకరేణైవ జీవం దత్వా విసర్జితః ।
వర్షాణాం దశ లక్షాణి శూలాగ్రా దవరోపితః ॥

దరిద్రో బ్రాహ్మణః కశ్చిన్నిక్షిప్య గురువేశ్మని ।

పుత్రం తు గాలవం యశ్చ పూర్వమాసీద్గృహాశ్రమీ ॥

ఆ తపశ్శాలిని ఇన్ద్రుడు శపించగా, ఆయన గొప్ప ధైర్యము గలవాడై కోర్కెలను తీర్చే లింగమును ఆరాధించి అధర్మమును అతిక్రమించి ధర్మమును పొందెను. చాక్షుషమనువుయొక్క కుమారుడగు గృత్సమదుడు వసిష్ఠుని శాపముచే లేడియే దండకారణ్యములోని ఎడారిలో ఒంటరిగా తిరుగాడెను. ఆయన హృదయములో శివుని స్మరిస్తూ భక్తితో ఓంకారమును జపించి మరణించిన తరువాత లేడి ముఖము గల గణము ఆయేను. శంకరుడు ఆయనకు శాపనివృత్తిని చేసి మరల జరామరణములు లేనట్లు అనుగ్రహించి ప్రేమతో విఘ్నేశ్వరునకు నిత్య-అనుచరునిగా చేసెను. శివుడు గర్గపుత్రునకు భూలోకదుర్లభమైన మోక్షమును, మహాక్షేత్రములను సంచరించుటకై యథేచ్ఛాసంచారశక్తినీ, గొప్ప ఐశ్వర్యమునిచ్చే కాలజ్ఞానమును, సరస్వతీస్వరూపమగు నాలుగు వేదములలో సర్వదా నిష్ణాతుడై ఉండే శక్తిని, సాటిలేని వేయిమంది పుత్రులను ఇచ్చెను. పినాకధారియగు శివుడు పరాశరునిపై ప్రసన్నుడై యోగీశ్రేష్ఠుడు, జరామరణములు లేనివాడు అగు వేదవ్యాసుని పుత్రునిగా అనుగ్రహించెను. శంకరుడు శూలముపై కొరత వేయబడి యున్న మాండవ్యుని దానిపై నుండి విడిపించి పది లక్షల సంవత్సరముల ఆయుర్దాయమునిచ్చి పంపించెను. పూర్వము గృహస్థాశ్రమమునందున్న ఒక దరిద్రబ్రాహ్మణుడు గురువుగారి ఇంటిలో తన పుత్రుడగు గాలవుని ఉంచెను.

గుప్తో వా మునిశాలాయాం భిక్షురాయాతి తద్గృహమ్ ।

భార్యామువాచ యః కశ్చిదవశ్యం నిర్ధనో యతః ॥

స తు వాచ్యో భవత్యా చ న దృశ్యంత ఇతి ప్రియః ।

అతిథేరాగతస్యాపి కిం దాస్యామి గృహే వసన్ ॥

కదాచిదతిథిః కశ్చిత్ క్షుత్తృషాక్షామతర్షితః ।

తాామువాచ స భర్తా తే క్వ గతశ్చేతి తం చ సా ॥

ప్రాహ భర్తా మదీయస్తు సాంప్రతం న చ దృశ్యతే ।

స ఋషిస్తమువాదం జ్ఞాత్వా దివ్యేన చక్షుషా ॥

గృహస్థితః ప్రతిచ్ఛన్నస్తత్రైవ స మృతో ద్విజః ।

విశ్వామిత్రాభ్యనుజ్ఞాతస్తత్పుత్రో గాలవస్తథా ॥

గృహమాగత్య మాతుస్స శ్రుత్వా శాపం సుదారుణమ్ ।

ఆరాధ్య శంకరం దేవం పూజాం కృత్వా తు శాంభవీమ్ ॥

గృహాదసౌ వినిష్క్రాంత స్సంస్మరన్ శంకరం హృదా ।

అథ తం తనయం దృష్ట్వా పితా తం ప్రాహ సాంజలిమ్ ॥

మహాదేవ ప్రసాదాచ్చ కృతకృత్యోఽస్మి కృత్యతః ।

ధనవాన్ పుత్రవాంశ్చైవ మృతోఽ హం జీవితః పునః ॥

ఇతి వః కథితమశేషం నాహం శక్తస్సమాసతో వ్యాసాత్ ।

వక్తుం శంభోశ్చ గుణాన్ శేషస్యాపి న ముఖాని స్యుః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం శివభక్తిమాహాత్మ్య వర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥

ఆ బ్రాహ్మణుడు మునిపల్లెలో రహస్యముగా జీవిస్తూ ఆ గృహమునకు భిక్ష కొరకు వచ్చుచుండెను. ఆ యజమాని భార్యతో నిట్లనెను: ఆతడు నిశ్చయముగా దరిద్రుడై యుండును, ఆతనితో నా భర్త కానవచ్చుట లేదనియు, ఒంటరిగా ఇంటిలో నున్న నేను ఇంటికి వచ్చిన అతిథికి ఏమి ఈయగలను అనియు చెప్పుము. ఒకనాడు ఒక అతిథి ఆకలి దప్పికలతో నీరసించి యున్నవాడై ఆమెతో, నీ భర్త ఎక్కడకు వెళ్లినాడు ? అని ప్రశ్నించగా, ఆమె ఆతనితో నా భర్త ఇప్పుడు కానవచ్చుట లేదని చెప్పెను. అపుడా మహర్షి దివ్యదృష్టిచే సర్వమును తెలుసుకొని ఆమెతో నీ భర్త ఇంటిలోననే దాగియున్నాడని పలికెను. ఆ బ్రాహ్మణుడు అచటనే మరణించెను. వారి కుమారుడగు గాలవుడు విశ్వామిత్రుని వద్ద సెలవు తీసుకొని, ఇంటికి వచ్చి తల్లినుండి ఆ అతిదారుణమగు శాపమును గురించి విని శంకరదేవుని ఆరాధించి పార్వతికి పూజను చేసి, హృదయములో శంకరుని స్మరిస్తూ ఆతడు ఇంటినుండి బయటకు వెళ్లెను. అపుడు ఆతని తండ్రి బ్రతికి వచ్చి ఆ భిక్షుకుని మరియు తన పుత్రుని చూచి ఇట్లనెను. మహాదేవుని అనుగ్రహముచే కృతార్థుడనైతిని. నేను ధనమును, పుత్రుని పొందితిని. మరణించిన నేను మరల బ్రతికితిని. ఈ విధముగా మీకు శంకరుని గుణములను చెప్పితిని. వాటిని సంగ్రహముగా గాని విస్తారముగా గాని పూర్తిగా చెప్పే సామర్థ్యము నాకు లేదు. ఆ విధముగా చెప్పుటకు శేషుని ముఖములు కూడ చాలవు.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు శివభక్తి మాహాత్మ్య వర్ణనమనే మూడవ ఆధ్యాయము ముగిసినది.

4 – శివ మాయా ప్రభావము

మునయ ఊచుః ।

తాత తాత మహాభాగ ధన్యస్త్వం హి మహామతే ।
అద్భుతేయం కథా శంభో శ్రావితా పరభక్తిదా ॥
పునర్బ్రూహి కథాం శంభో ర్వ్యాసప్రశ్నానుసారతః ।
సర్వజ్ఞస్త్వం వ్యాసశిష్యశ్శివతత్త్వ విచక్షణః ॥

మునులు ఇట్లు పలికిరి –

ఓ తండ్రీ ! మహాత్మా! మహాబుద్ధిశాలివి అగు నీవు ధన్యుడవు. శంభునిపై గొప్ప భక్తిని కలిగించే ఈ అద్భుతమగు కథను చెప్పితివి. వ్యాసుని ప్రశ్నకు. అనురూపముగా మరల ఆ గాథను చెప్పుము. వ్యాసశిష్యుడవగు నీవు సర్వజ్ఞుడవు మరియు శివతత్త్వములో విద్వాంసుడవు.

సూత ఉవాచ ।

ఏవమేవ గురుర్వ్యాసః పృష్టవాన్మేఽజ సంభవమ్ ।
సనత్కుమారం సర్వజ్ఞం శివభక్తం మునీశ్వరమ్ ॥

సూతుడు ఇట్లు పలికెను :

బ్రహ్మపుత్రుడు, సర్వజ్ఞుడు, శివభక్తుడు అగు సనత్కుమార మహర్షిని నాకు గురవగు వ్యాసుడు ఇటులనే ప్రశ్నించెను.

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ శ్రావితేయం శుభా కథా ।
శంకరస్య మహేశస్య నానాలీలా విహారిణః ॥
పునర్బ్రూహి మహాదేవమహిమానం విశేషతః ।
శ్రద్ధా చ మహతీ శ్రోతుం మమ తాత ప్రవర్ధతే ॥
మహిమ్నా యేన శంభోస్తు యే యే లోకే విమోహితాః ।
మాయయా జ్ఞానమావృత్య నానాలీలా విహారిణః ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

సర్వజ్ఞుడవగు ఓ సనత్కుమారా ! మహేశ్వరుడు, అనేకలీలలతో విహరించువాడు నగు ః శంకరుని ఈ శుభగాథను నీవు వినిపించితివి, మహాదేవుని మహిమను విశేషించి మరల చెప్పుము. ఓ తండ్రీ ! మాయచే అనేకలీలలను నెరపు శంభుని మహిమచే లోకములో ఏయే జనులు మాయచే కప్పివేయబడిన జ్ఞానము గలవారై మోహమును పొందినారు అనే విషయమును వినాలనే శ్రద్ధ అధికముగా నున్నది.

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాబుద్ధే శాంకరీం సుఖదాం కథామ్ ।
యస్యాః శ్రవణమాత్రేణ శివే భక్తిః ప్రజాయతే ॥
శివస్సర్వేశ్వరో దేవస్సర్వాత్మా సర్వదర్శనః ।
మహిమ్నా తస్య సర్వం హి వ్యాప్తం చ సకలం జగత్ ॥
శివస్యైవ పరా మూర్తిర్బ్రహ్మ విష్ణీశ్వరాత్మికా ।
సర్వభూతాత్మ భూతాఖ్యా త్రిలింగా లింగరూపిణీ ॥
దేవానాం యోనయశ్చాష్టౌ మానుషో నవమీ చ యా ।
తిరశ్చాం యోనయః పంచ భవంత్యేవం చతుర్దశ ॥
భూతా వా వర్తమానా వా భవిష్యాశ్చైవ సర్వశః ।
శివాత్సర్వే ప్రవర్తంతే లీయంతే వృద్ధిమాగతాః ॥
బ్రహ్మేంద్రోపేంద్ర చంద్రాణాం దేవదానవ భోగినామ్ ।
గంధర్వాణాం మనుష్యాణామన్యేషాం వాపి సర్వశః ॥
బంధుర్మిత్ర మథాచార్యో రక్షన్నేతాఽర్థవాన్ గురుః ।
కల్పద్రుమోఽథ వా భ్రాతా పితా మాతా శివో మతః ॥
శివస్సర్వమయః పుంసాం స్వయం వేద్యః పరాత్పరః ।
వక్తుం న శక్యతే యశ్చ పరం చానుపరం చ యత్ ॥
తన్మాయా పరమా దివ్యా సర్వత్ర వ్యాపినీ మునే ।
తదధీనం జగత్సర్వం సదేవాసురమానుషమ్ ॥
కామేన స్వసహాయేన ప్రబలేన మనో భువా ।
సర్వః ప్రధర్షితో వీరో విష్ణ్వాది ప్రబలోఽపి హి ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

మహాబుద్ధిశాలివియగు ఓ వ్యాసా ! శంకరుని సుఖములనిచ్చే గాథను వినుము. దీనిని విన్నంత మాత్రాన శివునియందు భక్తి ఉదయించును. సర్వేశ్వరుడు, సర్వుల ఆత్మ, సర్వసాక్షియగు ఆ శివదేవుని మహిమచే ఈ సకలజగత్తు మరియు సర్వము వ్యాప్తమై యున్నది. బ్రహ్మవిష్ణురుద్రులు శివుని శ్రేష్ఠమగు మూర్తులు మాత్రమే. సర్వప్రాణులలోని ఆత్మ శివుడే. మూడు రూపములలో భాసించు శివుడు యథార్థముగా రూపము లేనివాడు. ఎనిమిది దేవయోనులు, ఒక మనుష్యయోని మరియు పశుపక్ష్యాదుల యోనులు అయిదు వెరసి పదునాలుగు యోనులు గలవు. ఈ యోనులలో భూతభవిష్యద్వర్తమానకాలములలోని సర్వప్రాణులు శివుని నుండి జన్మించి శివుని యందు వృద్ధిని చెంది శివునిలో లీనమగుచున్నవి. బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, చంద్రుడు, దేవతలు, దానవులు, పన్నగులు, గంధర్వులు, మానవులు మరియు ఇతరులు అందరికీ అన్ని విధములుగా శివుడే బంధువు, స్నేహితుడు, ఆచార్యుడు, రక్షకుడు, నాయకుడు, సాఫల్యమునిచ్చే గురువు, కల్పవృక్షము, సోదరుడు, తండ్రి మరియు తల్లి అని చెప్పబడినది. సర్వస్వరూపుడు, ప్రకృతికంటే అతీతుడు అగు

శివుని మానవుడు తప్పక స్వయముగా తెలియవలెను. శివునితో సమమైన వాడు గాని, అధికుడు గాని ఉన్నాడని చెప్పుటకు శక్యము కాదు. ఓ మునీ! పరమదివ్యమగు శివుని మాయ సర్వమును వ్యాపించియున్నది. దేవదానవమానవులతో కూడిన జగత్తు అంతయు ఆ మాయకు ఆధీనమై యున్నది. లేశమైనను సాహాయ్యము లేనివాడు, మనస్సులో ఉదయించువాడు, మిక్కిలి బలశాలి అగు మన్మథుడు విష్ణువు మొదలగు అధికబలశాలురగు వీరులనందరినీ కూడ జయించినాడు.

శివమాయా ప్రభావేణాభూద్ధరిః కామమోహితః ।
పరస్త్రీ ధర్షణం చక్రే బహువారం మునీశ్వర ॥
ఇంద్రస్త్రిదశపో భూత్వా గౌతమస్త్రీ విమోహితః ।
పాపం చకార దుష్టాత్మా శాపం ప్రాప మునేస్తదా ॥
పావకోఽ పి జగచ్ఛ్రేష్ఠో మోహితశ్శివమాయయా ।
కామాధీనః కృతో గర్వాత్తతస్తేనైవ చోద్ధృతః ॥
జగత్ప్రాణోఽ పి గర్వేణ మోహితశ్శివమాయయా ।
కామేన నిర్జితో వ్యాస చక్రేఽన్యస్త్రీ రతిం పురా ॥
చండరశ్మిస్తు మార్తండో మోహితశ్శివమాయయా ।
కామాకులో బభూవాశు దృష్ట్వాశ్వీం హయరూపధృక్ ॥
చంద్రశ్చ మోహితశ్శంభో ర్మాయయా కామసంకులః ।
గురుపత్నీం జహారాథ యుతస్తేనైవ చోద్ధృతః ॥
పూర్వం తు మిత్రావరుణౌ ఘోరే తపసి సంస్థితౌ ।
మోహితౌ తావపి మునీ శివమాయావిమోహితౌ ॥
ఉర్వశీం తరుణీం దృష్ట్వా కాముకౌ సం బభూవతుః ।
మిత్రః కుంభే జహౌ రేతో వరుణోఽ పి తథా జలే ॥
తతః కుంభాత్సముత్పన్నో వసిష్ఠో మిత్రసంభవః ।
అగస్త్యో వరుణాజ్జాతో వడవాగ్ని సమద్యుతిః ॥
దక్షశ్చ మోహితశ్శంభో ర్మాయయా బ్రహ్మణస్సుతః ।
భ్రాతృభిస్స భగిన్యాం వై భోక్తుకామోఽ భవత్పురా ॥
బ్రహ్మా చ బహువారం హి మోహితశ్శివమాయయా ।
అభవద్భోక్తుకామశ్చ స్వసుతాయాం పరాసు చ ॥

ఓ మహర్షీ! విష్ణువు శివుని మాయయొక్క ప్రభావముచే అనేక పర్యాయములు కా◌ామముచే మోహితుడై పరస్త్రీలను పీడించెను. దుర్బుద్ధి, దేవతలకు అధిపతి అగు ఇంద్రుడు గౌతముని భార్యచే వ్యామోహితుడై పాపమును చేసి అప్పుడు మహర్షియొక్క శాపమునకు గురి అయ్యెను. జగత్తులో శ్రేష్ఠుడగు అగ్ని కూడ గర్వితుడై శివమాయచే మోహితుడై కామమునకు వశుడైనాడు. తరువాత ఆయనను శివుడే ఉద్ధరించినాడు. ఓ వ్యాసా! జగత్తునకు ప్రాణమైన వాయువు కూడ పూర్వము గర్వించి శివమాయచే మోహితుడై కామునిచే

జయింపబడి పరస్త్రీతో సంభోగించెను, తీక్ష్ణమగు కిరణములు గల సూర్యుడు శివమాయచే మోహితుడై కామునిచే ఆకులితునిగా చేయబడి ఒక ఆడగుర్రమును చూచి వెంటనే గుర్రము రూపమును దాల్చెను. చంద్రుడు శంభుని మాయచే మోహితుడై మన్మథవికారమునకు లోనై గురుపత్నిని అపహరించెను. అపుడు శివుడే వారిని కలిపి ఉద్ధరించెను. పూర్వము మిత్రావరుణులు ఘోరమగు తపస్సును చేసిరి. ఆ మునులు కూడ శివమాయచే మోహమును పొందిరి. వారిద్దరు యువతియగు ఊర్వశిని చూచి కామవికారమును పొందిరి. మిత్రుడు కుండయందు, వరుణుడు జలమునందు తేజస్సును త్యజించిరి. తరువాత వసిష్ఠుడు కుంభమునుండి పుట్టి మిత్రుని పుత్రుడైనాడు. వరుణుని పుత్రుడైన అగస్త్యుడు బడబాగ్నితో సమానమైన తేజస్సును కలిగియుండెను, పూర్వము బ్రహ్మపుత్రుడగు దక్షుడు సోదరులతో సహా శంభుని మాయచే మోహితుడై సోదరియందు దుర్బుద్ధిని చేసెను. అనేకపర్యాయములు శివుని మాయచే మోహితుడైన బ్రహ్మ తన కుమార్తెయందు మరియు ఇతర స్త్రీలయందు దుర్బుద్ధిని పొందెను.

చ్యవనోఽపి మహాయోగీ మోహితశ్శివమాయయా ।
సుకన్యయా విజహ్రే స కామాసక్తో బభూవ హ ॥
కశ్యపశ్శివమాయాతో మోహితః కామసంకులః ।
యయాచే కన్యకాం మోహాద్ధన్వనో నృపతేః పురా ॥
గరుడశ్శాండిలీం కన్యాం నేతుకమస్సుమోహితః ।
విజ్ఞాతస్తు తయా సద్యో దగ్ధపక్ష బభూవ హ ॥
విభాండకో మునిర్నారీం దృష్ట్వా కామవశం గతః ।
ఋష్యశృంగసుతస్తస్య మృగ్యాం జాతశ్శివాజ్ఞయా ॥
గౌతమశ్చ మునిశ్శంభోర్మాయా మోహితమానసః ।
దృష్ట్వా శారద్వతీం నగ్నాం రరామ క్షుభితస్తయా ॥
రేతస్స్కన్నం దధార స్వం ద్రోణ్యాం చైవ స తాపసః ।
తస్మాచ్చ కలశాజ్జాతో ద్రోణశ్శస్త్ర భృతాం వరః ॥
పరాశర మహాయోగీ మోహితశ్శివమాయయా ।
మత్స్యోదర్యా చ చిక్రీడే కుమార్యా దాశకన్యయా ॥
విశ్వామిత్రో బభూవాథ మోహితశ్శివమాయయా ।
రేమే మేనకయా వ్యాస వనే కామవశం గతః ॥
వసిష్ఠేన విరోధం తు కృతవాన్నష్టచేతనః ।
పునశ్శివ ప్రసాదాచ్చ బ్రాహ్మణోఽభూత్స ఏవ వై ॥

రావణో వైశ్రవాః కామీ బభూవ శివమాయయా ।

సీతాం జహ్రే కుబుద్ధిస్తు మోహితో మృత్యుమాప చ ॥

బృహస్పతిర్మునివరో మోహితశ్శివమాయయా ।

భ్రాతృపత్న్యా వశీ రేమే భరద్వాజస్తతోఽ భవత్ ॥

ఇతి మాయ ప్రభావో హి శంకరస్య మహాత్మనః ।

వర్ణితస్తే మయా వ్యాస కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥

ఇతి శ్రీశివమహాపురాణే ఉమాసంహితాయాం శివమాయా ప్రభావవర్ణనం నామ చతుర్థోఽ ధ్యాయః ॥

మహాయోగియగు చ్యవనుడు కూడ శివమాయచే మోహితుడై కామమునందు ఆసక్తి గలవా◌ాడై సుకన్యతో విహరించెను. పూర్వము కశ్యపుడు శివునిమాయచే మోహితుడై కామముచే క్షోభితుడై ధన్వమహారాజుయొక్క కుమార్తెను యాచించెను. మిక్కిలి మోహితుడై యున్న గరుడుడు శండీలునీ కన్యను అపహరించ బూనుకొనెను. ఆమెకు విషయము తెలియగానే ఆతని రెక్కలు కాలిపోయెను. విభాండకమహర్షి స్త్రీని చూచి కామమునకు వశుడాయెను. అపుడు శివుని ఆజ్ఞచే అతనికి ఆడు లేడియందు ఋష్యశృంగుడు కుమారునిగా జన్మించెను. గౌతమమహర్షి శంభుని మాయచే మోహితమైన అంతఃకరణము గలవాడై నగ్నురాలైయున్న శారద్వతిని చూచి, క్షోభను పొంది ఆమెతో రమించెను. ఆ మహర్షి సన్నమైన తన తేజస్సును కలశమునందు ధరించెను. ఆ కలశమునుండి ధనుర్ధారులలో శ్రేషుడైన ద్రోణుడు జన్మించెను. మహాయోగియగు పరాశరుడు శివమాయచే మోహితుడై చేపనుండి పుట్టిన, కుమారి యగు దాశకన్యతో రమించెను. ఓ వ్యాసా! విశ్వామిత్రుడు శివమాయచే మోహితుడై కామమునకు వశుడై వనములో మేనకతో రమించెను. నశించిన వివేకము గల ఆతడు వసిష్ఠునితో విరోధమును చేసెను. మరల శివుని అనుగ్రహముచే ఆయనయే బ్రాహ్మణుడాయెను. విశ్రవసుని కుమారుడగు రావణుడు శివుని మాయచే మోహితుడై కామమునకు లొంగి దుర్బుద్ధి గలవాడై సీతను అపహరించి మృత్యువు వాత పడెను. మహర్షి, జితేంద్రియుడు అగు బృహస్పతి శివమాయచే మోహితుడై సోదరుని భార్యతో రమించగా భరద్వాజుడు జన్మించెను. ఓ వ్యాసా! ఈ విధముగా నేను మహాత్ముడగు శంకరుని మాయాప్రభావమును నీకు వర్ణించి చెప్పితిని. ఇంకనూ ఏమి వినగోరుచున్నావు.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు శివమాయా ప్రభావమును వర్ణించే నాల్గవ అధ్యాయము ముగిసినది.

5 - మహా పాతక నిరూపణము

వ్యాస ఉవాచ ।

యే పాపనిరతా జీవా మహానరకహేతవః ।
భగవంస్తాన్ సమాచక్ష్వ బ్రహ్మపుత్ర నమోఽస్తు తే ॥

వ్యాసుడు ఇట్లు పలికెను-

ఓ బ్రహ్మపుత్రా! నీకు నమస్కారము. మహానరకములను పొందుటకు కారణమైన పాపములను జీవులు చేయుచుందురు. ఓ పూజ్యా! ఆ వివరములను చెప్పుము.

సనత్కుమార ఉవాచ ।

యే పాపనిరతా జీవా మహానరక హేతవః ।
తే సమాసేన కథ్యంతే సావధానతయా శృణు ॥
పరస్త్రీ ద్రవ్యసంకల్పశ్చేతసాఽ నిష్ట చింతనమ్ ।
అకార్యాభినివేశశ్చ చతుర్ధా కర్మ మానసమ్ ॥
అవిబద్ధ ప్రలాపత్వమసత్యం చాప్రియం చ యత్ ।
పరోక్షతశ్చ పైశున్యం చతుర్ధా కర్మ వాచికమ్ ॥
అభక్ష్యభక్షణం హింసా మిథ్యా కార్య నివేశనమ్ ।
పరస్వానాముపాదానం చతుర్ధా కర్మ కాయికమ్ ॥
ఇత్యే తద్ద్వాదశవిధం కర్మ ప్రోక్తం త్రిసాధనమ్ ।
అస్య భేదాన్ పునర్వక్ష్యే యేషాం ఫలమనంతకమ్ ॥
యే ద్విషంతి మహాదేవం సంసారార్ణవ తారకమ్ ।
సుమహత్పాతకం తేషాం నిరయార్ణవగామినామ్ ॥
యే శివజ్ఞానవకారం నిందంతి చ తపస్వినమ్ ।
గురూన్ పితౄ నథోన్మత్తాస్తే యాంతి నిరయార్ణవమ్ ॥
శివనిందా గురోర్నిందా శివజ్ఞానస్య దూషణమ్ ।
దేవద్రవ్యాపహరణం ద్విజద్రవ్య వినాశనమ్ ॥
హరంతి యే చ సమ్మూఢాశ్శివజ్ఞానస్య పుస్తకమ్ ।
మహాంతి పాతకాన్యాహురనంత ఫలదాని షట్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

మహానరకములకు హేతువులగు పాపములయందు ఆసక్తి గల జీవుల గురించి సంగ్రహముగా చెప్పుచున్నాను. సావధానముగా వినుము, మనస్సులో ఇతరుని భార్యను, ఇతరుల ద్రవ్యమును కోరుట, ఇతరులకు హానిని తలపెట్టుట, చేయకూడని పనియందు పట్టుదల అనునవి నాలుగు రకముల మానసికపాపములు. అనుచితమగు ప్రలాపము, అసత్యమును పలుకుట,

అప్రియమును పలుకుట, పరోక్షములో కొండెములను చెప్పుట అను నాలుగు విధములుగా వాచికమగు పాపకర్మ గలదు, తినకూడని పదార్థములను తినుట, హింసించుట, వ్యర్థకార్యములయందు లగ్నమగుట, ఇతరుల ద్రవ్యమును అపహరించుట అనునవి నాలుగు కాయికములగు పాపకర్మలు, మనోవాక్కాయములనే మూడు సాధనములచే చేయబడే కర్మలు ఈ విధముగా పన్నెండు రకములుగా నున్నవి. వీటిలో గల భేదములను మరల చెప్పగలను. వీటికి అనంతమగు పాపఫలము గలదు. ఎవరైతే సంసారసముద్రమునుండి తరింపజేసే మహాదేవుని ద్వేషించేరో, వారు మహాపాపమును పొంది నరకసముద్రములో పడెదరు. ఎవరైతే తపశ్శాలి, శివజ్ఞానమును బోధించువాడు అగు వ్యక్తిని, గురువులను మరియు తల్లిదండ్రులను నిందించెదరో, అట్టి పిచ్చివారు నరక సముద్రమును పొందెదరు. శివుని నిందించుట, గురువును నిందించుట, శివజ్ఞానమును దూషించుట, దేవుని సొమ్మును అపహరించుట, బ్రాహ్మణుల ధనమునకు ముపును కలిగించుట, శివజ్ఞానమునకు సంబంధించిన పుస్తకమును అపహరించుట అను ఆరు మహాపాపములు అనంతపాపఫలమునిచ్చునని చెప్పెదరు.

నాభినందంతి యే దృష్ట్వా శివపూజాం ప్రకల్పితామ్ ।
న నమంత్యర్చితం దృష్ట్వా శివలింగం స్తువంతి న ॥
యథేష్ట చేష్టా నిశ్శంకాస్సంతిష్ఠంతి రమంతి చ ।
ఉపచారవినిర్ము క్తాశ్శివాగ్రే గురుసన్నిధౌ ॥
స్థానసంస్కారపూజాం చ యే న కుర్వంతి పర్వసు ।
విధివద్వా గురూణాం చ కర్మయోగ వ్యవస్థితాః ॥
యే త్యజంతి శివాచారం శివభక్తాన్ ద్విషంతి చ ।
అసంపూజ్య శివజ్ఞానం యేఽధీయంతే లిఖంతి చ ॥
అన్యాయతః ప్రయచ్ఛంతి శృణ్వంత్యుచ్చారయంతి చ ।
విక్రీడంతి చ లోభేన కుజ్ఞాననియమేన చ ॥
అసంస్కృత ప్రదేశేషు యథేష్టం స్వాపయంతి చ ।
శివజ్ఞానకథాఽఽక్షేపం యః కృత్వాన్యత్ర భాషతే ॥
న బ్రవీతి చ యస్సత్యం న ప్రదానం కరోతి చ ।
అశుచిర్వా శుచిస్థానే యః ప్రవక్త శృణోతి చ ॥
గురుపూజామకృత్వైవ యశ్శాస్త్రం శ్రోతుమిచ్ఛతి ।
న కరోతి చ శుశ్రూషామాజ్ఞాం చ భక్తిభావతః ॥
నాభినందతి తద్వాక్యముత్తరం చ ప్రయచ్ఛతి ।
గురుకర్మణ్యసాధ్యం యత్తదుపేక్షాం కరోతి చ ॥
గురుమార్తమశక్తం చ విదేశం ప్రస్థితం తథా ।
వైరిభిః పరిభూతం వా యస్సంత్య జతి పాపకృత్ ॥

తద్భార్యాపుత్రమిత్రేషు యశ్చావజ్ఞాం కరోతి చ ।
ఏవం సువాచకస్యాపి గురోర్ధర్మానుదర్శినః ॥
ఏతాని ఖలు సర్వాణి కర్మాణి మునిసత్తమ ।
సుమహత్పాతకాన్యాహు శ్శివనిందాసమాని చ ॥

ఇతరులు చక్కగా శివపూజను చేసినప్పుడు చూచి ఎవరైతే అభినందించరో, అర్చింఁచబడియున్న శివలింగమునకు ఎవరైతే నమస్కరించరో, మరియు స్తుతించరో, ఎవరైతే బిడియము లేకుండగా ఇచ్చవచ్చిన రీతిలో ప్రవర్తించెదరో మరియు రమించెదరో, శివుని సన్నిధిలో మరియు గురువు యెదుట మర్యాద లేకుండగా ప్రవర్తించెదరో , ఎవరైతే పండుగ దినములలో కర్మయోగమునందు నిష్ఠ గలవారై యథావిధిగా పూజాస్థానమును శుభ్రము చేసి పూజను చేయరో, మరియు గురువులను పూజించరో, ఎవరైతే శివాచారమును విడిచిపెట్టి శివభక్తులను ద్వేషించెదరో, శివజ్ఞానమును బోధించే పుస్తకమును ఆరాధించకుండగా అక్షరాభ్యాసమును చేసి వ్రాసి అధ్యయనమును చేయుదురో, ఎవరైతే తప్పు పద్ధతిలో దానమును చేయుదురో, తప్పు మాటలను వినెదరో మరియు పలికెదరో, లోభముతో క్రీడలయందు ప్రవేశించెదరో, జ్ఞానము విషయములో సరియగు నియమములను పాటించరో, సంస్కారములేని ప్రదేశములలో యథేచ్ఛగా నిద్రించెదరో, ఎవడైతే శివజ్ఞానముయొక్క ప్రవచనమును నిందించి మరియొక ప్రసంగమును చేయునో, ఎవడైతే సత్యమును పలుకడో, దానమును చేయడో, అశుచియై మరియు అశుచియగు ప్రదేశములో ప్రవచనమును చెప్పునో మరియు వినునో, ఎవడైతే గురువును పూజించకుండగనే శాస్త్రమును వినగోరునో, గురుశుశ్రూషను మరియు ఆజ్ఞాపాలనను భక్తి భావముతో చేయడో, గురువుయొక్క వచనమును స్వీకరించకుండగా ప్రత్యుత్తరమునిచ్చునో, గురువుగారి పనులలో కఠినమైన దానిని ఉపేక్షించునో, ఆపదలో నున్నవాడు, శక్తి లేనివాడు, విదేశమునకు వెళ్లినవాడు మరియు శత్రువులచే పరాభవించబడినవాడు అగు గురువును ఏ పాపాత్ముడైతే విడిచి పెట్టునో; ధర్మమునెరింగి చక్కగా పాఠములను చేప్పే గురువుయొక్క భార్యను, పుత్రులను మరియు మిత్రులను ఎవడైతే అవమానించునో, వీరందరు మహాపాపమును పొందెదరు. ఈ కర్మలను చేయువారు శివనిందతో సమమగు పాపమును పొందెదరని చెప్పెదరు.

బ్రహ్మఘ్నశ్చ సురాపశ్చ స్తేయీ చ గురుతల్పగః ।
మహాపాతకనస్త్వేతే తత్సంయోగీ చ పంచమః ॥
క్రోధాల్లో భాధ్భయాద్ద్వేషాద్బ్రాహ్మణస్య వధే తు యః ।
మర్మాంతికం మహాదోషముక్త్వా స బ్రహ్మహా భవేత్ ॥
బ్రాహ్మణం యస్సమాహూయ దత్త్వా యశ్చాదదాతి చ ।
నిర్దోషం దూషయేద్యస్తు స నరో బ్రహ్మహా భవేత్ ॥
యశ్చ విద్యాభిమానేన నిస్తేజయతి సుద్విజమ్ ।
ఉదాసీనం సభామధ్యే బ్రహ్మహా స ప్రకీర్తితః ॥

మిథ్యా గుణైర్య ఆత్మానం నయత్యుత్కర్షతాం బలాత్ ।

గుణానపి నిరుద్యాస్య స చ వై బ్రహ్మహా భవేత్ ॥

గవాం వృషాభిభూతానాం ద్విజానాం గురుపూర్వకమ్ ।

యస్సమాచరతే విఘ్నం తమాహుర్బ్రహ్మ ఘాతకమ్ ॥

దేవద్విజగవాం భూమిం ప్రదత్తాం హరతే తు యః ।

ప్రనష్టామపి కాలేన తమాహుర్బ్రహ్మ ఘాతకమ్ ॥

దేవద్విజస్వహరణమన్యాయేనార్జితం తు యత్ ।

బ్రహ్మహత్యాసమం జ్ఞేయం పాతకం నాత్ర సంశయః ॥

అధీత్య యో ద్విజో వేదం బ్రహ్మజ్ఞానం శివాత్మకమ్ ।

యది త్యజతి యో మూఢస్సు రాపానస్య తత్సమమ్ ॥

యత్కించిద్ధి వ్రతం గృహ్య నియమం యజనం తథా ।

సంత్యాగః పంచయజ్ఞానాం సురాపానస్య తత్సమమ్ ॥

బ్రహ్మహత్యను చేసినవాడు, సురాపానము చేసినవాడు, చోరుడు, గురుభార్యతో రమించువాడు, మరియు ఈ నలుగురితో స్నేహమును చేయువాడు అను ఐదుగురు మహాపాపాత్ములు. ఎవడైతే కోపముచే గాని, లోభముచే గాని, భయముచే గానీ, ద్వేషముచే గాని బ్రాహ్మణుని వధకొరకై ఆతని రహస్యమును బట్టబయలు చేసే మహాదోషమును చెప్పునో, వాడు బ్రహ్మహత్యా దోషమును పొందును. ఏ మానవుడు బ్రాహ్మణుని ఆహ్వానించి ఇచ్చిన దానిని తిరిగి తీసుకొని దోషము లేకుండగనే దూషించునో, వాడు బ్రహ్మహత్యాదోషమును పొందును. ఎవడైతే తాను విద్వాంసుడననే అహంకారముతో సభామధ్యములో ఉదాసీనుడగు సద్బ్రాహ్మణుని చిన్నబుచ్చునో వానికి బ్రహ్మహత్యాదోషము కలుగును. ఎవడైతే ఇతరుల గుణములను కూడ ప్రయత్నపూర్వకముగా కప్పిపుచ్చి తనయందు లేని గుణములను ప్రచారము చేసుకొని తనకు ఉత్కర్ష కలుగునట్లు చేసుకొనునో, వానికి బ్రహ్మహత్యా దోష ము కలుగును. వృషభముతో సంగమించే గోవునకు, గురువువద్ద ఉపదేశమును పొందుచున్న బ్రాహ్మణునకు ఎవడైతే విఘ్నమును చేయునో, వానికి బ్రహ్మహత్యాదోషము సంక్రమించును. దేవాలయమునకు, బ్రాహ్మణులకు మరియు ఆవులు మేయుటకు ఈయబడిన భూమిని ఎవడైతే అపహరించునో, వానికి బ్రహ్మహత్యాదోషము సంక్రమించును. ఆ భూమి కాలక్రమములో పాడుపడియున్ననూ, ఆయా హక్కుదారుల అధికారమునకు కాలదోషము పట్టిననూ, దానిని ఆక్రమించరాదు. దేవుని సొమ్మును, బ్రాహ్మణుల సొత్తును అపహరించుట మరియు అన్యాయముగా ధనమునార్జించుట బ్రహ్మహత్యతో సమానమగునని తెలియవలెను. మూర్ఖుడగు ఏ బ్రాహ్మణు డైతే వేదమును మరియు శివస్వరూపమగు బ్రహ్మజ్ఞానమును అధ్యయనము చేసి విడిచిపెట్టునో, వానికి సురాపానముతో సమానమగు పాపము వచ్చును. ఏదేని వ్రతమును, నియమమును లేదా పూజను చేపట్టి వదిలిపెట్టుట, దేవ- ఋషి- పితృ- మనుష్య-భూతయజ్ఞములనే అయిదు మహాయజ్ఞములను వదలిపెట్టుట సురాపానముతో సమానమగును.

పితృమాతృపరిత్యాగః కూటసాక్ష్యం ద్విజానృతమ్ ।
ఆమిషం శివభక్తానామ భక్ష్యస్య చ భక్షణమ్ ॥
వనే నిరపరాధానాం ప్రాణినాం చాపఘాతనమ్ ।
ద్విజార్థం ప్రక్షిపేత్సాధుర్న ధర్మార్థం నియోజయేత్ ॥
గవాం మార్గే వనే గ్రామే యైశ్చైవాగ్నిః ప్రదీయతే ।
ఇతి పాపాని ఘోరాణి బ్రహ్మహత్యాసమాని చ ॥
దీనసర్వ స్వహరణం నరస్త్రీ గజవాజీనామ్ ।
గోభూర జతవస్త్రాణామౌషధీనాం రసస్య చ ॥
చందనాగరుకర్పూర కస్తూరీ పట్టవాససామ్ ।
విక్రయస్త్వవిపత్తౌ యః కృతో జ్ఞానాద్ద్విజాతిభిః ॥
హస్తన్యాసాపహరణం రుక్మస్తేయసమం స్మృతమ్ ।
కన్యానాం వరయోగ్యానామదానం సదృశే వరే ॥
పుత్రమిత్ర కలత్రేషు గమనం భగినీషు చ ।
కుమారీసాహసం ఘోరమద్యపస్త్రీ నిషేవణమ్ ॥
సవర్ణాయాశ్చ గమనం గురుభార్యాసమం స్మృతమ్ ।
మహాపాపాని చోక్తాని శృణు త్వముపపాతకమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం మహాపాతకవర్ణనం నామ
పంచమోఽధ్యాయః ॥

తల్లిదండ్రులను విడిచిపెట్టుట, తప్పుడు సాక్ష్యమును చెప్పుట, బ్రాహ్మణునితో అసత్యమును పలుకుట, శివభక్తులకు మాంసమును తినిపించుట, నిషిద్ధమగు ఆహారమును భుజించుట, అడవిలోని అపరాధమునెరుంగని ప్రాణులను సంహరించుట అనునవి బ్రహ్మహత్యతో సమానమగు పాపములు. సాధుస్వభావము గల మానవుడు బ్రాహ్మణధనమును తనవద్ద ఉంచుకొనరాదు. దానిని ధర్మము కొరకైననూ వినియోగించరాదు. అట్లు చేయుట బ్రహ్మహత్యతో సమానమగును , గోవులు సంచరించే మార్గములో, అడవిలో, మరియు గ్రామములో నిప్పును పెట్టుట అనునవి బ్రహ్మహత్యతో సమానమైన ఘోర పాపములు:. దీనుల సర్వస్వమును అపహరించుట, బ్రాహ్మణుడై యుండి ఆపత్కాలము కాకున్ననూ బుద్ధిపూర్వకముగా, పురుషుడు, స్త్రీ, ఏనుగు, గుర్రము, ఆవు, భూమి, వెండి, బట్టలు, మందులు, పాదరసము, చందనము, అగరు, కర్పూరము, కస్తూరి, పట్టు వస్త్రములు అను వాటిని అమ్ముట, ఇతరులు నమ్మి చేతిలో పెట్టిన సంపదను అపహరించుట అను కార్యములు బంగారమును అపహరించుటతో సమానమని మహర్షులు చెప్పుచున్నారు. వివాహయోగ్యమగు వయస్సు వచ్చిన కన్యలను యోగ్యులగు వరులకు ఇచ్చి వివాహమును చేయకుండుట, పుత్రుని మరియు మిత్రుని భార్యతో మరియు సోదరితో సంగమము, కన్యను బలాత్కరించుట, భయంకరముగా మద్యమును సేవించు స్త్రీతో గాని, తన కులమునకు చెందిన పరస్త్రీతో గాని సంబంధమును పెట్టుకొనుట అనే కర్మలు గురు భార్యాగమనముతో సమానమగు పాపకర్మలు అని చెప్పబడినది. నేను ఇంతవరకు మహాపాపములను గురించి చెప్పితిని. ఇప్పుడు ఉపపాతకములను గురించి వినుము.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మహాపాతకవర్ణనము అనే ఐదవ అధ్యాయము ముగిసినది.

6 – పాప భేద వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

ద్విజద్రవ్యాపహరణమపి దాయవ్యతిక్రమః ।
అతిమానోఽతికోపశ్చ దాంభికత్వం కృతఘ్నతా ॥
అత్యంత విషయాసక్తిః కార్పణ్యం సాధుమత్సరమ్ ।
పరదారాభిగమనం సాధుకన్యాసు దూషణమ్ ॥
పరివిత్తిః పరివేత్తా చ యయా చ పరివిద్యతే ।
తయోర్దానం చ కన్యాయాస్తయోరేవ చ యాజనమ్ ॥
శివాశ్రమ తరూణాం చ పుష్పారామ వినాశనమ్ ।
యః పీడామాశ్రమస్థానామాచరేదల్పి కామపి ॥
సభృత్యపరివారస్య పశుధాన్య ధనస్య చ ।
కుప్య ధాన్యపశుస్తేయమం వ్యాపావనం తథా ॥
యజ్ఞారామతడాగానాం దారాపత్యస్య విక్రయమ్ ।
తీర్థయాత్రోపవాసానాం వ్రతోపనయకర్మణామ్ ॥
స్త్రీధనాన్యుపజీవంతి స్త్రీ భిరత్యంత నిర్జితాః ।
అరక్షణం చ నారీణాం మాయయా స్త్రీనిషేవణమ్ ॥
కాలాగతా ప్రదానం చ ధాన్యవృష్ట్యుప సేవనమ్ ।
నిందితాచ్చ ధనాదానం పణ్యానాం కూటజీవనమ్ ॥
విషమారణ్యపత్రాణాం సతతం వృషవాహనమ్ ।
ఉచ్చాటనాభిచారం చ ధాన్యాదానం భిషక్క్రియా ॥
జిహ్వాకామోపభోగార్థం యస్యారంభస్సుకర్మసు ।
మూలేనా ధ్యాపకో నిత్యం వేదజ్ఞానాదికం చ యత్ ॥
బ్రాహ్మాదివ్రతసంత్యాగశ్చాన్యాచార నిషేవణమ్ ।
అసచ్ఛాస్త్రాధిగమనం శుష్కతరావలంబనమ్ ॥
దేవాగ్నిగురుసాధూనాం నిందయా బ్రాహ్మణస్య చ ।
ప్రత్యక్షం వా పరోక్షం వా రాజ్ఞాం మండలినామపి ॥
ఉత్సన్నపితృదేవేజ్యాస్స్వకర్మత్యాగినశ్చ యే ।
దుశ్శీలా నాస్తికాః పాపాస్సదా వాఽసత్యవాదినః ॥
పర్వకాలే దివా వాప్సు వియోనౌ పశుయోనిషు ।
రజస్వలాయా యోనౌ చ మైథునం యస్సమాచరేత్ ॥
స్త్రీపుత్రమిత్రసంప్రాప్తే ఆశాచ్ఛేదకరాశ్చ యే ।
జనస్యా ప్రియవక్తారః క్రూరాస్సమయవేధినః ॥
భేత్తా తడాగకూపానాం సంక్రయాణాం రసస్య చ ।
ఏకపంక్తిస్థితానాం చ పాకభేదం కరోతి యః ॥

ఇత్యతః స్త్రీనరాః పాపైరుపపాతకినః స్మృతాః ।

యుక్తా ఏభిస్తథాన్యేఽపి శృణు తాంస్తు బ్రవీమి తే ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

బ్రాహ్మణుల సొత్తును అపహరించుట, పిత్రార్జితమును పంచుటలో మోసమును చేయుట, తన గొప్పదనమందు అధికమగు అభిమానమును కలిగియుండుట, తీవ్రమగు కోపము, తాను ధర్మాత్ముడునని పదిమందికి తెలియునట్లు చేయుట, చేసిన మేలును మరచుట (1), ఇంద్రియభోగములయందు అధికమగు ఆసక్తి, పిసినారి తనము, సత్పురుషులయందు అసూయ, పరస్త్రీతో సంబంధమును పెట్టుకొనుట, సత్కులమునకు చెందిన కన్యను చెడగొట్టుట (2), అన్నగారి వివాహము కాకుండగనే తమ్ముడు వివాహమాడుట, అట్టి అన్నదమ్ములకు కన్యలనిచ్చుట, వారిచే యజ్ఞమును చేయించుట (3), శివుని ఆశ్రమమును చెట్లను పుష్పోద్యానములను నాశనము చేయుట, ఆశ్రమమునందు ఉన్నవారికి అల్పముగ నేననూ పీడను కలిగించుట (4), సేవకులతో మరియు కుటుంబముతో కూడియున్నవాని పశువులను, ధాన్యమును మరియు ధనమును అపహరించుట, లోహములను, ధాన్యమును మరియు పశువులను అపహరించుట, జలములను కలుషితము చేయుట (5), యజ్ఞస్థలమును, చెరువును, భార్యను, సంతానమును విక్రయించుట, తీర్థయాత్రలను, ఉపవాసములను, వ్రతములను మరియు ఉపనయనకర్మను. ధనసంపాదనకు వాడుకొనుట (6), స్త్రీధనముతో జీవించుట, స్త్రీలకు పూర్తిగా వశమై యుండుట, స్త్రీకి రక్షణను కల్పించకుండుట, మోసగించి స్త్రీని భోగించుట (7), తీసుకున్న అప్పును సమయము వచ్చిననూ తీర్చకుండుట, ధాన్యమును దుర్వినియోగము చేయుట, దుష్టుని నుండి ధనమును తీసుకొనుట, మోసముతో వ్యాపారమును చేసి జీవించుట (8), సరియగు దారి లేని అడవి దొరులగుండా ఎద్దులచే బరువులను మోయించుట, భూతోచ్చాటనము, ఆభిచారికకర్మ ధాన్యమును అపహరించుట, మోసముతో కూడిన వైద్యమును చేయుట (9), రుచ్యములగు పదార్థములను తినాలనే కోరికతో మంచి పనులనారంభించుట, నిత్యము ధనమును సంపాదించుట కొరకై వేదమును మరియు ఇతర జ్ఞానమును ఇతరులకు బోధించుట (10), బ్రహ్మచర్యము మొదలగు వ్రతములను విడిచి పెట్టుట, పరధర్మమును స్వీకరించుట, దుష్టశాస్త్రములనధ్యయనము చేయుట, శాస్త్ర విరుద్ధమగు తర్కమునవలంబించుట (11), దేవతలు, అగ్ని, గురువు, సాధువు, బ్రాహ్మణుడు, రాజు మరియు మండలాధిపతి అను వారిని ప్రత్యక్షముగా గాని, పరోక్షములో గానీ నిందించుట (12), పిత్ృ క్రియలను, దేవతలకొరకు చేసే యజ్ఞములను పరిత్యజించుట, స్వకర్మను అనుష్ఠించ కుండుట, చేడు స్వభావమును కలిగి యుండుట, నాస్తిక వాదమునవలబించుట, సర్వదా పాపకార్యములను చేయుచుండుట, అసత్యమును పలుకుట (13), పర్వదినములలో గాని, పగలు గానీ, నీటిలో గాని సంభోగము, పరస్త్రీ రతి, పశుసంభోగము, రజస్వలాసంభోగము (14), తన వద్దకు వచ్చిన స్త్రీకి, పుత్రునకు మరియు మిత్రునకు ఆశాభంగమును కలిగించుట, జనులకు అప్రియమగు విషయములను చెప్పుట,

క్రూరబుద్ధిని కలిగియుండుట, మాటను నిలబెట్టు కొనక పోవుట (15), చెరువులను, నూతులను, మరియు నీటిని చేలకు అందించే కాలువలను వినాశము చేయుట, ఒకే పంక్తియందు ఉన్న వారికి ఆహారము నిచ్చే సమయములో పంక్తిభేదమును చేయుట (16) అను పాపములను చేయు స్త్రీ పురుషులు ఉపపాతకులు అనబడుదురు. ఇంకనూ మరికొందరు పాపాత్ములను గురించి చెప్పెదను ; వినుము (17).

యే గో బ్రాహ్మణకన్యానాం స్వామిమిత్ర తపస్వినామ్ ।
వినాశయంతి కార్యాణి తే నరా నారకాః స్మృతాః ॥
పరస్త్రియాభి తప్యంతే యే పరద్రవ్యసూచకాః ।
పరద్రవ్యహరా నిత్యం తౌలమిథ్యానుసారకాః ॥
ద్విజదుఃఖకరా యే చ ప్రహారం చోద్దరంతి యే ।
సేవంతే తు ద్విజాశ్శూద్రాం సురాం బధ్నంతి కామతః ॥
యే పాపనిరతాః క్రూరా యేఽపి హింసా ప్రియా నరాః ।
వృత్త్యర్థం యేఽపి కుర్వంతి దానయజ్ఞాదికాః క్రియాః ॥
గోష్ఠాగ్నిజలరథ్యాసు తరుచ్ఛాయానగేషు చ ।
త్యజంతి యే పురీషా ద్యాన్నా రామాయతనేషు చ ॥
లజ్జా శ్రమ ప్రాసాదేషు మద్యపానరతాశ్చ యే ।
కృతకేళిభుజంగాశ్చ రంధ్రాన్వేషణతత్పరాః ॥
వంశేష్టకాశిలా కాష్ఠైః శృంగైశ్శంకుభిరేవ చ।
యే మార్గమనురుంధంతి పరసీమాం హరంతి యే ॥
కూటశాసనకర్తారః కూట కర్మక్రియారతాః ।
కూటపాకాన్నవస్త్రాణాం కూటసంవ్యవహారిణః ॥
ధనుషశ్శస్త్ర శల్యానాం కర్తా యః క్రయవిక్రయీ ।
నిర్దయోఽ తీవ భృత్యేషు పశూనాం దమనశ్చ యః ॥
మిథ్యా ప్రవదతో వాచ ఆకర్ణయతి యశ్శనైః ।
స్వామిమిత్రగురుద్రోహీ మాయావీ చపలశ్శఠః ॥
యే భార్యాపుత్రమిత్రాణి బాలవృద్ధకృశాతురాన్ ।
భృత్యానతిథి బంధూంశ్చ త్యక్త్వాశ్నంతి బుభుక్షితామ్ ॥
యస్స్వయం మిష్టమశ్నాతి విప్రేభ్యో న ప్రయచ్ఛతి ।
వృథాపాకస్స విజ్ఞేయో బ్రహ్మావాదిషు గర్హితః ॥

ఎవరైతే గోవులు, బ్రాహ్మణులు, కన్యలు, రాజు, మిత్రులు, తపశ్శాలురు అను వారి◌ి కార్యములను చెడగొట్టెదరో, వారు పాపాత్ములని చెప్పబడుదురు (18). పరస్త్రీ వ్యామోహముచే తాపమును పొందువారు, పరధనముపై కన్నువేసి ఉంచువారు, పరధనమును అపహరించువారు, తూకములో మోసమును చేయువారు (19), బ్రాహ్మణులకు దుఃఖమును కలిగించువారు, వారిని కొట్టుటకై

ఆయుధమును పైకి ఎత్తువారు, శూద్రులను సేవించు బ్రాహ్మణులు, కామనచే మదిరను సేవించువారు (20), పాపమునందాసక్తి గల క్రూరాత్ములు, హింసయందు ప్రీతి గల మానవులు, దానము, యజ్ఞము మొదలగు కర్మలను జీవికకొరకై చేయువారు (21), గోశాల, అగ్ని, నీరు, నడచే దారీ, చెట్టునీడ, పర్వతము, ధర్మశాల, దేవాలయము అను ప్రదేశములయందు పురీషాదులను విసర్జించువారు (22), సిగ్గును విడిచి ఆశ్రమములలో మరియు ప్రధానమగు ప్రాసాదములలో మద్యమును సేవించుటయందు ఆసక్తిని కలిగి యుండువారు, జూదమునాడువారు, విటులు, ఇతరులయందలి దోషములను వెదుకుటయే ప్రముఖకార్యముగా గలవారు (23), వెదురుబొంగులు, ఇటుకలు, రాళ్లు, కర్రలు, పశువుల కొమ్ములు, మేకులు అను వాటితో దారిని మూసివేయువారు. ఇతరుల సరిహద్దును అతిక్రమించువారు (24), మోసముతో కూడిన చట్టములను చేయువారు, మోసముతో కూడిన కార్యములయందు ఆసక్తి గలవారు, ఇతరులను మోసగించి తెచ్చిన అన్నమును, ఇతర భక్ష్యములను మరియు వస్త్రములను మోసముతో ఉపయోగములో పెట్టువారు (25), ధనస్సు, బాణము, మరియు ఇతరములగు ఆయుధములను తయారుచేసి క్రయవిక్రయములను చేయువారు, సేవకులయందు లేశమైననూ దయలేనివారు, పశువులను హింసించువారు (26), వ్యర్థమగు వచనములను పలుకువాడు, ఇతరుల మాటలను మెల్లగా వినువాడు, రాజునకు, మిత్రునకు మరియు గురువునకు ద్రోహమును చేయువాడు, మోసములను చేయువాడు; చంచలస్వభావము గల వాడు, నమ్మించి మోసము చేయువాడు (27), భార్య, పుత్రులు, మిత్రులు, పిల్లలు, వృద్ధులు, నీరసించి యున్నవారు, ఆపదలో నున్నవారు, సేవకులు, అతిథులు, బంధువులు అను వారు ఆకలితో నుండగా వారిని విడిచిపెట్టి భుజించువారు పాపాత్ములనబడుదురు (28). బ్రాహ్మణులకు సమర్పించకుండగా స్వయముగా మృష్టాన్నమును తినువారు చేసుకొనే వంట వ్యర్థమనియు, వారు నిందార్హులనియు వేదవేత్తలు చెప్పుచున్నారు (29).

నియమాన్ స్వయమాదాయ యే త్యజంత్య జితేంద్రియాః ।
ప్రవ్రజ్యా వాసితా యే చ హరస్యాస్య ప్రభేదః ॥
యే తాడయంతి గాం క్రూరా దమయంతే ముహుర్ముహుః ।
దుర్బలాన్యే న పుష్ణంతి సతతం యే త్యజంతి చ ॥
పీడయంత్యతిభారేణాఽసహంతం వాహయంతి చ ।
యోజయన్నకృతాహారాన్న విముంచంతి సంయతాన్ ॥
యే భారక్షతో గార్తాన్ గోవృషాంశ్చ క్షుధాతురాన్ ।
న పాలయంతి యత్నేన గోఘ్నాస్తే నారకాః స్మృతాః ॥
వృషాణాం వృషణాన్యే చ పాపిష్ఠా గాలయంతి చ ।
వాహయంతి చ గాం వంధ్యాం మహానారకినో నరాః ॥
ఆశయా సమనుప్రాప్తాన్ క్షుత్తృష్ణాశ్రమ కర్శితాన్ ।
అతిథీంశ్చ తథాఽనాథాన్ స్వతంత్రాన్ గృహమాగతాన్ ॥

అన్నాభిలాషాన్ దీనాన్వా బాలవృద్ధకృశాతురాన్ ।
నానుకంపంతి యే మూఢాస్తే యాంతి నరకార్ణవమ్ ॥

ఎవరైతే ఇంద్రియజయము లేనివారై తాము స్వయముగా చేపట్టిన వ్రతనియమములను విడిచి పెట్టెదరో, సన్న్యసించి మరల గృహస్థాశ్రమములోనికి తిరిగి వచ్చేదరో, శివుని మూర్తులను భగ్నము చేసెదరో (30), ఏ క్రూరాత్ములు ఎద్దును పలుమార్లు కొట్టి పీడించెదరో, బక్క చిక్కిన ఎద్దులను పోషించకుండగా విడిచిపెట్టెదరో (31), సహించ శక్యము కాని అధికభారమును బళ్లకు కట్టి వాటిచే మోయించెదరో, వాటిని విశ్రాంతి కొరకై విడిచిపెట్టరో, వాటికి ఆహారమునీయరో (32), బరువులను మోసే సమయములో గాయపడిన ఎద్దులను, రోగమును పొందిన ఎద్దులను మరియు ఆవులను, అవి ఆకలితో బాధపడుచుండగా వాటికి ప్రయత్నపూర్వకముగా ఆహారమును ఇచ్చి పోషించరో, అట్టి వారు గోహత్యాపాపమును పొందెదరని మహర్షులు చెప్పుచున్నారు (33). ఏ పాపాత్ములు వృషభముల అండములను బలాత్కారముగా తీసివేసి వాటిచే బరువులను మోయించెదరో, పాలీయని ఆవులచే బరువులను మోయించెదరో, వారు మహాపాపాత్ములు (34). ఆశ పడి వచ్చిన వారిని, ఆకలి దప్పికలతో మరియు శ్రమ చేసి చిక్కి యున్నవారిని, అతిథులను, అనాథులను, స్వతంత్రముగా ఇంటికి వచ్చిన అభ్యాగతులను, అన్నమును కోరే దీనులను, పిల్లలను, ముసలి వారిని, కృశించి దుఃఖించుచున్న వారిని ఏ మూర్ఖులైతో దయతో పాలించరో, వారు నరకసముద్రములో పడెదరు (35,36).

గృహేష్వర్థా నివర్తంతే స్మశానాదపి బాంధవాః ।
సుకృతం దుష్కృతం చైవ గచ్ఛంతమనుగచ్ఛతి ॥
అజావికో మాహిషికస్సాముద్రో వృషలీపతిః ।
శూద్రవత్ క్షత్రవృత్తిశ్చ నారకీ స్యాద్ ద్విజాధమః ॥
శిల్పినః కారవో వైద్యా హేమకారా నృపధ్వజాః ।
భృతకాః కూటసంయుక్తాస్సర్వే తే నారకాః స్మృతాః ॥
యశ్చోచిత మతిక్రమ్య స్వేచ్ఛయై వాహరేత్కరమ్ ।
నరకే పచ్యతే సోఽపి యోపి దండరుచిర్నరః ॥
ఉత్కోచకై రుచిక్రీతైస్తస్కరైశ్చ ప్రపీడ్యతే ।
యస్య రాజ్ఞః ప్రజా రాష్ట్రే పచ్యతే నరకేషు సః ॥
యే ద్విజాః పరిగృహ్ణంతి నృపస్యాన్యాయవర్తినః ।
తే ప్రయాంతి తు ఘోరేషు నరకేషు న సంశయః ॥
అన్యాయాత్సముపాదాయ ద్విజేభ్యో యః ప్రయచ్ఛతి ।
ప్రజాభ్యః పచ్యతే సోఽపి నరకేషు నృపో యథా ॥
పారదారిక చౌరాణాం చండానాం విద్యతే త్వఘమ్ ।
పరదారరతస్యాపి రాజ్ఞో భవతి నిత్యశః ॥
అచౌరం చౌరవత్పశ్యేచ్చౌరం వాఽచౌర రూపిణమ్ ।
అవిచార్య నృపస్తస్మాద్ఘాతయన్నరకం వ్రజేత్ ॥

వ్యక్తి మరణించినప్పుడు సంపదలు ఇంటి వద్దనే ఆగి పోవును. బంధువులు స్మశానము నుండి వెనుకకు మరలేదరు. పరలోక ప్రయాణములో ఆతడు చేసిన ధర్మాధర్మములు మాత్రమే తోడుగా వచ్చును (37). మేకలను పెంచువాడు, బర్రెలను పాలించువాడు, చేపలు పట్టి జీవించువాడు, శూద్రస్త్రీని వివాహమాడినవాడు, క్షత్రియధర్మమును పాటించువాడు అగు బ్రాహ్మణాధముడు శూద్రునివంటి వాడై నరకమును పొందును (38). మోసమును చేయు శిల్పకారులు, కమ్మరులు, వైద్యులు, కంసాలులు, రాజపురుషులు, నటించువారు, రాజసేవకులు అనే వీరు అందరు నరకమును పొందెదరు (39). ప్రజలను శిక్షించుటయందు అభిరుచి కలిగి ఔచిత్యమును ప్రక్కన బెట్టి యథేచ్ఛగా పన్నులను వసూలు చేయు రాజు కూడ నరకములో మగ్గి పోవును (40). ఏ రాజుయొక్క రాష్ట్రములో ప్రజలు లంచగొండితనము, బంధు ప్రీతి మరియు చోరబాధల వలన పీడించబడుదురో, ఆ రాజు నరకములలో మగ్గును (41). అన్యాయమార్గములోనున్న రాజు యొక్క ధనమును స్వీకరించే బ్రాహ్మణులు నిస్సందేహముగా ఘోరమగు నరకములను పొందెదరు (42). బ్రాహ్మణుల సంపదను అన్యాయముగా అపహరించి దానిని ఇతరులకు పంచి పెట్టు రాజు కూడ నరకములో తపింప చేయబడును (43). పరభార్యారతులకు, చోరులకు, క్రూరులకు మరియు నిత్యము పరస్త్రీలయందు వ్యామోహము గల రాజునకు పాపము చుట్టుకొనును (44). చోరుని మంచివాడుగా తలంచు. రాజు, చోరుడు కాని వానిని చోరుడని తలంచి శిక్షించే రాజు నరకమును పొందును (45).

ఘృతతైలాన్నపానాని మధుమాంస సురాసనమ్ ।
గుడేక్షుకదుగ్ధాని దధిమూలఫలాని చ ॥
తృణం కాష్ఠం పత్రపుష్పమౌషధం చాత్మభోజనమ్ ।
ఉపానచ్చత్ర శకటమాసనం చ కమండలుమ్ ॥
తామ్రసీసత్రపుశ్శస్త్రం శంఖాద్యం చ జలోద్భవమ్ ।
వైద్యం చ వైణవం చాన్యద్గృహోపస్కరణాని చ ॥
ఔర్ణకార్పాస కౌశేయ పట్టసూత్రోద్భవాని చ ।
స్థూలసూక్ష్మణి వస్త్రాణి యే లోభాద్ధి హరంతి చ ॥
ఏవమాదీని చాన్యాని ద్రవ్యాణి వివిధాని చ ।
నరకేషు ధ్రువం యాంతి చాపహృత్యాల్పకాని చ ॥
తద్వా యద్వా పరద్రవ్యమపి సర్షపమాత్రకమ్ ।
అపహృత్య నరా యాంతి నరకం నాత్ర సంశయః ॥
ఏవమాద్యైర్నరః పాపైరుత్క్రాంతి సమనంతరమ్ ।
శరీరయాతనార్థాయ సర్వాకారమవాప్నుయాత్ ॥
యమలోకం వ్రజంత్యేతే శరీరేణ యమాజ్ఞయా ।
యమదూతైర్మహాఘోరైర్నీయమానాస్సు దుఃఖితాః ॥
దేవతిర్యఙ్మనుష్యాణామ ధర్మనిరతాత్మనామ్ ।
ధర్మరాజః స్మృతశ్శాస్తా సుఘోరైర్వి విధైర్విధైః ॥

నియమాచారయుక్తానాం ప్రమాదాత్ స్థలితాత్మనామ్ ।

ప్రాయశ్చిత్తైర్గురుశ్శాస్తా న బుధైరిష్యతే యమః ॥

పారదారికచౌరాణామన్యాయ వ్యవహారిణామ్ ।

నృపతిశ్శాసకః ప్రోక్తః ప్రచ్ఛన్నానాం స ధర్మరాట్ ॥

తస్మాత్కృతస్య పాపస్య ప్రాయశ్చిత్తం సమాచరేత్ ।

నా భుక్తస్యాన్యథా నాశః కల్పకోటీశ తైరపి ॥

యః కరోతి స్వయం కర్మ కారయేచ్చానుమోదయేత్ ।

కాయేన మనసా వాచా తస్య పాపగతిః ఫలమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం పాపభేదవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥

నేయి, నూనె, అన్నము, పానము, తేనె, మాంసము, సారా, కల్లు, బెల్లము, చెరుకు, కూ◌ారలు, పాలు, పెరుగు, దుంపలు, పళ్లు (46), గడ్డి, కట్టెలు, ఆకులు, పుష్పములు, మందు, స్త్రీయభోజనము, చెప్పులు, గొడుగు, బండి, ఆసనము, కమండలము (47), రాగి, సీసము, తగరము, ఆయుధము, నీటిలో పుట్టే శంఖము మొదలైన వస్తువులు, మందు కషాయములు, వెదురు, ఇతరములగు ఇంటి పనిముట్లు (48), ప్రత్తి, సిల్కు మరియు పట్టులతో నేసిన ముతక మరియు నాజూకు వస్త్రములు అను పదార్థములను ఎవరైతే లోభముచే అపహరించెదరో (49), ఎవరైతే ఇటువంటి వివిధద్రవ్యములను అల్పపరిమాణములో నైననూ అపహరించెదరో, వారు నరకములను పొందుట నిశ్చయము (50). పరద్రవ్యమేదైననూ ఆవగింజంత కూడ అపహరించిన మానవులు నరకమును పొందెదరు. దీనిలో సందేహము లేదు (51). ఇటువంటి పాపములను చేసిన మానవుడు మరణించిన పిదప యాతనలను అనుభవించుట కొరకే అనేకదేహములను ధరించును (52). వీరు ఒక శరీరమును దాల్చి మహాభయంకరులగు యమదూతలు యముని ఆజ్ఞచే గొనిపోవుచుండగా మహా దుఃఖమును పొందుచూ యమలోకమునకు వెళ్లెదరు (53). అధర్మమునందు లగ్నమైన అంతఃకరణములు గల దేవతలు, పశుపక్ష్యాదులు మరియు మానవులు అను ప్రాణులను యమధర్మరాజు మిక్కిలి ఘోరమైన వివిధములగు యాతనలకు గురి చేసి శిక్షించునని చెప్పబడినది (54). నిత్యము ఆచారమును పాటించుచూ పొరపాటునే తప్పును ఒనరించిన వారికి గురువు ప్రాయశ్చిత్తమును చేయించిన సర్పడును. వారిని యముడు శిక్షించడని పండితులు చెప్పినారు (55). పరభార్యాగతులను, చోరులను, అన్యాయముతో కూడిన వ్యవహారము గలవారిని శిక్షించును. వారు తప్పు బయట పడకుండగా దాచినచో, వారిని యముడు శిక్షించును (56). కావున, చేసిన పాపమును ప్రాయశ్చిత్తముచే తొలగించుకొనవలెను. ఫలమును అనుభవించకుండగా చేసిన పాపము కోటి కల్పములు గడచినా నశించదు (57). ఎవడైతే తాను స్వయముగా తప్పు పనిని శరీరముచే గాని వాక్కుతో గాని లేదా మనస్సుతో గానీ చేయునో, లేదా చేయించునో, మరియు ప్రోత్సహించునో, వానికి నరకమనే ఫలము లభించును (58).

7 – నరకలోక మార్గ వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

అథ పాపైర్నరా యాంతి యమలోకం చతుర్విధైః।
సంత్రాస జననం ఘోరం వివశాస్సర్వదేహినః ॥
గర్భస్థైర్జాయమానైశ్చ బాలైస్తరుణమధ్యమైః ।
స్త్రీ పున్నపుంసకైర్జీవైర్ జ్ఞాతవ్యం సర్వజంతుషు ॥
శుభాశుభఫలం చాత్ర దేహినాం సంవిచార్యతే ।
చిత్రగుప్తాది భిస్సర్వైర్వసిష్ఠ ప్రముఖైస్తథా ॥
న కేచిత్ప్రాణినస్సంతి యే న యాంతి యమక్షయమ్ ।
అవశ్యం హి కృతం కర్మ భోక్తవ్యం తద్విచార్యతామ్ ॥
తత్ర యే శుభకర్మాణ స్సౌమ్యచిత్తా దయాన్వితాః ।
తే నరా యాంతి సౌమ్యేన పూర్వం యమనికేతనమ్ ॥
యే పునః పాపకర్మాణః పాపా దానవివర్జితాః ।
తే ఘోరేణ పథా యాంతి దక్షిణేన యమాలయమ్ ॥
షడశీతి సహస్రాణి యోజనానామతీత్య యత్ ।
వైవస్వతపురం జ్ఞేయం నానారూపమవస్థితమ్ ॥
సమీపస్థమివాభాతి నరాణాం పుణ్యకర్మణామ్ ।
పాపినామతిదూరస్థం పథా రౌద్రేణ గచ్ఛతామ్ ॥
తీక్ష్ణ కంటకయుక్తేన శర్కరావిచితేన చ ।
క్షురధారానిభైస్తీక్ష్ణైః పాషాణై రచితేన చ ॥
క్వచితంకేన మహతా ఉరుతోకైశ్చ పాతకైః ।
లోహసూచీనిభైర్దర్భైస్సంపన్నేన పథా క్వచిత్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

సర్వమానవులు మరియు ఇతరప్రాణులు నాలుగు రకముల పాపముల ప్రభావముచే నిస్సహాయులై భయమును గొల్పు ఘోరమగు నరకమును పొందెదరు (1). అన్ని రకముల ప్రాణులలో గర్భమునందున్న వారు, అప్పుడే పుట్టిన వారు, బాల్యమునందున్నవారు, యౌవనమును పొందినవారు, మధ్యవయస్కులు, స్త్రీలు, పురుషులు, నపుంసకులు అగు జీవులకు నరకము విదితమే (2). అచట వసిష్ఠుడు, చిత్రగుప్తుడు మొదలగు వారు అందరు ప్రాణుల పుణ్యపాపకర్మల ఫలములను చక్కగా పరిశీలించెదరు (3). యమలోకమునకు వెళ్లని ప్రాణులు ఎవ్వరూ లేరు. జీవులు తాము చేసిన కర్మల ఫలములను నిశ్చయముగా అనుభవించ వలయును. మనమీ విషయమును గమనించవలేదు (4). పవిత్రమగు అంతఃకరణము, దయాహృదయము గలవారే శుభకర్మలను చేయు మానవులు యముని నగరములోనికి సౌమ్యముగానుండే తూర్పు ద్వారము గుండా ప్రవేశించెదరు (5), పాపవిచారము గలవారై దానమును విడిచిపెట్టి పాపకర్మలను

చేయువారు యమనగరములోనికి భయంకరమగు దక్షిణమార్గము గుండా ప్రవేశించెదరు (6), అనేకరూపములు గల యముని నగరము ఎనుబది ఆరు యోజనముల దూరమును దాటి ఉన్నదని తెలియవలెను (7). పుణ్యమును చేసుకున్న మానవులకు చాల దగ్గరగా నున్నట్లు, భయంకరమగు దారిలో పయనించు పాపాత్ములకు చాల దూరములో నున్నట్లు ఆ నగరము కన్పట్టును (8). పాపులు పయనించే మార్గము వాడి ముళ్లతో, చిన్న చిన్న రాళ్లతో నిండి, మరియు కత్తుల వలే వాడియైన పెద్ద రాళ్లతో నిర్మించబడి యుండును (9). కొన్ని చోట్ల విస్తారమైన బురద ఉండును. మరి కొన్ని చోట్ల చిన్న మరియు పెద్దయగు దర్భలు ఇనుప సూదులవలె వాడిగా నుండి దారిలో నడచువారల పాదములకు పీడను కలిగించును (10).

తటప్రాయాతివిషమైః పర్వతైర్వృక్ష సంకులైః ।

ప్రతప్తాంగారయుక్తేన యాంతి మార్గేణ దుఃఖితాః ॥

క్వచిద్విషమగర్తైశ్చ క్వచిల్లోష్టైస్సుదుష్కరైః ।

సుతప్తవాలుకాభిశ్చ తథా తీక్ష్ణైశ్చ శంకుభిః ॥

అనేకశాఖావిత తైర్వ్యాప్తం వంశవనైః క్వచిత్ ।

కష్టేన తమసా మార్గే నానాలంబేన కుత్రచిత్ ॥

అయశ్శృంగాటకైస్తీక్ష్ణైః క్వచిద్దావాగ్నినా పునః ।

క్వచిత్తప్త శిలాభిశ్చ క్వచిద్వ్యాప్తం హిమేన చ ॥

క్వచిద్వాలుకయా వ్యాప్తమాకంఠాంతః ప్రవేశయా ।

క్వచిద్దుష్టాంబునా వ్యాప్తం క్వచిచ్చ కరిషాగ్నినా ॥

క్వచిత్సింహైర్వృకైర్వ్యాఘ్రై ర్మశకైశ్చ సుదారుణైః ।

క్వచిన్మహాజలౌకాభిః క్వచిచ్చాజగరైస్తథా ॥

మక్షికాభిశ్చ రౌద్రాభిః క్వచిత్సర్పైర్విషోల్బణైః ।

మత్తమాతంగయూథైశ్చ బలోన్మత్తైః ప్రమాథిభిః ॥

పంథానముల్లిఖద్భిశ్చ సూకరైస్తీక్ష్ణదంష్ట్రిభిః ।

తీక్ష్ణశృంగైశ్చ మహిషైస్సర్వభూతైశ్చ శ్వాపదైః ॥

డాకినీభిశ్చ రౌద్రాభిర్వి కరాలైశ్చ రాక్షసైః ।

వ్యాధిభిశ్చ మహా ఘోరైః పీడ్యమానా వ్రజంతి హి ॥

మహాధూలి విమిశ్రేణ మహాచండేన వాయునా ।

మహాపాషాణ వర్షేణ హన్యమానా నిరాశ్రయాః ॥

మిక్కిలి ఎత్తుగా నుండి దాటుటలో అధికక్లేశమును కలిగించే గట్టులవంటి పర్వతములు చెట్లతో దట్టముగా నిండి ఆ మార్గములో నుండును. కణ కణ కాలుచున్న నిప్పులతో కూడియున్న ఆ మార్గములో పాపులు దుఃఖిస్తూ పయనించెదరు (11). కొన్ని చోట్ల దాటుటలో క్లేశమును కలిగించే గోతులు గలవు. కొన్ని చోట్ల మిక్కిలి పీడను కలిగించే బెడ్డలు ఉండును. కొన్ని చోట్ల మండే ఇసుక గలదు. మరికొన్ని చోట్ల వాడి మేకులు గలవు (12), ఆ మార్గములో కొన్ని చోట్ల

వివిధశాఖలతో వ్యాపించి యుండే వెదురు డొంకలు గలవు. కష్టమును కలిగించే ఆ మార్గము చీకటితో నిండి పట్టుకొనుటకు ఆశ్రయము లేనిదై ఉండును (13). కూడలి స్థలములు వాడి ఇనుప మేకులతో నిండి యుండును. దారిలో కొన్ని చోట్ల దావాగ్ని ఉండును. కొన్ని చోట్ల కాలే రాళ్లు ఉండగా, మరి కొన్ని చోట్ల మంచు నిండి యుండును (14). కొన్ని చోట్ల నడిచే వ్యక్తి కంఠము వరకు దిగబడి పోయే విధముగా ఇసుక ఉండును. కొన్ని చోట్ల బురద నీరు నిండియుండగా, మరి కొన్ని చోట్ల కాలుచున్న పిడకలు ఉండును (15). అక్కడక్కడ సింహములు, తోడేళ్లు, పెద్దపులులు, మిక్కిలి పీడను, కలిగించే దోమలు, పెద్ద జలగలు మరియు కొండ చిలువలు ఉండును (16). భయమును గొల్పు ఈగలు, అత్యంతతీవ్రమగు విషమును కలిగియున్న పాములు, బలముచే మదించి సర్వమును పాదములతో తొక్కి నాశనము చేసే ఏనుగుల గుంపులు (17), వాడి కోరలతో నేలను చీల్చుచున్న పందులు, వాడి కొమ్ములు గల దున్నలు, మరియు అన్ని రకములు క్రూరమృగములు (18), భయమును గొల్పు డాకినీ పిశాచములు, మిక్కిలి క్రూరులగు రాక్షసులు ఉండే ఆ దారిలో జీవులు మిక్కిలి ఘోరమైన రోగములచే బాధపడుతూ పయనించేదరు (19). ఆశ్రయము లేని ఆ జీవులు దట్టమైన ధూళితో నిండియున్న పెనుగాలులు కురిపించే రాళ్ల వర్షముచే కొట్టబడుచుందురు (20).

క్వచిద్విద్యు త్ప్రపాతేన దహ్యమానా వ్రజంతి చ ।
మహతా బాణవర్షేణ విధ్యమానాశ్చ సర్వతః ॥
పతద్భిర్వజ్రపాతైశ్చ ఉల్కాపాతైశ్చ దారుణైః ।
ప్రదీప్తాంగారవర్షేణ దహ్యమానాశ్చ సంతి హి ॥
మహతా పాంసువర్షేణ పూర్యమాణా రుదంతి చ ।
మహామేఘవరైర్ఘోరైస్త్రస్యంతే చ ముహుర్ముహుః ॥
నిశితాయుధవర్షేణ భిద్యమానాశ్చ సర్వతః ।
మహాక్షారాంబుధారాభిస్సిచ్యమానా వ్రజంతి చ ॥
మహాశీతేన మరుతా రూక్షేణ పరుషేణ చ ।
సమంతా ద్బాధ్యమానాశ్చ శుష్యంతే సంకుచంతి చ ॥
ఇత్థం మార్గేణ రౌద్రేణ పాథేయరహితేన చ ।
నిరాలంబేన దుర్గేణ నిర్జలేన సమంతతః ॥
విషమేణైవ మహతా నిర్జనాపాశ్రయేణ చ ।
తమోరూపేణ కష్టేన సర్వదుష్టాశ్రయేణ చ ॥
నీయంతే దేహినస్సర్వే యే మూఢాః పాపకర్మిణః ।
యమదూతైర్మహాఘోరైస్తదా జ్ఞాకారిభిర్బలాత్ ॥
ఏకాకినః పరాధీనా మిత్రబంధు వివర్జితాః ।
శోచంతస్స్వాని కర్మాణి రుదంతశ్చ ముహుర్ముహుః ॥
ప్రేతా భూత్వా వివస్త్రాశ్చ శుష్కకంఠోష్ఠ తాలుకాః ।
అసౌమ్యా భయభీతాశ్చ దహ్యమానాః క్షుధాన్వితాః ॥

వారు అక్కడక్కడ మెరుపులచే కాల్చబడుచున్నవారై ముందుకు సాగెదరు. వారిని పెద్ద బాణవర్షము అన్ని వైపులనుండియు ముంచెత్తును (21). వారిపై దారుణమైన పిడుగులు, ఉల్కలు పడుచుండును. వారు వెళ్లుచుండగా, కాలే నిప్పులు వారిపై వర్షించును (22). దట్టమైన ధూళి వర్షించి కప్పివేయుటచే వారు దుఃఖించెదరు.. ఘోరములగు పెద్ద మేఘములు వారిని తరుచుగా భయపెట్టుచుండును (23). అన్ని వైపులనుండియు వాడి ఆయుధములు వర్షించి వారి దేహములు కోసివేయబడును. క్షరజలముల పెద్ద ధారలు వారిపై కురియుచుండగా, వారు పూర్తిగా ఆ జలములో తడిసి వెళ్లుచుందురు (24). మిక్కిలి చల్లనిది, శరీరమును కోసివేయునదీ అగు వాయువు వేగముగా వీచుచుండగా, వారు కుంచించుకొని పోయెదరు. వారి దేహములు ఎండిపోవును (25). ఈ విధముగా భయంకరమైనది, మధ్యలో ఆహారవ్యవస్థ లేనిది, నిలువ నీడ లేనిది, దాట శక్యము కానిది, ఎచ్చటనైననూ త్రాగే నీరు లేనిది, మిక్కిలి ఎగుడు దిగుడులు గలది, జనసంచారము లేనిది, చీకటితో నిండినది, క్లేశమును కలిగించునది, దుష్టులందరికీ. ఆశ్రయమైనది అగు మార్గము గుండా (26, 27), పాపములను చేసిన మూర్ఖజీవులనందరినీ యముని ఆజ్ఞను పాటించే మహాభయంకరులగు యమదూతలు బలాత్కారముగా గొనిపోవుచుందురు (28). ఏకాకులు, అస్వతంత్రులు, మిత్రులు గాని బంధువులు గాని తోడు లేనివారు, తాము చేసిన పాపములను స్మరించి పలుమార్లు దుఃఖించువారు అగు జీవులు (29) చూచుటకు రోత పుట్టించే ప్రేతములై, వస్త్రములు లేకుండగా, కంఠము నాలుక పెదవులు ఎండిపోవుచుండగా, ఆకలితో కడుపు మండి పోవుచుండగా, మిక్కిలి భయమును పొంది పయనించెదరు (30).

బద్ధాశ్శృంఖలయా కేచిదుత్తానపాదకా నరాః ।
కృష్యంతే కృష్యమాణాశ్చ యమదూతైర్బలోత్కటైః ॥
ఉరసాధో ముఖాశ్చాన్యే ఘృష్యమాణాస్సుదుఃఖితాః ।
కేశపాశనిబంధేన సంస్కృష్యంతే చ రజ్జునా ॥
లలాటే చాంకుశేనాన్యే భిన్నా దుష్యంతి దేహినః ।
ఉత్తానాః కంటకపథా క్వచిదంగా రవర్త్మనా ॥
పశ్చాద్బాహు నిబద్ధాశ్చ జఠరేణ ప్రపీడితాః ।
పూరితాశ్శృంఖలాభిశ్చ హస్తయోశ్చ సుకీలితాః ॥
గ్రీవాపాశేన కృష్యంతే ప్రయాంత్యన్యే సుదుఃఖితాః ।
జిహ్వాంకుశ ప్రవేశేన రజ్జ్వాకృష్యంతేఽన్యే ఏవ తే ॥
నాసా భేదేన రజ్జ్వా చ త్వాకృశ్యంతే తథాపరే ।
భిన్నాః కపోలయో రజ్జ్వాకృష్యంతేఽన్యే తథౌష్ఠయోః ॥
ఛిన్నా గ్రపాదహస్తాశ్చ ఛ్ఛిన్నకర్ణోష్ఠ నాసికాః ।
సంఛన్నశిశ్నవృషణాః ఛిన్నభిన్నాంగ సంధయః ॥
ఆభిద్యమానాః కుంతైశ్చ భిద్యమానాశ్చ సాయకైః ।
ఇతశ్చేతశ్చ ధావంతః క్రందమానా నిరాశ్రయాః ॥

ముద్గరైర్లోహదండైశ్చ హన్యమానా ముహుర్ముహుః ।

కంటకైర్వివిధైర్ఘోరైర్జ్వలనార్కసమ ప్రభైః ॥

భిందిపాలైర్వి భిద్యంతే స్రవంతః పూయశోణితమ్ ।

శకృతా కృమిదిగ్ధాశ్చ నీయంతే వివశా నరాః ॥

బలముతో మదించియున్న యమదూతలు కొందరిని కాళ్లను పైకి కట్టి గొలుసుతో బర బర ఈడ్చుచుండిరి (31). వారు కొందరి ముఖమును వక్షఃస్థలము పైకి నొక్కి పెట్టి జుట్టును త్రాటితో కట్టి లాగుచుండగా ఆ జీవులు మహాదుఃఖమును అనుభవించుచుండిరి (32). కొందరు ప్రాణులను వెల్లకిలా పరుండబెట్టి లలాటముపై అంకుశమును గ్రుచ్చి, అక్కడక్కడ ముళ్లతో మరియు నిప్పులతో కూడియున్న మార్గము గుండా తీసుకుని వెళ్లుచుండగా, వారు కష్టపడుచుండిరి (33). కొందరి చేతులను వెనుకకు విరచి కట్టి పొట్టలో కొట్టుచుండిరి. కొందరిని దేహము అంతటా గొలుసులతో కట్టి చేతులలో మేకులను దింపిరి (34). కొందరి మెడకు త్రాటిని కట్టి లాగుచుండగా, వారు మహాదుఃఖముతో ముందుకు సాగుచుండిరి. కొందరి నాలుకపై అంకుశమును దింపి త్రాటితో వారిని లాగుచుండిరి (35), మరి కొందరి ముక్కునకు త్రాడు వేసి దానితో లాగుచుండిరి. కొందరికి చెక్కిళ్లకు, మరికొందరి పెదవులకు త్రాళ్లను వేసి లాగుచుండిరి (36). వారి చేతులు మరియు కాళ్లయొక్క అగ్రములు, చెవులు, పెదవులు, ముక్కులు, శిశ్నములు, అండములు కోసివేయబడెను. కొందరి అవయవములు మరియు కీళ్లు విరుగ గొట్టబడెను (37). శూలములతో మరియు బాణములతో కొట్టబడినవారై వారు దిక్కు తోచక ఏడుస్తూ ఇటునటు పరుగులెత్తు చుండిరి (38). వారు రోకళ్లతో మరియు ఇనుపకర్రలతో కొట్టబడిరి. అగ్నితో మరియు సూర్యునితో సమానమగు వేడి గల భయంకరమైన అనేకరకముల ముళ్లతో వారు గుచ్చబడుచుండిరి (39). బల్లెములచే పొడువ బడినవారై ఆ మానవులు రక్తము కారుచుండగా, క్రిములతో నిండిన మలమును విసర్జిస్తూ వాటిచే కలుషితులై నిస్సహాయులై లాగబడుచుండిరి (40).

యాచమానాశ్చ సలిలమన్నం వాపి బుభుక్షితాః ।

ఛాయాం ప్రార్థయమానాశ్చ శీతార్తాశ్చానలం పునః ॥

దానహీనాః ప్రయాంత్యేవం ప్రార్థయంతస్సుఖం నరాః ।

గృహీతదానపాథేయాస్సుఖం యాంతి యమాలయమ్ ॥

ఏవం న్యాయేన కష్టేన ప్రాప్తాః ప్రేతపురం యదా ।

ప్రజ్ఞాపితాస్తతో దూతైర్నివేశ్యంతే యమాగ్రతః ॥

తత్ర యే శుభకర్మాణస్తాంస్తు సమ్మానయేద్యమః ।

స్వాగతాసనదానేన పాద్యార్ఘ్యేణ ప్రియేణ చ ॥

ధన్యా యూయం మహాత్మానో నిగమోదిత కారిణః ।

యైశ్చ దివ్యసుఖార్థాయ భవద్భిస్సుకృతం కృతమ్ ॥

దివ్యం విమానమారుహ్య దివ్యస్త్రీ భోగభూషితమ్ ।

స్వర్గం గచ్ఛధ్వమమలం సర్వకామ సమన్వితమ్ ॥

తత్ర భుక్త్వా మహాభోగానంతే పుణ్యస్య సంక్షయాత్ ।
యత్కించిదల్పమశుభం పునస్తదిహ భోక్ష్యథ ॥
ధర్మాత్మానో నరా యే చ మిత్రభూతా ఇవాత్మనః ।
సౌమ్యం సుఖం ప్రపశ్యంతి ధర్మరాజానమేవ చ ॥
యే పునః క్రూరకర్మాణస్తే పశ్యంతి భయానకమ్ ।
దంష్ట్రాకరాలవదనం భ్రుకుటీకుటిలే క్షణమ్ ॥
ఊర్ధ్వకేశం మహాశ్మశ్రుమూర్ధ్వప్రస్ఫురితా ధరమ్ ।
అష్టాదశభుజం క్రుద్ధం నీలాంజన చయోపమమ్ ॥

వారు ఆకలి గొన్నవారై అన్నమును మరియు నీటిని ఇండనియు, ఎండకు తాళలేక నీడను, చలిని భరించలేక అగ్నిని కల్పించుడని ప్రార్థించుచుండిరి (41). దానమును చేయని మానవులు ఈ విధముగా సుఖమును కలిగించుడని యాచిస్తూ పయనించెదరు. కానీ, దానము చేసి పుణ్యము సంపాదించుకున్నవారికి ఆ పుణ్యము యమనగరమునకు వెళ్లే మార్గమధ్యములో ఆహారమువలె సుఖమునిచ్చును (42), ఈ విధముగా చేసుకున్న కర్మకు అనురూపమైన కష్టముననుభవిస్తూ వారు యమనగరమునకు చేరగానే, వెంటనే దూతలు యమునికి విన్నవించి ఆయన యెదుట వీరిని నిలబెట్టెదరు (43). వారిలో పుణ్యకార్యములను చేసిన వారిని యముడు స్వాగతము పలికి ఆసనముపై కూర్చుండబెట్టి, అభీష్టమగు పాద్యమును మరియు అర్ఘ్యమును ఇచ్చును (44). వేదము చెప్పిన విధముగా చేసిన మీరు ధన్యులు మరియు మహాత్ములు. మీరు దేవలోక సుఖములను గోరి పుణ్యకర్మలను చేసియుంటిరి (45). మీరు దివ్యమగు విమానమును ఎక్కి, దివ్యస్త్రీల విలాసములతో భూషితమై కోర్కెలనన్నింటినీ ఈడేర్చే పాపసంపర్కము లేని స్వర్గమునకు వెళ్లుడు (46). అచట గొప్ప భోగముల ననుభవించి అంతములో పుణ్యము ఖర్చు కాగానే మిగిలియున్న కొద్ది పాపమును మరల ఇచట అనుభవించెదరు అని వారికి యముడు చెప్పును (47). ధర్మాత్ములగు మానవులను యముడు తన మిత్రులవలె ఆదరించును. వారు యమధర్మరాజుయొక్క సౌమ్యమగు రూపమును సుఖముగా దర్శించెదరు (48). కానీ క్రూరమగు కర్మలనాచరించువారు భయంకరుడు, కోరలతో వికృతమైన నోరు గలవాడు, కనుబొమ ముడివడుచుండగా క్రూరముగా చూచువాడు, పైకి విస్తరించి వణుకుచున్న క్రింది పెదవి గలవాడు, పదునెనిమిది చేతులు గలవాడు, కోపించి యున్నవాడు, కాటుక కొండను పోలియున్న వాడు అగు యముని చూచెదరు (49,50).

సర్వాయుధోద్ధృతకరం సర్వదండేన తర్జయన్ ।
మహామహిష మారూఢం దీప్తాగ్ని సమలోచనమ్ ॥
రక్తమాల్యాంబరధరం మహామేరుమివోచ్ఛ్రితమ్ ।
ప్రలయాంబుద నిర్ఘోషం పిబన్నివ మహోదధిమ్ ॥
గ్రసంతమివ శైలేంద్రముద్గిరంత మివానలమ్ ।
మృత్యుశ్చైవ సమీపస్థః కాలానల సమప్రభః ॥

కాలశ్చాంజన సంకాశః కృతాంతశ్చ భయానకః ।

మారీచో గ్రమహామారీ కాలరాత్రిశ్చ దారుణా ॥

వివిధ వ్యాధయః కుష్ఠా నానారూపా భయావహాః ।

శక్తిశూలాం కుశధరాః పాశచక్రాసిపాణయః ॥

వక్రతుండధరా రుద్రా క్షురతూణ ధనుర్ధరాః ।

నానాయుధ ధరాస్సర్వే మహావీరా భయంకరాః ॥

అసంఖ్యాతా మహావీరాః కాలాంజన సమప్రభాః ।

సర్వాయుధో ద్యతకరా యమదూతా భయానకాః ॥

అనేన పరిచారేణ వృతం తం ఘోరదర్శనమ్ ।

యమం పశ్యంతి పాపిష్ఠాశ్చిత్రగుప్తం చ భీషణమ్ ॥

నిర్భర్త్సయతి చాత్యంతం యమస్తాన్ పాపకర్మణః ।

చిత్రగుప్తశ్చ భగవాన్ ధర్మవాక్యైః ప్రబోధయేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నరకలోకమార్గ వర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥

యముడు పైకి ఎత్తిన తన చేతులతో ఆయుధముల నన్నింటినీ ధరించి సర్వులను దండముచే భయపెట్టును. గొప్ప దున్నను అధిష్ఠించి యున్న యముని నేత్రములు మండే నిప్పులను పోలియుండును (51). ఎర్రని మాలను మరియు వస్త్రములను ధరించు ఆయన గొప్పది యగు మేరు పర్వతమువలె నుండును. ఆయన మహాసముద్రమును త్రాగివేయునా యన్నట్లు కానవచ్చును. ఆయన మాటలు ప్రలయకాలమేఘముయొక్క గర్జనను పోలియుండును (52). ఆయన పర్వతములను మ్రింగువానివలే, నిప్పులను గ్రక్కువానివలె కన్పట్టును. ప్రలయకాలాగ్నిని పోలిన కాంతి గల మృత్యుదేవత ఆయనకు సమీపములోననే యుండును (53). సర్వమును నశింపజేయు ఆ మృత్యువు కాటుక వలె నల్లని వర్ణము గలవాడై భయమును గొల్పుచుండును. మారి, ఉగ్రమహామారి, భయంకరమగు కాళరాత్రి యముని కొల్చెదరు (54). అనేకరకములగు వ్యాధులు, భయమును గొల్పే నానారూపములగు కుష్టువ్యాధులు అక్కడ రూపు దాల్చి యుండును. వారు శక్తి, శూలము, అంకుశము, పాశము, చక్రము, కత్తి అనే ఆయుధములను చేతులలో ధరించి యుందురు (55). భయంకరులగు ఆ యమానుచరులు వజ్రము వలె పదునైన నోళ్లను కలిగియుందురు. ఛురిక, అంబుల పొది, ధనస్సు మొదలైన అనేకములగు ఆయుధములను, మహావీరులగు ఆ అనుచరులు ధరించి భయమును గొల్పుచుందురు (56). లెక్కలేనంత మంది మహావీరులైన యమదూతలు కాటుకతో సమమైన నల్లని వర్ణము గలవారై ఆయుధముల నన్నింటినీ చేతులలో ఎత్తి పట్టుకొని భయమును కలిగించుచుందురు (57). ఈ విధమగు పరిచారకులతో గూడి భయంకరముగా కన్పట్టే యముని మరియు భయంకరాకారుడగు చిత్రగుప్తుని పాపాత్ములు దర్శించెదరు (58). ఆ పాపాత్ములను యముడు అధికముగా కోపించి భయపెట్టును. చిత్రగుప్తభగవానుడు ధర్మబద్ధములగు వాక్యములతో వారికి బోధించును (59).

8 – నరకలోక వర్ణనము

చిత్రగుప్త ఉవాచ ।

భో భో దుష్కృతకర్మాణః పరద్రవ్యాప హారకాః ।
గర్వితా రూపవీర్యేణ పీడ్యమానాస్స్వకర్మభిః ॥
యస్స్వయం క్రియతే కర్మ తదిదం భుజ్యతే పునః ।
తత్కిమాత్మోపఘాతార్థం భవద్భిర్దుష్కృతం కృతమ్ ॥
ఇదానీం కిం ప్రలప్యధ్వే పీడ్యమానాస్స్వ కర్మభిః ।
భుజ్యంతాం స్వాని కర్మాణి నాస్తి దోషో హి కస్యచిత్ ॥

చిత్రగుప్తుడు ఇట్లు పలికెను –

ఓ మానవులారా ! మీరు పరద్రవ్యమును అపహరించి, సౌందర్యమును మరియు పరా◌ాక్రమమును చూసుకొని గర్వించి పాపకర్మలను చేసినారు. మీరు చేసుకున్న కర్మల ఫలరూపములో ఇప్పుడు దుఃఖముల ననుభవించుచున్నారు (1). మానవుడు చేసిన కర్మకు అనురూపముగా ఫలముననుభవించును. మీరు ఆత్మవినాశకరమగు పాపకర్మలను ఏల చేసినారు ? (2) చేసుకున్న కర్మలచే దుఃఖమును అనుభవించే మీరు ఇప్పుడు ఏడ్చి లాభము ఏమి గలదు? మీ మీ కర్మల ఫలమును అనుభవించుడు. దీనిలో ఇతరులు దోషము లేశమైననూ లేదు (3).

సనత్కుమార ఉవాచ ।

ఏవం తే పృథివీపాలాస్సం ప్రాప్తాస్తత్సమీపతః ।
స్వకీయైః కర్మభిర్ఘోరైర్దుష్కర్మ బలదర్పణః ॥
తానపి క్రోధసంయుక్తశ్చిత్రగుప్తో మహాప్రభుః ।
సంశిక్షయతి ధర్మజ్ఞో యమరాజానుశిక్షయా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఈ విధముగా బలగర్వితులై పాపకర్మలను చేసియున్న రాజులు తమ క్రూరకర్మల ప్రభావముచే◌ే ఆ చిత్రగుప్తుని వద్దకు వచ్చిరి. (4). ధర్మవేత్త యగు చిత్రగుప్తమహాప్రభుడు కోపముతో నిండిన వాడై యమరాజుయొక్క ఆదేశముననుసరించి వారిని కూడ చక్కగా శిక్షించును (5).

చిత్రగుప్త ఉవాచ ।

భో భో నృపా దురాచారాః ప్రజావిధ్వంసకారిణః ।
అల్పకాలస్య రాజ్యస్య కృతే కిం దుష్కృతం కృతమ్ ॥
రాజ్య భోగేన మోహేన బలాదన్యాయతః ప్రజాః ।
యద్దండితాః ఫలం తస్య భుజ్యతామధునా నృపాః ॥
క్వ తద్రాజ్యం కలత్రం చ యదర్థమ శుభం కృతమ్ ।
తత్సర్వం సంపరిత్యజ్య యూయమేకాకినః స్థితాః ॥

పశ్యామి తద్బలం నష్టం యేన విధ్వంసితాః ప్రజాః ।

యమదూతైర్యోజ్యమానా అధునా కీదృశం భవేత్ ॥

చిత్రగుప్తుడు ఇట్లు పలికెను –

ఓ రాజులారా ! మీరు అల్పకాలము మాత్రమే నిలిచి ఉండే రాజ్యాధికారము కొరకై పాపకర్మలనాచరించి ప్రజలకు గొప్ప వినాశమును తెచ్చి పెట్టినారు. అట్లు పాపమును చేయుటకు కారణమేమి ? (6) ఓ రాజులారా ! రాజ్య భోగములయందలి మోహముచే ప్రజలపై అన్యాయముగా బలమును ప్రయోగించి శిక్షించిన దానికి ఫలమును ఇప్పుడు మీరు అనుభవించెదరు గాక ! (7) వేటి కొరకైతే పాపకర్మలను చేసినారో, ఆ రాజ్యము మరియు భార్యాపుత్రాదులు ఏరి? వాటిని అన్నింటినీ విడిచిపెట్టి మీరు ఏకాకులుగా నిలబడి యున్నారు (8). ఏ బలముతో మీరు ప్రజలను నాశనమొనర్చినారో, ఆ బలము నశించుటను నేను చూచుచున్నాను. ఇప్పుడు మిమ్ములను యమదూతలు కష్టములకు గురిచేయునప్పుడు ఎట్లు ఉండునో ?(9)

సనత్కుమార ఉవాచ ।

ఏవం బహువిధైర్వాక్యైరుపలబ్ధా యమేన తే ।

స్వాని కర్మాణి శోచంతి తూష్ణీం తిష్ఠంతి పార్థివాః ॥

ఇతి కర్మ సముద్దిశ్య నృపాణాం ధర్మరాడ్యమః ।

తత్పాపపంకశుద్ధ్యర్థమిదం దూతాన్ బ్రవీతి చ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఈ విధముగా యమునిచే పలు వచనములతో నిందించ బడిన ఆ రాజులు మాటలాడకుండగా తాము చేసిన పాపకర్మలను తలచి దుఃఖించెదరు (10). యమధర్మరాజు ఆ రాజుల పాపమనే బురదను కడిగి వేయుట కొరకై కర్మఫలమును నిర్దేశిస్తూ దూతలతో నిట్లనును (11).

యమరాజ ఉవాచ ।

భో భోశ్చండ మహాచండ గృహీత్వా నృపతీన్ బలాత్ ।

నియమేన విశుద్ధ్యధ్వం క్రమేణ నరకాగ్నిషు ॥

యమధర్మరాజు ఇట్లు పలికెను –

ఓయీ ! చండా ! మహాచండా! ఈ రాజులను బలపూర్వకముగా తీసుకొని పోయి నరకములోని అగ్నులయందు వరుసగా నియమముతో శుద్ధిని చేయుడు (12).

సనత్కుమార ఉవాచ ।

తతశ్శీఘ్రం సమాదాయ నృపాన్ సంగృహ్య పాదయోః ।
భ్రామయిత్వా తు వేగేన నిక్షిప్యోర్ధ్వం ప్రగృహ్య చ ॥
సర్వప్రాయేణ మహతా తీవ తప్తే శిలాతలే ।
ఆస్ఫాలయంతి తరసా వజ్రేణేవ మహాద్రుమాన్ ॥
తతస్స రక్తం శ్రోత్రేణ స్రవతే జర్జరీకృతః ।
నిస్సంజ్ఞస్స సదా దేహీ నిశ్చేష్టస్సంప్ర జాయతే ॥
తతస్స వాయునా స్పృష్టస్స తైరుజ్జీవితః పునః।
తతః పాపవిశుద్ధ్యర్థం క్షిపంతి నరకార్ణవే ॥
అష్టావింశతి సంఖ్యాభిః క్షిత్య ధస్సప్తకోటయః ।
సప్తమస్య తలస్యాంతే ఘోరే తమసి సంస్థితః ॥
ఘోరాఖ్యా ప్రథమా కోటీస్సు ఘోరా తదధః స్థితా ।
అతిఘోరా మహా ఘోరాఘోరరూపా చ పంచమీ ॥
షష్ఠీ తలాతలాఖ్యా చ సప్తమీ చ భయానకా ।
అష్టమీ కాలరాత్రిశ్చ నవమీ చ భయోత్కటా ॥
దశమీ తదధశ్చండా మహాచండా తతోఽప్యధః ।
చండకోలాహలా చాన్యా ప్రచండా చండనాయికా ॥
పద్మా పద్మావతీ భీతా భీమా భీషణనాయికా ।
కరాలా వికరాలా చ వజ్రా వింశతిమా స్మృతా ॥
త్రికోణా పంచకోణా చ సుదీర్ఘా చాఖిలార్తిదా ।
సమా భీమబలాభోగ్రా దీప్తప్రాయేతి చాంతిమీ ॥
ఇతి తే నామతః ప్రోక్తా ఘోరా నరక కోటయః।
అష్టావింశతిరేవైతాః పాపానాం యాతనాత్మికాః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

అపుడు వారు వెంటనే ఆ రాజులను కాళ్లతో పట్టుకొని వేగముగా తిప్పి పైకి విసిరి ిమరల పట్టుకొని (13), వజ్రముతో మహావృక్షములను కొట్టిన విధముగా శరీరమునంతనూ కాలుతున్న రాతిపలకపై వేసి మహావేగముతో కొట్టెదరు (14). అపుడు ఆ ప్రాణి చెవులనుండి రక్తము కారుచుండగా శిథిలమైన అవయవములు గలవాడై సంజ్ఞను కోల్పోయి లేశమైననూ చేష్ట లేనివాడై పడియుండును (15). అపుడు ఆ ప్రాణిపై గాలి వీచును. వారు వా కానికి మరల తెలివి వచ్చునట్లు చేసెదరు. తరువాత దానిని పాపములను కడిగి వేయుట కొరకే నరకసముద్రములో పారవేసెదరు (16). భూమికి అడుగున ఏడవ తలము దాటి ఘోరమగు చీకటితో నిండిన ఇరువది ఎనిమిది నరకకోటులు (శ్రేణులు) గలవు (17). మొదటి కోటికి ఘోర అని పేరు. దాని అడుగున వరుసగా సఘోర, అతీఘోర, మహాఘోర మరియు ఘోరరూప అనునవి గలవు (18). ఆరవది. తలాతలము. ఏడవది భయానకము. ఎనిమిదవది కాలరాత్రి. భయోత్కటము తొమ్మిదవది (19).

దాని క్రింద పదవది యగు చండగలదు. అంతకంటే క్రింద మహాచండ, చండకోలాహల, ప్రచండ, చండనాయిక (20), పద్మ, పద్మావతి, భీత, భీమ, భీషణనాయిక, కరాల, వికరాల గలవు. ఇరువదవ స్థానములో వజ్ర అను కోటి (నరకస్థాయి) గలదని మహా ర్షులు చెప్పుచున్నారు (21). త్రికోణ, పంచ కోణ, సుదీర్ఘ, అఖిలార్తిద, సమ, భీమబల, ఉగ్ర, మరియు ఆఖరులో దీప్తప్రాయ అనునవి ఇరువది ఎనిమిది ఘోరములగు నరకకోటులు. వీటిలో పాపాత్ములు యాతనలను పొందెదరు. నేను నీకు వాటి పేర్లను చెప్పితిని (22,23).

తాసాం క్రమేణ విజ్ఞేయాః పంచ పంచైవ నాయకాః ।
ప్రత్యేకం సర్వకోటీనాం నామతస్సంనిబోధత ॥
గౌరవః ప్రథమస్తేషాం రువంతే యత్ర దేహినః ।
మహారౌరవ పీడాభిర్మహాంతోఽ పి రుదంతి చ ॥
తతశ్శీతం తథా చోష్ణం పంచాద్యా నాయకాస్స్మృతాః ।
సుఘోరస్సు మహాతీక్ష్ణస్తథా సంజీవసస్స్మృతః ॥
మహాతమో విలోమశ్చ విలోపశ్చాపి కంటకః ।
తీవ్రవేగః కరాలశ్చ వికరాలః ప్రకంపనః ॥
మహావక్రశ్చ కాలశ్చ కాలసూత్రః ప్రగర్జనః ।
సూచీముఖస్సునేతిశ్చ ఖాదకస్సు ప్రపీడనః ॥
కుంభీపాకసుపాకౌ చ క్రకచశ్చాతిదారుణః ।
అంగారరాశిభవనం మేదోఽసృక్ ప్రహితస్తతః ॥
తీక్ష్ణతుండశ్చ శకునిర్మహా సంవర్తకః క్రతుః ।
తప్తజంతుః పంకలేపః ప్రతీమాంసస్త్రపూద్భవః ॥
ఉచ్ఛ్వాసస్సునిరుచ్ఛ్వాసో సుదీర్ఘః కూటశాల్మలిః ।
దురిష్టస్సుమహావాదః ప్రవాదస్సు ప్రతాపనః ॥
తతో మేఘా వృషశ్శాల్మసింహవ్యాఘ్ర గజాననాః ।
శ్వసూకరాజమహిష ఘూకకోకవృకాననాః ॥
గ్రాహకుంభీనక్రాఖ్యాస్సర్ప కూర్మాఖ్య వాయసాః ।
గృధ్రోలూకహలౌకాఖ్యాశ్శార్దూల క్రథకర్కటాః ॥
మండూకాః పూతివక్త్రాశ్చ రక్తాక్షః పూతమృత్తికాః ।
కణధూమ్రస్తథాగ్నిశ్చ కృమిగంధివపు స్తథా ॥
అగ్నీధ్రశ్చా ప్రతిష్ఠశ్చ రుధిరాభశ్శ్వభోజనః ।
లాలాభక్షాంత్రభక్షౌ చ సర్వభక్షస్సు దారుణః ॥
కంటకస్సు విశాలశ్చ వికటః కటపూతనః ।
అంబరీషః కటాహశ్చ కష్టా వైతరణీ నదీ ॥
సుతప్తలోహశయన ఏకపాదః ప్రపూరణః ।
అసితిలవనం ఘోరమస్థిభంగస్సుపూరణః ॥

విలాతసోఽసుయంత్రోఽపి కూటపాశః ప్రమర్దనః ।
మహాచూర్ణో సుచూర్ణోఽపి తప్తలోహమయం తథా ॥
పర్వతః క్షురధారా చ తథా యమలపర్వతః ।
మూత్రవిష్ఠాశ్రుకూపశ్చ క్షారకూపశ్చ శీతలః ॥
ముసలోలూఖలం యంత్రం శిలాశకటలాంగలమ్ ।
తాలపత్రాసి గహనం మహాశకట మండపమ్ ॥
సంమోహ మస్థిభంగశ్చ తప్తశ్చలమయో గుడమ్ ।
బహుదుఃఖం మహాక్లేశః కశ్మలం సమలం మలమ్ ॥
హాలాహలో విరూపశ్చ స్వరూపశ్చ యమానుగః ।
ఏకపాదస్త్రిపాదశ్చ తీవ్రశ్చాచీవరం తమః ॥
అష్టావింశతిరిత్యేతే క్రమశః పంచపంచకమ్ ।
కోటీనామానుపూర్వ్యేణ పంచ పంచైవ నాయకాః ॥
గౌరవాయ ప్రబోధ్యంతే నరకాణాం శతం స్మృతమ్ ।
చత్వారింశచ్ఛతం ప్రోక్తం మహానరక మండలమ్ ॥
ఇతి తే వ్యాస సంప్రోక్తా నరకస్య స్థితిర్మయా ।
ప్రసంఖ్యావాచ్చ వైరాగ్యం శృణు పాపగతిం చ తామ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నరకలోకవర్ణనం నామ
అష్టమోఽధ్యాయః ॥

ఈ నరకకోటులు అన్నింటికీ ఒక్కొక్కదానికి అయిదుగురు చొప్పున నాయకులు గలరు. ఈ విభాగములలోని నరకముల పేర్లను చక్కగా తెలుసుకొనుము (24). మొదటిది రౌరవము. అచట ప్రాణులు రోదించుచుందురు. తరువాతిది యగు మహారౌరవములో ఎంతటి వారైనా రోదించెదరు (25), తరువాత చల్లని మరియు వేడి నరకములు గలవు. వీటిలో మొదటి ఐదు ప్రముఖమైనవి. ఈ నరకముల పేర్లు ఏవనగా : సుఘోరము, సుమహాతీక్ష్ణము, సంజీవనము (26), మహాతమస్సు, విలోమము, విలోపము, కంటకము, తీవ్రవేగము, కరాలము, వికరాలము, ప్రకంపనము (27), మహావక్రము, కాలము, కాలసూత్రము, ప్రగర్జనము, సూచీముఖము, సునేతి, ఖాదకము, సు ప్రపీడనము (28), కుంభీపాకము, సుపాకము, క్రకచము, అతిదారుణము, అంగారరాశిభవనము, మేదఃప్రహితము, అస్యృక్ ప్రపాతము (29), తీక్ష్ణ తుండము, శకుని, మహాసంవర్తకము, క్రతువు, తప్తజంతువు, పంకల్పము, ప్రతిమాంసము, త్రపూద్భవము (30), ఉచ్ఛ్వాసము, సునీరుచ్ఛ్వాసము, సుదీర్ఘము, కూటశాల్మలి, దురిష్టము, సుమహావాదము, ప్రవాదము, సుప్రతాపనము (31), మేఘము, వృషము, శాల్మము, సింహాననము, వ్యాఘ్రాననము, గజాననము, శ్వాననము, సూకరాననము, అజాననము, మహిషాసనము, ఘూకాననము, కోకాననము, వృకాననము (32), గ్రాహాఖ్యము, కుంభీనాఖ్యము, నక్రాఖ్యము, సర్పా ఖ్యము, కూర్మాఖ్యము, వాయసా ఖ్యము, గృధ్రాఖ్యము, ఉలూకాఖ్యము, హలౌకాఖ్యము, శార్దూలము, క్రథము, కర్కటము (33), మండూకము, పూతీవక్త్రము, రక్తాక్షము,

పూతి మృత్తిక, కణధూమము, అగ్ని, కృమిగంధివపుస్సు (34), అగ్నీధ్రము, అప్రతిష్ఠము, రుధిరాభము, శ్వభోజనము, లాలా భక్షము, ఆంత్ర భక్షము, సర్వభక్షము, సుదారుణము (35), కంటకము, సువిశాలము, వికటము, కటపూతనము, అంబరీషము, కటాహము, కష్టమును కలిగించే వైతరణీ నది (36), సుతప్తలోహశయనము, ఏకపాదము, ప్రపూరణము, ఘోరమగు అసితిలవనము, ఘోరము, అస్థిభంగము, సుపూరణము (37), వితసము, అసుయంత్రము, కూటపాశము, ప్రమర్ధనము, మహాచూర్ణము, సుచూర్ణము, తప్తలోహమయము (38), పర్వతము, యములపర్వతము, మూత్రకూపము, విషాకూపము, అశ్రుకూపము, క్షారకూపము, శీతలము (39), ముసలో లూఖలము, యంత్రము, శిల, శకటలాంగలము, తాలపత్రాసిగహనము, మహాశకటమండపము (40), సంమోహము, అస్థిభంగము, తప్తము, చలము, అయోగుడము, బహుదుఃఖము, మహా క్లేశము, కశ్మలము, సమలము, మలము (41), హాలాహలము, విరూపము, స్వరూపము, యమానుగము, ఏకపాదము, త్రిపాదము, తీవ్రము, అచీవరము, తమస్సు అనునవి (42). పైన ఉదహరించిన ఇరువది ఎనిమిది నరకవిభాగములలో వరుసగా ఒక్కొక్క దానికి అయిదుగురు చొప్పున నాయకులు గలరు (43). రౌరవములో వంద విభాగములు గలవనియు, మహానరకమండలములో నాలుగు వేల విభాగములు గలవనియు చెప్పెదరు (44). ఓ వ్యాసా ! నేను నరకముయొక్క స్థితిని చెప్పితిని. దీనిని చెప్పుట వలన వైరాగ్యము కలుగును. పాపాత్ముల గతిని గురించి ఇప్పుడు వినుము (45).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు నరకలోకవర్ణనమనే ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (8).

9 – నరక యాతనలు

సనత్కుమార ఉవాచ ।

ఏషు పాపాః ప్రపచ్యంతే శోష్యంతే నరకాగ్నిషు ।
యాతనాభిర్వి చిత్రాభిరాస్వకర్మ క్షయాద్భృశమ్ ॥
స్వమలప్రక్షయాద్యద్వదగ్నౌ ధాస్యంతి ధాతవః।
తత్ర పాపక్షయాత్పాపా నరాః కర్మానురూపతః ॥
సుగాఢం హస్తయోర్బద్ధ్వా తతశ్శృంఖలయా నరాః ।
మహావృక్షాగ్రశాఖాసు లంబ్యంతే యమకింకరైః ॥
తతస్తే సర్వయత్నేన క్షిప్తా దోలంతీ కింకరైః ।
దోలంతశ్చాతివేగేన విసంజ్ఞా యాంతి యోజనమ్ ॥
అంతరిక్ష స్థితానాం చ లోహభారశతం పునః ।
పాదయోర్బధ్యతే తేషాం యమదూతైర్మహాబలైః ॥
తేన భారేణ మహతా ప్రభృశం పీడితా నరాః ।
ధ్యాయంతి స్వాని కర్మాణి తూష్ణీం తిష్ఠంతి నిశ్చలాః ॥
తతోంకుశైరగ్నివర్ణైర్లోహదండైశ్చ దారుణైః ।
హన్యంతే కింకరైర్ఘోరైస్సమంతాత్పాప కర్మిణః ॥
తతః క్షారేణ దీప్తేన వహ్నేరపి విశేషతః ।
సమంతతః ప్రలిప్యంతే తీవ్రేణ తు పునః పునః ॥
ద్రుతేనాత్యంతలిప్తేన కృత్తాంగా జర్జరీకృతాః ।
పునర్విదార్య చాంగాని శిరసః ప్రభృతి క్రమాత్ ॥
వృతాకవత్ప పచ్యంతే తప్తలోహకటాహకైః ।
విష్ఠాపూర్ణే తథా కూపే కృమీణాం నిచయే పునః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

పాపాత్ములు ఈ నరకాగ్నులయందు తమ తమ కర్మ క్షయమగు వరకు విచిత్ర ిములు మరియు తీవ్రములు అగు యాతనలచే తపించి శుష్కింప చేయబడుదురు (1). లోహములను మనము వాటిలోని మాలిన్యము పోవు వరకు నిప్పులలో పుటము పెట్టెదము. అటులనే, అచట పాపాత్ములగు మానవులు తమ తమ కర్మకు అనురూపముగా తాపమునకు గురిచేయ బడుదురు (2) యమకింకరులు ఆ మానవుల చేతులను గట్టిగా కట్టి పెద్ద చెట్ల చిటారు కొమ్మలకు గొలుసులతో వ్రేలాడ దీసెదరు (3). తరువాత వారిని ఆ కింకరులు తమ బలమునంతనూ ఉపయోగించి మహావేగముతో ఊయలను ఊపుచుండగా, వారు స్పృహను గోల్పోయి యోజనము దూరము వరకు ఊగుచుందురు (4). వారు గాలిలో వ్రేలాడుచుండగా మహాబలశాలురగు ఆ యమదూతలు వారి పాదములకు వంద భారముల లోహమును కట్టెదరు (5). ఆ మహాభారముచే అతిశయించిన పీడను పొందిన ఆ నరులు తమ కర్మలను స్మరిస్తూ మౌనముగా కదలిక లేకుండగా

నుందురు (6). తరువాత ఆ కింకరులు పాపాత్ములను అగ్నివలె ప్రకాశించే అంకుశములతో మరియు దారుణమైన లోహపు రోకళతో అంతటా కొట్టెదరు (7). తరువాత మండే నిప్పుల కంటే అధికమగు మంటను కలిగించే తీవ్రమగు క్షారమును వారి దేహములకు అంతటా పలుమార్లు పూసెదరు (8). కరిగిన లోహమును వారి దేహములపై పోయగా వారి అవయవములు కోసివేయబడి శిథిలమగును. మరల వారి దేహావయవములను తలనుండి మొదలిడి వరుసగా చీల్చి వేసెదరు (9). తరువాత వారిని వంకాయలను వలే కాగే ఇనుప గుండిగలలో వేయించి, తరువాత మలముతో నిండిన నూతులలో మరియు క్రిముల గుట్టలలో పారవేసెదరు (10).

మేదోఽసృక్పూయ పూర్ణాయాం వాప్యాం క్షిప్యంతి తే పునః ।

భక్ష్యంతే కృమిభిస్తీక్ష్ణైర్లోహతుండైశ్చ వాయసైః ॥

శభిర్దం శైర్మ్మకైర్వ్యాఘ్రై రౌద్రైశ్చ వికృతాననైః ।

పచ్యంతే మత్స్యవచ్చాపి ప్రదీప్తాంగారరాశిషు ॥

భిన్నాశ్శూలైసుతీక్ష్ణైశ్చ నరాః పాపేన కర్మణా ।

తైలయంత్రేషు చాక్రమ్య ఘోరైః కర్మభిరాత్మనః ॥

తిలా ఇవ ప్రపీడ్యంతే చక్రాఖ్యే జనపిండకాః ।

భ్రజ్యంతే చాతపే తప్తే లోహభాండేష్వనే కధా ॥

తైలపూర్ణకటాహేషు సుతప్తేషు పునః పునః ।

బహుధా పచ్యతే జిహ్వా ప్రపీడ్యో రసి పాదయోః ॥

యాతనాశ్చ మహత్యోఽత్ర శరీరస్యాపి సర్వతః ।

నిశ్శేషనరకే ష్వేవం క్రమంతి క్రమశో నరాః ॥

నరకేషు చ సర్వేషు విచిత్రా యమయాతనా ।

యామ్యైశ్చ దీయతే వ్యాస సర్వాంగేషు సుకష్టదా ॥

జ్వలదంగారమాదాయ ముఖమాపూర్య తాడ్యతే ।

తతః క్షారేణ దీప్తేన తామ్రేణ చ పునః పునః ॥

ఘృతేనాత్యంతతప్తేన తదా తైలేన్ తన్ముఖమ్ ।

ఇతస్తతః పీడయిత్వా భృశమాపూర్య హన్యతే ॥

విష్ఠాభిః కృమిభిశ్చాపి పూర్యమాణాః క్వచిత్క్వచిత్ ।

పరిష్వజంతి చాత్యుగ్రాం ప్రదీప్తాం లోహశాల్మలీమ్ ॥

వారు మరల క్రొవ్వు, రక్తము మరియు మురికితో నిండిన నూతిలోనికి త్రోసి ివేయ బడుదురు. వారిని వాడి కోరలు గల క్రిములు, లోహనిర్మితమైన ముక్కులు గల కాకులు, కుక్కలు, దోమలు, తోడేళ్లు మరియు వికృతమగు ముఖముతో భీతిని గొల్పు పెద్ద పులులు భక్షించును. వారు కణ కణ కాలే నిప్పులపై చేపల వలె పచనము చేయబడుదురు (11, 12). మానవులు పాపకర్మ ప్రభావముచే మిక్కిలి వాడియగు శూలములచే పొడువబడుదురు. చేసిన కర్మను బట్టి వారు చక్రము అనబడే నూనె గానుగలలో భయంకరులగు యమకింకరులచే తొక్కి పెట్టి

నువ్వుల వలే గట్టిగా పీడింపబడి తెలక పిండి వలె చేయ బడెదరు. మరియు మండుటెండలో కాలుతున్న ఇనుపగుండిగలలో అనేకరకములుగా ఉడికించబడేదరు (13, 14). నాలుకను, వక్షఃస్థలమును మరియు పాదములను తొక్కి పెట్టి గుండిగలలో సలసల మరిగే నూనెలో వారు అనేకపర్యాయములు అనేకవిధములుగా వేయించబడెదరు (15). ఇచట శరీరమునకు అన్నీ భాగములలో కలిగే యాతనలు తీవ్రముగా నుండును. మానవులు నరకముల నన్నింటినీ క్రమముగా అనుభవించెదరు (16). ఓ వ్యాసా! నరకములన్నింటిలో యమభటులు అవయవములన్నింటికీ అధికమగు కష్టమును కలిగించే విచిత్రమగు యాతనలను పెట్టెదరు (17). వారి నోటిలో మండే నిప్పులను, తరువాత కాగే క్షారమును, తరువాత పలుమార్లు మరిగే రాగిని, చాల వేడిగా నుండే నేతిని, తరువాత నూనెను నిండుగా నింపి ఇటునటు నొక్కి కొట్టెదరు (18, 19). కొన్ని సమయములలో వారు మలముచే మరియు క్రిములచే కప్పి వేయబడెదరు. వారు మిక్కిలి వేడిగా నుండే ఇనుప వృక్షమును కౌగిలించు కొనునట్లు చేసెదరు (20).

హన్యంతే పృష్ఠదేశే చ పునర్దీప్తైర్మహాఘనైః ।
దంతురేణాదికంఠేన క్రకచేన బలీయసా ॥
శిరఃప్రభృతి పీడ్యంతే ఘోరైః కర్మభిరాత్మ జైః।
ఖాద్యంతే చ స్వమాంసాని పీయతే శోణితం స్వకమ్ ॥
అన్నం పానం న దత్తం యైస్సర్వదా స్వాత్మపోషకైః ।
ఇక్షువత్తే ప్రపీడ్యంతే జర్జరీకృత్య ముద్గరైః ॥
అసితాలవనే ఘోరే ఛిద్యంతే ఖండశస్తతః।
సూచీభిర్భిన్నసర్వాంగా స్తప్తశూలాగ్రరోపితాః ॥
సంచాల్యమానా బహుశః క్లిశ్యంతే న మ్రియంతి చ ।
తథా చ తచ్ఛరీరాణి సుఖదుఃఖసహాని చ ॥
దేహాదుత్పాట్య మాంసాని ఛిద్యంతే స్వైశ్చ ముద్గరైః ।
దంతురా కృతిభిర్ఘోరైర్యమదూతైర్బలోత్కటైః ॥
నిరుచ్ఛ్వాసే నిరుచ్ఛ్వాసాస్తిష్ఠంతి నరకే చిరమ్ ।
ఉత్తాడ్యంతే తథోచ్ఛ్వాసే వాలుకాసదనే నరాః ॥
రౌరవే రోదమానాశ్చ పీడ్యంతే వివిధైర్వధైః ।
మహారౌరవపీడాభిర్మహాంతోఽపి రుదంతి చ ॥
పత్సు వక్త్రే గుదేముండే నేత్రయోశ్చైవ మస్తకే ।
నిహన్యంతే ఘనైస్తీక్ష్ణైస్సుతప్తైర్లోహ శంకుభిః ॥
సుతప్తవాలుకాయాం తు ప్రయోజ్యంతే ముహుర్ముహుః ।
జంతుపంకే భృశం తప్తే క్షిప్తాః క్రందంతి విస్వరమ్ ॥
కుంభీపాకేషు చ తథా తప్తశైలేషు వై మునే ।
పాపినః క్రూరకర్మాణోఽ సహ్యేషు సర్వథా పునః ॥

లాలాభక్షేషు పాపాస్తే పాత్యంతే దుఃఖదేషు వై।
నానాస్థానేషు పచ్యంతే నరకేషు పునః పునః ॥
సూచీముఖే మహాక్లేశే నరకే పాత్యతే నరః।
పాపీ పుణ్యవిహీనశ్చ తాడ్యతే యమకింకరైః ॥

ఇంతేగాక, వారు కాలే సుత్తులచే వెనుక భాగమునందు కొట్టబడెదరు. వారిని శిరస్సు మొదలుకొని అవయవములు పదునైన పళ్లు గల బలమైన రంపముచే కోయబడును. వారీ విధముగా తాము చేసిన కర్మలచే పీడించబడెదరు. వారు తమ మాంసమును తామే తినునట్లు తమ రక్తమును తామే త్రాగునట్లు చేయబడుదురు (21, 22). ఎవరైతే తాము మాత్రమే భుజిస్తూ ఇతరులకు అన్నపానముల నీయరో, వారిని రో కళ్లతో చెరుకుగడను వలె పిప్పి చేసి తీవ్రమగు పీడకు గురి చేయుదురు (23). తరువాత వారిని అసీతాలవనములో ముక్క ముక్కలుగా కోసి సూదులతో అవయవములను అన్నింటినీ గుచ్చి శూలముపై కొరత వేసెదరు (24). ఈ విధముగా వారిని పలు నరకస్థానములలోనికి అనుభవించెదరే గాని, మరణించరు. వారి శరీరములు సుఖదుఃఖములను సహించును (25), బలముచే గర్వించి యున్న యమదూతలు దేహమునుండి కండలను పేరికి, వాడి పళ్లను కలిగి భయంకరాకారము గల తమ చేతి దండములతో మోద్దరు (26). నిరుచ్ఛ్వాసము అనే నరకములో ఆ మానవులు చాలా సేపు గాలి పీల్చకుండగా నిలిచి యుందురు. మరియు వారిని ఉచ్ఛ్వాసమనే నరకములో ఇసుక గదులలో ఉతికెదరు (27). రౌరవనరకములో వివిధపీడలకు గురి చేయబడి వారు రోదించెదరు. మహారౌరవమునందలి యాతనలచే గొప్ప వారు కూడ రోదించేదరు (28). మిక్కిలి బరువైన, బాగా కాలుచున్న, వాడియైన, ఇనుప కీలలతో వారిని పాదములు, ముఖము, గుదము, తల, కన్నులు, లలాటము అను స్థానములయందు పొడిచెదరు (29). వారిని కాలే ఇసుకలో అనేకపర్యాయములు దొర్లించెదరు. జంతుదేహములతో నిండి మరుగుతూ ఉండే బురదలో పారవేయగా, వారు వికృతస్వరముతో రోదించేదరు (30). ఓ మునీ! క్రూరమగు కర్మలను చేసిన పాపాత్ములను కుంభీపాకనరకముల యందు లేశమైననూ సహింప శక్యము కానీ, కాగే నూనెతో నిండిన గుండీగలలో పడవేయుదురు (31). లాలాభక్షములు అనే నరకములలో పాపాత్ములను దుఖమును కలిగించే వివిధస్థానములలో పారవేసి పలుమార్లు ఉడికించేదరు (32). యమకింకరులు పుణ్యమును చేయని పాపాత్ముడగు మానవుని మహాదుఃఖమును కలిగించే సూచీముఖ నరకములో పారవేసి కొట్టెదరు (33).

లౌహకుంభే వినిక్షిప్తాః శ్వసంతశ్చ శనైశ్శనైః।

మహాగ్నినా ప్రపచ్యంతే స్వపాపైరివ మానవాః ॥

దృఢం రజ్జ్వాదిభిర్బద్ధ్వా ప్రపీడ్యంతే శిలాసు చ ।

క్షిప్యంతే చాంధకూపేషు దశ్యంతే భ్రమరైర్భృశమ్ ॥

కృమిభిర్భిన్నసర్వాంగాశ్శతశో జర్జరీకృతాః ।

సుతీక్ష్ణక్షారకూపేషు క్షిప్యంతే తదనంతరమ్ ॥

మహాజ్వాలేఽ త్ర నరకే పాపాః క్రందంతి దుఃఖితాః ।

ఇతశ్చేతశ్చ ధావంతి దహ్యమానాస్తదర్చిషా ॥

పృష్ఠే చానీయ తుండాభ్యాం విన్యస్తస్కంధయోజితే ।

తయోర్మధ్యేన వాకృష్య బాహుపృష్ఠేన గాఢతః ॥

బద్ధాః పరస్పరం సర్వే సుభృశం పాపరజ్జుభిః ।

బద్ధపిండాస్తు దృశ్యంతే మహా జ్వాలే తు యాతనాః ॥

రజ్జుభిర్వేష్టితాశ్చైవ ప్రలిప్తాః కర్దమేన చ ।

కరీషతుషవహ్నౌ చ పచ్యంతే న మ్రియంతి చ ॥

సుతీక్ష్ణం చరితాస్తే హి కర్కశాసు శిలాసు చ ।

ఆస్ఫాల్య శతశః పాపాః పశ్యంతే తృణవత్తతః ॥

శరీరాభ్యంతరగతైః ప్రభూతైః కృమిభిర్నరాః ।

భక్ష్యంతే తీక్ష్ణవదనైరాత్మదేహక్ష యాద్భృశమ్ ॥

కృమీణాం నిచయే క్షిప్తాః పూయమాంసాస్థిరాశిషు ।

తిష్ఠంత్యుద్విగ్న హృదయాః పర్వతాభ్యాం నిపీడితాః ॥

తప్తేన వజ్రలేపేన శరీరమనులిప్యతే ।

అధోముఖోర్ధ్వపాదాశ్చ తాతప్యంతే స్మ వహ్నినా ॥

వదనాంతః ప్రవిన్యస్తాం సుప్రతప్తామయోగదామ్ ।

తే ఖాదంతి పరాధీనాస్తైస్తాడ్యంతే సముద్గరైః ॥

ఇత్థం వ్యాస కుకర్మాణో నరకేషు పచంతి హి ।

వర్ణయామి వివర్ణత్వం తేషాం తత్త్వాయ కర్మణామ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నరకగతివర్ణనం నామ

నవమోఽధ్యాయః ॥

మానవులు తాము చేసిన పాపముల ప్రభావముచే ఇనుప కుండలోనికి త్రోసివేయబడి పెద్ద మంటలచే ఉడికించ బడుతూ మెల్ల మెల్లగా గాలిని పీల్చుచుందురు (34). వారిని గట్టిగా త్రాళ్లు మొదలైన వాటితో బంధించి రాళ్లపై వేసి ఈడ్చెదరు. వారిని చీకటి నూతుల లోనికి త్రోసెదరు. అచట వారిని తేనెటీగలు గట్టిగా కుట్టుచుండును (3 5). క్రిములచే భేదించ బడిన సర్వావయవములు కలిగి శతవిధములుగా శిథిలమైన దేహములు గల ఆ జీవులను ఆ తరువాత మిక్కిలి తీక్ష్ణమైన క్షారముతో నిండిన నూతులలో పారవేసెదరు (36). అచట పెద్ద పెద్ద మంటలతో నిండిన నరకములో వారు ఆ వేడిచే కాలిన దేహములు గలవారై దుఃఖముతో రోదిస్తూ ఇటునటు పరుగులెత్తెదరు (37). వారి నోళ్లను భుజములపై ఆన్చి చేతులను ఆ భుజముల మధ్యలో నుండి వెనుకకు లాగి గట్టిగా కట్టెదరు (38). వారందరు ఈ విధముగా మహాజ్వాల అనే నరకములో, వారు చేసిన పాపములే త్రాళ్లు కాగా, ఒకరితో మరియొకరు చాల గట్టిగా కట్టబడిన దేహములు గలవారై యాతనలను అనుభవించెదరు (39). వారిని త్రాళతో శరీరమంతా చుట్టి బురదను పూసి ఊక మరియు పిడకలతో కూడిన నిప్పులలో ఉడికించెదరు. అయిననూ, వారు మరణించరు (40). ఆ పాపులను కర్కశమగు రాళ్లపై చాల గట్టిగా పడవేసి ఈడ్చి అనేకవిధములుగా కొట్టి, తరువాత గడ్డిని వలె కాల్చెదరు (41). ఆ మానవులు తమ దేహములోపల నుండే వాడి నోళ్లు గల పెద్ద పెద్ద క్రిములచే భక్షింపబడెదరు. వారిని క్రిముల గుట్టపై, మరియు మలమాంసముల ఎముకల రాశులపై పారవేసెదరు. రెండు పర్వతముల మధ్య నలిగి పోతూ వారు తమ దేహములు తీవ్రముగా కృశించుచుండగా భయముతో నిండిన హృదయములు గలవారె దుఃఖించెదరు (42, 43). వజ్రపు పొడితో చేసిన ముద్దను కాల్చి వారి శరీరములకు పూత పూసెదరు. వారిని తల క్రిందకు కాళ్లు పైకి ఉండునట్లు వ్రేలాడదీసి నిప్పులపై తపింప జేసెదరు (44). వారు నోటిలోనికి చొప్పించ బడిన మిక్కిలి వేడిగా నున్న ఇనుప గదను నిస్సహాయులై నమిలెదరు. వారు రోకళ్లచే కొట్టబడెదరు (45). ఓ వ్యాసా! పాపాత్ములు ఈ విధముగా నరకములో తపించెదరు. కర్మలను చేయు మానవుల అవగాహన కొరకై నేను వారి బాధలను వర్ణించెదను (46).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు నరకగతి వర్ణనము అనే తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (9).

10 - నరక యాతనలు

సనత్కుమార ఉవాచ ।

మిథ్యాగమం ప్రవృత్తస్తు ద్విజిహ్వాఖ్యే చ గచ్ఛతి ।
జిహ్వార్ధకోశవిస్తీర్ణహలైస్తీక్ష్ణైః ప్రపీడ్యతే ॥
నిర్భర్త్సయతి యః క్రూరో మాతరం పితరం గురుమ్ ।
విష్ఠాభిః కృమిమిశ్రాభిర్ముఖమాపూర్య హన్యతే ॥
యే శివాయతనారామ వాపీకూపతడాగకాన్ ।
విద్రవంతి ద్విజస్థానం నరాస్తత్ర రమంతి చ ॥
కామాయోద్వర్తనాభ్యంగ స్నానపానాంబు భోజనమ్ ।
క్రీడనం మైథునం ద్యూతమాచరంతి మదోద్ధతాః ॥
పేచిరే వివిధైర్ఘోరైరిక్షుయంత్రాది పీడనైః ।
నిరయాగ్నిషు పచ్యంతే యావదా భూతసంప్లవమ్ ॥
తేన తేనైవ రూపేణ తాడ్యంతే పారదారికాః ।
గాఢమాలింగ్య తే నారీం సుతప్తాం లోహనిర్మితామ్ ॥
పూర్వాకారాశ్చ పురుషాః ప్రజ్వలంతి సమంతతః ।
దుశ్చారిణీం స్త్రియం గాఢమాలింగంతి రుదంతి చ ॥
యే శృణ్వంతి సతాం నిందాం తేషాం కర్ణ ప్రపూరణమ్ ।
అగ్నివర్ణైరయః కీలైస్తప్తైస్తా మ్రాదినిర్మితైః ॥
త్రపు సీసారకూటాదిః క్షీరేణ చ పునః పునః ।
సుతప్తతీక్ష్ణ తైలేన వజ్రలేపేన వా పునః ॥
క్రమాదాపూర్య కర్ణాంస్తు నరకేషు చ యాతనాః ।
అను క్రమేణ సర్వేషు భవంత్యేతా స్సమంతతః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

అధర్మమును బోధించే ఆగమములను పాటించువాడు ద్విజిహ్వాము అనే నరకమును పొంది, నాలుకవలెనుండే, మైలు దూరమువరకు విస్తరించి యున్న వాడి నాగళ్లచే పీడించ బడును (1). ఏ క్రూరుడైతే తల్లిదండ్రులను, గురువును గద్దించునో, వానిని నోటిలో క్రిములతో, నిండిన మాలిన్యమును నింపి కొట్టెదరు (2). ఏ మానవులైతే మదముచే గర్వించిన వారై శివాలయము, సత్రము, నుయ్యి, దిగుడు బావి, చెరువు, బ్రాహ్మణస్థానము అనువాటిని దుర్వినియోగము చేసెదరో, అనగా అచట క్రీడించుట, సంభోగించుట, లేపనములను మరియు నూనెను రాసుకొని స్నానమాడుట, మద్యమును సేవించుట, విలాసభోజనములను చేయుట, జూదమాడుట మొదలగు పనులను చేయుదురో, వారు ప్రలయకాలము వరకు నరకములోని చెరుకు గానుగలయందు నలుగ కొట్టబడి నిప్పులలో ఉడికించ బడెదరు (3-5). పరస్త్రీ వ్యామోహము గల వారిని వారు ప్రేమించిన స్త్రీ యొక్క లోహవిగ్రహమును చేసి దానిని గట్టిగా కౌగిలించుకొనునట్లు చేసి,

కొట్టెదరు (6). చేడు ప్రవృత్తి గల స్త్రీలు వారు ప్రేమించిన పురుషుల కాలే విగ్రహములను కౌగిలించు కొనునట్లు చేయుటచే వారు రోదించెదరు (7). ఎవరైతే సత్పురుషుల నిందలను వినెదరో, వారి చెవులలో అగ్ని వలె ప్రకాశించే, రాగి ఇనుము తగరము సీసము కంచు మొదలగు లోహములచే చేయబడిన, కాలుచున్న మేకులను, కాలుచున్న నీటిని, పాలను, నూనెను, మరియు వజ్రపు చూర్ణమును దట్టముగా నింపెదరు (8,9), ఈ విధముగా నరకములలో చెవులను మాత్రమే గాక, క్రమముగా సర్వావయవములను దట్టముగా నింపి అన్ని వైపులనుండి యాతనలను పెట్టెదరు (10).

సర్వేంద్రియాణామప్యేవం క్రమాత్పాపేన యాతనాః ।
భవంతి ఘోరాః ప్రత్యేకం శరీరేణ కృతేన చ ॥
స్పర్శదోషేణ యే మూఢాస్స్పృశంతి చ పరస్త్రియమ్ ।
తేషాం కరోఽగ్నివర్ణాభిః పాంశుభిః పూర్యతే భృశమ్ ॥
తేషాం క్షారాదిభిస్సర్వైశ్శరీర మనులిప్యతే ।
యాతనాశ్చ మహాకష్టాస్సర్వేషు నరకేషు చ ॥
కుర్వంతి పిత్రోర్భ్రు కుటిం కరనేత్రాణి యే నరాః ।
వక్త్రాణి తేషాం సాంతాని కీర్యంతే శంకుభిర్దృడమ్ ॥
యైరింద్రియైర్నరా యే చ కుర్వంతి పరస్త్రియమ్ ।
ఇంద్రియాణి చ తేషాం వై వికుర్వంతి తథైవ చ ॥
పరదారాంశ్చ పశ్యంతి లుబ్ధాః స్తబ్ధేన చక్షుషా ।
సూచీభిశ్చాగ్ని వర్ణాభిస్తేషాం నేత్రప్రపూరణమ్ ॥
క్షారాద్యైశ్చ క్రమాత్సర్వా ఇహైవ యమయాతనాః ।
భవంతి మునిశార్దూల సత్యం సత్యం న సంశయః ॥
దేవాగ్నిగురు విప్రేభ్యశ్చానివేద్య ప్రభుంజతే ।
లోహకీలశతైస్తప్తైస్తజ్జిహ్వాస్యం చ పూర్యతే ॥
యే దేవారామపుష్పాణి లోభాత్సంగృహ్య పాణినా ।
జిఘ్రంతి చ నరా భూయశ్శిరసా ధారయంతి చ ॥
ఆపూర్యతే శిరస్తేషాం తప్తైర్లోహస్య శంకుభిః ।
నాసికా వాతిబహులైస్తతః క్షారాదిభిర్భృశమ్ ॥

మానవుడు శరీరములోని ఏయే ఇంద్రియములచే పాపమును చేసినాడో, ఆయా ఇంద్రి ియములు అన్నింటికీ క్రమముగా ప్రత్యేకించి ఇదే విధముగా ఘోరమైన యాతనలు కలుగును (11). ఏ మూర్ఖులైతే పరస్త్రీని స్పృశించెదరో, ఆ స్పర్శదోషముచే వారి చేతులు నిప్పుల వలే కాలే బూడిదతో దట్టముగా నింపబడును (12), వారికి దేహమునకు క్షారము మొదలైన వాటిని అన్నింటినీ పూసి నరకములన్నింటియందు మహాకష్టమును కలిగించే యాతనలను పెట్టెదరు (13). ఏ మానవులైతే కనుబొమలను ముడిచి చేతులను త్రిప్పుతూ కన్నులతో కోపముగా చూచెదరో, వారి ముఖములను ఈ కొననుండి ఆ కొన

వరకు మేకులతో గట్టిగా గీసెదరు (14). ఏ ఇంద్రియములచే మానవులు ఇతరస్త్రీలకు హానిని కలిగించెదరో, వారి ఆ ఇంద్రియములను వికృతమొనర్చెదరు (15). పరభార్యలను పాపబుద్ధితో చూచు కాముకుల కళ్లలో నిప్పుల వలె ప్రకాశించే సూదులను గుచ్చెదరు (16). ఓ మహర్షీ! ఈ నరకమునందు క్షారమును మీద పోయుట మొదలగు యమయాతనలను పాపులు అందరు అనుభవించెదరనుటలో సందేహము ముమ్మాటికీ లేదు (17). ఎవరైతే దేవతలకు, అగ్నికీ, గురువునకు, బ్రాహ్మణులకు నివేదించకుండగా భకించెదరో, వారి నాలుకను మరియు నోటిని వందలాది కాలే ఇనుప మేకులతో నింపెదరు (18). ఏ మానవులైతే దేవాలయములోని పుష్పములను ఆశవలన చేతితో కోసి ఆఘ్రాణించెదరో, మరియు శిరస్సుపై ధరించెదరో (19), వారి తల కాలే ఇనుప శంకువులతో నింపి వేయబడును. ఇంతే గాక, ముక్కులో క్షారము మొదలగు వాటిని అధిక మాత్రలో పోసెదరు (20).

యే నిందంతి మహాత్మానం వాచకం ధర్మదేశికమ్ ।
దేవాగ్నిగురుభక్తాంశ్చ ధర్మశాస్త్రం చ శాశ్వతమ్ ॥
తేషామురసి కంఠే చ జిహ్వాయాం దంతసంధిషు ।
తాలున్యోష్ఠే నాసికాయాం మూర్ధ్ని సర్వాంగసంధిషు ॥
అగ్నివర్ణాస్తు తప్తాశ్చ త్రిశాఖా లోహశంకవః ।
ఆఖిద్యంతే చ బహుశః స్థానేష్వేతేషు ముద్గరైః ॥
తతః క్షారణ దీప్తేన పూర్యతే హి సమంతతః ।
యాతనాశ్చ మహత్యో వై శరీరస్యాతి సర్వతః ॥
అశేష నరకేష్వేవ క్రమంతి క్రమశః పునః ।
యే గృహ్ణంతి పరద్రవ్యం పద్భ్యాం విప్రం స్పృశంతి చ ॥
శివోపకరణం గాం చ జ్ఞానాదిలిఖితం చ యత్ ।
హస్తపాదాదిభిస్తేషామాపూర్యంతే సమంతతః ॥
నరకేషు చ సర్వేషు విచిత్రా దేహయాతనాః ।
భవంతి బహుశః కష్టాః పాణిపాద సముద్భవాః ॥
శివాయతనపర్యంతే దేవారామేషు కుత్రచిత్ ।
సముత్సృజంతి యే పాపాః పురీషం మూత్రమేవ చ ।
తేషాం శిశ్నం సవృషణం చూర్ణ్యతే లోహముద్గరైః ।
సూచీభిరగ్నివర్ణాభిస్క్షిత్వా పూర్యతే పునః ॥
తతః క్షారేణ మహతా తీవ్రేణ చ పునః పునః ।
ద్రుతేన పూర్యతే గాఢం గుదే శిశ్నే చ దేహినః ॥

ఎవరైతే మహాత్ముని, ప్రవచనమును చెప్పువానిని, ధర్మాచార్యునీ, దేవతలను, అగ్ని్నిని, గురువును, భక్తులను మరియు శాశ్వతమగు ధర్మశాస్త్రమును నిందించెదరో (21), వారి వక్షఃస్థలము, కంఠము, నాలుక, దంతముల మధ్యలోని ఖాళీ స్థానములు, తొలువు, పెదవి, ముక్కు, తల, అన్ని కీళ్లు అను స్థానములలో

(22), అగ్నివలె ప్రకాశించే కాల్చిన మూడు కొనలు గల లోహపు మేకులను అనేకవిధములుగా, గుచ్చి సుత్తులతో మోదెదరు (23). తరువాత వారినీ మరిగే క్షారమునందు ముంచి, శరీరముయొక్క అన్ని భాగములలో మహాయాతనలను కలిగించేదరు (24). ఎవరైతే ఇతరుల ద్రవ్యమును సంగ్రహించెదరో, పాదములతో బ్రాహ్మణుని స్పృశించెదరో, వారు క్రమముగా అన్ని నరకములను మరల ప్రవేశించి ముందుకు సాగెదరు (25). శివపూజాసాధనమును, గోవును, జ్ఞానమును కలిగియున్న వ్రాతప్రతిని ఎవరైతే చేతితో పాడుచేసెద రో, లేదా పాదములతో తొక్కెదరో, వారు పైన చెప్పిన ద్రవ్యములన్నింటియందు ముంచబడేదరు (26). నరకములన్నింటియందు విచిత్రములగు శరీరయాతనలు పలువిధములుగా చేతులపై మరియు కాళ్లపై ప్రయోగించబడును (27). ఏ పాపాత్ములైతే శివాలయమునకు సమీపములో, మరియు పరమేశ్వరుని ఉద్యానములలో ఎక్కడనైననూ మూత్రపురీషములను విసర్జించెదరో (28), వారి జననేంద్రియములను ఇనుప కడ్డీలతో చూర్ణము చేసి, అగ్నివలె ప్రకాశించే సూదులను గుచ్చి, పైన చెప్పిన ద్రవ్యములను వాటిపై పోసెదరు (29). తరువాత ఆ ప్రాణియొక్క జనన వీసర్జ నేంద్రియములు కాలే క్షారముతో అధికపరిమాణములో దట్టముగా పలుమార్లు నింపి వేయబడును (30).

మనస్సర్వేంద్రియాణాం చ యస్మాద్దుఃఖం ప్రజాయతే ।
ధనే సత్యపి యే దానం న ప్రయచ్ఛంతి తృష్ణయా ॥
అతిథిం చావమన్యంతే కాలే ప్రాప్తే గృహాశ్రమే ।
తస్మాత్తే దుష్కృతం ప్రాప్య గచ్ఛంతి నిరయేఽ శుచౌ ॥
యేఽన్నం దత్త్వా హి భుంజంతి న శ్వభ్యస్సహ వాయసైః।
తేషాం చ వివృతం వక్త్రం కీలకద్వయతాడితమ్ ॥
కృమిభిః పాణిభిశ్చోగ్రై ర్లోహతుండైశ్చ వాయసైః ।
ఉపద్రవైర్బహువిధైరుగ్రై రంతః ప్రపీడ్యతే ॥
శ్యామశ్చ శబలశ్చైవ యమమార్గానురోధకౌ ।
యౌ స్తస్తాభ్యాం ప్రయచ్ఛామి తౌ గృహ్ణీ తామిమం బలిమ్ ॥
యే వా వరుణవాయవ్యా యామ్యా నైరృత్యవాయసాః ।
వాయసా పుణ్య కర్మాణస్తే ప్రగృహ్ణంతు మే బలిమ్ ॥
శివామభ్యర్చ్య యత్నేన హుత్వాగ్నౌ విధిపూర్వకమ్ ।
శైవైర్మం త్రై ర్బలిం యే చ దదతే న చ తే యమమ్ ॥
పశ్యంతి త్రిదివం యాంతి తస్మాద్దద్యాద్దినే దినే ।
మండలం చతురస్రం తు కృత్వా గంధాది వాసితమ్ ॥
ధన్వంతర్యర్థమీశాన్యాం ప్రాచ్యామింద్రాయ నిఃక్షిపేత్ ।
యామ్యాం యమాయ వారుణ్యాం సదక్షోమాయ దక్షిణే ॥
పితృభ్యస్తు వినిక్షిప్య ప్రాచ్యామర్యమణే తతః ।
ధాతుశ్చైవ విధాతుశ్చ ద్వారదేశే వినిఃక్షిపేత్ ॥

శ్వభ్యశ్చ శ్వపతిభ్యశ్చ వయోభ్యో వికిషేద్భువి ।

దేవైః పితృమనుష్యైశ్చ ప్రేతైర్భూతైస్స గుహ్యకైః ॥

వయోభిః కృమికీటైశ్చ గృహస్థశ్చోపజీవ్యతే ।

స్వాహాకారస్స్వధాకారో వషట్ కారస్తృతీయకః ॥

హంతకారస్తథైవాన్యో ధేన్వాః స్తనచతుష్టయమ్ ।

స్వాహాకారం స్తనం దేవాస్స్వధాం చ పితరస్తథా ॥

వషట్ కారం తథైవాన్యే దేవా భూతేశ్వరాస్తథా ।

హంతకారం మనుష్యాశ్చ పిబంతి సతతం స్తనమ్ ॥

ఎవరైతే ధనము ఉన్ననూ లోభముచే దానమును చేయరో, వారి మనస్సునకు మరియు అన్ని ఇంద్రియములకు దుఃఖము కలుగును (31). గృహస్థాశ్రమములో ఉండియు సమయమునకు ఇంటికి వచ్చిన అతిథిని ఎవరైతే అవమానించెదరో, వారు దాని వలన పాపమును పొంది అశుచియగు నరకమును పొందెదరు (32). ఎవరైతే కుక్కలకు మరియు కాకులకు పెట్టకుండగా అన్నమును భుజించేదో, వారి నోటిని తెరిచి రెండు మేకులను కొట్టెదరు (33). మరియు లోపల క్రిములను, భయంకరమగు ప్రాణులను నింపి, ఇనుప ముక్కులు గల కాకులచే పొడిపించి, మరియు అనేకవిధములైన ఉగ్రమగు ఉపద్రవములకు లోను చేసి పీడించేదరు (34). శ్యామ (నల్లనిది), శబల (విచిత్రవర్ణము గలది) అనే రెండు కుక్కలు యమలోకమార్గములో వెళ్లనక్కర లేకుండగా అడ్డుకొనును. వాటికి ఈ అన్నమును సమర్పించుచున్నాను. అవి దీనిని స్వీకరించును గాక! (35) వరుణుని (పశ్చిమ), వాయువుయొక్క (వాయవ్యమూల), యముని (దక్షిణ), మరియు నిర్‌ఋుతియొక్క (నైర్‌ఋుతి మూల) దిక్కులయందు ఉండే పవిత్రమైన కర్మ గల కాకులు నేను ఇచ్చే ఈ అన్నమును స్వీకరించును గాక !(36) ఎవరైతే శివుని శ్రద్ధతో పూజించి అగ్నియందు యథావిధిగా వ్రేల్చి శివుని స్తుతించు. మంత్రములచే అన్నమును ఈ విధముగా సమర్పించెదరో, వారు యముని (37) చూడకుండగనే స్వర్గమును పొందెదరు. కావున ఈ విధముగా అన్నమును నిత్యము సమర్పించవలెను. చతురస్రాకారమగు మండలమును చేసి గంధము మొదలగు వాటితో దానిని పరిమళభరితము చేయవలెను (38). దానిలో ఈశాన్యమునందు ధన్వంతరికి, తూర్పునందు ఇంద్రునకు, దక్షిణమునందు యమునకు, పశ్చిమమునందు దక్షుడు మరియు ఉమలతో కూడియున్న శివునకు, దక్షిణమునందు (39) పితృదేవతలకు, తూర్పునందు అర్యమ అను దేవతకు, ద్వారదేశమునందు ధాత మరియు విధాతలకు నైవేద్యము నీయవలెను (40). కుక్కలకు, వాటి పాలకులకు, మరియు కాకులకు నేలపై అన్నమును వేయవలెను. దేవతలు, పితరులు, మనుష్యులు, ప్రేతములు, భూతములు, యక్షులు (41), పక్షులు మరియు క్రిమికీటకములు గృహస్థుని ఆశ్రయించి జీవించుచున్నవి. స్వాహాకారము, స్వధాకారము, వషట్కారము (42) మరియు హంతకారము అను నాలుగు ఆహుతీశబ్దములు గోవుయొక్క. నాలుగు స్తనములు. దేవతలు స్వాహాకారము అనే స్తనమును, పితరులు స్వధాకారమును (43), ఇతరదేవతలు మరియు భూతపతులు. వషట్ కారమును, మనుష్యులు హంతకారమును సర్వకాలములయందు త్రాగుచున్నారు (44).

యస్త్వేతాం మానవో ధేనుం శ్రద్ధయా హ్యానుపూర్వికామ్ ।
కరోతి సతతం కాలే సాగ్నిత్వాయోపకల్ప్యతే ॥
యస్తాం జహోతి వా స్వస్థస్తామిస్రే స తు మజ్జతి ।
తస్మాద్దత్త్వా బలిం తేభ్యో ద్వారస్థశ్చింతయేత్ క్షణమ్ ॥
క్షుధార్తమతిథిం సమ్యగేక గ్రామనివాసినమ్ ।
భోజయేత్తం శుభాన్నేన యథాశక్త్యాత్మ భోజనాత్ ॥
అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతి నివర్తతే ।
స తస్మై దుష్కృతం దత్త్వా పుణ్యమాదాయ గచ్ఛతి ॥
తతోఽన్నం ప్రియమేవాశ్నన్నరః శృంఖలవాన్ పునః ।
జిహ్వావేగేన విద్ధోఽత్ర చిరం కాలం స తిష్ఠతి ॥
యతస్తం మాంసముద్ధృత్య తిలమాత్ర ప్రమాణతః ।
ఖాదితుం దీయతే తేషాం భిత్త్వా చైవ తు శోణితమ్ ॥
నిశ్శేషతః కశాభిస్తు పీడ్యతే క్రమశః పునః ।
బుభుక్షయాతికష్టం హి తథా యాతి పిపాసయా ॥
ఏవమాద్యా మహాఘోరా యాతనాః పాపకర్మణామ్ ।
అంతే యత్ప్రతిపన్నం హి తత్సంక్షేపేణ సంశృణు ॥
యః కరోతి మహాపాపం ధర్మం చరతి వై లఘు ।
ధర్మం గురుతరం వాపీ తథావస్థే తయోః శృణు ॥
సుకృతస్య ఫలం నోక్తం గురుపాప ప్రభావతః ।
న మినోతి సుఖం తత్ర భోగైర్బహుభిరన్వితః ॥
తథోద్విగ్నోతిసంతప్తో న భక్ష్యైర్మన్యతే సుఖమ్ ।
అభావాదగ్రతోఽన్నస్య ప్రతికల్పం దినే దినే ॥
పుమాన్యో గురుధర్మాఽపి సోపవాసే యథా గృహే ।
విత్తనాన్న విజానాతి పీడాం నియమసంస్థితః ॥
తాని పాపాని ఘోరాణి సంతి యైశ్చ నరో భువి ।
శతధా భేదమాప్నోతి గిరిర్వజ్రహతో యథా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నరకగతి వర్ణనం నామ
దశమోఽధ్యాయః ॥

పరంపరగా వచ్చుచున్న ఈ గోవును ఏ మానవుడైతే శ్రద్ధగా పాలించునో, అనగా ని◌ిత్యము తన ధర్మమును యథాకాలముగా అనుష్ఠించునో, అట్టి ఆహితాగ్ని అగ్నిలో కమును పొందుటకు అర్హుడగును (45). ఎవడైతే ఆరోగ్యవంతుడై యుండి ఈ ధర్మానుష్ఠానమును పరిత్యజించునో, వాడు తామిస్రము అను నరకములో మగును. కావున, గృహస్థుడు ద్వారము వద్ద నిలబడి ఆహారమును సమర్పించి, క్షణకాలము ధ్యానమును, చేయవలెను (46). ఆకలితో బాధపడుతూ అదే గ్రామములో నున్న అతిథినీ గృహస్థుడు తాను తినే భోజనముతో సమానమైన శుభమగు భోజనమును ఇచ్చి చక్కగా భుజింపజేయవలెను (47). అతిథి ఎవని గృహమునుండి నిరాశతో వెనుకకు మరలునో, వానికి తన పాపమును ఇచ్చి, వాని పుణ్యమును తీసుకొని వెళ్లిపోవును (48). కావున, తాను మాత్రమే రుచ్యమగు అన్నమును భుజించు మానవుడు చిరకాలము నరకములో గొలుసులతో కట్టబడి, నాలుకపై వేగముగా గుచ్చబడిన ఊచ గలవాడై పడియుండును (49). నువ్వు, గింజల పరిమాణములో వానీ శరీరమునందలి మాంసమును ఊడబెరికి వానికి తినుటకై ఇచ్చెదరు. మరియు వాని శరీరమును కోసి రక్తమును తీసి వానికి ఇచ్చెదరు (50). తరువాత క్రమముగా దేహములోని అవయవములను అన్నింటినీ కొరడాలతో కొట్టెదరు. పాపులు అచట, ఆకలి దప్పికలతో చాల క్లేశమును అనుభవించెదరు (51). పాపాత్ములు ఈ విధమైన మహాఘోరమగు యాతనలను అనుభవించెదరు. అంతములో వారికి లభించు దానిని గురించి సంక్షేపముగా వినుము (52). పాపమును అధికముగను, ధర్మమును అల్పముగను, మరియు పాపమును. అల్పముగను ధర్మమును అధిక ముగను ఆచరించు వారిద్దరి అవస్థలను వినుము (53). పాపము అధికమైనప్పుడు పుణ్య ప్రభావము ఉండదు. అట్టి వాడు, బహుదుఃఖములను అనుభవించుటచే ఆ కాలములోని సుఖము లెక్క, లోనికి రాదు (54). ఆతడు మిక్కిలి దుఃఖముతో మరియు ఉద్వేగముతో బాధపడును. ఒకనికి ఒక పూట మంచి ఆహారమును ఇచ్చిననూ, ప్రతి నిత్యము అన్నము లేకపోవుటచే, ఆతడు ఆ ఆహారమును ఆనందముగా భుజించలేడు. అదే విధముగా ప్రతి దినము అధికకష్టములను పడే వానికి చిన్న చిన్న సుఖములు ఆనందమును ఈయజాలవు (55). ధనవంతుడు వ్రతనీయమము కొరకై ఒక రోజు ఉపవాసమును చేసిననూ, దానిలో పెద్ద క్లేశమును పొందడు. అదే విధముగా, అధిక పుణ్యము గల వ్యక్తి చిన్న కష్టమును అనుభవించిననూ, ఆతనికి పెద్ద ఇబ్బంది ఉండదు (56). మానవుని వజ్రముచే కొట్టబడిన పర్వతము వలె వంద ముక్కలుగా చేయగల మహాపాపములు గలవు. ఈ లోకములో వాటిని ఆచరించు వారు అట్టి ఫలమును పొందెదరు (57).

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు నరకయాతనలను వర్ణించే పదవ అధ్యాయము ముగిసినది (10).

11 – అన్నదాన మాహాత్మ్యము

వ్యాస ఉవాచ ।

కృతపాపా నరా యాంతి దుఃఖేన మహతాన్వితాః ।
యమమార్గే సుఖం యైశ్చ తా న్ధర్మాన్ వదమే ప్రభో ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ ప్రభూ! పాపములను చేసిన మానవులు మహాదుఃఖమును అనుభవిస్తూ యముని ి మార్గములో పయనించెదరు. ఏ ధర్మములను చేసినచో సుఖము లభించునో, వాటిని నాకు చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

అవశ్యం హి కృతం కర్మ భోక్తవ్యమ విచారతః ।
శుభాశుభమథో వక్ష్యే తాన్ ధర్మాన్ సుఖదాయకాన్ ॥
అత్ర యే శుభకర్మాణస్సౌమ్యచిత్తా దయాన్వితాః ।
సుఖేన తే నరా యాంతి యమమార్గం భయావహమ్ ॥
యః ప్రదద్యాద్ద్విజేంద్రాణాముపానత్కాష్ఠ పాదుకే ।
స నరోఽ శ్వేన మహతా సుఖం యాతి యమాలయమ్ ॥
ఛత్రదానేన గచ్ఛంతి యథా ఛత్రేణ దేహినః ।
శిబికాయాః ప్రదానేన తద్రథేన సుఖం వ్రజేత్ ॥
శయ్యాసన ప్రదానేన సుఖం యాతి సువిశ్రమమ్ ।
ఆరామచ్ఛాయాకర్తారో మార్గే వా వృక్షరోపకాః ।
వ్రజంతి యమలోకం చ ఆతమేఽతి గతక్లమాః ॥
యాంతి పుష్పకయానేన పుష్పారామకరా నరాః ।
దేవాయతనకర్తారః క్రీడంతి చ గృహోదరే ॥
కర్తారశ్చ తథా యే చ యతీనామాశ్రమస్య చ ।
అనాథమండపానాం తు క్రీడంతి చ గృహోదరే ॥
దేవాగ్నిగురువిప్రాణాం మాతాపిత్రోశ్చ పూజకాః ।
పూజ్యమానా నరా యాంతి కాముకేన యథాసుఖమ్ ॥
ద్యోతయంతో దిశస్సర్వా యాంతి దీపప్రదాయినః ।
ప్రతిశ్రయ ప్రదానేన సుఖం యాంతి నిరామయాః ॥
విశ్రామ్యమాణా గచ్ఛంతి గురుశుశ్రూషకా నరాః ।
ఆతో ద్యవిప్రదాతారస్సుఖం యాంతి స్వకే గృహే ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

మానవుడు తాను చేసిన మంచి-చెడు కర్మల ఫలమును ఆలోచించకుండగా అనుభవించుట తప్పదు. ఇప్పుడు నేను సుఖములనిచ్చే ధర్మములను చెప్పెదను (2). ఈ లోకములో ఏ మానవులైతే సౌమ్యమైన మనస్సు గలవారై దయతో నిండిన వారై శుభకర్మలను చేయుదురో, వారు భయమును గొల్పు యమమార్గమునందు సుఖముగా పయనించేదరు (3). ఏ మానవుడైతే బ్రాహ్మణశ్రేష్ఠులకు చర్మముతో గాని, కర్రతో గాని చేసిన పాదరక్షలను ఇచ్చునో, ఆతడు యమస్థానమునకు గొప్ప గుర్రముపై సుఖముగా వెళ్లును (4). గొడుగును ఇచ్చు మానవులు గొడుగుతో, పల్లకీని ఇచ్చువారు యముని రథముపై సుఖముగా వెళ్లేదరు (5). మంచమును, కుర్చీని ఇచ్చినవారు మధ్యలో విశ్రమిస్తూ సుఖముగా వెళ్లెదరు. సత్రములను, నీడను ఇచ్చు స్థానములను కట్టించువారు, మార్గములో చెట్లను నాటువారు ఎండలోనైననూ క్లేశము లేశమైననూ లేకుండగా యమలోకమునకు వెళ్లెదరు (6). పూదోటలను కట్టించు మానవులు పుష్పకవిమానముపై వెళ్లేదరు. దేవాలయములను, యతులకు ఆశ్రమములను, అనాథులకు నివాసగృహములను కట్టించిన మానవులు మార్గమధ్యములో గృహముల లోపల క్రీడించెదరు (7,8). దేవతలను, అగ్నిని, గురువును, బ్రాహ్మణులను, తల్లిదండ్రులను పూజించు మానవులు సుఖముగా స్వేచ్ఛగా పూజింపబడుచున్నవారై వెళ్లెదరు (9). దీపదానమును చేయువారు దిక్కులను అన్నింటినీ ప్రకాశింప జేయుచున్నవారే, సత్రములను ఆశ్రమములను కట్టించి ఇచ్చువారు సుఖముగా ఆటంకములు లేనివారై వెళ్లేదరు (10). గురువును శుశ్రూష చేయు మానవులు విశ్రమిస్తూ వెళ్లెదరు. బ్రాహ్మణులకు సంగీతసాధనములను ఇచ్చువారు స్వగృహమునకు వలె సుఖముగా వెళ్లేదరు (11).

సర్వకామసమృద్ధేన యథా గచ్ఛంతి గో ప్రదాః ।
అత్ర దత్తాన్నపానాని తాన్యాప్నోతి నరః పథి ॥
పాదశౌచ ప్రదానేన సజలేన పథా వ్రజేత్ ।
పాదాభ్యంగం చ యః కుర్యాదశ్వపృష్ఠేన గచ్ఛతి ॥
పాదశౌచం తథాభ్యంగం దీపమన్నం ప్రతిశ్రయమ్ ।
యో దదాతి సదా వ్యాస నోపసర్పతి తం యమః ॥
హేమరత్న ప్రదానేన యాతి దుర్గాణి విస్తరన్ ।
రౌప్యానడుత్తృగ్దానేన యమలోకం సుఖేన సః ॥
ఇత్యేవమాదిభిర్దానైస్సు ఖం యాంతి యమాలయమ్ ।
స్వర్గే తు వివిధాన్ భోగాన్ ప్రాప్నువంతి సదా నరాః ॥
సర్వేషామేవ దానానామన్నదానం పరం స్మృతమ్ ।
సద్యః ప్రీతికరం హృద్యం బలబుద్ధి వివర్ధనమ్ ॥
నాన్నదానసమం దానం విద్యతే మునిసత్తమ ।
అన్నాద్భవంతి భూతాని తదభావే మ్రియంతి చ ॥
రక్తం మాంసం వసా శుక్రం క్రమాదన్నాత్ప్ర వర్ధతే ।
శుక్రాద్భవంతి భూతాని తస్మాదన్నమయం జగత్ ॥

హేమరత్నాశ్వనాగేంద్రై ర్నారీస్రక్ చందనాదిభిః ।

సమస్తైరపి సంప్రాప్తైర్న రమంతి బుభుక్షితాః ॥

గర్భస్థా జాయమానాశ్చ బాలవృద్ధాశ్చ మధ్యమాః ।

ఆహారమభికాంక్షంతే దేవదానవ రాక్షసాః ॥

గోదానము చేయువారు సకలకామనలతో నిండియున్న మార్గము గుండా వెళ్లెదరు. మానవులు ఈ లోకములో దానము చేసిన అన్నపానములను అచట మార్గములో పొందెదరు (12). కాళ్లను కడుగుకొనే జలమును ఇచ్చిన వారు నీటితో నిండిన మార్గములో వెళ్లెదరు. పాదములకు మర్దనా చేయుటకై నూనెను ఇచ్చువారు గుర్రముపై స్వారీ చేయుచూ వెళ్లెదరు (13). ఓ వ్యాసా! ఎవడైతే కాళ్లను కడిగే నీటిని, వంటికి మర్దనా చేసుకొనుటకై నూనెను, దీపమును, అన్నమును, నివాసగృహములను ఇచ్చునో, వాని సమీపమునకు యముడు వెళ్లడు (14). బంగారమును, రత్నములను దానము చేయువాడు మార్గములోని ఆటంకములను దాటుకొని వెళ్లును. వెండిని, ఎద్దును, మాలను దానము చేయువాడు యమలోకమునకు సుఖముగా వెళ్లును (15). మానవులు ఈ విధమైన దానములను చేసి యమలోకమునకు సుఖముగా వెళ్లెదరు. వారు నిత్యము స్వర్గములోని వివిధ భోగములను పొందెదరు (16). దానములన్నింటిలో అన్నదానము గొప్పది అని మహర్షులచే చెప్పబడినది. అన్నదానము వెనువెంటనే ప్రీతిని, ఉల్లాసమును కలిగించి, బలమును బుద్ధినీ వర్ధిల్లజేయును (17). ఓ మహర్షీ! అన్నదానముతో సమానమైన దానము లేదు. ప్రాణులు అన్నమునుండి పుట్టుచున్నవి. అన్నము లేనిచో, ప్రాణులు మరణించును (18). రక్తము, మాంసము, క్రొవ్వు, మరియు శుక్రము క్రమముగా అన్నము వలన వృద్ధిని జెందును. శుక్రమునుండి ప్రాణులు పుట్టుచున్నవి. కావున ఈ జగత్తు అన్నముపై ఆధారపడి యున్నది (19). ఆకలి గొన్నవారికి బంగారము, రత్నములు, గుర్రములు, గొప్ప ఏనుగులు, యువతులు, పుష్పమాలలు, గంధము మొదలగునవి సకలము లభించిననూ వారు వాటిని అనుభవించ జాలరు (20). గర్భములో నున్న శిశువులు, అప్పుడే పుట్టిన శిశువులు, పిల్లలు, పెద్దలు, మధ్యవయస్కులు, దేవతలు, దానవులు మరియు రాక్షసులు అందరు ఆహారమును కోరుచున్నారు.(21).

క్షుధా నిశ్శేషరోగాణాం వ్యాధిః శ్రేష్ఠతమః స్మృతః ।

స చాన్నౌషధిలేపేన నశ్యతీహ న సంశయః ॥

నాస్తి క్షుధాసమం దుఃఖం నాస్తి రోగః క్షుధాసమః ।

నాస్త్యరోగసమం సౌఖ్యం నాస్తి క్రోధసమో రిపుః ॥

అత ఏవ మహత్పుణ్యమన్నదానే ప్రకీర్తితమ్ ।

తథా క్షుధాగ్నినా తప్తా మ్రియంతే సర్వదేహినః ॥

అన్నదః ప్రాణదః ప్రోక్తః ప్రాణదశ్చాపి సర్వదః ।

తస్మాదన్న ప్రదానేన సర్వదానఫలం లభేత్ ॥

యస్యాన్నపాన పుష్టాంగః కురుతే పుణ్యసంచయమ్ ।

అన్నప్రదాతు స్తస్యార్ధం కర్తుశ్చార్ధం న సంశయః ॥

త్రైలోక్యే యాని రత్నాని భోగస్త్రీ వాహనాని చ ।

అన్నదానప్రదస్సర్వమిహాముత్ర చ తల్లభేత్ ॥

ధర్మార్థకామమోక్షాణాం దేహః పరమసాధనమ్ ।

తస్మాదన్నేన పానేన పాలయేద్దేహమాత్మనః ॥

అన్నమేవ ప్రశంసంతి సర్వమేవ ప్రతిష్ఠితమ్ ।

అన్నేన సదృశం దానం న భూతం న భవిష్యతి ॥

అన్నేన ధార్యతే సర్వం విశ్వం జగదిదం మునే ।

అన్నమూర్జకరం లోకే ప్రాణా హ్యన్నే ప్రతిష్ఠితాః ॥

దాతవ్యం భిక్షవే చాన్నం బ్రాహ్మణాయ మహాత్మనే ।

కుటుంబం పీడయిత్వాపి హ్యాత్మనో భూతిమిచ్ఛతా ॥

ఆకలి రోగములలోకెల్లా పెద్దది అని చెప్పెదరు. అన్నము అనే ఓషధియొక్క్క లేపముచే అది నశించుననుటలో సందేహము లేదు (22). ఆకలితో సమమగు దుఃఖము, రోగము లేవు. ఆరోగ్యముతో సమమైన సౌఖ్యము లేదు. కోపముతో సమమగు శత్రువు లేడు (23). అందువలననే, అన్నదానము మహాపుణ్య ప్రదమని చెప్పెదరు. మరియు సర్వప్రాణులు ఆకలి అనే అగ్నిచే దహింపబడి మరణించును (24), అన్నదానము చేసినవాడు ప్రాణదానమును చేసినవానితో సమానము. ప్రాణములనిచ్చుట యనగా సర్వమును ఇచ్చినట్లే. కావున అన్నమును ఇచ్చినచో, సర్వమును ఇచ్చిన ఫలము లభించును (25). మానవుడు ఎవనిచే ఈయబడిన అన్నమును తిని బలమును పొంది పుణ్యమును చేయునో, ఆ పుణ్యములో సగము చేసిన వానికి, మిగిలిన సగము అన్నదాతకు చెందుననుటలో సందేహము లేదు (26). అన్నదానమును చేయువాడు ముల్లోకములలో ఏ శ్రేష్ఠ వస్తువులు, భోగములు, యువతులు, వాహనములు గలవో, వాటిని ఇహలోకములోనే గాక పరలోకములో. కూడ పొందును (27). ధర్మార్థకామమోక్షములకు దేహము ముఖ్యసాధనము. కావున మానవుడు తన దేహమును అన్నపానములనిచ్చి రక్షించుకొన వలెను (28), అందరు అన్నమునే కొనియాడుచున్నారు. సర్వము అన్నమునందు ఆశ్రయమును కలిగియున్నది. అన్నముతో సమానమైన దానము ఇదివరకు లేదు; ఈ పైన ఉండబోదు (29). ఓ మునీ! ఈ జగత్తులో ప్రాణులన్నియు అన్నము చేతనే నిలబడి యున్నవి. లోకములో బలమును ఇచ్చునది అన్నమే. ప్రాణములు నిలబడేది అన్నముతో మాత్రమే (30). ఆత్మశ్రేయస్సును కోరు మానవుడు తన కుటుంబమును పీడించి యైననూ భిక్షువునకు, బ్రాహ్మణునకు మరియు మహాత్మునకు అన్నమునీయవలెను (31).

విదధాతి నిధి శ్రేష్ఠం యో దద్యాదన్నమర్థినే ।

బ్రాహ్మణాయార్తరూపాయ పారలౌకికమాత్మనః ॥

అర్చయేద్భూతిమన్విచ్ఛన్ కాలే ద్విజముపస్థితమ్ ।

శ్రాంతమధ్వని వృత్త్యర్థం గృహస్థో గృహమాగతమ్ ॥

అన్నదః పూజయే ద్వ్యాస సుశీలస్తు విమత్సరః ।

క్రోధముత్పతితం హిత్వా దివి చేహ మహత్సుఖమ్ ॥

నాభినిందే దధిగతం న ప్రణుద్యాత్కథంచన ।
అపి శ్వపాకే శుని వా నాన్నదానం ప్రణశ్యతి ॥
శ్రాంతాయా దృష్టపూర్వాయ హ్యన్నమధ్వని వర్తతే ।
యో దద్యాదపరిక్లిష్టం స సమృద్ధిమ వాప్నుయాత్ ॥
పితౄన్ దేవాంస్తథా విప్రానతిథీంశ్చ మహామునే ।
యో నరః ప్రీణయత్యన్నైస్తస్య పుణ్యఫలం మహత్ ॥
అన్నం పానం చ శూద్రేఽ పి బ్రాహ్మణే చ విశిష్యతే ।
న పృచ్ఛేద్గోత్ర చరణం స్వాధ్యాయం దేశమేవ చ ॥
భిక్షతో బ్రాహ్మణేనేహ దద్యాదన్నం చ యః పుమాన్ ।
స యాతి పరమం స్వర్గం యావదా భూతసంప్లవమ్ ।
అన్నదస్య చ వృక్షాశ్చ సర్వకామ ఫలాన్వితాః ।
భవంతీహ యథా విప్రా హర్షయుక్తాస్త్రి విష్టపే ॥
అన్నదానేన యే లోకాస్స్వర్గే విరచితా మునే ।
అన్నదాతుర్మహాదివ్యాస్తాన్ శృణుష్వ మహామునే ॥
భవనాని ప్రకాశంతే దివి తేషాం మహాత్మనామ్ ।
నానాసంస్థాన రూపాణి నానాకామాన్వితాని చ ॥
సర్వకామ ఫలాశ్చాపి వృక్షా భవనసంస్థితాః ।
హేమవాప్యశ్శుభాః కూపా దీర్ఘికాశ్చైవ సర్వశః ॥

ఎవడైతే, దుఃఖితుడై నీరసించి అర్థించే బ్రాహ్మణునకు అన్నమును ఇచ్చునో, వాడు తన కొరకై పరలోకములో శ్రేష్ఠమగు నిధిని భద్రము చేసుకున్నవాడే యగును (32). తన శ్రేయస్సును కోరు గృహస్థుడు, జీవిక కొరకై పయనిస్తూ మార్గములో అలిసి సమయమునకు ఇంటికి విచ్చేసిన బ్రాహ్మణుని పూజించవలెను (33). ఓ వ్యాసా! మంచి స్వభావము గలవాడై, మాత్సర్యము లేనివాడై, పైకి ఉబుకుతున్న కోపమును విడిచిపెట్టి అన్నమును ఇచ్చి పూజించు వ్యక్తి ఇహలోకములోనే గాక స్వర్గములో కూడ గొప్ప సుఖమును పొందును (34). ఇంటికి వచ్చిన వానిని నిందించరాదు. ఏ విధముగనైననూ తిరస్కరించరాదు. కుక్కకు గాని, వాటిని పాలించు వానికి గానీ, చేసిన అన్నదానము వ్యర్థము కాదు (35). ఎవడైతే తనకు పరిచితుడు కాకపోయినా మార్గములో అలిసియున్నవానికి మనస్సులో ఇచ్చి వేయుచున్నామనే బెంగ లేకుండగా అన్నమునిచ్చునో, వాడు సమృద్ధిని పొందును (36). ఓ మహర్షీ! ఎవడైతే పితరులను, దేవతలను, బ్రాహ్మణులను మరియు అతిథులను అన్నముచే సంతోషపెట్టునో, వానికి మహాపుణ్యము లభించును (37). అన్నపానములు శూద్రునియందు మరియు బ్రాహ్మణునియందు సమానముగా గొప్ప ఫలమునిచ్చును. ఆకలి గొన్నవానిని వంశము, చదువు, వేదశాఖ మరియు దేశము అనే వివరములను ప్రశ్నించరాదు (38). ఎవడైతే భిక్షను కోరిన బ్రాహ్మణునకు అన్నమునిచ్చునో, వాడు ప్రలయము వచ్చునంతవరకు సర్వోత్కృష్టమగు స్వర్గములో సుఖమును పొందును (39). ఏ విధముగా బ్రాహ్మణులు స్వర్గములో ఉల్లాసముగానుందురో, అదే విధముగా

అన్నదాతకు వృక్షములు ఆతడు కోరే ఫలములను అన్నింటినీ ఇచ్చును (40). ఓ మహర్షీ! అన్నదాతకు ఆ అన్నదానము స్వర్గమునందు ఎటువంటి మహాదివ్యలోకములను నిర్మాణము చేయునో, ఆ వివరములను వినుము (41). స్వర్గములో ఆ మహాత్ముల భవనములు అనేకములగు రచనారూపములు గలవై అన్ని విధముల సౌఖ్యములతో ప్రకాశించును (42). ఆ భవనములను చేరియున్న ఉద్యానములలో వృక్షములు కోరిన ఫలములను అన్నింటినీ ఇచ్చును. బంగరు నూతులు, దిగుడు బావులు, మరియు చెరువులు అన్ని విధములుగా శుభకరముగా నుండును (43).

ఘోషయంతి చ పానాని శుభాన్యథ సహస్రశః ।
భక్ష్యభోజ్య మయాశ్శైలా వాసాంస్యాభరణాని చ ॥
క్షీరం ప్రవంత్యస్సరిత స్తథైవాజ్యస్య పర్వతాః ।
ప్రాసాదాః పాండురాభాసాశ్శయ్యాశ్చ కనకోజ్జ్వలాః ॥
తానన్నదాశ్చ గచ్ఛంతి తస్మాదన్న ప్రదో భవేత్ ।
యదిచ్ఛేదాత్మనో భవ్యమిహ లోకే పరత్ర చ ॥
ఏతే లోకాః పుణ్యకృతామన్నదానాం మహాప్రభాః ।
తస్మాదన్నం విశేషేణ దాతవ్యం మానవైర్ధ్రు వమ్ ॥
అన్నం ప్రజాపతిస్సాక్షాదన్నం విష్ణుస్స్వయం హరః ।
తస్మాదన్నసమం దానం న భూతం న భవిష్యతి ॥
కృత్వాపి సుమహత్పాపం యః పశ్చాదన్నదో భవేత్ ।
విముక్త స్సర్వపాపేభ్య స్స్వర్గలోకం స గచ్ఛతి ॥
అన్నపానాశ్వగోవస్త్రశయ్యాచ్ఛత్రా సనాని చ ।
ప్రేతలోకే ప్రశస్తాని దానాన్యష్టౌ విశేషతః ॥
ఏవం దానవిశేషేణ ధర్మరాజపురం నరః ।
యస్మాద్యాతి విమానేన తస్మాద్దానం సమాచరేత్ ॥
ఏతదాఖ్యానమనఘమన్నదాన ప్రభావతః ।
యః పఠేత్పాఠయేదన్యాన్ స సమృద్ధః ప్రజాయతే ॥
శృణుయాచ్ఛ్రావయేచ్ఛ్రాద్ధే బ్రాహ్మణాన్యో మహామునే ।
అక్షయ్యమన్నదానం చ పిత్రూణాము పతిష్ఠతి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం అన్నదాన మాహాత్మ్య వర్ణనం
నామ ఏకాదశోఽధ్యాయః ॥

సేవకులు వేలాది శుభకరములగు పానీయములను ప్రకటించుచుందురు. తినుబండారములు, వస్త్రములు మరియు ఆభరణములు గుట్టలు గుట్టలుగా నుండును (44). పాలు నదులై ప్రవహించును. నేయి పర్వతముల రూపములో ఉండును. భవనములు తెల్లని కాంతులతో ప్రకాశించును. శయనములు బంగారము వలె ప్రకాశించుచుండును (45). అన్నమును ఇచ్చువారు ఇట్టి లోకములను పొందెదరు. కావున, ఇహపరలోకములలో తనకు శ్రేయస్సును కోరు మానవుడు అన్నదానమును చేయవలెను (46). గొప్పగా ప్రకాశించే ఈ లోకములను అన్నదానమనే పుణ్యమును చేసినవారు పొందెదరు. కావున, మానవులు తప్పనిసరిగా అన్నదానమును విరివిగా చేయవలెను (47). అన్నము సాక్షాత్తు బ్రహ్మ, అన్నము సాక్షాత్తు విష్ణువు. అన్నము స్వయముగా శివుడే. కావున, అన్నదానముతో సమానమగు దానము ఇదివరలో లేదు; ఈ పైన ఉండబోదు (48). మహాపాపమును చేసినవాడైననూ తరువాత అన్నదానమును చేసినచో, సకలపాపములనుండి విముక్తిని పొంది స్వర్గలోకమును పొందును (49). అన్నము, పానము, గుర్రము, గోవు, వస్త్రములు, శయ్య, గొడుగు మరియు ఆసనము అను ఎనిమిది వస్తువులను దానము చేయుట మరణించిన వారి లోకములో చాల ప్రశస్తముగా పరిగణించబడును (50). ఈ విధమైన ప్రశస్తదానములను చేయు మానవుడు యమనగరమునకు విమానముపై వేళును. కావున, మానవుడు దానములను చేయవలెను (51). అన్నదానముయొక్క మహిమను వర్ణించే ఈ ప్రకరణమును ఎవడు పఠించునో, మరియు పఠింపజేయునో, వాడు సంపదలను పొందును (52). ఓ మహర్షీ! ఎవడైతే ఈ ఆఖ్యానమును శ్రాద్ధకాలములో వినునో, మరియు బ్రాహ్మణులకు వినిపించునో, వాడు చేయు ఆ అన్నదానము పితృదేవతలకు అక్షయఫలమునిచ్చును (53).

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు అన్నదానమాహాత్మ్య వర్ణనము అనే పదకొండవ అధ్యాయము ముగిసినది (11).

12 – తపస్సు యొక్క మహిమ

సనత్కుమార ఉవాచ ।

పానీయదానం పరమం దానానాముత్తమం సదా ।
సర్వేషాం జీవపుంజానాం తర్పణం జీవనం స్మృతమ్ ॥
ప్రపాదానమతః కుర్యాత్సుస్నేహాద నివారితమ్ ।
జలాశ్రయ వినిర్మాణం మహానందకరం భవేత్ ॥
ఇహ లోకే పరే వాపి సత్యం సత్యం న సంశయః ।
తస్మాద్వాపీశ్చ కూపాంశ్చ తడాగాన్ కారయేన్నరః ॥
అర్ధం పాపస్య హరతి పురుషస్య వికర్మణః ।
కూపః ప్రవృత్తపానీయస్సు ప్రవృత్తస్య నిత్యశః ॥
సర్వం తారయతే వంశం యస్య ఖాతే జలాశయే ।
గావః పిబంతి విప్రాశ్చ సాధవశ్చ నరాస్సదా ॥
నిదాఘకాలే పానీయం యస్య తిష్ఠత్యవారితమ్ ।
సుదుర్గం విషమం కృచ్ఛ్రం న కదాచిదవాప్యతే ॥
తడాగానాం చ వక్ష్యామి కృతానాం యే గుణాః స్మృతాః ।
త్రిషు లోకేషు సర్వత్ర పూజితో యస్తడాగవాన్ ॥
అథవా మిత్రసదనే మైత్రం మిత్రార్థివర్జితమ్ ।
కీర్తిసంజననం శ్రేష్ఠం తడాగానాం నివేశనమ్ ॥
ధర్మస్యార్థస్య కామస్య ఫలమాహుర్మనీషిణః ।
తడాగం సుకృతే యేన తస్య పుణ్యమనంతకమ్ ॥
చతుర్విధానాం భూతానాం తడాగః పరమాశ్రయః ।
తడాగాదీని సర్వాణి దిశంతి శ్రియముత్తమామ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

సర్వకాలములలో నీటిని దానము చేయుట దానములలో ఉత్తమదానము. సర్వప్రాణిసమూ ూహములకు దప్పికను తీర్చుటచే నీటికి జీవనము అను పేరు వచ్చినది (1). కావున, మానవుడు వెనుకకు తగ్గకుండగా అతిశయించిన ప్రేమతో చలివేంద్రమును ఏర్పాటు చేయవలెను. జలాశయములను నిర్మించుట వలన మానవుడు ఇహలోకములో మాత్రమే గాక, పరలోకములో కూడ మహానందమును పొందగలడు. ఇది ముమ్మాటికీ నిజము. సందేహము లేదు. కావున, మానవుడు దిగుడు బావులను, నూతులను, మరియు చెరువులను నిర్మించవలెను (2,3). ఎవనిచే నిర్మించబడిన నూయి నిత్యము జనులకు నీటిని పుష్కలముగా సరఫరా చేయునో, అట్టివాడు చేసిన పాపములలో సగము పాపమును ఆ నూయి తొలగించును (4). ఎవనిచే నిర్మించబడిన చెరువులో గోవులు, బ్రాహ్మణులు, సాధువులు మరియు ఇతరమానవులు నిత్యము నీటిని త్రాగెదరో, వాని వంశము అంతయు తరించును (5). ఎవడైతే వేసవి కాలములో

కాదనకుండగా నీటిని సరఫరా చేయునో, వానికి గట్టెక్కుటకు శక్యము కాని కష్టములు ఎన్నటికీ రావు (6). చెరువులను నిర్మించుటలో గల గుణములను చెప్పెదను. చెరువును నిర్మించిన వాడు ముల్లోకములలో సర్వకాలములలో పూజించబడును (7). చెరువులను నిర్మించిన వాడు గొప్ప కీర్తిని పొందుటయే గాక, ఆదిత్యలోకములో సూర్యుని తాపము లేకుండగా, స్నేహభావముతో నివసించును (8). చెరువు ధర్మార్థకామములనే మూడు పురుషార్థముల ఫలస్వరూపమని విద్వాంసులు చెప్పెదరు. చెరువును నిర్మించు వ్యక్తియొక్క పుణ్యము అనంతము (9), జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జములనే నాలుగు రకముల ప్రాణులకు చెరువు గొప్ప జలాధారము అగుచున్నది. కావున, చెరువును నిర్మించుట మొదలగు పుణ్యకార్యములు ఉత్తమమగు సంపదను కలిగించును (10).

దేవా మనుష్యా గంధర్వాః పితరో నాగరాక్షసాః ।
స్థావరాణి చ భూతాని సంశ్రయంతి జలాశయమ్ ॥
ప్రావృడృతౌ తడాగే తు సలిలం యస్య తిష్ఠతి ।
అగ్నిహోత్రఫలం తస్య భవతీత్యాహ చాత్మభూః ॥
శరత్కాలే తు సలిలం తడాగే యస్య తిష్ఠతి ।
గోసహస్రఫలం తస్య భవేన్నైవాత్ర సంశయః ॥
హేమంతే శిశిరే చైవ సలిలం యస్య తిష్ఠతి ।
స వై బహుసువర్ణస్య యజ్ఞస్య లభతే ఫలమ్ ॥
వసంతే చ తథా గ్రీష్మే సలిలం యస్య తిష్ఠతి ।
అతిరాత్రాశ్వ మేధానాం ఫలమాహుర్మనీషిణః ॥
మునే వ్యాసాథ వృక్షాణాం రోపణే చ గుణాన్ శృణు ।
ప్రోక్తం జలాశయఫలం జీవ ప్రీణనముత్తమమ్ ॥
అతీతానాగతాన్ సర్వాన్ పితృవంశాంస్తు తారయేత్ ।
కాంతారే వృక్షరోపీ యస్తస్మాద్వృక్షాంస్తు రోపయేత్ ॥
తత్ర పుత్రా భవంత్యేతే పాదపా నాత్ర సంశయః ।
పరం లోకం గతస్సోఽ పి లో కానాప్నోతి చౌక్షయాన్ ॥
పుష్పైసురగణాన్ సర్వాన్ ఫలైశ్చాపి తథా పితౄన్ ।
ఛాయయా చాతిథీన్ సర్వాన్ పూజయంతి మహీరుహాః ॥
కిన్నరో రగరక్షాంసి దేవగంధర్వమానవాః ।
తథైవర్షిగణాశ్చైవ సంశ్రయంతి మహీరుహాన్ ॥

దేవతలు, మనుష్యులు, గంధర్వులు, పితృదేవతలు, నాగులు, రాక్షసులు, చెట్టుచేమలు మరియు సర్వప్రాణులు చెరువును ఆశ్రయించుకొని జీవించును (11). ఎవడు నిర్మించిన చెరువులో వర్షాకాలము నీరు ఉండునో, వానికి అగ్నిహోత్రకర్మను చేసిన ఫలము లభించునని బ్రహ్మ చెప్పెను (12). ఎవని చెరువులో శరత్కాలమునందు నీరు ఉండునో, వానికి వేయి గోదానముల ఫలము లభించుననుటలో సందేహము లేదు (13). ఎవని చెరువులో హేమంత,

శిశిరములనే ఋతువులలో నీరు ఉండునో, వానికి అధికమగు ధనమును దక్షిణలు ఇచ్చి చేసిన యజ్ఞము వలన లభించే ఫలము లభించును (14). ఎవని చెరువులో వసంత, గ్రీష్మములనే ఋతువులలో నీరు ఉండునో, వానికి అతిరాత్ర-అశ్వమేధములనే క్రతువులు చేసిన ఫలము లభించుననీ విద్వాంసులు చెప్పుచున్నారు (15). ఓ వ్యాసమహర్షీ! ప్రాణులకు తృప్తిని కలిగించే చెరువులను త్రవ్వించుట వలన కలిగే ఫలమును చెప్పితిని. ఇప్పుడు చెట్లను నాటుట వలన కలిగే ఫలమును వినుము (16). ఎవడైతే అడవిలో చెట్లను నాటునో, వానియొక్క గడచిన పితరుల వంశములు మాత్రమే గాక, రాబోయే పితరుల వంశములు కూడ తరించును. కావున, చెట్లను నాటవలెను (17). ఈ చెట్లు వానికి పుత్రసంతానముతో సమానమగు ప్రేమకు పాత్రమగుననుటలో సందేహము లేదు. వాడు మరణించిన తరువాత కూడ, వినాశము లేని పుణ్యలోకములను పొందును (18). చెట్లు తమ పూవులతో సర్వదేవతాగణములను, ఫలములతో పితరులను, నీడతో అతిథులను అందరినీ పూజించును (19). కిన్నరులు, నాగులు, రాక్షసులు, దేవతలు, గంధర్వులు, మానవులు మరియు ఋషుల సముదాయములు కూడ చెట్లను ఆశ్రయించెదరు (20).

పుష్పితాః ఫలవంతశ్చ తర్పయంతీహ మానవాన్ ।
ఇహ లోకే పరే చైవ పుత్రాస్తే ధర్మతః స్మృతాః ॥
తడాగకృద్వృక్షరోపీ చేష్టయజ్ఞశ్చ యో ద్విజః ।
ఏతే స్వర్గాన్న హీయంతే యే చాన్యే సత్యవాదినః ॥
సత్యమేవ పరం బ్రహ్మ సత్యమేవ పరం తపః ।
సత్యమేవ పరో యజ్ఞస్సత్యమేవ పరం శ్రుతమ్ ॥
సత్యం సుప్తేషు జాగర్తి సత్యం చ పరమం పదమ్ ।
సత్యేనైవ ధృతా పృథ్వీ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥
తతో యజ్ఞశ్చ పుణ్యం చ దేవర్షి పితృపూజనే ।
ఆపో విద్యా చ తే సర్వే సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ ॥
సత్యం యజ్ఞస్తపో దానం మంత్రా దేవీ సరస్వతీ ।
బ్రహ్మచర్యం తథా సత్యమోంకారస్సత్యమేవ చ ॥
సత్యేన వాయురభ్యేతి సత్యేన తపతే రవిః ।
సత్యేనాగ్నిర్నిర్దహతి స్వర్గస్సత్యేన తిష్ఠతి ॥
పాలనం సర్వవేదానాం సర్వతీర్థావ గాహనమ్ ।
సత్యేన వహతే లోకే సర్వమాప్నోత్య సంశయమ్ ॥
అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయా ధృతమ్ ।
లక్షాణి క్రతవశ్చైవ సత్యమేవ విశిష్యతే ॥
సత్యేన దేవాః పితరో మానవోరగ రాక్షసాః ।
ప్రీయంతే సత్యతస్సర్వే లోకాశ్చ సచరాచరాః ॥

వృక్షములు పుష్పించి ఫలించి ఇహ లోకములో మానవులకు తృప్తిని ఇచ్చుచు ున్నవి. కావున, చెట్లు మానవులకు ఇహపరలోకములలో సుఖమునిచ్చే పుత్రులతో సమానమని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి (21), చెరువులను త్రవ్వించినవాడు, చెట్లను పాతినవాడు, యజ్ఞమును - చేసిన బ్రాహ్మణుడు మరియు సత్యమును పలుకువారు స్వర్గమును కోల్పోయే ప్రసక్తి లేదు (22), సత్యమే పరంబ్రహ్మ, సత్యమే గొప్ప తపస్సు. సత్యమే శ్రేష్ఠమగు యజ్ఞము. సత్యమే గొప్ప పాండిత్యము (23). మానవులు నిద్రించుచున్ననూ, సత్యము మేల్కొని యుండును. సత్యమే పరమపదము. సత్యమే భూమిని ధరించి యున్నది. సర్వము సత్యమునందు స్థితిని కలిగియున్నది (24). యజ్ఞము, పుణ్యము, దేవపూజ, పితృపూజ, ఋషిపూజ, జలములు, విద్య అనే ఈ సర్వము సత్యమునందు నిలకడగా నున్నవి (25). సత్యమే యజ్ఞము. సత్యమే తపస్సు. సత్యమే దానము. సత్యమే మంత్రములు. సత్యమే సరస్వతీ దేవి. సత్యమే బ్రహ్మచర్యము మరియు ఓంకారము కూడ సత్యమే (26). సత్యము చేతనే వాయువు వీచుచున్నది. సత్యము చేతనే సూర్యుడు ప్రకాశించుచున్నాడు. సత్యము చేతనే అగ్ని కాల్చుచున్నది. స్వర్గము సత్యము చేతనే నిలబడి యున్నది (27). లోకములో మానవులు సత్యమును పాలించి, సర్వవేదముల ఆదేశములను పాలించిన ఫలమును మరియు సర్వతీర్థములలో స్నానము చేసిన ఫలమును కూడ పొందెదరనుటలో సంశయము లేదు (28). వేయి అశ్వమేధములు, లక్ష క్రతువులు ఒక వైపు, సత్యము ఒక వైపు ఉండగా తూచినచో, సత్యమే బరువైనదని తేలినది (29). సత్యముచే దేవతలు, పితృదేవతలు, మానవులు, నాగులు, రాక్షసులు మరియు సర్వలోకములలోని స్థావరజంగమాత్మకమగు సర్వప్రాణులు ప్రీతిని పొందును (30).

సత్యమాహుః పరం ధర్మం సత్యమాహుః పరం పదమ్ ।

సత్యమాహుః పరం బ్రహ్మ తస్మాత్సత్యం సదా వదేత్ ॥

మునయస్సత్యనిరతాస్తపస్తప్త్వా సుదుశ్చరమ్ ।

సత్య ధర్మరతాస్సిద్ధాస్తతస్స్వర్గం చ తే గతాః ॥

అప్సరో గణసంవిష్టైర్విమానైః పరిమాతృభిః ।

వక్తవ్యం చ సదా సత్యం న సత్యాద్విద్యతే పరమ్ ॥

అగాధే విపులే సిద్ధే సత్యతీర్థే శుచిహ్రదే ।

స్నాతవ్యం మనసా యుక్తం స్థానం తత్పరమం స్మృతమ్ ॥

ఆత్మార్థేవా పరార్థే వా పుత్రార్థే వాపి మానవాః ।

అనృతం యే న భాషంతే తే నరాస్స్వర్గ గామినః ॥

వేదా యజ్ఞాస్తథా మంత్రాస్సంతి విప్రేషు నిత్యశః ।

నో భాంత్యపి హ్యసత్యేషు తస్మాత్సత్యం సమాచరేత్ ॥

పరమధర్మము సత్యమే. పరమపదము సత్యమే. పరం బ్రహ్మ సత్యమే. కావున, సర్వకా ాలములలో సత్యమును పలుకవలెను (31). సత్యమునందు నిష్ఠ గల మునులు మరియు సత్యమనే ధర్మమునందు రుచి గల సిద్ధులు మిక్కిలి కఠినమైన తపస్సును చేసి ఆ సత్యము యొక్క ప్రభావముచే, పరిచర్యలను చేయు

అప్సరసలతో కూడియున్న విమానములనెక్కి స్వర్గమును పొందిరి. కావున, మానవుడు సర్వదా సత్యమును పలుకవలెను. సత్యముకంటె గొప్పది లేదు (32,33). లోతైనది, విస్తారమైనది, సిద్ధిని ఇచ్చునది మరియు శుచియైనది అగు సత్యమనే తీర్థమునందు మనస్సును నిలిపి స్నానమును చేయవలెను. సత్యమే గొప్ప స్థానమని చెప్పబడినది (34). ఏ మానవులైతే తమ కొరకు గాని ఇతరుల కొరకు గాని పుత్రుని కొరకైననూ గాని, అసత్యమును పలుకరో, వారు స్వర్గమును పొందెదరు (35). బ్రాహ్మణులయందు వేదములు, యజ్ఞములు, మంత్రములు నిత్యము ఉన్ననూ, అసత్యము ఉన్నచో, అవి ప్రకాశించవు. కావున, సత్యమును వ్రతముగా స్వీకరించవలెను (36).

వ్యాస ఉవాచ ।

తపసో మే ఫలం బ్రూహి పునరేవ విశేషతః।
సర్వేషాం చైవ వర్ణానాం బ్రాహ్మణానాం తపోధన ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

తపస్సే ధనముగా గలవాడా ! బ్రాహ్మణులకు మరియు సర్వవర్ణముల వారికి తపస్సు యొక్క ఫలమును గూర్చి మరల విశేషముగా చెప్పుము (37).

సనత్కుమార ఉవాచ ।

ప్రవక్ష్యామి తపోఽధ్యాయం సర్వం కామార్థసాధకమ్ ।
సుదుశ్చరం ద్విజాతీనాం తన్మే నిగదతః శృణు ॥
తపో హి పరమం ప్రోక్తం తపసా విద్యతే ఫలమ్ ।
తపోరతా హి యే నిత్యం మోదంతే సహ దైవతైః ॥
తపసా ప్రాప్యతే స్వర్గస్తపసా ప్రాప్యతే యశః ।
తపసా ప్రాప్యతే కామస్తపస్సర్వార్థ సాధనమ్ ॥

తపసా మోక్షమాప్నోతి తపసా విందతే మహత్ ।
జ్ఞానవిజ్ఞాన సంపత్తిస్సౌభాగ్యం రూపమేవ చ ॥
నానావిధాని వస్తూని తపసా లభతే నరః।
తపసా లభతే సర్వం మనసా యద్యదిచ్ఛతి ॥
నాతప్తతపసో యాంతి బ్రహ్మలోకం కదాచన ।
నాతప్తతపసాం ప్రాప్యశ్శంకరః పరమేశ్వరః ॥
యత్కార్యం కించిదాస్థాయ పురుషస్తపతే తపః।
తత్సర్వం సమవాప్నోతి పరత్రేహ చ మానవః ॥
సురాపః పారదారీ చ బ్రహ్మహా గురుతల్పగః ।
తపసా తరతే సర్వం సర్వతశ్చ విముంచతి ॥
అపి సర్వేశ్వరః స్థాణుర్విష్ణుశ్చైవ సనాతనః ।
బ్రహ్మా హుతాశనశ్శక్రో యే చాన్యే తపసాన్వితాః ॥
అష్టాశీతీ సహస్రాణి మునీనామూర్ధ్వరేతసామ్ ।
తపసా దివి మోదంతే సమేతా దైవతైస్సహ ॥
తపసా లభ్యతే రాజ్యం స చ శక్రస్సురేశ్వరః ।
తపసాఽపాలయత్సర్వ మహన్యహని వృత్రహా ॥
సూర్యచంద్రమసౌ దేవౌ సర్వలోకహితే రతౌ ।
తపసైవ ప్రకాశంతే నక్షత్రాణి గ్రహాస్తథా ॥
న చాస్తి తత్సుఖం లోకే యద్వినా తపసా కిల ।
తపసైవ సుఖం సర్వమితి వేదవిదో విదుః ॥
జ్ఞానం విజ్ఞానమారోగ్యం రూపవత్త్వం తథైవ చ ।
సౌభాగ్యం చైవ తపసా ప్రాప్యతే సర్వదా సుఖమ్ ॥
తపసా సృజ్యతే విశ్వం బ్రహ్మా విశ్వం వినా శ్రమమ్ ।
పాతి విష్ణుర్హరోఽ ప్యత్తి ధత్తే శేషోఽ ఖిలాం మహీమ్ ॥
విశ్వామిత్రో గాధిసుతస్తపసైవ మహామునే ।
క్షత్రియోఽ థాభవద్విప్రః ప్రసిద్ధం త్రిభవే త్విదమ్ ॥
ఇత్యుక్తం తే మహాప్రాజ్ఞ తపోమాహాత్మ్యముత్తమమ్ ।
శృణ్వధ్యయనమాహాత్మ్యం తపసోఽధిక ముత్తమమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం తపోమాహాత్మ్యవర్ణనం నామ
ద్వాదశోఽధ్యాయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

తపస్సు వలన కోరికలు అన్నియు ఈడేరును. బ్రాహ్మణులకైననూ చేయుటకు కఠినమైన ఆ తపస్సును గూర్చి చెప్పెదను. నేను చెప్పే ఈ అధ్యాయమును వినుము (38). తపస్సు చాల గొప్పది. తపస్సు ఫలమునిచ్చును. నిత్యము తపస్సును చేసినవారు దేవతలతో గూడి ఆనందించుచున్నారు (39). తపస్సుచే స్వర్గము లభించును. తపస్సుచే కీర్తి లభించును. తపస్సుచే కోరికలు తీరును. సర్వప్రయోజనములను సిద్ధింపజేయు సాధనము తపస్సే (40). మానవుడు తపస్సుచే మోక్షమును పొందును. తపస్సుచే గొప్ప విషయములు లభించును. పారమార్థికజ్ఞానము, లౌకికజ్ఞానము, సంపద, మంచి భాగ్యము మరియు సౌందర్యములను తపస్సుచే పొందవచ్చును (41). మానవుడు వివిధములైన వస్తువులను తపస్సుచే పొందగలడు. మానవుడు తన మనస్సులో కోరే సర్వమును తపస్సుచే పొందును (42). తపస్సును చేయని వారు ఎన్నటికీ బ్రహ్మలోకమునకు వెళ్లజాలరు. తపస్సును చేయనివారు మంగళకరుడగు పరమేశ్వరుని పొందలేరు (43). మానవుడు ఇహపరలోకములలో ఏ ప్రయోజనమును అపేక్షించి తపస్సును చేయునో, ఆ సర్వమును పొందును (44). మద్యపానము చేయువాడు, పరభార్యతో రమించువాడు, బ్రహ్మహత్యను చేసినవాడు, మరియు గురుభార్యాగమనము చేయువాడు తపస్సుచే సర్వపాపములను అతిక్రమించి వాటినుండి విముక్తిని పొందెదరు (45). సర్వేశ్వరుడగు శివుడు, సనాతనుడగు విష్ణువు, బ్రహ్మ, అగ్ని, ఇంద్రుడు మొదలగు వారు తపస్సును చేసినవారే (46). అస్ఖలిత బ్రహ్మచారులగు ఎనభై ఎనిమిది వేల మునులు తపస్సు యొక్క ప్రభావముచే స్వర్గములో దేవతలతో గూడి ఆనందమును అనుభవించుచున్నారు (47). తపస్సుచే రాజ్యము లభించును. దేవతలకు ప్రభువు, వృత్రాసురుని సంహరించినవాడు అగు ఆ ఇంద్రుడు తపఃప్రభావముచే ప్రతిదినము సర్వమును పాలించుచున్నాడు (48). ప్రకాశమునిచ్చి సర్వలోకములకు హితమును చేకూర్చు సూర్యచంద్రులు, నక్షత్రములు మరియు గ్రహములు తపస్సుచేతనే ప్రకాశించుచున్నవి (49). తపస్సు లేకుండగా లభించే సుఖము లోకములో లేదు. తపస్సు చేతనే సర్వసుఖము లభించుననీ వేదవేత్తలు చెప్పుచున్నారు (50). పారమార్థికజ్ఞానము, లౌకికవిజ్ఞానము, ఆరోగ్యము, సౌందర్యము, సౌభాగ్యము, మరియు నిత్యసుఖము అనునవి తపస్సుచే మాత్రమే పొందబడును (51). తపఃప్రభావముచే శ్రమ లేకుండగనే బ్రహ్మ బ్రహ్మాండమును సృష్టించుచున్నాడు; విష్ణువు పాలించుచున్నాడు ; శివుడు ఉపసంహరించుచున్నాడు; శేషుడు సకలభూమండలమును మోయుచున్నాడు (52). ఓ మహర్షీ ! గాధికుమారుడు, క్షత్రియుడు అగు విశ్వామిత్రుడు తపస్సు చేతనే బ్రాహ్మణుడైనాడు. ఈ విషయము ముల్లోకములలో ప్రసిద్ధిని గాంచినది (53). ఓ మహాబుద్ధిశాలీ ! తపస్సు యొక్క మహిమను నీకు ఈ విధముగా చెప్పితిని. తపస్సు కంటే అధ్యయనము ఇంకనూ ఉత్తమమైనది. దాని మహిమను వినుము (54).

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు తపస్సు యొక్క మహిమను వర్ణించే పన్నెండవ అధ్యాయము ముగిసినది (12).

13 – పురాణ మహిమ

సనత్కుమార ఉవాచ ।

తపస్తపతి యోఽ రణ్యే వన్యమూల ఫలాశనః ।
యోఽధీతే ఋచమేకాం హి ఫలం స్యాత్తత్సమం మునే ॥
శ్రుతేరధ్యయనాత్పుణ్యం యదాప్నోతి ద్విజోత్తమః ।
తదధ్యాపనతశ్చాపి ద్విగుణం ఫలమశ్నుతే ॥
జగద్యథా నిరాలోకం జాయతేఽ శశిభాస్కరమ్ ।
వినా తథా పురాణం హ్యధ్యేయమస్మాన్మునే సదా ॥
తప్యమానం సదాజ్ఞానాన్నిరయే యోఽపి శాస్త్రతః ।
సంబోధయతి లోకం తం తస్మాత్పూజ్యః పురాణగః ॥
సర్వేషాం చైవ పాత్రాణాం మధ్యే శ్రేష్ఠః పురాణవిత్ ।
పతనాత్త్రాయతే యస్మాత్తస్మాత్పాత్రముదాహృతమ్ ॥
మర్త్యబుద్ధిర్న కర్తవ్యా పురాణజ్ఞే కదాచన ।
పురాణజ్ఞస్సర్వవేత్తా బ్రహ్మా విష్ణుర్హరో గురుః ॥
ధనం ధాన్యం హిరణ్యం చ వాసాంసి వివిధాని చ ।
దేయం పురాణవిజ్ఞాయ పరత్రేహ చ శర్మణే ॥
యో దదాతి మహాప్రీత్యా పురాణజ్ఞాయ సజ్జనః ।
పాత్రాయ శుభవస్తూని స యాతి పరమాం గతిమ్ ॥
మహీం గాం వా స్యందనాంశ్చ గజానశ్వాంశ్చ శోభనాన్ ।
యః ప్రయచ్ఛతి పాత్రాయ తస్య పుణ్యఫలం శృణు ॥
అక్షయాన్ సర్వకామాంశ్చ పరత్రేహ చ జన్మని ।
అశ్వమేధమఖస్యాపి స ఫలం లభతే పుమాన్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను-

ఓ మహర్షీ ! ఎవడు అరణ్యములో కందమూలఫలములను భక్షిస్తూ తపస్సును చేయునో, ఎవడు ఒక ఋక్కు (వేదమంత్రము) ను పఠించునో, వారిద్దరి ఫలము సమానము (1). బ్రాహ్మణోత్తముడు వేదాధ్యయనముచే ఎట్టి ఫలమును పొందునో, అంతకు రెట్టింపు ఫలమును వేదమును బోధించి పొందును (2). ఓ మునీ! సూర్యచంద్రులు లేనిచో జగత్తు అంధకారమగును. పురాణములు లేనిచో, అదే విధముగా అగును. కావున, వాటిని సర్వదా అధ్యయనము చేయవలెను (3). అజ్ఞానముచే సర్వకాలములలో నరకమువంటి సంసారములో తాపమును పొందుచున్న మానవునకు పురాణవేత్త శాస్త్రమును బోధించును. కావున, పురాణజ్ఞుని పూజించవలేను (4), దానమునిచ్చుటకు యోగ్యులగు వ్యక్తులు (పాత్రులు) అందరిలో పురాణవేత్త శ్రేషుడు. పతనము (అధోగతి) నుండి రక్షించువాడు పాత్రుడు అనబడును (5). పురాణవేత్త సాధారణ మానవుడు అని ఎన్నటికీ తలంచరాదు. పురాణవేత్త సర్వమును తెలిసినవాడు,

బ్రహ్మవిష్ణుమహేశ్వరస్వరూపుడు మరియు గురువు (6). ఇహపరలోకములలో సుఖమును గోరు మానవుడు పురాణవేత్తకు ధనధాన్యములను, బంగారమును, వివిధములగు వస్త్రములను ఈయవలెను (7). ఏ సత్పురుషుడు పాత్రుడగు పురాణజ్ఞునకు గొప్ప ప్రీతితో శుభవస్తువులను దానమునిచ్చునో, వాడు పరమగతిని పొందును (8). ఎవడైతే పాత్రుడగు వ్యక్తికి భూమి, గోవు, వాహనములు, ఏనుగులు మరియు అందమైన గుర్రములు అను వాటిని దానము చేయునో, వాని పుణ్యఫలమును వినుము (9). అట్టి మానవుడు ఈ జన్మయందు మాత్రమే గాక, పరలోకములో కూడ అక్షయఫలమును పొందును. ఆతని కోరికలు అన్నియు తీరును. ఆతడు అశ్వమేధయజ్ఞముయొక్క ఫలమును కూడ పొందును (10).

మహీం దదాతి యస్తస్మై కృష్టాం ఫలవతీం శుభమ్ ।
స తారయతి వై వంశ్యాన్ దశ పూర్వాన్ దశాపరాన్ ॥
ఇహ భుక్త్వాఖిలాన్ కామానంతే దివ్యశరీరవాన్ ।
విమానేన చ దివ్యేన శివలోకం స గచ్ఛతి ॥
న యజ్ఞైస్తుష్టిమాయాంతి దేవాః ప్రోక్షణకైరపి ।
బలిభిః పుష్పపూజాభిర్యథా పుస్తకవాచనైః ॥
శంభో రాయతనే యస్తు కారయేద్ధర్మ పుస్తకమ్ ।
విష్ణోరర్కస్య కస్యాపి శృణు తస్యాపి తత్ఫలమ్ ॥
రాజసూయాశ్వమేధానాం ఫలమాప్నోతి మానవః ।
సూర్యలోకం చ భిత్త్వాశు బ్రహ్మలోకం స గచ్ఛతి ॥
స్థిత్వా కల్పశతాన్య త్ర రాజా భవతి భూతలే ।
భుంక్తే నిష్కంటకం భోగాన్నా త్ర కార్యా విచారణా ॥
అశ్వమేధసహస్రస్య యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం సమవాప్నోతి దేవాగ్రే యో జపం చరేత్ ॥
ఇతిహాసపురాణాభ్యాం శంభో రాయతనే శుభే ।
నాన్య త్ప్రీతికరం శంభోస్తథాన్యేషాం దివౌకసామ్ ॥ ।
తస్మాత్సర్వ ప్రయత్నేన కార్యం పుస్తకవాచనమ్ ।
తథాస్య శ్రవణం ప్రేమ్ణా సర్వకామ ఫలప్రదమ్ ॥
పురాణశ్రవణాచ్ఛంభోర్నిష్పాపో జాయతే నరః ।
భుక్త్వా భోగాన్ సువిపులాన్ శివలోకమవాప్నుయాత్ ॥

ఎవడైతే పురాణజ్ఞునకు దున్ని పంటతో నున్న మంచి భూమిని ఇచ్చునో, వాడు తన వంశములో పది ముందు తరములను మరియు పది తరువాతి తరములను తరింపజేయును (11). ఆతడు ఇహలోకములో సకలభోగములననుభవించి మరణించిన తరువాత దివ్యమగు శరీరమును దాల్చి దివ్యమగు విమానముపై శివలోకమునకు వెళ్లును (12), పురాణప్రవచనములచే దేవతలు ఏ విధముగా సంతోషించెదరో, ఆ తీరున పశు యాగములచే గాని,

నైవేద్యములచే గాని, పుష్పములతో చేయు పూజలచే గాని సంతోషించరు (13). ఎవడైతే శివుని ఆలయములో గానీ, విష్ణ్వాలయములో గానీ, లేదా ఇతరదేవతల ఆలయములలో గాని ధర్మపుస్తకముయొక్క ప్రవచనము చేయించునో, వానికి లభించే పుణ్యఫలమును గురించి వినుము (14). అట్టి మానవుడు రాజసూయ-అశ్వమేధముల ఫలమును పొంది సూర్యమండలమును భేదించుకొని బ్రహ్మలోకమును పొందును (15). ఆతడు అచట వంద కల్పములు ఉండి భూమిపై రాజుగా జన్మించి ఆటంకములు లేని భోగములను అనుభవించును. ఈ విషయములో సంశయము లేదు (16). ఎవడైతే పరమేశ్వరుని సన్నిధిలో జపమును చేయునో, వాడు వేయి అశ్వమేధయాగముల ఫలమును పొందును (17). శివునకు మరియు ఇతర దేవతలకు శుభకరమగు శివాలయములో ఇతిహాసపురాణముల ప్రవచనముల కంటే ప్రియమైనది మరియొకటి లేదు (18). కావున, పూర్ణప్రయత్నమును చేసి పురాణ ప్రవచనమును చేయవలెను. దానిని ప్రేమతో, వినువారికి కామనలన్నియు సిద్ధించును (19). శివపురాణమును శ్రవణము చేయు మానవుడు పాపవిముక్తుడై విస్తారమగు భోగమునసనుభవించి శివలోకమును పొందును (20).

రాజసూయేన యత్పుణ్యమగ్నిష్టోమశతేన చ ।
తత్పుణ్యం లభతే శంభోః కథా శ్రవణమాత్రతః ॥
సర్వతీర్థావ గాహేన గవాం కోటిప్రదానతః ।
తత్ ఫలం లభతే శంభోః కథాశ్రవణతో మునే ॥
యే శృణ్వంతి కథాం శంభోస్సదా భువనపావనీమ్ ।
తే మనుష్యా న మంతవ్యా రుద్రా ఏవ న సంశయః ॥
శృణ్వతాం శివసత్కీర్తిం సతాం కీర్తయతాం చ తామ్ ।
పదాంబుజరజాంస్యేవ తీర్థాని మునయో విదుః ॥
గంతుం నిఃశ్రేయసం స్థానం యేఽభివాంఛంతి దేహినః ।
కథాం పౌరాణికీం శైవీం భక్త్యా శృణ్వంతు తే సదా ॥
కథాం పౌరాణికీం శ్రోతుం యద్యశక్తస్సదా భవేత్ ।
నియతాత్మా ప్రతిదినం శృణుయాద్వా ముహూర్తకమ్ ॥
యది ప్రతిదినం శ్రోతుమశక్తో మానవో భవేత్ ।
పుణ్యమాసాదిషు మునే శృణుయాచ్ఛాంకరీం కథామ్ ॥
శైవీం కథాం హి శృణ్వానః పురుషో హి మునీశ్వర ।
స నిస్తరతి సంసారం దగ్ధ్వా కర్మమహాటవీమ్ ॥
కథాం శైవీం ముహూర్తం వా తదర్ధం వా క్షణం చ వా ।
యే శృణ్వంతి నరా భక్త్యా న తేషాం దుర్గతిర్భవేత్ ॥
యత్పుణ్యం సర్వదానేషు సర్వయజ్ఞేషు వామునే ।
శంభోః పురాణ శ్రవణాత్తత్ఫలం నిశ్చయం భవేత్ ॥

రాజసూయయాగమును మరియు వంద అగ్నిష్టోమములను చేసినచో ఏ పుణ్యము లభించునో, ఆ పుణ్యము శివుని కథను విన్నంత మాత్రాన లభించును (21). ఓ మునీ! సర్వతీర్థములలో స్నానము చేయుట వలన మరియు కోటి గోవులను దానము చేయుట వలన ఏ పుణ్యము లభించునో, ఆ పుణ్యము శివుని కథను వినుట వలన లభించును (22). ఎవరైతే లోకములను పవిత్రము చేయు శివగాథను వినెదరో, వారు రుద్రస్వరూపులే. వారిని సామాన్యమానవులని తలంచరాదు. ఈ విషయములో సందేహము లేదు (23). శివుని పవిత్రమగు కీర్తిని వింటూ దానిని కీర్తించే సత్పురుషుల పాదపద్మముల నుండి రాలే ధూళికణములే తీర్థములని మహర్షులు చెప్పుచున్నారు (24). ఏ మానవులు మోక్షము అనే పరమపదమును పొందగోరుచున్నారో, వారు సర్వదా శివపురాణగాథలను భక్తితో వినెదరు గాక! (25) సర్వకాలములలో పురాణగాథను వినే శక్తి లేనిచో, ప్రతిదినము గంట సేపు స్థిరచిత్తముతో వినవలెను (26). ఓ మునీ! ప్రతిదినము వినే శక్తి లేని మానవుడు పుణ్యమాసము మొదలగు సందర్భములలో శంకరుని గాథను వినవలెను (27). ఓ మహర్షీ! శివగాథను వినే మానవుడు కర్మ అనే పెద్ద అడవిని దహించి సంసారమును అతిక్రమించును (28). ఏ మానవులైతే శివగాథను గంట గాని, అరగంట గాని, లేదా క్షణకాలమైననూ భక్తితో వినెదరో, వారికి దుర్గతి లేదు (29). ఓ మునీ! సర్వదానములచే మరియు సర్వయజ్ఞములచే ఏ పుణ్యము లభించునో, ఆ పుణ్యఫలము శంకరుని పురాణమును వినుట వలన నిశ్చయముగా కలుగును (30).

విశేషతః కలౌ వ్యాస పురాణ శ్రవణాదృతే ।
పరో ధర్మో న పుంసాం హి ముక్తిధ్యానపరః స్మృతః ॥
పురాణ శ్రవణం శంభోర్నామ సంకీర్తనం తథా ।
కల్పద్రుమఫలం రమ్యం మనుష్యాణాం న సంశయః ॥
కలౌ దుర్మధసాం పుంసాం ధర్మాచారోజ్ఝి తాత్మనామ్ ।
హితాయ విదధే శంభుః పురాణాఖ్యం సుధారసమ్ ॥
ఏకోఽ జరామరస్స్యాద్వై పిబన్నేవామృతం పుమాన్ ।
శంభోః కథామృతాపానాత్కులమేవా జరామరమ్ ॥
యా గతిః పుణ్యశీలానాం యజ్వనాం చ తపస్వినామ్ ।
సా గతిస్సహసా తాత పురాణశ్రవణాత్ఖలు ॥
జ్ఞానావాప్తిర్యదా న స్యాద్యోగశాస్త్రాణి యత్నతః ।
అధ్యేతవ్యాని పౌరాణం శాస్త్రం శ్రోతవ్యమేవ చ ॥
పాపం సంక్షీయతే నిత్యం ధర్మశ్చైవ వివర్ధతే ।
పురాణ శ్రవణాత్ జ్ఞానీ న సంసారం ప్రపద్యతే ॥
అత ఏవ పురాణాని శ్రోతవ్యాని ప్రయత్నతః ।
ధర్మార్థకామలాభాయ మోక్షమార్గాప్తయే తథా ॥
యజ్ఞైర్దానైస్తపోభిస్తు యత్ఫలం తీర్థసేవయా ।
తత్ఫలం సమవాప్నోతి పురాణ శ్రవణాన్నరః ॥

న భవేయుః పురాణాని ధర్మమార్గే క్షణాని తు ।
యద్యత్ర యద్వ్రతీ స్థాతా చాత్ర పారత్రికీం కథామ్ ॥
షట్త్రింశతి పురాణానాం మధ్యేఽ ప్యేకం శృణోతి యః ।
పఠేద్వా భక్తియుక్తస్తు స ముక్తో నాత్ర సంశయః ॥
అన్యో న దృష్టస్సుఖదో హి మార్గః పురాణమార్గో హి సదా వరిష్ఠః ।
శాస్త్రం వినా సర్వమిదం న భాతి సూర్యేణ హీనా ఇవ జీవలోకాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం పురాణమాహాత్మ్య వర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥

ఓ వ్యాసా! విశేషించి కలియుగములో ధ్యానమును కుదిర్చి ముక్తిని ఇచ్చే ధర్మము పురాణ శ్రవణము కంటే గొప్పది మరియొకటి లేదు (31). శివపురాణ శ్రవణము మరియు నామసంకీర్తన అనునవి మానవులకు సుందరమగు ఫలములనిచ్చే కల్పవృక్షము వంటివి. సంశయము వలదు (32). కలియుగములో దుష్టబుద్ధి గలవారై ధర్మమును మరియు ఆచారమును విడిచిపెట్టే స్వభావము గల మానవుల క్షేమము కొరకై శివుడు పురాణము అనే అమృతరసమును ఏర్పాటు చేసెను (33). పురుషుడు అమృతమును పానము చేసినచో, తాను ఒక్కడు మాత్రమే అమరుడగును. కాని శివగాథ అనే అమృతమును పానము చేయుట వలన వంశము జరామరణములనుండి విముక్తిని పొందును (34). ఓ కుమారా! పుణ్యాత్ములై యజ్ఞములను మరియు తపస్సును చేసిన వారికి ఏ గతి లభించునో, అదే గతి పురాణ శ్రవణము వలన శీఘ్రముగా కలుగును (35). జ్ఞానము లభించనంత వరకు, ప్రయత్నపూర్వకముగా యోగశాస్త్రములను అధ్యయనము చేయవలెను. పురాణమును మరియు శాస్త్రమును శ్రవణము చేయవలెను (36). నిత్యము పురాణమును వినే మానవునకు పాపము క్షీణించి ధర్మము వర్ధిల్లి జ్ఞానము ఉదయించి సంసారమునుండి విముక్తి కలుగును (37). కావుననే, ధర్మార్థకామములు సిద్ధించుటకు, మరియు మోక్షమార్గము లభించుటకు ప్రయత్నపూర్వకముగా పురాణములను వినవలెను (38). మానవుడు యజ్ఞములచే, దానములచే, తపస్సులచే, మరియు తీర్థాటనముచే ఏ ఫలమును పొందునో, అదే ఫలమును పురాణ శ్రవణముచే పొందును (39). పురాణములు ధర్మమార్గమును చూపే నేత్రములు. ఈ లోకములో అవి లేనిచో, వ్రతముల ననుష్ఠించువాడు గాని, పరలోకప్రసంగము గాని ఉండెడిది గాదు (40). ఎవడైతే ముప్పది ఆరు పురాణములలో ఏ ఒక్కదానినైననూ భక్తితో కూడినవాడై వీనునో, లేదా పఠించునో, వాడు ముక్తుడగుననుటలో సందేహము లేదు (41). సుఖమునిచ్చే మార్గము మరియొకటి లేదు. సర్వకాలములలో పురాణమార్గమే శ్రేష్ఠమైనది. సూర్యుడు లేని ప్రాణి వర్గము వలె శాస్త్రము లేనిచో ఈ సర్వముయొక్క తత్త్వము ప్రకాశించదు (42).

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు పురాణమహిమను వర్ణించే పదమూడవ అధ్యాయము ముగిసినది (13).

14 – దాన మహిమ

సనత్కుమార ఉవాచ ।

శస్తాని ఘోరదానాని మహాదానాని నిత్యశః ।
పాత్రేభ్యస్తు ప్రదేయాని ఆత్మానం తారయంతి చ ॥
హిరణ్య దానం గోదానం భూమి దానం ద్విజోత్తమ ।
గృహీతో వై పవిత్రాణి తారయంతి స్వమేవ తమ్ ॥
సువర్ణదానం గోదానం పృథివీదానమేవ చ ।
ఏతాని శ్రేష్ఠదానాని కృత్వా పాపైః ప్రముచ్యతే ॥
తులాదానాని శస్తాని గావః పృథ్వీ సరస్వతీ ।
ద్వే తు తుల్యబలే శస్తే హ్యధికా చ సరస్వతీ ॥
నిత్యం హ్యనడుహో గావశ్ఛత్రం వస్త్రముపానహౌ ।
దేయాని యాచమానేభ్యః పానమన్నం తథైవ చ ॥
సంకల్పవిహితో యోఽర్థో బ్రాహ్మణేభ్యః ప్రదీయతే ।
అర్థిభ్యో పీడితేభ్యశ్చ మనస్వీ తేన జాయతే ॥
కనకం చ తిలా నాగాః కన్యా దాసీ గృహం రథః ।
మణయః కపిలా గావో మహాదానాని వై దశ ॥
గృహీత్వైతాని సర్వాణి బ్రాహ్మణో జ్ఞానవిత్సదా ।
వదాన్యాంస్తారయేత్సద్యో హ్యాత్మానం చ న సంశయః ॥
సువర్ణం యే ప్రయచ్ఛంతి నరాశ్శుద్ధేన చేతసా ।
దేవతాస్తం ప్రయచ్ఛంతి సమంతాదితి మేఽ శ్రువమ్ ॥
అగ్నిర్హి దేవతాస్సర్వాః సువర్ణం చ హుతాశనః ।
తస్మాత్సువర్ణం దత్త్వా చ దత్తాః స్స్యుస్సర్వదేవతాః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

శివప్రీతికరమగు దానములు చాల గొప్పవి గలవు. అవి ప్రశంసనీయములు. నిత్యము యోగ్యులకు ఆ దానములను చేయవలెను. అవి మానవుని తరింపజేయును (1), ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! బంగారము, గోవు, భూమి అను వాటి దానములు చాల పవిత్రమైనవి. అవి దాతను మాత్రమేగాక, ప్రతి గ్రహీతను కూడ తరింపజేయును (2). బంగారము, గోవు, భూమి అను వాటి దానములు శ్రేష్ఠమైనవి. వాటిని చేయువాడు పాపములనుండి విముక్తుడగును (3). తులాదానములు (ప్రతిగ్రహీత బరువుతో సమముగా ఇచ్చుట), గోదానము, భూదానము, విద్యాదానము అను దానములు ప్రశంసించ దగినవి. భూదానము, విద్యాదానము సమమగు బలము గలవియే అయినా, విద్యాదానము గొప్పది (4). యాచించు వారలకు నిత్యము ఎద్దులు, ఆవులు, గొడుగు, వస్త్రము, చెప్పులు మరియు అన్నము అను వాటిని ఇచ్చుచుండవలెను (5). బ్రాహ్మణులకు, యాచకులకు మరియు దీనులకు సంకల్పపూర్వకముగా దానము చేయు వ్యక్తి

గొప్ప బుద్ధిశాలి యగును (6). బంగారము, నువ్వులు, ఏనుగులు, కన్య, దాసి, ఇల్లు, వాహనము, మణులు, కపిలగోవు మరియు ఆవులు అను పది దానములు మహాదానములు అని ప్రసిద్ధి (7), జ్ఞానియగు బ్రాహ్మణుడు వీటిని అన్నింటినీ సర్వదా స్వీకరించవలెను. అట్లు చేయుట వలన ఆయన స్వయముగా తరించుటయే గాక, దాతలను కూడ వెంటనే తరింపజేయుననుటలో సందేహము లేదు (8). ఏ మానవులు శుద్ధమగు మనస్సుతో బంగారమును దానము చేయుదురో, వారికి దేవతలు వారి దానములకు అనురూపముగా సర్వమును ఇచ్చెదరని నేను వినియుంటిని (9). సర్వదేవతలు అగ్నిస్వరూపులై యున్నారు. బంగారము అగ్నియొక్క స్వరూపము. కావున, బంగారమును దానము చేసినచో, సర్వదేవతలను దానము చేసినట్లే యగును (10).

పృథ్వీదానం మహా శ్రేష్ఠం సర్వకామ ఫలప్రదమ్ ।
సౌవర్ణం చ విశేషేణ యత్కృతం పృథునా పురా ॥
దీయమానాం ప్రపశ్యంతి పృథ్వీం రుక్మ సమన్వితామ్ ।
సర్వపాప వినిర్ముక్తాస్తే యాంతి పరమాం గతిమ్ ॥
అథాన్యచ్చ ప్రవక్ష్యామి దానం సర్వోత్తమం మునే ।
కాంతారం యన్న పశ్యంతి యమస్య బహుదుఃఖదమ్ ॥
కుర్యాత్కాంతారదానం హి విధినా శుద్ధమానసః ।
న్యాయార్జితేన ద్రవ్యేణ విత్తశాఠ్య వివర్జితః ॥
తిలప్రస్థమయీం కృత్వా ధేనుం సర్వగుణాన్వితామ్ ।
ధేనువత్సం సువర్ణం చ సుదివ్యం సర్వలక్షణమ్ ॥
పద్మమష్టదలం కృత్వా కుంకుమాక్తాక్షతైశ్శుభైః ।
పూజయేత్తత్ర రుద్రాదీన్ సర్వాన్ దేవాన్ సుభక్తితః ॥
ఏవం సంపూజ్య తాం దద్యాద్బ్రాహ్మణాయ స్వశక్తితః ।
సరత్నాం సహిరణ్యాం చ సర్వాభరణ భూషితామ్ ॥
తతో నక్తం సమశ్నీయద్దీపాన్దద్యాత్తు విస్తరాత్ ।
కార్తిక్యామితి కర్తవ్యం పూర్ణిమాయాం ప్రయత్నతః ॥
ఏవం యః కురుతే సమ్యగ్విధానేన స్వశక్తితః ।
యమమార్గభయం ఘోరం నరకం చ న పశ్యతి ॥
కృత్వా పాపాన్యశేషాణి సబంధుస్ససుహృజ్జనః ।
దివి సంక్రీడతే వ్యాస యావదింద్రాశ్చతుర్దశ ॥

భూదానము చాల గొప్పది. దానివలన కోరికలన్నియు ఈడేరును. బంగారమును ఇచ్చుట కూడ విశేషఫలమును ఇచ్చును. పూర్వము పృథుచక్రవర్తి ఆ దానమును చేసినాడు (11). బంగారముతో కలిపి చేసే భూదానము ప్రశంసనీయము. అట్టి దానము జరుగుచుండగా చూచువారు కూడ సకలపాపములనుండి విముక్తులై పరమగతిని పొందెదరు (12). ఓ మునీ! సర్వశ్రేష్టమగు మరియొక దానమును కూడ చెప్పెదను. దీని ప్రభావముచే

మానవులు అనేకదుఃఖములకు నిలయమైన యముని అడవిని చూడరు, (13). ధనవిషయములో మోసమునెరుంగని మానవుడు న్యాయమార్గములో ధనమును సంపాదించి పవిత్రమగు మనస్సుగలవాడై యముని పీడను తొలగింపజేసే ఈ దానమును చేయవలెను (14). పుట్టెడు నువ్వులతో సకలశుభ లక్షణములు గల ఆవు ఆకారమును నిర్మించవలేను. బంగారముతో మిక్కిలి దివ్యమైనది, సకలశుభలక్షణములు గలది అగు ఆవుదూడను కూడ చేయవలెను (15), కుంకుమ మరియు శుభాక్షతలతో ఎనిమిది దళముల పద్మమును వేయవలెను. దానియందు రుద్రుడు మొదలగు సకల దేవతలను ప్రతిష్ఠించి చక్కని భక్తితో పూజించవలెను (16). ఈ విధముగా పూజించి ఆ గోవును యథాశక్తిగా రత్నములతో మరియు సకలాభరణములతో అలంకరించి బంగారమును జతచేసి బ్రాహ్మణునకు ఈయవలెను (17). తరువాత రాత్రి యందు మాత్రమే భుజించి అధికముగా దీపములను దానము చేయవలెను. ఈ విధముగా కార్తీకపూర్ణిమనాడు ప్రయత్నపూర్వకముగా చేయవలెను (18). ఎవడైతే ఈ విధముగా యథాశక్తిగా యథావిధిగా చేయునో, వాడు భయంకరమగు యమమార్గపీడను గాని, నరకమును గాని చూడడు (19). ఓ వ్యాసా! అట్టివాడు సమస్తపాపములను చేసినవాడైననూ, బంధుమిత్రులతో గూడి పదునాలు ఇంద్రులు ఉండే కాలము స్వర్గములో చక్కగా క్రీడించును (20).

విధితో గోశ్చ దానం వై సర్వోత్తమమిహ స్మృతమ్ ।
న తేన సదృశం వ్యాస పరం దానం ప్రకీర్తితమ్ ॥
ప్రయచ్ఛతే యః కపిలాం సవత్సాం స్వర్ణశృంగికామ్ ।
కాంస్యపాత్రాం రౌప్యఖురాం సర్వలక్షణ లక్షితామ్ ॥
తైస్తైర్గుణైః కామదుఘా భూత్వా సా గౌరుపైతి తమ్ ।
ప్రదాతారం నరం వ్యాస పరత్రేహ చ జన్మని ॥
యద్యదిష్టతమం లోకే యదస్తి దయితం గృహే ।
తత్తద్గుణవతే దేయం తదేవాక్షయ మిచ్ఛతా ॥
తులాపురుషదానం హి దానానాం దానముత్తమమ్ ।
తులాసంరోహణం కార్యం యదీచ్ఛేచ్ఛ్రేయ ఆత్మనః ॥
యత్కృత్వా ముచ్యతే పాపైర్వధ బంధకృతోద్భవైః ।
తులాదానం మహత్పుణ్యం సర్వపాప క్షయంకరమ్ ॥
కృత్వా పాపాన్యశేషాణి తులాదానం కరోతి యః ।
సర్వైస్తు పాత్రకైర్ముక్తస్స దివం యాత్యసంశయమ్ ॥
పాపం కృతం యద్దివసే నిశాయాం ద్విసంధ్యయోర్మధ్య దినే నిశాంతే ।
కాలత్రయే కామమనోవచోభిస్తు లాపుమాన్వై తదపాకరోతి ॥
బాలేన వృద్ధేన మయా హి యూనాऽవిజానతా జ్ఞానపరేణ పాపమ్ ।
తత్సర్వమేవాశు కృతం మదీయం తులాపుమాన్వై హరతు స్మరారిః ॥
పాత్రే ప్రయుక్తం ద్రవిణం మయాऽద్య ప్రమాణపూర్ణం నిహితం తులాయామ్ ।
తేనైవ సార్ధం తు మమావశేషం కృతాకృతం యత్సుకృతం సమేతు ॥

ఏవముచ్చార్య తం దద్యాత్ ద్విజేభ్యః సర్వదా హితః ।

నైకస్యాపి ప్రదాతవ్యం న నిస్తారస్తతో భవేత్ ॥

దదాత్యేవం తు యో వ్యాస తులాపురుషముత్తమమ్ ।

హత్వా పాపం దివం తిష్ఠేద్యావంద్రాశ్చతుర్దశ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం దానమాహాత్మ్యవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥

యథావిధిగా చేయబడిన గోదానము ఈ లోకములో సర్వోత్తమమైనదని మహర్షులు చెప్పుచున్నారు. ఓ వ్యాసా! దాని సాటి మరియొకటి లేదు (21). ఓ వ్యాసా! ఎవడైతే సకల శుభలక్షణములు గల కపిలగోవును దూడ, కంచు పాత్ర, వెండి గిట్టలు మరియు బంగరు కొమ్ములతో సహా దానము చేయునో (22), ఆయా గుణములతో కూడియున్న ఆ గోవు వచ్చి ఆ దాతకు ఇహపరములలో కోర్కెలను తీర్చును (2.3). అక్షయఫలమును కోరు వ్యక్తి లోకములో మిక్కిలి ప్రియమైన వస్తువులు ఏవి గలవో వాటిని, ఇంటిలో ప్రీతిపాత్రమగు వస్తువు ఏది గలదో దానిని గుణవంతునకు ఈయవలెను (24). దానములలో తులాపురుషదానము ఉత్తమమైనది. తన శ్రేయస్సును గోరు. మానవుడు దానము చేసిన తులపై తాను కూర్చుండవలెను (25), మహాపుణ్యమును ఇచ్చునది, సకలపాపములను పోగొట్టునది అగు తులాదానమును చేసినచో, ఇతరప్రాణులను వధించుట మరియు బంధించుట వలన కలిగిన పాపములు తొలగిపోవును (26), సకలపాపములను ఆచరించిన వాడైననూ తులాదానమును చేయువాడు సకలపాపములనుండి విముక్తిని పొంది నిస్సందేహముగా స్వర్గమునకు వెళ్లును (27). పగలు, రాత్రి మరియు ఉదయ-మధ్యాహ్న- సాయంసంధ్యలు అనే మూడు కాలములలో మనోవాక్కాయములతో చేయబడిన పాపములను తులాధిష్టానదేవత పోగోట్టును (28). నేను బాల్యములో యావనములో వార్ధక్యములో తెలిసి తెలియక చేసిన పాపములను అన్నింటినీ మన్మథశత్రువు, తులాధిష్టాన దేవత అగు శివుడు పోగొట్టును గాక ! (29) నేను ఈనాడు నా బరువుతో సరిదూగే ధనమును తుల (తక్కెడ) యందు ఉంచి యోగ్యుడగు వ్యక్తికి సమర్పించినాను. దీని ప్రభావముచే నాకు ఇంతవరకు నేను చేసిన మరియు చేయని మంచి కర్మల పుణ్యము అంతయు లభించుగాక ! (30) ఇట్లు పలికి సర్వకాలములలో హితమును గోరు దాత ఆ ధనమును అనేకులగు బ్రాహ్మణులకు ఈయవలెను. తులాదానమును ఒకే వ్యక్తికి ఈయరాదు. అట్లు ఇచ్చినచో, ప్రయోజనము ఉండదు (31). ఓ వ్యాసా! ఎవడైతే ఈ విధముగా ఉత్తమమగు తులాదానమును చేయునో, వాడు పాపములనుండి విముక్తుడై పదునాల్గు ఇంద్రుల కాలము స్వర్గములో నుండును (32).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు దానమాహాత్మ్యమును వర్ణించే పదునాలుగవ అధ్యాయము ముగిసినది (14).

15 - పాతాళ లోక వర్ణనము

వ్యాస ఉవాచ ।

యేనైకేన హి దత్తేన సర్వేషాం ప్రాప్యతే ఫలమ్ ।

దానానాం తన్మమాఖ్యాహి మానుషాణాం హితార్థతః ॥

వ్యాసుడు ఇట్లు పలికెను -

ఏ ఒక్క దానముచే సర్వదానముల ఫలము లభించునో, ఆ దానమును గురించి మనుష్యుల హితము కొరకై నాకు చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

శృణు కాలే ప్రదత్తాద్వై ఫలం విందంతి మానవాః ।

ఏకస్మాదపి సర్వేషాం దానానాం తద్వదామి తే ॥

దానానాముత్తమం దానం బ్రహ్మాండం ఖలు మానవైః ।

దాతవ్యం ముక్తికామైస్తు సంసారోత్తారణాయ వై ॥

బ్రహ్మాండే సకలే దత్తే యత్ఫలం లభతే నరః।

తదేక భావాదాప్నోతి సప్తలోకాధిపో భవేత్ ॥

యావచ్చంద్ర దివాకరౌ నభసి వై యావత్ స్థిరా మేదినీ తావత్సోఽపి

నరస్స్వబాంధవయుత స్స్వర్గౌకసామోకసి ।

సర్వేష్వేవ మనోనుగేషు కకుభిర్బ హ్మాండదః క్రీడతే పశ్చాద్యాతి పదం

సుదుర్లభతరం దేవైర్ముదే మాధవమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

మానవులు సకాలములో చేసిన ఏ ఒకే ఒక దానము వలన సర్వదానముల ఫలమును పొం ందెదరో, ఆ దానమును గురించి నీకు చెప్పెదను. వినుము (2) దానములలో ఉత్తమమైనది బ్రహ్మాండదానము. ముక్తిని కోరు మానవులు సంసారమును అతిక్రమించుటకై ఈ దానమును చేయవలెను (3). బ్రహ్మాండదానము వలన ఏ ఫలము లభించునో, ఆ ఫలములో చిన్న అంశముచే మానవుడు ఏడు లోకములకు అధిపతి యగును (4). దిక్కులతో సహా బ్రహ్మాండమును దానము చేసిన మానవుడు ఆకాశములో సూర్యచంద్రులు ఉన్నంతవరకు, భూమి స్థిరముగా నున్నంతవరకు, తన బంధువులతో కూడి దేవతల నివాసమగు స్వర్గములో సంగీతములను వింటూ క్రీడించును. ఆ దేవతలు అందరు ఆతని మనస్సునకు అనుకూలముగా ఉండెదరు. తరువాత అటు దేవతలకు కూడ మిక్కిలి పొందశక్యము కాని విష్ణుపదమును పొంది ఆనందించును (5) .

వ్యా స ఉవాచ।

భగవన్ బ్రూహి బ్రహ్మాండం యత్ప్ర మాణం యదాత్మకమ్ ।

యదాధారం యథాభూతం యేన మే ప్రత్యయో భవేత్ ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ పూజ్యా! బ్రహ్మాండము యొక్క ప్రమాణము ఎంత ? దాని స్వరూపము ఎట్టిది ? దానికి ఆధారము ఏది ? దాని నిర్మాణము ఎట్టిది ? ఈ విషయములను నాకు తెలిసే విధముగా చెప్పుము (6).

సనత్కుమార ఉవాచ ।

మునే శృణు ప్రవక్ష్యామి యదుత్సేధం తు విస్తరమ్ ।

బ్రహ్మాండం తత్తు సంక్షేపాచ్ఛ్రు త్వా పాపాత్ప్ర ముచ్యతే ॥

యత్తత్కారణమవ్యక్తం వ్యక్తం శివమనామయమ్ ।

తస్మాత్సంజాయతే బ్రహ్మా ద్విధా భూతర్ద్ధి కాలతః ॥

బ్రహ్మాండం సృజతి బ్రహ్మా చతుర్దశ భవాత్మకమ్ ।

తద్వచ్మి క్రమతస్తాత సమాసాచ్ఛృణు యత్నతః ॥

పాతాలాని తు సప్తైవ భువనాని తథోర్ధ్వతః ।

ఉచ్ఛ్రాయో ద్విగుణస్తస్య జలమధ్యే స్థితస్య చ ॥

తస్యాధారః స్థితో నాగస్స చ విష్ణుః ప్రకీర్తితః ।

బ్రహ్మణో వచసో హేతోర్బి భర్తి సకలం త్విదమ్ ॥

శేషస్యాస్య గుణాన్ వక్తుం న శక్తా దేవదానవాః ।

యోఽనంతః పఠ్యతే సిద్ధైర్దేవర్షిగణపూజితః ॥

శిరస్సాహస్రయుక్తస్స సర్వా విద్యోతయన్ దిశః ।

ఫణామణిసహస్రేణ స్వస్తికామలభూషణః ॥

ముదాఘూర్ణితనేత్రోఽసౌ సాగ్నిశ్శ్వేత ఇవాచలః ।

స్రగ్వీ కిరీటీ హ్యాభాతి యస్సదైవైక కుండలః ॥

సోఽయం గంగా ప్రవాహేణ శ్వేతశ్శైలోపశోభితః ।

నీలవాసా మదోద్రిక్తః కైలాసాద్రిరివాపరః ॥

లాంగలాసక్తహస్తాగ్రో బిభన్ముసల ముత్తమమ్ ।

యోఽర్చ్యతే నాగకన్యాభిస్స్వర్ణ వర్ణాభిరాదరాత్ ॥

సంకర్షణాత్మకో రుద్రో విషానలశిఖోజ్జ్వలః ।

కల్పాంతే నిష్క్రమంతే యద్వక్త్రే భ్యోఽగ్నిశిఖా ముహుః ।

దగ్ధ్వా జగత్త్రయం శాంతా భవంతీత్యనుశుశ్రుమ ॥

ఆస్తే పాతాలమూలస్థస్స శేషః క్షితిమండలమ్ ।

బిభ్రత్స్వపృష్ఠే భూతేశశ్శేషోఽ శేషగుణార్చితః ॥

తస్య వీర్య ప్రభావశ్చ సాకాంక్షైస్త్రిద శైరపి ।

న హి వర్ణయితుం శక్యస్స్వరూపం జ్ఞాతుమేవ వా ॥

ఆస్తే కుసుమమాలేవ ఫణామణి శిలారుణా ।

యస్యైషా సకలా పృథ్వీ కస్తద్వీర్యం వదిష్యతి ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ మునీ! వినుము. బ్రహ్మాండము ఎంత గొప్పదియో మరియు ఎంతటి విస్తారము గలది◌ియో సంక్షేపముగా చెప్పెదను. దీనిని విన్నచో, పాపమునుండి విముక్తి కలుగును. నామరూపములుగా అభివ్యక్తము కాని ఆ జగత్కారణమగు పరంబ్రహ్మ దోషరహితమైన శివతత్త్వము రూపములో వ్యక్తమగును. అది కాలక్రమములో రెండు అగును. దాని నుండి బ్రహ్మ పుట్టును. ఆ బ్రహ్మ పదునాల్గు భువనములతో కూడిన బ్రహ్మాండమును సృష్టించును. ఆ వివరములను క్రమముగా చెప్పెదను. ఓ కుమారా! దానిని శ్రద్ధగా వినుము. ఏడు పాతాళలో కములు గలవు. వీటికి పైన ఏడు ఊర్ధ్వలోకములు ఉండుటచే, వీటి మధ్యలోనున్న బ్రహ్మాండముయొక్క ఎత్తు రెట్టింపు అగును. దానికి ఆధారము సర్పము. ఆ సర్పము విష్ణువు అని కీర్తించబడినది. బ్రహ్మయొక్క వచనముచే ఆ సర్పము ఈ సర్వమును మోయుచున్నది. ఈ శేషుని గుణములను దేవతలు గాని, రాక్షసులు గాని వర్ణించలేరు. దేవతలచే, మరియు ఋషిగణములచే పూజింపబడే ఆ శేషుని సిద్ధులు అనంతుడని కీర్తించెదరు. ప్రకాశించే స్వస్తికయే ఆభరణముగా గల ఆ శేషుడు వేయి తలలు గలవాడై వేయి పడగలపై నున్న మాణిక్యములచే దిక్కులనన్నింటినీ ప్రకాశింపజేయును. బలగర్వముచే తిరుగుచున్న నేత్రములు గలవాడు, మాలను కిరీటమును ధరించినవాడు, ఒకే కుండలము గలవాడు అగు ఈ శేషుడు నిప్పులు గ్రక్కే తెల్లని పర్వతము వలె ప్రకాశించును. నల్లని వస్త్రమును దాల్చి బలగర్వముచే ఉద్రిక్తుడై యున్న ఈ శేషుడు తెల్లని పర్వతమువలె ప్రకాశించుచున్నవాడై గంగా ప్రవాహముతో కూడిన రెండవ కైలాసమా యన్నట్లు విరాజిల్లుచున్నాడు. చేతివేళ్లతో నాగలిని పట్టినవాడు, ఉత్తమమగు ముసలాయుధమును ధరించినవాడు అగు శేషుని బంగరు కాంతులతో ప్రకాశించే నాగకన్యలు ఆదరముతో కొలిచెదరు, విషాగ్నియొక్క జ్వాలలచే అతిశయించి ప్రకాశించే ఆ శేషుడు సంకర్షణరూపములో నున్న రుద్రుడే. ప్రలయకాలమునందు ఆయన నోళ్లనుండి అనేకపర్యాయములు అగ్నిజ్వాలలు బయల్వెడలుచుండును. అవి ముల్లోకములను తగులబెట్టి చల్లారునని వినియుంటిమి. సర్వభూతాధిపతి, అనంతగుణములచే ప్రకాశించువాడు అగు ఆ శేషుడు పాతాలముయొక్క మూలములో నున్నవాడై భూమండలమును తన పడగలపై ధరించి యుండును. ప్రజ్ఞాశాలురగు దేవతలైననూ ఆయనయొక్క శక్తి ప్రభావమును వర్ణించుటకు, మరియు ఆయనయొక్క స్వరూపమును తెలుసుకొనుటకు సమర్థులు కారు. పడగలపై గల మణుల కాంతులచే ఎర్రగా ప్రకాశించే సమస్తమగు భూమండలము ఎవనిపై పూల మాలవలె నున్నదో, అట్టి శేషుని బలమును ఎవడు వర్ణించగలడు ?

యదా విజృంభతేఽనంతో మదాఘూర్ణితలోచనః ।
తదా చలతి భూరేషా సాద్రితోయాధికాననా ॥
దశసాహస్రమేకైకం పాతాలం మునిసత్తమ ।
అతలం వితలం చైవ సుతలం చ రసాతలమ్ ॥
తలం తలాతలం చాగ్ర్యం పాతాలం సప్తమం మతమ్ ।
భూమేరధస్సప్త లోకా ఇమే జ్ఞేయా విచక్షణైః ॥
ఉచ్ఛ్రాయో ద్విగుణశ్చైషాం సర్వేషాం రత్నభూమయః ।
రత్నవంతోఽథ ప్రాసాదా భూమయో హేమసంభవాః ॥
తేషు దానవదైతేయా నాగానాం జాతయస్తథా ।
నివసంతి మహానాగా రాక్షసా దైత్యసంభవాః ॥
ప్రాహ స్వర్గసదోమధ్యే పాతాలానీతి నారదః ।
స్వర్లోకాదతిరమ్యాణి తేభ్యోఽసావాగతో దివి ॥
నానాభూషణభూషాసు మణయో యత్ర సుప్రభాః ।
ఆహ్లాదకానీ శుభ్రాణి పాతాలం కేన తత్సమమ్ ॥
పాతాలే కస్య న ప్రీతిశ్చేతశ్చేతశ్చ శోభితమ్ ।
దేవదానవకన్యాభిర్విముక్తస్యాభిజాయతే ॥
దివార్కరశ్మయో యత్ర న భవంతి విధోర్నిశి ।
న శీతమాతపో యత్ర మణితేజోఽత్ర కేవలమ్ ॥
భక్ష్యభోజ్యాన్నపానాని భుజ్యంతే ముదితైర్భృశమ్ ।
యత్ర న జ్ఞాయతే కాలో గతోఽపి మునిసత్తమ ॥
పుంస్కోకిలరుతం యత్ర పద్మాని కమలాకరాః ।
నద్యస్సరాంసి రమ్యాణి హ్యన్యోన్యవిచరాణి చ ॥
భూషణాన్యతిశుభ్రాణి గంధాఢ్యం చానులేపనమ్ ।
వీణావేణు మృదంగానాం స్వనా గేయాని చ ద్విజ ॥
దైత్యోరగైశ్చ భుజ్యంతే పాతాలే వై సుఖాని చ ।
తపసా సమవాప్నోతి దానవైస్సిద్ధమానవైః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం పాతాలలోకవర్ణనం నామ
పంచదశోఽధ్యాయః ॥

మత్తుచే నిండియున్న కన్నులు గల శేషుడు తన శరీరమును సాగదీసినప్పుడు, పర్వతములతో, సముద్రములతో మరియు వనములతో నిండియున్న ఈ భూమి కంపించును. ఓ మహర్షీ! భూమికి దిగువన అతల-వితల-సుతల- రసాతల- తల-తలాతల-పాతాలములనే ఏడు అధోలోకములు గలవు. వాటిలో ప్రతి ఒక్కటీ పదివేల యోజనముల నిడివి కలిగియున్నదని విద్వాంసులు చెప్పెదరు. వాటి ఎత్తు నిడివికి రెట్టింపు ఉండును. ఈ లోకములన్నింటిలో భూములు రత్నములతో నిండియుండును. ప్రాసాదములు రత్నములచే పొదగబడి యుండును. వాటి ఉపరితలములు బంగారముతో నిర్మింపబడి యుండును. వాటిలో దానవులు, దైత్యులు, నాగజాతులు, మహానాగములు, దైత్యవంశస్థులగు రాక్షసులు నివసించేదరు. ఈ లోకములనుండీ స్వర్గమునకు వచ్చిన నారదుడు స్వర్గసభామధ్యములో పాతాళలోకములు స్వర్గలోకము కంటే మిక్కిలి సుందరమైనవని చెప్పెను. పాతాళములో ఆభరణములన్నింటియందు గొప్ప కాంతులను విరజిమ్మే స్వచ్ఛమగు మణులు ఆహ్లాదమును కలిగించుచుండును. పాతాళముతో సమానమైన స్థానము ఏది గలదు ? అక్కడక్కడ దేవదానవకన్యలతో ప్రకాశించే పాతాళమునందు ఇహలోకమునుండి విముక్తిని పొందిన ఏ జీవునకు ప్రతి పగలు సూర్యకాంతులు, రాత్రి చంద్రకిరణములు, చలి, ఎండ ఉండవు. అచట కేవలము మణుల కాంతులు మాత్రమే ఉండును. ఓ మహర్షీ! అచట నివసించు వారు వివిధభక్ష్యములను మరియు అన్నములను భుజించి పానీయములను త్రాగి మహానందమును పొందెదరు. అచట కాలము గడచినట్లు తెలియదు. అచట గండు కోకిలలు కూయుచుండును. నదులు, సరస్సులు పద్మములతో మరియు కలువలతో నిండి ఒకదానిని మించి మరియొకటి ప్రకాశించుచుండును. అచటి ఆభరణములు అతిస్వచ్ఛముగా నుండును. అనులేపనములు (పైపూతలు) సుగంధభరితములై యుండును. ఓ బ్రాహ్మణా! అచట వీణ, వేణువు, మృదంగము అను వాద్యముల ధ్వనులు మరియు గేయములు వినవచ్చును. పాతాళలోకసుఖములను దైత్యులు, నాగులు అనుభవించెదరు. దానవులు మరియు సిద్ధపురుషులు తపస్సుచే ఆ సుఖములను పొందెదరు.

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు పాతాళలోకవర్ణనమనే పదునైదవ అధ్యాయము ముగిసినది.

16- నరకోద్ధార వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

తేషాం మూర్ధోపరిష్టాద్వై నరకాంస్తాన్ శృణుష్వ చ ।
మత్తో మునివర శ్రేష్ఠ పచ్యంతే యత్ర పాపినః ॥
గౌరవశ్శూకరో రోధస్తాలో వివసనస్తథా ।
మహాజ్వాలస్తప్తకుంభో లవణోఽపి విలో హితః ॥
వైతరణీ పూయవహా కృమిణః కృమిభోజనః ।
అసిపత్రవనం ఘోరం లాలాభక్షశ్చ దారుణః ॥
తథా పూయవహః పాపో వహ్నిజ్వాలో హ్యధశ్శిరాః ।
సందంశః కాలసూత్రశ్చ తమశ్చావీచిరోధనః ॥
శ్వభో జనోఽథ రుష్టశ్చ మహారౌరవశాల్మలీ ।
ఇత్యాద్యా బహవస్తత్ర నరకా దుఃఖదాయకాః ॥
పచ్యంతే తేషు పురుషాః పాపకర్మరతాస్తు యే ।
క్రమాద్వక్ష్యే తు తాన్ వ్యాస సావధానతయా శృణు ॥
కూటసాక్ష్యం తు యో వక్తి వినా విప్రాన్ సురాంశ్చ గాః ।
సదాఽనృతం వచేద్యస్తు స నరో యాతి రౌరవమ్ ॥
భ్రూణహా స్వర్ణహర్తా చ గోరోధీ విశ్వఘాతకః ।
సురాపో బ్రహ్మహంతా చ పరద్రవ్యాపహారకః ॥
యస్తత్సంగీ సవై యాతి మృతో వ్యాస గురోర్వధాత్ ।
తప్త కుంభే స్వసుర్మాతుర్గో శ్చైవ దుహితుస్తథా ॥
సాధ్వ్యా విక్రయకృచ్చాథ వార్ధకీ కేశవిక్రయీ ।
తప్తలో హేషు పచ్యంతే యశ్చ భక్తం పరిత్యజేత్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఆ అధోలోకములకు వైన నరకములు గలవు. వాటిలో పాపులు పీడలకు గురి చేయబడుదురు. ఓ గొప్ప మహర్షీ! ఆ వివరములను చెప్పెదను. వినుము. రౌరవము, శూకరము, రోధము, తాలము, వివసనము, మహాజ్వాలము, తప్తకుంభము, లవణము, విలోహితము అనునవి వాటి పేర్లు. వైతరణి అను నదియందు మురికి ప్రవహించుచుండును. కృమిణము, కృమిభోజనము, ఘోరమగు అసిపత్రవనము, దారుణమగు లాలాభక్షము, పూయవహము, పాపము, వహ్నిజ్వాల, అధశ్శిరస్సు, సందంశము, కాలసూత్రము, తమస్సు, ఆవిచిరో ధనము, శ్వభోజనము, రుష్టము, మహారౌరవము, శాల్మలి మొదలైన అనేకరకములు గలవు. అవి ప్రాణులకు దుఃఖమును కలుగజేయును. పాపకర్మలయందు అభిరుచిగల జనులు వాటియందు పీడలకు గురి చేయబడుదురు. ఓ వ్యాసా! వాటిని క్రమముగా చెప్పెదను. నీవు సావధానముగా వినుము. బ్రాహ్మణులు, దేవతలు మరియు గోవులు అను వాటి కొరకు తప్ప మిగిలిన సందర్భములలో తప్పుడు సాక్ష్యమును

చెప్పువాడు, మరియు సర్వదా అసత్యమును పలుకువాడు రౌరవనరకమును పొందెదరు. ఓ వ్యాసా! గర్భస్థశిశువును చంపువాడు, బంగారమును అపహరించిన వాడు, గోవులను అపహరించిన వాడు, నమ్మకద్రోహి, సురాపానమును చేయువాడు, బ్రహ్మహత్యను చేసినవాడు, పరధనమును అపహరించువాడు మరియు వీరితో స్నేహమును చేయువాడు, గురువును చెల్లెలిని తల్లిని గోవును కూతురును సంహరించిన వాడు మరణించిన తరువాత తప్తకుంభము అనే నరకమును పొందెదరు. పతివ్రతను అమ్మువాడు, అధర్మముగా అధికవడ్డీలను వసూలు చేయువాడు, కేశములను అమ్మువాడు మరియు భక్తుని పరిత్యజించిన వాడు తప్తలోహము అనే నరకములలో ఉడికించ బడుదురు.

అవమంతా గురూణాం యః పశ్చాద్భోక్తా నరాధమః ।
దేవదూషయితా చైవ దేవవిక్రయికశ్చ యః ॥
అగమ్యగామీ యశ్చాంతే యాతి సప్తబలం ద్విజ ।
చౌరో గోఘ్నో హి పతితో మర్యాదాదూషకస్తథా ॥
దేవద్విజపితృద్వేష్టా రత్నదూషయితా చ యః ।
స యాతి కృమిభక్షం వై కృమీనత్తి దురిష్టికృత్ ॥
పితృదేవసురాన్ యస్తు పర్యశ్నాతి నరాధమః ।
లాలాభక్షం స యాత్యజ్ఞో యశ్శస్త్ర కూటకృన్నరః ॥
యశ్చాంత్య జేన సంసేవ్యో హ్యసద్గ్రాహీ తు యో ద్విజః ।
అయాజ్యయాజకశ్చైవ తథైవా భక్ష్యభక్షకః ॥
రుధిరౌఘే పతంత్యేతే సోమవిక్రయిణశ్చ యే ।
మధుహా గ్రామహా యాతి క్రూరాం వైతరణీం నదీమ్ ॥
నవయౌవనమత్తాశ్చ మర్యాదాభేదినశ్చ యే ।
తే కృత్యం యాంత్యశాచాశ్చ కులజీవినశ్చ యే ॥
అసిపత్రవనం యాతి వృక్షచ్ఛేదీ వృథైవ యః ।
క్షురభ్రకా మృగవ్యాధా వహ్నిజ్వాలే పతంతి తే ॥
భ్రష్టాచారో హి యో విప్రః క్షత్రియో వైశ్య ఏవ వా ।
యాత్యంతే ద్విజ తత్రైవ యశ్శ్వపాకేషు వహ్నిదః ॥
వ్రతస్య లోపకా యే చ స్వాశ్రమాద్విచ్యుతాశ్చ యే ।
సందంశయాతనామధ్యే పతంతి భృశదారుణే ॥

ఓ బ్రాహ్మణా! గురువులను అవమానించువాడు, అతిథులను ఆదరిం◌ంచకుండగా పంపివేసి తరువాత భుజించు మానవాధముడు, దైవమును దూషించువాడు, దేవతావిగ్రహములను అమ్మువాడు, పొందకూడని స్త్రీని పొందువాడు మరణించిన తరువాత సప్తబలమనే నరకమును పొందెదరు. చోరుడు, గోహంతకుడు, పతితుడు, మర్యాదను ఉల్లంఘించువాడు, దైవమును బ్రాహ్మణులను మరియు తల్లిదండ్రులను ద్వేషించువాడు, రత్నములను పాడు చేయువాడు మరియు ఇతరులను హింసించుటకై యజ్ఞమును చేయువాడు

కృమిభక్షమనే నరకమును పొంది అచట క్రిములను భక్షించును. ఎవడైతే తల్లిదండ్రులకంటే ముందుగా, ఈశ్వరునకు నైవేద్యము చేయకుండగా, మరియు దేవతలకు ఆహుతులనీయకుండగా తానే భుజించుచుండునో అట్టి మానవాధముడు, మరియు శస్త్ర నిర్మాణములో మోసమును చేయువాడు లాలాభక్షమనే నరకమును పొందెదరు. దుష్టులచే సేవించబడే బ్రాహ్మణుడు, దుష్టప్రతిగ్రహమును చేయు బ్రాహ్మణుడు, అర్హత లేనివారిచే యజ్ఞమును చేయించువాడు, తినకూడని పదార్థములను తినువాడు, యజ్ఞములో వినియోగించబడే సోమలతను అమ్మువారు అనే పాపులు రుధిరౌఘము అనే నరకములో పడెదరు. తేనెటీగల తేనెను అపహరించువాడు, గ్రామమునకు అపకారము చేయువాడు భయంకరమగు వైతరణీనదిలో పడెదరు. నూతనయౌవనములో మదించి మర్యాదను ఉల్లంఘించువారు, ఆంతరశౌచము లేనివారు మరియు ఇతరులను మోసగించి జీవించువారు కృత్యమనే నరకమును పొందెదరు. వ్యర్థముగా చెట్టును నరుకువాడు అసిపత్రవనమనే నరకమును పొందును. వాడి బాణములతో మృగములను వేటాడి సంహరించు కిరాతులు వహ్నిజ్వాల అనే నరకములో పడెదరు. ఓ బ్రాహ్మణా! ఆచారభ్రష్టులైన బ్రాహ్మణక్షత్రియవైశ్యులు మరణించిన తరువాత అక్కడికే చేరెదరు. ఇళ్లకు నిప్పు పెట్టి వివిధప్రాణులు మంటలలో పడి మరణించుటకు కారణమైన వ్యక్తి శ్వభోజనము అనే నరకములో పడును. వ్రతలోపమును చేయువారు, తమ ఆశ్రమధర్మమునుండి జారిపోయినవారు. మిక్కిలి దారుణమైన సందంశము అనే నరకముయొక్క యాతనల మధ్యలో పడెదరు.

వీర్యం స్వప్నేషు స్కందేయుర్యే నరా బ్రహ్మచారిణః ।
పుత్రా నాధ్యాపితా యైశ్చ తే పతంతి శ్వభోజనే ॥
ఏతే చాన్యే చ నరకాశ్శతశోఽథ సహస్రశః ।
యేషు దుష్కృతకర్మాణః పచ్యంతే యాతనాగతాః ॥
తథైవ పాపాన్యేతాని తథాన్యాని సహస్రశః ।
భుజ్యంతే యాని పురుషైర్నరకాంతర గోచరైః ॥
వర్ణాశ్రమ విరుద్ధం చ కర్మ కుర్వంతి యే నరాః ।
కర్మణా మనసా వాచా నిరయే తు పతంతి తే ॥
అధశ్శిరో భిర్దృశ్యంతే నారకా దివి దైవతైః ।
దేవానధో ముఖాన్ సర్వానధః పశ్యంతి నారకాః ॥
స్థావరాః కృమిపాకాశ్చ పక్షిణః పశవో మృగాః ।
ధార్మికాస్త్రి దశాస్తద్వన్మోక్షిణశ్చ యథాక్రమమ్ ॥
యావంతో జంతవస్స్వర్గే తావంతో నరకౌకసః ।
పాపకృద్యాతి నరకం ప్రాయశ్చిత్త పరాఙ్ముఖః ॥
గురూణి గురుభిశ్చైవ లఘూని లఘుభిస్తథా ।
ప్రాయశ్చిత్తాని కాలేయ మనుస్స్వాయంభువోఽ బ్రవీత్ ॥

యాని తేషామశేషాణాం కర్మాణ్యుక్తాని తేషు వై ।
ప్రాయశ్చిత్త మశేషేణ హరానుస్మరణం పరమ్ ॥
ప్రాయశ్చిత్తం తు యస్యైవ పాపం పుంసః ప్రజాయతే ।
కృతే పాపేఽను తాపోఽపి శివసంస్మరణం పరమ్ ॥

స్వప్నములో వీర్యస్ఖలనము చేయు బ్రహ్మచారులు, పుత్రులను చదివించని తండ్రులు శ్వభోజనమనే నరకములో పడెదరు. ఇవియే గాక అసంఖ్యాకములగు నరకములు గలవు. వాటియందు పాపాత్ములు యాతనలచే పీడించబడుదురు. ఇవియే గాక, ఇంకనూ అసంఖ్యాకములగు పాపకర్మలు గలవు. వాటిని చేసిన జీవులు నరకములలో యాతనలను అనుభవించుచుందురు. ఎవరైతే మనోవాక్కాయకర్మలను వర్ణాశ్రమధర్మమునకు విరుద్ధముగా ఆచరించెదరో, వారు నరకములో పడెదరు. స్వర్గములోని దేవతలకు నరకములోని ప్రాణులు తమకు క్రింది భాగములో తలపై నిలబడియున్నట్లు కానవచ్చెదరు. అటులనే, నరకములోని జీవులు తలలను వంచి క్రిందకు చూచుచున్న దేవతలను చూచెదరు, చెట్టుచేమలు, క్రిములు, కీటకములు, పక్షులు, పశువులు, పెద్ద జంతువులు, ధార్మికులు, దేవతలు మరియు ముక్తులు అను క్రమములో పాపాత్ములగు జీవులు ఉన్నతిని పొందవచ్చును. స్వర్గములో ఎంతమంది ప్రాణులు గలరో, అన్ని ప్రాణులు నరకములో కూడ గలరు. పాపమును చేసి ప్రాయశ్చిత్తమును చేయనిచ్ఛగించని మానవుడు నరకమును పొందును. ఓ కాళీపుత్రా ! స్వాయంభువమనువు చిన్న పాపములకు చిన్న ప్రాయశ్చిత్తములను, పెద్ద పాపములకు పెద్ద ప్రాయశ్చిత్తములను చెప్పినాడు. ఆ చెప్పబడిన ప్రాయశ్చిత్తకర్మలన్నింటిలో శివుని స్మరించుట ఉత్తమమైనది. మానవుడు చేసిన పాపమునకు పశ్చాత్తాపము కూడ ప్రాయశ్చిత్తము అగును. అప్పుడు కూడ శివుని స్మరించుట శ్రేష్ఠము.

మహేశ్వరమవాప్నోతి మధ్యాహ్నాదిషు సంస్మరన్ ।
ప్రాతర్నిశి చ సంధ్యాయాం క్షీణపాపో భవేన్నరః ॥
ముక్తిం ప్రయాతి స్వర్గం వా సమస్తక్లేశ సంక్షయమ్ ।
శివస్య స్మరణాదేవ తస్య శంభోరుమాపతేః ॥
పాపాంతరాయో విప్రేంద్ర జపహోమార్చనాది చ ।
భవత్యేవ న కుత్రాపి త్రైలోక్యే మునిసత్తమ ॥
మహేశ్వరే మతిర్యస్య జపహోమార్చ నాదిషు ।
యత్పుణ్యం తత్కృతం తేన దేవేంద్రత్వాదికం ఫలమ్ ॥
పుమాన్న నరకం యాతి యస్స్మరన్ భక్తితో మునే ।
అహర్నిశం శివం తస్మాత క్షీణాశేషపాతకః ॥
నరకస్వర్గసంజ్ఞాయై పాపపుణ్యే ద్విజోత్తమ ।
యయోస్త్వేకం తు దుఃఖాయాన్యత్సుఖాయోద్భవాయ చ ॥

తదేవ ప్రీతయే భూత్వా పునర్దుఃఖాయ జాయతే ।
తత్మాద్దుఃఖాత్మకం నాస్తి న చ కించిత్సుఖాత్మకమ్ ॥
మనసః పరిణామోఽయం సుఖదుఃఖోప లక్షణః ।
జ్ఞానమేవ పరం బ్రహ్మ జ్ఞానం తత్త్వాయ కల్పతే ॥
జ్ఞానాత్మకమిదం విశ్వం సకలం సచరాచరమ్ ।
పరవిజ్ఞానతః కించిద్విద్యతే న పరం మునే ॥
ఏవమేతన్మయఖ్యాతం సర్వం నరకమండలమ్ ।
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి సాంప్రతం మండలం భువః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నరకోద్ధారవర్ణనం నామ
షోడశోఽధ్యాయః ॥

ఉదయము, రాత్రి మరియు మధ్యాహ్నము మొదలగు సమయములలో మహేశ్వరుని స్మరిం ిచు మానవుడు పాపవిముక్తుడై మహేశ్వరుని పొందును. మంగళస్వరూపుడు, పార్వతీపతి అగు శంభుని స్మరించుట వలన మానవుడు కష్టములన్నింటినుండి గట్టెక్కి స్వర్గమును గాని, మోక్షమును గాని పొందును. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా ! మహర్షీ! జపము, హోమము, పూజ మొదలైనవి పాపమును దరి చేరనీయవు. ముల్లోకములలో భూలోకములో తప్ప మరియెచ్చటనూ వీటిని అనుష్ఠించుట సంభవము కాదు, ఎవడైతే మహేశ్వరునియందు మనస్సును నిలిపి జపము, హోమము, పూజ మొదలగువాటిని చేయునో, వాడు ఆ పుణ్యముచే దేవేంద్రస్థానము మొదలగు ఫలమును పొందును. ఓ మునీ! ఏ మానవుడైతే భక్తితో రాత్రింబగళ్లు శివుని స్మరించునో, వాని పాపములన్నియు నశించును. కావున, అట్టివాడు నరకమును పొందడు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! పాపమునకు నరకమనియు, పుణ్యమునకు స్వర్గమనియు పేరు. పాపము దుఃఖమును, పుణ్యము స్వర్గమును మరియు ఉత్తమజన్మను ఇచ్చును. ఏ వస్తువు అయిననూ ఆరంభములో ప్రీతిని కలిగించిననూ, మరల దుఃఖమునే ఇచ్చును. కావున, సర్వము దుఃఖాత్మకమే. కేవలసుఖమునిచ్చేది ఏదీ లేదు. సుఖదుఃఖములు కేవలము మనోవికారములు మాత్రమే. అవి. బాహ్యపదార్థముల ధర్మములు కావు. పరంబ్రహ్మ జ్ఞానస్వరూపుడు. జ్ఞానము వలన సత్యతత్త్వము అవగాహనకు వచ్చును. ఓ మునీ! ఈ స్థావరజంగమాత్మకమగు జగత్తు అంతయు జ్ఞానస్వరూపమగు బ్రహ్మ కంటే భిన్నముగా లేదు. పరబ్రహ్మజ్ఞానము కంటే గొప్పది మరియొకటి లేదు. నేను ఈ తీరున నరకమండలమును అంతను వర్ణించితిని. ఈ పైన ఇప్పుడు భూమండలమును గురించి చెప్పెదను.

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు నరకోద్ధారవర్ణనము అనే పదునారవ అధ్యాయము ముగిసినది.

17 – జంబూద్వీప వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

పారాశర్య సుసంక్షేపాచ్ఛృణు త్వం వదతో మమ ।
మండలం చ భువస్సమ్యక్ సప్తద్వీపాది సంయుతమ్ ॥
జంబూ ప్లక్షశ్శాల్మలిశ్చ కుశః క్రౌంచశ్చ శాకకః ।
పుష్కకస్సప్తమస్సర్వే సముద్రై స్సప్తభిర్వృతాః ॥
లవణేక్షురసా సర్పిర్దధిదుగ్ధ జలాశయాః ।
జంబూద్వీపస్సమస్తానామే తేషాం మధ్యతః స్థితః ॥
తస్యాపి మేరుః కాలేయ మధ్య కనకపర్వతః ।
ప్రవిష్టః షోడశాధస్తాద్యో జనేస్తస్య చోచ్ఛ్రయః ॥
చతురశీతీమానైస్తైర్ద్వా త్రింశన్మూర్ధ్ని విస్తృతః ।
భూమిపృష్ఠస్థ శైలోఽయం విస్తరస్తస్య సర్వతః ॥
మూలే షోడశసాహస్రః కర్ణికాకార సంస్థితః ।
హిమవాన్ హేమకూటశ్చ నిషధశ్చాస్య దక్షిణే ॥
నీలశ్శ్వేతశ్చ శృఙ్గీ చ ఉత్తరే వర్షపర్వతాః ।
దశసాహస్రికా హ్యేతే రత్నవంతోఽ రుణప్రభాః ॥
సహస్రయోజనోత్సే ధాస్తావద్విస్తారిణశ్చ తే ।
భారతం ప్రథమం వర్షం తతః కింపురుషం స్మృతమ్ ॥
హరివర్షం తతోఽన్యద్వై మేరోర్దక్షిణతో మునే ।
రమ్యకం చోత్తరే పార్శ్వే తస్యాం తు హిరణ్మయమ్ ॥
ఉత్తరే కురవశ్చైవ యథా వై భారతం తథా ।
నవసాహస్రమేకైకమే తేషాం మునిసత్తమ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఓ పరాశరపుత్రా! ఏడు ద్వీపములు మొదలగు వాటితో కూడియున్న భూమండలమును గురించి చక్కగా నేను సంగ్రహముగా. చెప్పెదను. నీవు వినుము. జంబూ-ప్లక్ష- శాల్మలి-కుశ- క్రౌంచ- శాకక-పుష్కకములను ఏడు ద్వీపములు గలవు. ఇవి ఏడు సముద్రములచే చుట్టువారబడి యున్నవి. అవి క్రమముగా ఉప్పునీరు, చెరుకు రసము, నెయ్యి, పెరుగు, పాలు, మంచి నీరు అను వాటితో నిండియుండును. ఈ ఏడు ద్వీపములలో జంబూద్వీపము మధ్యలో నున్నది. ఓ వ్యాసా! దానికి మధ్యలో బంగరు మేరు పర్వతము గలదు. అది భూమి లోపలికి పదునారు, పైకీ ఎనభై నాలుగు యోజనములు వ్యాపించి యున్నది. అగ్రమునందు దాని నిడివి ముప్పది రెండు యోజనములు గలదు. భూమీపై చాల ఎత్తులో ఉన్న ఈ పర్వతము అన్ని వైపులకు విస్తరించి యున్నది. అది మూలమునందు పదునార వేల యోజనముల విస్తారమును కలిగియున్నది. అది పద్మముయొక్క బీజకోశమును పోలియున్నది. దానికి దక్షిణములో హిమవాన్,

హేమకూటము మరియు నిషధము అను పర్వతములు గలవు. ఉత్తరమునందు నీలము, శ్వేతము మరియు శృంగీ అనే వర్ష (భూఖండమును నిర్దేశించే) పర్వతములు గలవు. పదివేల యోజనముల విస్తీర్ణము గల ఈ పర్వతములు రత్నములతో నిండి ఎర్రని కాంతులు కలిగి యుండును. ఇవి వేయి యోజనములు ఎత్తు అంతే నిడివి కలిగి యున్నవి. మొదటి ఖండము భారతము. రెండవది కింపురుషమనబడును. ఓ మునీ! తరువాతిది హరివర్షము. అది మేరుపర్వతమునకు దక్షిణములో గలదు. మేరువునకు ఉత్తరభాగమునందు రమ్యకవర్షము గలదు. హిరణ్మయవర్షము దానిలో భాగమే. ఓ మహర్షీ! ఉత్తరమునందు కురుదేశము గలదు. భారతవర్షముతో సహా ఈ భూభాగములు అన్నియు ఒక్కొక్కటీ తొమ్మిది వేల యోజనముల నిడివి కలిగి యున్నవి.

ఇలావృతం తు తన్మధ్యే తన్మధ్యే మేరురుచ్ఛ్రితః ।
మేరోశ్చతుర్దిశం తత్ర నవసాహస్రముచ్ఛ్రితమ్ ॥
ఇలావృతమృషి శ్రేష్ఠ చత్వారశ్చాత్ర పర్వతాః ।
విష్కంభా రచితా మేరోర్యోజితాః పునరుచ్ఛ్రితాః ॥
పూర్వే హి మందరో నామ దక్షిణే గంధమాదనః ।
విపులః పశ్చిమే భాగే సుపార్శ్వశ్చోత్తరే స్థితః ॥
కదంబో జంబువృక్షశ్చ పిప్పలో వట ఏవ చ ।
ఏకాదశశతాయామాః పాదపా గిరికేతవః ॥
జంబూద్వీపస్య నామ్నో వై హేతుం శృణు మహామునే ।
విరాజంతే మహావృక్షాస్తత్స్వభావం వదామి తే ॥
మహాగజ ప్రమాణాని జంబ్వాస్తస్యాః ఫలాని చ ।
పతంతి భూభృతః పృష్ఠే శీర్యమాణాని సర్వతః ॥
రసేన తేషాం విఖ్యాత తత్ర జంబూనదీతి వై ।
సరితో వర్తతే తత్ర పీయతే తన్నివాసిభిః ॥
న స్వేదో న చ దౌర్గంధ్యం న జరా చేంద్రియగ్రహః ।
తస్యాస్తటే స్థితానాం తు జనానాం తన్న జాయతే ॥
తీరమృత్స్నాం చ సంప్రాప్య ముఖవాయు విశోషితామ్ ।
జాంబూనదాఖ్యం భవతి సువర్ణం సిద్ధభూషణమ్ ॥
భద్రాశ్వం పూర్వతో మేరోః కేతుమాలం చ పశ్చిమే ।
వర్షే ద్వే తు మునిశ్రేష్ఠ తయోర్మధ్య ఇలావృతమ్ ॥

దాని మధ్యలో ఇలావృతవర్షము గలదు. దాని మధ్యలో ఎత్తైన మేరు పర్వ్ృతము గలదు. మేరువు అచట నాలుగు దిక్కులయందు తొమ్మిది వేల యోజనముల ఎత్తు ఉండును. ఓ మహర్షీ! ఇలావృతము ఇట్టిది. దీనియందు మేరువునకు నాలుగు వైపులయందు నాలుగు ఎత్తైన పర్వతములు మేరువునకు బలమునిచ్చే స్తంభముల వలె నిలబడి దానితో జతగూడి యున్నవి. తూర్పునందు మందరము, దక్షిణములో గంధమాదనము, పశ్చిమదిక్కునందు విపులము,

మరియు ఉత్తరమునందు సుపార్శ్వము అను పర్వతములు గలవు. కడిమి చెట్టు, జంబూవృక్షము, రావి చెట్టు మరియు మర్రి చెట్టు ఆ పర్వతమునకు ధ్వజముల వలె నున్నవి. వాటి ఎత్తు పదకొండు వందల మానములు గలదు. ఓ మహర్షీ! జంబూద్వీపము అను పేరు వచ్చుటకు గల కారణమును వినుము. అచట మహావృక్షములు ప్రకాశించుచున్నవి. వాటి స్వభావమును గురించి నీకు చెప్పెదను. జంబూవృక్షముయొక్క ఫలములు పెద్ద ఏనుగుయొక్క పరిమాణమును కలిగియుండును. అవి ఆ పర్వతముపై పడి పగిలి అంతటా చెల్లాచెదరు అగుచుండును. వాటి రసముచే అచట జంబు అని ప్రసిద్ధిని గాంచిన నది ఏర్పడి అచట పర్వతము చుట్టూ ప్రవహించుచున్నది. అచట నివసించు జనులు ఆ జలమును త్రాగుచుందురు. ఆ నదియొక్క తీరమునందు నివసించు జనులకు చెమట పట్టదు. శరీరమునకు దుర్గంధము ఉండదు. ముసలిదనము ఉండదు. వారికి ఇంద్రియముల పటుత్వము తగ్గదు. ఆ నదీతీరమునందలి మట్టిని తీసుకొని నోటితో గాలి ఊది పొడిగా చేసినచో, అది బంగారమగును. సిద్ధులు ఆ బంగారము యొక్క ఆభరణములను ధరించెదరు. కావుననే, బంగారమునకు జాంబూనదము అను పేరు వచ్చినది. ఓ మహర్షి! మేరుపర్వతమునకు తూర్పునందు భద్రేశ్వము, పశ్చిమమునందు కేతుమాలము అను రెండు భూఖండములు గలవు. ఇలావృతము వాటి మధ్యలో గలదు.

వనం చైత్రరథం పూర్వే దక్షిణే గంధమాదనః ।
విభ్రాజం పశ్చిమే తద్వదుత్తరే నందనం స్మృతమ్ ॥
అరుణోదం మహాభద్రం శీతోదం మానసం స్మృతమ్ ।
సరాంస్యేతాని చత్వారి దేవభోగ్యాని సర్వశః ॥
శీతాంజనః కురుంగశ్చ కురరో మాల్యవాంస్తథా ।
వైకంక ప్రముఖా మేరోః పూర్వతః కేసరాచలాః ॥
త్రికూటశ్శిశిరశ్చైవ పతంగో రుచకస్తథా ।
నిషధః కపిలాద్యాశ్చ దక్షిణే కేసరాచలాః ॥
సినీవాసః కుసుంభశ్చ కపిలో నారదస్తథా ।
నాగాదయశ్చ గిరయః పశ్చిమే కేసరాచలాః ॥
శంఖచూడోఽథ ఋషభో హంసో నామ మహీధరః ।
కాలంజరాద్యాశ్చ తథా ఉత్తరే కేసరాచలాః ॥
మేరోరుపరి మధ్యే హి శాతకౌంభం విధేః పురమ్ ।
చతుర్దశ సహస్రాణి యోజనాని చ సంఖ్యయా ॥
అష్టానాం లోకపాలానాం పరితస్తదను క్రమాత్ ।
యథాదిశం యథారూపం పురోఽష్టావుప కల్పితాః ॥
తస్యాం చ బ్రహ్మణః పుర్యాం పాతయిత్వేందు మండలమ్ ।
విష్ణుపాదవినిష్క్రాంతా గంగా పతితి వై నదీ ॥
సీతా చాలకనందా చ చక్షుర్భద్రా చ వై క్రమాత్ ।
సా తత్ర పతితా దిక్షు చతుర్ధా ప్రత్యపద్యత ॥

సీతా పూర్వేణ శైలం హి నందా చైవ తు దక్షిణే ।
సా చక్షుః పశ్చిమే చైవ భద్రా చోత్తరతో వ్రజేత్ ॥
గిరీనతీత్య సకలాంశ్చతుర్దిక్షు మహాంబుధిమ్ ।
సా యయౌ ప్రయతా సూతా గంగా త్రిపథగామినీ ॥

తూర్పు దిక్కునందు చైత్రరథము, దక్షిణమునందు గంధమాదనము, పశ్చిమము◌నందు విభ్రాజము, ఉత్తరమునందు నందనము అనే ఉద్యానవనములు గలవు, అరుణోదము, మహాభద్రము, శీతో దము, మానసము అనే ఈ నాలుగు సరస్సులయందు సర్వకాలములలో దేవతలు విహరించేదరు. పద్మాకారములో నున్న మేరుపర్వతమునకు కేసరముల స్థానములో తూర్పు దిక్కులో శీతాంజనము, కురుంగము, కురరము మరియు మాల్యహాన్ అనే పర్వతములు గలవు. ఇవి అన్నియు చాల ముఖ్యమైన పర్వతములు. త్రికూటము, శిశిరము, పతంగము, రుచకము, నిషధము, కపిలము మొదలైనవి దక్షిణదిక్కునందలి కేసరపర్వతములు, పద్మమునకు కేసరములవలే, మేరువునందు ఆ స్థానములో నుండే పర్వతములు కేసర పర్వతములనబడును. సినీవాసము, కుసుంభము, కపిలము, నారదము, నాగము మొదలైనవి పశ్చిమమునందలి కేసరసర్వతములు, శంఖచూడము, ఋషభము, హంసము, కాలంజరము మొదలగునవి ఉత్తరమునందలి కేసరపర్వతములు, మేరుపర్వతముయొక్క అగ్రభాగమునందు మధ్యలో బ్రహ్మపురము గలదు. బంగారముతో నిర్మించబడిన ఆ నగరము పదు నాలుగు వేల యోజనముల నిడివి కలిగియున్నది. దానిని చుట్టువారి అష్టదిక్పాలకుల నగరములు గలవు. ఆ ఎనిమిది నగరములు క్రమముగా ఆయా దిక్కులలో ఆ దిక్పాలకుల రూపములకు తగినట్లుగా ఉన్నవి. విష్ణువుయొక్క పాదములనుండి పుట్టిన గంగానదీ చంద్రమండలము గుండా ప్రవహించి ఆ బ్రహ్మపురములో పడుచుండును. ఆ గంగ అచట నాలుగు దిక్కులలో పడి వరుసగా సీత, అలకనంద, చక్షుస్సు, భద్ర అనే నాలుగు పాయలుగా ప్రవహించును. ఆ పర్వతమునకు తూర్పుదిక్కు గుండా సీత, దక్షిణములో నంద, పశ్చిమములో చక్షుస్సు, ఉత్తరదిక్కు గుండా భద్ర ప్రవహించుచున్నవి. ముల్లో కములలో ప్రవహించే ఆ గంగానది ఈ విధముగా నాలుగు పాయలై నాలుగు దిక్కుల గుండా ప్రవహించి పర్వతములను అన్నింటినీ దాటి మహాసముద్రములో కలియుచున్నది.

సునీలనిషధౌ యౌ తౌ మాల్యవద్గంధమాదనౌ ।
తేషాం మధ్యగతో మేరుః కర్ణికాకార సంస్థితః ॥
భారతః కేతుమాలశ్చ భద్రాశ్వః కురవస్తథా ।
పత్రాణి లోకపద్మస్య మర్యాదాతోక పర్వతాః ॥
జఠరం దేవకూటశ్చ ఆయామే దక్షిణోత్తరే ।
గంధమాదనకైలాసౌ పూర్వపశ్చిమతో గతౌ ॥
పూర్వపశ్చిమతో మేరోర్నిషధో నీలపర్వతః ।
దక్షిణోత్తరమాణాతౌ కర్ణికాంతర్వ్యవస్థితౌ ॥
జఠరాద్యాః స్థితా మేరోర్యేషాం ద్వౌ ద్వౌ వ్యవస్థితౌ ।
కేసరాః పర్వతా ఏతే శ్వేతా ద్యాస్సు మనోరమాః ॥
శైలానాముత్తరే ద్రోణ్యస్సిద్ధచారణ సేవితాః ।
సురమ్యాణి తథా తాసు కాననాని పురాణి చ ॥
సర్వేషాం చైవ దేవానాం యక్షగంధర్వర రక్షసామ్ ।
క్రీడంతి దేవదైతేయాశ్శైల ప్రాయేష్వహర్నిశమ్ ॥
ధర్మిణామాలయా హ్యేతే భౌమాస్స్వర్గాః ప్రకీర్తితాః ।
న తేషు పాపకర్తారో యాంతి పశ్యంతి కుత్రచిత్ ॥
యాని కింపురుషాదీని వర్షాణ్యష్టౌ మహామునే ।
న తేషు శోకో నాపత్యో నోద్వేగః క్షుద్భయాదికమ్ ॥
స్వస్థాః ప్రజా నిరాతంకాస్సర్వ దుఃఖ వివర్జితాః ।
దశ ద్వాదశవర్షాణాం సహస్రాణి స్థిరాయుషః ॥
కృతత్రేతాదికాశ్చైవ భౌమాన్యంభాంసి సర్వతః ।
న తేషు వర్తతే దేవస్తేషు స్థానేషు కల్పనా ॥
సప్తస్వేతేషు నద్యశ్చ సుజాతాస్స్వర్ణవాలుకాః ।
శతశస్సంతి క్షుద్రాశ్చ తాసు క్రీడారత జనాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం జంబూద్వీపవర్షవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥

సునీల-నీషధ-మాల్యవత్-గంధమాదన పర్వతముల మధ్యలో పద్మముయొక్క బీజకోశమును పోలి మేరుపర్వతము గలదు. పద్మమును పోలిన ఈ భువనమునకు భారత-కేతుమాల-భద్రాశ్వ- కురువర్షములు (భూభాగములు) రేకల వంటివి. ఈ లోకమునకు హద్దు లోకపర్వతములు. ఈ లోకమునకు జఠరస్థానములో దేవకూటము గలదు. ఈ లోకము దక్షిణమునుండి ఉత్తరము వరకు వ్యాపించి యున్నది. గంధమాదన కైలాసపర్వతములు తూర్పునుండి పశ్చిమము వరకు వ్యాపించి యున్నవి. మేరువునకు తూర్పునుండి పశ్చిమము వరకు నీషధనీలపర్వతములు వ్యాపించి యున్నవి. అవి దక్షిణమునుండి ఉత్తరము వరకు విస్తరించి బీజకోశము (పద్మమునకు మధ్య భాగము) అనదగిన స్థానములో కలియుచున్నవి. మేరువుయొక్క జఠరస్థానముతో మొదలిడి శ్వేతము మొదలైన జంట పర్వతములు పద్మకేసరముల వలె మిక్కిలి సుందరముగా నున్నవి. ఈ పర్వతములకు ఉత్తరమునందు సిద్ధులచే మరియు చారణులచే సేవించబడే జలాశయములు గలవు. ఆ జలాశయములను ఆనుకొని మిక్కిలి సుందరమగు అడవులు మరియు నగరములు గలవు. దేవతలు, యక్షులు, గంధర్వులు మరియు రాక్షసులు అందరికీ ఈ నగరములు చెంది యుండును. ఆ పర్వతప్రాంతములలో దేవతలు మరియు దైత్యులు రాత్రింబగళ్లు క్రీడించుచుందురు. ధర్మాత్ములకు నిలయమగు ఈ స్థానములు భూమిపై వెలసిన స్వర్గములని కీర్తించబడినవి. అచటకు పాపాత్ములు వెళ్లలేరు. వారు ఆ సమీపములో కానరారు. ఓ మహర్షీ! కింపురుషము మొదలైన ఎనిమిది భూభాగములలో జనులకు శోకము, ఆపదలు, ఆదుర్దాలు, ఆకలిబాధ మరియు ఇతరభయములు లేవు. జనులు ఆరోగ్యవంతులై, భయమునుండి మరియు సర్వదుఃఖములనుండి విముక్తులై, పది పన్నెండు వేల సంవత్సరముల ఆయుర్దాయము గలవారై ఉందురు. అచట జనులు కృతత్రేతాయుగములందలి జనులవలె ధర్మపరాయణులై ఉందురు. అచట చక్కగా ప్రకాశించే స్వచ్ఛ జలములతో నిండిన జలాశయములు అంతటా గలవు. అచట ఇంద్రుడు వర్షించడు. వర్షించనక్కర లేదు. అచటి సౌందర్యము ఊహాగోచరము మాత్రమే. ఈ ఏడు వర్షములయందు బంగరు ఇసుకతిన్నెలు గల అందమైన చిన్న నదులు వందల సంఖ్యలో గలవు. జనులు వాటియందు క్రీడించుటలో అభిరుచిని కలిగియుందురు.

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు జంబూద్వీపవర్ణనమనే పదునేడవ అధ్యాయము ముగిసినది.

18 – సప్త ద్వీప వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

వక్ష్యేఽహం భారతం వర్షం హిమాద్రేశ్చైవ దక్షిణే ।
ఉత్తరే తు సముద్రస్య భారతీ యత్ర సంస్కృతిః ॥
నవయోజనసాహస్రో విస్తారోఽస్య మహామునే ।
స్వర్గాపవర్గయోః కర్మభూమిరేషా స్మృతా బుధైః ॥
యతస్సం ప్రాప్యతే పుంభిస్స్వర్గో నరక ఏవ చ ।
భారతస్యాపి వర్షస్య నవ భేదాన్ బ్రవీమి తే ॥
ఇంద్రద్యుమ్నః కసేరుశ్చ తామ్రవర్ణో గభస్తిమాన్ ।
నాగద్వీపస్తథా సౌమ్యో గంధర్వస్త్వథ వారుణః ॥
అయం తు నవమస్తేషాం ద్వీపస్సాగర సంభృతః ।
యోజనానాం సహస్రం తు ద్వీపోఽయం దక్షిణోత్తరః ॥
పూర్వే కిరాతా యస్య స్యుర్దక్షిణే యవనాః స్థితాః ।
పశ్చిమే చ తథా జ్ఞేయా ఉత్తరే హి తపస్వినః ॥
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా మధ్యే శూద్రాశ్చ భూయశః ।
ఇజ్యాయుద్ధపణా సేవా వర్తయంతో వ్యవస్థితాః ॥
మహేంద్రో మలయస్సహ్యస్సు దామా చర్క్షపర్వతః ।
వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తాత్ర కులపర్వతాః ॥
వేదస్మృతి పురాణాద్యాః పారియాత్రోద్భవా మునే ।
సర్వపాపహరా జ్ఞేయా దర్శనాత్స్పర్శనాదపి ॥
నర్మదా సురసాద్యాశ్చ సప్తాన్యాశ్చ సహస్రశః ।
వింధ్యోద్భవా మహానద్య స్సర్వపాపహరాశ్శుభాః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఇప్పుడు నేను భారతదేశమును గూర్చి చెప్పగలను. హిమవత్పర్వతమునకు దక్షిణముగా మరియు సముద్రమునకు ఉత్తరముగా వ్యాపించియున్న భూభాగములోని సమాజము భారతీయసమాజము. ఇచటి జీవనశైలి భారతీయసంస్కృతికి సంబంధించినది. ఓ మహర్షి! ఈ భూభాగము తొమ్మిది వేల యోజనములు విస్తీర్ణమును కలిగియున్నది. ఇది జనులకు స్వర్గమును మరియు మోక్షమును ఇచ్చే కర్మభూమి అని పండితులు చెప్పుచున్నారు. ఏలయనగా, ఈ భూమిలో కర్మను చేయు జనులు స్వర్గనరకములను పొందెదరు. ఈ భారతభూభాగములోని తొమ్మిది విభాగములను గురించి నీకు చెప్పెదను. ఇంద్రద్యుమ్నము, కసేరువు, తామ్రవర్ణము, గభస్తిమాన్, నాగద్వీపము, సౌమ్యము, గంధర్వము, వారుణము మరియు సాగరసంభృతము అను విభాగములు గలవు. వీటిలో తొమ్మిదవ భూభాగము దక్షిణమునుండి ఉత్తరము వరకు వేయి యోజనములు వ్యాపించియున్న ద్వీపము. భారతవర్షమునకు తూర్పునందు

కిరాతులు, దక్షిణమునందు మరియు పశ్చిమమునందు యవనులు, ఉత్తరమునందు తపశ్శాలురు గలరు, మధ్య భాగమునందు బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు అధికముగా గలరు. వారు క్రమముగా యజ్ఞములను, యుద్ధముల ద్వారా దేశరక్షణను, వ్యాపారమును మరియు సేవాకార్యములను చేసి జీవించెదరు. భారతవర్షములో మహేంద్రము, మలయము, సహ్యము, సుదామ, ఋక్షపర్వతము, వింధ్యము, పారియాత్రము అను ఏడు కులపర్వతములు గలవు. ఓ మహర్షీ! పారియాత్ర పర్వతమునుండి పుట్టిన నదులను దర్శించి, స్పృశించి నంత మాత్రాన సకల పాపములు నశించుననీ తెలియదగుననీ వేదములు, స్మృతులు, పురాణములు మొదలగు గ్రంథములు చెప్పు చున్నవి. వింధ్యపర్వతము నుండి నర్మద, సురస మొదలగు ఏడు మహానదులు మరియు వేల సంఖ్యలో ఇతరనదులు పుట్టుచున్నవి. ఈ శుభనదులు సర్వపాపములను పోగొట్టును.

గోదావరీ భీమరథీ తాపీ ప్రముఖనిమ్నగాః ।
గిరేర్వినిర్గతా ఋక్షాత్సద్యః పాపభయాపహాః ॥
సహ్యపాదోద్భవా నద్యః కృష్ణా వేణ్యాదికాస్తథా ।
కృతమాలా తామ్రపర్ణీ ప్రముఖ మలయోద్భవాః ॥
త్రియామా చర్షికుల్యాద్యా మహేంద్రప్రభవాః స్మృతాః ।
ఋషికుల్యా కుమారాద్యాశ్శుక్తిమత్పాద సంభవాః ॥
నానా జనపదాస్తేషు మండలేషు వసంతి వై ।
ఆసాం పిబంతి పానీయం సరస్సు వివిధేషు చ ॥
చత్వారి భారతే వర్షే యుగాన్యాసన్మహామునే ।
కృతాదీని న చాన్యేషు ద్వీపేషు ప్రభవంతి హి ॥
దానాని చిత్ర దీయంతే సుకృతైశ్చాత్ర యాజ్ఞికైః ।
తపస్తపంతి యతయః పరలోకార్థమాదరాత్ ॥
యతో హి కర్మభూరేషా జంబూద్వీపే మహామునే ।
అత్రాపి భారతం శ్రేష్ఠమతోఽన్యా భోగభూమయః ॥
కదాచిల్లభతే మర్త్యస్సహస్రై ర్మునిసత్తమ ।
అత్ర జన్మ సహస్రాణాం మానుష్యం పుణ్యసంచయైః ॥
స్వర్గాపవర్గాస్పదమార్గభూతే ధన్యాస్తు తే భారతభూమిభాగే ।
గాయంతి దేవాః కిల గీతకాని భవంతి భూయః పురుషాసురాస్తే ॥
అవాప్య మానుష్యమయం కదాచిద్విహృత్య శంభోః పరమాత్మరూపే ।
ఫలాని సర్వాణి తు కర్మజాని యాస్యామ్యహం తత్తనుతాం హి తస్య ॥

ఋక్షపర్వతము నుండి పుట్టిన నదులలో గోదావరి, భీమరథి మరియు తాపి అనునవి ప్రముఖమైనవి. అవి స్నానము చేసిన వెంటనే పాపభయమును పోగొట్టును. సహ్యపర్వతసానువుల నుండి కృష్ణ వేణి మొదలగు. నదులు ఉద్భవించినవి. మలయపర్వతము నుండి కృతమాల, తామ్రపర్ణి మొదలైన నదులు

పుట్టినవి. త్రియామ, ఋషికుల్య మొదలైన నదులు మహేంద్రపర్వతమునుండి పుట్టినవి. మరియొక ఋషికుల్య మరియు కుమారి మొదలగు నదులు శుక్తిమత్పర్వతసానువులనుండియు పుట్టినవి. ఆయా మండలములలోని వివిధగ్రామములలో నివసించు జనులు ఈ నదుల జలమును మరియు వివిధసరస్సులలోని జలమును త్రాగుచున్నారు. ఓ మహర్షీ! భారతదేశములో కృతయుగముతో మొదలయ్యే నాలుగు యుగములు గలవు. ఈ యుగములు ఇతరద్వీపములలో లేవు. ఇచట యజ్ఞమును చేసిన పుణ్యాత్ములు దానములనిచ్చేదరు. యతులు పరలోకప్రాప్తి కొరకై శ్రద్ధతో ఇచట తపస్సును చేయుదురు. ఓ మహర్షీ! జంబూద్వీపములోని ఈ భారతదేశము కర్మభూమి యగుటచే శ్రేష్ఠము. ఇతరభూభాగములు భోగము కొరకు ఉద్దేశించబడినవి. ఓ మహర్షి ! జీవుడు వేలాది జన్మలలో సంపాదించిన పుణ్యముయొక్క ప్రభావముచే ఒకసారి ఇచట మనుష్యుడై పుట్టును. పుణ్యాత్ములగు దేవతలు స్వర్గమును మరియు మోక్షమును పొందుటకు ద్వారభూతమైన భారతభూమియందు పురుషులై జన్మించి ధన్యులగుదురని దేవతలు గానము చేయుచుందురు. నేను యాదృచ్ఛికముగా ఇచట మనుష్యుడనై జన్మించితిని. నేను ధ్యానమార్గములో శంభుని పరమాత్మ రూపమునందు విహరించి కర్మలు ఈయదగిన ఫలములను అన్నింటినీ పొంది తరువాత శివునిలో ఐక్యమును పొందెదను.

ఆప్స్యంతి ధన్యాః ఖలు తే మనుష్యాస్సుఖైర్యుతాః కర్మణి సన్నివిష్టాః ।

జనుర్హి యేషాం ఖలు భారతేఽస్తి తే స్వర్గమోక్షో భయలాభవంతః ॥

లక్షయోజన విస్తారస్సమస్త పరిమండలః ।

జంబూద్వీపో మయా ఖ్యాతః క్షారోదధిసు సంవృతః ॥

సంవేష్ట్య క్షారముదధిం శతసాహస్ర సమ్మితమ్ ।

తతో హి ద్విగుణో బ్రహ్మన్ ప్లక్షద్వీపః ప్రకీర్తితః ॥

గోమంతశ్చైవ చంద్రశ్చ నారదో దర్దురస్తథా ।

సోమకస్సుమనాశ్శైలో వైభ్రాజశ్చైవ సత్తమః ॥

వర్షాచలేషు రమ్యేషు సహితాస్సతతం ప్రజాః ।

వసంతి దేవగంధర్వా వర్షేష్వేతేషు నిత్యశః ॥

నాధయో వ్యాధయో వాపి జనానాం తత్ర కుత్రచిత్ ।

దశ వర్షసహస్రాణి తత్ర జీవంతి మానవాః ॥

అనుతప్తా శిఖీ చైవ పాపఘ్నీ త్రిదివా కృపా ।

అమృతా సుకృతా చైవ సప్తైవాత్ర చ నిమ్నగాః ॥

క్షుద్రనద్యస్తథా శైలస్తత్ర సంతి సహస్రశః ।

తాః పిబంతి సుసంహృష్టా నదీర్జనపదాస్తు తే ॥

న తత్రాపి యుగావస్థా యథా స్థానేషు సప్తసు ।

త్రేతాయుగసమః కాలస్సర్వదైవ మహామునే ॥

విప్రక్షత్రియవైశ్యాస్తే శూద్రాశ్చ మునిసత్తమ ।

కల్పవృక్ష సమానస్తు తన్మధ్యే సుమహాతరుః ॥

ఏ మానవులైతే భారతదేశములో జన్మించి కర్మలను చేయుచూ సుఖములననుభవిస్తూ జీవించెదరో, వారు ధన్యులు. వారికి స్వర్గము మరియు మోక్షము అనే రెండు లాభములు కలుగును. లక్ష యోజనముల వైశాల్యము కలిగి ఉప్పు నీటి సముద్రముతో చుట్టువారబడియున్న జంబూ ద్వీపము అనేకములగు అవాంతరభూభాగములతో కూడియున్నది. నేను దానిని గురించి చెప్పితిని. ఓ మహర్షీ! లక్షయోజనముల విస్తారము గల ఉప్పునీటి సముద్రమును చుట్టువారీ దానికి రెట్టింపు వైశాల్యము గల ప్లక్ష ద్వీపము గలదని కీర్తించబడినది. గోమంతము, చంద్రము, నారదము, దద్దురము, సోమకము, సుమనస్సు, మరియు వైభాజము అనే ఏడు శ్రేష్ఠమగు వర్షపర్వతములు గలవు. సుందరమగు ఆ పర్వతములలో జనులు, దేవతలు, గంధర్వులు సర్వకాలములలో కలిసి జీవించేదరు. అచట ఎక్కడైననూ జనులకు శారీరకవ్యాధులు గాని, మానసిక వ్యాధులు గాని లేవు. అచట మానవులు పదివేల సంవత్సరములు జీవించేదరు. అచట అనుతప్త, శిఖి, పాపఘ్ని, త్రిదివ, కృప, అమృత, సుకృత అనే ఏడు నదులు గలవు. అచట చిన్న నదులు మరియు పర్వతములు వేల సంఖ్యలో గలవు. అచటి జనపదములలోని జనులు ఆ జలములను మహానందముతో త్రాగుచుందురు. దానిలో ఏడు అవాంతర భూభాగములు గలవు. వాటిలో ఎక్కడనైననూ యుగవ్యవస్థ లేదు. ఓ మహామునీ ! అచట కాలము సర్వదా త్రేతాయుగములో వలె ధర్మపూర్ణమైయుండును. ఓ మహర్షీ! అక్కడ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మరియు శూద్రులు గలరు. దానికి మధ్యభాగములో కల్పవృక్షముతో సమానమైన మిక్కిలి పెద్ద వృక్షము గలదు.

ప్లక్షస్తన్నామ సంజ్ఞో వై ప్లక్షద్వీపో ద్విజోత్తమ ।
ఇజ్యతే తత్ర భగవాన్ శంకరో లోకశంకరః ॥
హరిశ్చ భగవాన్ బ్రహ్మా యంత్రైర్మంత్రై శ్చ వైదికైః ।
సంక్షేపణ తథా భూయశ్శాల్మలిం త్వం నిశామయ ॥
సప్తవర్షాణి తత్రైవ తేషాం నామాని మే శృణు ।
శ్వేతోఽథ హరితశ్చైవ జీమూతో రోహితస్తథా ॥
వైకలో మానసశ్చైవ సుప్రభస్సప్తమో మునే ।
శాల్మలేన తు వృక్షేణ ద్వీపశ్శాల్మలి సంజ్ఞకః ॥
ద్విగుణేన సముద్రేణ సతతం సంవృతః స్థితః ।
వర్షాభివ్యంజకా నద్యస్తాసాం నామాని మే శృణు ॥
శుక్లా రక్తా హిరణ్యా చ చంద్రా శుభ్రా విమోచనా ।
నివృత్తిస్సప్తమీ తాసాం పుణ్యతోయాః సుశీతలాః ॥
సప్తైవ తాని వర్షాణి చతుర్వర్ణయుతాని చ ।
భగవంతం సదా శంభుం యజంతే వివిధైర్మఖైః ॥
దేవానాం తత్ర సాన్నిధ్యమతీవ సుమనోరమే ।
ఏష ద్వీపస్సముద్రేణ సురోదేన సమావృతః ॥

ద్విగుణేన కుశద్వీపస్సమంతాద్బాహ్యతః స్థితః ।
వసంతి తత్ర దైతేయా మనుజైస్సహ దానవాః ॥
తథైవ దేవగంధర్వా యక్షాః కింపురుషాదయః ।
వర్ణాస్తత్రైవ చత్వారో నిజానుష్ఠాన తత్పరాః ॥
తత్రైవ చ కుశద్వీపే బ్రహ్మాణం చ జనార్ధనమ్ ।
యజంతి చ తథేశానం సర్వకామ ఫలప్రదమ్ ॥
కుశేశయో హరిశ్చైవ ద్యుతిమాన్ పుష్పవాంస్తథా ।
మణిద్రుమో హేమశైలస్సప్తమో మందరాచలః ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! ఆ వృక్షమునకు ప్లక్షము అని పేరు. అందువలననే ఆ ద్వీపమునకు ప్లక్షద్వీపము అనే పేరు వచ్చినది. అచట ప్రాణులకు మంగళములనిచ్చు శంకరుడు యజ్ఞములలో ఆరాధించబడును. విష్ణుభగవానుడు, బ్రహ్మ వైదికమంత్రములతో మరియు యంత్రములతో అచట ఆరాధించ బడెదరు. ఇప్పుడు శాల్మలీ ద్వీపమును గురించి సంక్షేపముగా వినుము. దానియందు ఏడు భూభాగములు గలవు. వాటి పేర్లను వినుము. శ్వేతము, హరితము, జీమూతము, రోహితము, వైకలము, మానసము, సుప్రభము అనునవి వాటి పేర్లు. ఓ మునీ! శాల్మలి (బూరుగ) వృక్షము ఉండుటచే దానికి శాల్మలీ ద్వీపము అను పేరు వచ్చినది. అది రెట్టింపు విస్తారము గల సముద్రముచే సర్వదా చుట్టువారబడి యుండును. ఆయా భూభాగములను సూచించే నదుల పేర్లను చెప్పెదను. వినుము. శుక్ల, రక్త, హిరణ్య, చంద్ర, శుభ్ర, విమోచన, నివృత్తి అనే ఈ నదులలోని పవిత్రజలములు మిక్కిలి చల్లగా నుండును. ఈ ఏడు భూభాగములలో నాలుగు వర్ణముల ప్రజలు గలరు. వారు సర్వదా శంభుభగవానుని వివిధయజ్ఞములచే ఆరాధించెదరు. మిక్కిలి మనోహరమగు ఈ ద్వీపములో దేవతలు తరచుగా సంచరించెదరు. ఇది రెట్టింపు వైశాల్యము గల రససముద్రముచే చుట్టువారబడి యుండును. దానికి బయట అన్ని వైపులయందు కుశద్వీపము గలదు. అచట మానవులతో బాటు దైత్యులు మరియు దానవులు కూడ నివసించేదరు. ఇంతేగాక, అచట దేవతలు, గంధర్వులు, యక్షులు, కింపురుషులు మొదలగు వారు నివసించేదరు. అచటి నాలుగు వర్ణముల ప్రజలు తమ తమ కర్మలను చేయుటయందు అభిరుచిని కలిగి యుందురు. ఆ కుశద్వీపమునందు బ్రహ్మను, జనార్దనుడగు విష్ణువును, మరియు కోరికలను అన్నింటినీ తీర్చే శివుని ఆరాధించెదరు. అచట కుశేశయము, హరి, ద్యుతిమాన్, పుష్పవాన్, మణిద్రుమము, హేమశైలము మరియు మందరము అనే ఏడు పర్వతములు గలవు.

నద్యశ్చ సప్త తాసాం తు నామాని శృణు తత్త్వతః ।
ధూతపాపా శివా చైవ పవిత్ర సంమితిస్తథా ॥
విద్యా దంభా మహీ చాన్యా సర్వపాపహరాస్త్విమాః ।
అన్యాసహస్రశస్సంతి శుభాపో హేమవాలుకాః ॥

కుశద్వీపే కుశస్తంబో ఘృతోదేన సమావృతః ।
క్రౌంచద్వీపే మహాభాగ శ్రూయతాం చాపరో మహాన్ ॥
ద్విగుణేన సముద్రేణ దధిమండేన చావృతః ।
వర్షాచలా మహాబుద్ధే తేషాం నామాని మే శృణు ॥
క్రౌంచశ్చ వామనశ్చైవ తృతీయశ్చాంధకారకః ।
దివావృతిర్మనశ్చైవ పుండరీకశ్చ దుందుభిః ॥
నివసంతి నిరాతంగా వర్షశైలేషు తేషు వై ।
సర్వసౌవర్ణరమ్యేషు సుహృద్దేవగణైః ప్రజాః ॥
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూ ద్రాశ్చాను క్రమోదితాః ।
సంతి తత్ర మహానద్యస్సన్యాస్తు సహస్రశః ॥
గౌరీ కుముద్వతీ చైవ సంధ్యా రాత్రిర్మనో జవా ।
శాంతిశ్చ పుండరీకా చ యాః పిబంతి పయశ్శుభమ్ ॥
భగవాన్ పూజ్యతే తత్ర యోగరుద్ర స్వరూపవాన్ ।
దధిమండోదకశ్చాపి శాకద్వీపేన సంవృతః ॥
ద్విగుణేనాద్రయస్సప్త తేషాం నామాని మే శృణు ।
పూర్వే తత్రోదయగిరిర్జలధారః పరే యతః ॥
పృష్ఠతోఽస్త గిరిశ్చైవ హ్యవికేశశ్చ కేసరీ ।
శాకస్తత్ర మహావృక్షస్సిద్ధ గంధర్వ సేవితః ॥
తత్ర పుణ్యా జనపదాశ్చాతుర్వర్ణ్య సమన్వితాః ।
నద్యశ్చాత్ర మహాపుణ్యా స్సర్వపాప భయాపహాః ॥
సుకుమారీ కుమారీ చ నలినీ వేణుకా తథా ।
ఇక్షుశ్చ రేణుకా చైవ గభస్తిస్సప్తమీ తథా ॥
అన్యాస్సహస్ర శస్తత్ర క్షుద్రనద్యో మహామునే ।
మహీధరాస్తథా సంతి శతశోఽథ సహస్రశః ॥

అచట ఏడు నదులు గలవు. వాటి నామములను యథార్థముగా విని తెలుసుకొనుము. ధూ౦ాతపాప, శివ, పవిత్ర, సమ్మితి, విద్య, దంభ మరియు మహి అనే ఆ నదులు పాపములన్నింటినీ హరించును. ఇవియే గాక, స్వచ్ఛమగు జలములు మరియు బంగరు ఇసుకతిన్నెలు గల నదులు వేల సంఖ్యలో గలవు. కుశద్వీపములో దర్భగడ్డి నేయి సముద్రముతో చుట్టువారబడి యున్నది. ఓ మహాత్మా! క్రౌంచము అనే మరియొక పెద్ద ద్వీపమును గురించి వినుము. అది రెట్టింపు వైశాల్యము గల పెరుగు-వెన్నల సముద్రముచే చుట్టువారబడి యున్నది. ఓ గొప్ప బుద్ధిశాలీ ! అచట నున్న వర్షపర్వతముల పేర్లను నానుండి వినుము. క్రౌంచము, వామనము, అంధకారకము, దివావృతి, మనస్సు, పుండరీకము, దుందుభి అనునవి వాటి పేర్లు, అంతటా బంగరు వన్నెలతో ప్రకాశించే ఆ వర్షపర్వతములయందు జనులు మిత్రులైన దేవతలతో కలిసి భయము లేకుండగా నివసించెదరు. అచట బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు క్రమవికాసము గలవారై

నివసించెదరు. అచట ఏడు మహానదులు మాత్రమే గాక, ఇతరనదులు కూడ వేల సంఖ్యలో గలవు. గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, శాంతి, పుండరీక అనే పేర్లు గల ఆ నదుల శుభజలమును జనులు త్రాగెదరు. యోగరుద్రరూపములో నున్న భగవానుని వారు పూజించేదరు. పెరుగు-వెన్న సముద్రమును చుట్టి రెట్టింపు వైశాల్యము గల శాకద్వీపము గలదు. దానియందు ఏడు పర్వతములు గలవు. వాటి పేర్లను చేప్పదను. వినుము. తూర్పు దిక్కునందు ఉదయగిరి గలదు. దాని తరువాత జలధారపర్వతము గలదు. దాని వెనుక అస్తపర్వతము, అవికేశము, కేసరి గలవు. అచట శాకము (టేకు) మహావృక్షము. ఆ ద్వీపమును సిద్ధులు, గంధర్వులు సేవించేదరు. దానియందు పవిత్రమగు పల్లెలు గలవు. వాటియందు నాలుగు వర్ణముల జనులు నివసించెదరు. అచటి పరమపవిత్రమగు నదులు సకలపాపభయములను పోగొట్టునవి. సుకుమారి, కుమారి, నలిని, వేణుక, ఇక్షువు, రేణుక మరియు గభస్తి అనునవి ఆ ఏడు నదుల పేర్లు. ఓ మహర్షీ! అచట చిన్న నదులు వేల సంఖ్యలో గలవు. మరియు పర్వతములు అసంఖ్యాకముగా గలవు.

ధర్మహానిర్న తేష్వస్తి స్వర్గాదాగత్య మానవాః ।
వర్షేషు తేషు పృథివీం విహరంతి పరస్పరమ్ ॥
శాకద్వీపే తు వై సూర్యః ప్రీత్యా జనపదైస్సదా ।
యథోక్తైరిజ్యతే సమ్యక్కర్మభిర్ని యతాత్మభిః ॥
క్షీరోదేనావృతస్సోఽపి ద్విగుణేన సమంతతః ।
క్షీరాబ్ధిస్సర్వతో వ్యాస పుష్కరాఖ్యేన సంవృతః ॥
ద్విగుణేన మహావర్షస్తత్ర ఖ్యాతోఽత్ర మానసః ।
యోజనానాం సహస్రాణి పంచైవోర్ధ్వ సముచ్ఛ్రితః ॥
తాని చైవ తు లక్షాణి సర్వతో వలయాకృతి ।
పుష్కరద్వీపవలయో మధ్యేన విభజంతి చ ॥
తేనైవ వలయాకారా ద్వీపవర్ష సమాకృతిః ।
దశవర్షసహస్రాణి తత్ర జీవంతి మానవాః ॥
నిరామయా వీతశోకా రాగద్వేష వివర్జితాః ।
అధర్మో న మతస్తేషాం న బంధవధకౌ మునే ॥
సత్యానృతే న తస్యాస్తాం సదైవ వసతిస్సదా ।
తుల్యవేషాస్తు మనుజా హేమవర్ణైక రూపిణః ॥
వర్షశ్చాయం తు కాలేయ భౌమస్వర్గోపమో మతః ।
సర్వస్య సుఖదః కాలే జరారోగ వివర్జితః ॥
పుష్కరే ధాతకీఖండే మహావీతే మహామునే ।
న్యగ్రోధం పుష్కరద్వీపే బ్రహ్మణః స్థానముత్తమమ్ ॥

ఈ భూఖండములలో ధర్మమునకు హాని కలుగదు. అచట మానవులు స్వర్గమునుండి భూమికి ి దిగి వచ్చిన దేవతలతో కలిసి మెలిసి విహరించెదరు. శాకద్వీపమునందలి ప్రజలు మనోనిగ్రహము గలవారై యథావిధిగా కర్మలను

అనుష్ఠించి ప్రీతితో సూర్యుని సర్వకాలములలో చక్కగా ఆరాధించెదరు. ఆ ద్వీపము రెట్టింపు వైశాల్యము గల పాల సముద్రముచే చుట్టువారబడి యున్నది. ఓ వ్యాసా! ఆ పాల సముద్రమును అన్ని వైపులా చుట్టి రెట్టింపు వైశాల్యము గల పుష్కరమనే పెద్ద ద్వీపము గలదు. అచట ఐదు వేల యోజనముల ఎత్తు గల మానసమనే పర్వతము గలదు. దాని చుట్టు అయిదు లక్షల యోజనముల నిడివిగల పుష్కరద్వీపము గలదు. అది వలయాకారములో మధ్యలో జనపదములచే విభజింపబడి యుండును. ద్వీపము మరియు వర్షములు సమానమైన వలయాకారమును కలిగియున్నవి. అచటి మానవులు పది వేల సంవత్సరముల వరకు జీవించెదరు. వారియందు రోగములు, శోకము, మరియు రాగద్వేషములు లేవు. వారికి అధర్మము తెలియదు. అచట కారాగారము మరియు మరణశిక్ష అనునవి లేవు. వారికి సత్యము మరియు అసత్యము అనునవి తెలియవు. అచట సర్వదా రాత్రి ఉండును. అచటి మానవులు బంగరు రంగు గలవారై సమానమగు దేహసంస్థానమును మరియు వేషమును కలిగి యుందురు. ఓ మహర్షీ! ఈ వర్షము భూలోక స్వర్గమని చెప్పెదరు. అచట సర్వకాలములలో సర్వమానవులు రోగము, వృద్ధాప్యము లేనివారై సుఖముగా నుండెదరు. ఓ మహర్షీ! పుష్కరద్వీపమునందలి ధాతకీఖండములో మహావీతమునందు గల మర్రి చెట్టు బ్రహ్మయొక్క ఉత్తమమగు స్థానము.

తస్మిన్నవసతే బ్రహ్మా పూజ్యమాన స్సురాసురైః ।
స్వాదూదకేనాంబుధినా పుష్కరః పరివేష్టితః ॥
ఏవం ద్వీపాస్సముద్రైస్తు సప్త సప్తభిరావృతాః ।
ద్వీపాశ్చైవ సముద్రాశ్చ సమానా ద్విగుణైః పరైః ॥
ఉక్తాతిరిక్తతా తేషాం సముద్రేషు సమాని వై ।
పయాంసి సర్వదాఽల్పత్వం జాయతే న కదాచన ॥
స్థాలీస్థమగ్ని సంయోగాదధః స్థం మునిసత్తమ ।
తథేందువృద్ధౌ సలిలమూర్ధ్వగం భవతి ధ్రువమ్ ॥
ఉదయాస్తమనే త్విందోర్వర్ధంత్యాపో హ్రసంతి చ ।
అతో న్యూనాతిరిక్తాశ్చ పక్షయోశ్శుక్ల కృష్ణయోః ॥
అపార వృద్ధిక్షయౌ దృష్టౌ శతశస్తు దశోత్తరమ్ ।
సముద్రాణాం మునిశ్రేష్ఠ సర్వేషాం కథితం తవ ॥
భోజనం పుష్కరద్వీపే ప్రజాస్సర్వాస్సదైవ హి ।
ఖండస్య కుర్వతే విప్ర తత్ర స్వయముప స్థితమ్ ॥
స్వాంగదో యస్య పరతో నాస్తి లో కస్య సంస్థితిః ।
ద్విగుణా హిరణ్మయీ భూమిస్సర్వజంతు వివర్జితా ॥
లోకాలోకస్తతశ్శైలస్సహస్రాణ్యచలో హి సః ।
ఉచ్ఛ్రాయేణ హి తావంతి యోజనాయుత విస్తృతః ॥

తమశ్చాండకటాపాన సేయముర్వీ మహామునే ।

పంచాశత్కోటివిస్తారా సద్వీపా సమహీధరా ॥

ఆధారభూతా సర్వేషాం సర్వభూతగుణాధికా ।

సేయం ధాత్రీ చ కాలేయ సర్వేషాం జగతామిలా ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం సప్తద్వీపవర్ణనం నామ అష్టాదశోఽధ్యాయః ॥

దేవతలచే మరియు రాక్షసులచే పూజింపబడే బ్రహ్మ ఆ ద్వీపమునందు నివసించును. పుష్కరద్వీపము మంచినీటి సముద్రముచే చుట్టువారబడి యున్నది. ఈ విధముగా ఏడు ద్వీపములు ఏడు సముద్రములచే చుట్టువారబడి యున్నవి. ద్వీపములు మరియు సముద్రములు క్రమముగా తరువాతీది ముందు దానికంటే వైశాల్యములో రెట్టింపు ఉండును. వాటీ మాహాత్మ్యము చెప్పబడినది, ఆ సముద్రములలో నీరు సమానమగు పరిమాణములో నుండును. ఆ నీరు ఎన్నడైననూ తగ్గే ప్రసక్తి లేదు. ఓ మహర్షీ! గిన్నెలో నీరు పోసి నిప్పులపై పెట్టినచో ఆ నీరు పైకి పోవుట నిశ్చయము. అదే విధముగా చంద్రుని కళలు పెరిగినప్పుడు సముద్రములోని నీరు కూడ పైకి నిశ్చయముగా ఎగిరి పడును. చంద్రుడు ఉదయించే సమయములో సముద్రము ఉప్పొంగును. కాని చంద్రుడు అస్తమించినప్పుడు సముద్రజలములు శాంతముగా నుండి వెనుకకు తగ్గును. ఈ విధముగా శుక్లకృష్ణపక్షములలో సముద్రమునకు ఆటుపోటులు వచ్చుచుండును. ఓ మహర్షీ! ఈ సముద్రములలో నీటియొక్క పరిమాణము నూటపది శాతము వరకు పెరిగి, మరల తగు చుండును. ఈ వివరములను అన్నింటినీ నేను నీకు చెప్పియుంటిని. ఓ బ్రాహ్మణా! పుష్కర ద్వీపములో పటిక బెల్లము దానంతట అదియే ఉత్పన్నమగును. అచటి ప్రజలు సర్వదా దానినే భక్షించేదరు. దాని తరువాత నుండే భూభాగములో హిరణ్యగర్భదేహమునుండి పుట్టిన ప్రాణిసముదాయము లేదు. ఏ ఒక్క ప్రాణియైననూ కంటికి కానరాని అట్టి భూభాగము బంగారముచే కప్పబడి పుష్కరద్వీపమునకు రెండు రెట్లు వైశాల్యమును కలిగియుండును. దాని తరువాత లోకాలోకపర్వతము గలదు. ఆ పర్వతము వేయి యోజనములు ఎత్తు, అంతే కైవారము కలిగియున్నది. అది ఆ పైనీ బ్రహ్మాండముతో సహా చీకటితో నిండియుండును. ఓ మహర్షీ! ద్వీపములతో మరియు పర్వతములతో కూడియున్న ఈ భూమండలము ఏబది కోట్ల యోజనముల వైశాల్యమును కలిగియున్నది. ఓ కాలీనందనా! సర్వప్రాణులకు ఆధారమైన ఈ భూమి ఇతరభూతములన్నింటికంటే అధిక గుణములను కలిగియున్నది. సర్వప్రాణులను ఈ భూమియే తల్లివలె పోషించుచున్నది.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు సప్తద్వీపవర్ణనమనే పదునెనిమిదవ అధ్యాయము ముగిసినది.

19 – లోక వర్ణనము

సనత్కుమార ఉవాచ ।

రవిచంద్రమసోర్యావన్మయూఖా భాసయంతి హి ।
తావత్ప్రమాణా పృథివీ భూలోకస్స తు గీయతే ॥
భూమేర్యోజనలక్షే తు సంస్థితం రవిమండలమ్ ।
యోజనానాం సహస్రాణి సదైవ పరిసంఖ్యయా ॥
శశినస్తు ప్రమాణాయ జగతః పరిచక్షతే ।
రవేరూర్ధ్వం శశీ తస్థౌ లక్షయోజన సంఖ్యయా ॥
గ్రహాణాం మండలం కృత్స్నం శశేరుపరి సంస్థితమ్ ।
సనక్షత్రం సహస్రాణి దశైవ పరితోపరి ॥
బుధస్తస్మాదథో కావ్యస్తస్మాద్భౌమస్య మండలమ్ ।
బృహస్పతిస్త దూర్ధ్వం తు తస్యోపరి శనైశ్చరః ॥
సప్తర్షిమండలం తస్మాల్లక్షేణైకేన సంస్థితమ్ ।
ఋషిభ్యస్తు సహస్రాణాం శతాదూర్ధ్వం ధ్రువః స్థితః ॥
మేఢీభూతస్స యస్తస్య జ్యోతిశ్చ క్రస్య వై ధ్రువః ।
భూర్భువస్స్వరితి జ్ఞేయం భువ ఊర్ధ్వం ధ్రువాదవాక్ ॥
ఏకయోజనకోటిస్తు యత్ర తే కల్పవాసినః ।
ధ్రువాదూర్ధ్వం మహర్లోకస్సప్తైతే బ్రహ్మణస్సుతాః ॥
సనకశ్చ సనందశ్చ తృతీయశ్చ సనాతనః ।
కపిలశ్చాసురిశ్చైవ వోఢుః పంచశిఖస్తథా ॥
ఉపరిష్టాత్తతశ్శుక్రో ద్విలక్షాభ్యంతరే స్థితః ।
ద్విలక్షయోజనం తస్మాదధస్సోమసుత స్స్మృతః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఎంతవరకు సూర్యచంద్రుల కిరణములు ప్రకాశింప జేయునో, అంతవరకు గల పృథివి భూలో కమనబడును. ఖచ్చితముగా అంచనావేయగా, సూర్యమండలము భూమికి లక్ష యోజనముల దూరములో నున్నదని నిర్ధారించ బడినది. చంద్రమండలము ఎల్లప్పుడు భూమికి కొన్ని వేల యోజనముల దూరములో నుండును. చంద్రుడు సూర్యుని పైన లక్ష యోజనముల దూరములో నున్నాడు. గ్రహమండలము అంతయు నక్షత్రములతో సహా చంద్రునికి పైన ఒక్కొక్కటీ మరియొక దానికి పది వేల యోజనముల దూరములో నున్నది. ముందుగా బుధుడు గలడు. ఆ పైన శుక్రుడు, ఆ పైన కుజమండలము, ఆ పైన గురువు, ఆ పైన శని గలరు. ఆ పైన లక్షయోజనముల దూరములో సప్తర్షి మండలము గలదు. సప్తర్షులకు లక్ష యోజనముల ఎత్తులో ధ్రువమండలము గలదు. ధ్రువమండలము నక్షత్రచక్రమును నిలబెట్టే స్తంభము వంటిది. భూమికి పైన ధ్రువమండలమునకు క్రింద భువః, సువః అనే లోకములుగలవు.

ధ్రువనక్షత్రమునకు కోటి యోజనముల పైన మహర్లోకము గలదు. అచట బ్రహ్మపుత్రులు ఏడుగురు కల్పము ఉన్నంత వరకు నివసించేదరు. సనకుడు, సనందుడు, సనాతనుడు, కపిలుడు, ఆసురి, వోడుడు, పంచశిఖుడు అనునవి వారి పేర్లు. దానికి పైన రెండు లక్షల యోజనముల లోపులో శుక్రుడు, రెండు లక్షల యోజనముల క్రింద బుధుడు గలరు.

ద్విలక్షయోజనం తస్మాదూర్ధ్వం భౌమః స్థితో మునే ।
ద్విలక్షయోజనం తస్మాదూర్ధ్వం జీవః స్థితో గురుః ॥
ద్విలక్షయోజనం జీవాదూర్ధ్వం సౌరిర్వ్యవస్థితః ।
ఏతే సప్తగ్రహాః ప్రోక్తాస్స్వస్వరాశివ్యవ స్థితాః ॥
రుద్రలక్షైర్యోజన తస్సప్తోర్ధ్వమృషయః స్థితాః ।
విశ్వలక్షైర్యోజనతో ధ్రువస్థితి రుదాహృతా ॥
చతుర్గుణోత్తరే చార్ధే జనలోకాత్త పస్స్మృతమ్ ।
వైరాజా యత్ర దేవా వై స్థితా దాహవివర్జితాః ॥
షడ్గుణేన తపోలోకాత్సత్యలకో వ్యవస్థితః ।
బ్రహ్మలోకస్స విజ్ఞేయో వసంత్యమలచేతసః ॥
సత్య ధర్మరతాశ్చైవ జ్ఞానినో బ్రహ్మచారిణః ।
యద్గామినోఽథ భూలోకాన్నివసంతి హి మానవాః ॥
భువర్లోకే తు సంసిద్ధా మునయో దేవరూపిణః ।
స్వర్గలోకే సురాదిత్యా మరుతో వసవోఽశ్వినౌ ॥
విశ్వే దేవాస్తథా రుద్రాద్రస్సాధ్యా నాగాః ఖగాదయః ।
నవగ్రహో స్తతస్తత్ర ఋషయో వీతకల్మషాః ॥
ఏతే సప్త మహాలోకాః కాలేయ కథితాస్తవ ।
పాతాలాని చ సప్తైవ బ్రహ్మాండస్య చ విస్తరః ॥
దధివృక్షఫలం యద్వద్వృత్తిశ్చోర్ధ్వ మధస్తథా ।
ఏతదండకటాహేన సర్వతో వై సమావృతమ్ ॥
దశగుణేన పయసా సర్వతస్తత్సమా వృతమ్ ।
వహ్నినా వాయునా చాపి నభసా తమసా తథా ॥

ఓ మునీ ! దానికి రెండు లక్షల యోజనముల పైన శుక్రగ్రహము గలదు. దానికి రెండు లక్షల యోజనముల పైన గురుగ్రహము గలదు. గురువునకు రెండు లక్షల యోజనముల పైన శని గలడు. ఇంతవరకు చెప్పబడిన ఏడు గ్రహములు తమ తమ రాశులలో నుండును. శనికి పదకొండు లక్షల యోజనముల పైన సప్తర్షిమండలము, పదునాలు లక్షల యోజనముల పైన ధ్రువనక్షత్రము గలవు. జనలో కము నుండి అరవై మూడు లక్షల యోజనముల పైన తపోలోకము గలదని చెప్పబడినది. అచట తాపమునెరుంగని వైరాజదేవతలు నివసించేదరు. తపోలోకమునకు ఎనభై నాలుగు లక్షల యోజనముల పైన సత్యలోకము గలదు. అదియే బ్రహ్మలోకమని తెలియదగును. పవిత్రమగు అంతఃకరణము గలవారు,

సత్యమునందు మరియు ధర్మము నందు ప్రీతి గలవారు, జ్ఞానులు, బ్రహ్మచారులు అగు మానవులు భూలోకమునుండి వెళ్లి, అచట నివసించేదరు. గొప్ప సిద్ధులు గల మునులు దేవరూపమును దాల్చి భువర్లోకమునందు నివసించెదరు. స్వర్గలోకమునందు దేవతలు, ఆదిత్యులు, మరుత్తులు, వస్తువులు, అశ్వినీదేవతలు, విశ్వేదేవతలు, రుద్రులు, సాధ్యులు, నాగులు, ఖగులు మొదలగువారు నివసించేదరు. దానికి పైన నవగ్రహములు, ఆ పైన పాపసంబంధము లేని సప్తర్షులు ఉండేదరు. ఓ కాళీనందనా ! నేను నీకు ఈ ఏడు మహాలోకములను గురించి చెప్పితిని. పాతాళములు కూడ ఏడు గలవు. ఈ విధముగా బ్రహ్మాండము విస్తరించి యున్నది. కపిత్థవృక్షము యొక్క ఫలములు నేలకు క్రింద మరియు పైన కూడ వ్యాపించియుండును. అదే విధముగా, క్రింద మరియు పైన అంతటా వ్యాపించి యున్న ఈ జగత్తు రెండు అర్ధభాగముల రూపములో బ్రహ్మాండము లోపల ఇమిడి యున్నది. ఈ బ్రహ్మాండము పది రెట్లు పరిమాణము గల నీటిచేత, అగ్ని-వాయు-ఆకాశములచేత మరియు చీకటిచే అంతటా చుట్టువారబడి యున్నది.

భూతాదినాపి మహతా దిగ్గుణోత్తర వేష్టితః ।
మహాంతం చ సమావృత్య ప్రధానం పురుషః స్థితః ॥
అనంతస్య న తస్యాస్తి సంఖ్యాపి పరమాత్మనః ।
తేనానంత ఇతి ఖ్యాతః ప్రమాణం నాస్తి వై యతః ॥
హేతుభూతస్సమస్తస్య ప్రకృతి పరా మునే ।
అండానాం తు సహస్రాణాం సహస్రాణ్యయుతాని చ ॥
ఈదృశానాం ప్రభూతాని తస్మాదవ్యక్తజన్మనః ।
దారుణ్యగ్నిస్తిలే తైలం పయస్సు చ యథా ఘృతమ్ ॥
తథాసౌ పరమాత్మా వై సర్వం వ్యాప్యాత్మవేదనః ।
ఆదిబీజాత్ప్రసువతే తతస్తేభ్యః పరేండజాః ॥
తేభ్యః పుత్రాస్తథా న్యేషాం బీజాన్యన్నాని వై తతః ।
మహదాదయో విశేషాంతాస్తద్భవంతి సురాదయః ॥
బీజాద్వృక్ష ప్రరోహేణ యథా నాపచయస్తరోః ।
సూర్యకాంత మణేస్సూర్యాద్యద్వద్వహ్నిః ప్రజాయతే ॥
తద్వత్సంజాయతే సృష్టిశివస్తత్ర న కామయేత్ ।
శివశక్తిసమాయోగే దేవాద్యాః ప్రభవంతి హి ॥
తథా స్వకర్మణైకేన ప్రరోహముపయాంతి వై ।
బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ స శివః పరిగీయతే ॥
తస్మాదుద్ధరతే సర్వం యస్మింశ్చ లయమేష్యతి ।
కర్తా క్రియాణాం సర్వాసాం స శివః పరిగీయతే ॥

పంచభూతములకు కారణమైనది, బ్రహ్మాండమునకు ఎనిమిది రెట్లు పరిమాణము గలది అగు ఁ మహత్తత్త్వముచే బ్రహ్మాండము. చుట్టువారబడి యున్నది. మహత్తత్త్వమును మరియు ప్రధానమును చుట్టువారి పురుషుడు (పరమాత్మ) గలడు. ఆ పరమాత్మ ఇన్ని రెట్లు పెద్దవాడు అనే సంఖ్యను చెప్పుట సంభవము కాదు. ఆయనకు పరిచ్ఛేదము లేదు. అందువలననే, ఆయనకు అనంతుడని పేరు వచ్చినది. ఓ మునీ! ఆ అనంతుడే సర్వమునకు కారణుడు. ఆయనయే పరా ప్రకృతి. వ్యక్తము కాని జన్మ గల ఆ పరా ప్రకృతి నుండి వేల, పదివేల, లక్షల సంఖ్యలో ఈ బ్రహ్మాండము వంటి బ్రహ్మాండములు పుట్టుచున్నవి. ఆత్మస్వరూపమును తెలుసుకొని యున్న ఆ పరమేశ్వరుడు కర్రలో నిప్పువలె, నువ్వులలో నూనె వలె, పాలలో నేయి వలె అంతటా వ్యాపించి యున్నాడు. ఆదిబీజమగు ఆ పరమేశ్వరునినుండి మహత్తత్త్వముతో మొదలిడి పరమాణు విశేషముల వరకు గల సర్వ ప్రకృతి వికృతులు, దేవతలు, పక్షులు, వాటి సంతానము, ఇతరప్రాణులు, వాటి బీజములు సర్వప్రాణుల ఆహారములు ఇత్యాది సర్వము పుట్టినవి. బీజమునుండి చెట్టు పుట్టిననూ, అది చెట్టునకు లోటు కాదు. సూర్యకాంతమణిపై సూర్యకిరణములు పడినప్పుడు నిప్పు పుట్టును. అదే విధముగా, సృష్టి ఉద్భవించుచున్నది. శివునకు దానియందు కామన (సంగము) లేదు. శివశక్తుల సమాగమముచే దేవతలు మొదలగు ప్రాణులు పుట్టుచున్నవి. ఆ శివుడు ఒక్కడే తాను చేసే పనులను బట్టి బ్రహ్మ-విష్ణు-రుద్ర- రూపములలో ప్రకటమగుచున్నాడు. శివుని నుండియే సర్వము. ఉద్భవించుననియు, సర్వము ఆయనయందు మాత్రమే లయమగుననియు, సర్వక్రియలకు కర్త ఆ శివుడేననియు మహర్షులు కీర్తించుచున్నారు.

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ ఛింధి మే సంశయం మహత్ ।
సంతి లోకా హి బ్రహ్మాండాదుపరిష్టాన్న వా మునే ॥

వ్యాసుడు ఇట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. నాకు ఒక పెద్ద సందేహము గలదు. దానిని పోగొట్టుము. ఓ మునీ ! బ్రహ్మాండమునకు పైన లోకములు ఉన్నవా? లేవా?

సనత్కుమార ఉవాచ ।

బ్రహ్మాండాదుపరిష్టాచ్చ సంతి లోకా మునీశ్వర ।
తాన్ శృణు త్వం విశేషేణ వచ్మి తేఽహం సమాసతః ॥
విధిలోకాత్పరో లోకో వైకుంఠ ఇతి విశ్రుతః ।
విరాజతే మహాదీప్త్యా యత్ర విష్ణుః ప్రతిష్ఠితః ॥
తస్యోపరిష్టాత్కౌమారో లోకో హి పరమాద్భుతః ।
సేనానీశ్శంభుతనయో రాజతే యత్ర సుప్రభః ॥
తతః పరముమాలోకో మహాదివ్యో విరాజతే ।
యత్ర శక్తిర్విభాత్యేకా త్రిదేవజననీ శివా ॥
పరాత్పరా హి ప్రకృతీ రజస్సత్త్వతమోమయీ ।
నిర్గుణా చ స్వయం దేవీ నిర్వికారా శివాత్మికా ॥
తస్యోపరిష్టా ద్విజ్ఞేయశ్శివలోక స్సనాతనః ।
అవినాశీ మహాదివ్యో మహాశోభాన్వితస్సదా ॥
విరాజతే పరం బ్రహ్మ యత్ర శంభుర్మహేశ్వరః ।
త్రిదేవజనకస్స్వామీ సర్వేషాం త్రిగుణాత్పరః ॥
తత ఊర్ధ్వం న లో కాశ్చ గోలోకస్తత్సమీపతః ।
గోమాతరస్సుశీలాఖ్యాస్తత్ర సంతి శివప్రియాః ॥
తత్పాలః కృష్ణనామా హి రాజతే శంకరాజ్ఞయా ।
ప్రతిష్ఠితశ్శివేనైవ శక్త్యా స్వచ్ఛందచారిణా ॥
శివలోకోఽద్భుతో వ్యాస నిరాధారో మనోహరః ।
అతినిర్వచనీయశ్చ నానావస్తువిరాజితః ॥
శివస్తు తదధిష్ఠాతా సర్వదేవశిరోమణిః ।
విష్ణు బ్రహ్మహరైస్సేవ్యః పరమాత్మా నిరంజనః ॥
ఇతి తే కథితా తాత సర్వబ్రహ్మాండ సంస్థితిః ।
తదూర్ధ్వం లోకసంస్థానం కిమన్య చ్ఛ్రోతుమిచ్ఛసి ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం లోకవర్ణనం నామ
ఏకోనవింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! బ్రహ్మాండమునకు పైన లోకములు గలవు. నేను నీకు ఆ వివరములను సంగ్రహముగా చెప్పెదను. నీవు వినుము. బ్రహ్మలోకమునకు పైన వైకుంఠము గలదు. అది గొప్ప కాంతులతో ప్రకాశించుచుండును. అచట విష్ణువు స్థిరముగా నుండును, దానికి పైన పరమాద్భుతమగు కౌమారలోకము గలదు. అచట గొప్ప తేజశ్శాలి, శంభుపుత్రుడు, దేవసేనానాయకుడు అగు కుమారస్వామి ప్రకాశించుచున్నాడు. దానికి పైన మహాదివ్యమైన ఉమాలోకము విశేషముగా ప్రకాశించుచున్నది. అచట అద్వయశక్తిస్వరూపిణి, త్రిమూర్తులను సృష్టించినది అగు శివపత్ని ప్రకాశించుచున్నది. మహత్తత్త్వము మొదలగు వాటికంటే ఉత్కృష్టురాలగు ఆ దేవీ రజస్సత్త్వతమోగుణస్వరూపురాలై జగత్తునకు ప్రకృతి యైనది. ఆమె స్వయముగా గుణసంబంధము లేనిది. మంగళస్వరూపురాలగు ఆమెయందు వికారములు లేవు. ఆ లోకమునకు పైన శాశ్వతమగు శివలోకము గలదని తెలియవలెను. వినాశము లేని ఆ లోకము మహాదివ్యమైనది మరియు సర్వకాలములలో గొప్ప శోభను కలిగియుండునది. అచట పరంబ్రహ్మ, మహేశ్వరుడు, త్రిమూర్తులకు తండ్రి, సర్వులకు ప్రభువు, త్రిగుణములకు అతీతుడు అగు శంభుడు విశేషముగా ప్రకాశించుచున్నాడు. దానికి పైన లోకములు లేవు. దానికి సమీపములో గోలోకము గలదు. అచట సుశీలలు అనే పేరు గల, శివునకు ప్రియమైన గోమాతలు ఉండును. శ్రీకృష్ణుడు శంకరుని ఆజ్ఞచే వాటిని పాలించును. తన శక్తిచే యథేచ్ఛగా సంచరించే శంకరుడు స్వయముగా ఆయనను అచట ప్రతిష్ఠించినాడు. ఓ వ్యాసా! ఆధారము లేనిది, మనోహరమైనది, అతిశయించి వర్ణింపదగినది, అనేకవస్తువులతో విశేషముగా ప్రకాశించునది అగు శివలోకము అద్భుతముగా నుండును. సర్వదేవతాశిరోమణి, విష్ణు బ్రహ్మరుద్రులచే సేవింపబడువాడు, పరమాత్మ, అసంగుడు అగు శివుడు దానిని అధిష్ఠించి యుండును. ఓ వత్సా! ఈ విధముగా నేను నీకు సకలబ్రహ్మాండముల సంస్థితిని, దానికి పైన గల లోకముల సంస్థితిని చెప్పితిని. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు?

శ్రీ శివమహాపురాణములో ఉమాసంహితయందు లోకవర్ణనమనే పది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

20 – పురుషార్థ నిరూపణము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ తత్ప్రాప్తిం వద సత్తమ ।
యద్గత్వా న నివర్తంతే శివభక్తియుతా నరాః ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. ఓ మహాత్మా! ఆ శివలోకమును పొందే ఉపాయమును చెప్పుము. శివ భక్తితో కూడిన నరులు, దానిని పొందినచో, పునరావృత్తి ఉండదు గదా !

సనత్కుమార ఉవాచ ।

పరాశరసుత వ్యాస శృణు ప్రీత్యా శుభాం గతిమ్ ।
వ్రతం హి శుద్ధభక్తానాం తథా శుద్ధం తపస్వినామ్ ॥
యే శివం శుద్ధకర్మాణస్సుశుద్ధ తపసాన్వితాః ।
సమర్చయంతి తం నిత్యం వంద్యాస్తే సర్వథాన్వహమ్ ॥
నాతప్తతపసో యాంతి శివలోకమనామయమ్ ।
శివానుగ్రహసద్ధేతుస్తప ఏవ మహామునే ॥
తపసా దివి మోదంతే ప్రత్యక్షం దేవతాగణాః ।
ఋషయో మునయశ్చైవ సత్యం జానీహి మద్వచః ॥
సుదుర్ధరం దురాసాధ్యం సుధురం దురతిక్రమమ్ ।
తత్సర్వం తపసా సాధ్యం తపో హి దురతిక్రమమ్ ॥
సుస్థితస్తపసి బ్రహ్మా నిత్యం విష్ణుర్హర స్తథా ।
దేవా దేవ్యోఽఖిలాః ప్రాప్తాస్తపసా దుర్లభం ఫలమ్ ॥
యేన యేన హి భావేన స్థిత్వా యత్క్రియతే తపః ।
తతస్సంప్రాప్యతేఽసౌ త్వైరీహ లోకే న సంశయః ॥
సాత్త్వికం రాజసం చైవ తామసం త్రివిధం స్మృతమ్ ।
విజ్ఞేయం హి తపో వ్యాస సర్వసాధన సాధనమ్ ॥
సాత్త్వికం దైవతానాం హి యతీనామూర్ధ్వ రేతసామ్ ।
రాజసం దానవానాం హి మనుష్యాణాం తథైవ చ ॥
తామసం రాక్షసానాం హి నరాణాం క్రూరకర్మణామ్ ॥
త్రివిధం తత్ఫలం ప్రోక్తం మునిభిస్తత్త్వదర్శిభిః ।
జపో ధ్యానం తు దేవానామర్చనం భక్తితశ్శుభమ్ ॥
సాత్త్వికం తద్ధి నిర్దిష్టమశేష ఫలసాధకమ్ ।
ఇహ లోకే పరే చైవ మనోభిప్రేత సాధనమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ పరాశరపుత్రా! వ్యాసా! శుభగతి, పవిత్రభక్తుల వ్రతము, తపశ్శాలుల శుద్ధమగు తపస్సు అను విషయములను గురించి ప్రీతితో వినుము, ఎవరైతే పవిత్రమగు కర్మలను చేయుచూ, శుద్ధమగు తపస్సుతో కూడినవారై, నిత్యము ఆ శివుని చక్కగా ఆరాధించెదరో, వారికి ప్రతిదినము అన్ని విధములుగా నమస్కారమును చేయవలెను. దుఃఖరహితమైన శివలోకమును తపస్సు చేయనివారు పొందలేరు. ఓ మహర్షీ! శివుని అనుగ్రహమును సంపాదించుటకు చక్కటి హేతువు తపస్సు మాత్రమే. దేవతాసమూహములు, ఋషులు మరియు మునులు తపస్సుయొక్క ప్రభావముచే స్వర్గలోకములో ఆనందించుచున్నారు. ఇది ప్రత్యక్షము. నా మాట సత్యమని తెలుసుకొనుము. మిక్కిలి ధరింప శక్యము కానిది, పొంద శక్యము కానిది, అతిశయించిన భారము గలది, అతిక్రమింప శక్యము కానిది అగు సర్వమును తపస్సుచే సాధించవచ్చును. తపస్సును అతిక్రమించుట సంభవము కాదు. బ్రహ్మ, విష్ణువు రుద్రుడు, దేవతలు, దేవీమూర్తులు అందరు నిత్యము తపస్సునందు స్థిరముగా నున్నవారై ఆ తపస్సుచే దుర్లభమగు ఫలమును పొందిరి. మానవుడు ఇహలోకములో ఏయే లక్ష్యమును మనస్సులో నిడుకొని తపస్సును చేయునో, ఆయా లక్ష్యమును పొందుననుటలో సందేహము లేదు. ఓ వ్యాసా! సర్వమును సాధించుటకు, సాధనమైన తపస్సు సాత్త్విక-రాజస-తామసభేదముచే మూడు విధములుగా నున్నదని తెలియవలెను. దేవతలు, ఊర్ధ్వరేతస్కులగు యతులు సాత్త్వికతపస్సును, దానవులు మరియు మానవులు రాజసతపస్సును, రాక్షసులు మరియు క్రూరమగు పనులను చేసే మానవులు తామసతపస్సును చేయుదురు. తత్త్వవేత్తలగు మునులు తపస్సుయొక్క ఫలము మూడు రకములుగా నున్నదని చెప్పినారు. జపము, ధ్యానము, భక్తితో దేవతలను పూజించుట అనునవి శుభకరమగు సాత్త్వికతపస్సు. అది సర్వఫలములను ఇచ్చుననియు, ఇహపరలోకములలో, మనస్సులోని కామనలను తీర్చుకొనే సాధనమనియు చెప్పబడినది.

కామనాఫలముద్దిశ్య రాజసం తప ఉచ్యతే ।

నిజదేహం సుసంపీడ్య దేహశోషకదుస్స్పృహైః ॥

తపస్తాపసముద్దిష్టం మనోభిప్రేత సాధనమ్ ॥

ఉత్తమం సాత్త్వికం విద్యార్ధర్మబుద్ధిశ్చ నిశ్చలా ।

స్నానం పూజా జపో హోమశ్శుద్ధశౌచమహింసనమ్ ॥

వ్రతోపవాసచర్యా చ మౌనమింద్రియ నిగ్రహః ।

ధీర్విద్యా సత్యమక్రోధో దానం క్షాంతిర్దమో దయా ॥

వాపీకూపతడాగాదేః ప్రసాదస్య చ కల్పనా ।

కృచ్ఛం చాంద్రాయణం యజ్ఞస్సుతీర్థాన్యాశ్రమాః పునః ॥

ధర్మస్థానాని చైతాని సుఖాదీని మనీషిణామ్ ।

సుధర్మః పరమో వ్యాస శివభక్తేశ్చ కారణమ్ ॥

సంక్రాంతివిషువద్యోగో నాదముక్తే నియుజ్యతామ్ ।
ధ్యానం త్రికాలికం జ్యోతిరున్మనీ భావధారణా ॥
రేచకః పూరకం కుంభః ప్రాణాయామస్త్రిధా స్మృతః ।
నాడీసంచార విజ్ఞానం ప్రత్యాహార నిరోధనమ్ ॥
తురీయం తదధో బుద్ధిగణిమాద్యష్ట సంయుతమ్ ।
పూర్వోత్తమం సముద్దిష్టం పరజ్ఞాన ప్రసాధనమ్ ॥
కాష్ఠావస్థా మృతావస్థా హరితా వేతి కీర్తితాః ।
నానోపలబ్ధయో హ్యేతాస్సర్వ పాపప్రణాశనాః ॥

కోర్కెలను తీర్చుకొనుటకై చేసే తపస్సు రాజసమనబడును. దేహమును శోషింపజేసి మిక్కిలి పీడకు గురిచేసి సహించుటకు కష్టమైన విధముగా చేసే తపస్సు తామసమనబడును. మనస్సులోని కోరికలను తీర్చుటకు సాత్త్వికతపస్సు ఉత్తమమైనదని తెలియవలెను. నిశ్చలమగు ధర్మబుద్ధి, స్నానము, పూజ, జపము, హోమము, బాహ్యాశౌచము, ఆంతరశౌచము, అహింస, వ్రతములను మరియు ఉపవాసములను చేయుట, మౌనము, ఇంద్రియములను నియంత్రణలో నుంచుకొనుట, సద్బుద్ధి, విద్య, సత్యము, కోపము లేకుండుట, దానము, క్షమ, బాహ్యేంద్రియనిగ్రహము, దయ, దిగుడుబావులు-నూతులు-చెరువులు-విశ్రాంతిగృహములు మొదలగు వాటిని నిర్మించుట, కృచ్ఛ్ర చాంద్రాయణవ్రతములను చేయుట, యజ్ఞము, తీర్థములను సేవించుట, ఆశ్రమములను అనేకపర్యాయములు దర్శించుట అనునవి వివేకవంతులకు సుఖమునిచ్చే ధర్మస్థానములు. ఓ వ్యాసా! ఇవియే చక్కని ధర్మము అగును. ఇవి శివభక్తికి హేతువులు. మకరసంక్రమణమునాడు ఉత్సవము చేయవలెను. ప్రతిదినము మూడు కాలములయందు ధ్యానమును చేయవలెను. మనస్సును అనాహతపద్మమునందు, అనగా హృదయపుండరీకమునందు నియంత్రించి, మనస్సును ఉద్దీపింపజేసే ఆత్మచైతన్యము (ఆత్మజ్యోతి) నందు విలీనము చేయవలెను. ప్రాణాయామము రేచక-పూరక- కుంభకములని మూడు విధములుగా నున్నది. నాడీ సంచారముయొక్క జ్ఞానము, ప్రత్యాహారముచే ఇంద్రియములను నిగ్రహించుట, బ్రహ్మైక్యాను సంధానము అనునవి ఒకదానిని మించి మరియొకటి ఉత్తమజ్ఞానమునకు సాధనములగును అణిమ మొదలగు ఎనిమిది సిద్ధులు జాగ్రత్- స్వప్న-సుషుప్తి- అవస్థలకు అతీతమైన ఆత్మనిష్ఠకంటే తక్కువస్థాయికి చెందినవి మాత్రమే. సమాధిలో కాషావస్థ (దుంగవలె నిశ్చలముగా నుండుట), మృతావస్థ (మరణించిన వానివలె నుండుట), హరితా (?) అను రకములు గలవు. ఈ సమాధులు అనేకములగు సిద్ధులను ఇచ్చుటయే గాక, పాపముల నన్నిటినీ నశింపజేయును.

నారీ శయ్యా తథా పానం వస్త్ర ధూపవిలేపనమ్ ।
తాంబూలభక్షణం పంచ రాజైశ్వర్య విభూతయః ॥
హేమభారస్తథా తామ్రం గృహాశ్చ రత్నధేనవః ।
పాండిత్యం వేదశాస్త్రాణాం గీతనృత్య విభూషణమ్ ॥

శంఖవీణా మృదంగాశ్చ గజేంద్రశ్ఛత్రచామరే ।
భోగరూపాణి చైతాని ఏభిశ్శక్తోఽను రజ్యతే ॥
ఆదర్శవన్మునే స్నేహైస్తైలవత్స నిపీడ్యతే ।
అరం గచ్ఛేతి చాప్యేనం కురుతేఽ జ్ఞానమోహితః ॥
జానన్నపీహ సంసారే భ్రమంతే ఘటియంత్రవత్ ।
సర్వయోనిషు దుఃఖార్తః స్థావరేషు చరేషు చ ॥
ఏవం యోనిషు సర్వాసు ప్రతిక్రమ్య భ్రమేణ తు ।
కాలాంతరవశాద్యాతి మానుష్యమతి దుర్లభమ్ ॥
వ్యుత్క్ర మేణాపి మానుష్యం ప్రాప్యతే పుణ్య గౌరవాత్ ।
విచిత్రా గతయః ప్రోక్తాః కర్మణాం గురులాఘవాత్ ॥
మానుష్యం చ సమాసాద్య స్వర్గమోక్ష ప్రసాధనమ్ ।
నాచరత్యాత్మనః శ్రేయస్స మృతశ్శోచతే చిరమ్ ॥
దేవాసురాణాం సర్వేషాం మానుష్యం చాతిదుర్లభమ్ ।
తత్సంప్రాప్య తథా కుర్యాన్న గచ్ఛేన్నరకం యథా ॥
స్వర్గాపవర్గలాభాయ యది నాస్తి సముద్యమః ।
దుర్లభం ప్రాప్య మానుష్యం వృథా తజ్జన్మ కీర్తితమ్ ॥
సర్వస్య మూలం మానుష్యం చతుర్వర్గస్య కీర్తితమ్ ।
సంప్రాప్య ధర్మతో వ్యాస తద్యత్నాదను పాలయేత్ ॥

స్త్రీ, తల్పము, పానము, వస్త్రములు- ధూపము-విలేపనము, మరియు తాంబూలమును నములుట అను ఈ ఐదు రాజుయొక్క ఐశ్వర్యమును ప్రకటించు మహిమలు. అధికమగు బంగారమును మణులను కలిగియుండుట, ఇల్లు, రత్నములు, గోవులు, వేదశాస్త్రములలో పాండిత్యము, సంగీతనృత్యములు, అలంకారములు, శంఖవీణామృదంగములనే వాద్యములు, గొప్ప ఏనుగు, గొడుగు, వింజామరలు అనునవి భోగముయొక్క రూపములు. సమర్థుడగువాడు వీటియందు అనురాగమును కలిగియుండును. ఓ మునీ! ఇవి అద్దములోని ప్రతిబింబముల వలె మిథ్యా రూపములు. మానవుడు అజ్ఞానముచే మోహమును పొంది, ఎవరో వెనుకనుండి వీనిని 'తొందరగా పద' అని తరుముచున్నారా యన్నట్లు వీటి వెనుక పరుగులెత్తుచుండును. నువ్వులను పిండి నూనెను తీసిన విధముగా, అవి మానవుని శక్తియుక్తులను పిండి వేయును. ఇవి నిస్సారములని తెలిసి కూడా మానవుడు సంసారములో నీటిని తోడే చక్రము వలె తిరుగాడుచున్నాడు. మానవుడు చెట్టుచేమలు, క్రిమికీటకములు, పశుపక్ష్యాదులు మొదలగు సకలజన్మలనెత్తి దుఃఖముచే పీడితుడగుచున్నాడు. ఈ విధముగా వివిధయోనులలో జన్మించి తిరిగి తిరిగి కాలమునకు వశుడై ఒకానొక కాలములో మిక్కిలి దుర్లభమైన మానవజన్మను పొందుచున్నాడు. పుణ్య ప్రభావము అధికముగా నున్నచో, నీచయోనిలోనున్న జీవుడు క్రమమును దాటి మానవజన్మను పొందవచ్చును. కర్మసముదాయములో ఒకప్పుడు పుణ్యమునకు, మరియొకప్పుడు పాపమునకు ప్రాముఖ్యము కలిగి జీవుడు విభిన్నయోనులలో జన్మించుటకు

అవకాశము గలదని మహర్షులు చెప్పుచున్నారు. ఎవడైతే స్వర్గమోక్షములను పొందుటకు శ్రేష్టసాధనమైన మానవజన్మను పొందియు, తనకు శ్రేయస్సు కొరకై యత్నించడో, వాడు మరణించిన తరువాత చిరకాలము యాతనలను పొందును. దేవతలకు, రాక్షసులకు, సర్పులకు మానవజన్మ దుర్లభమైనది. దానిని పొందిన తరువాత జీవుడు మరల నరకమునకు పోనక్కర లేని విధముగా ప్రవర్తించవలెను. దుర్లభమగు మానవజన్మను పొందియూ, స్వర్గమును మోక్షమును పొందుటకు చక్కని ప్రయత్నమును చేయనిచో, ఆ జన్మ వ్యర్థమని చెప్పబడినది. ఓ వ్యాసా! ధర్మార్థకామమోక్షములనే నాలుగు పురుషార్థములకు మానవజన్మయే మూలమని చెప్పబడినది. కావున, అట్టి చక్కని జన్మను పొందిన తరువాత దానిని ప్రయత్నపూర్వకముగా ధర్మమార్గములో పాలించవలెను.

ధర్మమూలం ఏి మానుష్యం లబ్ధ్వా సర్వార్థసాధకమ్ ।
యది లాభాయ యత్నస్స్యాన్మూలం రక్షేత్స్వయం యతః ॥
మానుష్యేఽపి చ విప్రత్వం యః ప్రాప్య ఖలు దుర్లభమ్ ।
నాచరత్యాత్మనః శ్రేయః కోఽన్యస్తస్మాద చేతనః ॥
ద్వీపానామేవ సర్వేషాం కర్మభూరియముచ్యతే ।
ఇతస్స్వర్గశ్చ మోక్షశ్చ ప్రాప్యతే సముపార్జితః ॥
దేశేఽస్మిన్ భారతే వర్షే ప్రాప్య మానుష్యమధ్రువమ్ ।
న కుర్యాదాత్మనః శ్రేయస్తేనాత్మా ఖలు వంచితః ॥
కర్మభూమిరియం విప్ర ఫలభూమిరసౌ స్మృతా ।
ఇహ యత్క్రియతే కర్మ స్వర్గే తదనుభుజ్యతే ॥
యావత్స్వాస్థ్యం శరీరస్య తావద్ధర్మం సమాచరేత్ ।
అస్వస్థశ్చోదితోఽప్యన్యైర్న కించిత్కర్తుముత్సహేత్ ॥
అధ్రువేణ శరీరేణ ధ్రువం యో న ప్రసాధయేత్ ।
ధ్రువం తస్య పరిభ్రష్టమధ్రువం నష్టమేవ చ ॥
ఆయుషః ఖండఖండాని నిపతంతి తదగ్రతః ।
అహోరాత్రో పదేశేన కిమర్థం నావబుధ్యతే ॥
యదా న జ్ఞాయతే మృత్యుః కదా కస్య భవిష్యతి ।
ఆకస్మికే హి మరణే ధృతిం విందతి కస్తథా ॥
పరిత్యజ్య యదా సర్వమేకాకీ యాస్యతి ధ్రువమ్ ।
న దదాతి కదా కస్మాత్పాథేయార్థమిదం ధనమ్ ॥

పురుషార్థములను అన్నింటినీ సంపాదించే సాధనము మరియు ధర్మము మూలముగా గలది అగు మానవజన్మను పొంది పురుషార్థమును సాధించుటకు ప్రయత్నమును చేయు వ్యక్తి ఆ ప్రయత్నము వలన స్వయముగా తనకు మూలమగు ధర్మమును రక్షించుకొనును. మానవజన్మలో మరల బ్రాహ్మణజన్మ దుర్లభమైనది. దానిని పొందియు ఎవడైతే తనకు శ్రేయస్సు కలుగువిధముగా ఆచరించడో, వానికంటే మూర్ఖుడు ఎవడు ఉండును ?

ఖండములన్నింటిలో భారతదేశమునకు కర్మభూమి యని పేరు. ఇచట జన్మించిన వ్యక్తి ప్రయత్నముచే స్వర్గమును గాని, మోక్షమును గానీ పొందగలడు. ఎవడైతే అనిత్యమగు మానవజన్మను ఈ భారతదేశమునందు పొందియు తనకు శ్రేయస్సు కలుగు విధముగా ఆచరించడో, వాడు తనను తానే వంచించుకున్నవాడు అగును. ఓ బ్రాహ్మణా! ఈ భూమి కర్మభూమియని, ఫలభూమి యని వర్ణించబడినది. ఇచట చేయబడిన కర్మ స్వర్గములో అనుభవించబడును. శరీరములో ఆరోగ్యము ఉన్నంత వరకు ధర్మమును చేయవలెను. ఆరోగ్యము లేనివానిని ఇతరులు ప్రోత్సహించిననూ ఏ పనినైననూ చేయుటకు సమర్థుడు కాడు. అనిత్యమగు శరీరముతో ధ్రువమగు ధర్మమును ఎవడైతే సంపాదించుకొనడో, వానికి నిత్యమగు ధర్మము దూరమగును. అనిత్యమగు శరీరము ఎటులైననూ నశించునదియే. పగలు, రాత్రి అనే మిషతో ఆయుర్దాయముయొక్క ముక్కలు మన యెదుట పడుచున్నవి. కాని మానవుడు ఏల తెలుసుకొన లేక పోవుచున్నాడు ? మరణము ఎవనికి ఎప్పుడు వచ్చును అను విషయము తెలియదు. మరణము ఆకస్మికముగా వచ్చును. ఇట్టి స్థితిలో ఎవడు ధైర్యముగా నుండగలడు ? మానవుడు సర్వమును ఇచటనే విడిచిపెట్టి ఒంటరిగా పరలోకమునకు పోవును. మానవుడు చేసిన దానము ఆ ఒంటరి యాత్రలో మార్గమధ్యములో ఆహారమును సంపాదించి పెట్టును. ఆయిననూ, మానవుడు ఈ ధనమును ఏ కాలములోనైననూ దానము కొరకై ఏల వినియోగించుట లేదు ?

గృహీతదానపాథేయస్సుఖం యాతి యమాలయమ్ ।

అన్యథా క్లిశ్యతే జంతుః పాథేయరహితే పథి ॥

యేషాం కాలేయ పుణ్యాని పరిపూర్ణాని సర్వతః ।

గచ్ఛతాం స్వర్గదేశం హి తేషాం లాభః పదే పదే ॥

ఇతి జ్ఞాత్వా నరః పుణ్యం కుర్యాత్పాపం వివర్జయేత్ ।

పుణ్యేన యాతి దేవత్వమపుణ్యో నరకం వ్రజేత్ ॥

యే మనాగపి దేవేశం ప్రపన్నాశ్శరణం శివమ్ ।

తేఽపి ఘోరం న పశ్యంతి యమం న నరకం తథా ॥

కిం తు పాపైర్మహామోహైః కించిత్కాలే శివాజ్ఞయా ।

వసంతి తత్ర మానుష్యాస్తతో యాంతి శివాస్పదమ్ ॥

యే పునస్సర్వభావేన ప్రతిపన్నా మహేశ్వరమ్ ।

న తే లింపంతి పాపేన పద్మపత్ర మివాంభసా ॥

ఉక్తం శివేతి యైర్నామ తథా హర హరేతి చ ।

న తేషాం నరకాద్భీతిర్యమాద్ధి మునిసత్తమ ॥

పరలోకస్య పాథేయం మోక్షోపాయమనామయమ్ ।
పుణ్యసంఘైక నిలయం శివ ఇత్యక్షరద్వయమ్ ॥
శివనామ్నైవ సంసారమహారోగైక శామకమ్ ।
నాన్యత్సంసారరోగస్య శామకం దృశ్యతే మయా ॥
బ్రహ్మహత్యా సహస్రాణి పురా కృత్వా తు పుల్కసః ।
శివేతి నామ విమలం శ్రుత్వా మోక్షం గతః పురా ॥
తస్మాద్వివర్ధయేద్భక్తిమీశ్వరే సతతం బుధః ।
శివభక్త్యా మహాప్రాజ్ఞ భుక్తిం ముక్తిం చ విందతి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం పురుషార్థనిరూపణం నామ
వింశోఽధ్యాయః ॥

దానము చేసిన వానికి యమలోకమార్గములో ఆ దానమే ఆహారముగా పరిణమించి సుఖమును కలిగించును. అట్టి దానమును చేసిన వ్యక్తి యమాలయమునకు సుఖముగా వెళ్లును. దానము చేయనివాడు మధ్యలో ఆహారము లేకుండగా దారిలో చాల కష్టమును పొందును. ఓ మహర్షీ! అన్ని విధములుగా పరిపూర్ణమైన పుణ్యము గల జీవులు స్వర్గలోకమునకు వెళ్లునప్పుడు ప్రతి అడుగులో లాభము కలుగును. ఈ సత్యమును తెలుసుకొని మానవుడు పాపమునకు దూరముగా నుండి పుణ్యమును చేయవలెను. పుణ్యమును చేసినవాడు దేవత్వమును పొందగా, పుణ్యమును చేయని వాడు నరకమును పొందును. ఎవరైతే కొంచెమైననూ దేవదేవుడగు శివుని శరణు పొందెదరో, వారు కూడ భయంకరుడగు యముని మరియు నరకమును చూడరు, కాని ఆ మానవులు మహామోహము గల పాపాత్ములైనచో, శివుని ఆజ్ఞచే అచట కొంత కాలము నివసించి తరువాత శివలోకమును పొందెదరు. ఎవరైతే మహేశ్వరుని సర్వస్వార్పణము చేసి శరణు పొందెదరో, వారు తామరాకు నీటిచేతను వలే, పాపముచే స్పృశించబడరు. ఓ మహర్షీ! ఎవరైతే శివ, హర, హర అనే నామములను ఉచ్చరించెదరో, వారికి. నరకము వలన, యముని వలన భయము ఉండదు. శివ అనే రెండు అక్షరముల నామము పరలోకమునకు వెళ్లే దారిలో ఆహారమై సుఖమును కలిగించునదీ, మోక్షమునకు ఉపాయము, దోషము, మరియు పుణ్యసమూహములకు, నిలయమైనది. సంసారము అనే పెద్ద వ్యాధికి శివ అనే నామము మాత్రమే మందు. సంసారరోగమును కుదిర్చే మందు నాకు మరియొకటి కానవచ్చుట లేదు. పూర్వము పుల్కసుడు వేలాది బ్రహ్మహత్యలను చేసి, శివ అనే పవిత్రనామమును విని, మోక్షమును పొందినాడు. కావున, వివేకి సర్వకాలములలో ఈశ్వరుని యందు భక్తిని పెంపొందించుకొన వలయును. ఓ మహాబుద్ధిశాలీ ! మానవుడు శివభక్తిచే భుక్తిని మరియు ముక్తిని పొందును.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు పురుషార్థనిరూపణము అనే ఇరువదియవ అధ్యాయము ముగిసినది.

21 – యుద్ధఫల వర్ణనము

వ్యాస ఉవాచ ।

బ్రాహ్మణత్వం హి దుష్ప్రాప్యం నిసర్గా ద్బ్రాహ్మణో భవేత్ ।
ఈశ్వరస్య ముఖాత్ క్షత్రం బాహుభ్యామూరుతో విశః ॥
పద్భ్యాం శూద్రస్సముత్పన్న ఇతి తస్య ముఖా చ్ఛ్రుతిః ।
కిము స్థితిమధః స్థానాదాప్నువంతి హ్యతో వద ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

బ్రాహ్మణత్వమును పొందుట చాల కష్టమైనది. మానవుడు స్వభావముచే బ్రాహ్మణుడు కావలెను. ఈశ్వరుని ముఖమునుండి బ్రాహ్మణుడు, బాహువులనుండి క్షత్రియుడు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రుడు పుట్టినారని వేదము చెప్పుచున్నది. వేదము ఈశ్వరుని ముఖమునుండి పుట్టినది. క్రింది స్థాయిలో నున్నవారికి మోక్షము లభించునా? చెప్పుము.

సనత్కుమార ఉవాచ ।

దుష్కృతేన తు కాలేయ స్థానాద్భ్రశ్యంతి మానవాః ।
శ్రేష్ఠం స్థానం సమాసాద్య తస్మాద్రక్షేత పండితః ॥
యస్తు విప్రత్వముత్సృజ్య క్షత్రయోన్యాం ప్రసూయతే ।
బ్రాహ్మణ్యాత్స పరిభ్రష్టః క్షత్రియత్వం నిషేవతే ॥
అధర్మ సేవనాన్మూఢ స్తథైవ పరివర్తతే ।
జన్మాంతర సహస్రాణి తమస్యావిశతే యతః ॥
తస్మాత్ప్రాప్య పరం స్థానం ప్రమాదన్న తు నాశయేత్ ।
స్వస్థానం సర్వదా రక్షేత్ప్రాప్యాపి విపదో నరః ॥
బ్రాహ్మణత్వం శుభం ప్రాప్య బ్రహ్మణ్యం యోఽవమన్యతే ।
భోజ్యాభోజ్యం న జానాతి స పుమాన్ క్షత్రియో భవేత్ ॥
కర్మణా యేన మేధావీ శూద్రో వైశ్యో హి జాయతే ।
తత్తే వక్ష్యామి నిఖిలం యేన వర్ణోత్తమో భవేత్ ॥
శూద్రకర్మ యథోద్దిష్టం శూద్రో భూత్వా సమాచరేత్ ।
యథావత్పరిచర్యాం తు త్రిషు వర్ణేషు నిత్యదా ॥
కురుతే కామయానస్తు శూద్రోఽపి వైశ్యతాం వ్రజేత్ ।
యో యోజయేద్ధనైర్వైశ్యో జుహ్వానశ్చ యథావిధి ॥
అగ్నిహోత్రముపాదాయ శేషాన్న కృతభోజనః ।
స వైశ్యః క్షత్రియకులే జాయతే నాత్ర సంశయః ॥
క్షత్రియో జాయతే యజ్ఞైస్సంస్కృతైరాత్త దక్షిణైః ।
అధీతే స్వర్గమన్విచ్ఛంస్త్రేతాగ్నిశరణం సదా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ వ్యాసా! మానవులు పాపమును చేసినచో స్థానభ్రంశమును పొందెదరు. కావున, ఉన్న్నతస్థానమును పొందియున్న వివేకియగు వ్యక్తి దానిని రక్షించుకొనవలెను. ఎవడైతే బ్రాహ్మణధర్మమును విడనాడునో, వాడు బ్రాహ్మణత్వమునుండి భ్రష్టుడై క్షత్రియజన్మను పొంది క్షత్రియోచితమగు కర్మలను చేయును. అధర్మమును సేవించు మూర్ఖుడు ఆ విధముగనే పరిభ్రమించుచూ, తమోగుణ ప్రధానమగు వేలాది జన్మలను పొందును. కావున, ఉన్నతస్థానమును పొందియున్న వ్యక్తి తప్పు చేసి దానిని చెడగొట్టుకొనరాదు. అట్టి మానవుడు ఆపదలు వచ్చిననూ, తన స్థానమును సర్వకాలములలో రక్షించుకొనవలెను. ఏ మానవుడైతే శుభకరమగు బ్రాహ్మణత్వమును పొందియు, ఏది తినవచ్చును ? ఏది తినకూడదు ? అను విషయమునెరుంగక, బ్రాహ్మణత్వమునకు మచ్చను దెచ్చునో, అట్టివాడు క్షత్రియుడగును. మానవుడు కర్మచే ఉత్తమవర్ణమును పొందవచ్చును. బుద్ధిమంతుడగు శూద్రుడు కర్మ ప్రభావముచే వైశ్యుడుగా కావచ్చును. ఆ వివరములను అన్నింటినీ నేను నీకు చెప్పెదను. శూద్రుడు తన వర్ణమునకు విధించబడిన పరిచర్యను మిగిలిన మూడు వర్ణముల వారియందు సర్వదా ఆచరించవలెను, ఉత్తమవర్ణమును కోరు శూద్రుడు ఈ విధముగా చేసి వైశ్యుడగును. ఏ వైశ్యుడు ధనములను దానము చేయునో, యథావిధిగా హోమములను చేయునో, అగ్నిహోత్రకర్మను ఆచరించి ఆ ప్రసాదమును భుజించునో, అట్టి వైశ్యుడు క్షత్రియకులములో జన్మించుననుటలో సందేహము లేదు (10,11).వైశ్యుడు చక్కగా యజ్ఞములను చేసి దక్షిణలను యథావిధిగా ఇచ్చినచో, క్షత్రియుడై పుట్టును. స్వర్గమును కోరు వైశ్యుడు వేదమును అధ్యయనము చేసి, త్రేతాగ్నులను శరణు వేడి సర్వదా వాటిని ఆరాధించవలెను(12).

ఆర్ద్రహస్తపదో నిత్యం క్షితిం ధర్మేణ పాలయేత్ ।
ఋతుకాలాభిగామీ చ స్వభార్యాధర్మతత్పరః ॥
సర్వాతిథ్యం త్రివర్గస్య భూతేభ్యో దీయతామితి ।
గోబ్రాహ్మణాత్మనోఽ ర్థం హ సంగ్రామాభిహతో భవేత్ ॥
తేనాగ్నిమంత్రపూతాత్మా క్షత్రియో బ్రాహ్మణో భవేత్।
విధితో బ్రాహ్మణో భూత్వా యాజకస్తు ప్రజాయతే ॥
స్వకర్మనిరతో నిత్యం సత్య వాదీ జితేంద్రియః ।
ప్రాప్యతే విపులస్స్వర్గో దేవానామపి వల్లభః ॥
బ్రాహ్మణత్వం హి దుష్ప్రాప్యం కృచ్ఛ్రేణ సాధ్యతే నరైః।
బ్రాహ్మణ్యాత్సకలం ప్రాప్య మోక్షశ్చాపి మునీశ్వర ॥
తస్మాత్సర్వ ప్రయత్నేన బ్రాహ్మణో ధర్మతత్పరః ।
సాధనం సర్వవర్గస్య రక్షేద్బ్రాహ్మణ్యముత్తమమ్ ॥

క్షత్రియుడు చేతులను, కాళ్లను కడుగుకొని పవిత్రస్థలములలోనికి ప్రవేశించవలెను. రాజ్యమును ధర్మబద్ధముగా పాలించవలెను. తన భార్యతో ఋతుకాలములో రమించవలెను. ధర్మమునందు పూర్ణశ్రద్ధను కలిగియుండవలెను (13). క్షత్రియుడు ధర్మార్థకామములనే పురుషార్థములను కోరి సర్వప్రాణులకు ఆహారమునీయవలెను. గోవులను, బ్రాహ్మణులను, మరియు తనను రక్షించుకొనే ప్రయత్నములో క్షత్రియుడు యుద్ధములో శత్రువులను ఎదిరిస్తూ ప్రాణములను విడిచిననూ మంచిదే (14). ఈ విధముగా అగ్ని చేత మరియు మంత్రములచేత పవిత్రమైన అంతఃకరణము గల క్షత్రియుడు బ్రాహ్మణుడగును. ఆతడు బ్రాహ్మణుడైన తరువాత యథావిధిగా యజ్ఞమును చేయును (15). ఆతడు నిత్యము తన ధర్మమును నిర్వర్తించి ఇంద్రియజయము గలవాడై సత్యమును పలుకుతూ జీవించి మరణించిన తరువాత విశాలమగు స్వర్గమును పొందినవాడై దేవతలకు ప్రీతిపాత్రుడగును (16). ఓ మహర్షీ! మానవులు మిక్కిలి క్లేశముచే పొందదగిన బ్రాహ్మణత్వమును కష్టపడి పొందెదరు. మానవుడు బ్రాహ్మణత్వము యొక్క ప్రభావముచే మోక్షముతో సహా సర్వమును పొందగలును (17). కావున, బ్రాహ్మణుడు ధర్మమునందు నిష్ఠ గలవాడై, చతుర్విధపురుషార్థములకు సాధనమైన ఉత్తమమగు బ్రాహ్మణత్వమును రక్షించుకొనవలెను (18).

వ్యాస ఉవాచ ।

సంగ్రామస్యేహ మాహాత్మ్యం త్వయోక్తం మునిసత్తమ ।

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం బ్రూహి త్వం వదతాం వర ॥

వ్యాసుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! నీవు యుద్ధము యొక్క మహిమను చెప్పియుంటివి. నేను దానిని వినగోరుచున్నాను. నీవు వక్తలలో గొప్ప వాడవు. దానిని చెప్పుము (19).

సనత్కుమార ఉవాచ।

అగ్నిష్టోమాదిభిర్యజ్ఞైరిష్ట్వా విపులదక్షిణైః ।

న తత్ఫలమవాప్నోతి సంగ్రామే యదవాప్నుయాత్ ॥

ఇతి తత్త్వవిదః ప్రాహుర్యజ్ఞకర్మవిదస్సదా ।

తస్మాత్తత్తే ప్రవక్ష్యామి యత్ఫలం శస్త్ర జీవితామ్ ॥

ధర్మలాభోఽర్థ లాభశ్చ యశోలాభస్తథైవ చ ।

యశ్శూరో వాంఛతే యుద్ధం విమృందన్ పరవాహినీమ్ ॥

తస్య ధర్మార్థకామాశ్చ యజ్ఞాశ్చైవ సదక్షిణాః ।

పరం హ్యభిముఖం దత్త్వా తద్యానం యోఽధిరోహతి ॥

విష్ణులోకే స జాయేత యశ్చ యుద్ధేఽపరాజితః।

అశ్వమేధానవాప్నోతి చతురో న మృతస్స చేత్ ॥

యస్తు శస్త్ర మనుత్సృజ్య మ్రియతే వాహినీముఖే ।

సమ్ముఖో వర్తతే శూరస్స స్వర్గాన్న నివర్తతే ॥

రాజా వా రాజపుత్రో వా సేనాపతిరథాపి వా ।
హతః క్షత్రేణ యశ్శూరస్తస్య లోకోఽక్షయో భవేత్ ॥
యావంతి తస్య రోమాణి భిద్యంతేఽ స్త్రైర్మహాహవే ।
తావతో లభతే లోకాన్ సర్వకామదుఘాఽ క్షయాన్ ॥
వీరాసనం వీరశయ్యా వీరాస్థానస్థితిః స్థిరా ।
సర్వదా భవతి వ్యాస ఇహ లోకే పరత్ర చ ॥
గవార్థే బ్రాహ్మణార్థే చ స్థానస్వామ్యర్థమేవ చ ।
యే మృతాస్తే సుఖం యాంతి యథా సుకృతిన స్తథా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

క్షత్రియుడు యుద్ధము ద్వారా పొందే ఫలమును మిక్కుటమగు దక్షిణలతో కూడిన అగ్నిష్టోమము మొదలైన అనేక యజ్ఞములను చేసిననూ పొందజాలడు (20). యజ్ఞమును, కర్మస్వరూపమును యెరింగిన జ్ఞానులు ఈ విధముగా చెప్పుచున్నారు. కావుననే, శస్త్రముతో ప్రజలను రక్షిస్తూ జీవించే క్షత్రియులకు లభించే ఫలమును గురించి నేను నీకు చెప్పుచున్నాను (21). ఏ శూరుడైతే యుద్ధమును కోరి శత్రుసైన్యమును కకావికలుగా చేయునో, వానికి ధర్మార్థములు మాత్రమే గాక, కీర్తి కూడ లభించును (22). ఎవడైతే శత్రువును ఎదుర్కొని యుద్ధమును చేసి వాని రథమును తన వశము చేసుకొని దానిని తాను అధిరోహించునో, వానికి ధర్మార్థకామములు మాత్రమే గాక, దక్షిణతో కూడిన యజ్ఞమును చేసిన ఫలము లభించును (23). యుద్ధనిపుణుడగు క్షత్రియుడు యుద్ధములో పరాజయమును గాని, మరణమును గాని పొందకుండగా విజయమును పొందినచో, వానికి నాలుగు అశ్వమేధములను చేసిన ఫలము లభించి, ఆతడు మరణించిన తరువాత విష్ణులోకమును పొందును (24). ఏ వీరుడైతే తన చేతిలోని ఆయుధమును విడిచిపెట్టకుండగా శత్రుసైన్యమునకు ఎదురుగా నిలబడి ప్రాణములను విడుచునో, ఆతడు స్వర్గమునుండి మరలి రాడు (25), శూరుడగు రాజు గానీ, రాజకుమారుడు గానీ, సేనాపతి గాని, ధర్మయుద్ధములో మరణించినచో, వానికి నాశము లేని పుణ్యలోకములు లభించును (26). యుద్ధములో ఆతని శరీరములోని ఎన్ని రోమములు. అస్త్రములచే నశింపచేయబడునో, వానికి అన్ని నాశము లేని, కోరికలను అన్నింటినీ ఈడేర్చే లోకములు లభించును (27). ఓ వ్యాసా! ఆతనికి ఇహలోకములో మాత్రమే గాక, పరలోకములో కూడ వీరునకు తగిన ఆసనము, శయ్య, స్థానము, స్థిరమగు పదవి సర్వకాలములలో లభించును (28). ఎవరైతే గోవుల కొరకు, బ్రాహ్మణుల కొరకు, తన దేశము. కొరకు, మరియు ప్రభువు కొరకు ప్రాణములను విడిచిపెట్టునో, వారు మరణించిన తరువాత పుణ్యాత్ములవలె సుఖములను బడయుదురు (29).

యః కశ్చిద్బ్రాహ్మణం హత్వా పశ్చాత్ప్రాణాన్ పరిత్యజేత్ ।
తత్రాసౌ స్వపతేర్యుద్ధే స స్వర్గాన్న నివర్తతే ॥
క్రవ్యాద్భిర్దంతిభిశ్చైవ హతస్య గతిరుత్తమా ।
ద్విజగోస్వామినామర్థే భవేద్విపులదాక్షయా ॥
శక్నోతీహ సమర్థశ్చ యష్టుం క్రతుశతైరపి ।
ఆత్మదేహ పరిత్యాగః కర్తుం యుధి సుదుష్కరః ॥
యుద్ధం పుణ్యతమం స్వర్గ్యం రూపజ్ఞం సర్వతోముఖమ్ ।
సర్వేషామేవ వర్ణానాం క్షత్రియస్య విశేషతః ॥
భృశం చైవ ప్రవక్ష్యామి యుద్ధధర్మం సనాతనమ్ ।
యాదృశాయ ప్రహర్తవ్యం యాదృశం పరివర్జయేత్ ॥
ఆతతాయినమాయాంతమపి వేదాంతగం ద్విజమ్ ।
జిఘాంసంతం జిఘాంసేత్తు న తేన బ్రహ్మహా భవేత్ ॥
హంతవ్యోఽపి న హంతవ్యం పానీయం యశ్చ యాచతే ।
రణే హత్వాతురాన్ వ్యాస స నరో బ్రహ్మహా భవేత్ ॥
వ్యాధితం దుర్బలం బాలం స్త్ర్యనాథౌ కృపణం ధ్రువమ్।
ధనుర్భగ్నం ఛిన్నగుణం హత్వా వై బ్రహ్మహా భవేత్ ॥
ఏవం విచార్య సద్ధీమాన్ భవేత్ప్రీత్యా రణప్రియః ।
స జన్మనః ఫలం ప్రాప్య పరత్రేహ ప్రమోదతే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం రణఫలవర్ణనం నామ
ఏకవింశోఽధ్యాయః ॥

బ్రహ్మహత్యను చేసినవాడైననూ తన ప్రభువు తరపున యుద్ధమును చేయుచూ ప్రాణములను విడిచినచో, ఆతడు స్వర్గమునుండి మరలి రాడు (30). బ్రాహ్మణులు, గోవులు మరియు ప్రభువు అను వారి రక్షణ కొరకై క్రూరమృగములచేత గాని, ఏనుగుల చేతగాని సంహరింప బడినవానికి విశాలమైన వినాశము లేని ఉత్తమమగు పుణ్యలోకము లభించును (31). ఈ లోకములో మానవుడు వంద యజ్ఞములను చేసే సామర్థ్యమును కలిగియుండ వచ్చును. కాని, యుద్ధములో ప్రాణములను విడనాడుట చాల క్లేశముతో కూడిన పని (32). యుద్ధము సర్వవర్ణముల వారికీ, విశేషించి క్షత్రియునకు మహాపుణ్యమును ఇచ్చి స్వర్గలోకమును పొందింపజేయును. మానవుని సర్వతోముఖమగు ప్రతిభ యుద్ధములో వ్యక్తమగును (33). నేనిప్పుడు శాశ్వతమైన యుద్ధధర్మమును సుస్పష్టముగా చెప్పెదను. ఎవరిని యుద్ధములో శస్త్రముతో కోట్టవచ్చును ? ఎవరిని కొట్టరాదు ? అను విషయమును ఈ ధర్మము నిర్దేశించును (34). వేదాంతమునెరింగిన బ్రాహ్మణుడైననూ మహాపాపములను చేసినవాడై సంహరించే ఉద్దేశ్యముతో మీదకు వచ్చుచున్నచో, వానిని సంహరించవలెను. దాని వలన బ్రహ్మహత్యా దోషము సంక్రమించదు (35). సంహరింప దగిన వ్యక్తియైననూ దాహబాధతో నీటిని ఇమ్మని కోరినచో, వానిని సంహరించరాదు. ఓ వ్యాసా! అట్లు సంహరించినచో, బ్రహ్మహత్యాదోషము సంక్రమించును (36), రోగగ్రస్తునీ, నీరసించి యున్నవానినీ, చిన్న పిల్లవానినీ, స్త్రీని, అనాథుని, దీనుని, విరిగిన ధనస్సు గలవానినీ, తెగిన నారిత్రాడు గలవానిని చంపినచో, నిశ్చయముగా బ్రహ్మహత్యా దోషము చుట్టుకొనును (37). బుద్ధిమంతుడగు వ్యక్తి ఈ విషయములను అన్నింటినీ విచారించి యుద్ధమునందు ప్రీతిని కలిగియుండవలెను. అట్టి వ్యక్తి ఇహలోకములో మానవజన్మయొక్క సాఫల్యమును పొంది పరలోకములో ఆనందమునను భవించును (38).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు యుద్ధఫలవర్ణనము అనే ఇరువది ఒకటవ అధ్యాయము ముగిసినది (21).

22 - జీవుని పుట్టుక

వ్యాస ఉవాచ ।

విధిం తాత వదేదానీం జీవజన్మ విధానతః ।
గర్భే స్థితిం చ తస్యాపి వైరాగ్యార్థం మునీశ్వర ॥

వ్యాసుడు ఇట్లు పలికెను -

ఓ తండ్రీ ! మహర్షీ ! ఇప్పుడు వైరాగ్యము కలుగుట కొరకై జీవుడు జన్మించు విధానమును, జీవుడు గర్భములోనుండే స్థితిని గురించి చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస సమాసేన శాస్త్రసారమశేషతః।
వదిష్యామి సువైరాగ్యం ముముక్షోర్భవ బంధకృత్ ॥
పాకపాత్రస్య మధ్యే తు పృథగన్నం పృథగ్జలమ్ ।
అగ్నేరూర్ధ్వం జలం స్థాప్యం తదన్నం చ జలోపరి ॥
జలస్యాధస్స చాగ్నిర్హి స్థితోఽగ్నిం ధమతే శనైః ।
వాయునా ధమ్యమానోఽగ్నిరత్యుష్ణం కురుతే జలమ్ ॥
తదన్నముష్ణతోయేన సమంతాత్పచ్యతే పునః ।
ద్విధా భవతి తత్పక్వం పృథక్కిట్టం పృథగ్రసః ॥
మలైర్ద్వాదశభిః కిట్టం భిన్నం దేహాద్బహిర్భవేత్ ।
రసస్తు దేహే సరతి స పుష్టస్తేన జాయతే ॥
కర్ణాక్షినాసికా జిహ్వా దంతాశ్శిశ్నో గుదం నఖాః ।
మలాశ్రయాః కఫః స్వేదో విణ్మూత్రం ద్వాదశ స్మృతాః ॥
హృత్పద్మే ప్రతిబద్ధాశ్చ సర్వనాడ్యస్సమంతతః।
జ్ఞేయా రసప్రవాహిన్యస్తత్ప్రకారం బ్రువే మునే ॥
తాసాం ముఖేషు తం సూక్ష్మం ప్రాణః స్థాపయేద్రసమ్ ।
రసేన తేన నాడీస్తాః ప్రాణః పూరయతే పునః ॥
పునః ప్రయాంతి సంపూర్ణాస్తాశ్చ దేహం సమంతతః।
తతస్స నాడీమధ్యస్థశ్శరీరేణాత్మనా రసః ॥
పచ్యతే పచ్యమానాచ్చ భవేత్పాకద్వయం పునః ।
త్వక్ తయా వేష్ట్యతే పూర్వం రుధిరం చ ప్రజాయతే ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ వ్యాసా! శాస్త్రముయొక్క సారము మరియు మోక్షకామునకు సంసారబంధమును తెంచివేయునది అగు మంచి వైరాగ్యమును గురించి నిశ్శేషముగా సంగ్రహముగా చెప్పగలను. వినుము (2). అన్నమును వండే ప్రక్రియ ఇట్లు ఉండును: వంట గిన్నెలో నీటిని పోసి బియ్యమును పోయవలెను. అప్పుడు

నీరు వేరుగా, బియ్యము వేరుగా ఉండును. అపుడా పాత్రను నిప్పులపై పెట్టవలెను. నిప్పుతో నీటికి, నీటితో బియ్యమునకు సంయోగము గలదు (3). నీటికి క్రింద ఉన్న అగ్నిని వాయువు నెమ్మదిగా ప్రజ్వరిల్లజేయును. వాయువుచే ప్రజ్వరిల్ల జేయబడిన అగ్ని నీటిని మరుగునట్లు చేయును (4). ఆ వేడి నీరు బియ్యమును పూర్తిగా ఉడుకునట్లు చేయును. ఆ ఉడికిన బియ్యము రెండు భాగములుగా విడిపోవును: ఒక భాగము పైకి తేలే మాలిన్యము కాగా, రెండవ భాగము అన్నరసము (గంజి) (5). అదే విధముగా, మనము తినే ఆహారము శరీరములో విడిపోయి, పన్నెండు మాలిన్యములు విసర్జింపబడును. కాని, అన్నరసము దేహమునందు ప్రసరించి శరీరమునకు పుష్టిని చేకూర్చును. (6). చెవులు, కన్నులు, ముక్కు, నాలుక, దంతములు, జననేంద్రియము, విసర్జనేంద్రియము, గోళ్లు అనునవి మాలిన్యస్థానములు. కఫము, చెమట మరియు మలమూత్రములతో కలిసి ఈ మాలిన్యము పన్నెండు రకములుగా నున్నది (7). ఓ మహర్షీ! నాడులన్నియు అన్ని వైపులనుండియు హృదయపద్మమునకు కలుపబడి యున్నవి. అవి రసమును ప్రవహింపజేయునని తెలియదగును. ఓ మునీ! ఆ విధానమును చెప్పెదను (8). ప్రాణశక్తి ఆ సూక్ష్మమగు రసమును నాడుల ముఖస్థానములయందు స్థాపించును. ఇంతేగాక, ప్రాణశక్తి ఆ నాడులను, ఆ రసముతో నింపును (9). ఆ విధముగా రసపూర్ణములైన నాడులు దేహము అంతటా ప్రసరించును. తరువాత ఆ నాడుల మధ్యలోనున్న రసమును శరీరము జీర్ణము చేసుకొని తనలో కలుపుకొనును. ఈ పచనము రెండు రకములుగా సాగును. ముందుగా శరీరము చుట్టూ చర్మము నిర్మాణమై, తరువాత రక్తము పుట్టును (10, 11).

రక్తాల్లోమాని మాంసం చ కేశాస్స్నాయుశ్చ మాంసతః ।
స్నాయుతశ్చ తథాస్థీని నఖా మజ్జాస్థి సంభవాః ॥
మజ్జాకారణ వైకల్యం శుక్రం హి ప్రసవాత్మకమ్ ।
ఇతి ద్వాదశధాన్నస్య పరిణామాః ప్రకీర్తితాః ॥
శుక్రోఽన్నాజ్జాయతే శుక్రాద్దివ్యదేహస్య సంభవః ।
ఋతుకాలే యదా శుక్రం నిర్దోషం యోనిసంస్థితమ్ ॥
తద్వా తద్వాయుసంస్పృష్టం స్త్రీ రక్తేనైకతాం వ్రజేత్ ।
విసర్గకాలే శుక్రస్య జీవః కారణసంయుతః ॥
సంవృతః ప్రవిశేద్యోనిం కర్మభిస్స్వైర్ని యోజితః ।
తచ్ఛుక్ర రక్తమేకస్థమేకాహాత్కలిలం భవేత్ ॥
పంచరాత్రేణ కలిలం బుద్బుదాకారతాం వ్రజేత్ ।
బుద్బుదస్సప్తరాత్రేణ మాంసపేశీ భవేత్పునః ॥
గ్రీవా శిరశ్చ స్కంధౌ చ పృష్ఠవంశ స్తథోదరమ్ ।
పాణిపాదం తథా పార్శ్వే కటీర్గాత్రం తథైవ చ ॥
ద్విమాసాభ్యంతరేణైవ క్రమశస్సంభవేదిహ ।
త్రిభిర్మాసైః ప్రజాయంతే సర్వే హ్యంకుర సంధయః ॥

మాసైశ్చతుర్భిరంగుల్యః ప్రజాయంతే యథాక్రమమ్ ।

ముఖం నాసా చ కర్ణౌ మాసైః పంచభిరేవ చ ॥

దంతపంక్తిస్తథా గుహ్యం జాయంతే చ నఖాః పునః ।

కర్ణయోస్తు భవేచ్ఛిద్రం షణ్మాసాభ్యంతరేణ తు ॥

రక్తము నుండి రోమములు, మాంసము పుట్టును. మాంసమునుండి శిరస్సుపై కేశములు మరియు కండరములు పుట్టును. కండరముల నుండి ఎముకలు, ఎముకల నుండి గోళ్లు మరియు ఎముకల మధ్యనుండే మజ్జ పుట్టును (12). ఈ మజ్జ పరిణామమును చెంది శుక్రమునకు కారణమగును. శుక్రము సంతానహేతువు. ఈ తీరున అన్నము పన్నెండు రూపములలోనికి పరిణమించుచున్నది (13). అన్నము నుండి శుక్రము పుట్టుచున్నది. శుక్రమునుండి మరియొక చేతనదేహము పుట్టును. ఋతు (మాసికరజోదోషనీయమములను పాటించుట పూర్తి అయిన) కాలమునందు దోషరహితమైన శుక్రము స్త్రీ యోనియందు నిక్షిప్తమై అచటి ప్రాణశక్తితో కూడి స్త్రీ రక్తముతో ఐక్యమును చెందును. జీవుడు సూక్ష్మశరీరముతో కూడినవాడై అజ్ఞానముచే కప్పివేయబడినవాడై తన పూర్వకర్మల ప్రభావముచే నియంత్రింపబడి శుక్రమును నిక్షేపించు కాలములో స్త్రీ గర్భమును ప్రవేశించును. ఆ శుక్రరక్తసముదాయము గర్భాశయము అనే ఏకస్థానమునందు కలుసుకొని ఒక రోజు సమయములో పిండరూపమును ధరించును (14-16). ఐదు రోజులలో ఆ పిండము బుడగ ఆకారమును దాల్చును. ఆ బుడగ ఏడు రోజులలో మాంసపు ముద్దయగును (17). ఆ ముద్దయందు రెండు మాసముల లోపులో మెడ, తల, భుజములు, వెన్నెముక, పొట్ట, చేతులు, కాళ్లు, పార్శ్వభాగములు, నడుము, మరియు పూర్ణశరీరసంస్థానము నిర్మాణమగును. మూడు మాసములలో కీళ్లు అన్నియు నిర్మాణమగును (18, 19). నాలుగు మాసములలో వ్రేళ్లు, అయిదు మాసములలో క్రమముగా నోరు, ముక్కు, చెవులు ఏర్పడును (20). ఆరు మాసముల లోపులో పళ్ల వరుస, జననేంద్రియము, గోళ్లు, మరియు చెవుల లోపలి రంధ్రము ఏర్పడును (21).

పాయుర్మేహముపస్థం చ నాభిశ్చాభ్యుప జాయతే ।

సంధయో యే చ గాత్రేషు మాసైర్జాయంతి సప్తభిః ॥

అంగప్రత్యంగ సంపూర్ణః పరిపక్వస్స తిష్ఠతి ।

ఉదరే మాతురాచ్ఛన్నో జరాయౌ మునిసత్తమ ॥

మాతురాహారచౌర్యేణ షడ్విధేన రసేన తు ।

నాభినాల నిబద్ధేన వర్ధతే స దినే దినే ॥

తతః స్మృతిం లభేజ్జీవ స్సంపూర్ణోఽస్మిన్ శరీరకే ।

సుఖం దుఃఖం విజానాతి నిద్రాస్వప్నం పురాకృతమ్ ॥

మృతశ్చాహం పునర్జాతో జాతశ్చాహం పునర్మృతః ।

నానా యోని సహస్రాణి మయా దృష్టాని జాయతా ॥

అధునా జాతమాత్రోఽహం ప్రాప్తసంస్కార ఏవ చ ।

శ్రేయోఽమునా కరిష్యామి యేన గర్భే న సంభవః ॥

గర్భస్థశ్చింతయత్యేవమహం గర్భాద్వినిస్సృతః ।

అన్వేష్యామి శివజ్ఞానం సంసార వినివర్తకమ్ ॥

ఏవం స గర్భదుఃఖేన మహతా పరిపీడితః ।

జీవః కర్మవశాదాస్తే మోక్షోపాయం విచింతయన్ ॥

యథా గిరివరాక్రాంతః కశ్చిద్దుఃఖేన తిష్ఠతి ।

తథా జరాయుణా దేహీ దుఃఖం తిష్ఠతి వేష్టితః ॥

పతితస్సాగరే యద్వద్దుఃఖమాస్తే సమాకులః ।

గర్భోదకేన సిక్తాంగ స్సర్వదాకులితస్తదా ॥

ఏడు మాసములలో విసర్జనేంద్రియము, మూత్రాశయము, జననేంద్రియము, నాభి మరియు శరీరావయవములయందలి కీళ్లు నిర్మాణమగును (22). ఓ మహర్షీ! అపుడు సర్వావయవములయందు పరిపూర్ణుడై పూర్తిగా ఎదిగియున్న ఆ శిశువు తల్లియొక్క కడుపులో జరాయువు (పిండమును చుట్టియుండు పొర) నందు కప్పబడి యుండును (23). ఆ శిశువు తల్లియొక్క ఆరు రసములతో కూడియున్న ఆహారమును నాభినాళము ద్వారా స్వీకరించుచూ దినదిన ప్రవర్ధమానుడగుచుండును (24). అపుడు ఆ శరీరము పూర్ణముగా నిర్మాణమై యుండగా ఆ జీవుడు స్మృతిని పొంది సుఖదుఃఖములను మరియు పూర్వజన్మలో తాను చేసిన కర్మలను నిద్రపోతూ కన్న కలను వలె స్మరించును (25). నేను మరణించి మరల జన్మించినాను; జన్మించి మరల మరణించినాను. ఈ విధముగా పుడుతూ ఉండే నేను అనేకవేల జన్మలను చూచితిని (26). ఈ జన్మలో నేను పుట్టి సంస్కారములను పొందిన వెంటనే ఈ దేహముతో మోక్షము లభించి మరల జన్మ లేని విధముగా ప్రయత్నించెదను (27). నేను గర్భమునుండి బయట పడగానే, సంసారమునుండి విముక్తిని కలిగించే శివజ్ఞానమును అన్వేషించెదను అని గర్భమునందలి జీవుడు తలపోయుచుండును (28). ఈ విధముగా ఆ జీవుడు కర్మకు లోబడి గర్భవాసముయొక్క మహా దుఃఖమును అనుభవించుచూ మోక్షోపాయమును గురించి ఆలోచించుచుండును (29). జరాయువుచే కప్పబడియున్న జీవుడు పెద్ద పర్వతము మీద పడినదై యన్నట్లు భారముచే క్రుంగిపోవుచూ మహా దుఃఖముననుభవించును (30). ఆ సమయములో సర్వకాలములలో గర్భమునందలి నీటిలో మునిగి యున్న జీవుడు సముద్రమునందు పడియున్న మానవుని వలే కంగారు పడుతూ మహా దుఃఖమును అనుభవించును (31).

లోహకుంభే యథా న్యస్తః పచ్యతే కశ్చిదగ్నినా ।

గర్భకుంభే తథా క్షిప్తః పచ్యతే జఠరాగ్నినా ॥

సూచీభిరగ్నివర్ణాభిర్నిర్భిన్నస్య నిరంతరమ్ ।

యద్దుఃఖం జాయతే తస్య తత్ర సంస్థస్య చాధికమ్ ॥

గర్భావాసాత్పరం దుఃఖం కష్టం నైవాస్తి కుత్రచిత్ ।

దేహినాం దుఃఖబహులం సుఘోరమతి సంకటమ్ ॥

ఇత్యేతత్సుమహద్దుఃఖం పాపినాం పరికీర్తితమ్ ।
కేవలం ధర్మబుద్ధీనాం సప్తమాసైర్భవ స్సదా ॥
గర్భాత్సు దుర్లభం దుఃఖం యోనియంత్రని పీడనాత్ ।
భవేత్పాపాత్మనాం వ్యాస న హి ధర్మయుతాత్మనామ్ ॥
ఇక్షువత్పీడ్యమానస్య యంత్రేణైవ సమంతతః।
శిరసా తాడ్యమానస్య పాపముద్గరకేణ చ ॥
యంత్రేణ పీడితా యద్వన్నిసారాస్స్యుస్తిలాః క్షణాత్ ।
తథా శరీరం నిస్సారం యోనియంత్రని పీడనాత్ ॥
అస్థిపాదతులాస్తంభం స్నాయుబంధేన యంత్రితమ్ ।
రక్తమాంస మృదాలిప్తం విణ్మూత్రద్రవ్య భాజనమ్ ॥
కేశరోమన ఖచ్ఛన్నం రోగాయతనమాతురమ్ ।
వదనైక మహాద్వారం గవాక్షాష్టక భూషితమ్ ॥
ఓష్ఠద్వయకపాటం చ తథా జిహ్వార్గలాన్వితమ్ ।
భోగతృష్ణాతురం మూఢం రాగద్వేషవశానుగమ్ ॥

నిప్పులపై కాలుచున్న పాత్రలోని మరుగుచున్న నీటిలో పారవేయబడిన జీవుడు ఏ తీరున దహించివేయబడునో, అదే విధముగా గర్భము అనే పాత్రలో పారవేయబడియున్న జీవుడు జఠరాగ్నిచే తపింపజేయబడును (32). నిప్పులవలె కణకణలాడే సూదులతో నిరంతరముగా పొడవబడినప్పుడు ఎట్టి దుఃఖము కలుగునో, గర్భమునందలి జీవునకు అంతకంటే అధికమగు దుఃఖము కలుగును (33). ప్రాణులకు అతిశయించిన దుఃఖమును కలిగించునది, మిక్కిలి ఘోరమైనది, తప్పించుకొన శక్యము కానిది అగు గర్భవాసముకంటే పెద్ద దుఃఖము మరియు క్లేశము ఈ జగత్తులో ఎక్కడైననూ లేనే లేదు (34). ఈ మహాదు:ఖము పాపాత్ములకు మాత్రమే కలుగునని చెప్పబడినది. కానీ ధర్మాత్ములగు జీవులు నిశ్చయముగా ఏడు మాసములలో జన్మించెదరు (35). ఓ వ్యాసా! జన్మించునప్పుడు జీవునకు కలిగే దుఃఖము గర్భవాసదుఃఖము కంటే అధికము. ఈ దుఃఖము పాపాత్ములకు మాత్రమే కలుగును. ధర్మబుద్ధి గలవారికి ఈ దుఃఖము కలుగదు (36). పాపియగు జీవుడు జన్మసమయములో యంత్రములో నలగకొట్టబడే చేరుకుగడవలే పాపము అనే రోకలి తలపై మోదుచున్నదా యన్నట్లు పీడను పొందును (37). యంత్రములో నలగకొట్టబడిన నువ్వులు క్షణకాలములో పిప్పి యగును. అదే విధముగా జన్మసమయములో కలిగే పీడ వలన జీవుని దేహము నిస్సారమగును (38). ఈ శరీరము వ్రేలాడే స్తంభములు వలెనున్న ఎముకలు మరియు పాదములు గలది, కండరములచే బంధింపబడి నియంత్రించబడునది, రక్తముచే మరియు అశుచియగు మాంసముచే పూయబడియున్నది, మలమూత్రములవంటి పదార్థములకు నిలయమైనది (39). కేశములు, రోమములు, గోళ్లు అనువాటితో ఆవరించ బడియున్నది, రోగములకు నిలయమైనది, దుఃఖమునకు ఆలవాలమైనది, నోరు అనే పెద్ద ద్వారము గలది, ఎనిమిది (నవరంధ్రములలో నోరు మినహాయించి మిగిలినవి) కిటికీలతో

అలంకరింపబడియున్నది (40). రెండు పెదవులు అనే తలుపులు గలది, నాలుక అనే గడియ గలది, భోగములయందలి తృష్ణచే పీడింపబడునది, మోహమునకు నిలయమైనది మరియు రాగద్వేషములకు వశమై చరించునది (41).

సంవర్తితాంగ ప్రత్యంగం జరాయుపరివేష్టితమ్ ।
సంకటేనావివిక్తేన యోనిమార్గేణ నిర్గతమ్ ॥
విణ్మూత్రరక్తసిక్తాంగం వికోశిక సముద్భవమ్ ।
అస్థిపంజర విఖ్యాతమస్మిన్ జ్ఞేయం కలేవరమ్ ॥
శతత్రయం షష్ట్యధికం పంచపేశీశతానీ చ ।
సార్ధాభిస్తిసృభిశ్ఛన్నం సమంతా ద్రోమకోటిభిః ॥
శరీరం స్థూలసూక్ష్మాభిర్దృశ్యాఽ దృశ్యా హి తాస్స్మృతాః ।
ఏతావతీభిర్నాడీభిః కోటిభిస్తత్సమంతతః ॥
అస్వేదమధుభిర్యా భిరంతస్థః స్రవతే బహిః ।
ద్వాత్రింశదదశనాః ప్రోక్తా వింశతిశ్చ నఖాః స్మృతాః ॥
పిత్తస్య కుడవం జ్ఞేయం కఫస్యాథాడకం స్మృతమ్ ।
వసాయాశ్చ పలం వింశత్తదర్ధం కపిలస్య చ ॥
పంచార్ధం తు తులా జ్ఞేయా పలాని దశ మేదసః ।
పలత్రయం మహారక్తం మజ్ఞాయాశ్చ చతుర్గుణమ్ ॥
శుక్రార్ధం కుడవం జ్ఞేయం తద్బీజం దేహినాం బలమ్ ।
మాంసస్య చైకపిండేన పలసాహస్రముచ్యతే ॥
రక్తం పలశతం జ్ఞేయం విణ్మూత్రం యత్ప్రమాణతః ।
అంజలయశ్చ చత్వారశ్చత్వారో మునిసత్తమ ॥
ఇతి దేహగృహం హ్యేతన్నిత్యస్యానిత్యమాత్మనః ।
అవిశుద్ధం విశుద్ధస్య కర్మబంధాద్వి నిర్మితమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం దేహోత్పత్తివర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥

తల్లి గర్భములో జరాయువు అను చర్మముచే కప్పబడియున్న జీవుడు జన్మిం◌్మించే సమయములో ఒక దానితో నొకటి చిక్కుకొనియున్న అవయవములు గలవాడై, ఇరుకైన మార్గముగుండా అతికష్టము మీద బయట పడును (42). ఈ సమయములో ఒర (బంధస్థానము) నుండి బయట పడి అస్థిపంజరము వలెనున్న ఆ దేహము మలమూత్రములతో మరియు రక్తముతో తడిసి యుండును (43). మూడు వందల అరువది ఎముకలతో మరియు అయిదు వందల కండరములతో కూడియున్న ఆ దేహము మూడున్నర కోట్ల రోమములతో కప్పబడియుండును (44), ఆ దేహములో అంతటా అదే సంఖ్యలో నాడులు వ్యాపించియుండును. ఈ నాడులలో కొన్ని స్థూలముగా నుండుటచే కంటికి కానవచ్చిననూ, మరికొన్ని సూక్ష్మములగు నాడులు కంటికి కానరావు (45). దేహము లోపల స్రవించే మాలిన్యములు ఈ రోమకూపములగుండా చెమట రూపములో బయటకు వచ్చును. ఆ దేహమునకు ముప్పది రెండు పళ్లు, ఇరువది గోళ్లు ఏర్పడును (46). దేహములో పిత్తముయొక్క పరిమాణము ఒక కుడవము (12 దోసిళ్లు) అనియు, కఫముయొక్క పరిమాణము ఆడకము (శేరు) అనియు, వస (మాంసములోని క్రొవ్వు) యొక్క పరిమాణము ఇరువది పలములనీయు, కుంకుమ రంగు గల ఘనపదార్థము దానిలో సగమనియు చెప్పబడినది (47). క్రొవ్వు పదార్థము యొక్క పరిమాణము పదిహేనున్నర పలములు ఉండును. శుద్దరక్తము మూడు పలములు ఉండును. ఇది ఎముకలోని ములుగుకు నాలుగు రెట్లు (48). శుక్రము అర్ధకుడవము (ఆరు దోసిళ్లు) ఉండును. ప్రాణుల దేహశక్తి మరియు ప్రజనన సామర్థ్యము దానిపై ఆధారపడి యుండును. ఒక దేహములోని మాంస పిండము వేయి పలముల పరిమాణము కలిగియుండును (49). ఓ మహర్షీ! రక్తము యొక్క పరిమాణము వంద పలములు అనియు, మలమూత్రములు నాలుగు నాలుగు గుప్పిళ్ల పరిమాణములో నుండుననియు తెలియవలెను (50), ఈ అనిత్యమగు దేహము అనే గృహమునందు నిత్యమగు ఆత్మ నివసించును. విశుద్ధమగు ఆత్మకు కర్మబంధము వలన ఈ అశుచియగు దేహము నిర్మితమైనది (51).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు జీవుని పుట్టుకను వర్ణించే ఇరువది రెండవ అధ్యాయము ముగిసినది (22).

23 - దేహము అశుచి- జరాది దోష గ్రస్తము

సనత్కుమార ఉవాచ ।

శృణు వ్యాస మహాబుద్ధే దేహస్యాశుచితాం మునే ।
మహత్త్వం చ స్వభావస్య సమాసాత్కథయామ్యహమ్ ॥
శుక్రశోణిత సంయోగాద్దేహస్సంజాయతే యతః ।
నిత్యం విణ్మూత్రసంపూర్ణస్తేనాయమ శుచిస్స్మృతః ।
యథాంతర్విష్ఠయా పూర్ణశ్శుచిమాన్న బహిర్ఘటః ।
శోధ్యమానో హి దేహోఽయం తేనాయమశుచిస్తతః ॥
సంప్రాప్యాతి పవిత్రాణి పంచగవ్యం హవీంషి చ ।
అశుచిత్వం క్షణాద్యాంతి కిమన్యదశుచిస్తతః ॥
హృద్యాన్యప్యన్నపానాని యం ప్రాప్య సురభీణి చ ।
అశుచిత్వం ప్రయాంత్యాశు కిమన్య దశుచిస్తతః ॥
హే జనాః కిం న పశ్యంతి యన్నిర్యాతి దినే దినే ।
స్వదేహాత్కశ్మలం పూతిస్తదా ధారః కథం శుచిః ॥
దేహస్సంశోధ్యమానోఽపి పంచగవ్యకుశాంబుభిః ।
ఘృష్యమాణ ఇవాంగారో నిర్మలత్వం న గచ్ఛతి ॥
స్రోతాంసి యస్య సతతం ప్రభవంతి గిరేరివ ।
కఫమూత్ర పురీషాద్యైస్స దేహశ్శుధ్యతే కథమ్ ॥
సర్వాశుచి నిధానస్య శరీరస్య న విద్యతే ।
శుచిరేకః ప్రదేశోఽపి విణ్మూత్రస్య దృతేరివ ॥
స్పృష్ట్వాత్మదేహ స్రోతాంసి మృత్తోయైశ్శోధ్యతే కరః ।
తథాప్య శుచిభాండస్య న విభ్రశ్యతి కింకరః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఓ వ్యాసా! నీవు మహాబుద్ధిశాలివి. ఓ మునీ! దేహముయొక్క అశుచిని గురించి, స్వభావముయొక్క గొప్పదనమును గురించి సంగ్రహముగా చెప్పెదను వినుము (1). దేహము శుక్రశోణితముల కలయికచే పుట్టినదగుటచే, సర్వకాలములలో మలమూత్రములతో నిండి యుండును. కావుననే, దేహము అశుచి యని చెప్పబడినది (2). లోపల మలముతో కూడియున్న కుండ బయట శుభ్రముగా నుండజాలదు. అదే విధముగా, ఈ దేహమును శుభ్రము చేయుచున్ననూ, మరల మలినమగుచుండును. కావుననే, ఇది అశుచి యని చెప్పబడినది (3). పరమపవిత్రమగు పంచగవ్యము (పాలు, పెరుగు, వెన్న మొదలగు వాటి మిశ్రమము) ను మరియు యజ్ఞప్రసాదమును భక్షించిన తరువాత కూడ క్షణకాలములో ఈ దేహము మరల అశుచి యగును. దీనికంటే అధికమగు అశుచి మరియేది గలదు ? (4) ఉల్లాసకరము, పరిమళభరితము అగు అన్నము మరియు పానీయములు ఈ దేహమును పొంది శీఘ్రముగా అశుచి యగుచున్నవి.

దీనికంటే అధికమగు అశుచీ మరియేది గలదు ? (5) ఓ జనులారా! ప్రతిదినము మనము దేహమునుండి వెలువడే మాలిన్యమును, కుళ్లును చూచుట లేదా ? వాటికి ఆశ్రయమగు దేహము శుచి యెట్లగును ? (6) బొగ్గును ఉతికి ఆరవేసిననూ తెల్లబడదు. అటులనే, పంచగవ్యము మరియు దర్భజలము అను వాటిచే పవిత్రము చేయబడుచున్నప్పటికీ దేహము శుచీ కాదు (7) కొండనుండి జలము కొండకాలువల రూపములో ప్రవహించు విధముగా, దేహము నుండి శ్లేష్మము మరియు మలమూత్రముల రూపములో మాలిన్యము నిరంతరముగా ప్రవహించుచునే యుండును. అట్టి దేహము శుచి యగుట ఎట్లు సంభవమగును ? (8) సకలమాలిన్యములకు నిలయమగు శరీరము మలమూత్రములతో నిండియున్న తోలుతిత్తి వంటిది. దానిలో శుచియగు భాగము లేశమైననూ లేదు (9). దేహమునుండి స్రవించే మాలిన్యమును ముట్టుకున్న వెంటనే మనము చేతిని మట్టితో తోమి నీటితో శుభ్రము చేసుకొనవలెను. అయిననూ, మాలిన్యమునకు ఆశ్రయమైన దేహమునకు బానిసయైన మానవుడు భ్రష్టుడు కాడా యేమి ?(10)

కాయస్సు గంధధూపాద్యైర్యత్నేనాది సుసంస్కృతః ।

న జహాతి స్వభావం స శ్వపుచ్ఛమివ నామితమ్ ॥

యథా జాత్యైవ కృష్ణోర్ధశ్శుక్లస్స్యాన్న హ్యుపాయతః ।

సంశోధ్యమానాపి తథా భవేన్మూర్తిర్న నిర్మలా ॥

జిఘ్రన్నపి స్వదుర్గంధం పశ్యన్నపి స్వకం మలమ్ ।

న విరజ్యేత లోకోఽయం పీడయన్నపి నాసికామ్ ॥

అహో మోహస్య మాహాత్మ్యం యేనేదం ఛాదితం జగత్ ।

శీఘ్రం పశ్యన్ స్వకం దోషం కాయస్య న విరజ్యతే ॥

స్వదేహస్య విగంధేన న విరజ్యేత యో నరః ।

విరాగకారణం తస్య కిమేతదుప దిశ్యతే ॥

సర్వస్యైవ జగన్మధ్యే దేహ ఏవాశుచిర్భవేత్ ।

తన్మలావయవస్పర్శాచ్ఛుచిరప్య శుచిర్భవేత్ ॥

గంధలేపాపనో దార్థం శౌచం దేహస్య కీర్తితమ్।

ద్వయస్యాపగమాచ్ఛుద్ధి శ్శుద్ధస్పర్శాద్విశుధ్యతి ॥

గంగాతోయేన సర్వేణ మృద్భారైః పర్వతో పమైః।

ఆమృత్యోరాచరేచ్ఛౌచం భావదుష్టో న శుధ్యతి ॥

తీర్థస్నానై స్తపోభిర్వా దుష్టాత్మా నైవ శుధ్యతి ।

శ్వదృతిః క్షాలితా తీర్థే కిం శుద్ధిమధిగచ్ఛతి ॥

అంతర్భావ ప్రదుష్టస్య విశతోఽపి హుతాశనమ్ ।

న స్వర్గో నాపవర్గశ్చ దేహనిర్దహనం పరమ్ ॥

సర్వేణ గాంగేన జలేన సమ్యజ్ మృత్పర్వతేనాప్యథ భావదుష్టః ।

ఆజన్మనస్స్నానపరో మనుష్యో న శుధ్యతీత్యేవ వయం వదామః ॥

కుక్క తోకను ఎంత లాగి కట్టినా, అది వంకరగనే యుండును. అదే విధముగా, సుగంధము, ధూపము మొదలగు ద్రవ్యములతో దేహమును ప్రయత్నపూర్వకముగా శుద్ధి చేసిననూ, అది తన అశుచిస్వభావమును విడనాడదు (11). సహజసిద్ధముగా నల్లగా నుండే వస్తువును వివిధోపాయములచే చక్కగా శుద్ధి చేసిననూ, అది తెల్లబడదు. అదే విధముగా చక్కగా శుద్ధి చేసిననూ దేహము మాలిన్యములు లేనిదిగా కాదు (12), మానవుడు తన దేహము యొక్క దుర్గంధమును భరించలేక ముక్కును మూసుకొనును. ఈ మానవుడు తన మాలిన్యమును తాను చూచుచున్ననూ, విరక్తిని పొందకున్నాడు (13). ఆశ్చర్యము ! మోహము ఎంత గొప్పదియో ! ఈ జగత్తు మోహముచే కప్పివేయబడి యున్నది. మానవుడు తన దేహముయొక్క దోషములను చూచుచున్ననూ, శీఘ్రముగా విరక్తిని పొందుట లేదు (14). తన దేహముయొక్క దుర్గంధముచే విరక్తిని పొందని వ్యక్తికి వైరాగ్యమును కలిగించే ఉపదేశమును బోధించి ప్రయోజనమేమున్నది ? (15) ఈ సర్వజగత్తులో దేహము మాత్రమే అతిశయించిన మాలిన్యములను కలిగియున్నది. మాలిన్యములతో కూడిన దేహావయవములను స్పృశించినంత మాత్రాన శుద్ధమైన వస్తువు కూడ అశుచియగును (16). దేహమునుండి స్రవించే ద్రవములను, మరియు గంధమును తొలగించుట కొరకై దానికి శౌచము విధించబడినది. ఈ రెండు దోషములు తొలగినచో, అది శుద్ధమగును. మరియు శుద్ధవస్తువుయొక్క స్పర్శచేత కూడ దేహము శుద్ధమగును (17), దుష్టములగు భావములు గల వ్యక్తి గంగాజలమునంతనూ పోసి కడిగిననూ, పర్వతముల పరిమాణము గల మట్టితో రుద్దిననూ, మరణించు వరకు శుద్ధికర్మలను చేసిననూ శుద్ధిని పొందడు (18). దుష్టమగు బుద్ధిగల వ్యక్తి తీర్థములయందు స్నానములను చేయుట చేత, తపస్సు చేత శుద్ధిని పొందే ప్రసక్తి లేదు. కుక్కతోలును తీర్థజలముతో కడిగినచో, అది శుద్ధమగునా యేమి ? (19) అంతఃకరణములో దుష్టుడైన వ్యక్తి నిప్పులలో దుమికిననూ, ఒళ్లు కాలుట తప్ప స్వర్గము గాని, మోక్షము గాని లభించబోదు (20). దుష్టమైన అంతఃకరణము గల వ్యక్తి బ్రతికి ఉన్నంత కాలము సకలమగు గంగాజలముతో స్నానమును చేయుచూ గడిపిననూ, పర్వతమంతటి మట్టితో శరీరమును రుద్దిననూ, లేశమైననూ శుద్ధిని పొందలేడని మేము చెప్పుచున్నాము (21).

ప్రజ్వాల్య వహ్నిం ఘృతతైలసిక్తం ప్రదక్షిణావర్తశిఖం మహాంతమ్ ।
ప్రవిశ్య దగ్ధస్త్వపి భావదుష్టో న ధర్మమాప్నోతి ఫలం న చాన్యత్ ॥
గంగాదితీర్థేషు వసంతి మత్స్యా దేవాలయ పక్షిగణాశ్చ నిత్యమ్ ।
భావోజ్ఝితాస్తే న ఫలం లభంతే తీర్థావగాహాచ్చ తథైవ దానాత్ ॥
భావశుద్ధిః పరం శౌచం ప్రమాణే సర్వకర్మసు ।
అన్యథాఽఽలింగ్యతే కాంతా భావేన దుహితాన్యథా ॥
మనసో భిద్యతే వృత్తిరభిన్నేష్వపి వస్తుషు ।
అన్యథైవ సుతం నారీ చింతయత్యన్యథా పతిమ్ ॥
పశ్య ధ్వమస్య భావస్య మహాభాగ్య మశేషతః ।
పరిష్వక్తోఽపి యన్నార్యా భావహీనాం న కామయేత్ ॥

నాద్యాద్వివిధమన్నాద్యం భక్ష్యాణి సురభీణి చ।
యది చింతాం సమాధత్తే చిత్తే కామాదిషు త్రిషు ॥
గృహ్యతే తేన భావేన నరో భావాద్విముచ్యతే ।
భావతశ్శుచిశుద్ధాత్మ స్వర్గం మోక్షం చ విందతి ॥
భావేనైకాత్మశుద్ధాత్మ దహన్ జుహ్వన్ స్తువన్ మృతః ।
జ్ఞానావాప్తేరవాప్యాశు లోకాన్ సుబహుయాజినామ్ ॥
జ్ఞానామలాంభసా పుంసాం సద్వైరాగ్యమృదా పునః ।
అవిద్యారాగ విణ్మూత్రలేపగంధ విశోధనమ్ ॥
ఏవమేతచ్ఛరీరం హి నిసర్గా దశుచి స్మృతమ్ ।
త్వఙ్మాత్రసారం నిస్సారం కదలీసార సన్నిభమ్ ॥
జ్ఞాత్వైవం దోషవద్దేహం యః ప్రాజ్ఞశ్శిథిలో భవేత్ ।
దేహభోగోద్భవాద్భావాచ్ఛమచిత్తః ప్రసన్నధీః ॥
సోఽతిక్రామతి సంసారం జీవన్ముక్తః ప్రజాయతే ।
సంసారం కదలీసార దృఢగ్రాహ్యేవ తిష్ఠతే ॥

దుష్టమైన అంతఃకరణము గల వ్యక్తి అగ్నిని వ్రేల్చి దానిని నేయిని మరియు నూనెను ః పోసి ప్రజ్వరిల్ల జేసి, పెద్ద జ్వాలలతో సుడులు తీరుగుచున్న ఆ అగ్నికి ప్రదక్షిణము చేసి, దానియందు దుమికి దహింపబడిననూ, వానికి ధర్మము గానీ, మరియొక ఫలము గానీ దక్కదు (22). గంగ మొదలగు పవిత్రనదీజలములలో చేపలు బ్రతుకుచున్నవి. పక్షుల గుంపులు నిత్యము దేవాలయములో నివసించుచున్నవి. కాని వాటికి భగవద్భావము లేకుండుటచే, పుణ్యఫలము లభించదు. అదే విధముగా, భావములో దుష్టుడైన వ్యక్తి పుణ్యనదులలో మునిగిననూ, దానమును చేసిననూ, ఫలము సున్న (23), కర్మలన్నింటియొక్క పవిత్రత పూర్తిగా అంతఃకరణశుద్ధిపై ఆధారపడియున్నది. మానవుడు తన భార్యను కౌగిలించుకున్నప్పుడు, మరియు కుమార్తెను కౌగిలించుకున్నప్పుడు భావము వేరుగా నుండును (24). వస్తువులలో భేదము లేకున్ననూ, మనస్సులోని భావములలో భేదము ఉండును. స్త్రీ కుమారునియందు ఒక భావమును, భర్తయందు మరియొక భావమును కలిగియుండును (25). ఈ మనో భావముయొక్క మహాభాగ్యమును గాంచుడు. పురుషుడు ఒక స్త్రీచే కౌగిలించుకొన బడిననూ, ఆమెయందు ప్రేమ లేనిచో, ఆమెను కామించడు (26). మనస్సు కామక్రోధలోభములనే భావములచే చింతను గొని యున్నచో, అట్టి మానవుడు సుగంధయుక్తములగు వివిధభక్ష్యములను మరియు రుచ్యమగు అన్నమును భుజించలేడు (27). మానవుడు మనో భావములచే బంధింపబడును. కానీ, శుద్ధమగు మనో భావములు గల వ్యక్తి భావములనుండి విముక్తుడై స్వర్గమును మరియు మోక్షమును కూడ పొందును (28). శుద్ధమగు భావములచే ఏకాగ్రము మరియు పవిత్రము అగు అంతఃకరణము గల మానవుడు దహింపబడిన మాలిన్యము గలవాడై, హోమములను చేసి, భగవానుని స్తుతించి, శీఘ్రముగా జ్ఞానమును పొందినవాడై, దాని ప్రభావముచే మరణించిన తరువాత,

అనేకములగు గొప్ప యజ్ఞములను చేయువారు పొందే లోకములను పొందును (29). మానవులు మలమూత్రములవంటి అజ్ఞానకామముల వలన కలిగే మాలిన్యమును మరియు దుర్గంధమును, జ్ఞానము అనే పవిత్రమగు జలమును ఉపయోగించి చక్కని వైరాగ్యము అనే మట్టితో తోముట వలన పోగొట్టుకొనవచ్చును (30). ఈ విధముగా ఈ శరీరము సహజముగనే అశుచి యని చెప్పబడినది. అరటి బోదె వలె నిస్సారమైన ఈ శరీరముయొక్క పస, పైన కప్పియున్న చర్మము మాత్రమే (31). ఏ. వివేకి ఈ విధముగా దేహము దోషములతో కుడియున్నదని గ్రహించి శాంతమగు మనస్సు, ప్రసన్నమగు బుద్ధి గలవాడై దేహభోగములయందలి ఆసక్తిని బలహీనము చేసుకొని యుండునో (32), అట్టి మానవుడు సంసారమును అతిక్రమించి జీవించియుండగనే ముక్తుడగును. అరటి బోదె వలె నిస్సారమైన సంసారమును గట్టిగా పట్టుకున్న వ్యక్తి సంసారములో స్థిరముగా నుండును (33).

ఏవమేతన్మహాకష్టం జన్మ దుఃఖం ప్రకీర్తితమ్ ।
పుంసామజ్ఞానదోషేణ నానాకర్మవశేన చ ॥
శ్లోకార్ధేన తు వక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
మమేతి పరమం దుఃఖం న మమేతి పరం సుఖమ్ ॥
బహవోఽపీహ రాజానః పరం లోకమితో గతాః ।
నిర్మమత్వసమేతాస్తు బద్ధాశ్శత సహస్రశః ॥
గర్భస్థస్య స్మృతిర్యాసీత్సా చ తస్య ప్రణశ్యతి ।
సంమూర్ఛితేన దుఃఖేన యోనియంత్రని పీడనాత్ ॥
బాహ్యేన వాయునా వాస్య మోహసంగేన దేహినః ।
స్పృష్టమాత్రేణ ఘోరేణ జ్వరస్సముపజాయతే॥
తేన జ్వరేణ మహతా సమ్మోహశ్చ ప్రజాయతే ।
సమ్మూఢస్య స్మృతిభ్రంశశ్శీఘ్రం సంజాయతే పునః ॥
స్మృతిభ్రంశాత్తతస్తస్య స్మృతిర్నో పూర్వకర్మణః ।
రతిస్సంజాయతే తూర్ణం జంతోస్తత్రైవ జన్మని ॥
రక్తో మూఢశ్చ లోకోఽయం న కార్యే సంప్రవర్తతే ।
న చాత్మానం విజనాతి న పరం న చ దైవతమ్ ॥
న శృణోతి పరం శ్రేయస్సతి కర్ణేఽపి సన్మనే ।
న పశ్యతి పరం శ్రేయస్సతి చక్షుషి తత్క్షమే ॥
సమే పథి శనైర్గచ్ఛన్ స్ఖలతీవ పదే పదే ।
సత్యాం బుద్ధౌ న జానాతి బోధ్యమానో బుధైరపి ॥
సంసారే క్లిశ్యతే తేన గర్భలో భవశానుగః ।
గర్భస్మృతేన పాపేన సముజ్ఝితమతిః పుమాన్ ॥

ఈ విధముగా జీవులు అజ్ఞానమనే దోషముచే వివిధకర్మలకు వశులై మిక్కిలి క్లే◌ాశకరమైన జన్మదుఃఖమును పొందెదరని చెప్పబడినది (34). కోటి గ్రంథములలో చెప్పబడిన జ్ఞానముయొక్క సారమును సగము శ్లోకములో చెప్పెదను. నాది అను బుద్ధి మహా దుఃఖహేతువు. నాది కాదు అనే బుద్ధి మహాసుఖమును ఇచ్చును (35), లక్షలు సంఖ్యలో రాజులు ఈ లోకములో సంసారమునందు బద్ధులై యున్ననూ మమకారమును విడిచిపెట్టి శ్రేష్ఠమగు లోకములను పొందిరి (36). జీవునకు గర్భములోనుండగా కొద్ది వివేకము ఉండును. కాని జన్మసమయములో కలిగే నలుగుడు వలన దుఃఖము వలన జీవుడు ఆ స్మృతిని గోల్పోవును (37). జీవుడు పుట్టుటతో డనే ఘోరమగు మోహమును పొందును. బయటనుండే గాలి తగులుట తోడనే ఆ శిశువునకు అజ్ఞానమనే. జ్వరము వచ్చును (38). ఆ గొప్ప జ్వరముచే జీవునకు గొప్ప వ్యామోహము కలుగును. ఆ వ్యామోహము కలిగిన వెంటనే జీవుడు స్మృతిని గోల్పోవును (39). స్మృతిని గోల్పోవుటచే ఆ జీవునకు పూర్వములో చేసిన కర్మలు గుర్తులో నుండవు. వెంటనే జీవునకు ఆ జన్మయందు మాత్రమే ఆసక్తి దృఢమగును (40). మూర్ఖుడగు ఈ జీవుడు దేహము నందు అనురాగము గలవాడై కర్తవ్య కర్మలను విడిచిపెట్టును. ఆతడు ఆత్మస్వరూపమును గాని, పరమేశ్వరతత్త్వమును గాని తెలియజాలడు (41), ఓ మహర్షీ! మానవుడు చెవి ఉన్ననూ మోక్షమునిచ్చే జ్ఞానమును శ్రవణము చేయడు. పరమపురుషార్థమును చూడగలిగే జ్ఞాననేత్రము ఉన్ననూ, మానవుడు దానిని చూడడు (42). చదునైన నేలపై మెల్లగా నడుచుచున్ననూ, మానవుడు ప్రతి అడుగులో తూలుచున్నాడా యన్నట్లు ప్రవర్తించును. బుద్ధి ఉన్ననూ, మానవుడు పండితుల ఉపదేశమును తెలుసుకొనడు (43). మానవుడు లోభమునకు వశవర్తియై సంసారములో కష్టములననుభవించుచుండును. ఆతడు గర్భములో నుండగా తాను చేసిన పాపములను స్మరించెడిపోడు.. కాని ఇప్పుడు వానికి ఆ స్మృతి కరువైనది (44).

ఇత్థం మహత్పరం దివ్యం శాస్త్రముక్తం శివేన తు ।
తపసః కథనార్థాయ స్వర్గమోక్షప్రసాధనమ్ ॥
యే సత్యస్మిన్ శివే జ్ఞానే సర్వకామార్థసాధనే ।
న కుర్వంత్యాత్మనః శ్రేయస్తదత్ర మహదద్భుతమ్ ॥
అవ్యక్తేంద్రియ వృత్తిత్వాదాల్యే దుఃఖం మహత్పునః ।
ఇచ్ఛన్నపి న శక్నోతి వక్తుం కర్తుం ప్రతిక్రియామ్ ॥
దంతోత్థానే మహద్దుఃఖ మల్పేన వ్యాధినా తథా ।
బాలరోగైశ్చ వివిధైః పీడా బాలగ్రహైరపి ॥
క్వచిత్ క్షుత్తృట్ పరీతాంగః క్వచిత్తిష్ఠతి సంరటన్ ।
విణ్మూత్రభక్షణాద్యం చ మోహాద్బాల స్సమాచరేత్ ॥
కౌమారే కర్ణపీడాహం మాతాపిత్రోశ్చ సాధనైః ।
అక్షరాధ్యయనాద్యైశ్చ నానాదుఃఖం ప్రవర్తతే ॥

బాల్యే దుఃఖమతీత్యైవ పశ్యన్నపి విమూఢధీః ।
న కుర్వీతాత్మనః శ్రేయస్తదత్ర మహదద్భుతమ్ ॥
ప్రవృత్తేంద్రియ వృత్తిత్వాత్కామరోగ ప్రపీడనాత్ ।
తదప్రాప్తే తు సతతం కుతస్సౌఖ్యం తు యౌవనే ॥
ఈర్ష్యయా చ మహద్దుఃఖం మోహాద్రక్తస్య తస్య చ ।
నేత్రస్య కుపితస్యేవ త్యాగీ దుఃఖాయ కేవలమ్ ॥
న రాత్రౌ విందతే నిద్రాం కామాగ్ని పరివేదితః ।
దివాపి చ కుతస్సౌఖ్యమర్థోపార్జన చింతయా ॥
స్త్రీష్వధ్యాసితచిత్తస్య యే పుంసశ్శుక్ర బిందవః।
తే సుఖాయ న మన్యంతే స్వేదజా ఇవ తే తథా ॥

స్వర్గమును మరియు మోక్షమును సంపాదించి పెట్టే గొప్ప పరమదివ్యశాస్త్రము ను శివుడు తపస్సును వర్ణించే సందర్భములో ఈ విధముగా చెప్పినాడు (45). కోరికల నన్నింటినీ ఈడేర్చే ఈ శివజ్ఞానము ఉపలభ్యముగా నున్ననూ జనులు ఆత్మ శ్రేయస్సును సాధించుకొనక పోవుట గొప్ప ఆశ్చర్యము (46). జీవునకు బాల్యములో ఇంద్రియవ్యాపారములు స్పష్టముగా వృద్ధి చెంది యుండకపోవుటచే పదే పదే మహాదుఃఖము కలుగుచుండును. బాలుడు కోరిక ఉన్ననూ పైకి చెప్పలేడు. తనకు ఇబ్బంది కలుగుచున్ననూ, ప్రతిక్రియను చేసుకొనలేడు (47). శిశువునకు పళ్లు వచ్చినప్పుడు చాల నొప్పి కలుగును. ఇంతే గాక, వివిధరకములైన చిన్నపిల్లల వ్యాధులచేత మరియు బాలగ్రహములచేత శిశువు పీడింపబడును (48). ఒకప్పుడు శిశువు ఆకలిదప్పికలచే పీడింపబడిన అవయవములను కలిగియుండును. మరియొకప్పుడు ఏడ్చుచూ నిలబడియుండును. బాలుడు అజ్ఞానముచే మలమూత్రములను కూడ నోట్లో పెట్టుకొనును (49). చిన్న వయస్సులో జీవునకు చెవులను కుట్టించుట వలన చాల నొప్పి కలుగును. తల్లిదండ్రులు వానిని శిక్షించుచుందురు. అక్షరములను నేర్చుకొనుట మొదలగు అనేకదుఃఖములు బాలునకు కలుగుచుండును (50). ఈ విధముగా బాల్యదుఃఖము గడిచిననూ, జీవుడు అతిశయించిన మోహము గలవాడగుటచే, చూపు ఉండియు చూడజాలక, తనకు హితమగు పనినీ చేయడు. మానవజీవితములోని పెద్ద ఆశ్చర్యము ఇదియే (51). యౌవనములో ఇంద్రియవ్యాపారములు ఆరంభమగును. కామము అనే రోగము వ్యక్తిని పీడించుచుండును. ఆ కామము ఏ కాలమునందైననూ తీరే ప్రసక్తి లేదు. అట్టి యౌవనములో సుఖము ఎక్కడిదీ ? (52) యువకుడు ఈర్ష్యచే మహాదుఃఖమును పొందును. మోహముచే ఆతని కన్నులు ఎర్రబడి కోపించినవాని కన్నులను బోలియుండును. శక్తి లేక కోరికలను వదిలి పెట్టినచో, అదీ కేవలము దుఃఖమునకు మాత్రమే కారణమగును (53). మానవుడు రాత్రియందు కామము అనే అగ్ని తపింపజేయబడినవాడై నిద్ర పోలేడు. ఆతడు పగలు కూడ డబ్బు సంపాదన అనే చింతలోనుండును. ఆతనికి సౌఖ్యము ఎక్కడిది ? (54) స్త్రీలయందు లగ్నమైన మనస్సు గల పురుషునకు స్థలితమైన శుక్రబిందువులు చెమట వలె మాలిన్య హేతువులే గాని, సుఖహేతువులుగా పరిగణింపబడవు (55).

కృమిభిస్తుద్యమానస్య కుష్ఠినో వానరస్య చ ।
కండూయ నాభితేపేన యద్భవేత్ స్త్రీషు తద్విదః ॥
యాదృశం మన్యతే సౌఖ్యం గండే పూతివినిర్గమాత్ ।
తాదృశం స్త్రీషు మంతవ్యం నాధికం తాసు విద్యతే ॥
విణ్మూత్రస్య సముత్సర్గాత్సుఖం భవతి యాదృశమ్ ।
తాదృశం షు విజ్ఞేయం మూఢైః కల్పితమన్యథా ॥
నారీష్వవస్తు భూతాసు సర్వదోషాశ్రయాసు చ ।
నాణుమాత్రం సుఖం తాసు కథితం పంచచూడయా ॥
సమ్మాన నావమానాభ్యాం వియోగేనేష్ట సంగమాత్।
యౌవనం జరయా గ్రస్తం క్వ సౌఖ్యమనుప ద్రవమ్ ॥
వలీపలితఖాలిత్యైశ్శిథిలీ కృతవిగ్రహమ్ ।
సర్వక్రియాస్వశక్తిం చ జరయా జర్జరీకృతమ్ ॥
స్త్రీపుంసయౌవనం హృద్యమన్యోన్యస్య ప్రియం పురా ।
తదేవ జరయా గ్రస్తమనయోరపి న ప్రియమ్ ॥
అపూర్వవత్స్వమాత్మానం జరయా పరివర్తితమ్ ।
యః పశ్యన్నపి రజ్యేత కోఽన్యస్తస్మాద చేతనః ॥
జరాభిభూతః పురుషః పుత్రీపుత్రాది బాంధవైః ।
అసక్తత్వాద్దురాధర్షైర్భృత్యైశ్చ పరిభూయతే ॥
ధర్మమర్థం చ కామం వా మోక్షం వాతిజరాతురః ।
అశక్తస్సాధితుం తస్మాద్యువా ధర్మం సమాచరేత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం దేహాశుచిత్వదుఃఖహేతుత్వాది
వర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః॥

కుష్టు రోగముతో బాధపడుచున్న కోతి క్రిములచే పీడింపబడుచున్న తన దేహమును గోకుకొని కొంత సుఖమును పొంది తరువాత తాపమును పొందును. మానవుడు పొందే కామసుఖము కూడ అట్టిది మాత్రమేనని అభిజ్ఞులు చెప్పెదరు (56). కురుపు నుండి చీము బయట పడినప్పుడు ఎట్టి సౌఖ్యము కలుగునో, కామభోగములయందలి సుఖము అట్టిది మాత్రమే. అంతకు మించిన సుఖము కామభోగములయందు లేదు (57). మలమూత్రములను విసర్జించుట వలన ఎట్టి సుఖము కలుగునో, కామభోగములయందలి సుఖము కూడ అట్టిదియేనని తెలియవలెను. కాని, మూర్ఖులు వాటియందు అధికసౌఖ్యము గలదని భ్రమించెదరు (58). కామభోగములు సర్వదోషములకు ఆశ్రయమనియు, అవి యథార్థములు కావనియు, వాటియందు సుఖము లేశమాత్రమైననూ లేదనియు పంచచూడ చెప్పియున్నది (59). సమ్మానమును వెన్నంటి అవమానము గలదు. ప్రియసమాగమము వెంటనే వియోగము కలుగుచున్నది. యౌవనమును వృద్ధాప్యము మ్రింగివేయుచున్నది. దుఃఖముయొక్క బెడద లేని సుఖము ఎక్కడనున్నది ? (60) వృద్ధాప్యములో తల పండి, చర్మము ముడతలు పడియుండును. తల బట్టతల యగును, శరీరము పెద్ద వయస్సుచే శిథిలమై యుండుటచే ఏ పనిని చేయుటకైననూ శక్తి ఉండదు (61). ముసలితనములోనున్న స్త్రీ పురుషులే పూర్వమునందు యౌవనములోనున్నప్పుడు మనోహరమగు దేహములు గలవారై అన్యోన్యానురాగమును కలిగియుండెడివారు. ఆ దేహములు ఇప్పుడు వృద్ధాప్యముచే కబళించి వేయబడి యున్నప్పుడు ఆ ప్రీతి దూరమగును (62). వృద్ధాప్యముయొక్క ప్రభావముచే గుర్తు పట్టలేనంతటి మార్పులకు గురియై యున్న స్వీయదేహమును చూచుచున్ననూ, ఇంకనూ దానియందు రాగమును కలిగియుండే వ్యక్తి కంటే మూర్ఖుడు మరియొకడు ఎవడు గలడు? (63) వృద్ధాప్యముచే పరాజితుడై యున్న వ్యక్తియందు పుత్రుడు, పుత్రిక మొదలగు బంధువులకు అనురాగము ఉండదు. కావున, ఆతడు వారిని అదుపులో పెట్టజాలడు. అట్టి వానిని సేవకులు కూడ అవమానించేదరు (64). ముసలితనముచే పీడింపబడుచున్న వ్యక్తి ధర్మమును గానీ, అర్థమును గానీ, కామమును గానీ, మోక్షమును గాని సాధించలేడు. కావున, మానవుడు యువకుడై ఉండగనే ధర్మమును ఆచరించవలెను.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు దేహముయొక్క అశుచిత్వమును జరాదిదోషములను వర్ణించే ఇరువది మూడవ అధ్యాయము ముగిసినది.

24 – కామోపభోగములోని దోషములు

వ్యాస ఉవాచ ।

కుత్సితం యోషిదర్థం యత్సంప్రోక్తం పంచచూడయా ।
తన్మే బ్రూహి సమాసేన యది తుష్టోఽసి మే మునే ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ మునీ! కామోపభోగము నీచమైనది అని పంచచూడ చెప్పిన విషయమును, నీకు నాయందు అనురాగము ఉన్నచో, సంగ్రహముగా చెప్పుడు (1).

సనత్కుమార ఉవాచ ।

స్త్రీణాం స్వభావం వక్ష్యామి శృణు విప్ర యథాతథమ్ ।
యస్య శ్రవణమాత్రేణ భవేద్వైరాగ్య ముత్తమమ్ ॥
స్త్రియో మూలం హి దోషాణాం లఘుచిత్తాస్సదా మునే ।
తదాసక్తిర్న కర్తవ్యా మోక్షేప్సుభిర తంద్రితైః ॥
అత్రాప్యుదాహరంతీమమితిహాసం పురాతనమ్ ।
నారదస్య చ సంవాదం పుంశ్చల్యా పంచచూడయా ॥
లోకాన్ పరిచరన్ ధీమాన్ దేవర్షిర్నారదః పురా ।
దదర్శాప్సరసం బాలాం పంచచూడామనుత్తమామ్ ॥
పప్రచ్ఛాప్సరసం సుభ్రూం నారదో మునిసత్తమః ।
సంశయో హృది మే కశ్చిత్తన్మే బ్రూహి సుమధ్యమే ॥
ఏవముక్తా తు సా విప్రం ప్రత్యువాచ వరాప్సరా ।
విషయే సతి వక్ష్యామి సమర్థా మన్యసేఽథ మామ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఓ విప్రా ! దుష్ట స్త్రీ స్వభావమును గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పెదను. వినుము. దానిని వినినంత మాత్రాన ఉత్తమమగు వైరాగ్యము కలుగును (2). ఓ మునీ! చపలచిత్తము గల స్త్రీలు సర్వకాలములలో దోషములకు మూలము అగుచుందురు. ముముక్షువులు జాగరూకులై వారియందు ఆసక్తి లేని వారై ఉండవలెను (3). ఈ సందర్భములో పూర్వము జరిగిన ఇతిహాసమును, దానిలో దుష్టురాలగు పంచచూడతో నారదునకు జరిగిన సంభాషణమును పెద్దలు ఉదహరించుచుందురు (4). బుద్ధిశాలి, దేవర్షి అగు నారదుడు పూర్వము లోకములను తిరుగుచూ సాటిలేని యువతి అగు పంచచూడ అనే అప్సరసను చూచెను (5). నారదమహర్షి సుందరియగు ఆ అప్సరసతో 'ఓ సుందరీ ! నా మనస్సులో ఒక సందేహము గలదు; దానిని నీవు తీర్చుము' అని పలికెను. (6). ఆ సుందరియగు అప్సరస ఆ బ్రాహ్మణునకు ఇట్లు బదులిడెను : నేను చెప్పగలనని నీవు తలంచినచో, అది నాకు తెలిసిన విషయమైనచో, చెప్పగలను (7).

నారద ఉవాచ ।

న త్వామవిషయే భద్రే నియోక్ష్యామి కథంచన ।
స్త్రీణాం స్వభావమిచ్ఛామి త్వత్తః శ్రోతుం సుమధ్యమే ॥

నారదుడు ఇట్లు పలికెను –

ఓ సుందరీ ! నేను నీకు తెలియని విషయమును చెప్పుమని నిన్ను ఇబ్బంది పెట్టే ప్రసక్తి లేదు. నేను నీనుండి స్త్రీ స్వభావమును గురించి వినగోరుచున్నాను (8).

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య దేవర్షేరప్సరోత్తమా ।
ప్రత్యువాచ మునీశం తం దేవర్షిం మునిసత్తమమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

అప్సరసలలో శ్రేష్టురాలగు ఆమె ఆ దేవర్షియొక్క ఈ మాటను విని, మహర్షులలో శ్రేష్ఠుడగు ఆ దేవర్షికి ఇట్లు బదులిడెను (9).

పంచచూడోవాచ ।

మునే శృణు న శక్యా స్త్రీ సతీ వై నిందితుం స్త్రియా ।
విదితాస్తే స్త్రియో యాశ్చ యాదృశ్యశ్చ స్వభావతః ॥
న మామర్హసి దేవర్షే నియోక్తుం ప్రశ్నమీదృశమ్ ।
ఇత్యుక్త్వా సాఽ భవత్తూష్ణీం పంచచూడాప్సరోవరా ॥
అథ దేవర్షవర్యో హి శ్రుత్వా తద్వాక్య ముత్తమమ్ ।
ప్రత్యువాచ పునస్తాం వై లోకానాం హితకామ్యయా ॥

పంచచూడ ఇట్లు పలికెను –

ఓ మునీ! వినుము. నేను స్త్రీని అయి ఉండి స్త్రీని నిందించుట తగదు. స్త్రీలు ఎటువంటి వారు అను విషయము, వారి స్వభావము నీకు తెలిసినవే (10). ఓ దేవర్షి! నీవు నన్ను ఇట్టి ప్రశ్నను వేయుట తగదు. అప్సరసలలో శ్రేష్ఠురాలగు ఆ పంచచూడ ఇట్లు పలికి మిన్నకుండెను (11). దేవర్షులలో గొప్పవాడగు నారదుడు ఆమెయొక్క ఉత్తమమగు ఆ మాటను విని లోకములకు హితమును చేయగోరి మరల ఆమెతో నిట్లు పలికెను (12).

నారద ఉవాచ ।

మృషావాదే భవేద్దోషస్సత్యే దోషో న విద్యతే ।
ఇతి జానీహి సత్యం త్వం వదాతస్తత్సుమధ్యమే ॥

నారదుడు ఇట్లు పలికెను -

అసత్యమును పలికినచో దోషము సంక్రమించును. సత్యమును పలికినచో, దోషము లేదు. ఓ సుందరీ ! నీవీ సత్యమునెరుంగుము. కావున, ఆ విషయమును చెప్పుము (13).

సనత్కుమార ఉవాచ।

ఇత్యుక్తా సా కృతమతీ రభసా చారుహాసినీ ।
స్త్రీ దోషాన్ శాశ్వతాన్ సత్యాన్ భాషితుం సంప్రచక్రమే ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

సుందరమగు చిరునవ్వు గల ఆమె నారదుని ఈ మాటను విని, తన మనస్సులో నిశ్చ్చయించుకొని, యథార్థములు మరియు నిత్యములు అగు స్త్రీ దోషములను చెప్పుటకు ఆరంభించెను (14).

పంచచూడోవాచ।

కులీనా నాథవత్యశ్చ రూపవత్యశ్చ యోషితః ।
మర్యాదాసు న తిష్ఠంతి స దోషః స్త్రీషు నారద ॥
న స్త్రీభ్యః కించిదన్యద్వై పాపీయస్తరమస్తి హి ।
స్త్రియో మూలం హి పాపానాం తథా త్వమపి వేత్థ హ ॥
సమాజ్ఞాతానర్థవతః ప్రతిరూపాన్ యథేప్సితాన్ ।
పతీనంతరమాసాద్య నాలం నార్యః ప్రతీక్షితుమ్ ॥
అసద్ధర్మ స్త్వయం స్త్రీణామస్మాకం భవతి ప్రభో ।
పాపీయసో నరాన్ యద్వై లజ్జాం త్యక్త్వా భజామహే ॥
స్త్రియం చ యః ప్రార్థయతే సన్నికర్షం చ గచ్ఛతి ।
ఈషచ్చ కురుతే సేవాం తమేవేచ్ఛంతి యోషితః ॥
అనర్థిత్వాన్మనుష్యాణాం భయాత్పతిజనస్య చ ।
మర్యాదాయామమర్యాదాః స్త్రియస్తిష్ఠంతి భర్తృషు ॥
నాసాం కశ్చిదమాన్యోఽస్తి నాసాం వయసి నిశ్చయః ।
సురూపం వా కురూపం వా పుమాంసముప భుంజతే ॥
న భయాదథ వాక్రోశాన్నార్థహేతోః కథంచన ।
న జ్ఞాతికుల సంబంధాత్ స్త్రి యస్తిష్ఠంతి భర్తృషు ॥
యౌవనే వర్తమానానామిష్టాభరణ వాససామ్ ।
నారీణాం స్వైరవృత్తీనాం స్పృహయంతి కులస్త్రియః ॥

యా హి శశ్వద్బహుమతి రక్ష్యంతే దయితాః స్త్రియః।

అపి తాస్సంప్రసజ్జంతే కుబ్జాంధజడవామనే ॥

పంగుష్వపి చ దేవర్షే యే చాన్యే కుత్సితా నరాః ।

స్త్రీణామగమ్యో లోకేషు నాస్తి కశ్చిన్మహామునే ॥

పంచచూడ ఇట్లు పలికెను -

ఓ నారదా! సుందరులగు స్త్రీలు సత్కులమందు జన్మించిననూ, భర్త ఉన్నవారే అయిననూ, మర్యాదను అతిక్రమించినచో, ఆ దోషము వారిదే యగును (15). దుష్టులగు స్త్రీలకంటే ఎక్కువ పాపహేతువు మరియొకటి లేదు. ఇట్టి స్త్రీలు పాపములకు మూలమని నీకు కూడ తెలిసిన విషయమే (16), వారి భర్తలు చదువుకున్నవారు, ధనవంతులు, సుందరులు, మరియు తాము కోరుకున్నవారు అయి ఉన్ననూ, ఈ దుష్టస్త్రీలు అవకాశము లభించినచో తప్పు చేయుటకు వెనుకాడరు (17). ఓ ప్రభూ ! మా స్త్రీలకు ఈ తప్పు లక్షణము గలదు. మేము సిగ్గును విడిచి పాపాత్ములగు నరులను సేవించెదము (18). ఎవరైతే వీరిని ప్రార్థించెదరో, దగ్గరకు వచ్చెదరో, కొద్దిగా సేవను చేసెదరో, ఈ స్త్రీలు వారినే కోరెదరు (19), మర్యాదను ఎరుంగని స్త్రీలు కూడ పరపురుషులు కోరి ముందుకు రానప్పుడు, లేదా భర్తయొక్క భయము వలన మర్యాదను అతిక్రమించకుందురు (20). వీరి దృష్టిలో అయోగ్యుడు లేడు. వీరికి వయస్సుతో పని లేదు. వీరు అందగాడైనా, కాకపోయినా, పురుషునితో భోగించెదరు (21). ఈ స్త్రీలు భర్తలను అనుసరించి యుండుటకు భయము కాని, పెద్దలు కోపపడుట కాని, ధనము కాని, జ్ఞాతులు గాని, వంశసంబంధము గాని కారణము కానే కాదు (22). యౌవనములో నుండి అభీష్టములగు ఆభరణములను మరియు వస్త్రములను ధరించి యథేచ్ఛగా సంచరించే స్త్రీలను చూచి కులస్త్రీలు ఆ జీవితమును కోరెదరు (23). దుష్టలగు స్త్రీలను గౌరవించిననూ, ప్రేమతో రక్షించిననూ, వారు గూనివారు, గుడ్డివారు, మందబుద్ధులు మరియు మరుగుజ్జు వారు, కుంటివారు మరియు ఇతరములగు అవలక్షణములు గల పురుషుల వెంట కూడ బడెదరు. ఓ దేవర్షీ! ఈ స్త్రీలు కామించరానీ పురుషుడు ముల్లోకములలో ఒక్కడైననూ లేడు (24,25).

యది పుంసాం గతిర్బ్రహ్మన్ కథంచిన్నోపపద్యతే ।

అప్యన్యోన్యం ప్రవర్తంతే న చ తిష్ఠంతి భర్తృషు ॥

అలాభాత్పురుషాణాం చ భయాత్పరిజనస్య చ ।

వధబంధ భయాచ్చైవ తా భగ్నాశా హి యోషితః ॥

చలస్వభావదుశ్చేష్టా దుర్గ్రాహ్యా భవతస్తథా ।

ప్రాజ్ఞస్య పురుషస్యేహ యథా రతిపరిగ్రహాత్ ॥

నాగ్నిస్తుష్యతి కాష్ఠానాం నాపగానాం మహోదధిః ।

నాంతకస్సర్వ భూతానాం న పుంసాం వామలోచనాః ॥

ఇదమన్యచ్చ దేవర్షే రహస్యం సర్వయోషితామ్ ।

దృష్ట్వైవ పురుషం సద్యో యోనిః ప్రక్లిద్యతే స్త్రియః ।

సుస్నాతం పురుషం దృష్ట్వా సుగంధం మలవర్జితమ్ ।
యోనిః ప్రక్లిద్యతే స్త్రీణాం దృతేః పాత్రాదివోదకమ్ ॥
కాయానామపి దాతారం కర్తారం మానసాంత్వయోః।
రక్షితారం న మృష్యంతి భర్తారం పరమం స్త్రియః ॥
న కామభోగాత్పరమాన్నాలంకారార్థ సంచయాత్ ।
తథా హితం న మన్యంతే యథా రతిపరిగ్రహాత్ ॥
అంతకశ్శమనో మృత్యుః పాతాలం వడవాముఖమ్ ।
క్షురధారా విషం సర్పో వహ్నిరిత్యేకతః స్త్రియః ॥
యతశ్చ భూతాని మహాంతి పంచ యతశ్చ లోకో విహితో విధాత్రా ।
యతః పుమాంసః ప్రమదాశ్చ నిర్మితాస్సదైవ దోషః ప్రమదాసు నారద ॥

ఓ బ్రహ్మజ్ఞానీ ! ఈ దుష్టస్త్రీలకు పురుషసంయోగము లభించని సందర్భములలో వారు అన్యోన్యము రమించుటకైననూ వెనుకాడరు. వీరియందు భర్తను అనుసరించి ఉండే లక్షణము లేదు (26). ఆ స్త్రీలు పురుషసంయోగము లేనప్పుడు, కేవలము సేవకులకు భయపడి, లేదా కారాగారశిక్షకు మరణశిక్షకు భయపడి తమకు పరపురుషుల యందు గల ఆశను వదులు కొనెదరు (27). వీరు యథేచ్ఛగా సంభోగమునందు ప్రవర్తించుటచే చంచలస్వభావము మరియు దుశ్చేష్టలు గలవారై యుందురు. వారి స్వరూపము నీవంటి బుద్ధిశాలురగు పురుషులకు కూడ అంతు పట్టనిదై యుండును (28). ఎన్ని కట్టెలను సమర్పించిననూ అగ్నికి సంతోషము ఉండదు. ఎన్ని నదులు వచ్చి కలిసిననూ, సముద్రమునకు తృప్తి ఉండదు. సర్వప్రాణులను సంహరించిననూ, మృత్యువునకు చాలు అనిపించదు. ఈ స్త్రీలు ఎందరు పురుషులతో రమించిననూ తృప్తిని బడయరు. (29). ఓ దేవర్షి! ఈ దుష్టస్త్రీలు అందరియందు గల రహస్యము ఒకటి గలదు. వీరికి పురుషుని చూడగనే కామవికారము కలుగును (30). మానవుల దేహములు నీటితో నిండిన తోలుతిత్తుల వంటివి. చక్కగా స్నానమును చేయుటచే నిర్మలముగా నున్న, మరియు సుగంధపరిమళమును కలిగియున్న పురుషుని చూచి ఈ స్త్రీలకు కామవికారము కలుగును (3 1). ప్రాణములనైననూ లెక్క చేయక మానమును రక్షించి కష్టములో ఓదార్చి సర్వమును ఇచ్చే భర్తపై కూడ ఈ దుష్టస్త్రీలు ప్రేమను కలిగియుండరు (32). వీరి దృష్టిలో శ్రేష్ఠమగు అలంకారములకు, సంపదకు కామమును భోగించుట కంటే ఎక్కువ విలువ లేదు (33). మృత్యుదేవత, పాతాళము, బడబాగ్ని, కత్తియొక్క ధార, విషము, పాము మరియు అగ్ని ఒకవైపున, ఇటువంటి దుష్టస్త్రీ మరియొక వైపున ఉన్నచో, ఆమె వలననే హాని అధికము (34). ఓ దేవర్షి! పంచమహాభూతములు, లోకములు, పురుషులు మరియు స్త్రీలు ఏ కాలములో బ్రహ్మగారిచే నిర్మింపబడినారో, అప్పటినుండియు సర్వకాలములలో ఇట్టి దోషము గల స్త్రీలు ఉండిరి (35).

సనత్కుమార ఉవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్యా నారదస్తుష్టమానసః ।
తథ్యం మత్వా తతస్తద్వై విరక్తో భూద్ధి తాసు చ ॥
ఇత్యుక్తః స్త్రీస్వభావస్తే పంచచూడోక్త ఆదరాత్।
వైరాగ్యకారణం వ్యాస కిమన్య చ్ఛ్రోతుమర్హసి ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం దుష్టస్త్రీ స్వభావవర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

ఆమె యొక్క ఈ మాటలను విని నారదుడు మనస్సులో సంతోషించేను. ఆ వచనము ులను సత్యమని ఆయన తలచి అట్టి స్త్రీలయందు విరక్తి గలవాడు ఆయెను (36). ఓ వ్యాసా! వైరాగ్యమును కలిగించుట కొరకై పంచచూడచే చెప్పబడిన దుష్టస్త్రీ స్వభావమును ఈ విధముగా శ్రద్ధగా. నీకు చెప్పితిని. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు ? (37)

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు దుష్టస్త్రీ స్వభావవర్ణనమనే ఇరువది నాల్గవ అధ్యాయము ముగిసినది (24).

25 - కాలజ్ఞాన వర్ణనము

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ త్వత్సకాశాన్మయా మునే ।
స్త్రీస్వభావః శ్రుతః ప్రీత్యా కాలజ్ఞానం వదస్వ మే ॥

వ్యాసుడు ఇట్లు పలికెను -

ఓ సనత్కుమారా ! నీవు సర్వజ్ఞుడవు. ఓ మునీ ! నేను నీవద్దనుండి దుష్టస్త్రీ◌ీల స్వభావమును గురించి ప్రీతిపూర్వకముగా వినియుంటిని. నాకు కాలజ్ఞానమును గురించి చెప్పుము (1).

సనత్కుమార ఉవాచ ।

ఇదమేవ పురాऽపృచ్ఛత్పార్వతీ పరమేశ్వరమ్ ।
శ్రుత్వా నానాకథాం దివ్యాం ప్రసన్నా సుప్రణమ్య తమ్ ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను -

పూర్వము పార్వతి దివ్యములగు అనేకగాథలను వినిన పిదప పరమేశ్వరునకు చక్కగా నమస్కరించి ఇదే విధముగా ప్రశ్నించెను (2).

పార్వత్యువాచ ।

భగవంస్త్వత్ప్రసాదేన జ్ఞాతం మే సకలం మతమ్ ।
యథార్చనం తు తే దేవ యైర్మంత్రైశ్చ యథావిధి ॥
అద్యాపి సంశయస్త్వేకః కాలచక్రం ప్రతి ప్రభో ।
మృత్యుచిహ్నం యథా దేవ కిం ప్రమాణం యథాయుషః ॥
తథా కథయ మే నాథ యద్యహం తవ వల్లభా ।
ఇతి పృష్టస్తయా దేవ్యా ప్రత్యువాచ మహేశ్వరః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ పరమేశ్వరా ! నీ అనుగ్రహముచే నేను సర్వమును తెలుసుకొని మననము చేసితిని. ఓ దేవా ! నిన్ను యథావిధిగా ఏయే మంత్రములతో ఎట్లు అర్చించవలెనో తెలుసుకుంటిని (3). ఓ ప్రభూ ! అయిననూ నాకు ఇంకనూ కాలచక్రమును గురించి ఒక సందేహము గలదు. ఓ దేవా! రాబోయే మరణమును సూచించే చిహ్నములు ఏవి? జీవితముయొక్క పరిమాణము ఎంత ?(4) ఓ నాథా! నేను నీకు ప్రియురాలనైనచో, ఈ విషయములను నాకు చెప్పుము. ఆ దేవి ఇట్లు ప్రశ్నించగా, మహేశ్వరుడు ఇట్లు బదులిడెను (5).

ఈశ్వర ఉవాచ ।

సత్యం తే కథయిష్యామి శాస్త్రం సర్వోత్తమం ప్రియే ।
యేన శాస్త్రేణ దేవేశి నరైః కాలః ప్రబుధ్యతే ॥
అహః పక్షం తథా మాసమృతుం చాయనవత్సరౌ।
స్థూలసూక్ష్మగతైశ్చిహ్నైర్బహిరంతర్గతై స్తథా ॥
తత్తేహం సంప్రవక్ష్యామి శృణు తత్త్వేన సుందరి ।
లోకానాముపకారార్థం వైరాగ్యార్థముమేఽధునా ॥
అకస్మాత్పాండురం దేహమూర్ధ్వరాగం సమంతతః ।
తదా మృత్యుం విజానీయాత్ షణ్మాసాభ్యంతరే ప్రియే ॥
ముఖం కర్ణౌ తథా చక్షుర్జిహ్వాస్తంభో యదా భవేత్ ।
తదా మృత్యుం విజానీయాత్ షణ్మాసాభ్యంతరే ప్రియే ॥
రౌరవానుగతం భద్ర ధ్వనిం నాకర్ణయేద్ద్రుతమ్ ।
షణ్మాసాభ్యంతరే మృత్యుర్ జ్ఞాతవ్యః కాలవేదిభిః ॥
రవిసోమాగ్నిసంయోగాద్యదోద్యోతం న పశ్యతి ।
కృష్ణం సర్వం సమస్తం చ షణ్మాసం జీవితం తథా ॥
వామహస్తో యదా దేవి సప్తాహం స్పందతే ప్రియే ।
జీవితం తు తదా తస్య మాసమేకం న సంశయః ॥
ఉన్మీలయంతి గాత్రాణి తాలుకం శుష్యతే యదా ।
జీవితం తు తదా తస్య మాసమేకం న సంశయః ॥
నాసా తు స్రవతే యస్య త్రిదోషే పక్షజీవితమ్ ।
వక్త్రం కంఠం చ శుష్యేత షణ్మాసాంతే గతాయుషః ॥

ఈశ్వరుడు ఇట్లు పలికెను –

ఓ ప్రియురాలా ! నీకు సర్వశ్రేష్ఠమగు శాస్త్రమును యథార్థముగా చెప్పగలను. ఓ దేవ దేవీ ! ఈ శాస్త్రమును ఆధారముగా చేసుకొని మాత్రమే మానవులు కాలమును తెలియగలుగుచున్నారు (6). దినము, పక్షము, మాసము, ఋతువు, అయనము, సంవత్సరము అను కాలవిభాగమును శాస్త్రము బోధించుచున్నది. బయట మరియు లోపల ఉండే స్థూలము మరియు సూక్ష్మము అగు చిహ్నములచే భవిష్యత్తును ఊహించవచ్చును (7). ఓ సుందరీ ! నేను నీకు ఆ వివరములను యథాతథముగా చెప్పెదను. ఓ ఉమా ! నేను ఇప్పుడు ఆ విషయమును వైరాగ్యమును కలిగించి మానవులకు ఉపకారమును చేయుటకొరకై చెప్పుచున్నాను (8). ఓ ప్రియురాలా ! హఠాత్తుగా దేహము పాలిపోయి తెల్లగా అయి, పై భాగమునందు అంతటా ఎర్ర బడినచో, ఆరు మాసములలో మృత్యువు కలుగునని తెలియవలెను (9). ఓ ప్రియురాలా ! ముఖము, చెవులు, కన్నులు లేదా నాలుక స్తంభించినచో, ఆరు మాసముల లోపులో మృత్యువు కలుగునని తెలియుము (10). ఓ మంగళస్వరూపురాలా ! పెద్ద కేకయొక్క ధ్వని వెంటనే విన

రాకున్నచో, ఆరు మాసముల లోపులో మృత్యువు కలుగునని కాలవేత్తలు చెప్పుచున్నారు (11). సూర్యచంద్రులను, అగ్నిని చూచినప్పుడు ప్రకాశించే జ్యోతీ కానరాకుండగా, అంతా నల్లగా కానవచ్చినచో, వాని జీవితకాలము ఆరు మాసములు మాత్రమే (12). ఓ దేవీ ! ఎవని ఎడమ చేయి ఏడు రోజులు అదురునో, వానికి నెల రోజులు మాత్రమే జీవితము గలదు. సందేహము లేదు (13). అవయవములు పెద్దవి అగుచున్నచో, లేదా కొండ నాలుక ఎండిపోయినచో, అట్టి వాడు కేవలము నెల రోజులు మాత్రమే జీవించును. ఈ విషయములో సందేహము లేదు (14). కఫవాతపిత్తములలో దోషము ఏర్పడి ముక్కు నీరు గారుచున్నచో, అట్టి వ్యక్తి పదిహేను రోజులు మాత్రమే జీవించును. ముఖము మరియు కంఠము ఎండి పోయినచో, అట్టి వాడు ఆరు మాసముల తరువాత మరణించును (15).

స్థూలజిహ్వో భవేద్యస్య ద్విజాః క్లిద్యంతి భామిని ।
షణ్మాసాజ్జాయతే మృత్యుశ్చి హ్నైస్తైరుప లక్షయేత్ ॥
అంబుతైలఘృతస్థం తు దర్పణే వరవర్ణిని ।
న పశ్యతి యదాత్మానం వికృతం పలమేవ చ ॥
షణ్మాసాయుస్స విజ్ఞేయః కాలచక్రం విజానతా ।
అన్యచ్చ శృణు దేవేశి యేన మృత్యుర్విబుధ్యతే ॥
శిరోహీనాం యదా ఛాయాం స్వకీయాముప లక్షయేత్ ।
అథవా ఛాయయా హీనం మాసమేకం న జీవతి ॥
ఆంగికాని మయోక్తాని మృత్యుచిహ్నాని పార్వతి ।
బాహ్యస్థాని బ్రువే భద్రే చిహ్నాని శృణు సాంప్రతమ్ ॥
రశ్మిహీనం యదా దేవి భవేత్సోమార్క మండలమ్ ।
దృశ్యతే పాటలాకారం మాసార్ధేన విపద్యతే ॥
అరుంధతీం మహాయానమిందుం లక్షణవర్జితమ్ ।
అదృష్టతారకో యోఽసౌ మాసమేకం న జీవతి ॥
దృష్టే గ్రహే చ దిఙ్మోహః షణ్మాసాజ్జాయతే ధ్రువమ్ ।
ఉతథ్యం న ధ్రువం పశ్యేద్యది వా రవిమండలమ్ ॥
రాత్రౌ ధనుర్యదా పశ్యేన్మధ్యాహ్నే చోల్కపాతనమ్ ।
వేష్ట్యతే గృధ్రకాకైశ్చ షణ్మాసాయుర్న సంశయః ॥
ఋషయస్స్వర్గపంథాశ్చ దృశ్యంతే నైవ చాంబరే ।
షణ్మాసాయుర్విజానీయాత్పురుషైః కాలవేదిభిః ॥

ఓ సుందరీ ! ఎవని నాలుక మొద్దు బారునో, పళ్లు నీరు గారుచుండునో, అట్టి వానికి ఆరు మాసములలో మరణము కలుగునని ఆ చిహ్నములను బట్టి గుర్తించవలెను (16). ఓ సుందరీ ! ఎవడైతే నీరు, నూనె, నేయి మరియు అద్దము అను వాటిలో తన ప్రతిబింబమును చూడడో, లేదా పాలిపోయినట్లు వికృతమగు ప్రతిబింబమును చూచునో, వానికి ఆరు మాసముల ఆయుర్దాయము గలదని కాలచక్రజ్ఞానము గల పండితుడు తెలుసుకొనును. ఓ దేవదేవీ ! మృత్యువును గుర్తు

పట్టే మరియొక లక్షణమును కూడ వినుము (17, 18). ఎవనికి తన నీడ తల లేనిదిగా కానవచ్చునో, లేదా నీడయే కొనరాదో, అట్టి వాడు ఒక మాసమైననూ జీవించడు (19). ఓ పార్వతీ ! దేహావయవములయందు కానవచ్చే మృత్యుచిహ్నములను ఇంతవరకు చెప్పితిని. ఓ మంగళస్వరూపురాలా! ఇప్పుడు బాహ్యమునందు కానవచ్చే గుర్తులను చెప్పుచున్నాను. వినుము (20). ఓ దేవీ ! ఎవనికైతే సూర్యచంద్రమండలములు ప్రకాశహీనములుగా ఎర్రని ఆకారములో కానవచ్చునో, అట్టివాడు పదిహేను రోజులలో మరణించును (21). ఎవడైతే అరుంధతీ నక్షత్రమును మహాయానమును కనజాలడో, లేదా చంద్రుని యందలి మచ్చను కనజాలడో, లేదా నక్షత్రములను చూడలేడో, అట్టివాడు నెల రోజులు మాత్రమే జీవించును (22). గ్రహమును చూచిననూ ఎవనికి దిక్కులు తోచవో, ఎవడైతే ఉతథ్య ధ్రువనక్షత్రములను మరియు సూర్యమండలమును చూడజాలడో, అట్టివాడు నిశ్చయముగా ఆరు మాసములలో మరణించును (23). ఎవడైతే రాత్రియందు ఇంద్రధనస్సును చూచునో, మధ్యాహ్నము ఉల్క పడుటను గాంచునో, ఎవడైతే గద్దలు మరియు కాకుల చేత చుట్టువారబడునో, అట్టివానికి ఆరు మాసములు మాత్రమే ఆయుర్దాయము గలదనుటలో సందేహము లేదు (24). ఎవడైతే ఆకాశములో సప్తర్షిమండలమును మరియు పాలపుంతను గనజాలడో, అట్టివానికి ఆరు మాసముల ఆయుర్దాయము గలదని కొలవేత్తలగు పెద్దలు చెప్పెదరు (25).

అకస్మాద్రాహుణా గ్రస్తం సూర్యం వా సోమమేవ చ ।
దిక్చక్రం భ్రాంతవత్పశ్యేత్ షణ్మాసాన్మ్రియతే స్ఫుటమ్ ॥
నీలాభిర్మక్షికాభిశ్చ హ్యకస్మాద్వేష్ట్యతే పుమాన్ ।
మాసమేకం హి తస్యాయుర్ జ్ఞాతవ్యం పరమార్థతః ॥
గృధ్రః కాకః కపోతశ్చ శిరశ్చాక్రమ్య తిష్ఠతి ।
శీఘ్రం తు మ్రియతే జంతుర్మాసైకేన న సంశయః ॥
ఏవం చారిష్టభేదస్తు బాహ్యస్థస్సముదాహృతః ।
మానుషాణాం హితార్థాయ సంక్షేపేణ వదామ్యహమ్ ॥
హస్తయోరు భయోర్దేవి యథా కాలం విజానతే ।
వామదక్షిణ యోర్మధ్యే ప్రత్యక్షం చేత్యుదాహృతమ్ ॥
ఏవం పక్షౌ స్థితౌ ద్వౌ తు సమాసాత్సుర సుందరి ।
శుచిర్భూత్వా స్మరన్ దేవం సుస్నాతస్సంయతేంద్రియః ॥
హస్తౌ ప్రక్షాల్య దుగ్ధేనాలక్తకేన విమర్దయేత్ ।
గంధైః పుష్పైః కరౌ కృత్వా మృగయేచ్చ శుభాశుభమ్ ॥
కనిష్ఠమాదితః కృత్వా యావదాంగుష్ఠకం ప్రియే ।
పర్వత్రయక్రమేణైవ హస్తయోరు భయోరపి ॥
ప్రతిపదాదివిన్యస్య తిథిం ప్రతిపదాదితః ।
సంపుటాకారహస్తౌ తు పూర్వదిఙ్ముఖ సంస్థితః ॥

స్మరేన్నవాత్మకం మంత్రం యావదష్టోత్తరం శతమ్ ।

నిరీక్షయేత్తతో హస్తౌ ప్రతిపర్వణి యత్నతః ॥

ఎవడైతే హఠాత్తుగా సూర్యచంద్రులను రాహువు మింగినట్లు గనునో, దిక్కులన్నియు ుు గిరగిర తిరుగుచున్నట్లు గనునో, అట్టివాడు నిశ్చయముగా ఆరు మాసములలో మరణించును (26), ఎవడైతే హఠాత్తుగా నల్లని తేనెటీగలచే చుట్టివేయబడునో, అట్టివానికి ఖచ్చితముగా నెల రోజులు మాత్రమే ఆయుర్దాయము గలదని తెలియవలెను (27). ఎవనీ శిరస్సుపై గ్రద్ద గాని, కాకి కాని, పావురము గాని తలను ఆక్రమించి వ్రాలి నిలిచియుండునో, అట్టివాడు తొందరలోనే అనగా నెల రోజులలో మరణించుట నిశ్చయము (28). ఈ విధముగా బాహ్య ప్రకృతిలోని అపశకునములను గురించి చెప్పియుంటిని. మానవుల హితమును గోరి నేను సంక్షేపముగా మరియొక విషయమును చెప్పుచున్నాను (29). ఓ దేవీ ! ఎడమ, కుడి అనే రెండు చేతుల మధ్యలో కాలమును ప్రత్యక్షముగా తెలుసుకొనే విధానము వర్ణించబడినది (30). ఓ సుందరి యగు దేవతామూర్తీ! ఈ విషయములో రెండు పక్షములు గలవు. వాటిని సంగ్రహముగా చెప్పెదను. వ్యక్తి చక్కగా స్నానమును చేసి శుచియై ఇంద్రియములను అదుపులో నుంచుకొని పరమేశ్వరుని స్మరించుచూ (31), చేతులను పాలలో కడిగి వాటికి లత్తుక రంగును మర్ధించి, చేతులను గంధములతో మరియు పుష్పములతో ఆరాధించి వాటి ద్వారా శుభాశుభములను తెలుసుకొనే ప్రయత్నమును చేయవలెను (32). ఓ ప్రియురాలా ! చిటికెన వేలితో మొదలిడి బొటన వేలి వరకు రెండు చేతులతో ఒక్కొక్క వేలికి మూడు పర్వల చొప్పున క్రమముగా (33) పాడ్యమితో మొదలిడి తిథులను అన్నింటినీ న్యాసము చేయవలెను. తూర్పు దిక్కునకు అభిముఖముగా కూర్చుండి చేతులను సంపుట (దొన్నె) ఆకారములో ఉంచవలెను (34). తరువాత నవాత్మకమంత్రమును నూట యెనిమిది సార్లు జపించి, తరువాత చేతులను ప్రతి పర్వయందు జాగరూకతతో పరిశీలించవలెను (35).

తస్మిన్ పర్వణి సా రేఖా దృశ్యతే భృంగసన్నిభా ।

తత్తథౌ హి మృతిర్ జ్ఞేయా కృష్ణే శుక్లే తథా ప్రియే ॥

అధునా నాదజం వక్ష్యే సంక్షేపాత్కాల లక్షణమ్ ।

గమాగమం విదిత్వా తు కర్మ కుర్యాచ్ఛృణు ప్రియే ॥

ఆత్మవిజ్ఞానం సుశ్రోణి చారం జ్ఞాత్వా తు యత్నతః ।

క్షణం త్రుటిర్లవం చైవ నిమేషం కాష్ఠకాలికమ్ ॥

ముహూర్తకం త్వహో రాత్రం పక్షమాసర్తువత్సరమ్ ।

అబ్దం యుగం తథా కల్పం మహాకల్పం తథైవ చ ॥

ఏవం స హరతే కాలః పరిపాట్యా సదాశివః ।

వామదక్షిణమధ్యే తు పథి త్రయమిదం స్మృతమ్ ॥

దినాని పంచ చారభ్య పంచవింశద్దినావధి ।

వామాచారగతౌ నాదః ప్రమాణం కథితం తవ ॥

భూతరంధ్రదిశశ్చైవ ధ్వజశ్చ వరవర్ణిని ।
వామచారగతౌ నాదః ప్రమాణం కాలవేదినః ॥
ఋతోర్వికారభూతాశ్చ గుణాస్తత్రైవ భామిని ।
ప్రమాణం దక్షిణం ప్రోక్తం జ్ఞాతవ్యం ప్రాణవేదిభిః ॥
భూతసంఖ్యా యదా ప్రాణాన్ వహంతే చ ఇడాదయః ।
వర్షస్యాభ్యంతరే తస్య జీవితం హి న సంశయః ॥
దశఘస్ర ప్రవాహేణ హ్యబ్దమానం స జీవతి ।
పంచదశ ప్రవాహేణ హ్యబ్దమేకం గతాయుషమ్ ॥

ఓ ప్రియురాలా ! ఏ పర్వయందు తుమ్మెద వంటి రేఖ కానవచ్చునో, దానికి సంబంధించిన పక్షము (శుక్ల / కృష్ణ) లో ఆ తిథినాడు మరణము సంభవించునని తెలియవలెను (36). ఓ ప్రియురాలా! ఇప్పుడు శబ్దమును బట్టి కాలమును గురించి తెలుసుకునే ప్రక్రియను సంక్షేపముగా చెప్పెదను. వినుము. మానవుడు ప్రాణముయొక్క రాకను, పోకను తెలుసుకొని కర్మను చేయవలెను (37): ఓ సుందరీ! మానవుడు గ్రహచారమును ప్రయత్నపూర్వకముగా తెలుసుకొని ఆత్మజ్ఞానమును సంపాదించవలెను (లేదా తన భవిష్యత్తును తెలుసుకొనవలెను). క్షణము, త్రుటి, లవము, నిమేషము, కాష్ఠము (38), ముహూర్తము, పగలు-రాత్రి, పక్షము, మాసము, ఋతువు, సంవత్సరము, యుగము, కల్పము, మహాకల్పము అను విధముగా కాలము విభజింపబడి యున్నది (39). సదాశివుడు ఈ విధముగా కాలస్వరూపుడై ఒక క్రమములో ఆయుర్దాయమును హరించుచుండును. కాలగణనములో ఎడమ, కుడి, మధ్య అనే ఈ మూడు మార్గములను మహర్షులు చెప్పుచున్నారు (40). ఎడమ చేతితో చేసే కాలగణనమునందు అయిదుతో మొదలిడి ఇరువది, అయిదు రోజుల వరకు శబ్దము ప్రమాణమని నేను నీకు చెప్పియుంటిని (41). ఓ సుందరీ ! ఎడమ చేత్తో చేసే కాలగణనమునందు కాలవేత్తల మానము అయిదు, తొమ్మిది, పది అగుచున్నది. మరియు వారు చిహ్నమును, నాదమును కూడ పరిగణించేదరు (42). ఓ సుందరీ! ప్రాణగతిని తెలుసుకున్న విద్వాంసులు కుడి చేతి గణనములో ఆరు, అయిదు, మూడు అను సంఖ్యలను శబ్దమానముగా స్వీకరించెదరని తెలియవలెను (43). ఇడా మొదలగు నాడులు అయిదు రోజుల వరకు ప్రాణశక్తిని తమలో ప్రవహింప జేసినచో, అట్టి వాని జీవితము నిస్సంశయముగా సంవత్సరము లోపులో అంతమగును (44). ఈ ప్రవాహము పది రోజులు ఉన్నచో అట్టివాడు సంవత్సరకాలము జీవించును. ఈ ప్రవాహము పదిహేను రోజులు ఉన్నచో, అట్టివాడు సంవత్సరము తరువాత మరణించును (?) (45)

వింశద్దిన ప్రవాహేణ షణ్మాసం లక్షయేత్తదా ।
పంచవింశద్దినమితం వహతే వామనాడికా ॥
జీవితం తు తదా తస్య త్రిమాసం హి గతాయుషః ।
షడ్వింశద్దినమానేన మాసద్వయముదాహృతమ్ ॥
సప్తవింశద్దినమితం వహతేత్యతివి శ్రమా ।
మాసమేకం సమాఖ్యాతం జీవితం వామగోచరే ॥
ఏతత్ప్రమాణం విజ్ఞేయం వామవాయు ప్రమాణతః ।
సవ్యేతరే దినాన్యేవ చత్వారశ్చాను పూర్వశః ॥
చతుఃస్థానే స్థితా దేవి షోడశైతాః ప్రకీర్తితాః ।
తేషాం ప్రమాణం వక్ష్యామి సాంప్రతం హి యథార్థతః ॥
షడ్ దినాన్యాదితః కృత్వా సంఖ్యాయాశ్చ యథావిధి।
ఏతదంతర్గతే చైవ వామరంధ్రే ప్రకాశితమ్ ॥
షడ్ దినాని యదా రూఢం ద్వివర్షం చ స జీవతి ।
మాసానష్టౌ విజానీయాద్దినాన్యష్ట చ తాని తు ॥
ప్రాణస్సప్తదశే చైవ విద్ధి వర్షం న సంశయః ।
సప్తమాసాన్విజానీయాద్దినైః షడ్భిర్న సంశయః ॥
అష్టఘస్రప్రభేదేన ద్వివర్షం హి స జీవతి ।
చతుర్మాసా హి విజ్ఞేయాశ్చతుర్వింశద్దినావధిః ॥
యదా నవదినం ప్రాణా వహంత్యేవ త్రిమాసకమ్ ।
మాసద్వయం చ ద్వే మాసే దినా ద్వాదశ కీర్తితాః ॥

ప్రాణప్రవాహము ఇరువది రోజులు ఉన్నచో, వాని ఆయుర్దాయము ఆరు మాసములని తెలియవలెను. ఎడమ నాడిలో ప్రవాహము ఇరువది రోజులు ఉన్నచో, ఆతడు మూడు మాసములలో మరణించును. ఇరువది ఆరు రోజులు ఉన్నచో, ఆయుర్దాయము రెండు మాసములని చెప్పబడినది (46,47). ప్రాణము చాల మెల్లగా ఇరువది ఏడు రోజులు ప్రవహించినచో, వాని ఆయుర్దాయము ఒక నెల యని తెలియవలెను. ఈ మానము ఎడమ చేతికి సంబంధించినదనియు, ఎడమ నాడియందలి ప్రాణప్రవాహమును ఆధారముగా చేసుకొని చెప్పబడినదనియు తెలియవలెను. కుడి వైపు ఇదే స్థితి ఉన్నచో, వాని ఆయుర్దాయము నాలుగు రోజులు మాత్రమే. ఓ దేవీ! నాలుగు స్థానములలో యథాక్రమముగా నుండే ఈ పదునారు మానములను నేను వర్ణించి చెప్పితిని. ఇప్పుడు వాటి ప్రమాణమును యథాతథముగా చెప్పగలను (48-50). ఆరు దినములు అనే సంఖ్యతో మొదలిడి యథావిధిగా లెక్కించినచో ఎడమ చేతి ప్రక్రియలో చెప్పనట్లుగనే సరిపడును (?) (51). ప్రాణ ప్రవాహము ఆరు దినములు స్థిరముగా నున్నచో, ఆ వ్యక్తి రెండు సంవత్సరముల ఎనిమిది మాసముల ఎనిమిది రోజులు జీవించును (52). పదిహేడు రోజులు ప్రాణప్రవాహము ఉన్నచో ఆయుర్దాయము ఒక సంవత్సరము ఏడు మాసముల ఆరు రోజులు అని తెలియవలెను. దీనిలో సంశయము లేదు (53). ఎనిమిది దినములు ఆ ప్రవాహము

ఉన్నచో, రెండు సంవత్సరముల నాలుగు మాసముల ఇరువది నాలుగు రోజుల ఆయుర్దాయము ఉండునని తెలియవలెను (54). తొమ్మిది దినములు ప్రాణ ప్రవాహము ఉన్నచో, ఏడు మాసముల పన్నెండు రోజులు ఆ వ్యక్తి జీవించునని చెప్పబడినది (55).

గమనిక : ఈ ప్రసంగము చాల నిగూఢముగా గాని, అసందర్భముగా గాని ఉన్నది. ఇది గాక అనేకలేఖక దోషములు సంక్రమించుటచే కొన్ని శ్లోకములు దురూహ్యములుగా నున్నవి.

పూర్వవత్కథితా యే తు కాలం తేషాం తు పూర్వకమ్ ।

అవాంతరదినా యే తు తేన మాసేన కథ్యతే ॥ (?)

ఏకాదశ ప్రవాహేణ వర్షమేకం స జీవతి ।

మాసా నవ తథా ప్రోక్తా దినాన్యష్టమితాన్యపి ॥

ద్వాదశేన ప్రవాహేణ వర్షమేకం స జీవతి ।

మాసాన్ సప్త విజానీయాత్ షడ్ఢ ప్రాంశ్చాప్యు దాహరేత్ ॥

నాడీ యదా చ వహతి త్రయోదశ దినావధి ।

సంవత్సరం భవేత్తస్య చతుర్మాసాః ప్రకీర్తితాః ॥

చతుర్వింశద్దినం శేషం జీవితం చ న సంశయః।

ప్రాణవాహో యదా వామే చతుర్దశదినాని తు ॥

సంవత్సరం భవేత్తస్య మాసాః షట్ చ ప్రకీర్తితాః ।

చతుర్వింశద్దినాన్యేవ జీవితం చ న సంశయః ॥

పంచదశ ప్రవాహేణ నవ మాసాన్ స జీవితి।

చతుర్వింశద్దినాధిక్యం కథితం కాలవేదిభిః ॥

షోడశాహ ప్రవాహేణ దశమాసాన్ స జీవతి।

చతుర్వింశద్దినాధిక్యం కథితం కాలవేదిభిః ॥

సప్తదశ ప్రవాహేణ నవమాసైర్గతాయుషమ్ ।

అష్టాదశదినాన్యత్ర కథితం సాధకేశ్వరి ॥

వామచారం యదా దేవీ హ్యష్టాదశ దినావధిః ।

జీవితం చాష్టమాసం తు ఘస్రా ద్వాదశ కీర్తితాః ॥

ప్రాణప్రవాహము పదకొండు రోజులు ఉన్నచో, ఆ వ్యక్తి ఒక సంవత్సరము తొమ్మిది మాసముల ఎనిమిది దినములు బ్రతుకును (57). ప్రవాహము పన్నెండు రోజులు ఉన్నచో, ఆ వ్యక్తి ఒక సంవత్సరము ఏడు మాసముల ఆరు రోజులు జీవించునని చెప్పబడినది (58). నాడీ ప్రవాహము పదమూడు రోజుల వరకు ఉన్నచో, ఆ వ్యక్తికి సంవత్సరము నాలుగు మాసముల ఇరువది నాలుగు రోజుల ఆయుర్దాయము మిగిలి యున్నదనుటలో సందేహము లేదు. ఎడమభాగమునందు ప్రాణము పదునాలుగు రోజులు ప్రవహించినచో, ఆతనికి సంవత్సరము ఆరు మాసముల ఇరువది నాలుగు రోజుల ఆయుర్దాయము ఉండుననుటలో సందేహము లేదు (59-61). ప్రాణ ప్రవాహము పదునైదు రోజులు

ఉన్నచో, ఆ వ్యక్తి తొమ్మిది మాసముల ఇరువది నాలుగు రోజులు జీవించునని కాలవేత్తలు చెప్పెదరు (62). పదునారు దినములు ప్రాణప్రవాహము ఉన్న వ్యక్తి పది మాసముల ఇరువది నాలుగు రోజులు జీవించునని కాలవేత్తలు చెప్పెదరు (63), భక్తులను కాపాడే ఓ పార్వతీ! పదిహేడు రోజులు ప్రాణప్రవాహము ఉన్న వ్యక్తి తొమ్మిది మాసముల పదునెనిమిది దినములు జీవించునని చెప్పబడినది (64). ఓ దేవీ ! ఎడమ భాగమునందు ప్రవాహము పదునెనిమిది దినములు ఉన్నచో, వాని జీవితము ఎనిమిది మాసముల పన్నెండు రోజులని చెప్పబడినది (65).

చతుర్వింశద్దినాన్యత్ర నిశ్చయేనా వధారయ ।
ప్రాణవాహో యదా దేవి త్రయోవింశద్దినావధిః ॥
చత్వారః కథితా మాసాః షడ్ దినాని తథోత్తరే ।
చతుర్వింశ ప్రవాహేణ త్రీన్మాసాంశ్చ స జీవతి ॥
దినాన్యత్ర దశాష్టౌ చ సంహరంత్యేవ చారతః।
అవాంతరదినే యస్తు సంక్షేపాత్తే ప్రకీర్తితః ॥
వామచారస్సమాఖ్యాతో దక్షిణం శృణు సాంప్రతమ్ ।
అష్టావింశ ప్రవాహేణ తిథమానేన జీవతి ॥
ప్రవాహేణ దశాహేన తత్సంస్థేన విపద్యతే ।
త్రింశద్ఘస్ర ప్రవాహేణ పంచాహేన విపద్యతే ॥
ఏకత్రింశద్యదా దేవి వహతే చ నిరంతరమ్ ।
దినత్రయం తదా తస్య జీవితం హి న సంశయః ॥
ద్వాత్రింశత్ప్రాణసంఖ్యా చ యదా హి మహతే రవిః ।
తదా తు జీవితం తస్య ద్విదినం హి న సంశయః ॥
దక్షిణః కథితః ప్రాణో మధ్యస్థం కథయామి తే।
ఏకభాగగతో వాయు ప్రవాహో ముఖమండలే ॥
ధావమాన ప్రవాహేణ దినమేకం స జీవతి।
చక్రమేతత్పరాసోర్హి పురావద్భిరుదా హృతమ్ ॥
ఏతత్తే కథితం దేవి కాలచక్రం గతాయుషః ।
లోకానాం చ హితార్థాయ కిమన్యచ్ఛ్రోతు మిచ్ఛసి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం కాలజ్ఞానవర్ణనం నామ
పంచవింశోఽధ్యాయః॥

ఓ దేవీ! ప్రాణ ప్రవాహము ఇరువది మూడు రోజుల వరకు ఉన్నచో, ఆ వ్యక్తి నిశ్చయముగా నాలుగు మాసముల ఇరువది తొమ్మిది దినములు జీవించునని తెలుసుకొనుము. ప్రవాహము ఇరువది నాలుగు రోజులు ఉన్నచో, ఆ వ్యక్తి అవాంతరదినముల లెక్కను కూడ కలుపుకుని మూడు మాసముల పదునెనిమిది రోజులు జీవించును. నేను నీకు ఈ విధముగా ఎడమ చేతి కాలగణనమును చెప్పితిని. ఇప్పుడు కుడి చేతి గణనమును వినుము. ఇరువది ఎనిమిది దినముల ప్రవాహము ఉన్నచో, ఆతడు అన్ని రోజులు మాత్రమే జీవించును (66-69). ప్రవాహము పది దినములు ఉన్న వ్యక్తి వెనువెంటనే మరణించును. ముప్పది రోజుల ప్రవాహము ఉన్న వ్యక్తి అయిదు రోజులలో మరణించును (70). ఎవనిలో ప్రాణప్రవాహము నిరంతరముగా ముప్పది ఒక్క రోజుల వరకు ఉండునో, వాని జీవితము మూడు రోజులు మాత్రమే మిగిలి యున్నది. దీనిలో సందేహము లేదు (71). ఎవని సూర్యనాడిలో ప్రాణప్రవాహసంఖ్య ముప్పది రెండు ఉండునో, అట్టి వ్యక్తి రెండు రోజులు మాత్రమే జీవించును. దీనిలో సందేహము లేదు (72). కుడి భాగమునందలి ప్రాణప్రవాహము గురించి నీకు ఇంతవరకు చెప్పియుంటిని. ఇప్పుడు మధ్య భాగమునందలి ప్రాణ ప్రవాహమును గురించి చెప్పెదను. ఎవని ముఖమండలమునందు ప్రాణము ఒక భాగమునందు మాత్రమే పరుగు వేగముతో ప్రవహించునో, అట్టి వ్యక్తి ఒక రోజు మాత్రమే జీవించును. ఆ వ్యక్తి మరణించుచున్నాడని పురాతనులగు కాలవేత్తలు చెప్పిరి (73,74). ఓ దేవీ ! ఈ విధముగా మానవుల హితమును గోరి నీకు మరణమునకు ఉన్ముఖముగా నున్నవారి కాలచక్రమును గురించి చెప్పితిని. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు ?

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు కాలజ్ఞానవర్ణనమనే ఇరువది అయిదవ అధ్యాయము ముగిసినది.

26 – యోగ మహిమ

దేవ్యువాచ।

కథితం తు త్వయా దేవ కాలజ్ఞానం యథార్థతః ।
కాలస్య వంచనం బ్రూహి యథా తత్త్వేన యోగినః ॥
కాలస్తు సన్నికృష్టో హి వర్తతే సర్వజంతుషు ।
యథా చాస్య న మృత్యుశ్చ వంచతే కాలమాగతమ్ ॥
తథా కథయ మే దేవ ప్రీతిం కృత్వా మమోపరి ।
యోగినాం చ పాతాయ త్వం బ్రూహి సర్వసుఖప్రద ॥

పార్వతీదేవి ఇట్లు పలికెను –

ఓ దేవా ! నీవు కాలజ్ఞానమును యథాతథముగా చెప్పితివి. యోగి మరణమును తప్పించుకొనే (వాయిదా వేసే) విధానమును యథాతథముగా చెప్పుము (1). సర్వప్రాణులకు మృత్యువు సమీపముననే యుండును. సంప్రాప్తమైన కాలమును వంచించి, యోగి మృత్యువునకు దూరముగా ఉండే విధానమును చెప్పుము. ఓ దేవా ! ఈ విషయమును నీవు నాపై ప్రేమను చూపి చెప్పుము. సర్వులకు సుఖమునిచ్చే నీవు దీనిని యోగుల హితము కొరకై చెప్పుము (2,3).

శంకర ఉవాచ ।

శృణు దేవి ప్రవక్ష్యామి పృష్టోఽహం యత్త్వయా శివే।
సమాసేన చ సర్వేషాం మానుషాణాం హితార్థతః ॥
పృథివ్యాపస్తథా తేజో వాయురాకాశమేవ చ ।
ఏతేషాం హి సమాయోగశ్శరీరం పాంచభౌతికమ్ ॥
ఆకాశస్తు తతో వ్యాపీ సర్వేషాం సర్వగః స్థితః ।
ఆకాశే తు విలీయంతే సంభవంతి పునస్తతః ॥
వియోగే తు సదా కస్య స్వం ధామ ప్రతిపేదిరే ।
తస్యాస్థిరతా చాస్తి సన్నిపాతస్య సుందరి ॥
జ్ఞానినోఽపి తథా తత్ర తపోమంత్ర బలాదపి ।
తే సర్వే సువిజానంతో సర్వమేతన్న సంశయః ॥

శంకరుడు ఇట్లు పలికెను –

ఓ పార్వతీదేవీ ! వినుము. సర్వమానవుల హితమును గోరి నీవు ప్రశ్నించిన విషయమును సంగ్రహముగా చెప్పెదను (4). భూమి, నీరు, వాయువు, అగ్ని మరియు ఆకాశము అనే అయిదు భూతముల కలయికచే ఈ శరీరము నిర్మాణమైనది (5). ఆ భూతములన్నింటిలో ఆకాశము సర్వవ్యాపకము. ఇతరభూతములు ఆకాశములో విలీనమే, మరల ఆకాశమునుండి పుట్టుచున్నవి (6). ఈ శరీరము శిథిలము కాగానే ఆయా భూతములు మహా భూతములలో కలిసిపోవును. ఓ సుందరీ ! కఫవాతపిత్తములనే మూడు ధాతువుల కలయిక

యగు దేహమునకు అస్థిరత్వము ఉండనే ఉన్నది (7), ఈ స్థితి జ్ఞానులకైననూ తప్పదు. కాని, ఈ విషయమును అంతనూ జ్ఞానులు అందరు తపస్సు మరియు మంత్రములయొక్క ప్రభావముచే సుస్పష్టముగా తెలుసుకొనుచున్నారు. ఈ విషయములో సంశయము వలదు (8).

దేవ్యువాచ।

ఖం తేన యన్నశ్యతి ఘోరరూపః కాలః కరాలస్త్రి దివైకనాథః ।
దగ్ధస్త్వయా త్వం పునరేవ తుష్టః స్తోత్రైః స్తుతస్స్వాం ప్రకృతిం స లేభే ॥
త్వయా స చోక్తః కథయా జనానామదృష్టరూపః ప్రచరిష్యసీతి ।
దృష్టస్త్వయా తత్ర మహాప్రభావః ప్రభోర్వరాత్తే పునరుత్థితశ్చ ॥
తదద్య భోః కాల ఇహాస్తి కించిన్నిహన్యతే యేన వదస్వ తన్మే ।
త్వం యోగివర్యః ప్రభురాత్మతంత్రః పరోపకారాత్తతనుర్మహేశ ॥

దేవి ఇట్లు పలికెను –

దేవతలకు ఏకైక ప్రభుడవు అగు ఓ శివా ! ఘోరమగు రూపము గలది, భయంకరమైనది అగు కాలము నాలుగు భూతములను ఆకాశములో విలీనము చేసి, తాను నశించును. ఆ కాలపురుషుని నీవు దహించెదవు. స్తోత్రములచే స్తుతించబడిన నీవు సంతోషించగా, అపుడు మరల ఆ కాలుడు తన స్వరూపమును పొందెను (9). నీవు ఆ కాలునితో సంభాషిస్తూ ఇట్లు పలికితివి: 'నీవు జనులకు కానరాకుండగా సంచరించగలవు'. నీవు గొప్ప ప్రభావము గల ఆ కాలుని అచట చూచితివి. సర్వసమర్థుడవగు నీ వరముచే ఆ కాలుడు పునరుజ్జీవింపచేయ బడినాడు (10). ఓ మహేశ్వరా ! ఈ కాలుడు ఆ కారణముచే ఇప్పుడు ఇక్కడ నున్నాడు. ఆతనిచే ఏదియో సంహరించబడినది. దానిని గురించి నాకు చెప్పుము. నీవు సర్వసమర్థుడవు ; యోగులలో శ్రేష్ఠుడవు ; స్వతంత్రుడవు ; మరియు పరోపకారము కొరకై దేహమును స్వీకరించినవాడవు (11).

శంకర ఉవాచ ।

న హన్యతే దేవవరైస్తు దైత్యైస్సయక్ష రక్షోరగమానుషైశ్చ ।
యే యోగినో ధ్యానపరాస్సదేహా భవంతి తే ఘ్నంతి సుఖేన కాలమ్ ॥

శంకరుడు ఇట్లు పలికెను –

దేవతలలో శ్రేష్ఠులైన వారు గాని, దైత్యులు గాని, యక్షులు గాని, రాక్షసులు ః గాని, నాగులు గాని, మానవులు గానీ కాలమును సంహరించలేరు. కాని ధ్యానమునందు నిమగ్నులైన యోగులు దేహముతో జీవించి యుండగనే కాలుని అనాయాసముగా జయించెదరు (12).

సనత్కుమార ఉవాచ ।

ఏతచ్ఛ్రుత్వా త్రిభువనగురోః ప్రాహ గౌరీ విహస్య సత్యం త్వం మే వద కథమసౌ హన్యతే యేన కాలః ।

శంభుస్తామహ సద్యో హిమకరవదనే యోగినో యే క్షిపంతి కాలవ్యాలం సకలమనఘాస్తచ్ఛృణుష్వైకచిత్తా ॥

పంచభూతాత్మకో దేహస్సదా యుక్తస్తు తద్గుణైః ।
ఉత్పాద్యతే వరారోహే తద్విలీనో హి పార్థివః ॥

ఆకాశాజ్జాయతే వాయుర్వాయోస్తేజశ్చ జాయతే ।
తేజసోఽఋ వినిర్దిష్టం తస్మాద్ధి పృథివీ భవేత్ ॥

పృథివ్యాదీని భూతాని గచ్ఛంతి క్రమశః పరమ్ ।
ధరా పంచగుణా ప్రోక్తా హ్యాపస్త్వైవ చతుర్గుణాః ॥

త్రిగుణం చ తథా తేజో వాయుర్ద్విగుణ ఏవ చ ।
శబ్దైకగుణమాకాశం పృథివ్యాదిషు కీర్తితమ్ ॥

శబ్దస్పర్శశ్చ రూపం చ రసో గంధశ్చ పంచమః ।
విజహాతి గుణం స్వం స్వం తదా భూతం విపద్యతే ॥

యదా గుణం విగృహ్ణాతి ప్రాదుర్భూతం తదుచ్యతే ।
ఏవం జానీహి దేవేశి పంచభూతాని తత్త్వతః ॥

తస్మాద్ధి యోగినా నిత్యం స్వస్వకాలేఽశజా గుణాః ।
చింతనీయాః ప్రయత్నేన దేవి కాలజిగీషుణా ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ముల్లోకములకు తండ్రియగు శివుని ఈ వచనమును విని గౌరి నవ్వి ఇట్లు పలికెను: 'ఈ కాలుడు ఎవనిచే ఏ విధముగా జయించబడును ? నీవు నాకు సత్యమును చెప్పుము'. వెంటనే శంభుడు ఆమెతో నిట్లనెను: చంద్రుని వలె ఆహ్లాదకరమైన ముఖము గల ఓ పార్వతీ ! పాపరహితులైన యోగులు కాలుడనే సర్పమును పూర్ణముగా త్రోసిపుచ్చెదరు. ఆ విషయమును ఏకాగ్రచిత్తముతో వినుము (13). ఓ సుందరీ ! ఈ స్థూలదేహము అయిదు భూతములనుండి నిర్మితమై సర్వదా వాటియొక్క గుణములను కలిగియున్నది. ఇది అంతములో వాటిలోననే విలీనమగును (14). ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, దానినుండి పృథివి పుట్టినవని పెద్దలు చెప్పెదరు (15). పృథివితో మొదలిడి ఈ భూతములు క్రమముగా తమ తమ కారణములో విలీనమగును. పృథివితో మొదలిడి ఈ పంచభూతములలో పృథివికి అయిదు, జలమునకు నాలుగు, అగ్నికి మూడు, వాయువునకు రెండు, ఆకాశమునకు శబ్దము అనే ఒకటి చొప్పున గుణములు గలవు (16, 17). శబ్దము, స్పర్శ, రూపము, రసము, మరియు గంధము అనునవి ఈ అయిదు గుణములు. ఆయా భూతములు తమ తమ గుణములను పరిత్యజించి వినష్టమగును (18). అది ఆ గుణమును స్వీకరించినప్పుడు పుట్టినదని చెప్పబడును. ఓ దేవదేవీ ! పంచభూతముల తత్త్వము

ఇట్లున్నది. దీనిని నీవు తెలుసుకొనుము (19). ఓ దేవీ ! కావున, కాలమును జయించ గోరు యోగి నిత్యము ఆయా కాలముల యందు సూక్ష్మపంచ భూతములనుండి పుట్టిన ఈ గుణములను ప్రయత్నపూర్వకముగా ధ్యానించవలెను (20).

దేవ్యువాచ।

కథం జేజీయ్యతే కాలో యోగిభిర్యోగవిత్ప్ర భో ।
ధ్యానేన చాథ మంత్రేణ తత్సర్వం కథయస్వ మే ॥

దేవి ఇట్లు పలికెను –

యోగవేత్తలకు ప్రభువైన ఓ శంకరా ! యోగులు కాలుని ఏ విధముగా జయిం◌ిపగోరుచున్నారు ? ధ్యానముచేతనా ? లేక మంత్రము చేతనా ? ఆ వివరమునంతనూ నాకు చెప్పడు (21).

శంకర ఉవాచ।

శృణు దేవి ప్రవక్ష్యామి యోగినాం హితకామ్యయా ।
పరజ్ఞానప్ర కథనం న దేయం యస్య కస్యచిత్ ॥
శ్రద్ధధానాయ దాతవ్యం భక్తియుక్తాయ ధీమతే ।
అనాస్తికాయ శుద్ధాయ ధర్మనిత్యాయ భామిని ॥
సుశ్వాసేన సుశయ్యాయాం యోగం యుంజీత యోగవిత్ ।
దీపం వినాంధకారే తు ప్రజాస్సుప్తేషు ధారయేత్ ॥
తర్జన్యా పిహితౌ కర్ణౌ పీడయిత్వా ముహూర్తకమ్ ।
తస్మాత్సం శ్రూయతే శబ్దస్తుదన్వహ్ని సముద్భవః ॥
సంధ్యాతో భుక్తమేవం హి చావసన్నం క్షణాదపి ।
సర్వరోగాన్ని హంత్యాశు జ్వరోపద్రవకాన్ బహూన్ ॥
యశ్శోపలక్షయేన్నిత్యైరాకారం ఘటికాద్వయమ్ ।
జిత్వా మృత్యుం తథా కామం స్వేచ్ఛయా పర్యటేదిహ ॥
సర్వజ్ఞస్సర్వదర్శీ చ సర్వసిద్ధిమ వాప్నుయాత్ ।
యథా నదతి ఖేఽబ్దో హి ప్రావృడబ్ధిస్సుసంయతః ॥
తం శ్రుత్వా ముచ్యతే యోగీ సద్యస్సంసార బంధనాత్ ।
తతస్సు యోగిభిర్నిత్యం సూక్ష్మాతూక్ష్మతరో భవేత్ ॥
ఏష తే కథతో దేవి శబ్దబ్రహ్మ విధిక్రమః ।
పలాలమివ ధాన్యార్థీ త్యజేద్బంధమశేషతః ।
శబ్దబ్రహ్మ త్విదం ప్రాప్య యే కేచిదన్యకాంక్షిణః ।
ఘ్నంతి తే ముష్టినాకాశం కామయంతే క్షుధాం తృషామ్ ॥
జ్ఞాత్వా పరమిదం బ్రహ్మ సుఖదం ముక్తికారణమ్ ।
అబాహ్యమక్షరం చైవ సర్వోపాధి వివర్జితమ్ ॥

మోహితాః కాలపాశేన మృత్యుపాశవశం గతాః ।

శబ్దబ్రహ్మ న జానంతి పాపినస్తే కుబుద్ధయః ॥

శంకరుడు ఇట్లు పలికెను –

ఓ దేవీ ! యోగుల హితమును కోరి శ్రేష్ఠజ్ఞానమును చేప్పెదను. వినుము. దీనిని యోగ్యతను చూడకుండగా సర్వులకు చెప్పరాదు (22). ఓ భామినీ ! శ్రద్ధ భక్తి మరియు సూక్ష్మబుద్ధి గలవాడు, నాస్తికుడు కానివాడు, శుద్ధమైన అంతఃకరణము గలవాడు మరియు నిత్యము ధర్మమునకు కట్టుబడినవాడు అగు వ్యక్తికి మాత్రమే దీనిని చెప్పవలెను (23). జనులు అందరు నిద్రించు సమయములో యోగవేత్త చక్కని ఆసనముపై గూర్చుండి దీపమును ఆర్పివేసి చీకటిలో ప్రాణాయామమును చేసి మనస్సును ధారణ చేయవలెను (24), చూపుడు వ్రేళ్లతో చెవులను మూసి కొద్ది సేపు నొక్కి పెట్టినచో, చెవుల లోపలినుండి భగ భగ మండే అగ్నియొక్క శబ్దమును పోలిన శబ్దము వినవచ్చును (25). ఈ యోగమును ఈ విధముగా అభ్యసించినచో, జ్వరము మొదలైన సర్వరోగములను మరియు ఇతరములగు అనేకములైన ఉపద్రవములను శీఘ్రకాలములో నశింపజేయును. సంధ్యాసమయము తరువాత తిన్న ఆహారము శీఘ్రముగా జీర్ణమగును (26). ఎవడైతే ప్రతిదినము ఈశ్వరస్వరూపమును రెండు ఘటికల కాలము వరకు ధ్యానించునో, వాడు మృత్యువును మరియు కామనలను జయించి ఈ లోకములో స్వేచ్ఛగా సంచరించును (27). ఆతడు సర్వజ్ఞుడు మరియు సర్వమును చూచే శక్తి గలవాడు అయి సర్వసిద్ధులను పొందును. ఆకాశము దట్టమైన వర్షకాల మేఘములతో నిండి యున్నప్పుడు వచ్చే ఏనుగుల శబ్దమును పోలిన శబ్దమును ధ్యానసమయములో విన్న యోగి గొప్ప ఇంద్రియజయము గలవాడై వెంటనే సంసారబంధమునుండి విముక్తిని పొందును. తరువాత యోగులచే వినబడే ఆ శబ్దము క్రమముగా మరింత సూక్ష్మము అగుచుండును (28, 29). ఓ దేవీ ! ఇంతవరకు నీకు శబ్దరూపములో నున్న బ్రహ్మను ఆరాధించే క్రమమును చెప్పితిని. ధాన్యమును కోరువాడు ఊకను విడిచిపెట్టు విధముగా, యోగి సకలబంధములను విడిచిపెట్టును (30). ఎవడైతే శబ్దబ్రహ్మను పొందిన తరువాత కూడ ఇతరమును కాంక్షించునో, అట్టి వాడు తన పిడికిలితో ఆకాశమును కొట్టినవానితో సమానము. అట్టివాడు ఆకలిదప్పికలను కోరుచున్నాడు (31). సుఖకరము, జగత్సంబంధము లేనిది, వినాశము లేనిది, అన్ని రకముల ఉపాధులనుండి వినిర్ముక్తమైనది అగు పరంబ్రహ్మను తెలుసుకున్న వ్యక్తి మోక్షమును పొందును (32). దుష్టబుద్ధి గల పాపాత్ములు మృత్యువుయొక్క పాశముచే మోహితులై ఆ పాశమునకు వశులై శబ్దబ్రహ్మను తెలియకున్నారు (33).

తావద్భవంతి సంసారే యావద్ధామ న విందతే ।

విదితే తు పరే తత్త్వే ముచ్యతే జన్మబంధనాత్ ॥

నిద్రాలస్యం మహావిఘ్నం జిత్వా శత్రుం ప్రయత్నతః ।

సుఖాసనే స్థితో నిత్యం శబ్దబ్రహ్మాభ్యసన్నితి ॥

శతవృద్ధః పుమాంల్లబ్ధ్వా యావదాయుస్సమభ్యసేత్ ।

మృత్యుం జయవపుస్తంభ ఆరోగ్యం వాయువర్ధనమ్ ॥

ప్రత్యయో దృశ్యతే వృద్ధే కిం పునస్తరుణే జనే ।
న చోంకారో న మంత్రోపి నైవ బీజం న చాక్షరమ్ ॥
అనాహతమనుచ్చార్యం శబ్దబ్రహ్మ శివం పరమ్ ।
ధ్యాయంతే దేవి సతతం సుధియో యత్నతః ప్రియే ॥
తస్మాచ్ఛబ్దా నవ ప్రోక్తాః ప్రాణవిద్భిస్తు లక్షితాః ।
తాన్ ప్రవక్ష్యామీ యత్నేన నాదసిద్ధిమను క్రమాత్ ॥
ఘోషం కాంస్యం తథా శృంగం ఘంటాం వీణాదివంశజాన్ ।
దుందుభిం శంఖశబ్దం తు నవమం మేఘగర్జితమ్ ॥
నవ శబ్దాన్ పరిత్యజ్య తుంకారం తు సమభ్యసేత్।
ధ్యాయన్నేవం సదా యోగీ పుణ్యైః పాపైర్న లిప్యతే ॥
న శృణోతి యదా శృణ్వన్ యోగాభ్యాసేన దేవికే ।
మ్రియతేభ్య సమానస్తు యోగీ తిష్ఠేద్దివానిశమ్ ॥
తస్మాదుత్పద్యతే శబ్దో మృత్యుజిత్సప్త భిర్దినైః ।
స వై నవవిధో దేవి తం బ్రవీమి యథార్థతః ॥
ప్రథమం నదతే ఘోషమాత్మ శుద్ధికరం పరమ్ ।
సర్వవ్యాధిహరం నాదం వశ్యాకర్షణ ముత్తమమ్ ॥

మానవుడు పరమపదమును పొందనంత వరకు మాత్రమే సంసారమునందు ఉండును. పరబ్రహ్మతత్త్వమును తెలుసుకున్న మానవుడు జన్మబంధమునుండి విముక్తిని పొందును (34). నిద్ర మరియు సోమరితనము అనునవి యోగసాధనకు పెద్ద విఘ్నములు. సాధకుడు ఈ శత్రువులను ప్రయత్నపూర్వకముగా జయించి సుఖకరమగు ఆసనమునందు కూర్చుండి నిత్యము శబ్దబ్రహ్మను అభ్యసించవలెను (35). వంద సంవత్సరముల వయస్సు గల పురుషుడేననూ దీనిని అభ్యసించినచో, మరణమును జయించును. ఆతని శరీరము శిథిలమగుట ఆగి పోవును.- ఆరోగ్యము మరియు ప్రాణశక్తి పెరుగును. ఆతడు జీవించి ఉన్నంత వరకు దీనిని అభ్యసించవలెను (36). ఇట్టి ప్రత్యక్షఫలము వృదునియందు కూడ కానవచ్చుచుండగా, యువకుల మాట చెప్పునదేమున్నది? ఓ ప్రియురాలా! వివేకము గలవారు సర్వకాలములలో ప్రయత్నపూర్వకముగా శబ్దబ్రహ్మ స్వరూపుడగు పరమశివుని ధ్యానము చేయుదురు. శబ్దబ్రహ్మ పదార్థములయందలి కంపనము వలన పుట్టే శబ్దము కాదు. దానిని నోటితో ఉచ్చరించుటయూ సంభవము కాదు. అది ఓంకారము గానీ, మంత్రము గాని, బీజాక్షరము గాని కాదు (37,38). కావుననే, ప్రాణస్వరూపమునెరింగిన పండితులు తొమ్మిది శబ్దములను చెప్పిరి. నేను వాటిని నాదసిద్ధిని అనుసరించి సరియగు క్రమములో ప్రయత్నపూర్వకముగా చెప్పెదను (39). అవి యేవనగా, ఘోషము (సరళమగు హల్లుల ఉచ్చారణలో వచ్చే శబ్దము), కాంస్యము (కంచుయొక్క శబ్దము), శృంగము (కొమ్ము బూరా ధ్వని), ఘంట (గంట), వీణ, పిల్లన గ్రోవి నుండి పుట్టే శబ్దము, దుందుభి, శంఖశబ్దము మరియు తొమ్మిదవది యగు మేఘగర్జనము (40). ఈ తొమ్మిది శబ్దములను విడిచిపెట్టి తుంకారమును చక్కగా

అభ్యసించవలెను. నిత్యము ఈ విధముగా ధ్యానమును చేయు యోగి పుణ్యపాపముల లేపమును పొందడు (41). ఓ దేవీ ! యోగమును అభ్యసించు యోగి ప్రయత్నించిననూ ఈ శబ్దములను వినలేక పోవచ్చును. యోగమును అభ్యసించుచుండగా, ఆతడు మరణమునకు దగ్గర కావచ్చును. అయిననూ, సాధకుడగు యోగి రాత్రింబగళ్లు అభ్యాసములను చేయుచుండవలెను (42). అట్టి అభ్యాసము వలన మృత్యువును జయించే శబ్దము ఏడు రోజుల తరువాత ఉదయించును. ఓ దేవీ ! అది తొమ్మిది రకములుగా నున్నది. వాటిని నేను యథాతథముగా చెప్పెదను (43). మొదటిది ఘోషము అనే శబ్దము. అది అంతఃకరణమును శుద్ధి చేయును. ఉత్తమమగు ఆ నాదము వ్యాధులను అన్నింటినీ పోగొట్టి వశీకరణ, ఆకర్షణశక్తులను ఇచ్చును (44).

ద్వితీయం నాదతే కాంస్యంస్తంభయేత్ప్రాణినాం గతిమ్ ।
విషం భూతగ్రహాన్ సర్వాన్ బధ్నీయానాత్ర సంశయః ॥
తృతీయం నాదతే శృంగమభిచారీ నియోజయేత్ ।
విద్విడుచ్చాటనే శత్రోర్మారణే చ ప్రయోజయేత్ ॥
ఘంటానాదం చతుర్థం తు వదతే పరమేశ్వరః ।
ఆకర్షస్సర్వ దేవానాం కిం పునర్మానుషా భువి ॥
యక్షగంధర్వకన్యాశ్చ తస్యా కృష్టా దదంతి హి ।
యథేప్సితాం మహాసిద్ధిం యోగినే కామతోఽపి వా ॥
వీణా తు పంచమో నాదః శ్రూయతే యోగిభిస్సదా ।
తస్మాదుత్పద్యతే దేవి దూరాద్దర్శనమేవ హి ॥
ధ్యాయతో వంశనాదం తు సర్వతత్త్వం ప్రజాయతే ।
దుందుభిం ధ్యాయమానస్తు జరామృత్యు వివర్జితః ॥
శంఖశబ్దేన దేవేశి కామరూపం ప్రపద్యతే ।
యోగినో మేఘనాదేన న విపత్సంగమో భవేత్ ॥
యశ్చైకమనసా నిత్యం తుంకారం బ్రహ్మరూపిణమ్ ।
కిమసాధ్యం న తస్యాపి యథామతి వరాననే ॥
సర్వజ్ఞ స్సర్వదర్శీ చ కామరూపీ ప్రజత్యసౌ ।
న వికారైః ప్రయుజ్యేత శివ ఏవ న సంశయః ॥
ఏతత్తే పరమేశాని శబ్దబ్రహ్మ స్వరూపకమ్ ।
నవధా సర్వమాఖ్యాతం కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం యోగమహిమవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥

రెండవ నాదము కాంస్యము. ఈ నాదము ప్రాణుల గతిని స్తంభింపజేయును. మరియు, అది విషమును, సకలభూతదోషములను, గ్రహదోషములను నివారించును. దీనిలో సందేహము లేదు (45). మూడవ నాదము శృంగము. ఇది ద్వేషించువారి వినాశము కొరకు మరియు శత్రుసంహారము కోరకు ఆభిచారికకర్మలయందు వినియోగించబడును (46). నాల్గవది ఘంటానాదము. ఆ నాదమును సాక్షాత్తుగా పరమేశ్వరుడు చేయుచుండును. ఇది దేవతలనందరినీ ఆకర్షించును. భూలోకములోని మానవులను ఆకర్షించునని వేరుగా చెప్పవలయునా? (47) అట్టి యోగిచే ఆకర్షించబడిన యక్షకన్యలు మరియు గంధర్వకన్యలు అతడు కోరిన కోర్కెలను తీర్చెదరు. ఆతడు కోరకున్ననూ, వారు తమంత తాముగా ఆతనికి అభీష్టములనిచ్చేదరు (48). అయిదవది వీణానాదము. దీనిని యోగులు సర్వదా వినుచునే యుందురు. ఓ దేవీ ! దీని వలన దూరమునుండి చూడగలిగే శక్తి లభించును (49). వంశనాదమును ధ్యానించువానికి పృథివ్యాది పంచసూక్ష్మతత్త్వముల జ్ఞానము కలుగును. దుందుభిని ధ్యానించువాడు ముసలితనము నుండి మరియు మృత్యువునుండి విముక్తుడగును (50). ఓ దేవదేవీ ! శంఖశబ్దమును జయించిన యోగి తనకు నచ్చిన రూపమును స్వీకరించగలును. మేఘనాదమును జయించిన యోగికి ఆపదల పాలగుట జరుగదు (51). ఓ సుందరీ! బ్రహ్మస్వరూపమగు తుంకారమును ఎవడైతే ఏకాగ్రమగు మనస్సుతో నిత్యము ధ్యానించునో, వానికి తన కోరికలలో పొంద శక్యము కానిది ఏదీ లేదు (52). ఇట్టి యోగి సర్వజ్ఞుడు, సర్వమును చూడగలవాడు, మరియు తనకు నచ్చిన రూపమును స్వీకరించ గలవాడు అగును. వికారములకు అతీతుడుగనుండే ఈ యోగి శివస్వరూపుడేననుటలో సందేహము లేదు (53). ఓ పరమేశ్వరీ ! తొమ్మిది విధముల ఈ శబ్దబ్రహ్మస్వరూపమును నీకు సమగ్రముగా చెప్పియుంటిని. నీవు ఇంకనూ ఏమి విన గోరుచున్నావు ?

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు యోగమహిమను వర్ణించే ఇరువది ఆరవ అధ్యాయము ముగిసినది.

27 – యోగ మహిమాను వర్ణనము

దేవ్యువాచ।

వాయోస్తు పదమాప్నోతి యోగాకాశ సముద్భవమ్ ।
తన్మే సర్వం సమాచక్ష్వ ప్రసన్నస్త్వం యది ప్రభో ॥

దేవి ఇట్లు పలికెను –

యోగి యోగము అనే ఆకాశమునుండి పుట్టిన వాయువుయొక్క స్థానమును పొందును. ఓ ప్రభూ ! నీవు నాపై ప్రసన్నుడవైనచో, ఆ వివరమునంతనూ నాకు చెప్పుము (1).

శంకర ఉవాచ।

పురా మే సర్వమాఖ్యాతం యోగినాం హితకామ్యయా ।
కాలం జిగాయ యస్సమ్యగ్వాయోర్లింగం యథా భవేత్ ॥
తేన జ్ఞాత్వా దినం యోగీ ప్రాణాయామపరః స్థితః ।
స జయత్యాగతం కాలం మాసార్ధేనైవ సుందరి ॥
హృత్ స్థో వాయుస్సదా వహ్నేర్దీపకస్సోఽను పావకః ।
స బాహ్యాభ్యంతరో వ్యాపీ వాయుస్సర్వగతో మహాన్ ॥
జ్ఞానవిజ్ఞానముత్సాహస్సర్వం వాయోః ప్రవర్తతే ।
యేనేహ నిర్జితో వాయుస్తేన సర్వమిదం జగత్ ॥
ధారణాయాం సదా తిష్ఠేజ్జరా మృత్యుజిఘాంసయా ।
యోగీ యోగరతస్సమ్యగ్ధారణాధ్యాన తత్పరః ॥
లోహకారో యథా భస్త్రామాపూర్య ముఖతో మునే ।
సాధయేద్వాయునా కర్మ తద్వద్యోగీ సమభ్య సేత్ ॥
దేవస్సహస్రకే నేత్రపాదహస్త సహస్రకః ।
గ్రంథీన్ హి సర్వమావృత్య సోఽగ్రే తిష్ఠేద్దశాంగులమ్ ॥
గాయత్రీం శిరసా సార్ధం జపేద్వ్యాహృతి పూర్వికామ్ ।
త్రివారమాయతప్రాణః ప్రాణాయామస్స ఉచ్యతే ॥
గతాగతా నివర్తంతే చంద్రసూర్యాదయో గ్రహాః ।
అద్యాపి న నివర్తంతే యోగధ్యాన పరాయణాః ॥
శతమబ్దం తపస్తప్త్వా కుశాగ్రాపః పిబేద్ద్విజః ।
తదాప్నోతి ఫలం దేవి విప్రాణాం ధారణైకయా ॥

శంకరుడు ఇట్లు పలికెను –

యోగుల హితమును గోరి నేను పూర్వము ఈ వివరములనన్నింటినీ చెప్పియుం◌ుంటిని. కాలమును జయించిన యోగి ఏ విధముగా వాయు రూపమును పొందును అను విషయమును చెప్పితిని (2). ఓ. సుందరీ! దీనిని బట్టి మరణకాలమును తెలుసుకొని ప్రాణాయామమునందు స్థిరముగా నున్న యోగి పదిహేను రోజులలో తనకు సంప్రాప్తమైన మృత్యువును జయించును (3). హృదయమునందు ఉండే ప్రాణవాయువు సర్వదా అగ్నిని ప్రజ్వరిల్లజేయును. అగ్నిని అనుసరించే ఉండే వాయువు లోపల మాత్రమే గాక బయట కూడా వ్యాపించియున్నాడు. ఈ గొప్ప వాయువు సర్వవ్యాపకము (4). సామాన్య జ్ఞానము, విశేషజ్ఞానము మరియు ఉత్సాహము అనే సర్వము వాయువునుండి ఉద్భవించుచున్నవి. ఈ లోకములో వాయువును జయించినవాడు ఈ జగత్తును అంతనూ జయించినవాడే యగును (5). ముసలిదనమును, మరణమును జయించగోరు యోగి సర్వధా ధారణయందు ఉండవలెను. యోగమ చక్కగా ధారణాధ్యానములను శ్రద్ధతో అనుష్ఠించవలెను (6). ఓ మునీ ! కమ్మరివాడు నోటితో తోలుతిత్తిని ఊది గాలితో నింపి ఆ గాలితో పనిని సాధించును. యోగి కూడ ప్రాణాయామమును అదే విధముగా అభ్యాసమును చేయవలెను (7). అనంతములగు శిరస్సులు, నేత్రములు, పాదములు మరియు చేతులు గల పరమేశ్వరుడు జగత్తునంతనూ, మరియు గ్రంథులను ఆవరించి ఆ పైన ఇంకనూ పది అంగుళములు అధికముగా నున్నాడు (8). యోగులు ప్రాణవాయువును స్తంభింపజేసి, మూడు వ్యాహృతులతో మరియు శిరోమంత్రముతో గూడిన గాయత్రిని మూడు సార్లు జపించి, ప్రాణవాయువును నిలిపి ఉంచవలెను. అది ప్రాణాయామమనబడును (9). చంద్రసూర్యాది గ్రహములు మరల మరల ఉదయించి అంతర్ధానమగుచుండును. కానీ ధ్యానపరాయణులగు యోగులకు పునరావృత్తి లేదు (10). ఓ దేవీ ! బ్రాహ్మణుడు దర్భ గడ్డిపై నిలిచిన నీటిని త్రాగుతూ వంద సంవత్సరములు తపస్సును చేసినచో ఎట్టి ఫలమును పొందునో, అట్టి ఫలమును బ్రాహ్మణులు ఒకే ఒక ప్రాణధారణచే పొందెదరు (11).

28 - ఛాయా పురుష వర్ణనము

దేవ్యువాచ ।

దేవదేవ మహాదేవ కథితం కాలవంచనమ్ ।
శబ్దబ్రహ్మ స్వరూపం చ యోగలక్షణ ముత్తమమ్ ॥
కథితం తే సమాసేన చ్ఛాయికం జ్ఞానముత్తమమ్ ।
విస్తరేణ సమాఖ్యాహి యోగినాం హితకామ్యయా ॥

పార్వతీదేవి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! మహాదేవా! నీవు మృత్యువును జయించు విధమును, శబ్దబ్ర్రహ్మస్వరూపమును మరియు ఉత్తమమగు యోగముయొక్క లక్షణమును చెప్పితివి (1). నీవు ఉత్తమమగు ఛాయాపురుషజ్ఞానమును గురించి సంగ్రహముగా ప్రస్తావించితివి. యోగుల హితమును గోరి దానిని వివరముగా చక్కగా చెప్పుము (2).

శంకర ఉవాచ ।

శృణు దేవి ప్రవక్ష్యామి చ్ఛాయాపురుషలక్షణమ్ ।
యజ్ జ్ఞాత్వా పురుషస్సమ్యక్సర్వపాపైః ప్రముచ్యతే ॥
సూర్యం హి పృష్ఠతః కృత్వా సోమం వా వరవర్ణిని ।
శుక్లాంబరధరస్స్రగ్వీ గంధధూపాది వాసితః ॥
సంస్మరేన్మే మహామంత్రం సర్వకామ ఫలప్రదమ్ ।
నవాత్మకం పిండభూతం స్వాం ఛాయాం సంనిరీక్షయేత్ ॥
దృష్ట్వా తాం పునరాకాశే శ్వేతవర్ణ స్వరూపిణీమ్ ।
స పశ్యత్యేకభావస్తు శివం పరమకారణమ్ ॥
బ్రహ్మప్రాప్తిర్భవేత్తస్య కాలవిద్భిరితీరితమ్ ।
బ్రహ్మహత్యాదికైః పాపైర్ముచ్యతే నాత్ర సంశయః ॥
శిరోహీనం యదా పశ్యేత్ షడ్భిర్మా సైర్భవేత్ క్షయః ।
సమస్తం వాఙ్మయం తస్య యోగినస్తు యథా తథా ॥
శుక్లే ధర్మం విజానీయాత్కృష్ణే పాపం వినిర్దిశేత్ ।
రక్తే బంధం విజానీయాత్పీతే విద్విషమాదిశేత్ ॥
విబాహౌ బంధునాశస్స్యాద్వితుండే చైవ క్షుద్భయమ్ ।
వికటౌ నశ్యతే భార్యా విజంఘే ధనమేవ హి ॥
పాదాభావే విదేశస్స్యాదిత్యే తత్కథితం మయా ।
తద్విచార్య ప్రయత్నేన పురుషేణ మహేశ్వరి ॥

సమ్యక్తం పురుషం దృష్ట్వా సన్నివేశ్యాత్మనాత్మని ।

జపేన్నవాత్మకం మంత్రం హృదయం మే మహేశ్వరి ॥

శంకరుడు ఇట్లు పలికెను —

ఓ దేవీ ! ఛాయాపురుషలక్షణమును చెప్పెదను. వినుము. దీనిని బాగుగా తెలుసుకున్న పురుషుడు పాపములన్నింటినుండి విముక్తుడగును (3). ఓ సుందరీ ! సూర్యుడు, లేదా చంద్రుడు వెనుక వైపు ఉండునట్లు కూర్చుండవలెను. వ్యక్తి తెల్లని వస్త్రములను, మాలను ధరించి గంధమును, ఇతరసుగంధద్రవ్యములను పూసుకొనవలెను. ధూపము కూడ ఉండవలెను (4). నాయొక్క తొమ్మిది అంశములు ముద్దగా అయి ఏర్పడిన, కోరికలను అన్నింటినీ తీర్చే నవాత్మకమహామంత్రమును జపిస్తూ తన నీడను నిశితముగా పరిశీలించవలెను (5). ఆ నీడను చూచి మరల ఆకాశములో దానిని తెల్లని మెరిసే రూపములో చూచి సర్వజగత్కారణమగు శివుని ఏకాగ్రమగు మనస్సుతో చూచినచో (6), వానికి మోక్షప్రాప్తి కలుగునని కాలవేత్తలు చెప్పుచున్నారు. ఆతడు బ్రహ్మహత్య మొదలగు పాపములనుండి విముక్తుడగుననుటలో సందేహము లేదు (7), నీడ తలలేని విధముగా కనబడినచో, ఆ యోగియొక్క వాగ్రూపమగు శక్తి అంతయు యథాతథముగా ఆరు మాసములలో వినష్టమగును (8). ఆ ఛాయాపురుషుడు తెల్లగా నున్నచో ధర్మమును, నల్లగా నున్నచో పాపమును, ఎర్రగా నున్నచో బంధమును మరియు పచ్చగా నున్నచో విద్వేషమును నిర్దేశించును (9). ఆ నీడకు చేతులు లేనిచో బంధునాశమును, నోరు లేనిచో ఆకలిభయమును, పృష్ఠభాగము లేనిచో భార్యానాశమును, పిక్కలు లేనిచో ధననాశమును, పాదములు లేనిచో విదేశబహిష్కారమును (ఆస్తి నష్టమును) సూచించును. ఓ మహేశ్వరీ ! నేనీ విషయములను చెప్పితిని. మానవుడు ప్రయత్నపూర్వకముగా ఛాయాపురుషుని పరిశీలించి నిర్ధారించవలెను (10, 11), ఓ మహేశ్వరీ ! ఆ పురుషుని సరిగా దర్శించి మనస్సును ఆత్మయందు లగ్నము చేసి, నా హృదయమనదగిన నవాత్మకమంత్రమును జపించవలెను (12).

వత్సరే విగతే మంత్రి తన్నాస్తి యన్న సాధయేత్ ।

అణిమాది గుణానష్టౌ ఖేచరత్వం ప్రపద్యతే ॥

పునరన్యత్ప్ర వక్ష్యామి శక్తిం జ్ఞాతుం దురాసదమ్ ।

ప్రత్యక్షం దృశ్యతే లోకే జ్ఞానినామగ్రతః స్థితమ్ ॥

అజ్ఞేయా లిఖ్యతే లోకే యా సర్పీకృత కుండలీ ।

సా మాత్రా యానసంస్థాపి దృశ్యతే న చ పర్యతే (?)॥

బ్రహ్మాండమూర్ధ్నిగా యా చ స్తుతా వేదైస్తు నిత్యశః ।

జననీ సర్వవిద్యానాం గుప్తవిద్యేతి గీయతే ॥

ఖేచరా సా వినిర్దిష్టా సర్వప్రాణిషు సంస్థితా ।

దృశ్యాదృశ్యాచలా నిత్యా వ్యక్తావ్యక్తా సనాతనీ ॥

అవర్ణా వర్ణసంయుక్తా ప్రోచ్యతే బిందుమాలినీ ।

తార పశ్యన్ సర్వదా యోగీ కృతకృత్యోఽ భిజాయతే ॥

సర్వతీర్థ కృతస్నానాద్భవేద్దానస్య యత్ఫలమ్ ।

సర్వయజ్ఞఫలం యచ్చ మాలిన్యా దర్శనాత్తదా ॥

ప్రాప్నోత్యత్ర న సందేహస్సత్యం వై కథితం మయా ।

సర్వతీర్థేషు యత్ స్నాత్వా దత్త్వా దానాని సర్వశః ॥

సర్వేషాం దేవి యజ్ఞానాం యత్ఫలం తల్లభేత్పుమాన్।

కిం బహూక్త్యా మహేశాని సర్వాన్ కామాన్ సమశ్నుతే ॥

తస్మాత్ జ్ఞానం యథాయోగమభ్య సేత్సతతం బుధః ।

అభ్యాసాజ్ఞాయతే సిద్ధిర్యోగోఽ భ్యాసాత్ప్రవర్ధతే ॥

సంవిత్తిర్లభ్యతేఽ భ్యాసాదభ్యాసాన్మోక్ష మశ్నుతే ।

అభ్యాసస్సతతం కార్యో ధీమతా మోక్షకారణమ్ ॥

ఇత్యేతత్కథితం దేవి భుక్తిముక్తి ఫలప్రదమ్ ।

కిమన్యత్పృచ్ఛ్యతే తత్త్వం వద సత్యం బ్రవీమి తే ॥

సంవత్సరకాలము ఈ మంత్రమును జపించిన వ్యక్తి సాధించలేనిది ఉండబోదు. అణిమ మొదలగు ఎనిమిది సిద్ధులను మరియు ఆకాశమందు సంచరించే శక్తిని ఆతడు పొందును (13). తెలియుటకు చాల కఠినమైనది, కాని జ్ఞానులకు కరతలామలకము వంటిది అగు మరియొక శక్తిని గురించి చెప్పెదను. ఈ శక్తి లోకములో ప్రత్యక్షముగా కనబడుచున్నది (14). లోకమునందు జనులకు తెలియని ఒక రూపమును లిఖించవలెను. ఆ బొమ్మ చుట్టవలెనున్న పామును బోలియుండును. దానిని వాహనమునందు ఉంచవలెను. అది ఇతరులకు కనబడిననూ, దాని అర్థము వారికి తెలియదు అది ఇతరగ్రంథములలో వర్ణింపబడలేదు(15). ఆ విద్య బ్రహ్మాండములో అన్నింటికంటే గొప్పది. వేదములు ఆ విద్యను నిత్యము స్తుతించుచున్నవి. విద్యలు అన్నింటికీ తల్లి అనదగిన ఆ విద్య గుప్తవిద్య అని కీర్తించబడుచున్నది (16). అది ఖేచరీవిద్య అని నిర్దేశించ బడినది. అది సర్వప్రాణులయందు గలదు. అది కనబడుచున్ననూ కానరాదు. అది చలనము లేనిది, నిత్యము, వ్యక్తము, అవ్యక్తము మరియు సనాతనము (17). అది రంగు కలదియే అయిననూ, రంగు లేనిది. దానికి బిందుమాలిని అని పేరు. సర్వకాలములలో దానిని దర్శించు యోగి కృతార్థుడగును (18). తీర్థములన్నింటిలో స్నానము చేయుట వలన ఏ ఫలము లభించునో, దానము వలన ఏ ఫలము కలుగునో, యజ్ఞములను అన్నింటినీ అనుష్ఠించుట వలన ఏ ఫలము కలుగునో, ఆ ఫలము బిందుమాలినీ దర్శనము వలన కలుగును. దీనిలో సందేహము లేదు. నేను సత్యమును పలుకుచున్నాను. ఓ దేవీ ! తీర్థములన్నింటిలో స్నానము చేసి సర్వదానములను చేసి సర్వయజ్ఞములను చేయుట వలన మానవుడు ఏ ఫలమును పొందునో, దీనివలన మానవుడు ఆ ఫలమును పొందును. ఇన్ని మాటలేల ? ఓ మహేశ్వరీ ! ఆతనికి కోరికలు అన్నియు ఈడేరును (19-21). కావున వివేకి యోగమును మరియు ఈ జ్ఞానమును అభ్యసించవలెను. అభ్యాసము వలన సిద్ధి

కలుగును. అభ్యాసము వలన యోగము వర్ధిల్లును (22), అభ్యాసము వలన సమ్యద్దర్శనము కలుగును. అభ్యాసము వలన మోక్షము లభించును. కావున, వివేకి మోక్షహేతువు అగు అభ్యాసమును సర్వకాలములలో చేయవలెను (23). ఓ దేవీ ! భుక్తిని మరియు ముక్తిని ఇచ్చే ఈ విషయములను నేను నీకు ఈ విధముగా చెప్పితిని. నీవు ఇంకనూ ఏ తత్త్వమును తెలియగోరుచున్నావు ? చెప్పుము. నేను నీకు సత్యమును చెప్పగలను (24).

సూత ఉవాచ।

ఇతి శ్రుత్వా బ్రహ్మపుత్రవచనం పరమార్థదమ్ ।
ప్రసన్నోఽ భూదతి వ్యాసః పారాశర్యో మునీశ్వరాః ॥
సనత్కుమారం సర్వజ్ఞం బ్రహ్మపుత్రం కృపానిధిమ్ ।
వ్యాసః పరమసంతుష్టః ప్రణనామ ముహుర్ముహుః ॥
తతస్తుష్టావ తం వ్యాసః కాలేయస్స మునీశ్వరః ।
సనత్కుమారం మునయస్సుర విజ్ఞానసాగరమ్ ॥

సూతుడిట్లు పలికెను -

ఓ మహర్షులారా ! పరాశరపుత్రుడగు వ్యాసుడు బ్రహ్మపుత్రుడగు సనత్కుమారుని ఈ మోక్షమును ఇచ్చే వచనములను విని మిక్కిలి ప్రసన్నుడాయెను (25), సర్వజ్ఞుడు, బ్రహ్మపుత్రుడు, దయాసముద్రుడు అగు సనత్కుమారునకు పరమసంతోషమును పొందియున్న వ్యాసుడు పలు పర్యాయములు నమస్కరించెను (26). ఓ మహర్షులారా ! ఆ కాలీనందనుడగు వ్యాసమహర్షి తరువాత దేవతావిజ్ఞానమునకు సముద్రము వంటివాడగు సనత్కుమారుని స్తుతించెను (27).

వ్యాస ఉవాచ ।

కృతార్థోఽహం మునిశ్రేష్ఠ బ్రహ్మత్వం మే త్వయా కృతమ్ ।
నమస్తేఽస్తు నమస్తేఽస్తు ధన్యస్త్వం బ్రహ్మవిత్తమః ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ మహర్షి! నీవు నాయందు బ్రహ్మత్వమును కలిగించితివి. నీకు అనేకనమస్కారములు అగుగాక ! బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడవగు నీవు ధన్యుడవు (28).

సూత ఉవాచ ।

ఇతి స్తుత్వా స కాలేయో బ్రహ్మపుత్రం మహామునిమ్ ।
తూష్ణీం బభూవ సుప్రీతః పరమానందనిర్భరః ॥
బ్రహ్మపుత్రస్తమామంత్ర్య పూజితస్తేన శౌనక ।
యయౌ స్వధామ సుప్రీతో వ్యాసోఽపి ప్రీతమానసః ॥
ఇతి మే వర్ణితో విప్రాః సుఖదః పరమార్థయుక్ ।
సనత్కుమారకాలేయ సంవాదో జ్ఞానవర్ధనః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం ఛాయాపురుషవర్ణనం నామ అష్టావింశోఽధ్యాయః ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఆ కాలీనందనుడగు వ్యాసుడు ఈ విధముగా బ్రహ్మపుత్రుడు, మహర్షి యగు సనత్కుమా ారుని స్తుతించి మిక్కిలి ప్రీతిని పొందినవాడై పరమానందముతో నిండిపోయిన మనస్సు గల వాడై మిన్నకుండెను (29). ఓ శౌనకా ! బ్రహ్మపుత్రుడగు సనత్కుమారుడు ఆ వ్యాసునిచే పూజింపబడినవాడై ఆతని వద్ద సెలవు తీసుకొని తన స్థానమునకు వెళ్లెను. వ్యాసుడు కూడ గొప్ప ప్రీతితో నిండిన మనస్సు గలవాడై తన స్థానమునకు వెళ్లెను (30). ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా పరమపురుషార్థముగ మోక్షమునిచ్చే జ్ఞానమును పెంపొందింపజేసే సనత్కుమార వ్యాససం వాద మును నేను వర్ణించితిని (31).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ఛాయాపురుషవర్ణనమనే ఇరువది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (28).

29 - ఆది సృష్టి వర్ణనము

శౌనక ఉవాచ ।

శ్రుతం మే మహదాఖ్యానం యత్త్వయా పరికీర్తితమ్ ।
సనత్కుమారకాలేయ సంవాదం పరమార్థదమ్ ॥
అతోఽ హం శ్రోతుమిచ్ఛామి యథా సర్గస్తు బ్రహ్మణః ।
సముత్పన్నం తు మే బ్రూహి యథా వ్యాసాచ్చ తే శ్రుతమ్ ॥

శౌనకుడు ఇట్లు పలికెను -

సనత్కుమారవ్యాససంవాదము పరమపురుషార్థమగు మోక్షమునిచ్చే గొప్ప గాథ. దానిని నీవు ు కీర్తించగా నేను వింటిని (1). బ్రహ్మనుండి ఈ సృష్టి ఉద్భవించిన తీరును నేను ఈ పైన ,విన గోరుచున్నాను. నీవు ఆ విషయమును వ్యాసునినుండి వినియుంటివి. దానిని నాకు చెప్పుము (2).

సూత ఉవాచ ।

మునే శృణు కథాం దివ్యాం సర్వపాప ప్రణాశినీమ్ ।
కథ్యమానాం మయా చిత్రం బహ్వర్థాం శ్రుతివిస్తరామ్ ॥
యశ్చైనాం పాఠయేత్తాం చ శృణుయాద్వాఽప్యభీక్ ష్ణశః ।
స్వవంశధారణం కృత్వా స్వర్గలోకే మహీయతే ॥
ప్రధానం పురుషో యత్తన్నిత్యం సదసదాత్మకమ్ ।
ప్రధానపురుషో భూత్వా నిర్మమే లోకభావనః ॥
స్రష్టారం సర్వభూతానాం నారాయణ పరాయణమ్ ।
తం వై విద్ధి మునిశ్రేష్ఠ బ్రహ్మాణమమి తౌజసమ్ ॥
యస్మాదకల్పయత్కల్పాన్ సమగ్రాశ్చుచయో యతః ।
భవంతి మునిశార్దూల నమస్తస్మై స్వయంభువే ॥
తస్మై హిరణ్యగర్భాయ పురుషాయేశ్వరాయ చ ।
నమస్కృత్య ప్రవక్ష్యామి భూయస్సర్గ మనుత్తమమ్ ॥
బ్రహ్మా స్రష్టా హరిః పాతా సంహర్తా చ మహేశ్వరః ।
తస్య సర్గస్య నాన్యోఽస్తి కాలే కాలే తథా గతే ॥
సోఽపి స్వయంభూర్భగవాన్ సిసృక్షుర్వివిధాః ప్రజాః ।
అప ఏవ ససర్జాదౌ తాసు వీర్యమవాసృజత్ ॥
ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః ॥
హిరణ్యవర్ణమభవత్త దండముద కేశయమ్ ।
తత్ర జజ్ఞే స్వయం బ్రహ్మా స్వయంభూరితి విశ్రుతః ॥

హిరణ్య గర్భో భగవానుషిత్వా పరివత్సరమ్ ।
తదండమకరోద్ద్వైధం దివం భూమిం చ నిర్మమే ॥
అధోఽథోర్ధ్వం ప్రయుక్తాని భువనాని చతుర్దశ।
తయోశ్శకలయోర్మధ్య ఆకాశమసృజత్ప్రభుః ॥
అప్పు పారిప్లవాం పృథ్వీం దిశశ్చ దశధా భువి ।
తత్ర కాలే మనో వాచం కామక్రోధావథో రతిమ్ ॥
మరీచిమత్ర్యంగిరసౌ పులస్త్యం పులహం క్రతుమ్ ।
వసిష్ఠం తు మహాతేజాస్సోఽ సృజత్సప్త మానసాన్ ॥

సూతుడు ఇట్లు పలికెను –

ఓ మునీ ! సకలపాపములను పోగొట్టునది, చిత్రమైనది, గంభీరమగు అర్థము గలది, ప్రఖ్యాతిని గాంచిన విశేషములు గలది అగు దివ్యగాథను నేను చెప్పుచున్నాను. నీవు వినుము (3). ఎవడైతే ఈ కథను పఠింపజేయునో, లేదా పలుమార్లు వినునో, వాడు తన వంశమును నిలబెట్టుకొని స్వర్గలోకములో మహిమను గాంచును (4). ఏది ప్రధానమో అదియే పురుషుడు. అదియే. నిత్యము, ప్రధానము కార్య కారణరూపముగా నుండును. ఓ మహర్షీ! లోకములను నిర్మించిన పరమేశ్వరుడు జడప్రకృతిగను, మరియు చేతనపురుషుడుగను తానే అయి, సర్వభూతములను సృష్టించినవాడు, నారాయణుని శరణు జొచ్చినవాడు, సాటిలేని తేజస్సు గలవాడు అగు ఆ బ్రహ్మను సృష్టించినాడని తెలుసుకొనుము (5, 6). ఎవనినుండి బ్రహ్మగారు కల్పములను సృష్టించెనో, సర్వప్రాణులు ఎవనినుండి ఉద్భవించుచున్నవో, ఎవడు స్వతంత్రమగు సత్త గలవాడో, అట్టి పరమేశ్వరునకు నమస్కారము (7). చేతనపరంబ్రహ్మకు, మాయోపాధికుడగు ఈశ్వరునకు మరియు ప్రథమజీవుడగు హిరణ్యగర్భునకు నమస్కరించి నేను సర్వశ్రేష్ఠమగు సృష్టిని గురించి మరల చెప్పగలను (8). సృష్టిని చేయువాడు బ్రహ్మ అనియు, పాలించువాడు హరి అనియు, సంహరించువాడు మహేశ్వరుడనీయు అనబడును. కాలము ఉండే స్థితియందు, కాలము తొలగిపోయే ప్రళయమునందు ఈ సృష్టికి మూలము మరియొకరు లేరు (9), స్వయముగా ప్రకటమైన పూజ్యుడగు ఆ హిరణ్యగర్భుడు వివిధప్రాణులను సృష్టించగోరి మున్ముందు నీటిని మాత్రమే సృష్టించి వాటియందు తన శక్తిని నింపెను (10). జలములకు నారములు అని పేరు. జలములు నరుని (పరమేశ్వరుని) సృష్టి. పూర్వము ఆయన వాటియందు నివసించుటచే, ఆయనకు నారాయణుడని పేరు వచ్చినది (11). జలములో నిక్షిప్తము చేయబడిన ఆ తేజస్సు బంగరు వర్ణము గల (తేజోమయమైన) అండము ఆయెను. దానియందు స్వయముగా బ్రహ్మ పుట్టి స్వయంభువుడు అని ప్రఖ్యాతిని గాంచెను (12). ఆ హిరణ్యగర్భ బ్రహ్మ భగవానుడు అచటనే సంవత్సరకాలము నివసించి ఆ అండమును రెండుగా చేసి స్వర్గమును మరియు భూలోకమును నిర్మించెను (13). క్రింద పైన కలిపి పదునాలుగు లో కములు ప్రవర్తిల్లినవి. సర్వసమర్థుడగు బ్రహ్మ ఆ రెండు ముక్కల మధ్యలో ఆకాశమును సృష్టించెను (14). అచట కాలక్రమములో నీటియందు తేలియాడే భూమిని, ఆకాశమునందు పది దిక్కులను, మనస్సును, వాక్కును, కామక్రోధములను మరియు సుఖానుభవమును

సృష్టించెను (15). గొప్ప తేజశ్శాలియగు ఆ బ్రహ్మ మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు అనే ఏడుగురు మానసపుత్రులను సృష్టించెను (16).

సప్త బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ।
తతోఽసృజత్పునర్బ్రహ్మా రుద్రాన్ క్రోధసముద్భవాన్ ॥
సనత్కుమారం చ ఋషిం సర్వేషామపి పూర్వజమ్ ।
సప్త చైతే ప్రజాయంతే పశ్చాద్రుద్రాశ్చ సర్వతః ॥
అతస్సనత్కుమారస్తు తేజస్సంక్షిప్య తిష్ఠతి ।
తేషాం సప్త మహావంశా దివ్యా దేవర్షి పూజితాః ॥
ప్రజాయంతే క్రియావంతో మహర్షిభిరలం కృతాః ।
విద్యుతోఽశనిమేఘాంశ్చ రోహితేంద్రధనూంషి చ ॥
పయాంసి చ ససర్జాదౌ పర్జన్యం చ ససర్జ హ ।
ఋచో యజూంషి సామాని నిర్మమే యజ్ఞసిద్ధయే ॥
పూజ్యాంస్తై రజయస్దేవానిత్యేవమనుశుశ్రుమ ।
ముఖాద్దేవాన జనయత్పిత్సృంశ్చైవాథ వక్షసః ।
ప్రజనాచ్చ మనుష్యాన్వై జఘనాన్నిర్మమేఽసురాన్ ॥
ఉచ్చావచాని భూతాని గాత్రేభ్యస్తస్య జజ్ఞిరే ।
ఆపవస్య ప్రజాస్సర్గం సృజతో హి ప్రజాపతేః ॥
సృజ్యమానాః ప్రజాశ్చైవ నావర్ధంత యదా తదా ।
ద్విధా కృత్వాత్మనో దేహం స్త్రీ చైవ పురుషోఽభవత్ ॥
ససృజేఽథ ప్రజాస్సర్వా మహిమ్నా వ్యాప్య విశ్వతః ।
విరాజమసృజద్విష్ణుస్సు సృష్టః పురుషో విరాట్ ॥
ద్వితీయం తం మనుం విద్ధి మనోరంతరమేవ చ।
స వైరాజః ప్రజాస్సర్వాస్ససర్జ పురుషః ప్రభుః ॥
నారాయణ విసర్గస్య ప్రజాస్తస్యాప్యయోనిజః ।
ఆయుష్మాన్ కీర్తిమాన్ ధన్యః ప్రజావాంశ్చా భవత్తతః ॥
ఇత్యేవమా దిసర్గస్తే వర్ణితో మునిసత్తమ ।
ఆదిసర్గం విదిత్వైవం యథేష్టాం ప్రాప్నుయాద్గతిమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం ఆదిసర్గవర్ణనం నామ
ఏకోనత్రింశోఽధ్యాయః॥

వీరు పురాణములో సప్త బ్రహ్మలు అని ప్రఖ్యాతిని పొందినారు. తరువాత బ్రహ్మ కో◌ోపమునుండి ఉదయించే రుద్రులను సృష్టించెను (17). బ్రహ్మ అందరికంటే ముందుగా సనత్కుమారమహర్షిని సృష్టించెను. తరువాతనే సప్తర్షులు, రుద్రులు మరియు సర్వము సృష్టించబడెను (18). ఇందువలననే, సనత్కుమారుడు తన తేజస్సును కుదించుకుని యుండును. ఆ ఏడుగురు ఋషులకు ప్రకాశవంతములు, దేవతలచే మరియు ఋషులచే అలంకరింపబడినవి అగు ఏడు వంశములు ఉదయించెను. తరువాత ఆయన ముందుగా మెరుపులను, పిడుగులను, మేఘములను, సంధ్యను, ఇంద్రధనస్సును, జలములను సృష్టించి, యజ్ఞములు సిద్ధించుట కొరకై ఋగ్వేద, యజుర్వేద, సామవేదములను నిర్మించెను (19-21). మానవులు ఆ ఋగ్యజుస్సామ వేదముల ద్వారా పూజ్యులగు దేవతల నారాధించినారని వేదమంత్రములలో వినుచున్నాము. ఆయన ముఖమునుండి దేవతలను, వక్షఃస్థలమునుండి పితృదేవతలను, సంతానప్రక్రియచే మానవులను, పొత్తి కడుపు భాగమునుండి రాక్షసులను నిర్మించెను (22). జలములనుండి పుట్టి ప్రజాపతియై ప్రజలను సృష్టించిన బ్రహ్మయొక్క అవయవములనుండి చిన్న-పెద్ద ప్రాణులు పుట్టినవి (23). ఈ విధముగా సృష్టించబడిన ప్రాణులు ఎప్పుడైతే వర్ధిల్లలేదో, అప్పుడు ఆయన తన దేహమును రెండుగా చేసి స్త్రీ మరియు పురుషుడు అయెను (24). తరువాత ఆయన విశ్వమును వ్యాపించి సమస్త ప్రాణులను సృష్టించెను. విష్ణువు విరాటను సృష్టించెను. ఆ విధముగా సృష్టించబడిన ఆ విరాట్పురుషుడే రెండవ మనువు అని తెలియుము. ఆయననుండియే మన్వంతరము ఏర్పడినది. సర్వసమర్థుడగు ఆ విరాట్పురుషుడు సకల ప్రజలను సృష్టించెను (25, 26). నారాయణుని విశేషసృష్టి యగు ఆ మనువునకు కూడ సంతానము కలిగిరి. అయోనిజుడు, ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు మరియు ధన్యుడు అగు ప్రజాపతి ఆయననుండి ఉదయించెను (27). ఓ మహర్షీ! ఈ విధముగా నేను నీకు ఆదిసృష్టిని వర్ణించితిని. ఈ విధముగా ఆదిసృష్టిని తెలుసుకున్న వ్యక్తి తనకు అభీష్టమైన పుణ్య గతిని పొందును (28).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ఆదిసర్గవర్ణనమనే ఇరువది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది. (29).

30 – దక్షుని సృష్టి

సూత ఉవాచ।

సంసృష్టాసు ప్రజాస్వేవం ఆపవోఽథ ప్రజాపతిః ।
లేభే వై పురుషః పత్నీం శతరూపామయోనిజామ్ ॥
ఆపవస్య మహిమ్నా తు దివమావృత్య తిష్ఠతః ।
ధర్మేణైవ మహాత్మా స శతరూపాప్య జాయత ॥
సా తు వర్షశతం తప్త్వా తపః పరమదుశ్చరమ్ ।
భర్తారం దీప్తతపసం పురుషం ప్రత్యపద్యత ॥
స వై స్వాయంభువో జజ్ఞే పురుషో మనురుచ్యతే ।
తస్యైక సప్తతియుగం మన్వంతర మిహోచ్యతే ॥
వైరాజాత్పురుషాద్వీరా శతరూపా వ్యజాయత ।
ప్రియవ్రతోత్తానపాదౌ వీరకార్యా వజాయతామ్ ॥
కామ్యా నామ మహాభాగా కర్దమస్య ప్రజాపతేః ।
కామ్యాపుత్రాస్త్ర యస్యాసన్ సమ్రాట్ సాక్షిరవిట్ ప్రభుః ॥
ఉత్తానపాదోఽ జనయత్పుత్రాన్ శక్రసమాన్ ప్రభుః ।
ధ్రువం చ తనయం దివ్యమాత్మానంద సువర్చసమ్ ॥
ధర్మస్య కన్యా సుశ్రోణీ సునీతిర్నామ విశ్రుతా ।
ఉత్పన్నా చాపి ధర్మేణ ధ్రువస్య జననీ తథా ॥
ధ్రువో వర్షసహస్రాణి త్రీణి దివ్యాని కాననే ।
తపస్తేపే స బాలస్తు ప్రార్థయన్ స్థానమవ్యయమ్ ॥
తస్మై బ్రహ్మ దదౌ ప్రీతః స్థానమాత్మసమం ప్రభుః ।
అచలం చైవ పురతస్సప్తర్షీణాం ప్రజాపతిః ॥

సూతుడు ఇట్లు పలికెను –

ప్రజలు ఈ విధముగా సృష్టించబడిన తరువాత చేతనస్వరూపుడగు ఆపవ ప్రజాపతి అయోనిజయగు శతరూపను భార్యగా పొందెను (1). మహాత్ముడగు ఆపవ ప్రజాపతి తన మహిమచే ద్యులోకమును వ్యాపించి యున్నవాడై తానే చేతన ధర్మముగల శతరూపగా అయినాడు (2). ఆమె వంద సంవత్సరములు మిక్కిలి కఠినమైన తపస్సును చేసి తపస్సుచే ప్రకాశించే పురుషుని భర్తగా పొందెను (3). ఆ పురుషుడే స్వాయంభువ మనువు రూపములో జన్మించెను. ఆ మనువు లోకములను డెబ్బది ఒక్క యుగముల కాలము పాలించెను. ఆ కాలమునకే మన్వంతరమని పేరు (4). విద్వాంసురాలగు శతరూపకు స్వాయంభువ మనువువలన వీరపురుషులగు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు కలిగిరి (5). మహానుభావురాలు అగు కామ్య కర్దమ ప్రజాపతికి భార్య ఆయెను. కామ్యకు సమ్రాట్, సాక్షి, అవీట్ ప్రభుడు అనే ముగ్గురు కుమారులు

కలిగిరి (6). ఉత్తానపాదమహా రాజు ఇంద్రునితో సమానమైన పుత్రులను కనెను. ఆత్మానందముతో మరియు తేజస్సుతో ప్రకాశించే ధ్రువుడు కూడ ఆయన పుత్రుడే (7). ధర్మప్రజాపతికి సుందరి, ధర్మాత్మురాలు, సునీతి అని ప్రఖ్యాతిని గాంచినది అగు కుమార్తె కలిగెను. ఆమెయే ధ్రువుని తల్లి (8), ఆ ధ్రువుడు బాలుడుగా నుండగనే వినాశము లేని స్థానమును గోరి అడవిలో మూడు వేల దివ్యసంవత్సరములు తపస్సును చేసెను (9). సర్వసమర్థుడు, లోకకర్త అగు బ్రహ్మ సంతసించినవాడై ఆయనకు తన స్థానముతో సమానమైనది, వినాశము లేనిది అగు స్థానమును సప్తర్షులకు ఎదురుగా ఇచ్చెను (10).

తస్మాత్పుష్టిశ్చ ధాన్యశ్చ ధ్రువాత్పుత్రౌ వ్యజాయతామ్ ।
పుష్టిరేవం సముత్థాయాః పంచ పుత్రానకల్మషాన్ ॥
రిపుం రిపుంజయం విప్రం వృకలం వృషతేజసమ్ ।
రిపోరేవం చ మహిషీ చాక్షుషం సర్వతోదిశమ్ ॥
అజీజనత్పుష్కరిణ్యాం వరుణం చాక్షుషో మనుః ।
మనోరజాయంత దశ నడ్వలాయాం మహౌజసః ॥
కన్యాయాం హి మునిశ్రేష్ఠ వైశ్య జన్మ ప్రజాపతేః ।
పురుర్మాసశ్శతద్యుమ్నస్తపస్వీ సత్యవిత్కవిః ॥
అగ్నిష్టోమో౾తిరా త్రిశ్చాతిమన్యుస్సుయశా దశ ।
పూరో రజనయత్పుత్రాన్ షడాగ్నేయీ మహాప్రభాన్ ॥
అంగం సుమనసం ఖ్యాతిం సృతిమంగిరసం గయమ్ ।
అంగాత్సునీతా భార్యా వై వేనమేకమ సూయత ॥
అపచారేణ వేనస్య కోపస్తేషాం మహానభూత్ ।
హుంకారేణైవ తం జఘ్నుర్మునయో ధర్మతత్పరాః ।
అథ ప్రజార్థమృషయః ప్రార్థితాశ్చ సునీథయా ।
సారస్వతాస్తదా తస్య మమంథుర్దక్షిణం కరమ్ ॥
వేనస్య పాణౌ మథితే సంబభూవ తతః పృథుః ।
స ధన్వీ కవచీ జాతస్తేజసాదిత్య సన్నిభః ॥
అవతారస్స విష్ణోర్హి ప్రజాపాలన హేతవే ।
ధర్మసంరక్షణార్థాయ దుష్టానాం దండహేతవే ॥

ఆ ధ్రువునకు పుష్టి, ధాన్యుడు అనే పుత్రులు కలిగిరి. పుష్టికి సముళ్ల అను భార్య గలదు. ఆమె అయిదుగురు పవిత్రులగు పుత్రులను కనెను (11). రిపుడు, రిపుంజయుడు, విప్రుడు, వృకలుడు మరియు వృషతేజసుడు అనునవి వారి పేర్లు. రిపుని భార్య సర్వదిక్కులకు ప్రభువు అగు చాక్షుషమనువును పుత్రునిగా పొందెను (12), చాక్షుషమనువునకు పుష్కరిణి అను భార్యయందు వరుణుడు పుట్టెను. ఆ మనువునకు నడ్వల అను భార్యయందు గొప్ప తేజశ్శాలురగు పదిమంది పుత్రులు కలిగిరి (13). ఓ మహర్షీ! నడ్వల వైశ్యకులములో జన్మించిన ప్రజాపతి (లేదా వైశ్యజన్మ ప్రజాపతి) యొక్క కుమార్తె. పురువు, మాసుడు, శతద్యుమ్నుడు, తపస్వి,

సత్యవిత్, కవి (14), అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, అతిమన్యుడు, సుయశస్సు అనునవి ఆ పదిమంది పేర్లు. పురువునకు ఆగ్నేయియందు గొప్ప తేజస్సు గల ఆర్గురు పుత్రులు కలిగిరి (15). అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, స్మృతి, అంగిరసుడు, గయుడు అనునవి వారి పేర్లు. అంగునకు సునీథ అనే భార్యయందు వేనుడు అనే ఒక పుత్రుడు కలిగెను (16). వేనుడు చేసిన అపరాధముచే ధర్మనిష్ఠులగు మునులు గొప్ప కోపమును పొందినవారై హుంకారముచే ఆతనిని సంహరించిరి (17). తరువాత సునీథ సారస్వతమహర్షులను సంతానము కొరకు ప్రార్థించగా, అపుడు వారు వేనుని కుడి చేతిని మథించిరి (18), వేనుని చేతిని మథించగా దానినుండి ధనస్సును కవచమును ధరించి తేజస్సులో సూర్యుని పోలియున్న పృథువు పుట్టెను (19), విష్ణువు ధర్మమును సంరక్షించి దుష్టులను శిక్షించి ప్రజలను పాలించుట కొరకై ఆ విధముగా అవతరించెను(20).

పృథుర్వైన్యస్తదా పృథ్వీమరక్షత్ క్షత్రపూర్వజః ।
రాజసూయాభిషిక్తానామాద్యస్స వసుధాపతిః ॥
తస్మాచ్చైవ సముత్పన్నౌ నిపుణౌ సూతమాగధౌ ।
తేనేయం గౌర్మునిశ్రేష్ఠ దుగ్ధా సర్వహితాయ వై ॥
సర్వేషాం వృత్తిదశ్చాభూద్దేవర్షిసుర రక్షసామ్ ।
మనుష్యాణాం విశేషేణ శతయజ్ఞకరో నృపః ॥
పృథోః పుత్రౌ తు జజ్ఞాతే ధర్మజ్ఞౌ భువి పార్థివౌ।
విజితాశ్వశ్చ హర్యక్షో మహావీరౌ సువిశ్రుతౌ ॥
శిఖండినీ చాజనయత్పుత్రం ప్రాచీన బర్హిషమ్ ।
ప్రాచీనగ్రాః కుశాస్తస్య పృథివీతల చారిణః ॥
సముద్రతనయా తేన ధర్మతస్సు వివాహితా ।
రేజేఽధికతరం రాజా కృతధారో మహాప్రభుః ॥
సముద్రతనయాయాస్తు దశ ప్రాచీన బర్హిషః ।
బభూవుస్తనయా దివ్యా బహుయజ్ఞకరస్య వై ॥
సర్వే ప్రాచేతసా నామ్నా ధనుర్వేదస్య పారగాః ।
అపృథగ్ధర్మా చరణాస్తేఽ తప్యంత మహత్తపః ॥
దశవర్ష సహస్రాణి సముద్రసలిలేశయాః ।
రుద్రగీతం జపంతశ్చ శివధ్యాన పరాయణాః ॥
తపశ్చరత్సు పృథివ్యామభవంశ్చ మహీరుహాః ।
అరక్ష్యమాణాయాం వృథ్వ్యాం బభూవాథ ప్రజాక్షయః ॥
తాన్ దృష్ట్వా తు నివృత్తాస్తే తపసో లబ్ధసద్వరాః ।
చక్రుర్దుర్మునిశార్దూల దగ్ధుకామాస్తపోబలాః ॥
ప్రాచేతసా ముఖేభ్యస్తే ప్రాసృజన్నగ్నిమారుతౌ ।
వృక్షానున్మూల్య వాయుస్తానదహద్ధవ్య వాహనః ॥

వృక్షక్షయం తతో దృష్ట్వా కించిచ్ఛేషేషు శాఖిషు ।

ఉపాగమ్యా బ్రవీదేతాన్ రాజా సోమః ప్రతాపవాన్ ॥

వేనుని కుమారుడు, క్షత్రియులకు మూలపురుషుడు, రాజసూయయాగములో అభిషిక్తులైన మహారాజులలో మొదటివాడు అగు ఆ పృథుమహారాజు అపుడు భూమిని రక్షించెను (21). సమర్థులగు సూతమాగధులు ఆయన పుత్రులే. ఓ మహర్షీ! ఆయన సర్వప్రాణుల హితమును గోరి గోరూపములోనున్న ఈ భూమిని వెతికినాడు (22). వంద యజ్ఞములను చేసిన ఆ రాజు దేవర్షులకు, దేవతలకు, రాక్షసులకు, విశేషించి మానవులకు వృత్తిని కల్పించెను (23). పృథువునకు విజితాశ్వుడు, హర్యక్షుడు అనే ఇద్దరు మహావీరులు, గొప్ప కీర్తి గలవారు, ధర్మవేత్తలు అగు పుత్రులు ఉదయించి భూమిని పాలించిరి (24). శిఖండిని అనునామె ప్రాచీనబర్హిషుడు అనే పుత్రునకు జన్మనిచ్చెను. ఆయన భూమియందు సంచరించుచుండగా దర్భల కొనలు తూర్పు వైపునకు ఉండెడివి (25). ఆయన సముద్రుని కుమార్తెను యథాశాస్త్రముగా వివాహమాడెను. గొప్ప సమర్థుడగు ఆ రాజు భార్యతో గూడి మిక్కుటముగా ప్రకాశించెను (26). అనేకయజ్ఞములను చేసిన ప్రాచీనబర్హిషునకు ఆ సముద్రుని కుమార్తె యందు పదిమంది తేజశ్శాలురగు పుత్రులు కలిగిరి (27). వారందరికీ ప్రాచేతసులు అని పేరు. ధనుర్వేదమునందు సిద్ధహస్తులగు ఆ ప్రాచేతసులు కలిసి ధర్మమును ఆచరిస్తూ గొప్ప తపస్సును చేసిరి (28). వారు సముద్రజలములలో నివసిస్తూ రుద్రగీతమును జపిస్తూ నిరంతరముగా శివుని ధ్యానించిరి (29). వారు తపస్సును చేయుచుండగా భూమిపై చెట్లు మొలిచినవి. భూమికి రక్షణ లేకపోవుటచే ప్రజానాశము సంభవించెను (30). ఓ మహర్షీ! గొప్ప వరములను పొంది తపస్సునుండి మరలి వచ్చిన ఆ రాజపుత్రులు చెట్లను చూచి కోపించి తపోబలముచే వాటిని దహించ నిశ్చయించిరి (31). ఆ ప్రాచేతసులు తమ నోళ్ల నుండి అగ్నిని, వాయువును సృష్టించిరి. వాయువు చెట్లను పెకిలించి వేయగా, అగ్ని వాటిని దహించెను (32). ఈ విధముగా చెట్లు నాశనమై కొద్ది చెట్లు మాత్రమే మిగిలి యుండుటను గాంచి చెట్టుచేమలకు రాజు, ప్రతాపము గలవాడు అగు చంద్రుడు వారిని సమీపించి ఇట్లనెను (33).

సోమ ఉవాచ ।

కోపం యచ్ఛత రాజానస్సర్వే ప్రాచీనబర్హిషః ।

అనుభూతానుకన్యేయం వృక్షాణాం వరవర్ణినీ ॥

భవిష్యం జానతా సా తు ధృతా గర్భేణ వై మయా ।

భార్యా వోఽస్తు మహాభాగాస్సోమ వంశవివర్ధినీ ॥

అస్యాముత్పత్స్యతే విద్వాన్ దక్షో నామ ప్రజాపతిః ।

సృష్టికర్త మహాతేజా బ్రహ్మపుత్రః పురాతనః ॥

యుష్మాకం తేజసార్ధేన మమ చానేన తేజసా ।

బ్రహ్మతేజోమయో భూపః ప్రజా స్సంవర్ధయిష్యతి ॥

తతస్సోమస్య వచనాజ్జగృహుస్తే ప్రచేతసః ।

భార్యాం ధర్మేణ తాం ప్రీత్యాం వృక్షజాం వరవర్ణినీమ్ ॥

తేభ్యస్తస్యాస్తు సంజజ్ఞే దక్షో నామ ప్రజాపతిః ।

సోఽపి జజ్ఞే మహాతేజాస్సోమస్యాంశేన వై మునే ॥

అచరాంశ్చ చరాంశ్చైవ ద్విపదోఽథ చతుష్పదః ।

సంసృజ్య మనసా దక్షో మైథునీం సృష్టిమారభేత్ ॥

వీరణస్య సుతాం నామ్నా వీరణీం స ప్రజాపతిః ।

ఉపయేమే సువిధినా సుధర్మేణ పతివ్రతామ్ ॥

హర్యశ్వానయుతం తస్యాం సుతాన్ పుణ్యానజీజనత్ ।

తే విరక్తా బభూవుశ్చ నారదస్యోప దేశతః ॥

తచ్ఛ్రుత్వా స పునర్దక్షస్సు బలాశ్వానజీజనత్ ।

నామతస్తనయాంస్తస్యాం సహస్ర పరిసంఖ్యయా ॥

తేఽపి భ్రాతృపథా యాతాస్తన్మునేరు పదేశతః ।

నాగమన్ పితృసాన్నిధ్యం విరక్త భిక్షుమార్గిణః ॥

సోముడు ఇట్లు పలికెను –

ప్రాచీన బర్హిషుని పుత్రులగు ఓ మహారాజులారా ! మీరందరు కోపమును విడిచిపెట్టుడు. ఈ సుందరి వృక్షముల కుమార్తె. ఈమె పేరు అనుభూత (?) (34). భవిష్యత్తు తెలిసిన నేను ఈమెను భద్రముగా రక్షించితిని. ఓ మహాత్ములారా ! ఈమె మీకు భార్యయై సోమవంశమును వర్ధిల్లజేయు గాక ! (35) విద్వాంసుడు, సృష్టికర్త, గొప్ప తేజశ్శాలి, బ్రహ్మపుత్రుడు మరియు ప్రాచీనుడు అగు దక్షప్రజాపతి ఈమెయందు జన్మించగలడు (36). మీ తేజస్సుల సగమును, నా ఈ తేజస్సును మరియు బ్రహ్మయొక్క తేజస్సును పొందినవాడై ఈ రోజు ప్రజలను వృద్ధిలోనికి తేగలడు (37). తరువాత సోముని వచనముచే ఆ ప్రచేతసులు వృక్షముల కుమార్తెయగు ఆ సుందరిని యథావిధిగా ప్రేమతో వివాహమాడిరి (38). వారికి ఆమెయందు దక్ష ప్రజాపతి పుట్టెను. ఓ మునీ ! గొప్ప తేజశ్శాలియగు ఆ శిశువు సోముని అంశచే జన్మించెను (39). దక్షుడు మనస్సుచే కదలని ప్రాణులను, కదిలే ప్రాణులను, రెండు పాదములు గల ప్రాణులను, నాలుగు పాదముల ప్రాణులను సృష్టించి, తరువాత మైథునసృష్టిని ఆరంభించెను (40). ఆ ప్రజాపతి వీరణునీ కుమార్తె మరియు పతివ్రత అగు వీరణిని యథావిధిగా చక్కని ధర్మమునననుసరించి వివాహమాడెను (41). ఆయనకు ఆమెయందు పదివేలమంది హర్యశ్వులనే పుణ్యాత్ములైన కుమారులు కలిగిరి. వారు నారదుని ఉపదేశము వలన విరక్తులైరి (42). ఆ విషయమును విని దక్షుడు మరల ఆమెయందు సుబలాశ్వులనబడే వేయిమంది కుమారులను గనేను (43). వారు కూడ ఆ నారదమునియొక్క ఉపదేశముచే సోదరులు వెళ్లిన దారియందే పయనించి విరక్తులై భిక్షాటనముతో జీవించిరి. వారు తిరిగి తండ్రి వద్దకు రాలేదు (44).

తచ్ఛ్రుత్వా శాపమాక్రుద్ధో మునయే దుస్సహం దదౌ ।

కుత్రచిన్న లభస్వేతి సంస్థితం కలహప్రియ ॥

సాంత్వితోఽథ విధాత్రా హి స పశ్చాదసృజత్ స్త్రియః ।

మహాజ్వాలా స్వరూపేణ గుణైశ్చాపి మునీశ్వర ॥

దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।

ద్వే చైవం బ్రహ్మపుత్రాయ ద్వే చైవాంగిరసే తదా ॥

ద్వే కృశాశ్వాయ విదుషే మునయే మునిసత్తమ ।

శిష్టాస్సోమాయ దక్షోఽపి నక్షత్రాఖ్యా దదౌ ప్రభుః ॥

తాభ్యో దక్షస్య పుత్రీభ్యో జాతా దేవాసురాదయః ।

బహవస్తనయాః ఖ్యాతాస్తైస్సర్వైః పూరితం జగత్ ॥

తతః ప్రభృతి విప్రేంద్ర ప్రజా మైథునసంభవాః ।

సంకల్పాద్దర్శనాత్ స్పర్శాత్పూర్వేషాం సృష్టిరుచ్యతే ॥

ఆ విషయమును విని ఆయన కోపించి 'ఓరీ కలహప్రియా ! నీకు ఎక్కడనైననూ స్థిరముగా నుండే అవకాశము లభించ కుండుగాక !' అనీ నారదునకు సహింప శక్యము గాని శాపమునిచ్చెను (45). ఓ మహర్షీ! అపుడు ఆయనను బ్రహ్మ ఓదార్చెను. తరువాత దక్షుడు గుణవతులు, గొప్ప అగ్నిజ్వాలల రూపములో నున్నవారు అగు కుమార్తెలను కనెను (46). ఓ మహర్షీ! సమర్థుడగు ఆ దక్షుడు పదిమందిని ధర్మునకు, పదముగ్గురిని కశ్యపునకు, ఇద్దరిని బ్రహ్మపుత్రునకు, ఇద్దరిని అంగిరసునకు, ఇద్దరిని విద్వాంసుడు మహర్షి అగు కృశాశ్వునకు, మిగిలిన నక్షత్రములు అనబడే అమ్మాయిలను సోమునకు ఇచ్చి వివాహములను చేసెను (47, 48). ఆ దక్షుని కుమార్తెలకు దేవతలు, రాక్షసులు మొదలగు అనేకులగు విఖ్యాతులైన పుత్రులు కలిగిరి. జగత్తు వారందరిచే నిండి పోయెను (49). ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! అప్పటినుండియు ప్రజలయొక్క మైథునసృష్టి ఆరంభమాయెను. అంతకు పూర్వములో సంకల్పము వలన, దర్శనము వలన, మరియు స్పర్శ వలన సంతానము కలిగెడిది (50).

శౌనక ఉవాచ ।

అంగుష్ఠాద్బ్రహ్మణో జజ్ఞే దక్షశ్చోక్తస్త్వయా పురా ।

కథం ప్రాచేతసత్వం హి పునర్లేభే మహాతపాః ॥

ఏతం మే సంశయం సూత ప్రత్యాఖ్యాతుం త్వమర్హసి ।

చిత్రమేతత్స సోమస్య కథం శ్వశురతాం గతః ॥

శౌనకుడు ఇట్లు పలికెను –

దక్షుడు బ్రహ్మయొక్క బొటనవ్రేలినుండి పుట్టినాడని నీవు పూర్వము చెప్పిపియుంటివి. మహాతపశ్శాలియగు ఆ దక్షుడు మరల ఏ విధముగా ప్రచేతసుని కుమారుడు ఆయెను ? (51) ఓ సూతా! నా ఈ సందేహమును నీవు తీర్చదగుదువు. ఇది చిత్రముగా నున్నది. ఆతడు సోమునికి మామగారు ఎట్లు అయినాడు ? (52)

సూత ఉవాచ ।

ఉత్పత్తిశ్చ నిరోధశ్చ నిత్యం భూతేషు వర్తతే ।
కల్పే కల్పే భవంత్యేతే సర్వే దక్షాదయో మునే ॥
ఇమాం విసృష్టిం దక్షస్య యో విద్యాత్స చరాచరమ్ ।
ప్రజావానాయుషా పూర్ణస్స్వర్గలోకే మహీయతే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం సృష్టివర్ణనం నామత్రింశోఽధ్యాయః ॥

సూతుడు ఇట్లు పలికెను -

ప్రాణులలో సృష్టి ప్రళయములు నిత్యము జరుగుచుండును. ఓ మునీ! ఈ దక్షు ్పడు మొదలగు వారు అందరు ప్రతి కల్పమునందు ఉండెదరు (53). ఈ స్థావరజంగమములగు ప్రాణులతో కూడియున్న దక్షుని విశేషసృష్టిని తెలుసుకొను వ్యక్తి సంతానమును, పూర్ణమగు ఆయుర్దాయమును పొంది స్వర్గలోకమునందు మహిమను గాంచును (54).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు సృష్టివర్ణనమనే ముప్పదియవ అధ్యాయము ముగిసినది (30).

31 – సృష్టి వర్ణనము

శౌనక ఉవాచ ।

దేవానాం దానవానాం చ గంధర్వోరగ రక్షసామ్ ।
సృష్టిం తు విస్తరేణేమాం సూతపుత్ర వదాశు మే ॥

శౌనకుడు ఇట్లు పలికెను –

ఓ సూతపుత్రా ! ఈ దేవదానవ-గంధర్వ- సర్ప- రాక్షసుల సృష్టిని గురించి నాకు వెంటనే వివరముగా చెప్పుము (1).

సూత ఉవాచ ।

యదా న వవృధే సా తు వీరణస్య ప్రజాపతిః ।
సుతాం సుతపసా యుక్తావహ్వాయత్సర్గ కారణాత్ ॥
స మైథునేన ధర్మేణ ససర్జ వివిధాః ప్రజాః ।
తాః శృణు త్వం మహాప్రాజ్ఞ కథయామి సమాసతః ॥
తస్యాం పుత్రసహస్రాణి వీరిణ్యాం పంచ వీర్యవాన్ ।
ఆశ్రిత్య జనయామాస దక్ష ఏవ ప్రజాపతిః ॥
ఏతాన్ సృష్టాంస్తు తాన్ దృష్ట్వా నారదః ప్రాహ వై మునిః ।
సర్వం స తు సముత్పన్నో నారదః పరమేష్ఠినః ॥
శ్రుతవాన్ వా కశ్యపాద్వై పుంసాం సృష్టిర్భవిష్యతి ।
దక్షస్యైవ దుహితృషు తస్మాత్తాన బ్రవీత్తు సః ॥
అజానంతః కథం సృష్టిం బాలిశా వై కరిష్యథ ।
దిశం కాంచిదజా నంతస్తస్మాద్విజ్ఞాయ తాం భువమ్ ॥
ఇత్యుక్తాః ప్రయయుస్సర్వే ఆశాం విజ్ఞాతుమోజసా ।
తదంతం న హి సంప్రాప్య న నివృత్తాః పితుర్గృహమ్ ॥
తద్ జ్ఞాత్వా జనయామాస పునః పంచశతాన్ సుతాన్ ।
తానువాచ పునస్సోఽపి నారదస్సర్వదర్శనః ॥

సూతుడు ఇట్లు పలికెను –

సృష్టి వర్ధిల్లకపోవుటను గాంచి దక్ష ప్రజాపతి గొప్ప తపస్సును చేయుచు ఁన్న వీరణుని కుమార్తెను సృష్టి కొరకై ఆహ్వానించెను (2). ఆయన మైథునధర్మముచే అనేక సంతానమును గనెను. ఓ మహాబుద్ధిశాలీ! ఆ వివరములను సంగ్రహముగా చెప్పుచున్నాను. వినుము (3). శక్తిమంతుడగు దక్షప్రజాపతి ఆమెను ఆశ్రయించి ఆమెయందు అయిదు వేల మంది పుత్రులను గనెను (4). పురుషుల సృష్టి అంతయు దక్షుని కుమార్తెల ద్వారా మాత్రమే జరుగగలదని బ్రహ్మ పుత్రుడగు నారదుడు కశ్యపునినుండీ వినియుండెను. కావుననే, ఆ నారదముని ఈ విధముగా సృష్టించబడిన దక్షపుత్రులను గాంచి వారితో నిట్లనెను (5,6). మీరు బాలకులు. మీకు దిక్కు ఒక్కటియైననూ తెలియదు.

సృష్టిని ఎట్లు చేయగలుదురు ? కావున, భూమిని గురించి తెలుసుకొని తరువాత ముందుకు సాగుడు (7). ఆయన ఇట్లు పలుకగా, వారు అందరు దిక్కును తెలియుటకై వేగముగా బయలుదేరిరి. కానీ వారు దాని అంతమును చేరలేకపోయిరి. అయిననూ, వారు తండ్రి గృహమునకు తిరిగి రాలేదు (8). ఈ విషయము తెలిసి దక్షుడు మరల అయిదు వందల మంది పుత్రులను గనెను. సర్వమును తెలుసుకొనే నారదుడు మరల వారితో నిట్లనెను (9).

నారద ఉవాచ ।

భువో మానమజానంతః కథం సృష్టిం కరిష్యథ ।

సర్వే హి బాలిశాః కిం హి సృష్టిం కర్తుం సముద్యతాః ॥

నారదుడు ఇట్లు పలికెను –

మీరందరు చిన్న పిల్లలు, భూమియొక్క పరిమాణమును తెలియకుండగా సృ◌ృష్టిని ఎట్లు చేయగలుదురు ? సృష్టిని చేయుటకు ఉద్యుక్తులగుచున్నారా యేమి ? (10)

సూత ఉవాచ ।

తేఽపి తద్వచనం శ్రుత్వా నిర్యాతాస్సర్వతో దిశమ్ ।

సుబలాశ్వా దక్షసుతా హర్యశ్వా ఇవ తే పురా ॥

అనంతం పుష్కరం ప్రాప్య గతాస్తేఽపి పరాభవమ్ ।

అద్యాపి న నివర్తంతే సముద్రేభ్య ఇవాపగాః ॥

తదా ప్రభృతి వై భ్రాతా భ్రాతురన్వేషణే రతః ।

ప్రయాతో నశ్యతి మునే తన్న కార్యం విపశ్చితా ॥

తాంశ్చాపి నష్టాన్ విజ్ఞాయ పుత్రాన్ దక్షః ప్రజాపతిః ।

స చ క్రోధాద్దదౌ శాపం నారదాయ మహాత్మనే ॥

కుత్రచిన్న లభస్వేతీ సంస్థితం కలహప్రియ ।

తవ సాన్నిధ్యతో లోకే భవేచ్చ కలహస్సదా ॥

సాంత్వితోఽ విధాత్రా హి స దక్షస్తు ప్రజాపతిః ।

కన్యాః షష్ట్యసృజత్పశ్చాద్వీరిణ్యామితి నః శ్రుతమ్ ॥

దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।

సప్తవింశతి సోమాయ చతస్రోఽరిష్టనేమినే ॥

ద్వే చైవ బ్రహ్మపుత్రాయ ద్వే చైవాంగిరసే తదా ।

ద్వే కృశాశ్వాయ విదుషే తాసాం నామాని మే శృణు ॥

అరుంధతీ వసుర్యామిర్లంబా భానుర్మరుత్వతీ ।

సంకల్పా చ ముహూర్తా చ సంధ్యా విశ్వా చ వై మునే ॥

ధర్మపత్న్యో మునే త్వేతాస్తాస్వపత్యాని మే శృణు ।

విశ్వేదేవాస్తు విశ్వాయస్సాధ్యాన్ సాధ్యా వ్యజాయత ॥

మరుత్వత్యాం మరుత్వంతో వసోస్తు వసవస్తథా ।
భానోస్తు భానవస్సర్వే ముహూర్తాయాం ముహూర్తజాః ॥
లంబాయాశ్చైవ ఘోషోఽథ నాగవీథీ చ యామిజా ।
పృథివీ విషమస్తస్యామరుంధత్యామ జాయత ॥
సంకల్పయాస్తు సత్యాత్మా జజ్ఞే సంకల్ప ఏవ హి ।
అయాదయో వసోః పుత్రా అష్టౌ తాన్ శృణు శౌనక ॥
అయో ధ్రువశ్చ సోమశ్చ ధరశ్చైవానిలోఽనలః ।
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవోఽష్టౌ చ నామతః ॥
అయస్య పుత్రో వైతండ శ్రమశ్శాంతో మునిస్తథా ।
ధ్రువస్య పుత్రో భగవాన్ కాలో లోకప్రభావనః ॥

సూతుడు ఇట్లు పలికెను –

సుబలాశ్వులనబడే ఆ దక్షపుత్రులు కూడ పూర్వమునందు హర్యశ్వుల వలెనే ఆయన మాటలను విని అన్ని దిక్కుల వైపునకు నిష్క్రమించిరి (11). వారు అనంతమహిమ గల పుష్కరక్షేత్రమును చేరి సంసారమునుండి విముఖులై సముద్రమును చేరిన నదుల వలె అచటినుండి ఈ నాటికి కూడ మరలి రాకుండిరి (12). ఓ మునీ ! అప్పటినుండియు సోదరుని అన్వేషిస్తూ వెళ్లిన సోదరుడు నశించుచున్నాడు. కావున, వివేకవంతుడగు మానవుడు ఆ విధముగా చేయరాదు (13). ఆ పుత్రులు కూడ తనకు కాకుండా పోయిరని తెలుసుకొని దక్ష ప్రజాపతి కోపముతో మహాత్ముడగు నారదునకు శాపమునిచ్చెను (14). ఓ కలహప్రియుడా ! నీకు ఎక్కడనైననూ స్థిరనివాసము ఏర్పడకుండుగాక ! నీ సన్నిధిలో లోకములో సర్వదా కలహములు పుట్టుచుండును (15). తరువాత బ్రహ్మచే ఓదార్చబడినవాడై ఆ దక్ష ప్రజాపతి వీరిణియందు అరవై కన్యలను కనినాడని మేము వినియుంటిమి (16). వారిలో పదిమందిని ధర్మునకు, పదముగ్గురినీ కశ్యపునకు, ఇరవై ఏడు మందిని సోమునకు, నలుగురిని అరిష్టనేమికి (17), ఇద్దరిని బ్రహ్మపుత్రునకు, ఇద్దరిని అంగిరసునకు, ఇద్దరిని విద్వాంసుడగు కృశాశ్వునకు ఇచ్చి వివాహమును చేసెను. వారి పేర్లను చెప్పెదను. వినుము (18). ఓ మునీ ! అరుంధతి, వసువు, యామి, లంబ, భానువు, మరుత్వతి, సంకల్ప, ముహూర్త, సంధ్య, విశ్వ అనునవి ధర్ముని భార్యల పేర్లు. ఓ మునీ ! వారి సంతానమును గురించి నేను చెప్పెదను. వినుము. విశ్వకు విశ్వేదేవతలు, సంధ్యకు సాధ్యులు జన్మించిరి (19, 20). మరుత్వతికి మరుత్వంతులు, వస్తువునకు అష్టవసువులు, భానువునకు ద్వాదశాదిత్యులు, ముహూర్తకు ముహూర్తజలు (21), లంబకు ఘోషుడు, యామీకి నాగవీథి, అరుంధతికి పృథివీవిషముడు జన్మించిరి (22). సంకల్పకు సత్యస్వరూపుడగు సంకల్పుడు జన్మించెను. ఓ శౌనకా! వసువునకు అయుడు మొదలగు ఎనమండుగురు పుత్రులు కలిగిరి. వారి పేర్లను వినుము (23). అయుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అనునవి ఎనిమిది వసువుల పేర్లు (24). అయునకు వైతండుడు, శ్రముడు, శాంతుడు మరియు ముని అనే పేర్లు గల పుత్రులు కలిగిరి. పూజ్యుడు, లోకములను ప్రభావితము చేయువాడు అగు కాలుడు ధ్రువుని పుత్రుడు (25).

సోమస్య భగవాన్వర్చా వర్చస్వీ యేన జాయతే ।
ధరస్య పుత్రో ద్రవిణో హుతహవ్యవహ స్తథా ॥
మనోహరాయాశ్శిశిరః ప్రాణోఽథ రమణస్తథా ।
అనిలస్య శివా భార్యా యస్యాః పుత్రాః పురో జవః ॥
అవిజ్ఞాత గతిశ్చైవ ద్వౌ పుత్రావనిలస్య తు ।
అగ్నిపుత్రః కుమారస్తు శరస్తంబే శ్రియావృతే ॥
తస్య శాఖో విశాఖశ్చ నైగమేయశ్చ పృష్ఠతః ।
అపత్యం కృత్తికానాం తు కార్తికేయ ఇతి స్మృతః ॥
ప్రత్యూషస్య త్వభూత్పుత్ర ఋషిర్నామ్నా తు దేవలః ।
ద్వౌ పుత్రౌ దేవలస్యాపి ప్రజావంతౌ మనీషిణౌ ॥
బృహస్పతేస్తు భగినీ వరస్త్రీ బ్రహ్మచారిణీ ।
యోగసిద్ధా జగత్కృత్స్నం సమంతాద్వ్యచరత్తదా ॥
ప్రభాసస్య తు సా భార్యా వసూనామష్టమస్య చ ।
విశ్వకర్మా మహాభాగ తస్య జజ్ఞే ప్రజాపతిః ॥
కర్తా శిల్పసహస్రాణాం త్రిదశానాం చ వార్ధకిః ।
భూషణానాం చ సర్వేషాం కర్తా శిల్పవతాం వరః ॥
యస్సర్వాసాం విమానాని దేవతానాం చకార హ ।
మనుష్యాశ్చోపజీవంతి యస్య శిల్పం మహాత్మనః ॥

పూజ్యుడగు వర్చస్సు సోముని పుత్రుడు. ఆయన వలననే మానవుడు కాంతిని పొందుచున్నాడు. ద్రవిణుడు మరియు హుతహవ్యవహుడు అను వారలు ధరుని పుత్రులు (26). శిశిరుడు, ప్రాణుడు మరియు రమణుడు అను వారలు మనోహరయొక్క కుమారులు. అనిలుని భార్య శివ. ఆమెయందు అనిలునకు పురో జవుడు మరియు అవిజ్ఞాతగతి అనే ఇద్దరు పుత్రులు కలిగిరి (27). శోభాయుతమగు రెల్లు గడ్డి యందు జన్మించిన కుమారుడు అగ్నియొక్క పుత్రుడు (28). శాఖుడు, విశాఖుడు మరియు నైగమేయుడు అను వారలు కుమారుని సోదరులు. కుమారుడు కృత్తికలచే పుత్రరూపములో పాలింపబడుటచే ఆయన కార్తికేయుడు అయినాడు (29). దేవలమహర్షి ప్రత్యూషుని పుత్రుడు. దేవలునకు విద్వాంసులగు ఇద్దరు పుత్రులు గలరు. వారికి కూడ సంతానము గలదు (30). బృహస్పతి సోదరీ బ్రహ్మచారిణి మరియు గొప్ప యోగ్యురాలు. ఆమెకు యోగసిద్దులు గలవు. ఆమె జగత్తునంతనూ విస్తారముగా సంచరించెను (31). ఓ మహాత్మా ! వసువులలో ఎనిమిదవ వాడగు ప్రభాసునకు ఆమె భార్య ఆయెను. ఆతనికి విశ్వకర్మ ప్రజాపతి పుత్రుడై జన్మించెను (32), శిల్పులలో శ్రేష్ఠుడగు ఆ విశ్వకర్మ దేవతలకు శిల్పి ఆయను. ఆయన వేలాది శిల్పములను, అనేకములగు భూషణములను నిర్మించెను (33). దేవతల విమానములను అన్నింటినీ ఆయనయే నిర్మించెను. ఆ మహాత్ముని శిల్పమునే మానవులు అనుకరించి గృహాదులను నిర్మించుకొనుచున్నారు (34).

మతాంతరమాహ ।

రైవతోఽజో భవో భీమో వామ ఉగ్రో వృషాకపిః ।

అజైకపాదహిర్బుధ్న్యో బహురూపో మహానితి ॥

సరూపాయాం ప్రసూతస్య స్త్రియాం రుద్రాశ్చ కోటిశః।

తత్రైకాదశముఖ్యాస్తు తన్నామని మునే శృణు ॥

అజైకపాదహిర్బుధ్న్యస్త్వష్టా రుద్రశ్చ వీర్యవాన్ ।

హరశ్చ బహురూపశ్చ త్ర్యంబకశ్చా పరాజితః ॥

వృషాకపిశ్చ శంభుశ్చ కపర్దీ రైవతస్తథా ।

ఏకాదశైతే కథితా రుద్రాస్త్రి భువనేశ్వరాః ॥

శతం త్వేవం సమాఖ్యాతం రుద్రాణామమితౌజసామ్ ।

శృణు కశ్యపపత్నీనాం నామాని మునిసత్తమ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం సృష్టివర్ణనం నామ ఏకత్రింశోఽధ్యాయః ॥

మహర్షి మరియొక పక్షమును చెప్పుచున్నాడు –

రైవతుడు, అజుడు, భవుడు, భీముడు, వాముడు, ఉగ్రుడు, వృషాకపి, అజైకపాత్, అహిర్బుధ్న్యుడు, బహురూపుడు, మహాన్ మొదలైన అసంఖ్యాకులగు రుద్రులు ప్రసూతుని భార్యయగు సరూపయందు జన్మించిరి. వారిలో పదకొండు మంది ముఖ్యులు. ఓ మునీ ! వారీ పేర్లను వినుము (35, 36). అజైకపాత్, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రులలో పరాక్రమశాలియగు హరుడు, బహురూపుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు (37), వృషాకపి, శంభుడు, కపర్ది, రైవతుడు అనే ఈ పదకొండుగురు రుద్రులు ముల్లోకములకు ప్రభువులని చెప్పబడినారు (38). ఈ విధముగా నేను సాటిలేని తేజస్సు గల వంద మంది రుద్రులను గురించి చెప్పితిని. ఓ మహర్షీ! కశ్యపుని భార్యలయొక్క పేర్లను వినుము (39).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు సృష్టివర్ణనము అనే ముప్పది ఒకటవ అధ్యాయము ముగిసినది (31).

32 – కశ్యప వంశ వర్ణనము

సూత ఉవాచ ।

అదితిర్దితిశ్చ సురసారిష్టేలా దనురేవ చ ।
సురభిర్వినతా చేలా తామ్రా క్రోధవశా తథా ॥
కద్రూర్మునిశ్చ విప్రేంద్ర తాస్వపత్యాని మే శృణు ।
పూర్వమన్వంతరే శ్రేష్ఠ ద్వాదశాసన్ సురోత్తమాః ॥
తుషితా నామ తేఽ న్యోన్యమూచుర్వైవస్వతేంతరే ।
ఉపస్థితే సుయశసశ్చాక్షుష స్యాంతరే మనోః ॥
హితాయ సర్వలోకానాం సమాగమ్య పరస్పరమ్ ।
ఆగచ్ఛతస్తు తానూచురదితిం చ ప్రవిశ్య వై ॥
మన్వంతరే ప్రసూయామస్తతాం శ్రేయో భవిష్యతి ।
ఏవముక్తాస్తు తే సర్వే చాక్షుషస్యాంతరే మనోః ॥
మారీచాత్కశ్యపా జ్జాతాస్తేఽ దిత్యాం దక్షకన్యయా ।
తత్ర విష్ణుశ్చ శక్రశ్చ జజ్ఞాతే పునరేవ హి ॥
అర్యమా చైవ ధాతా చ త్వష్టా పూషా తథైవ చ ।
వివస్వాన్ సవితా చైవ మిత్రావరుణ ఏవ చ ॥
అంశో భగశ్చాతితేజా ఆదిత్యా ద్వాదశ స్మృతాః ।
చాక్షుషస్యాంతరే పూర్వమాసన్ యే తుషితాస్సురాః ॥
పురైవ తస్యాంతరే తు ఆదిత్యా ద్వాదశ స్మృతాః ।
ఇతి ప్రోక్తాని క్రమశోఽ దిత్యపత్యాని శౌనక ॥
సప్తవింశతి యాః ప్రోక్తాస్సోమపత్న్యోఽథ సువ్రతాః ।
తాసామపత్యాన్య భవన్దీప్తయోఽ మితతేజసః ॥

సూతుడు ఇట్లు పలికెను –

అదితి, దితి, సురస, అరిష్టల, దనువు, సురభి, వినత, ఇల, తామ్ర, క్రోధవశ (1), కద్రువు, ముని అను వారు కశ్యపుని భార్యలు. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా ! వారియందు కలిగిన సంతానమును గురించి వినుము. గడచిన మన్వంతరము శ్రేష్ఠమైనది. దానియందు పన్నెండుగురు గొప్ప దేవతలు జన్మించిరి (2). వారి పేరు తుషితులు. వైవస్వతమన్వంతరము గడచి గొప్ప కీర్తిశాలియగు చాక్షుషుని మన్వంతరము సమీపించినప్పుడు (3), సర్వలోకముల హితమును గోరి వారు ఒకరి నొకరు కలుసుకొని ఇట్లు నిర్ణయించిరి: 'మనము రాబోయే మన్వంతరములో అదితియందు ప్రవేశించి జన్మించెదము. అట్లు చేయుట వలన సత్పురుషులకు మంచి జరుగగలదు'. ఇట్లు పలికి వారందరు చాక్షుషమన్వంతరములో మరీచిపుత్రుడగు కశ్యపునకు దక్షుని కుమార్తెయగు అదితియందు జన్మించిరి. వారికి విష్ణువు మరియు ఇంద్రుడు కూడ మరల జన్మించిరి (4-6). వారితో కలిపి అర్యముడు, ధాత, త్వష్ట, పూష, వివస్వాన్, సవిత, మిత్రావరుణుడు (7), అంశుడు,

భగుడు, అతితేజస్సు అను వారు ద్వాదశాదిత్యులు అని చెప్పబడినారు. పూర్వము తుషితులనబడిన దేవతలు చాక్షుషమన్వంతరములో మరల పన్నెండుగురు ఆదిత్యులై జన్మించిరి. ఓ శౌనకా ! ఈ విధముగా నీకు అదితియొక్క సంతానమును గురించి క్రమములో చెప్పితిని (8,9). చంద్రునకు ఇరువది ఏడుగురు భార్యలు గలరనియు, వారు గొప్ప వ్రతము గలవారనియు చెప్పబడినది. వారికి గొప్ప తేజస్సు గల దీప్తులు అనే సంతానము కలిగిరి (10).

అరిష్టనేమిపత్నీనామ పత్యానీహ షోడశ ।

బహుపుత్రస్య విదుషశ్చతస్రో యాస్సుతాః స్మృతాః ॥

కృశాశ్వస్య తు దేవర్షే దేవ ప్రహరణాః స్మృతాః ।

భార్యాయామర్చిషి మునే ధూమ్రకేశ స్తథైవ చ ॥

స్వధా సతీ చ ద్వే పత్న్యౌ స్వధా జ్యేష్ఠా సతీ పరా ।

స్వధాసూత పితృన్ వేదమథర్వాంగీరసం సతీ ॥

ఏతే యుగసహస్రాంతే జాయంతే పునరేవ హి ।

సర్వదేవనికాయాశ్చ త్రయస్త్రింశత్తు కామజాః ॥

యథా సూర్యస్య నిత్యం హి ఉదయాస్తమయావిహ ।

ఏవం దేవానికాస్తే చ సంభవంతి యుగే యుగే ॥

దిత్యాం బభూవతుః పుత్రౌ కశ్యపాదితి నః శ్రుతమ్ ।

హిరణ్య కశిపుశ్చైవ హిరణ్యాక్షశ్చ వీర్యవాన్ ॥

సింహికా హ్యా భవత్కన్యా విప్రచిత్తేః పరిగ్రహః ।

హిరణ్య కశిపోః పుత్రాశ్చత్వారః ప్రథితౌజసః ॥

అను హ్రాదశ్చ హ్రాదశ్చ సంహ్రాదశ్చైవ వీర్యవాన్ ।

ప్రహ్రాదశ్చాను జస్తత్ర విష్ణుభక్తి విచారధీః ॥

అనుహ్రాదస్య సుర్యాయాం పులోమా మహిషస్తథా ।

హ్రాదస్య ధమనిర్భార్యాసూత వాతాపిమిల్వలమ్ ॥

సంహ్రాదస్య కృతిర్భార్యాసూత పంచజనం తతః ।

విరోచనస్తు ప్రాహ్రాదిర్దేవ్యాస్తస్యా భవద్బలిః ॥

అరిష్టనేమికి తన భార్యలయందు పదునాల్గురు సంతానము కలిగిరి. ఓ దేవర్షి! అనేకపుత్రులు గలవాడు, విద్వాంసుడు అగు కృశాశ్వునకు దేవప్రహరణులు అనబడే నలుగురు కుమారులు గలరు. ఓ మునీ! ఆయనకు అర్చి అనబడే భార్యయందు ధూమ్రకేశుడు అనే పుత్రుడు కలిగెను (11, 12). స్వధ, సతి అనే ఇద్దరు భార్యలలో స్వధ పెద్ద ఆమె కాగా, సతి చిన్న ఆమె. స్వధ పితృదేవతలను, సతి అథర్వంగిరసుని కనెను (13). వీరు వేయి యుగముల తరువాత మరల జన్మించెదరు. మైథునసృష్టిలో భాగమైన దేవతలు ముప్పది మూడు సముదాయములుగా నుండిరి (14). ఈ లోకములో సూర్యుడు నిత్యము ఉదయించి అస్తమించుచుండును. అటులనే, ఈ దేవతాసముదాయములు ప్రతి యుగమునందు పుట్టుచుందురు (15). కశ్యపునకు దితియందు హిరణ్యకశిపుడు

మరియు పరాక్రమశాలియగు హిరణ్యాక్షుడు అనే ఇద్దరు పుత్రులు కలిగిరని మేము విని యుంటిమి (16). ఆయనకు సింహిక అనే కన్య కూడ కలిగెను. ఆమెను విప్రచిత్తి వివాహమాడెను. హిరణ్య కశిపునకు అనుహ్లాదుడు, హ్లాదుడు, పరాక్రమశాలి యగు సంహ్లాదుడు, మరియు ప్రహ్లాదుడు అనే ప్రఖ్యాతి గాంచిన తేజస్సు గల నలుగురు పుత్రులు కలిగిరి. వారిలో కనిష్ఠసోదరుడగు ప్రహ్లాదుని విచారాత్మకమగు బుద్ధి విష్ణు భక్తితో నిండియుండెను (17, 18). అనుహ్లాదునకు సూర్యయందు పులోముడు, మహిషుడు అనే పుత్రులు కలిగిరి. హ్లాదునకు ధమని అనే భార్యయందు వాతాపి మరియు ఇల్వలుడు అనే కుమారులు కలిగిరి (19). సంహ్లాదునకు కృతి అనే భార్య యందు పంచజనుడు అనే కుమారుడు కలిగెను. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. అతనికి భార్యయగు దేవియందు బలి అనే పుత్రుడు కలిగెను (20).

బలేః పుత్రశతం త్వాసీదశనాయాం మునీశ్వర ।
బలిరాసీన్మహాశైవశ్శివ భక్తి పరాయణః ॥
దానశీల ఉదారశ్చ పుణ్య కీర్తితపాః స్మృతః ।
తత్పుత్రో బాణనామా యస్సోఽపి శైవవరస్సుధీః ।
యస్సంతోష్య శివం సమ్యగ్గాణాపత్యమవాప హ ॥
సా కథా శ్రుతపూర్వా తే బాణస్య హి మహాత్మనః ।
కృష్ణం యస్సమరే వీరస్సు ప్రసన్నం చకార హ ॥
హిరణ్యాక్షసుతాః పంచ పండితాస్సు మహాబలాః ।
కుకురశ్శకునిశ్చైవ భూతసంతాపన స్తథా ॥
మహానా దశ్చ విక్రాంతః కాలనాభ స్తథైవ చ ।
ఇత్యుక్తా దితిపుత్రాశ్చ దనోః పుత్రాన్మునే శృణు ॥
అభవన్దను పుత్రాశ్చ శతం తీవ్రపరాక్రమాః ।
అయోముఖశ్శంబరశ్చ కపోలో వామనస్తథా ॥
వైశ్వానరః పులో మా చ విద్రావణ మహాశిరౌ ।
స్వర్భానుర్వృషపర్వా చ విప్రచిత్తిశ్చ వీర్యవాన్ ॥
ఏతే సర్వే దనోః పుత్రాః కశ్యపాదను జజ్ఞిరే ।
ఏషాం పుత్రాన్ శృణు మునే ప్రసంగా ద్వచ్మి తేఽనఘ ॥
స్వర్భానోస్తు ప్రభా కన్యా పులోమ్నస్తు శచీ సుతా ।
ఉపదానవీ హయశిరా శర్మిష్ఠా వార్షపర్వణీ ॥
పులోమా పులోమికా చైవ వైశ్వానరసుతే ఉభే ।
బహ్వపత్యే మహావీర్యే మారీచేస్తు పరిగ్రహః ॥

ఓ మహర్షీ! బలికి అశన అనే భార్యయందు వంద మంది పుత్రులు కలిగిరి. బలి గొప్పప శివభక్తుడు. ఆయనకు శివభక్తియందు గొప్ప నిష్ఠ ఉండెను (21). ఆయన దానము చేసే స్వభావము, ఔదార్యము గలవాడు. ఆయన పుణ్యదాయకమగు తపస్సును చేసి కీర్తిని పొందెను. ఆయన పుత్రుడు బాణుడు.

ఆయన కూడ గొప్ప బుద్ధిమంతుడు మరియు శివభక్తాగ్రగణ్యుడు. ఆయన శివుని చక్కగా సంతోషపెట్టి గణాధ్యక్షస్థానమును పొందెను (22). మహాత్ముడగు ఆ బాణుని కథను నీవు ఇదివరలో వినియుంటివి. ఆ వీరుడు యుద్ధములో శ్రీకృష్ణుని మిక్కిలి ప్రసన్నుని చేసెను (23). హిరణ్యాక్షునకు కుకురుడు, శకునీ, భూతసంతాపనుడు, సుహానాదుడు, పరాక్రమశాలియగు కాలనాభుడు అనే పండితులు, మహాబలశాలురు అగు అయిదుగురు పుత్రులు గలరు. ఓ మునీ ! ఇంతవరకు దితియొక్క సంతానమును గురించి చెప్పితిని. ఇప్పుడు దనుపుత్రులను గురించి వినుము (24, 25), దనువునకు తీవ్రమగు పరాక్రమము గల వందమంది పుత్రులు ఉండిరి. అయోముఖుడు, శంబరుడు, కపోలుడు, వామనుడు, వైశ్వానరుడు, పులోముడు, విద్రావణుడు, మహాశిరుడు, స్వర్భానుడు, వృషపర్వుడు, పరాక్రమశాలియగు విప్రచిత్తి అను వీరు అందరు కశ్యపునకు దనువునందు జన్మించినది. ఓ మునీ ! నేను ప్రసంగవశముచే వీరి పుత్రులను గురించి చెప్పుచున్నాను. ఓయీ పుణ్యాత్మా ! నీవు వినుము (26-28). స్వర్భానువునకు ప్రభ, పులోమునకు శచి అనే కుమార్తెలు కలిగిరి. ఉపదానవీ, హయశిర, శర్మిష్ఠ అను వారలు వృషపర్వుని కుమార్తెలు (29). వైశ్వానరునకు పులోమ, పులోమిక అనే ఇద్దరు కుమార్తెలు కలిగిరి. వారిని మరీచియొక్క పుత్రుడగు కశ్యపుడు వివాహమాడెను. వారికి గొప్ప పరాక్రమము గల అనేకులు పుత్రులు కలిగిరి (30).

తయోః పుత్రసహస్రాణి షష్టిర్దానవనందనాః ।
మారీచిర్జనయామాస మహతా తపసాన్వితః ॥
పౌలోమాః కాలఖంజాశ్చ దానవానాం మహాబలాః ।
అవధ్యా దేవతానాం చ హిరణ్యపురవాసినః ॥
పితామహ ప్రసాదేన యే హతాస్సవ్యసాచినా ।
సింహికాయా మథోత్పన్నా విప్రచిత్తేస్సుతా స్తథా ॥
దైత్య దానవసంయోగాజ్జాతాస్తీవ్రపరా క్రమాః ।
సైంహికేయా ఇతి ఖ్యాతాస్త్రయోదశ మహాబలాః ॥
రాహుశ్శల్యో సుబలినో బలశ్చైవ మహాబలః ।
వాతాపిర్నముచిశ్చైవాథేల్వలస్స్వ సృపస్తథా ॥
అజికో నరకశ్చైవ కాలనాభస్తథైవ చ ।
శరమాణశ్శరకల్పశ్చ ఏతే వంశవివర్ధనాః ॥
ఏషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ దనువంశ వివర్ధనాః ।
బహవశ్చ సముద్భూతా విస్తరత్వాన్న వర్ణితాః ॥
సంహ్రాదస్య తు దైతేయా నివాతకవచాః కులే ।
ఉత్పన్నా మరుతస్తస్మింస్తపసా భావితాత్మనః ॥
షణ్ముఖాద్యా మహాసత్త్వాస్తా మ్రాయాః పరికీర్తితాః ।
కాకీ శ్యేనీ చ భాసీ చ సుగ్రీవీ చ శుకీ తథా ॥
గృధ్రికాశ్వీ హ్యులూకీ చ తామ్రా కన్యాః ప్రకీర్తితాః ।
కాకీ కాకానజనయదులూకీ ప్రత్యులూకకాన్ ॥

శ్యేనీ శ్యేనాంస్తథా భాసీ భాసాన్ గృధ్రీ తు గృధ్రకాన్ ।

శుకీ శుకానజనయత్సుగ్రీవీ శుభపక్షిణః ॥

గొప్ప తపశ్శాలి, మరీచిపుత్రుడు అగు కశ్యపునకు వారిద్దరియందు దానవులకు ఆనందమును కలిగించే అరవై వేలమంది పుత్రులు కలిగిరి (31). ఈ పులోమపుత్రులు మరియు కాలఖంజులు దానవులలో గొప్ప బలము గలవారు. హిరణ్యపురమునందు నివసించే వీరిని దేవతలు సంహరింపజాలరు (32). వీరు బ్రహ్మగారి అనుగ్రహముచే అర్జునునిచే సంహరింపబడిరి. విప్రచిత్తికి సింహికయందు పుత్రులు కలిగిరి (33). దైత్య దా నవసంయోగము వలన కలిగిన ఈ పుత్రులు తీవ్రమగు పరాక్రమము గలవారు. వీరికి సైంహికేయులు అను పేరు ప్రసిద్ధిని గాంచినది. ఈ పదముగ్గురు చాల బలము గలవారు (34). మహాబలశాలురగు రాహువు, శల్యుడు, బలుడు, మహాబలుడు, వాతాపి, నముచి, ఉల్వలుడు, స్వస్రుపుడు (35), అజికుడు, నరకుడు, కాలనాభుడు, శరమాణుడు, శరకల్పుడు అను ఈ పదముగ్గురు వంశమును వర్ధిల్లజేసిరి (36). వీరికి అనేకులు పుత్రులు, పౌత్రులు కలిగి దనువంశమును వర్ధిల్లజేసిరి. విస్తారభయముచే ఆ వివరములు ఈయబడుట లేదు (37). సంప్రదుని కులములో నివాతకవచులు అనే దైత్యులు మరియు మరుత్తులు పుట్టిరి. మరుత్తులు తపస్సును చేసి మనస్సును పరమేశ్వరునియందు లగ్నము చేసిరి (38). తామ్రయొక్క పుత్రులగు షణ్ముఖుడు మొదలగు వారు మహాబలశాలురనీ కీర్తిని బడసిరి. తామ్రకు కాకి, శ్యేని, భాసి, సుగ్రీవి, శుకీ (39), గృధ్రిక, అశ్వి, ఉలూకి అను కన్యలు పుట్టి ప్రఖ్యాతిని గాంచిరి. కాకి కాకులను, ఉలూకి గుడ్లగూబలను కనెను (40). శ్యేని గరుడపక్షులను, భాసి రాబందులను, గృద్ధి గ్రద్దలను, శుకీ చిలుకలను, సుగ్రీవి శుభకరమగు పక్షులను కనెను (41).

అశ్వానుష్ట్రాన్ గర్దభాంశ్చ తామ్రా చ కశ్యపప్రియా ।

జనయామాస చేత్యేవం తామ్రవంశాః ప్రకీర్తితాః ॥

వినతాయాశ్చ పుత్రౌ ద్వావరుణో గరుడస్తథా ।

సుపర్ణః పతతాం శ్రేష్ఠో నారుణస్స్వేన కర్మణా ॥

సురసాయాస్సహస్రం తు సర్పాణామమి తౌజసామ్ ।

అనేకశిరసాం తేషాం ఖేచరాణాం మహాత్మనామ్ ॥

యేషాం ప్రధానా రాజానశ్శేష వాసుకితక్షకాః ।

ఐరావతో మహాపద్మః కంబలాశ్వతరావుభౌ ॥

ఐలాపుత్రస్తథా పద్మః కర్కోటక ధనంజయౌ ।

మహానీలమహాకర్ణౌ ధృతరాష్ట్రో బలాహకః ॥

కుహరః పుష్పదంతశ్చ దుర్ముఖస్సు ముఖస్తథా ।

బహుశః ఖరరోమా చ పాణిరిత్యేవమాదయః ॥

గణాః క్రోధవశాయాశ్చ తస్యాస్సర్వే చ దంష్ట్రిణః ।

అండజాః పక్షిణోఽ బ్జాశ్చ వారాహ్యాః పశవో మతాః ॥

అనాయుషాయాః పుత్రాశ్చ పంచాశచ్చ మహాబలాః ।

అభవన్ బలవృక్షౌ చ విక్షరోఽథ బృహాంస్తథా ॥

శశాంస్తు జనయామాస సురభిర్మహిషాం స్తథా ।

ఇలా వృక్షాంల్లతా వల్లీస్తృణజాతీస్తు సర్వశః ॥

ఖశా తు యక్షరక్షాంసి మునిరప్సరస స్తథా ।

అరిష్టాసూత సర్పాంశ్చ ప్రభావైర్మానవోత్తమామ్ ॥

ఏతే కశ్యపదాయాదాః కీర్తితాస్తే మునీశ్వర ।

యేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం కశ్యపవంశవర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥

కశ్యపుని ప్రియురాలగు తామ్ర గుర్రములను, ఒంటెలను, గాడిదలను కనెను. ఈ విధముగా తామ్రవంశము వర్ణించబడినది (42). వినతకు అరుణుడు, గరుడుడు అనే ఇద్దరు పుత్రులు గలరు. గరుడుడు పక్షులలో గొప్పవాడు. అరుణుడు తాను చేసిన పొరపాటుచే ఎగురజాలడు (43). సురసకు గొప్ప తేజస్సు గలవారు, అనేకశిరస్సులు గలవారు, ఆకాశసంచారులు, మహాత్ములు అగు వేయి సర్పములు కలిగిరి (44). వారిలో శేషుడు, వాసుకి, తక్షకుడు, ఐరావతుడు, మహాపద్మడు, కంబలుడు, అశ్వతరుడు, ఐలాపుత్రుడు, పద్మడు, కర్కోటకుడు, ధనంజయుడు, మహానీలుడు, మహాకర్ణుడు, ధృతరాష్ట్రుడు, బలాహకుడు, కుహరుడు, పుష్పదంతుడు, దుర్ముఖుడు, సుముఖుడు, ఖరరోముడు, ఖరపాణి మొదలగు సర్పరాజులు ప్రధానమైన వారు. వీరే గాక ఇంకనూ అనేకులు గలరు (45-47). కోరలు గల జంతువులు, గ్రుడ్లనుండి పుట్టే జంతువులు, పక్షులు మరియు నీటియందు పుట్టే జంతువులు క్రోధవశయొక్క సంతానము పశువులు అని చెప్పబడినది (48). అనాయుషకు ఏభై మంది మహాబలవంతులగు పుత్రులు కలిగిరీ, బలుడు, వృక్షుడు, విక్షరుడు, బృహన్ అను వారలు ముఖ్యులు (49). సురభికి కుందేళ్లు, గేదేలు సంతానమైనవి. ఇల వృక్షములను, లత లతలను మరియు సర్వవిధముల గడ్డి జాతి మొక్కలను కనెను (50). ఖశ యక్షులను మరియు రాక్షసులను, ముని అప్సరసలను, అరిష్ట శక్తిలో మానవుల కంటే గొప్పవి యగు సర్పములను కనెను (51). ఓ మహర్షీ! నేనీ కశ్యపుని దాయాదులను గురించి నీకు వివరించి చెప్పితిని. వీరికి పుత్రులు, పౌత్రులు వందల మరియు వేల సంఖ్యలో గలరు (52).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు కశ్యపవంశవర్ణనము అనే ముప్పది రెండవ అధ్యాయము ముగిసినది (32).

33- మరుత్తుల చరితము

సూత ఉవాచ ।

ఏష మన్వంతరే తాత సర్గస్స్వారోచిషే స్మృతః ।
వైవస్వతే తు మహతి వారుణే వితతే క్రతౌ ॥
జుహ్వానస్య బ్రహ్మణో వై ప్రజాసర్గ ఇహోచ్యతే ।
పూర్వం యానథ బ్రహ్మర్షీనుత్పన్నాన్ సప్త మానసాన్ ॥
పుత్రాన్ వై కల్పయామాస స్వయమేవ పితామహః ।
తేషాం విరోధో దేవానాం దానవానాం మహాన్నృషే ॥
దితిర్వి నష్టపుత్రా తు కశ్యపం సముపస్థితా ।
స కశ్యపః ప్రసన్నాత్మా సమ్యగారాధితస్తయా ॥
వరేణ చ్ఛందయామాస సా చ వవ్రే వరం తదా ।
పుత్రమింద్రవధార్థాయ సమర్థమమి తౌజసమ్ ॥
స తస్యై చ వరం ప్రాదా త్ప్రార్థితం సుమహాతపాః ।
బ్రహ్మచర్యాదినియమం ప్రాహ చైవ శతం సమాః ॥
ధారయామాస గర్భం తు శుచిస్సా వరవర్ణినీ ।
బ్రహ్మచర్యాదినియమం దితిర్దధ్రే తథైవ వై ॥
తతస్సాధాయ దిత్యాం స గర్భం తం శంసిత వ్రతః ।
జగామ కశ్యపస్తప్తుం తపస్సంహృష్ట మానసః ॥
తస్యాశ్చైవాంతరం ప్రేప్సుస్సోఽ భవత్పాకశాసనః ।
ఊనవర్షే శతే చాస్యా దదర్శాంతరమేవ సః ॥
అకృత్వా పాదయోశ్శౌచం దితిరర్వాక్శిరాస్తదా ।
నిద్రామాహారయామాస భావినోఽ ర్థస్య గౌరవాత్ ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఓ వత్సా! స్వారోచిషమన్వంతరమందలి సృష్టి ఈ విధముగా వర్ణించబడినది. ఇప్పుడు వైవస్వతమన్వంతరములో గొప్ప విస్తారమైన వారుణక్రతువునందు హోమమును చేయుచూ బ్రహ్మ చేసిన ప్రజాసృష్టి వర్ణించబడుచున్నది. మున్ముందుగా పుట్టిన ఏడ్గురు బ్రహ్మర్షులను బ్రహ్మగారు తన మానసపుత్రులుగా చేసుకొనెను. దేవతలకు దానవులకు జరిగిన మహాయుద్ధములో దితి తన పుత్రులను అందరినీ పోగొట్టుకొనెను. అపుడు ఆమె కశ్యపుని వద్దకు వెళ్లి చక్కగా సేవించగా, ఆయన ప్రసన్నమగు మనస్సు గలవాడై నచ్చిన వరమును కోరుకొమ్మని పలికెను. అపుడామే ఇంద్రుని వధించుట కొరకై మహా తేజశ్శాలి, సమర్థుడు అగు పుత్రుని ఇమ్మని కోరెను (1-5). మహాతపశ్శాలియగు కశ్యపుడు ఆమె కోరిన వరమును ఆమెకు ఇచ్చెను. వంద సంవత్సరములు బ్రహ్మచర్యము మొదలగు నియమములను పాటించుమని చెప్పెను (6). ఆ సుందరియగు దితి శుచియై గర్భమును ధరించి, బ్రహ్మచర్యము మొదలగు నియమములను ఆయన

చెప్పిన విధముగానే పాటించుచుండెను (7). కొనియాడదగిన ప్రతనిష్ఠ గల కశ్యపుడు ఆమె గర్భమును ధరించిన తరువాత సంతోషముతో నిండిన మనస్సు గలవాడై తపస్సును చేయుటకై వెడలెను (8). ఆమెయొక్క దౌర్బల్యమును కనిపెట్టగోరి ఇంద్రుడు వేచియుండెను. వంద సంవత్సరముల నియమకాలములో ఒకే ఒక సంవత్సరము మిగిలియుండగా ఆతనికి ఆమెలో దౌర్బల్యము దొరికెను (9). విధివిధానములో చాల పెద్ద ఘటన జరుగనున్నది. అందువలననే ఆ దితి పాదములను కడుగుకొనకుండగా తల క్రిందకు వ్రేలాడుచుండగా నిద్రించెను (10).

ఏతస్మిన్నంతరే శక్రస్తస్యాః కుక్షిం ప్రవిశ్య సః ।
వజ్రపాణిస్తు తం గర్భం సప్తధా హి న్యకృంతత ॥
స పాట్యమానో గర్భోఽథ వజ్రేణ ప్రరురోద హ ।
రుదంతం సప్తధైకైకం మారో దీరితి తాన్ పునః ।
చకర్త వజ్రపాణిస్తాన్నైవ మమ్రుస్తథాపి తే ॥
తే తమూచుః పాత్యమానాస్సర్వే ప్రాంజలయో మునే ।
నో జిఘాంససి కిం శక్ర భ్రాతరో మరుతస్తవ ॥
ఇంద్రేణ స్వీకృతాస్తే హి భ్రాతృత్వే సర్వ ఏవ చ ।
తత్యజుర్దైత్య భావం తే విప్రర్షే శంకరేచ్ఛయా ॥
మరుతో నామ తే దేవా బభూవుస్సు మహాబలాః ।
ఖగా ఏకోనపంచాశత్సహాయా వజ్రపాణినః ॥
తేషామేవ ప్రవృద్ధానాం హరిః ప్రాదాత్ ప్రజాపతిః ।
క్రమశస్తాని రాజ్యాని పృథుపూర్వం శృణుష్వ తత్ ॥
అరిష్టపురుషో వీరః కృష్ణో జిష్ణుః ప్రజాపతిః ।
పర్జన్యస్తు ఘనా ధ్యక్షస్తస్య సర్వమిదం జగత్ ॥
భూతసర్గమిమం సమ్యగవోచం తే మహామునే ।
విభాగం శృణు రాజ్యానాం క్రమశస్తం బ్రువేఽధునా ॥
అభిషిచ్యాధిరాజ్యే తు పృథుం వైన్యం పితామహః ।
తతః క్రమేణ రాజ్యాని వ్యాదేష్టుముపచక్రమే ॥
ద్విజానాం వీరుధాం చైవ నక్షత్ర గ్రహయోస్తథా ।
యజ్ఞానాం తపసాం చైవ సోమం రాజ్యేఽభ్యషేచయత్ ॥

ఇంతలో ఆ ఇంద్రుడు వజ్రమును చేత దాల్చి ఆమెయొక్క గర్భములో ప్రవేశించి ఆ గర్భభమును ఏడు ముక్కలుగా భగ్నము చేసెను (11). అపుడు వజ్రముచే ఏడు ముక్కలుగా భగ్నము గావించబడిన ఆ గర్భము తీవ్రముగా రోదించేను. కాని వజ్రపాణియగు ఇంద్రుడు ఆ గర్భశకలములను ఓ 'ఏడవకుడు' అని పలుకుతూ, మరల ఒక్కొక్క దానిని ఏడు ముక్కలుగా పగులగొట్టేను. అయిననూ, ఆ శకలములు మరణించలేదు (12). ఓ మునీ ! ఆ విధముగా పగులగొట్ట బడుచున్న శకలములు అన్నియు చేతులను జోడించి ఇంద్రునితో, 'ఓ ఇంద్రా ! మమ్ములను సంహరించ గోరుచున్నావా ? మేము నీ సోదరులమగు మరుత్తులము' అనీ

పలికెను (13). వారిని అందరినీ ఇంద్రుడు తన సోదరులుగా స్వీకరించెను. ఓ బ్రహ్మర్షీ ! వారు శంకరుని ఇచ్ఛచే రాక్షసభావమును విడిచిపెట్టిరి (14), మహాబలశాలురగు ఆ బాలకులు మరుత్తులు అనే దేవతలు అయిరి. ఆ నలభై తొమ్మిది మంది ఆకాశమునందు సంచరిస్తూ వజ్రపాణియగు ఇంద్రునకు సహాయకులగుచున్నారు (15). వారు పెరిగి పెద్దవారైన తరువాత ప్రజలను పాలించే విష్ణువు పృథువుతో మొదలిడి క్రమముగా వారికి రాజ్యములను ఇచ్చెను. ఆ వివరములను వినుము (16). అరిష్టుడు పరాక్రమశాలియగు పురుషుడు. కృష్ణుడు విజేత మరియు ప్రజాపాలకుడు (?). పర్జన్యుడు మేఘాధిపతి. ఈ జగత్తు అంతయు ఆయనకు సంబంధించినదియే (17). ఓ మహర్షీ! నేను నీకు ప్రాణుల సృష్టిని చక్కగా చెప్పితిని. ఇప్పుడు రాజ్యముల క్రమవిభాగమును చెప్పుచున్నాను. వినుము (18). బ్రహ్మగారు వేనుని కుమారుడగు పృథువును చక్రవర్తి స్థానమునందు అభిషేకించి తరువాత క్రమముగా రాజ్యములను అప్పజెప్పుటకు ఆరంభించెను (19). బ్రాహ్మణులకు, ఓషధులకు, నక్షత్రములకు, గ్రహములకు, యజ్ఞములకు మరియు తపస్సులకు రాజుగా సోముని అభిషేకించెను (20).

అపాం తు వరుణం రాజ్యే రాజ్ఞాం వైశ్రవణం ప్రభుమ్ ।
ఆదిత్యానాం తథా విష్ణుం వసూనామథ పావకమ్ ॥
ప్రజాపతీనాం దక్షం తు మరుతామథ వాసవమ్ ।
దైత్యానాం దానవానాం చ ప్రహ్లాదమమి తౌజసమ్ ॥
వైవస్వతం పితౄణాం చ యమం రాజ్యేఽ భిషేచయత్ ।
మాతౄణాం చ వ్రతానాం చ మంత్రాణాం చ తథా గవామ్ ॥
యక్షాణాం రాక్షసానాం చ పార్థివానాం తథైవ చ ।
సర్వభూత పిశాచానాం గిరిశం శూలపాణినమ్ ॥
శైలానాం హిమవంతం చ నదీనామథ సాగరమ్ ।
మృగాణామథ శార్దూలం గోవృషం తు గవామపి ॥
వనస్పతీనాం వృక్షాణాం వటం రాజ్యేఽ భిషేచయత్ ।
ఇతి దత్తం ప్రజేశేన రాజ్యం సర్వత్ర వై క్రమాత్ ॥
పూర్వస్యాం దిశి పుత్రం తు వైరాజస్య ప్రజాపతేః ।
స్థాపయామాస సర్వాత్మా రాజ్యే విశ్వపతిర్విభుః ॥
తథైవ మునిశార్దూల కర్దమస్య ప్రజాపతేః ।
దక్షిణస్యాం తథా పుత్రం సుధన్వానమచీక్లుపత్ ॥
పశ్చిమాయాం దిశి తథా రజసః పుత్రమచ్యుతమ్ ।
కేతుమంతం మహాత్మానం రాజానం వ్యాదిశత్ప్రభుః ॥
తథా హిరణ్య రోమాణం పర్జన్యస్య ప్రజాపతేః ।
ఉదీచ్యాం దిశి రాజానం దుర్ధర్షం సోఽభ్యషేచయత్ ॥
తస్య విస్తరమాఖ్యాతం పృథోర్వైన్యస్య శౌనక ।
మహర్ధ్యేతదధిష్ఠానం పురాణం పరికీర్తితమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం మరుచ్చరిత్రవర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥

జలములకు వరుణుని, రాజులకు కుబేరప్రభువును, ఆదిత్యులకు విష్ణువును, వసువులకు అగ్నిని, ప్రజాపతులకు దక్షుని, మరుత్తులకు ఇంద్రుని, దైత్యులకు మరియు దానవులకు మహాతేజశ్శాలియగు ప్రహ్లాదుని, పితృదేవతలకు సూర్యపుత్రుడగు యముని, మాతృదేవతలకు వ్రతములకు మంత్రములకు గోవులకు యక్షులకు రాక్షసులకు రాజులకు సకలభూతపిశాచములకు శూలమును చేతబట్టి ఉండే కైలాసవాసియగు శివుని, పర్వతములకు హిమవంతుని, నదులకు సముద్రుని, మృగములకు పెద్దపులిని, గోవులకు ఎద్దును, చెట్టుచేమలకు మర్రిచెట్టును అధిపతిగా అభిషేకించెను. ఈ విధముగా ప్రజాపతి సర్వజగత్తులో క్రమముగా రాజ్యాధికారములను అప్పజెప్పెను (21-26). సర్వమునకు ఆత్మయైనవాడు, జగత్తునకు ప్రభువు, సర్వవ్యాపకుడు అగు పరమేష్ఠి తూర్పు దిక్కునందు వైరాజప్రజాపతియొక్క కుమారుని స్థాపించెను (27). ఓ మహర్షీ ! అదే విధముగా కర్దమ ప్రజాపతియొక్క పుత్రుడగు సుధన్వుని దక్షిణదిక్కునందు అధిపతిగా నియమించెను (28). అదే విధముగా పరమేష్ఠి పశ్చిమదిక్కునందు రజసుని పుత్రుడు, మహాత్ముడు, వినాశము లేనివాడు అగు కేతుమంతుని రాజుగా అభిషేకించెను (29). అదే విధముగా ఆయన ఉత్తరదిక్కునందు పర్జన్య ప్రజాపతియొక్క కుమారుడు, జయింప శక్యము కానివాడు అగు హిరణ్య రోముని రాజుగా అభిషేకించెను (30). ఓ శౌనకా ! వేనుని పుత్రుడగు పృథువుయొక్క వృత్తాంతమును నీకు విస్తారముగా చెప్పితిని. అతి ప్రాచీనమైన, ఆ పృథువు యొక్క సామ్రాజ్యము అగు ఈ భూమీ సమస్త సంపదలకు నిలయమనీ కీర్తించబడినది (31).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మరుత్తుల చరితమును వర్ణించే ముప్పది మూడవ అధ్యాయము ముగిసినది (33).

34 – చతుర్దశ మన్వంతర వర్ణనము

శౌనక ఉవాచ।

మన్వంతరాణి సర్వాణి విస్తరేణానుకీర్తయ ।
యావంతో మనవశ్చైవ శ్రోతుమిచ్ఛామి తానహమ్ ॥

శౌనకుడు ఇట్లు పలికెను –

మన్వంతరములను అన్నింటినీ విస్తరముగా వర్ణించుము. మనువులు ఎందరు గలరో, వారి గురించి నేను వినగోరుచున్నాను (1).

సూత ఉవాచ ।

స్వాయంభువో మనుశ్చైవ తతస్స్వారోచిషస్తథా ।
ఉత్తమస్తామస్తశ్చైవ రైవతశ్చాక్షుషస్తథా ॥
ఏతే చ మనవః షట్ తే సంప్రోక్తా మునిపుంగవ ।
వైవస్వతో మునిశ్రేష్ఠ సాంప్రతం మనురుచ్యతే ॥
సావర్ణిశ్చ మనుశ్చైవ తతో రౌచ్యస్తథా పరః ।
తథైవ బ్రహ్మసావర్ణిశ్చత్వారో మనవస్తథా ॥
తథైవ ధర్మసావర్ణి రుద్రసావర్ణిరేవ చ ।
దేవసావర్ణిరాఖ్యాత ఇంద్రసావర్ణిరేవ చ ॥
అతీతా వర్తమానాశ్చ తథైవానాగతాశ్చ యే ।
కీర్తితా మనవశ్చాపి మయైవైతే యథా శ్రుతాః ॥
మునే చతుర్దశైతాని త్రికాలానుగతాని తే ।
ప్రోక్తాని నిర్మితః కల్పే యుగసాహస్ర పర్యయః ॥
ఋషీంస్తేషాం ప్రవక్ష్యామి పుత్రాన్ దేవగణాంస్తథా ।
శృణు శౌనక సుప్రీత్యా క్రమశస్తాన్యశస్వినః ॥
మరీచిరత్రిర్భగవానంగిరాః పులహః క్రతుః ।
పులస్త్యశ్చ వసిష్ఠశ్చ సప్తైతే బ్రహ్మణస్సుతాః ॥
ఉత్తరస్యాం దిశి తథా మునే సప్తర్షయస్తథా ।
యామా నామ తథా దేవా ఆసన్ స్వాయంభువేంతరే ॥
అగ్నీధ్రశ్చాగ్నిబాహుశ్చ మేధా మేధాతిథిర్వసుః ।
జ్యోతిష్మాన్ ధృతిమాన్ హవ్యః సవనశ్శుభ్ర ఏవ చ ॥
స్వాయంభువస్య పుత్రాస్తే మనోర్దశ మహాత్మనః ।
కీర్తితా మునిశార్దూల తత్రేంద్రో యజ్ఞ ఉచ్యతే ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! స్వాయంభువమనువు, స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుషుడు అనే ఆర్గురు మనువులు గలరని నీకు ఇదివరలో చెప్పబడినది. ఓ మహర్షీ! ప్రస్తుతము వైవస్వతమనువుయొక్క కాలము జరుగుచున్నది (2,3). సావర్ణిమనువు, రౌచ్యుడు, బ్రహ్మసావర్ణి అను వారితో బాటు ధర్మ-రుద్ర- దేవ- ఇంద్రసావర్ణులు అనే నలుగురు మనువులను కలుపుకొనీ గడచిన, నడచుచున్న, మరియు రాబోయే మనువులను అందరిని గురించి చెప్పినట్లైనది. నేను ఈ వివరములను విన్న దానికి అనుగుణముగా చెప్పితిని (4-6). ఓ మునీ ! భూతవర్తమానభవిష్యత్కాలములకు సంబంధించి వీరు పదునలుగురు మనువులు అని చెప్పబడినది. ఈ మన్వంతరములు అన్నీ కలిసి కల్పము అగును. కల్పమనగా వేయి మహా యుగములు (7). ఓ శౌనకా ! నేను ఆయా మన్వంతరములకు చెందిన ఋషులను, వారి పుత్రులను, దేవగణములను గురించి క్రమముగా చెప్పెదను. కీర్తిమంతులగు వారిని గురించి నీవు అతిశయించిన ప్రీతితో వినుము (8). మరీచి, అత్రి, పూజ్యుడగు అంగిరసుడు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, వసిష్ఠుడు అనే ఏడుగురు బ్రహ్మయొక్క పుత్రులు (9). ఓ మునీ ! ఈ ఏడ్గురు ఋషులు ఉత్తరదిక్కునందు గలరు. స్వాయంభువమన్వంతరములో యాములు అనే దేవతలు గలరు (10). ఓ మహర్షీ ! మహాత్ముడగు స్వాయంభువమనువునకు ఆగ్నీధ్రుడు, అగ్నిబాహుడు, మేధ, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుడు, ధృతిమంతుడు, హవ్యుడు, సవనుడు, శుభ్రుడు అనే పదిమంది పుత్రులు గలరని చెప్పబడినది. ఆ మన్వంతరములోని ఇంద్రునకు యజ్ఞుడు అని పేరు (11, 12).

ప్రథమం కథితం తాత దివ్యం మన్వంతరం తథా ।
ద్వితీయం తే ప్రవక్ష్యామి తన్ని బోధ యథాతథమ్ ॥
ఊర్జస్తంభః పరస్తంభ ఋషభో వసుమాంస్తథా ।
జ్యోతిష్మాన్ ద్యుతిమాంశ్చైవ రోచిష్మాన్ సప్తమస్తథా ॥
ఏతే మహర్షయో జ్ఞేయస్తత్రేంద్రో రోచనస్తథా ।
దేవాశ్చ తుషితా నామ స్మృతాస్స్వారోచిషేంతరే ॥
హరిఘ్నస్సు కృతిర్జ్యోతి రయోమూర్తిరయస్మయః ।
ప్రథితశ్చ మనస్యుశ్చ నభస్సూర్య స్తథైవ చ ॥
స్వారోచిషస్య పుత్రాస్తే మనోర్దశ మహాత్మనః ।
కీర్తితో మునిశార్దూల మహావీర్య పరాక్రమాః ॥
ద్వితీయమేతత్కథితం మునే మన్వంతరం మయా ।
తృతీయం తవ వక్ష్యామి తన్నిబోధ యథాతథమ్ ॥
వసిష్ఠపుత్రాస్సప్తాసన్ వాసిష్ఠా ఇతి విశ్రుతాః ।
హిరణ్యగర్భస్య సుతా ఊర్జా నామ మహౌజసః ॥
ఋషయోఽత్ర సమాఖ్యాతాః కీర్త్యమానాన్ని బోధ మే ।
ఔత్తమేయా ఋషి శ్రేష్ఠ దశ పుత్రా మనోః స్మృతాః ॥

ఇష ఊర్జిత ఊర్జశ్చ మధుర్మాధవ ఏవ చ ।

శుచిశ్శుక్రవహాశ్చైవ నభసో నభ ఏవ చ ॥

ఋషభస్తత్ర దేవాశ్చ సత్యవేద శ్రుతాదయః ।

తత్రేంద్ర స్సత్యజిన్నామ త్రైలోక్యాధిపతిర్మునే ॥

ఓ వత్సా ! నీకు నేను దివ్యమైన మొదటి మన్వంతరమును గురించి చెప్పితిని. ఇప్పుడు రెండవ మన్వంతరమును గురించి చెప్పెదను. దానిని యథాతథముగా తెలుసుకొనుము (13). దానియందు ఊర్జస్తంభుడు, పరస్తంభుడు, ఋషభుడు, వసుమంతుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, రోచిష్మంతుడు అను ఏడ్గురు ఋషులు అనియు, ఇంద్రుడు రోచనుడనియు తెలియవలెను. ఈ స్వారోచిషమమన్వంతరములో దేవతలకు తుషితులని పేరు (14,15). మహాత్ముడగు స్వారోచిషమనువునకు హరిఘ్నుడు, సుకృతి, జ్యోతి, అయోమూర్తి, అయస్మయుడు, ప్రథితుడు, మనస్యుడు, నభస్సు, సూర్యుడు అనే పది మంది (?) పుత్రులు గలరు. ఓ మహర్షీ! వీరు గొప్ప వీర్యము, పరాక్రమము గలవారని కీర్తింపబడిరి (16, 17). ఓ మునీ! నేను నీకు ఈ విధముగా రెండవ మన్వంతరమును గురించి చెప్పితిని. ఇప్పుడు మూడవ దానిని చెప్పెదను. దానిని యథాతథముగా తెలుసుకొనుము (18). వసిష్ఠునకు ఏడ్గురు పుత్రులు గలరు. వారికి వాసిష్ఠులు అని పేరు. హిరణ్యగర్భునకు గొప్ప తేజస్సు గల ఊర్ధులు అనే పుత్రులు గలరు (19). వీరు ఆ మన్వంతరములోని ఋషులని చెప్పబడినది. ఓ మహర్షీ ! ఉత్తమమనువునకు పదిమంది పుత్రులు గలరు. నేను వారిని గురించి చెప్పెదను. తెలుసుకొనుము (20). ఇషుడు, ఊర్జితుడు, ఊరుడు, మధువు, మాధవుడు, శుచి, శుక్రవహుడు, నభుడు, నభస్సు, ఋషభుడు అనునవి వారి పేర్లు. ఆ మన్వంతరములో సత్యవేదశ్రుతులు మొదలగు వారు దేవతలు. ఓ మునీ ! దానియందు ముల్లోకములకు అధిపతి యగు ఇంద్రుని పేరు సత్యజిత్తు (2 1,22).

తృతీయమేతత్పరమం మన్వంతరముదా హృతమ్ ।

మన్వంతరం చతుర్థం తే కథయామి మునే శృణు ॥

గార్గ్యః పృథుస్తథా వాగ్మీ జయో ధాతా కపీనకః ।

కపీవాన్ సప్త ఋషయస్సత్యా దేవగణాస్తథా ॥

తత్రేంద్రస్త్రి శిఖో జ్ఞేయో మనుపుత్రాన్మునే శృణు ।

ద్యూతిపోతస్సౌ తపస్యస్తమశ్శూలిశ్చ తాపనః ॥

తపోరతిరకల్మాషో ధన్వీ ఖడ్గీ మహాన్నృషిః ।

తామసస్య స్మృతా ఏతే దశ పుత్రా మహావ్రతాః ॥

తామసస్యాంతరం చైవ మనోర్మే కథితం తవ ।

చతుర్థం పంచమం తాత శృణు మన్వంతరం పరమ్ ॥

దేవబాహుర్జయశ్చైవ మునిర్వేదశిరా స్తథా ।

హిరణ్య రోమా పర్జన్య ఊర్ధ్వబాహుశ్చ సోమపాః ॥

సత్యనేత్రరతాశ్చాన్యే ఏతే సప్తర్షయోఽపరే ।

దేవాశ్చ భూతరజసస్తపః ప్రకృతయస్తథా ॥

తత్రేంద్రో విభునామా చ త్రైలోక్యాధిపతి స్తథా ।

రైవతాఖ్యో మనుస్తత్ర జ్ఞేయస్తామ ససోదరః ॥

అర్జునః పంక్తివింధ్యో వా దయాయాస్తనయా మునే ।

మహతా తపసా యుక్తా మేరుపృష్ఠే వసంతి హి ॥

రుచేః ప్రజాపతేః పుత్రో రౌచ్యో నామ మనుః స్మృతః ।

భూత్యాం చోత్పాదితో దేవ్యాం భౌత్యో నామా భవత్సుతః ॥

అనాగతాశ్చ సప్తైతే కల్పేఽస్మిన్మనవస్స్మృతాః ।

అనాగతాశ్చ సప్తైవ స్మృతా దివి మహర్షయః ॥

శ్రేష్ఠమగు ఈ మూడవ మన్వంతరమును గురించి చెప్పితిని. ఓ మునీ ! నీకు నాల్గవ మన్వంతరమును గురించి చెప్పెదను. వినుము (23). దానిలో గార్గ్యుడు, పృథువు, వాగ్మి, జయుడు, ధాత, కనకుడు, కపీవంతుడు అను వారు సప్తర్షులు. దాని యందు దేవగణములు సత్యులనబడుదురు (24). ఓ మునీ ! దానియందు ఇంద్రునకు త్రిశిఖుడని పేరు. ఇప్పుడు తామస మనువుయొక్క పుత్రులను గురించి చెప్పెదను. వినుము. తామసమనువునకు ద్యుతిపోతుడు, సౌతపస్యుడు, తమసుడు, శూలుడు, తాపనుడు, తపోరతి, అకల్మషుడు, ధన్వి, ఖడ్గ, మహాత్ముడగు ఋషి అనే గొప్ప నిష్ఠ గల పదిమంది పుత్రులు గలరు (25, 26). ఈ విధముగా నాల్గవ తామసమన్వంతరమును గురించి చెప్పితిని. ఓ వత్సా ! అయిదవ గొప్ప మన్వంతరమును గురించి వినుము (27). దేవబాహువు, జయుడు, వేదశిరస్సు అనే ముని, హిరణ్యరోముడు, పర్జన్యుడు, ఊర్ధ్వబాహువు, సోమపుడు అను వారు సప్తర్షులు. వారు సత్యమే నేత్రముగా గలవారై సత్యమునందు ప్రీతి కలిగి యుండిరి. వీరే గాక, ఇతరులగు మహర్షులు కూడ గలరు. భూత రజసులు అనబడే దేవతలు తపస్సును చేసే స్వభావమును కలిగియుందురు (28, 29). ఆ మన్వంతరములో ముల్లోకములకు అధిపతియగు ఇంద్రునకు విభుడు అని పేరు. దీనికి రేవతమన్వంతరము అని పేరు. రైవతుడు తామసుని సోదరుడని తెలియదగును (30). ఓ మునీ ! ఆయన కుమారులు అగు అర్జునుడు, పంక్తివింధ్యుడు మొదలగు వారు మేరుశిఖరముపై నివసించి గొప్ప తపస్సును చేయుదురు. వీరు దయాదేవి యొక్క పుత్రులు (31). రౌచ్యమనువు రుచిప్రజాపతియొక్క పుత్రుడని మహర్షులు చెప్పెదరు. ఆయనకు భూతిదేవియందు భౌత్యుడు అనే పుత్రుడు కలిగెను (32). ఈ కల్పమునందు ఇంకనూ గడవని ఏడు మన్వంతరములు గలవు. వాటియందు కూడా ఏడ్గురు మహర్షులు స్వర్గలోకమునందు ఉండెదరని చెప్పబడినది (33).

రామో వ్యాసస్తథాత్రేయో దీప్తిమాన్ సుబహుశ్రుతః ।

భరద్వాజస్తథా ద్రౌణిరశ్వత్థామా మహాద్యుతిః ॥

గౌతమస్యాత్మజశ్చైవ శరద్వాన్ గౌతమః కృపః ।

కౌశికో గాలవశ్చైవ రురుః కశ్యప ఏవ చ ॥

ఏతే సప్త మహాత్మానో భవిష్యా మునిసత్తమాః ।

దేవాశ్చానా గతాస్తత్ర త్రయః ప్రోక్తాస్స్వయంభువా ॥

మారీచేశ్చైవ పుత్రాస్తే కశ్యపస్య మహాత్మనః।
తేషాం విరోచనసుతో బలిరింద్రో భవిష్యతి ॥
విషాంగశ్చావనీవాంశ్చ సుమంతో ధృతిమాన్ వసుః ।
సూరిస్సు రాఖ్యో విష్ణుశ్చ రాజా సుమతిదేవ చ॥
సావర్ణేశ్చ మనోః పుత్రా భవిష్యా దశ శౌనక ।
ఇహాష్టమం హి కథితం నవమం చాంతరం శృణు ॥
ప్రథమం దక్షసావర్ణిం ప్రవక్ష్యామి మనుం శృణు ।
మేధాతిథిశ్చ పౌలస్త్యో వసుః కశ్యప ఏవ చ ॥
జ్యోతిష్మాన్ భార్గవశ్చైవ ధృతిమానంగిరా స్తథా ।
సవనశ్చైవ వాసిష్ఠ ఆత్రేయో హవ్య ఏవ చ ॥
పులహస్సప్త ఇత్యేతే ఋషయో రోహితేంతరే ।
దేవతానాం గణాస్తత్ర త్రయ ఏవ మహామునే ॥
దక్ష పుత్రస్య పుత్రాస్తే రోహితస్య ప్రజాపతేః ।
ధృష్టకేతుర్దీప్తకేతుః పంచహస్తో నిరాకృతిః ॥
పృథుశ్రవా భూరిద్యుమ్నో ఋచీకో బృహతో గయః ।
ప్రథమస్య తు సావర్ణేర్నవ పుత్రా మహౌజసః ॥

పరశు రాముడు, వ్యాసుడు, ఆత్రేయుడు, దీప్తిమంతుడు, సుబహుశ్రుతుడు, భరద్వా◌ాజుడు, ద్రోణుని కుమారుడగు అశ్వత్థామ అను ఏడ్గురు ఈ మన్వంతరములోని ఋషులు (34). గౌతముని పుత్రుడగు శరద్వంతుడు, గౌతముడు, కృపుడు, కౌశికుడు, గాలవుడు, రురుడు, కశ్యపుడు అనే ఈ ఏడుగురు మహాత్ములు భవిష్యత్తులోని మహర్షులు. రాబోయే మన్వంతరములోని దేవతలు మూడు రకములుగా నుందురని స్వయంభువుడగు బ్రహ్మ చెప్పెను (35,36). వారే మరీచిపుత్రుడు, మహాత్ముడు అగు కశ్యపుని పుత్రులు. విరోచనుని పుత్రుడగు బలి వారికి ఇంద్రుడు కాగలడు (37). ఓ శౌనకా ! భవిష్యత్తులో సావర్ణి మనువునకు విషాంగుడు, అవనీవంతుడు, సుమంతుడు, ధృతిమంతుడు, వసువు, సూరి, సురుడు, విష్ణువు, రాజు, సుమతి అనే పది మంది పుత్రులు కలిగెదరు. ఇంతవరకు నీకు ఎనిమిదవ మన్వంతరమును గురించి చెప్పితిని. ఇప్పుడు తొమ్మిదవ మన్వంతరమును గురించి వినుము (38,39). ముమ్మందుగా దక్షసావర్ణి మనువును గురించి చెప్పెదను వినుము. పులస్త్యవంశమునందు పుట్టిన మేధాతిథి, వసువు, కశ్యపుడు, తేజశ్శాలి భృగువంశమునందు జన్మించినవాడు ధైర్యశాలి అగు అంగిరసుడు, వసిష్ఠపుత్రుడగు సవనుడు, అత్రి కుమారుడగు హవ్యుడు, పులహుడు అనే ఏడుగురు ఋషులు రౌహితమన్వంతరములో నుండెదరు. ఓ మహర్షీ! ఆ మన్వంతరములో దేవతా గణములు మూడు కూడ ఉండును (40-42). దక్షుని కుమారుడు, దక్షసావర్ణి అని ఖ్యాతిని గాంచినవాడు, గొప్ప తేజశ్శాలి అగు రోహితప్రజాపతికి ధృష్టకేతువు, దీప్తకేతువు, పంచహస్తుడు, నిరాకృతి, పృథు శ్రవసుడు, భూరిద్యుమ్నుడు, ఋచీకుడు, బృహతుడు, గయుడు అనే తొమ్మిదిమంది పుత్రులు గలరు (43,44).

దశమే త్వథ పర్యాయే ద్వితీయస్యాంతరే మనోః ।
హవిష్మాన్ పులహశ్చైవ ప్రకృతిశ్చైవ భార్గవః ॥
ఆయో ముక్తిస్తథాత్రేయో వసిష్ఠశ్చావ్యయస్స్మృతః ।
పౌలస్త్యః ప్రయతిశ్చైవ భామారశ్చైవ కశ్యపః ॥
అంగిరానేనసస్సత్యస్సప్తైతే పరమర్షయః ।
దేవతానాం గణాశ్చాపి ద్విషిమంతశ్చ తే స్మృతాః ॥
తేషామింద్రస్స్మృతశ్శంభు స్స్వయమేవ మహేశ్వరః ।
అక్షత్వానుత్తమౌజాశ్చ భూరిషేణశ్చ వీర్యవాన్ ॥
శతానీకో నిరామిత్రో వృషసేనో జయద్రథః ।
భూరిద్యుమ్నస్సువర్చార్చిర్దశ త్వేతే మనోస్సుతాః ॥
ఏకాదశే తు పర్యాయే తృతీయస్యాంతరే మనోః ।
తస్యాపి సప్త ఋషయః కీర్త్యమానాన్ని బోధ మే ॥
హవిష్మాన్ కశ్యపశ్చాపి వపుష్మాంశ్చైవ వారుణః ।
ఆత్రేయోఽథ వసిష్ఠశ్చ హ్యనయస్త్వంగిరాస్తథా ॥
చారు ధృష్యశ్చ పౌలస్త్యో నిస్స్వరోఽ గ్నిస్తు తైజసః ।
సప్తైతే ఋషయః ప్రోక్తాస్త్రయో దేవగణాస్మృతాః ॥
బ్రహ్మణస్తు సుతాస్తే హి త ఇమే వైధృతాస్స్మృతాః ।
సర్వగశ్చ సుశర్మా చ దేవానీకస్తు క్షేమకః ॥
దృఢేషుః ఖండకో దర్శః కుహుర్బాహుర్మనోస్స్మృతాః ।
సావర్ణస్య తు పౌత్రా వై తృతీయస్య నవ స్మృతాః ॥
చతుర్థస్య తు సావర్ణేః ఋషీన్ సప్త నిబోధ మే ।
ద్యుతిర్వసిష్ఠ పుత్రశ్చ ఆత్రేయస్సుతపాస్తథా ॥
అంగిరాస్తపసో మూర్తిస్తపస్వీ కశ్యపస్తథా ।
తపోధనశ్చ పౌలస్త్యః పులహశ్చ తపోరతిః ॥
భార్గవస్సప్తమస్తేషాం విజ్ఞేయస్తపసో నిధిః ।
పంచ దేవగణాః ప్రోక్తా మానసా బ్రహ్మణస్సుతాః ॥

పదవది యగు రెండవ సావర్ణియొక్క మన్వంతరములో హవిష్మంతుడు, పులహుడు, ప్రకృతి, భార్గవుడు (45), ఆయుడు, ముక్తి, ఆత్రేయుడు, వసిష్ఠుడు, అవ్యయడు అను ఋషులతో బాటు పౌలస్త్యుడు, ప్రయతి, భామారుడు, కశ్యపుడు (46), అంగిరసుడు, అనేనసుడు, సత్యుడు అను ఏడుగురు ఋషులు ఉండెదరు. ఆ మన్వంతరములోని దేవతాగణములకు ద్విషీమంతులు అని పేరు (47). మహేశ్వరుడగు ఈ శంభుడే వారికి ఇంద్రుడని చెప్పబడినది. అక్షత్వంతుడు, ఉత్తమౌజసుడు, భూరిషేణుడు, వీర్యవంతుడు, శతానీకుడు, నిరామిత్రుడు, వృషసేనుడు, జయద్రథుడు, భూరిద్యుమ్నుడు, సువర్చార్చి అను పదిమంది ఆ మనువు యొక్క పుత్రులు (48,49). మూడవ సావర్ణియొక్క పదకొండవ మన్వంతరములో కూడ సప్తర్షులు గలరు. వారి పేర్లను నేను చెప్పెదను. విని

తెలుసుకొనుము (50). హవిష్మంతుడు, కశ్యపుడు, వపుష్మంతుడు, వారుణుడు, ఆత్రేయుడు, వసిష్ఠుడు అనే ఋషులతో బాటు అనయుడు, అంగిరసుడు, చిరుధృష్యుడు, పౌలస్త్యుడు, నిస్స్వరుడు, అగ్ని, తైజసుడు అనే సప్తర్షులు కూడ గలరు. వీరు గాక, మూడు దేవగణములు గలరు (51,52). బ్రహ్మపుత్రులగు ఆ దేవతలకు వైధృతులు అని పేరు. మూడవ సావర్ణికి సర్వగుడు, సుశర్మ, దేవానీకుడు, క్షేమకుడు, దృడేషువు, ఖండకుడు, దర్శుడు, కుహుడు, బాహుడు అనే తొమ్మిది మంది పుత్రులు గలరు (53, 54). ఈ తొమ్మిదిమంది సావర్ణునకు పౌత్రులు. నాల్గవ సావర్ణికి సంబంధించిన ఏడ్గురు ఋషులను గురించి తెలుసుకొనుము. వసిష్ఠపుత్రుడగు ద్యుతి, గొప్ప తపశ్శాలియగు ఆత్రేయుడు, తపోమూర్తి యగు అంగిరసుడు, తపశ్శాలియగు కశ్యపుడు, తపోధనుడగు పౌలస్త్యుడు, తపస్సునందు గొప్ప ప్రీతి గల పులహుడు మరియు ఏడవ వాడు మరియు తపోనిధి యగు భార్గవుడు అను వారు సప్తర్షులు. బ్రహ్మయొక్క మానసపుత్రులగు అయిదు దేవగణములు కూడ గలవు (55-57).

ఋతధామా తదింద్రో హి త్రిలోకీ రాజ్యకృత్సుఖీ ।
ద్వాదశే చైవ పర్యాయే భావ్యే రౌచ్యాంతరే మునే ॥
అంగిరాశ్చైవ ధృతిమాన్ పౌలస్త్యో హవ్యవాంస్తు యః ।
పౌలహస్తత్త్వదర్శీ చ భార్గవశ్చ నిరుత్సవః ॥
నిష్ప్రపంచస్తథా త్రేయో నిర్దేహః కశ్యపస్తథా ।
సుతపాశ్చైవ వాసిష్ఠస్సప్తైవైతే మహర్షయః ॥
త్రయ ఏవ గణాః ప్రోక్తా దేవతానాం స్వయంభువా ।
దివస్పతిస్తమింద్రో వై విచిత్రశ్చిత్ర ఏవ చ ॥
నయో ధర్మో ధృతోఽద్రశ్చ సునేత్రః క్షత్రవృద్ధకః ।
నిర్భయస్సుతపా ద్రోణో మనో రౌచ్యస్య తే సుతాః ॥
చతుర్దశే తు పర్యాయే సత్యస్యైవాంతరే మనోః ।
ఆగ్నీధ్రః కాశ్యపశ్చైవ పౌలస్త్యో మాగధశ్చ యః ॥
భార్గవోఽప్యతవాహ్యశ్చ శుచిరాంగిరస స్తథా ।
యుక్తశ్చైవ తథాత్రేయః పౌత్రో వాశిష్ఠ ఏవ చ ॥
అజితః పులహశ్చైవ హ్యంత్యాస్సప్తర్షయశ్చ తే ।
పవిత్రాశ్చాక్షుషా దేవాశ్శుచిరింద్రో భవిష్యతి ॥
ఏతేషాం కల్య ఉత్థాయ కీర్తనాత్సుఖమేధతే ।
అతీతానాగతానాం వై మహర్షిణాం నరైస్సదా ॥
దేవతానాం గణాః ప్రోక్తాశ్శృణు పంచ మహామునే ।
తురంగభీరుర్బుధ్నశ్చ తనుగ్రోఽనూగ్ర ఏవ చ ॥
అతిమానీ ప్రవీణశ్చ విష్ణుస్సంక్రందన స్తథా ।
తేజస్వీ సబలశ్చైవ సత్యస్యైతే మనోస్సుతాః ॥

ఆ మన్వంతరములో ఋతధామ అనబడే ఇంద్రుడు సుఖముగా ముల్లోకములను ఏలు ను. ఓ మునీ ! భవిష్యత్తులో రాబోయే పన్నెండవ రౌచ్యమన్వంతరములో ధైర్యశాలి యగు అంగిరసుడు, పులస్త్యవంశీయుడగు హవ్యవంతుడు, తత్త్వమునెరింగిన పౌలహుడు, సంసారమునందు ఉత్సాహము లేని భార్గవుడు, మిథ్యా ప్రపంచమును త్రోసిపుచ్చిన ఆత్రేయుడు, దేహాభిమానము లేని కశ్యపుడు, గొప్ప తపశ్శాలియగు వాసిష్టుడు అను వారలు సప్తమహర్షులుగా నుందురు (58-60). అప్పుడు స్వయంభువుడగు బ్రహ్మ మూడు దేవతాగణములను సృష్టించును. స్వర్గలోకాధిపతికి ఆ మన్వంతరములో ఇంద్రుడనియే పేరు. విచిత్రుడు, చిత్రుడు (61), నయుడు, ధర్ముడు, ధృతుడు, అంధ్రుడు, సునేత్రుడు, క్షత్రవృద్ధకుడు, నిర్భయుడు, సుతపసుడు మరియు ద్రోణుడు అనువారలు రౌచ్యమనువు యొక్క పుత్రులు అగుదురు (62). సత్యమనువుయొక్క పదునాల్గవ మన్వంతరములో కశ్యపపుత్రుడగు ఆగ్నీధ్రుడు, పులస్త్యతనయుడగు మాగధుడు, భృగువంశీయుడగు అతివాహ్యుడు, అంగిరసపుత్రుడగు శుచి, జ్ఞాని మరియు ఆత్రేయుని పౌత్రుడు అగు వాసిష్ఠుడు, అజితుడు మరియు ఏడవవాడగు పులహుడు అనే ఆఖరి సప్తర్షులు ఉండెదరు. పవిత్రులగు చాక్షుషులు దేవతలు కాగా, శుచి ఇంద్రుడు అగును (63-65). ఉదయమే నిద్ర లేచి గడచిన మరియు రాబోయే ఈ మహర్షులను కీర్తించు మానవులకు సుఖము వర్ధిల్లును (66). ఓ మహర్షీ ! వినుము. దీనిలో అయిదు దేవతాగణములు ఉండునని చెప్పబడినది. తురంగభీరువు, బుధుడు, తనుగ్రుడు, అనూ గ్రుడు, అతిమాని, ప్రవీణుడు, విష్ణువు, సంక్రందనుడు, తేజస్వి, సబలుడు మరియు సత్యుడు అనువారలు మనువుయొక్క పుత్రులు (67, 68).

భౌమస్యైవాధికారే వై పూర్వకల్పస్తు పూర్యతే ।
ఇత్యేతేఽ నాగతాఽతీతా మనవః కీర్తితా మయా ॥
ఉక్తాస్సనత్కుమారేణ వ్యాసాయామితతేజసే ।
పూర్ణే యుగసహస్రాంతే పరిపాల్య స్వధర్మతః ॥
ప్రజాభిస్తపసా యుక్తా బ్రహ్మలోకం వ్రజంతి తే ।
యుగాని సప్తతిస్త్వేకం సాగ్రాణ్యంతర ముచ్యతే ॥
చతుర్దశైతే మనవః కీర్తితాః కీర్తివర్ధనాః ।
మన్వంతరేషు సర్వేషు సంహారాంతే పునర్భవః ॥
న శక్యమంతరం తేషాం వక్తుం వర్షశతైరపి ।
పూర్ణే శతసహస్రే తు కల్పో నిశ్శేష ఉచ్యతే ॥
తత్ర సర్వాణి భూతాని దగ్ధాన్యాదిత్య రశ్మిభిః ।
బ్రహ్మాణమగ్రతః కృత్వా సదాదిత్య గణైర్మునే ॥
ప్రవిశంతి సురశ్రేష్ఠం హరిం నారాయణం పరమ్ ।
స్రష్టారం సర్వభూతానాం కల్పాంతేషు పునః పునః ।

భూయోపి భగవాన్ రుద్రస్సంహర్తా కాల ఏవ హి ।

కల్పాంతే తత్రవక్ష్యామి మనోర్వైవస్వతస్య వై ॥

ఇతి తే కథితం సర్వం మన్వంతర సముద్భవమ్ ।

విసర్గం పుణ్యమాఖ్యానం ధన్యం కులవివర్ధనమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం సర్వమన్వంతరాను కీర్తనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥

దీనికి ముందు ఉన్న కల్పము భౌముని అధికారములో పూర్ణమైనది (?). ఈ వి◌ధముగా నేను గడచిన మరియు రాబోయే మనువులను గురించి చెప్పితిని (69). ఈ వివరములను సనత్కుమారుడు మహాతేజశ్శాలియగు వ్యాసునకు చెప్పెను. తపశ్శాలురగు ఆ మనువులు ప్రజలను స్వధర్మానురూపముగా పరిపాలించి వేయి యుగములు పూర్తి అయిన తరువాత సంతానముతో సహా బ్రహ్మలోకమును పొందెదరు. డెబ్బది ఒక్క యుగములు మరియు యుగములోని ఒక అంశము కలిసి ఒక మన్వంతరమగును (70,71). కీర్తిని వర్ధిల్లజేయు ఈ పదునాలు మనువులను గురించి వర్ణించితిని. మన్వంతరములన్నింటి యందు జగత్తు ప్రళయములో ఈశ్వరునియందు విలీనమై మరల సృష్టి జరుగుచుండును (72). ఆ మన్వంతరముల మధ్యలోని కాలమును వర్ణించుటకు వందల సంవత్సరములు కాలమైననూ చాలదు. వేయి మహాయుగముల కాలము పూర్తి కాగానే కల్పము నిశ్శేషమగును (73). ఓ మునీ ! ఆ కాలమునందు సూర్యరశ్మిలచే దహింపబడిన సర్వప్రాణులు బ్రహ్మను ముందిడుకొని ప్రకాశించే ఆదిత్య గణములతో కలిసి, దేవతలలో శ్రేషుడు పరాత్పరుడు పాపహారి సర్వప్రాణులను సృష్టించువాడు అగు నారాయణుని ప్రవేశించెదరు. ఈ విధముగా ప్రతి కల్పాంతమునందు జరుగుచుండును (74, 75). మరల కాలరూపుడగు రుద్ర భగవానుడు కల్పము పూర్తి అయిన తరువాత జగత్తును ఉపసంహరించును. వైవస్వతమనువుయొక్క వృత్తాంతమును మరల చెప్పగలను (76). నేనింతవరకు మన్వంతరములు పుట్టిన విధానమును మరియు వివిధరకముల సృష్టిని వర్ణించితిని. ధన్యము మరియు పుణ్యము అగు ఈ వృత్తాంతము కులమును వర్ధిల్లజేయును (77).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మన్వంతరవర్ణనమనే ముప్పది నాల్గవ అధ్యాయము ముగిసినది (34).

35 – సూర్యుని గాథ

సూత ఉవాచ ।

వివస్వాన్ కశ్యపాజ్జజ్ఞే దాక్షాయణ్యాం మహాఋషేః ।
తస్య భార్యాఽ భవత్సంజ్ఞా త్వాష్ట్రీదేవీ సురేణుకా ॥
మునేఽ సహిష్ణునా తేన తేజసా దుస్స హేన చ ।
భర్తృరూపేణ నాతుష్య ద్రూపయౌ వనశాలినీ ॥
ఆదిత్యస్య హి తద్రూపమ సహిష్ణుస్సు తేజసః ।
దహ్యమానా తదోద్వేగమకరోద్వర వర్ణినీ ॥
ఋషేఽ స్యాం త్రీణ్యపత్యాని జనయామాస భాస్కరః ।
సంజ్ఞాయాం తు మనుః పూర్వం శ్రాద్ధదేవః ప్రజాపతిః ॥
యమశ్చ యమునా చైవ యమలౌ సంబభూవతుః ।
ఏవం హి త్రీణ్యపత్యాని తస్యాం జాతాని సూర్యతః ॥
సంవర్తులం తు తద్రూపం దృష్ట్వా సంజ్ఞా వివస్వతః ।
అసహంతీ తతశ్ఛాయా మాత్మనస్సాఽసృజచ్ఛు భామ్ ॥
మాయామయీ తు సా సంజ్ఞామవోచద్భక్తిత శ్శుభే ।
కిం కరోమీహ కార్యం తే కథయస్వ శుచిస్మితే ॥

సూతుడు ఇట్లు పలికెను –

కశ్యపమహర్షికి దక్షుని కుమార్తెయందు సూర్యుడు జన్మించెను. ఆయనకు త్వష్టృని కుమార్తెయగు సంజ్ఞా భార్య ఆయెను. ఆమెకు సురేణుక అని కూడ పేరు గలదు (1). ఓ మునీ ! రూపముతో మరియు యావనముతో ప్రకాశించే ఆ సంజ్ఞ భర్త అనే రూపములో నున్న దుస్సహమగు తేజస్సును సహించలేకపోయెను. ఆమెకు ఆనందము లేకుండెను (2), సూర్యుని ఆ మహాతేజస్వంతమగు రూపమును సహించుట అసంభవము. సుందరియగు ఆ సంజ్ఞ ఆ తేజస్సుచే తపింపజేయబడి దు:ఖమును పొందెను (3). ఓ మహర్షీ! ఆ సంజ్ఞయందు సూర్యునకు ముందుగా ప్రజాపతియగు శ్రాద్ధదేవమనువు, తరువాత యముడు మరియు యమున అనే కవల పిల్లలు, వెరసి ముగ్గురు సంతానము కలిగెను (4,5). అగ్నిహోత్రము వలె సంహింప శక్యము కాని ఆ సూర్యుని రూపమును గాంచి ఆ సంజ్ఞ సహించలేనిదై తనయొక్క శుభకరమైన ఛాయను సృష్టించెను (6). మాయాస్వరూపురాలగు ఆ ఛాయ సంజ్ఞతో భక్తిపూర్వకముగా నిట్లనెను : ఓ మంగళస్వరూపురాలా ! స్వచ్ఛమగు చిరునవ్వు గలదానా ! నేను నీకు చేయదగిన కార్యము ఏమి ? చెప్పుము (7).

సంజ్ఞోవాచ ।

అహం యాస్యామి భద్రం తే మమైవ భవనం పితుః ।

త్వయైతద్భవనే సత్యం వస్తవ్యం నిర్వికారతః ॥

ఇమౌ మే బాలకౌ సాధూ కన్యా చేయం సుమధ్యమా ।

పాలనీయాస్సుఖేనైవ మమ చేదిచ్ఛసి ప్రియమ్ ॥

సంజ్ఞ ఇట్లు పలికెను –

నీకు శుభమగుగాక ! నేను నా తండ్రియొక్క నివాసమునకు వెళ్లిపోయెదను. నీవు వికారములు ఏమియు లేకుండగా ఈ భవనమునందు నివసించుము. ఇది యథార్థము (8), నాకు ప్రీతిని కలిగించవలెననే ఇచ్ఛ నీకు ఉన్నచో, నా ఈ ఇద్దరు బాలకులను మరియు సుందరియగు ఈ అమ్మాయిని చక్కగా పాలించుము (9).

ఛాయోవాచ ।

ఆకేశ గ్రహణాద్దేవి సహిష్యేఽహం సుదుష్కృతమ్ ।

నాఖ్యాస్యామి మతం తుభ్యం గచ్ఛ దేవి యథాసుఖమ్ ॥

ఛాయ ఇట్లు పలికెను –

ఓ దేవీ ! జుట్టును పట్టుకొని లాగుట మొదలైన సకలదుష్టచేష్టలను నేను సహించేదను. నా ఇబ్బందులను నా అభిప్రాయమును నీకు చెప్పను. నీవు సుఖముగా వెళ్లుము (10).

సూత ఉవాచ ।

ఇత్యుక్తా సాఽగమద్దేవీ వ్రీడితా సన్నిధౌ పితుః ।

పిత్రా నిర్భర్త్సితా తత్ర నియుక్తా సా పునః పునః ॥

అగచ్ఛద్వడవా భూత్వాఽఽచ్ఛాద్య రూపం తతస్స్వకమ్ ।

కురూంస్తదోత్తరాన్ ప్రాప్య నృణాం మధ్యే చచార హ ॥

సంజ్ఞాం తాం తు రవిరత్వా ఛాయాయాం సుసుతం తదా ।

జనయామాస సావర్ణిం మనుం వై సవితా కిల ॥

సంజ్ఞాఽను ప్రార్థితా ఛాయా సా స్వపుత్రేఽపి నిత్యశః ।

చకారాభ్యధికం స్నేహం న తథా పూర్వజే సుతే ॥

అనుజశ్చాక్షమస్తత్తు యమస్తం నైవ చక్షమే ।

స సరోషస్తు బాల్యాచ్చ భావినోఽర్థస్య గౌరవాత్ ॥

ఛాయాం సంతర్జయామాస యదా వైవస్వతో యమః ।

తం శశాప తతః క్రోధాచ్ఛాయా తు కలుషీకృతా ॥

చరణః పతతామేష తవేతి భృశరోషితః ।

యమస్తతః పితుస్సర్వం ప్రాంజలిః ప్రత్యవేదయత్ ॥

భృశం శాపభయోద్విగ్నస్సంజ్ఞావాక్యైర్వి చేష్టితః ।

మాత్రా స్నేహేన సర్వేషు వర్తితవ్యం సుతేషు వై ॥

స్నేహమస్మాస్వపాకృత్య కనీయాంసం బిభర్తి సా ।

తస్మాన్మయోద్యతః పాదస్తద్భవాన్ క్షంతుమర్హతి ॥

శప్తోఽహమస్మి దేవేశ జనన్యా తపతాం వర ।

తవ ప్రసాదాచ్చరణో న పతేన్మమ గోపతే ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఆ దేవి ఇట్లు పలికి సిగ్గు పడుతూ తండ్రి వద్దకు వెళ్లాను. కాని తండ్రి ఆమెపై కోపించి భర్త వద్దకు వెళ్లుమని పదే పదే ఆదేశించుచుండెను (11). అపుడామె నిజరూపమును కప్పిపుచ్చి ఆడు గుర్రము రూపమును దాల్చి ఉత్తరకురుదేశములకు వెళ్లి మానవుల మధ్యలో సంచరించుచుండెను(12). ఇంతలో సూర్యుడు ఛాయయే సంజ్ఞయని భావించుచుండెను. ఆయనకు ఆమెయందు ఒక కుమారుడు కలిగెను. ఆతడే సావర్ణి మనువు (13). సంజ్ఞచే ప్రార్థింపబడి యున్ననూ, ఛాయ నిత్యము తన పుత్రునియందు మాత్రమే అత్యధికమగు ప్రేమను చూపుతూ, పెద్ద కుమారునియందు అట్టి ప్రేమను చూపుట మానివేసెను (14). పెద్ద సోదరుడగు యముడు ఆ పరిస్థితిని సహించలేక పోయేను. బాలుడై యుండుట వలన, మరియు జరుగబోయే ఘటనలను నిర్దేశించే విధి బలీయమగుట వలన, క్రోధముతో నిండియున్న సూర్యపుత్రుడగు యముడు ఛాయను బెదిరించెను. అపుడు ఛాయ క్రోధముతో కలుషితమైన మనస్సు గలదై, నీ ఈ పాదము భగ్నమగును గాక !. అని ఆయనను శపించెను. అపుడు యముడు సూర్యునకు చేతులను జోడించి నమస్కరించి జరిగిన విషయమునంతనూ విన్నవించెను (15-17). నేను శాపభయముచే చాల కంగారు పడితిని. సంజ్ఞయొక్క వచనములు నన్ను నిశ్చేష్టుని చేసినవి. తల్లి తన పిల్లలు అందరియందు సమానమగు ప్రేమను చూపవలెను గదా ! (18) ఆమె మాయందు ప్రేమను తప్పించి చిన్న తమ్ముని మాత్రమే ప్రేమించుచున్నది. కావుననే, నేను కాలిని పైకి ఎత్తితిని. కావున, మీరు నన్ను క్షమించుడు (19). ఓ దేవదేవా ! ప్రకాశించు వారిలో నీవు శ్రేష్ఠుడవు. తల్లి నన్ను శపించినది. ఓ ప్రకాశస్వరూపా ! నీ అనుగ్రహముచే నా పాదము భగ్నము కాకుండును గాక ! (20)

సవితోవాచ।

అసంశయం పుత్ర మహద్భవిష్యత్యత్ర కారణమ్ ।

యేన త్వామావిశత్క్రోధో ధర్మజ్ఞం సత్యవాదినమ్ ॥

న శక్యతే తన్మిథ్యా వై కర్తుం మాతృవచస్తవ ।

కృమయో మాంసమాదాయ గమిష్యంతి మహీతలే ॥

తద్వాక్యం భవితా సత్యం త్వం చ త్రాతా భవిష్యసి ।

కురు తాత న సందేహం మనశ్చాశ్వాస్య స్వం ప్రభో ॥

సూర్యుడు ఇట్లు పలికెను -

ఓ కుమారా ! ధర్మజ్ఞుడవు మరియు సత్యవాదివి అగు నీకు కోపావేశము వచ్చినదనగా, దీనికి నిస్సందేహముగా పెద్ద కారణము ఉండియుండును (21). నీ తల్లియొక్క ఆ వచనమును మిథ్యగా చేయుట సంభవము కాదు. క్రిములు నీ పాదముయొక్క మాంసమును గ్రహించి భూమి లోపలికి ప్రవేశించ గలవు (22). ఆమెయొక్క వచనము సత్యము కాగలదు. కానీ నీకు కూడ రక్షణ లభించగలదు. ఓ పుత్రా ! నీవు సందేహమును పెట్టుకొనకుము. నీవు సమర్థుడవు. నీ మనస్సును నీవే ఊరడించుకొనుము (23).

సూత ఉవాచ ।

ఇత్యుక్త్వా తనయం సూర్యో యమసంజ్ఞం మునీశ్వర ।
అదిత్యా శ్చాబ్రవీత్తాం తు ఛాయాం క్రోధసమన్వితః ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! అదితిపుత్రుడగు సూర్యుడు యముడనే పేరు గల తన కుమారునితో ఇట్లు పలికి, కోపముతో నిండియున్నవాడై ఆ ఛాయతో నిట్లనెను (24).

సూర్య ఉవాచ ।

హే ప్రియే కుమతే చండి కిం త్వయాఽఽచరితం కిల ।
కిం తు మేఽ భ్యధికస్స్నేహ ఏతదాఖ్యాతుమర్హసి ॥

సూర్యుడు ఇట్లు పలికెను -

ఓసీ ప్రియురాలా ! దుష్టబుద్ధీ ! క్రూరాత్మురాలా ! నీవు ఏమి పనిని చేసి◌ితివి ? నీకు నా పుత్రులలో ఒకనిపై మాత్రమే అధికమగు ప్రేమ ఉండుటకు కారణమేమి ? ఈ విషయమును నీవు నాకు చెప్పదగుదువు (25).

సూత ఉవాచ ।

సా రవేర్వచనం శ్రుత్వా యథా తథ్యం న్యవేదయత్ ।
నిర్దగ్ధా కామరవిణా సాంత్వయామాస వై తదా ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఆమె సూర్యుని ఈ పలుకులను విని ఉన్న విషయమును యథాతథముగా విన్నవించుకొనెను. సూర్యకిరణములచే తాపమును పొందిన ఆమె అపుడు ఆయనను ఇట్లు ఓదార్చెను (26).

ఛాయోవాచ ।

తవాతితేజసా దగ్ధా ఇదం రూపం న శోభతే ।

అసహంతీ చ తత్సంజ్ఞా వనే వసతి శాద్వలే ॥

శ్లాఘ్యా యోగబలోపేతా యోగమాసాద్య గోపతే ।

అనుకూలస్తు దేవేశ సందిశ్యాత్మమయం మతమ్ ॥

రూపం నివర్తయామ్యద్య తవ కాంతం కరోమ్యహమ్ ।

ఛాయ ఇట్లు పలికెను –

నీ ఈ రూపము శోభిల్లుట లేదు. నీ తీవ్రతేజస్సుచే తపింపచేయ బడినదై దానిని సహించలేక సంజ్ఞ అడవిలో పచ్చికబయలులో బ్రతుకుచున్నది (27). ఓ రశ్మిపతీ ! ఆమె యోగమును చేపట్టి యోగబలమును పొందియున్నది. ఆమె కొనియాడదగినది. ఓ దేవదేవా! నీవు నీ మనస్సులోని మాటను ఆమెకు సందేశముగా పంపి, ఆమెకు అనుకూలుడవు కమ్ము (28). నేను నీ క్రోధరూపమును మళ్లింపజేయుచున్నాను. నిన్ను సుందరునిగా నేను తీర్చి దిద్దేదను.

సూతఉవాచ ।

తచ్ఛ్రుత్వాఽపగతః క్రోధో మార్తండస్య వివస్వతః ॥

భ్రమిమారోప్య తత్తేజశ్శాతయామాస వై మునిః ।

తతో విభ్రాజితం రూపం తేజసా సంవృతేన చ ॥

కృతం కాంతతరం రూపం త్వష్ట్రా తచ్ఛుశుభే తదా ।

తతో భియోగమాస్థాయ స్వాం భార్యాం హి దదర్శ హ ॥

అధృష్యాం సర్వభూతానాం తేజసా నియమేన చ ।

సోఽశ్వరూపం సమాస్థాయ గత్వా తాం మైథునేచ్ఛయా ॥

మైథునాయ విచేష్టంతీం పరపుంసోభి శంకయా ।

ముఖతో నాసికాయాం తు శుక్రం తత్ వ్యదధాన్మునే ॥

దేవౌ తతః ప్రజాయేతామశ్వినౌ భిషజాం వరౌ ।

నాసత్యౌ తౌ చ దస్రౌ చ స్మృతౌ ద్వావశ్వినావది ॥

తౌ తు కాంతేన రూపేణ దర్శయామాస భాస్కరః ।

ఆత్మానం సా తు తం దృష్ట్వా ప్రహృష్టా పతిమాదరాత్ ॥

పత్యా తేన గృహం ప్రాయాత్స్వం సతీ ముదితాననా ।

ముముదాతేఽథ తౌ ప్రీత్యా దంపతీ పూర్వతోధికమ్ ॥

యమస్తు కర్మణా తేన భృశం పీడితమానసః ।

ధర్మేణ రంజయామాస ధర్మరాజ ఇమాః ప్రజాః ॥

లేభే స కర్మణా తేన ధర్మరాజో మహాద్యుతిః ।

పితౄణామాధిపత్యం చ లోకపాలత్వమేవ చ ॥

మనుః ప్రజాపతిస్స్వాసీత్సావర్ణిస్స తపోధనః ।
భావ్యస్స కర్మణా తేన మనోస్సావర్ణికేంతరే ॥
మేరుపృష్ఠే తపో ఘోరమద్యాపి చరతే ప్రభుః ।
యవీయసీ తయోర్యా తు యమీ కన్యా యశస్వినీ ॥
అభవత్సా సరిచ్ఛ్రేష్ఠా యమునా లోకపావనీ ।
మనురిత్యుచ్యతే లోకే సావర్ణిరతి చోచ్యతే ॥
య ఇదం జన్మ దేవానాం శృణుయాద్ధారయేత్తు వా ।
ఆపదం ప్రాప్య ముచ్యేత ప్రాప్నుయాత్సు మహద్యశః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం వైవస్వతవర్ణనం నామ
పంచత్రింశోఽధ్యాయః॥

సూతుడు ఇట్లు పలికెను -

ఆ మాటను వినిన సూర్యుని కోపము తగ్గేను (29). మహర్షియగు త్వష్ట ఆయనను చక్రరము పైకి ఎక్కించి సానపట్టి తేజస్సు తగునట్లు చేసెను. అప్పుడు తీవ్రప్రకాశము గల ఆయన రూపములో కొంత తేజస్సు తగ్గేను (30), త్వష్టచే మరింత సుందరముగా తీర్చిదిద్దబడిన ఆయన రూపము చక్కగా ప్రకాశించెను. అప్పుడాయన యోగశక్తిని ఆశ్రయించి తన భార్యను చూచెను (31). ఆమె తపోనియమము గలదై సర్వప్రాణులకు దరిచేర శక్యము కాని తేజస్సుతో నుండెను. సూర్యుడు ఆమెతో సంగమించ గోరి గుర్రము రూపములో వెళ్లెను (32). ఓ మునీ ! ఆమెకు ఆతనియందు పరపురుషుడనే శంక కలిగెను. ఆ శుక్రము నాసికయందు నిక్షేపించబడెను (33). అపుడు వైద్య శ్రేష్ఠులగు. అశ్వినీ దేవతలు జన్మించిరి. ఆ ఇద్దరు అశ్వినీ దేవతలకు నాసత్యులనియు, దస్రులనియు కూడ పేర్లు ప్రసిద్ధిని గాంచేను (34). సూర్యుడు తన సుందరమగు రూపమును వారిద్దరికీ చూపించెను. సంజ్ఞా భర్తను గాంచి చాల సంతోషించి, ఆదరించెను (35). ఆ పతివ్రత సంతోషముతో నిండిన ముఖము గలదై తన భర్తతో గూడి స్వగృహమునకు వెళ్లాను. తరువాత ఆ దంపతులు పూర్వము కంటే అధికముగా ఆనందించిరి (36). ఈ ఘటన యముని మనస్సును చాల కలత పెట్టెను. ఆ యమధర్మరాజు ఈ ప్రజలను ధర్మముతో పాలించి సంతోషపెట్టెను (37). గొప్ప ప్రకాశము గల యమధర్మరాజు ప్రజలను ధర్మముతో పాలించుట వలన పితృదేవతలపై ఆధిపత్యమును మరియు లో కపాలపదవిని పొందెను (38). తపోధనుడగు ఆ సావర్ణి ప్రజాపతి ఆయెను. ఆ ఘటన వలన ఆయన మనువు కాగలడు. ఆయన రాజ్యము చేసిన కాలమునకు సావర్ణికమన్వంతరమని పేరు (39). సమర్థుడగు ఆ మనువు ఇప్పటికీ మేరుశిఖరముపై ఘోరమగు తపస్సును చేయుచున్నాడు. వారి చిన్న చెల్లెలు అగు యమీ అనే కన్య కీర్తినీ గాంచేను (40). ఆమె యమునా అనే గొప్ప నదియై జనులను పావనము చేయుచున్నది. లోకములో సావర్ణి మనువు ప్రసిద్ధిని గాంచినాడు (41). ఈ దేవతల జన్మవృత్తాంతమును ఎవడైతే వినునో, కంఠస్థము చేయునో, వానికి వచ్చిన ఆపద తొలగిపోవును. ఆతడు చాల గొప్ప కీర్తిని పొందును (42).

36 – మను పుత్ర వంశ వర్ణనము

సూత ఉవాచ ।

మనోర్వైవస్వతస్యాసన్ పుత్రా వై నవ తత్సమాః ।
పశ్చాన్మహోన్నతా ధీరాః క్షత్రధర్మ పరాయణాః ॥
ఇక్ష్వాకుశ్శిబినా భాగౌ ధృష్టశ్శర్యాతిరేవ చ।
నరిష్యంతోఽథ నాభాగః కరూషశ్చ ప్రియవ్రతః ॥
అకరోత్పుత్రకామస్తు మనురిష్టిం ప్రజాపతిః ।
అనుత్పన్నేషు పుత్రేషు తత్రేష్ట్యాం మునిపుంగవ ॥
సా హి దివ్యాంబరధరా దివ్యాభరణ భూషితా ।
దివ్యసంహననా చైవమిలా జజ్ఞే హి విశ్రుతా ॥
తామిడేత్యేవ హోవాచ మనుర్దండ ధరస్తథా ।
అనుగచ్ఛ త్వం మామేతి తమిడా ప్రత్యువాచ హ ॥

సూతుడు ఇట్లు పలికెను –

వైవస్వతమనువునకు తొమ్మిది మంది పుత్రులు గలరు. వారు ఆయనతో సమానమైన వారు. వారు తరువాతి కాలములో గొప్ప ఉన్నతిని పొందిరి. ధీరులగు ఆ మనుపుత్రులు క్షత్రియధర్మమును పాలించుటలో నిష్ఠను కలిగి యుండిరి (1). ఇక్ష్వాకువు, శిబి, నాభాగుడు, ధృష్ణుడు, శర్యాతి, నరిష్యంతుడు, రెండవ నాభాగుడు, కరూషుడు, ప్రియవ్రతుడు అనునవి వారి పేర్లు (2). ఓ మహర్షీ ! ప్రజాపతియగు మనువు పుత్రులను కోరి ఇష్టిని చేసెను. కాని పుత్రులు కలుగ లేదు. ఆ యజ్ఞములో దివ్యవస్త్రములను మరియు దివ్యాభరణములను దాల్చి దివ్య దేహము గలదై ఇల జన్మించెనని ప్రసిద్ధి (3,4). అపుడు దుష్టశిక్షకుడగు మనువు ఆమెను ఓ 'ఓ ఇడా !' అని మాత్రమే సంబోధించి, ' నీవు నా వెంట రమ్ము' అని పలుకగా, ఆ ఇడ ఇట్లు బదులిడేను (5).

ఇడో వాచ ।

ధర్మయుక్తమిదం వాక్యం పుత్రకామం ప్రజాపతిమ్ ।
మిత్రావరుణయోరంశైర్జాతాస్మి వదతాం వర ॥
తయోస్సకాశం యాస్యామి న మేఽ ధర్మే రుచిర్భవేత్ ।
ఏవముక్త్వా సతీ సా తు మిత్రావరుణయో స్తతః ॥
గత్వాంతికం వరారోహా ప్రాంజలిర్వాక్య మబ్రవీత్ ।
అంశైస్తు యువయోర్జాతా మనుయజ్ఞే మహామునీ ॥
ఆగతా భవతోరంతి బ్రూతం కిం కరవాణి వామ్ ।
అన్యాన్ పుత్రాన్ సృజ విభో తైర్వంశస్తే భవిష్యతి ॥

పుత్రులను కోరి ధర్మబద్ధముగా యజ్ఞమును చేయుచున్న ఆ ప్రజాపతిని ఉద్దేశించి ఇడ ఇట్లు పలికెను –

ఓ వక్తలలో శ్రేష్ఠమైనవాడా ! నేను మిత్రావరుణుల అంశచే జన్మించితిని (6). నేను వారి వద్దకు వెళ్లెదను. నాకు అధర్మమునందు అభిరుచి లేకుండుగాక ! ఇట్లు పలికి ఆ సుందరి తరువాత మిత్రావరుణుల వద్దకు వెళ్లి చేతులను జోడించి నమస్కరించి ఇట్లు పలికెను : ఓ మహర్షులారా! నేను మనువుయొక్క యజ్ఞములో మీ అంశలచే జన్మించితిని (7, 8). మీ వద్దకు వచ్చియుంటిని. ఎప్పుడు. మీకు ఏ పనిని నేను చేయవలెను? ఓ పరమేశ్వరా ! ఇతరసంతానమును సృష్టించుము. దాని వలన నీ వంశము వృద్ధిని పొందును (9).

సూత ఉవాచ ।

తాం తథా వాదినీం సాధ్వీమిడాం మన్వధ్వరోద్భవామ్ ।
మిత్రావరుణనామానౌ మునీ ఊచతురాదరాత్ ॥

సూతుడిట్లు పలికెను –

మనువుయొక్క యజ్ఞములో పుట్టిన సాధ్వి యగు ఆ ఇడ ఈ విధముగా పలుకగా, మిత్రా ావరుణులు అనే పేరు గల ఆ మునులు సాదరముగా నిట్లు పలికిరి (10).

మిత్రావరుణావూచతుః ।

అనేన తవ ధర్మజ్ఞే ప్రశ్రయేణ దమేన చ ।
సత్యేన చైవ సుశ్రోణి ప్రీతౌ ద్వా వరవర్ణిని ॥
ఆవయోస్త్వం మహాభాగే ఖ్యాతిం చైవ గమిష్యసి ।
మనోర్వంశకరః పుత్రస్త్వమేవ చ భవిష్యసి ॥
సుద్యుమ్న ఇతి విఖ్యాతస్త్రిషు లోకేషు విశ్రుతః ।
జగత్ప్రియో ధర్మశీలో మనువంశ వివర్ధనః ॥

మిత్రావరుణులు ఇట్లు పలికిరి –

ఓ ధర్మాత్మురాలా ! సుందరీ ! శ్రేష్ఠమగు దేహవర్ణము గలదానా ! నీ ఈ వినయము చేత, ఇంద్రియనిగ్రహము చేత మరియు సత్యము చేత మేము ఇద్దరము సంతోషించితిమి (11). ఓ మహాత్మురాలా ! నీవు మా కీర్తిని నిశ్చయముగా పొందగలవు. మనువుయొక్క వంశమును నిలబెట్టే పుత్రుడవు నీవే కాగలవు (12). నీవు ధర్మాత్ముడవు, లోకప్రియుడవు అయి ముల్లోకములలో సుద్యుమ్నుడు అను పేర ఖ్యాతిని గాంచి, మనువుయొక్క వంశమును వృద్ధిలోనికి తీసుకొని రాగలవు (13).

సూత ఉవాచ ।

నివృత్తా సా తు తచ్ఛ్రుత్వా గచ్ఛంతీ పితురంతికే ।
బుధేనాంతరమాసాద్య మైథునాయోప మంత్రితా ॥
సోమపుత్రాత్తతో జజ్ఞే తస్యాం రాజా పురూరవాః ।
పుత్రోఽ తిసుందరః ప్రాజ్ఞ ఊర్వశీపతిరున్నతః ॥

జనయిత్వా చ సా తత్ర పురూరవ సమాదరాత్ ।
పుత్రం శివప్రసాదాత్తు పునస్సుద్యుమ్నతాం గతః ॥
సుద్యుమ్నస్య తు దాయాదాస్త్రయః పరమధార్మికాః ।
ఉత్కలశ్చ గయశ్చాపి వినతాశ్వశ్చ వీర్యవాన్ ॥
ఉత్కలస్యోత్కలా విప్ర వినతాశ్వస్య పశ్చిమాః ।
దిక్పూర్వా మునిశార్దూల గయస్య తు గయాః స్మృతాః ॥
ప్రవిష్టే తు మనౌ తాత దివాకరతనుం తదా ।
దశధా తత్ర తత్ క్షేత్రమకరోత్పృథివీం మనుః ॥
ఇక్ష్వాకుః శ్రేష్ఠదాయాదో మధ్యదేశమ వాప్తవాన్ ।
వసిష్ఠవచనాదాసీత్ప్రతిష్ఠానం మహాత్మనే ॥
ప్రతిష్ఠాం ధర్మరాజ్యస్య సుద్యుమ్నోథ తతో దదౌ ।
తత్పురూరవసే ప్రాదాద్రాజ్యం ప్రాప్య మహాయశాః ॥
మానవో యో మునిశ్రేష్ఠాః స్త్రీ పుంసోర్లక్షణః ప్రభుః ।
నరిష్యంతాచ్ఛకాః పుత్రా నభగస్య సుతోఽ భవత్ ॥
అంబరీషస్తు బాహ్లేయో బాహ్లకం క్షేత్రమాప్తవాన్ ।
శర్యాతేర్మిథునం త్వాసీదానర్తో నామ విశ్రుతః ॥
పుత్రస్సుకన్యా కన్యా చ యా పత్నీ చ్యవనస్య హి ।
ఆనర్తస్య హి దాయాదో రైభ్యో నామ స రైవతః ॥

సూతుడు ఇట్లు పలికెను –

ఆ మాటను విని ఆమె తండ్రి వద్దకు మరలి వెళ్ళుచుండగా, బుధుడు మధ్యలో ో అవకాశమునెరింగి ఆమె పొందును కోరెను (14). బుధుని వలన ఆమె యందు మిక్కిలి సుందరుడు, బుద్ధిశాలి, ఉర్వశీ ప్రియుడు, గొప్పవాడు అగు పురూరవమహారాజు పుత్రుడై పుట్టెను (15). ఆమె అచట పురూరవుని పుత్రునిగా పొంది శివుని అనుగ్రహము వలన మరల సాదరముగా సుద్యుమ్నుడుగా ఆయెను (16). సుద్యుమ్నునకు ఉత్కలుడు, గయుడు మరియు పరాక్రమశాలియగు వినతాశ్వుడు అనే ముగ్గురు మహాధర్మాత్ములు అగు దాయాదులు గలరు (17). ఓ బ్రాహ్మణా ! మహర్షి! ఉత్కలునకు ఉత్కలదేశము, వినతాశ్వునకు పశ్చిమదేశములు, గయునకు గయదేశము మరియు తూర్పు దిక్కు ఈయబడినవని చెప్పెదరు (18). ఓ వత్సా! మనువు దేహమును విడిచి సూర్యమండలములో ఐక్యమగుటకు ముందు ఆయన ఆ భూక్షేత్రమును పది భాగములు చేసెను (19). పెద్ద కొడుకు అగు ఇక్ష్వాకుడు మధ్యదేశమును పొందెను. గొప్ప కీర్తిశాలియగు సుద్యుమ్నుడు తరువాత వసిష్ఠుని వచనముచే ధర్మరాజ్యమునకు సుస్థిరనిలయమగు ప్రతిష్ఠానదేశమునందలి రాజ్యాధికారమును పురూరవునకు ఇచ్చెను (20,21). ఓ మహర్షులారా ! మనుపుత్రుడగు సుద్యుమ్న ప్రభువునందు స్త్రీ పురుషలక్షణములు రెండు గలవు. నరిష్యంతుని పుత్రులు శకులు. నభగుని పుత్రుడగు అంబరీషుడు బాహ్లకదేశమును పొంది బాహ్లేయుడు ఆయెను. శర్యాతికి కొడుకు, కూతురు

ఉండిరి. కొడుకు ప్రసిద్ధిని గాంచిన ఆనర్తుడు (22, 23). కన్య పేరు సుకన్య. ఆమెయే చ్యవనుని భార్య. ఆనర్తుని కొడుకు రైభ్యుడు. ఆయనకు రైవతుడనియు పేరు గలదు (24).

ఆనర్తవిషయే యస్య పురీ నామ కుశస్థలీ ।
మహాదివ్యా సప్తపురీమధ్యే యా సప్తమీ మతా ॥
తస్య పుత్రశతం త్వాసీత్కకుద్మీ జ్యేష్ఠ ఉత్తమః ।
తేజస్వీ సుబలః పారో ధర్మిష్ఠో బ్రహ్మపాలకః ॥
కకుద్మినవస్తు సంజాతా రేవతీ నామ కన్యకా ।
మహాలావణ్య సంయుక్తా దివ్యలక్ష్మీరివాపరా ॥
ప్రష్టుం కన్యావరం రాజా కకుద్మీ కన్యయా సహ ।
బ్రహ్మలోకే విధేస్సమ్యక్ సర్వాధీశో జగామ హ ॥
ఆవర్తమానే గాంధర్వే స్థితో లబ్ధక్షణః క్షణమ్ ।
శుశ్రావ తత్ర గాంధర్వం నర్తనే బ్రహ్మణోఽతికే ॥
ముహూర్తభూతం తత్కాలే గతం బహుయుగం తదా ।
న కించిద్బుబుధే రాజా కకుద్మీ మునయస్స తు ॥
తదాసౌ విధిమానమ్య స్వాభిప్రాయం కృతాంజలిః ।
న్యవేదయద్వినీతాత్మా బ్రహ్మణే పరమాత్మనే ॥
తదభిప్రాయమాకర్ణ్య స ప్రహస్య ప్రజాపతిః ।
కకుద్మినం మహారాజం సమాభాష్య సమబ్రవీత్ ॥

ఆయన యొక్క నగరమగు కుశస్థలి ఆనర్తదేశమునందు గలదు. గొప్ప దివ్యయమగు ఆ నగరము ఏడు నగరములలో ఏడవది (25). ఆయనకు వంద మంది పుత్రులు గలరు. వారిలో ఉత్తముడు, తేజశ్శాలి, గొప్ప బలశాలి, మహాత్ముడు, ధర్మాత్ముడు, బ్రాహ్మణులను రక్షించువాడు అగు కకుది పెద్దవాడు (26). కకుద్మికి మహాలావణ్యవతీ, రెండవ దివ్యలక్ష్మి వలేనున్నది అగు రేవతి అను కన్యక పుట్టెను (27). ఆ కన్యకు వరుని గురించి అడుగుటకై సర్వాధీశ్వరుడగు ఆ కకుద్మిమహారాజు కన్యను తోడ్కొని బ్రహ్మలోకములో బ్రహ్మవద్దకు వెళ్లాను (28). అచట బ్రహ్మ సమీపములో నృత్య గీతములు జరుగుచుండగా, ఆ రాజు క్షణకాలము ఉత్సాహమును పొంది ఆ గీతమును వినుచుండెను (29). ఓ మునులారా ! అది బ్రహ్మకాలమును బట్టి ముహూర్తమే అయినా, అనేకయుగములు గడచిపోయెను. ఆ కకుద్మి మహారాజునకు కాలము గురించి లేశమైననూ తెలియలేదు (30). అపుడు వినయస్వభావము గల ఆ రాజు పరమాత్మయగు బ్రహ్మకు చేతులను జోడించి నమస్కరించి తన అభిప్రాయమును విన్నవించెను (31). ఆ కకద్మిమహారాజుయొక్క అభిప్రాయమును విని ప్రజాపతి నవ్వి, ఆయనను దగ్గరకు పిలచి ఇట్లు పలికెను (32).

బ్రహ్మోవాచ ।

శృణు రాజన్ రైభ్యసుత కకుద్మిన్ పృథివీపతే ।

మద్వచః ప్రీతితస్సత్యం ప్రవక్ష్యామి విశేషతః ॥

కాలేన సంహృతాస్తే వై వరా యే తే కృతా హృది ।

న తద్గోత్రం హి తత్రాస్తి కాలస్సర్వస్య భక్షకః ॥

త్వత్పుర్యపి హృతా పుణ్య జనైస్సా రాక్షసైర్నృప ।

అష్టావింశద్వాపరేఽ ద్య కృష్ణేన నిర్మితా పునః ॥

కృతా ద్వారావతీ నామ్నా బహుద్వారా మనో రమా ।

భోజవృష్ణ్యంధకైర్గుప్తా వాసుదేవ పురోగమైః ॥

తద్గచ్ఛ తత్ర ప్రీతాత్మా వాసుదేవాయ కన్యకామ్ ।

బలదేవాయ దేహి త్వమిమాం స్వతనయాం నృప ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

రైభ్యకుమారా ! కుకుద్మిమహారాజా ! నా మాటను ప్రీతితో వినుము. నేను వి ిశేషించి సత్యమును, చెప్పెదను (33). ఏ వరులను నీవు మనస్సులో భావన చేయుచుంటివో, వారు కాలగర్భములో కలిసిపోయినారు. భూలోకములో వారి గోత్రమైననూ మిగిలి లేదు. కాలము సర్వమును కబళించును (34). ఓ రాజా ! నీ నగరము కూడ పుణ్యజనులనే రాక్షసులచే అపహరించబడినది. ఇప్పుడు ఇరవై ఎనిమిదవ ద్వాపరము నడుచుచున్నది. శ్రీకృష్ణుడు మరల ఆ నగరమును నిర్మించినాడు (35). అనేకద్వారములతో మనోహరముగానుండే ఆ నగరమునకు ద్వారావతి అని పేరు. వాసుదేవుడు నాయకుడుగా గల భోజ-వృష్టి-అంధకవంశీయులు దానికి రక్షకులు (36). ఓ రాజా ! కావున, నీవు సంతసించిన అంతరంగము గలవాడవై అచటకు వెళ్లుము. నీవు నీ ఈ కుమార్తెను వసుదేవుని కుమారుడగు బలదేవునకు ఇమ్ము (37).

సూత ఉవాచ ।

ఇత్యాదిష్టో నృపోఽ యం తం నత్వా తాం చ పురీం గతః ।

గతాన్ బహూన్ యుగాన్ జ్ఞాత్వా విస్మితః కన్యయా యుతః ॥

తతస్తు యువతీం కన్యాం తాం చ స్వాం సువిధానతః ।

కృష్ణభ్రాత్రే బలాయాశు ప్రాదాత్తత్ర స రేవతీమ్ ॥

తతో జగామ శిఖరం మేరోర్దివ్యం మహాప్రభుః ।

శివమారాధయామాస స నృపస్తపసి స్థితః ॥

సూతుడు ఇట్లు పలికెను -

ఈ మహారాజు ఆ విధముగా ఆదేశించబడినవాడై ఆయనకు నమస్కరించి, అనేకయు ుగములు గడచినవని తెలిసి ఆశ్చర్యచకితుడై, తన కుమార్తెతో కూడి ఆ నగరమునకు వెళ్లెను (38). తరువాత ఆయన అచట యువకన్య యగు తన కుమార్తెను వెంటనే శ్రీకృష్ణుని సోదరుడగు బలరామునకు ఇచ్చి వివాహమును చేసెను (39). తరువాత గొప్ప సమర్థుడగు ఆ రాజు దివ్యమగు

మేరుశిఖరమునకు వెళ్లి తపస్సునందు నిమగ్నుడై శివుని ఆరాధించెను (40).

ఋషయ ఊచుః ।

తత్ర స్థితో బహుయుగం బ్రహ్మలోకే స రేవతః ।

యువైవాగాన్మర్త్యలో కమేతన్న స్సంశయో మహాన్ ॥

ఋషులు ఇట్లు పలికిరి –

ఆ కకుద్మిమహారాజు రేవతితో గూడి అనేకయుగముల కాలము బ్రహ్మలోకము ులో నున్నవాడై యువకుడుగనే తిరిగి మనుష్యలోకమునకు వచ్చినాడు. ఈ విషయములో మాకు పెద్ద సంశయము గలదు (41).

సూత ఉవాచ ।

న జరా క్షుత్పిపాసా వా వికారాస్తత్ర సంతి వై ।

అపమృత్యుర్న కేషాంచిన్మునయో బ్రహ్మణోఽతికే ॥

అతో న రాజా సంప్రాప జరాం మృత్యుం చ సా సుతా ।

స యువైవాగతస్తత్ర సంమంత్ర్య తనయావరమ్ ॥

గత్వా ద్వారావతీం దివ్యాం పురీం కృష్ణవినిర్మితామ్ ।

వివాహం కారయామాస కన్యాయాస్స బలేన హి ॥

తస్య పుత్రశతం త్వాసీద్ధార్మికస్య మహాప్రభోః ।

కృష్ణస్యాపి సుతా జాతా బహుస్త్రీభ్యోఽ మితాస్తతః ॥

అన్వవాయో మహాంస్తత్ర ద్వయోరపి మహాత్మనోః ।

క్షత్రియా దిక్షు సర్వాసు గతా హ్యష్టాస్సు ధార్మికాః ॥

ఇతి ప్రోక్తో హి శర్యాతేర్వంశోఽ న్యేషాం వదామ్యహమ్ ।

మానవానాం హి సంక్షేపాచ్ఛృణుతాదరతో ద్విజాః ॥

నా భాగో ధృష్టపుత్రోఽ భూత్స చ బ్రాహ్మణతాం గతః ।

స్వక్షత్రవంశం సంస్థాప్య బ్రహ్మకర్మభిరావృతః ॥

ధృష్టాద్ధార్ష్టమభూత్ క్షత్రం బ్రహ్మభూయం గతం క్షితౌ ।

కరూషస్య తు కారూషాః క్షత్రియా యుద్ధదుర్మదాః ॥

నృగో యో మనుపుత్రస్తు మహాదాతా విశేషతః ।

నానావసూనాం సుప్రీత్యా విప్రేభ్యశ్చ గవాం తథా ॥

గోదానవ్యత్యయాద్యస్తు స్వకుబుద్ధ్యా స్వపాపత ।

కృకలాసత్వమాపన్నః శ్రీకృష్ణేన సముద్ధృతః ॥

తస్యైకో భూత్సుతః శ్రేష్ఠః ప్రయతిర్ధర్మవిత్తథా ।

ఇతి శ్రుతం మయా వ్యాసాత్తత్ప్రోక్తం హి సమాసతః ॥

సూతుడు ఇట్లు పలికెను –

ఓ మునులారా ! బ్రహ్మయొక్క సన్నిధిలో ముసలితనము, ఆకలిదప్పికలు, ఇతరదేహవికారములు, అకాలమరణము అనునవి ఎవ్వరికైననూ ఉండవు (42).

ఇతరదేహవికారములు, అకాలమరణము అనునవి ఎవ్వరికైననూ ఉండవు (42). కావుననే, ఆ రాజునకు గాని, ఆయన కుమార్తెకు గానీ జరామరణములు కలుగలేదు. ఆయన అచట కుమార్తెకు వరుని గురించి చర్చించి యువకుడుగనే మరలి వచ్చినాడు (43). ఆయన శ్రీకృష్ణునిచే నిర్మింపబడిన దివ్యమగు ద్వారావతీ నగరమునకు వెళ్లి, కుమార్తెకు బలరామునితో వివాహమును జరిపించెను (44), ధర్మాత్ముడు, మహాప్రభువు అగు బలరామునకు నూర్గురు పుత్రులు కలిగిరి. తరువాత శ్రీకృష్ణునకు కూడ అనేక భార్యలయందు లెక్కలేనంత మంది పుత్రులు కలిగిరి (45). ఆ ఇద్దరు మహాత్ముల ద్వారా పెద్ద వంశము బయలు దేరెను. ఆ వంశక్షత్రియులు సర్వదిక్కులకు వెళ్లి ఆనందముగా ధర్మమునకు బద్ధులై ఉండిరి (46). ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా శర్యాతియొక్క వంశమును గురించి చెప్పితిని. ఇతరమనుపుత్రుల వంశములను గురించి కూడ సంక్షేపముగా చెప్పెదను. సాదరముగా వినుడు (47). ధృష్ణునకు నా భాగుడు అనే పుత్రుడు ఉండెను. ఆయన తన క్షత్రియవంశమును చక్కగా స్థాపించి వేదవిహితకర్మలలో నిమగ్నుడై బ్రాహ్మణత్వమును పొందెను (48). ధృష్ణునినుండి ధారిష్టము అనే క్షత్రియవంశము భూమిలో నెలకొని బ్రాహ్మణత్వమును పొందెను. కరూషుని వంశీయులగు క్షత్రియులు కారూషులు అనబడుదురు. వారు అధికమగు యుద్ధగర్వమును కలిగియుండిరి (49). మనుపుత్రుడగు నృగుడు గొప్ప దాత. ఆయన పలు విధముల సంపదను, గోవులను మహాప్రీతితో బ్రాహ్మణులకు దానము చేసెను (50). ఆయన తన చెడు బుద్ధిచే గోదానములో అపరాధమును చేసి తన పాపముచే ఊసరవెల్లి జన్మను పొందగా, శ్రీకృష్ణుడు ఆయనను ఉద్ధరించెను (51). ఆయనకు ప్రయాతి అనే ధర్మవేత్త మరియు గొప్పవాడు అగు ఒక పుత్రుడు కలిగెను. వ్యాసుడు ఈ విధముగా సంగ్రహముగా చెప్పిన దానిని నేను విని మీకు చెప్పితిని (52).

పృషధ్రస్తు మనోః పుత్రో గోపాలో గురుణా కృతః ।
పాలయామాస గా యత్తో రాత్ర్యాం వీరాసనవ్రతః ॥
స ఏకదాఽఽ గతం గోష్ఠే వ్యాఘ్రం గా హింసితుం బలీ ।
శ్రుత్వా గో క్రందనం బుద్ధో హంతుం తం ఖడ్గధృగ్యయౌ ॥
అజానన్నహనద్బభ్రోశ్శిరశ్శార్దూల శంకయా ।
నిశ్చక్రామ సభీర్వ్యాఘ్రో దృష్ట్వా తం ఖడ్గినం ప్రభుమ్ ॥
మన్యమానో హతం వ్యాఘ్రం స్వస్థానం స జగామ హ ।
రాత్ర్యాం తస్యాం భ్రమాపన్నో వర్షవాతవినష్టధీః ॥
వ్యుష్టాయాం నిశి చోత్థాయ ప్రగే తత్ర గతో హి సః ।
అద్రాక్షీత్స హతాం బభ్రుం న వ్యాఘ్రం దుఃఖితోఽ భవత్ ॥

శ్రుత్వా తద్వృత్తమాజ్ఞాయ తం శశాప కృతాగసమ్ ।
అకామతోఽ విచార్యేతి శూద్రో భవ న క్షత్రియః ॥
ఏవం శప్తస్తు గురుణా కులాచార్యేణ కోపతః ।
నిస్సృతశ్చ పృషధ్రస్తు జగామ విపినం మహత్ ॥
నిర్విణ్ణస్స తు కష్టేన విరక్తోఽ భూత్స యోగవాన్ ।
వనాగ్నౌ దగ్ధదేహశ్చ జగామ పరమాం గతిమ్ ॥
కవిః పుత్రో మనోః ప్రాజ్ఞశ్శివాను గ్రహతోఽ భవత్ ।
ఇహ భుక్త్వా సుఖం దివ్యం ముక్తిం ప్రాప సుదుర్లభామ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం మనునవపుత్రవంశవర్ణనం
నామ షట్త్రింశోఽధ్యాయః ॥

మనుపుత్రుడగు పృషధ్రుని గురువు గోవులను సేవించుమని ఆదేశించెను. ఆతడు రాత్రియందు జాగరూకుడై వీరాసనమునందు కూర్చుండి గోవులను రక్షించెడివాడు (53). ఒకనాడు గోశాలలోని గోవులను చంపుటకై ఒక పెద్ద పులి వచ్చెను. గోవుల ఆక్రందనమును విని తెలివి తెచ్చుకుని బలశాలియగు ఆతడు ఆ పెద్దపులిని చంపుటకై కత్తిని పట్టుకొని వెళ్లెను (54). ఖడ్గమును చేతబట్టియున్న ఆ వీరుని గాంచి పెద్దపులి భయపడి పారిపోయేను. కాని, ఆతనికి ఆ విషయము తెలియక, పెద్దపులి అని భ్రమపడి కపిలగోవుయొక్క తలను నరికివేసేను. (55). పెద్దపులి మరణించినదని తలంచి ఆతడు తన స్థానమునకు మరలి వెళ్లాను. ఆ రాత్రియందు గాలివాన వలన వినష్టమైన బుద్ధిగల ఆతడు భ్రమపడెను (56). రాత్రి గడచి తెల్లవారగానే ఆతడు అచటకు వెళ్లి పెద్దపులికి బదులుగా సంహరింపబడియున్న కపిలగోవును చూచి దుఃఖించెను (57). ఆ వృత్తాంతమును విని, ఆతడు ఆ పాపమును బుద్ధిపూర్వకముగా చేయలేదనియు, పరిశీలించకపోవుట వలన పాపము జరిగినదనియు గ్రహించిన గురువు ఆతనిని 'నీవు క్షత్రియుడవై ఉండదగవు; శూద్రుడవు కమ్ము' అని శపించెను (58). కులాచార్యుడగు గురువు కోపముతో ఇట్లు శపించగా, ఆ పృషధ్రుడు అక్కడనుండి బయటకు వచ్చి దట్టమగు అడవికి వెళ్లాను (59). ఆతడు వైరాగ్యమును పొంది కష్టపడి యోగమును సాధించి దావాగ్నియందు దహింపబడిన దేహము గలవాడై పరమగతిని పొందెను (60). మనుపుత్రుడగు కవి శివుని అనుగ్రహము వలన జ్ఞానమును పొంది ఇహలోకములో దివ్యసుఖములననుభవించి మిక్కిలి దుర్లభమైన మోక్షమును పొందెను (61).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మనుపుత్రవంశవర్ణనమనే ముప్పది ఆరవ అధ్యాయము ముగిసినది (36).

37 – ధుంధు వధ వర్ణనము

సూత ఉవాచ ।

పూర్వతస్తు మనోర్జజ్ఞే ఇక్ష్వాకుర్ఘ్రాణతస్సుతః ।
తస్య పుత్రశతం త్వాసీదిక్ష్వాకోర్భూరి దక్షిణమ్ ॥
తేషాం పురస్తాదభవన్నార్యావర్తే నృపా ద్విజాః ।
తేషాం వికుక్షిర్జ్యేష్ఠస్తు సోఽ యోధ్యాయాం నృపోఽ భవత్ ॥
తత్కర్మ శృణు తత్ప్రీత్యా యజ్జాతం వంశతో విధేః ।
శ్రాద్ధకర్మణి చోద్దిష్టో హ్యకృతే శ్రాద్ధకర్మణి ॥
భక్షయిత్వా శశం శీఘ్రం శశాదత్వమతో గతః ।
ఇక్ష్వాకుణా పరిత్యక్తశ్శశాదో వనమావిశత్ ॥
ఇక్ష్వాకౌ సంస్థితే రాజా వసిష్ఠ వచనాదభూత్ ।
శకుని ప్రముఖాస్తస్య పుత్రాః పంచదశ స్మృతాః ॥
ఉత్తరాపథదేశస్య రక్షితారో మహీక్షితః ।
అయోధస్య తు దాయాదః కకుత్స్థో నామ వీర్యవాన్ ॥
అరినాభః కకుత్స్థస్య పృథురేతస్య వై సుతః ।
విష్టరాశ్వః పృథోః పుత్రస్తస్మాదింద్రః ప్రజాపతిః ॥
ఇంద్రస్య యువనాశ్వస్తు శ్రావస్తస్య ప్రజాపతిః ।
జజ్ఞే శ్రావస్తకః ప్రాజ్ఞః శ్రావస్తీ యేన నిర్మితా ।
శ్రావస్తస్య తు దాయాదో బృహదశ్వో మహాయశాః ॥
యువనాశ్వస్సుతస్తస్య కువలాశ్వశ్చ తత్సుతః ।
స హి ధుంధువధాద్భూతో ధుంధుమారో నృపోత్తమః ॥
కువలాశ్వస్య పుత్రాణాం శతముత్తమ ధన్వినామ్ ।
బభూవాత్ర పితా రాజ్యే కువలాశ్వం న్యయోజయత్ ॥
పుత్రసంక్రామితశ్రీకో వనం రాజా సమావిశత్ ।
తముత్తంకోఽథ రాజర్షిం ప్రయాంతం ప్రత్యవారయత్ ॥

సూతుడు ఇట్లు పలికెను –

పూర్వము మనువునకు ముక్కునుండి ఇక్ష్వాకువు అనే పుత్రుడు జన్మించెను. ఆ ఇక్ష్వాకువునకు వంద మంది పుత్రులు కలిగిరి. వారు గొప్ప దక్షిణలను ఇచ్చిరి (1). ఓ బ్రాహ్మణులారా ! వారికి పూర్వము ఆర్యావర్తములో రాజులు లేకుండిరి. వారిలో వికుక్షి పెద్దవాడు. ఆతడు అయోధ్యకు రాజు ఆయెను (2). ఆతడు ఒకనాడు స్వీయరాగము వలన చేసిన ఒక కర్మను గురించి వినుము. ఆ ఘటన విధివిధానము వలన జరిగినది. ఆతడు శ్రాద్ధకర్మను చేయవలసి యుండెను. కానీ ఆతడు శ్రాద్ధకర్మను చేయకుండగనే (3), కుందేలును భక్షించి, వెంటనే శశాదుడు అను పేరును పొందెను. ఇక్ష్వాకువు శశాదుని బహిష్కరించగా, ఆతడు అడవిలోనికి ప్రవేశించెను (4). ఇక్ష్వాకుడు మరణించిన తరువాత వసిష్ఠుని

ఆదేశముపై శశాదుడు రాజు ఆయెను. ఆయనకు శకుని మొదలగు పదిహేనుమంది పుత్రులు గలరని చెప్పబడినది (5). వారు రాజులై ఉత్తరాపథమును పాలించిరి. అయోధుని పుత్రుడు పరాక్రమశాలియగు కకుత్స్థుడు (16). కకుత్స్థుని పుత్రుడు అరీనాభుడు. ఆయన పుత్రుడు పృథువు. పృథువుయొక్క పుత్రుడు విష్టరాశ్వుడు. ఆయన పుత్రుడు లోకపాలకుడగు ఇంద్రుడు (7). ఇంద్రుని కొడుకు యువనాశ్వుడు. ఆయన శ్రావస్తనగరప్రజలను పాలించెను. ఆయన కొడుకు బుద్ధిశాలియగు శ్రావస్తకుడు. శ్రావస్తి నగరమును ఆయనయే నిర్మించెను. శ్రావస్తుని కుమారుడు గొప్ప కీర్తిశాలియగు బృహదశ్వుడు (8). వాని కుమారుడు యువనాశ్వుడు. వాని కుమారుడు కువలాశ్వుడు. ఆ రాజశ్రేష్ఠుడు ధుంధువును వధించి ధుంధుమారుడు అయినాడు (9), కువలాశ్వునకు ఉత్తములగు ధనుర్ధారులైన వంద మంది పుత్రులు గలరు. కువలాశ్వుని తండ్రి ఆయనను రాజ్యములో నియోగించేను (10). ఆ రాజర్షి సంపదను కొడుకునకు అప్పజెప్పి అడవికి వెళ్లుచుండగా, ఆయనను ఉత్తంకుడు వారించెను (11).

ఉత్తంక ఉవాచ ।

భవతా రక్షణం కార్యం పృథివ్యా ధర్మతః శృణు ।
త్వయా హి పృథివీ రాజన్ రక్ష్యమాణా మహాత్మనా ॥
భవిష్యతి నిరుద్విగ్నా నారణ్యం గంతుమర్హసి ।
మమాశ్రమసమీపే తు హిమేషు మరుధన్వసు ॥
సముద్రవాలుకాపూర్ణో దానవో బలదర్పితః ।
దేవతానామవధ్యో హి మహాకాయో మహాబలః ॥
అంతర్భూమి గతస్తత్ర వాలుకాంతర్హితః స్థితః ।
రాక్షసస్య మధోః పుత్రో ధుంధునామా సుదారుణః ॥
శేతే లోకవినాశాయ తప ఆస్థాయ దారుణమ్ ।
సంవత్సరస్య పర్యంతే స నిశ్వాసం విముంచతి ॥
యదా తదా భూశ్చలతి సశైలవనకాననా ।
సవిస్ఫులింగం సాంగారం సధూమమపి వారణా ॥
తేన రాజన్న శక్నోమి తస్మింస్థాతుం స్వ ఆశ్రమే ।
తం వారయ మహాబాహో లోకానాం హితకామ్యయా ॥
లోకాస్స్వస్థా భవంత్వద్య తస్మిన్ వినిహతే త్వయా ।
త్వం హి తస్య వధాయైవ సమర్థః పృథివీపతే ॥
విష్ణునా చ వరో దత్తో మహాన్ పూర్వయుగేఽనఘ ।
తేజసా స్వేన తే విష్ణుస్తేజ ఆప్యాయయిష్యతి ॥
పాలనే హి మహాధర్మః ప్రజానామిహ దృశ్యతే ।
న తథా దృశ్యతేఽరణ్యే మా తే భూద్బుద్ధిరీదృశీ ॥

ఉత్తంకుడు ఇట్లు పలికెను –

నా మాటను వినుము. నీవు ధర్మబద్ధముగా భూలోకమును రక్షించవలెను. ఓ రాజా! మహాత్ముడవగు నీచే రక్షింపబడి యున్న ఈ భూమియందు ఆపదలు ఉండవు. కావున, నీవు అడవికి పోదగదు. నా ఆశ్రమమునకు సమీపములో సముద్రపు ఇసుకతో నిండి మంచుతో కప్పబడియుండే చవిటీ పర్రయందు బలముచే గర్వించియున్న వాడు, దేవతలకైననూ సంహరింప శక్యము కానీ వాడు, పెద్ద దేహము గలవాడు, మహాబలశాలి, మిక్కిలి క్రూరుడు అగు రాక్షసుడు భూమి లోపల ఇసుకచే కప్పబడి దాగియున్నాడు. వీని పేరు ధుంధుడు. ఈతడు మధురాక్షసుని పుత్రుడు (12-15). ఆతడు అచటనున్నవాడై లోకవినాశము కొరకు దారుణమగు తపస్సును చేయుచున్నాడు. ఆతడు సంవత్సరకాలము గడువగానే నిశ్వాసను విడిచిపెట్టును (16). అప్పుడు పర్వతములతో, అడవులతో మరియు విశాలమగు మైదానములతో కూడియున్న భూమి కంపించును. ఆ భూ భాగము కాలే కట్టెలతో, ఎగిరిపడే అగ్నికణములతో, నీటితో మరియు పొగతో నిండును (17). ఓ రాజా ! ఆ కారణముగా నేను నా ఆ ఆశ్రమములో నిలువలేకున్నాను. ఓ గొప్ప బాహువులు గలవాడా! లోకముల హితమును గోరి నీవు వాని బెడదను తప్పించుము (18). ఈనాడు నీచే వాడు సంహరింపబడి లోకములు సుఖమయములు అగుగాక ! ఓ మహారాజా! వానిని సంహరించుటకు నీవు మాత్రమే సమర్థుడవు (19). ఓ పుణ్యాత్మా ! గడచిన యుగములో విష్ణువు గొప్ప వరమును ఇచ్చియున్నాడు. విష్ణువు తన తేజస్సుచే నీ తేజస్సును వర్ధిల్లజేయగలడు (20). ఈ లోకములో ప్రజలను రక్షించుట మహాధర్మము అగును. అడవిలో అంతటి మహాధర్మమును నీవు చేయజాలవు. కావున, నీకు అడవికి వెళ్లవలేననే ఈ బుద్ధి కలుగకుండుగాక ! (21)

ఈదృశో న హి రాజేంద్ర క్వచిద్ధర్మః ప్రవిద్యతే ।

ప్రజానాం పాలనే యాదృక్ పురా రాజర్షిభిః కృతః ॥

స ఏవముక్తో రాజర్షిరుత్తంకేన మహాత్మనా ।

కువలాశ్వస్సుతం ప్రాదాత్తస్మై ధుంధునివారణే ॥

భగవన్న్యస్తశస్త్రోఽ హమయం తు తనయో మమ ।

భవిష్యతి ద్విజశ్రేష్ఠ ధుంధుమారో న సంశయః ॥

ఇత్యుక్త్వా పుత్రమాదిశ్య యయౌ స తపసే నృపః ।

కువలాశ్వశ్చ సోత్తంకో యయౌ ధుంధు వినిగ్రహే ॥

తమావిశత్తదా విష్ణుర్భగవాంస్తేజసా ప్రభుః ।

ఉత్తంకస్య నియోగాద్వై లోకానాం హితకామ్యయా ॥

తస్మిన్ ప్రయాతే దుర్ధర్షే దివి శబ్దో మహానభూత్ ।

ఏష శ్రీమాన్నృపసుతో ధుంధుమారో భవిష్యతి ॥

దివ్యైర్మాల్యైశ్చ తం దేవాసమంతాత్సమ వారయన్ ।

ప్రశంసాం చక్రిరే తస్య జయ జీవేతి వాదినః ॥

స గత్వా జయతాం శ్రేష్ఠస్తనయైస్సహ పార్థివః ।

సముద్రం ఖనయామాస వాలుకార్ణవ మధ్యతః ॥

నారాయణస్య విప్రర్షే తేజసాప్యాయితస్తు సః ।
బభూవ సుమహాతేజా భూయో బలసమన్వితః ॥
తస్య పుత్రైః ఖనద్భిస్తు వాలుకాంతర్గతస్తు సః ।
ధుంధురాసాదితో బ్రహ్మన్ దిశమాశ్రిత్య పశ్చిమామ్ ॥

ఓ మహారాజా ! పూర్వము రాజర్షులు ప్రజారక్షణము అనే ధర్మమును నిర్ధారించి◌ి యున్నారు. ఇట్టి ధర్మము మరియొకటి ఎక్కడనైననూ లేదు (22), మహాత్ముడగు ఉత్తంకుడు ఇట్లు పలుకగా, ఆ రాజర్షి తన పుత్రుడగు కువలాశ్వుని ధుంధుసంహారము కొరకై అయనకు అప్పజెప్పెను (23). ఓ పూజ్యా ! నేను ఆయుధములను పరిత్యజించితిని. ఈతడు నా కొడుకు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! ఈతడు నిస్సందేహముగా ధుంధువును సంహరించగలడు (24). ఆ మహారాజు ఇట్లు పలికి, పుత్రుడగు కువలాశ్వుని ఆదేశించి తపస్సునకు వెళ్లాను. ఆ కువలాశ్వుడు ఉత్తంకునితో గూడి ధుంధువును సంహరించుటకు వెల్లెను (25). అపుడు సర్వసమర్థుడగు విష్ణుభగవానుడు ఉత్తంకుని ప్రార్థనను స్వీకరించి లోకముల హితమును గోరి తన తేజస్సుచే ఆ రాజును ఆవేశించెను (26). జయింప శక్యము కాని కువలాశ్వుడు బయలు దేరగానే స్వర్గమునందు పెద్ద శబ్దము బయలు దేరెను. శోభిల్లే ఈ మహా రాజకుమారుడు ధుంధువును సంహరించగలడు అను వచనములు వినబడెను (27). దేవతలు ఆతనిని దివ్యములగు మాలలతో అన్ని వైపులనుండియు చుట్టుముట్టిరి. వారు 'నీకు జయమగుగాక ! చిరకాలము జీవించుము' అని పలుకుతూ ఆయనను ప్రశంసించిరి (28). విజేతలలో శ్రేష్ఠుడగు ఆ మహారాజు కొడుకులతో గూడి వెళ్లి, విస్తీర్ణమగు ఆ ఇసుక మైదానము మధ్యలో సముద్రమును త్రవ్వించేను (29). ఓ విప్రర్షీ! నారాయణుని తేజస్సుచే వర్ధిల్ల జేయబడిన ఆ మహాతేజశ్శాలియగు రాజు మరింత బలము గల వాడు ఆయెను (30). ఓ బ్రాహ్మణా ! ఆయన పుత్రులు త్రవ్వుచూ, ఇసుక లోపల పశ్చిమదిక్కును ఆశ్రయించుకొని యున్న ధుంధుని సమీపించిరి (31).

ముఖజేనాగ్నినా క్రోధాల్లోకాన్ సంవర్తయన్నివ ।
వారి సుస్రావ వేగేన విధోః కథిరివోదయే ॥
తతోఽ నలైరభిహతం దగ్ధం పుత్రశతం హి తత్ ।
త్రయ ఏవావశిష్టాశ్చ తేషు మధ్యే మునీశ్వర ॥
తతస్స రాజా విప్రేంద్ర రాక్షసం తం మహాబలమ్ ।
ఆససాద మహాతేజా ధుంధుం విప్రవినాశనమ్ ॥
తస్య వారిమయం వేగమాపీయ స నరాధిపః ।
వహ్నిబాణేన వహ్నిం తం శమయామాస వారిణా ॥
తం నిహత్య మహాకాయం బలేనోదక రాక్షసమ్ ।
ఉత్తంకస్యేక్షయామాస కృతం కర్మ నరాధిపః ॥
ఉత్తంకస్తు వరం ప్రాదాత్తస్మై రాజ్ఞే మహామునే ।
అదదచ్చాక్షయం విత్తం శత్రుభిశ్చా పరాజయమ్ ॥

ధర్మే మతిం చ సతతం స్వర్గే వాసం తథాక్షయమ్ ।

పుత్రాణాం చాక్షయం లోకం రక్షసా యే తు సంహతాః ॥

తస్య పుత్రాస్త్రయశ్శిష్టాః దృఢాశ్వః శ్రేష్ఠ ఉచ్యతే ।

హంసాశ్వకపిలాశ్వౌచ కుమారౌ తత్క నీయసౌ ॥

ధౌంధుమారిర్దృఢశ్వో యో హర్యశ్వస్తస్య చాత్మజః ।

హర్యశ్వస్య నికుంభో భూత్పుత్రో ధర్మరతస్సదా ॥

సంహతాశ్వో నికుంభస్య పుత్రో రణవిశారదః ।

అక్షాశ్వశ్చ కృతాశ్వశ్చ సంహతాశ్వసుతోఽ భవత్ ॥

ఆతడు తన నోటినుండి వెలువడిన అగ్నితో లోకములను కాల్చివేయుచున్నాడా యన్నట్లు ఉండెను. చంద్రకిరణములచే చంద్రకాంతి మణినుండివలె ఆతని నోటినుండి నీరు కూడ వేగముగా ప్రవహించేను (32). అపుడు ఆ అగ్ని ఆ వందమంది పుత్రులను ఆక్రమించి, తగులబెట్టెను. ఓ మహర్షీ! వారిలో ముగ్గురు మాత్రమే మిగిలిరి (33). ఓ బ్రాహ్మణశ్రేష్ఠా ! అపుడు మహాతేజశ్శాలియగు ఆ రాజు మహాబలుడు, బ్రాహ్మణహంతకుడు అగు ధుంధుడనే ఆ రాక్షసునిపై పరాక్రమించెను (34). ఆ మహారాజు వానినుండి వెలువడుచున్న జలధారలను ఆగ్నేయాస్త్రముచే ఎండగొట్టి అగ్నిని నీటితో చల్లార్చెను (35). ఆ మహారాజు పెద్ద శరీరము గలిగి నీటియందు ఉండే ఆ రాక్షసుని స్వీయబలముచే సంహరించి తాను చేసిన కర్మను ఉత్తంకునకు ప్రదర్శించెను (36). ఓ మహర్షీ! ఉత్తంకుడు ఆ రాజునకు వినాశము లేని సంపదను, శత్రువుల చేతిలో పరాజయము లేకుండుటను, సర్వదా స్థిరముగా నుండే ధర్మబుద్ధిని, స్వర్గములో శాశ్వతనివాసమును, రాక్షసునిచే సంహరింపబడిన పుత్రులకు శాశ్వతపుణ్యలో కమును వరములుగా నొసంగెను (37,38), ఆ మహారాజునకు మిగిలిన ముగ్గురు పుత్రులలో దృఢశ్వుడు పెద్దవాడు. హంసాశ్వుడు, కపిలాశ్వుడు ఆతని సోదరులు (39). ధుంధుమారునియొక్క పుత్రుడగు దృఢాశ్వునకు హర్యశ్వుడనే పుత్రుడు కలిగెను. హర్యశ్వునకు సర్వకాలములలో ధర్మమునందు ప్రీతి గల నికుంభుడు అనే పుత్రుడు కలిగెను (40). యుద్ధనిపుణుడగు సంహతాశ్వుడు నికుంభుని పుత్రుడు. సంహతాశ్వునకు అక్షాశ్వుడు, కృతాశ్వుడు అనే పుత్రులు గలరు (41).

తస్య హైమవతీ కన్యా సతాం మాన్యా వృషద్వతీ ।

విఖ్యాతా త్రిషు లోకేషు పుత్రస్తస్యాః ప్రసేనజిత్ ॥

లేభే ప్రసేనజిద్భార్యాం గౌరీం నామ పతివ్రతామ్ ।

అభిశప్తా తు సా భర్త్రా నదీ సా బాహుదా కృతా ॥

తస్య పుత్రో మహానాసీద్యువనాశ్వో మహీపతిః ।

మాంధాతా యువనాశ్వస్య త్రిషు లోకేషు విశ్రుతః ॥

తస్య చైత్రరథీ భార్యా శశబిందుసుతాఽ భవత్ ।

పతివ్రతా చ జ్యేష్ఠా చ భ్రాతౄణామయుతం చ సః ॥

తస్యాముత్పాదయామాస మాంధాతా ద్వౌ సుతౌ తదా ।
పురుకుత్సం చ ధర్మజ్ఞం ముచుకుందం చ ధార్మికమ్ ॥
పురుకుత్ససుతస్త్వాసీద్విద్వాంస్త్రయ్యారుణిః కవిః ।
తస్య సత్య వ్రతో నామ కుమారోఽ భూన్మహాబలీ ॥
పాణిగ్రహణ మంత్రాణాం విఘ్నం చక్రే మహాత్మభిః ।
యేన భార్యా హృతా పూర్వం కృతోద్వాహాః పరస్య వై ॥
బలాత్కామాచ్చ మోహాచ్చ సంహర్షాచ్చ యదోత్కటాక్ ।
జహార కన్యాం కామాచ్చ కస్య చిత్పురవాసినః ॥
అధర్మసంగినం తం తు రాజా త్రయ్యారుణి స్త్యజన్ ।
అపధ్వంసేతి బహుశోఽ వదత్క్రోధ సమన్వితః ॥
పితరం సోఽ బ్రవీన్ముక్తః క్వ గచ్ఛామీతి వై తదా ।
వస శ్వపాకనికటే రాజా ప్రాహేతి తం తదా ॥

ఆయనకు సత్పురుషులచే ఆదరింపబడే హైమవతి, మరియు ముల్లోకములలో కీర్తిని గాంచి్సిన వృషద్వతి అను కన్యలు గలరు. వృషద్వతియొక్క పుత్రుడు ప్రసేనజిత్తు (42). ప్రసేనజిత్తు గౌరి అనే పతివ్రతను భార్యగా పొందెను. భర్త ఆమెను శపించి బాహుద అనే నదిగా చేసెను (43). ఆయనకు యువనాశ్వుడనే గొప్ప రాజు పుత్రుడాయేను. ముల్లోకములలో పేరు బడసిన మాంధాత యువనాశ్వుని పుత్రుడు (44). శశిబిందుని కుమార్తె యగు చైత్రరథి ఆయనకు భార్య ఆయెను. ఆ పతివ్రత పదివేలమంది సోదరులకు అక్క. మాంధాతకు ఆమెయందు ఇద్దరు ధర్మాత్ములగు పుత్రులు కలిగిరి. పురుకుత్సుడు, ముచుకుందుడు అనునవి వారి పేర్లు (45,46). విద్వాంసుడు, కవియగు త్రయ్యారుణి పురుకుత్సుని కుమారుడు. వానికి మహాబలశాలియగు సత్య వ్రతుడనే కొడుకు కలిగెను (47). మహాత్ములు ఇతరుల వివాహసమయములో పఠించే మంత్రములకు ఆతడు విఘ్నములను కలిగించి వివాహమైన తరువాత నూతన వధువును అపహరించేవాడు (48). ఆతడు ఒకనాడు కామమోహితుడై బలగర్వితుడై భోగలాలసుడై ఒకానొక పౌరుని కన్యను బలాత్కారముగా అపహరించెను (49). త్రయ్యారుణి మహారాజు క్రోధముతో నిండిన మనస్సు గలవాడై అధర్మాత్ముడగు ఆ కొడుకును 'ఓరీ భ్రష్టుడా!' అని పలువిధములుగా నిందించి బహిష్కరించేను (50). అపుడు బహిష్కరించబడిన ఆ కుమారుడు తండ్రిని 'నేను ఎచటకు పోయెదను ?' అని ప్రశ్నించగా, అపుడా రాజు వానిచో 'శునకమాంసభక్షకుల సమీపములో నివసించుము' అని పలికెను (51).

స హి సత్య వ్రతస్తేన శ్వపాకా వసథాంతికే ।
పిత్రా త్యక్తో౨వసద్ధీరో ధర్మపాలేన భూభుజా ॥
తతస్త్రయ్యారుణీ రాజా విరక్తః పుత్రకర్మణా ।
స శంకరతపః కర్తుం సర్వం త్యక్త్వా వనం యయౌ ॥
తతస్తస్య స్వవిషయే నావర్షత్పా కశాసనః ।
సమా ద్వాదశ విప్రర్షే తేనా ధర్మేణ వై తదా ॥
దారాం తస్య తు విషయే విశ్వామిత్రో మహాతపాః ।
సంత్యజ్య సాగరానూపే చచార విపులం తపః ॥
తస్య పత్నీ గలే బద్ధ్వా మధ్యమం పుత్రమౌరసమ్ ।
శేషస్య భరణార్థాయ వ్యక్రీణాద్గోశతేన చ ॥
తాం తు దృష్ట్వా గలే బద్ధం విక్రీణంతీం స్వమాత్మజమ్ ।
మహర్షిపుత్రం ధర్మాత్మా మోచయమాస తం తదా ॥
సత్య వ్రతో మహాబాహుర్భరణం తస్య చాకరోత్ ।
విశ్వామిత్రస్య తుష్ట్యర్థమను క్రోశార్థమేవ చ ॥
తదారభ్య స పుత్రస్తు విశ్వామిత్రస్య వై మునేః ।
అభవద్గాలవో నామ గలబంధాన్మహాతపాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం ధుంధువధవర్ణనం నామ
సప్తత్రింశో౨ధ్యాయః ॥

ధర్మాత్ముడగు రాజు మరియు తండ్రి అగు త్రయ్యారుణిచే బహిష్కరించబడిన ధీరుడగు సత్య వ్రతుడు శునకమాంసభక్షకుల ఇంటికి సమీపములో నివసించెను (52), తరువాత తన కుమారుడు చేసిన పనిచే వైరాగ్యమును పొందిన ఆ త్రయ్యారుణి మహారాజు సర్వమును విడిచిపెట్టి శంకరుని ఉద్దేశించి తపస్సును చేయుటకై అడవికి వెళ్లాను (53). ఓ బ్రహ్మర్షీ ! అపుడు ఆ అధర్మముచే ఇంద్రుడు ఆ రాజ్యములో పన్నెండు సంవత్సరములు వర్షించలేదు (54). ఆ రాజ్యములో గొప్ప తపశ్శాలియగు విశ్వామిత్రుడు భార్యను విడిచి పెట్టి సముద్రతీరములో జలసమృద్ధమగు స్థానములో విస్తారమైన తపస్సును చేసెను (55). ఆయన భార్య తాను కన్న ముగ్గురు పుత్రులలో మిగిలిన వారి పోషణ కొరకై మధ్యమపుత్రుని కంఠమునందు త్రాడుతో కట్టి వంద గోవులకు అమ్మజూపెను (56), మహర్షిపుత్రుడగు తన కొడుకుయొక్క కంఠములో త్రాడును కట్టి అమ్ముటకు సంసిద్ధురాలైన ఆ తల్లిని చూచి ధర్మాత్ముడగు సత్య వ్రతుడు అపుడు అతనిని విడిపించేను (57). గొప్ప బాహువులు గల సత్య వ్రతుడు తన దయాస్వభావము కారణముగా మరియు విశ్వామిత్రునకు ఆనందమును కలగజేయుట కొరకై వాని పోషణకు ఏర్పాటు చేసెను (58). అప్పటినుండియు మహాతపశ్శాలియగు ఆ విశ్వామిత్రమహర్షి యొక్క పుత్రుడు కంఠములో త్రాడుచే కట్టబడుటచే గాలవుడు అను పేరును పొందెను (59).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ధుంధువధవర్ణనము అనే ముప్పది ఏడవ అధ్యాయము ముగిసినది (37).

38 - సగరోపాఖ్యానము

సూత ఉవాచ ।

సత్య వ్రతస్తు తద్భక్త్యా కృపయా చ ప్రతిజ్ఞయా ।
విశ్వామిత్ర కలత్రం చ పోషయామాస వై తదా ॥
హత్వా మృగాన్ వరాహాంశ్చ మహిషాంశ్చ వనే చరాన్ ।
విశ్వామిత్రా శ్రమాభ్యాశే తన్మాంసం చాక్షిపన్మునే ॥
తీర్థం గాం చైవ గోత్రం చ తథైవాంతః పురం మునిః ।
యాజ్యోపాధ్యాయ సంయోగద్వసిష్ఠః పర్యరక్షత ॥
సత్య వ్రతస్య వాక్యాద్వా భావినోఽర్థస్య వై బలాత్ ।
వసిష్ఠోఽభ్యధికం మన్యుం ధారయామాస నిత్యశః ॥
పిత్రా తు తం తదా రాష్ట్రాత్పరిత్యక్తం స్వమాత్మజమ్ ।
న వారయామాస మునిర్వసిష్ఠః కారణేన చ ॥
పాణిగ్రహణ మంత్రాణాం నిష్ఠా స్యాత్సప్తమే పదే ।
న చ సత్య వ్రతస్తస్య తముపాంశుమ బుద్ధ్యత ॥
తస్మిన్ స పరితోషాయ పితురాసీన్మహాత్మనః ।
కులస్య నిష్కృతిం విప్ర కృతవాన్ వై భవేదితి ॥
న తం వసిష్ఠో భగవాన్ పిత్రా త్యక్తం న్యవారయత్ ।
అభిషేక్ష్యామ్యహం పుత్రమస్యాం నైవాబ్రవీన్మునిః ॥
స తు ద్వాదశ వర్షాణి దీక్షాం తాముద్వహద్బలీ ।
అవిద్యమానే మాంసే తు వసిష్ఠస్య మహాత్మనః ॥
సర్వకామదుహాం దోగ్ధ్రీం దదర్శ స నృపాత్మజః ।
తాం వై క్రోధాచ్చ లోభాచ్చ శ్రమాద్వై చ క్షుధాన్వితః ॥
దాశధర్మగతో రాజా తాం జఘాన స వై మునే ।
స తం మాంసం స్వయం చైవ విశ్వామిత్రస్య చాత్మజమ్ ॥
భోజయామాస తచ్ఛ్రుత్వా వసిష్ఠో హ్యస్య చుక్రుధే ।
ఉవాచ చ మునిశ్రేష్టస్తం తదా క్రోధసంయుతః ॥

సూతుడు ఇట్లు పలికెను -

సత్య వ్రతుడు విశ్వామిత్రుని యందు గల భక్తిచే, ప్రతిజ్ఞను చేసియుండుటచే మరియు దయాస్వభావము గలవాడగుటచే ఆ సమయములో విశ్వామిత్రుని భార్యను పోషించేను (1). ఓ మునీ ! ఆతడు లేళ్లను, పందులను, వనములో తిరిగే దున్నలను సంహరించి వాటి మాంసమును విశ్వామిత్రుని ఆశ్రమమునకు సమీపములో ఉంచెడివాడు (2). యాజకుడు మరియు ఉపాధ్యాయుడు అయి ఉండుటచే వసిష్ఠుడు తీర్థమును, గోవును, గోత్రమును మరియు భార్యాదికమును రక్షించెడివాడు (3). సత్యవ్రతుని పలుకుల వలన, మరియు భవితవ్యము బలీయమగుట వలన వసిష్ఠుడు సర్వకాలములలో

అధికమగు కోపమును కలిగియుండెడివాడు (4), ఆ దేశపు మహారాజు తన కుమారుని సకారణముగా దేశమునుండి బహిష్కరించగా, ఆ వసిష్ఠమహర్షి వారించలేదు (5). వివాహమంత్రములు సప్తపదిలో పర్యవసానమును పొందును. కాని ఈ రహస్యము సత్య వ్రతునకు తెలియదు (6), ఓ విప్రా ! ఆయన మహాత్ముడగు తండ్రియొక్క సంతోషము కొరకు, కులధర్మములు పాటింపబడుననే భావన గలవాడై దేశనిష్కాసనమును పాలించెను (7). తండ్రి ఆయను బహిష్కరించుచుండగా పూజ్యుడగు వసిష్ఠుడు వారించలేదు. 'రాజ్యమునందు ఈ మహారాజు పుత్రుని నేను అభిషేకించెదను' అని ఆయన చెప్పనే లేదు (8). ఆ బలవంతుడగు సత్యవ్రతుడు పన్నెండు సంవత్సరములు దేశ బహిష్కారమును దీక్షగా పాలించెను. ఆహారము కొరకై ఒకనాడు ఆతనికి మాంసము దొరకలేదు. అపుడా రాజపుత్రునకు కోరికలనన్నిటినీ ఈడేర్చే ధేనువు కనబడెను. అది మహాత్ముడగు వసిష్ఠునిది. ఆతడు ఆకలిగొని యుండుటచే, వసిష్ఠుని పై కోపము ఉండుటచే, ఆహారము నందు తృష్ణ ఉండుటచే, మరియు శ్రమపడి యుండుటచే, కిరాతప్రవృతిని అనుసరించి ఉన్నవాడే ఆ ధేనువును సంహరించేను. ఓ మునీ ! ఆయన స్వయముగా ఆ మాంసమును తాను భక్షించి విశ్వామిత్రుని కుమారునిచే భుజింపజేసెను. ఈ విషయమును విని వసిష్ఠుడు ఆయనపై కోపించెను. అపుడా మహర్షి కోపముతో నిండిన వాడై ఆతనితో నిట్లనెను (9-12).

వసిష్ఠ ఉవాచ ।

పాతయేయమహం క్రూరం తవ శంకుమయోమయమ్ ।
యది తే ద్వావిమౌ శంకూ నశ్యేతాం వై కృతౌ పురా ॥
పితుశ్చా పరితోషేణ గురోర్దోగ్ధ్రీవధేన చ ।
అప్రోక్షితోపయోగాచ్చ త్రివిధస్తే వ్యతిక్రమః ॥
త్రిశంకురితి హోవాచ త్రిశంకురితి స స్మృతః ।
విశ్వామిత్రస్తు దారాణామాగతో భరణే కృతే ॥
తేన తస్మై వరం ప్రాదాన్మునిః ప్రీతస్త్రిశంకవే ।
ఛంద్యమానో వరేణాథ వరం వవ్రే నృపాత్మజః ॥
అనావృష్టి భయే చాస్మిన్ జాతే ద్వాదశవార్షికే ।
అభిషిచ్య పితూ రాజ్యే యాజయామాస తం మునిః ॥
మిషతాం దేవతానాం చ వసిష్ఠస్య చ కౌశికః ।
స శరీరం తదా తం తు దివమారోహయత్ప్రభుః ॥
తస్య సత్యరథా నామ భార్యా కేకయవంశజా ।
కుమారం జనయామాస హరిశ్చంద్రమ కల్మషమ్ ॥
స వై రాజా హరిశ్చంద్రో త్రైశంకవ ఇతి స్మృతః ।
ఆహర్తా రాజసూయస్య సమ్రాడితి హ విశ్రుతః ॥
హరిశ్చంద్రస్య హి సుతో రోహితో నామ విశ్రుతః ।
రోహితస్య వృకః పుత్రో వృకాద్బాహుస్తు జజ్ఞివాన్ ॥

హై హయాస్తాల జంఘాశ్చ నిరస్యంతి స్మ తం నృపమ్ ।
నాత్మార్థే ధార్మికో విప్రస్స హి ధర్మపరోఽ భవత్ ॥
సగరం ససుతం బాహుర్జజ్ఞే సహ గరేణ వై ।
ఔర్వస్యాశ్రమమాసాద్య భార్గవేణా భిరక్షితః ॥
ఆగ్నేయమస్త్రం లబ్ధ్వా చ భార్గవాత్సగరో నృపః ।
జిగాయ పృథివీం హత్వా తాలజంఘాన్ సహైహయాన్ ॥
శకాన్ బహూదకాంశ్చైవ పారదాన్ తగణాన్ ఖశాన్ ।
సుధర్మం స్థాపయామాస శశాస వృషతః క్షితిమ్ ॥

వసిష్టుడు ఇట్లు పలికెను –

నీకు పూర్వము రెండు శంకువులు వేయబడియున్నవి. అవి తొలగిపోయి ిసిచో, నీకు మరియొక పీడాకరమగు ఇనుప శంకువును నేను వేసెదను (13). నీవు తండ్రికి దుఃఖమును కలిగించితివి. గురువునకు పాలను ఇచ్చే ఆవును సంహరించి, ప్రోక్షించకుండగా వినియోగించితివి. నీవీ విధముగా మూడు రకములుగా ధర్మమును ఉల్లంఘించితివి (14). వసిష్టుడు ఆయనకు 'త్రిశంకుడు' అని పేరు పెట్టుటచే ఆ పేరే స్థిరపడెను. ఆయన విశ్వామిత్రుని భార్యను పోషించెను. ఇంతలో విశ్వామిత్ర మహర్షి వచ్చి ఆ త్రిశంకునిపై ప్రీతినీ పొందినవాడై వరమునిచ్చెను. వరమును కోరుకొమ్మని మహర్షి చెప్పగా, ఆ రాజకుమారుడు వరమును కోరెను. అపుడా మహర్షి ఆయన కోరిక మేరకు, పన్నెండు సంవత్సరములనుండి వర్షాభావపరిస్థితులు కలిగియుండగా, ఆయనను తండ్రియొక్క రాజ్యమునకు రాజుగా అభిషేకించి, యజ్ఞమును చేయించెను (15-17). సర్వసమర్థుడగు విశ్వామిత్రుడు, దేవతలు మరియు వసిష్ఠుడు నిస్సహాయులై చూచుచుండగా, త్రిశంకువును బొందితో స్వర్గమునధిష్ఠింప జేసెను (18), కేకయవంశమునందు పుట్టిన సత్యరథ అనునామే త్రిశంకుని భార్య. ఆమె పరమ పవిత్రుడగు హరిశ్చంద్రుడనే కుమారునకు జన్మనిచ్చెను (19). ఆ హరిశ్చంద్ర మహారాజునకు త్రిశంకవుడు (త్రిశంకుని పుత్రుడు) అని ప్రసిద్ధి. ఆ చక్రవర్తి రాజసూయయాగమును చేసినవాడని ప్రఖ్యాతి గలదు (20). హరిశ్చంద్రుని కుమారుడు ప్రఖ్యాతుడైన రోహితుడు. ఆయనకు వృకుడు, వృకునకు బాహువు పుత్రులు (21). ఓ విప్రా ! ఆ బాహుమహారాజు ధర్మాత్ముడు. ఆయన స్వార్థము కొరకు ప్రవర్తించెడివాడు కాదు. ఆ మహారాజును హైహయులు, తాలజంఘులు పదవీచ్యుతుని చేసిరి (22), ఆ బాహువునకు ఒక పుత్రుడు. కలిగెను. ఆ పుత్రుడు విషముతో గూడి జన్మించుటచే సగరుడైనాడు. బాహువు భృగువంశజుడగు ఔర్వుని ఆశ్రమమునకు వెళ్లగా, ఆయన ఆ బాలుని కాపాడినాడు (23). సగరమహారాజు భార్గవుని వద్దనుండి ఆగ్నేయాస్త్రమును సంపాదించి తాలజంఘులను, హైహయులను సంహరించి భూమిని జయించెను (24). ఆయన శక- బహూదక- పారద- తగణ- ఖశులను జయించి చక్కని ధర్మమును నెలకొల్పి భూమిని ధర్మబద్ధముగా పాలించెను (25).

శౌనక ఉవాచ ।

స వై గరేణ సహితః కథం జాతస్తు క్షత్రియాన్ ।

జితవానేతదాచక్ష్వ విస్తరేణ హి సూతజ ॥

శౌనకుడిట్లు పలికెను –

ఓ సూతపుత్రా ! ఆతడు విషముతో గూడి ఎట్లు జన్మించెను ? క్షత్రియులనెట్లు జయించెను ? ఈ విషయములను విస్తారముగా చెప్పుము (26).

సూత ఉవాచ ।

పారీక్షితేన సంపృష్టో వైశంపాయన ఏవ చ ।

యదాచష్ట స్మ తద్వక్ష్యే శృణుష్వైకమనా మునే ॥

సూతుడిట్లు పలికెను –

జనమేజయుడు ప్రశ్నించగా వైశంపాయనుడు చెప్పిన విషయమును చెప్పుచున్నాను. ఓ మునీ ! ఏకాగ్రమగు మనస్సు గలవాడవై వినుము (27).

పరిక్షిత ఉవాచ ।

కథం స సగరో రాజా గరేణ సహితో మునే ।

జాతస్స జఘ్నివాన్ భూయానేతదాఖ్యాతు మర్హసి ॥

జనమేజయుడిట్లు పలికెను –

ఓ మునీ ! ఆ సగరమహారాజు విషముతో గూడి ఎట్లు జన్మించినాడు ? అనేక శత్రువులనెట్లు సంహరించినాడు ? ఈ విషయమును నీవు చెప్పదగును (28).

వైశంపాయన ఉవాచ।

బాహోర్వ్యసనినస్తాత హృతం రాజ్యమభూత్కిల ।

హైహయైస్తాలజంఘైశ్చ శకైస్సార్ధం విశాంపతే ॥

యవనాః పారదాశ్చైవ కాంబోజాః పాహ్లవాస్తథా ।

బహూదకాశ్చ పంచైవ గణాః ప్రోక్తాశ్చ రక్షసామ్ ॥

ఏతే పంచగణా రాజన్ హైహయార్థేషు రక్షసామ్ ।

కృత్వా పరాక్రమాన్ బాహో రాజ్యం తేభ్యో దదుర్బలాత్ ॥

హృతరాజ్యస్తతో విప్రాస్స వై బాహుర్వనం యయౌ ।

పత్న్యా చానుగతో దుఃఖీ స వై ప్రాణానవాసృజత్ ॥

పత్నీ యా యాదవీ తస్య సగర్భా పృష్ఠతో గతా ।

సపత్న్యా చ గరస్తస్యై దత్తః పూర్వం సుతేర్ష్యయా ॥

సా తు భర్తుశ్చితాం కృత్వా జ్వలనం చావరోహత ।

ఔర్వస్తాం భార్గవో రాజన్ కారుణ్యాత్సమ వారయత్ ॥

తస్యా శ్రమే స్థితా రాజ్ఞీ గర్భరక్షణహేతవే ।
నిషేవే మునివర్యం తం స్మరంతీ శంకరం హృదా ॥
ఏకదా ఖలు తద్గర్భో గరేణైవ సహ చ్యుతః ।
సుముహూర్తే సులగ్నే చ పంచోచ్చ గ్రహ సంయుతే ॥
తస్మింల్లగ్నే చ బలిని సర్వథా మునిసత్తమ ।
వ్యజాయత మహాబాహుస్సగరో నామ పార్థివః ॥
ఔర్వస్తు జాతకర్మాది తస్య కృత్వా మహాత్మనః ।
అధ్యాప్య వేదశాస్త్రాణి తతోఽస్త్రం ప్రత్యపాదయత్ ॥
ఆగ్నేయం తం మహాభాగో హ్యమరైరపి దుస్సహమ్ ।
జగ్రాహ విధినా ప్రీత్యా సగరోఽసౌ నృపోత్తమః ॥

వైశంపాయనుడిట్లు పలికెను -

ఓ వత్సా ! మహారాజా ! ఆపదలకు గురియై యున్న బాహువుయొక్క రాజ్యయమును హైహయ- తాలజంఘ-శకులు అపహరించిరి గదా ! (29) యవన- పారద- కాంబోజ-పాప్లవ- బహూదకులనే అయిదు రాక్షస గణములు గలవు (30). ఓ రోజు ! ఈ అయిదు రాక్షస గణములు హైహయుల కొరకై పరాక్రమమును ప్రదర్శిస్తూ బాహువుయొక్క రాజ్యమును ఊడలాగి వారికి ఇచ్చిరి (31). ఓ బ్రాహ్మణులారా! అపుడు బాహువు రాజ్యమును పోగొట్టుకొని అడవుల పాలయ్యెను. దుఃఖితుడైయున్న ఆయన వెంట భార్య నడిచేను. ఆయన అచట ప్రాణములను విడిచెను (32). యదువంశమునందు జన్మించిన ఆయనయొక్క భార్య ఆయన వెంట వెళ్లియుండెను. ఆమెకు తనకంటే ముందు పుత్రుడు జన్మించుననే ఈర్ష్యతో సవతి విషమును పెట్టెను (33). ఆమె భర్త చితికి నిప్పును పెట్టి తాను కూడ దానిపై అధిరోహించెను. ఓ రాజా ! అపుడు భృగువంశజుడగు ఔర్వుడు దయతో ఆమెను అడ్డుకొనేను (34). ఆ మహారాణి గర్భమును పదిల పరచుటకై ఆయన ఆశ్రమములో నుండి హృదయములో శంకరుని స్మరిస్తూ ఆ మహర్షిని సేవించెను (35). ఒకనాడు ఆ గర్భము విషముతో సహా ప్రసవమాయేను. ఓ మహర్షీ ! మంచి ముహూర్తములో మంచి లగ్నములో అయిదు గ్రహములు ఉన్నతస్థానములలో నుండగా అన్నివిధములుగా శ్రేష్ఠమగు కాలములో మహాబాహుడు అగు సగరమహారాజు జన్మించెను (36,37). ఆ మహాత్ముడగు సగరునకు మహాత్ముడగు ఔర్వుడు జాతకర్మ మొదలగు సంస్కారములను చేసి వేదశాస్త్రములను చదివించిన తరువాత దేవతలకు కూడ సహింప శక్యము కాని ఆగ్నేయాస్త్రమునిచ్చెను. ఆ సగరమహారాజు ఆ అస్త్రమును ప్రేమతో యథావిధిగా స్వీకరించెను (38, 39).

స తేనాస్త్ర బలేనైవ బలేన చ సమన్వితః ।
హైహయాన్ విజఘానాశు సంక్రుద్ధోఽస్త్ర బలేన చ ॥
ఆజహార చ లోకేషు కీర్తిం కీర్తిమతాం వరః ।
ధర్మం సంస్థాపయామాస సగరోఽసౌ మహీతలే ॥
తతశ్శకాస్సయవనాః కాంబోజాః పాహ్లవాస్తథా ।
హన్యమానాస్తదా తే తు వసిష్ఠం శరణం యయుః ॥
వసిష్ఠో వంచనాం కృత్వా సమయేన మహాద్యుతిః ।
సగరం వారయామాస తేషాం దత్త్వాభయం నృపమ్ ॥
సగరస్స్వాం ప్రతిజ్ఞాం తు గురో ర్వాక్యం నిశమ్య చ ।
ధర్మం జఘాన తేషాం వై కేశాన్యత్వం చకార హ ॥
అర్ధం శకానాం శిరసో ముండం కృత్వా వ్యసర్జయత్ ।
యవనానాం శిరస్సర్వం కాంబోజానాం తథైవ చ ॥
పారదా ముండకేశాశ్చ పాహ్లవాశ్శ్మశ్రుధారిణః ।
నిస్స్వాధ్యాయవషట్కారాః కృతాస్తేన మహాత్మనా ॥
జితా చ సకలా పృథ్వీ ధర్మతస్తేన భూభుజా ।
సర్వే తే క్షత్రియాస్తాత ధర్మహీనాః కృతాః పురా ॥
స ధర్మవిజయీ రాజా విజిత్యేమాం వసుంధరామ్ ।
అశ్వం సంస్కారయామాస వాజిమేధాయ పార్థివః ॥
తస్య చాస్యతే సోఽశ్వస్సముద్రే పూర్వదక్షిణే ।
గతః షష్టిసహస్రైస్తు తత్పుత్త్రైరన్వితో మునే ॥

అస్త్ర బలమును పొందియున్న ఆ సగరుడు సైన్యమును వెంటబెట్టుకొని మిక్కికిలి కోపించినవాడై వెంటనే హైహయులను సంహరించేను. ఆయన ఆ అస్త్ర బలముచే లోకములలో కీర్తిని సంపాదించి కీర్తిగలవారిలో శ్రేష్టుడాయెను. ఆ సగరుడు భూలోకములో ధర్మమును స్థాపించేను (40,41). అపుడు ఆతనిచే సంహరింపబడుచున్న శక-యవన- కాంబోజ-పాహ్లవులు వసిష్ఠుని శరణు పొందిరి (42). మహాతేజశ్శాలియగు వసిష్ఠుడు సందర్భానుసారముగా వారిని వంచించి వారికి అభయమునిచ్చి సగరమహారాజును వారిని సంహరించవద్దని వారించేను (43). సగరుడు గురువుయొక్క వాక్యమును విని, ధర్మమును మరియు తన ప్రతిజ్ఞను మనస్సులో నిడుకొని వారి కేశాలంకారములో మార్పు వచ్చునట్లు చేసెను (44), శకుల తలలను సగభాగము ముండనము చేయించి వదిలిపెట్టెను. యవన-కాంబోజుల తలలకు పూర్తి ముండనమును విధించెను (45). ఆ మహాత్ముడు పారదులకు మరియు పాహ్లవులకు తలలకు ముండనమును వీధించి మీసములు ఉండునట్లు చేసెను. ఆ మహాత్ముడు వారికీ వేదాధ్యయనమునందు, యజ్ఞానుష్టానమునందు అధికారము లేకుండగా చేసెను (46). ఆ మహారాజు భూమినంతనూ ధర్మబద్ధముగా జయించి పూర్వము ఆ క్షత్రియులనందరినీ ధర్మమునుండి బహిష్కరించెను (47). ధర్మముగా జయమును పొందిన ఆ రాజు ఈ భూమిని జయించి అశ్వమేధయాగము కొరకై గుర్రమునకు సంస్కారములను

చేసెను (48). ఓ మునీ ! సగరుని అరువది వేల పుత్రులు వెంట నడువగా ఆ గుర్రము ఆగ్నేయ సముద్రమును చేరెను (49).

దేవరాజేన శక్రేణ సోఽశ్వోహి స్వార్థ సాధినా ।
వేలా సమీపేఽ పహృతో భూమిం చైవ ప్రవేశితః ॥
మహారాజోఽథ సగరస్తద్ధయాన్వేషణాయ చ ।
స తం దేశం తదా పుత్రైః ఖానయామాస సర్వతః ॥
ఆసేదుస్తే తతస్తత్ర ఖన్యమానే మహార్ణవే ।
తమాదిపురుషం దేవం కపిలం విశ్వరూపిణమ్ ॥
తస్య చక్షుస్సముత్థేన వహ్నినా ప్రతిబుధ్యతః ।
దగ్ధాః షష్టిసహస్రాణి చత్వారస్త్వవ శేషితాః ॥
హర్షకేతుస్సు కేతుశ్చ తథా ధర్మరథోఽపరః ।
శూరః పంచజనశ్చైవ తస్య వంశకరా నృపాః ॥
ప్రాదాచ్చ తస్మై భగవాన్ హరిః పంచ వరాన్ స్వయమ్ ।
వంశం మేధాం చ కీర్తిం చ సముద్రం తనయం ధనమ్ ॥
సాగరత్వం చ లేభే స కర్మణా తస్య తేన వై ।
తం చాశ్వమేధికం సోఽశ్వం సముద్రాదుప లబ్ధవాన్ ॥
ఆజహారాశ్వమేధానాం శతం స తు మహాయశాః ।
ఈజే శంభువిభూతీశ్చ దేవతాస్తత్ర సువ్రతః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం సగరోపాఖ్యానం నామ అష్టత్రింశోఽధ్యాయః ॥

స్వార్థసాధనలో దిట్టయగు దేవేంద్రుడు ఆ గుర్రమును సముద్రతీరము వద్ద అపహరించి భూమిలోపల ప్రవేశపెట్టెను (50). అపుడా సగరమహారాజు ఆ గుర్రమును వెదుకుట కొరకై ఆ స్థానమునంతనూ తన పుత్రులచే త్రవ్వించెను (51). వారు ఆ మహాసముద్రమును త్రవ్వుచూ, ఆదిపురుషుడు విశ్వమే రూపముగా గలవాడు అగు కపిలదేవుని సమీపమునకు చేరుకొనిరి (52). ఆయన సమాధినుండి బయటకు వచ్చి చూడగనే, ఆయన కంటినుండి పుట్టిన అగ్నిలో నలుగురిని మినహాయించి అరవై వేలమంది బూడిద అయిరి (53). హర్షకేతువు, సుకేతువు, ధర్మరథుడు మరియు శూరుడగు పంచజనుడు అనే ఆ నలుగు రోజులు సగరుని వంశమును నిలబెట్టిరి (54). విష్ణుభగవానుడు ఆ సగరునకు స్వయముగా, వంశాభివృద్ధి, మేధాశక్తి, కీర్తి, సముద్రుడు పుత్రుడు అగుట, ధనము అనే అయిదు వరములను ఇచ్చెను (55). ఆ కర్మచే సగరుడు సముద్రునకు తండ్రి ఆయెను. ఆయన అశ్వమేధయాగమునకు సంబంధించిన ఆ గుర్రమును సముద్రుని వద్దనుండి పొందెను (56). గొప్ప కీర్తి గల ఆ సగరుడు వంద అశ్వమేధయాగములను చేసెను. గొప్ప వ్రతము గల ఆ సగరుడు శంభుని అనుగ్రహముచే సంపదలను పొంది దేవతలను తన యజ్ఞశాలలో ఆహుతులనిచ్చి ఆరాధించెను (57).

39 – వైవస్వత రాజవంశ వర్ణనము

శౌనక ఉవాచ ।

సగరస్యాత్మజా వీరాః కథం జాతా మహా బలాః ।
విక్రాంతాః షష్టి సాహస్రా విధినా కేన వా వద ॥

శౌనకుడిట్లు పలికెను –

సగరుని అరువది వేల పుత్రులు వీరులుగను, మహాబలశాలురుగను, విక్రమశీలురుగను ఎట్లు కాగల్గిరి ? ఆ విధానమేది ? చెప్పుము (1).

సూత ఉవాచ ।

ద్వే పత్న్యౌ సగరస్యాస్తాం తపసా దగ్ధ కిల్బిషే ।
ఔర్వస్తయోర్వరం ప్రాదాత్తోషితో మునిసత్తమః ॥
షష్టిపుత్ర సహస్రాణి ఏకా వవ్రే తరస్వినామ్ ।
ఏకం వంశకరం త్వేకా యథేష్టం వరశాలినీ ॥
తత్రైవాగత్య తాంల్లబ్ధ్వా పుత్రాన్ శూరాన్ బహూంస్తదా ।
సా చైవ సుషువే తుంబం బీజపూర్ణం పృథక్కృతమ్ ॥
తే సర్వే హి స్వధాత్రీభిర్వవృధుశ్చ యథాక్రమమ్ ।
ఘృతపూర్ణేషు కుంభేషు కుమారాః ప్రీతివర్ధనాః ॥
కపిలాగ్ని ప్రదగ్ధానాం తేషాం తత్ర మహాత్మనామ్ ।
ఏకః పంచజనో నామ పుత్రో రాజా బభూవ హ ॥
తతః పంచజన స్యాసీదంశుమాన్నామ వీర్యవాన్ ।
దిలీపస్తనయస్తస్య పుత్రో యస్య భగీరథః ॥
యస్తు గంగాం సరిచ్ఛ్రేష్ఠామవా తారయత ప్రభుః ।
సముద్రమానయచ్చేమాం దుహితృత్వమ కల్పయత్ ॥
భగీరథ సుతో రాజా శ్రుతసేన ఇతి శ్రుతః ।
నాభాగస్తు సుతస్తస్య పుత్రః పరమధార్మికః ॥
అంబరీషస్తు నాభాగిస్సింధుద్వీపస్తతోఽ భవత్ ।
అయుతాజిత్తు దాయాదస్సింధుద్వీపస్య వీర్యవాన్ ॥
అయుతాజిత్సుతస్త్వాసీ దృతుపర్ణో మహాయశాః ।
దివ్యాక్ష హృతయజ్ఞోఽసౌ రాజా నలసఖోఽ భవత్ ॥

సూతుడిట్లు పలికెను –

సగరునకు ఇద్దరు భార్యలు ఉండిరి. తపస్సుచే నశింపచేయబడిన పాపములు గల వారిద్దరు ఔర్వమహర్షిని సంతోషపెట్టిరి. ఆయన వారికి వరమునిచ్చెను (2). వారిలో ఒకామె వేగవంతులగు అరవై వేలమంది పుత్రులను కోరగా, వరలాభముచే ఉల్లాసముగా నున్న రెండవ ఆమె తన ఇచ్ఛననుసరించి వంశకారకుడగు ఒక పుత్రుని కోరెను (3). ఆ మహర్షి వద్దకు వచ్చి అనేకమంది

శూరులగు పుత్రులను వరముగా పొందిన ఆ మొదటి భార్య అనేక బీజములతో నిండియున్న పిండమును కనెను. అది వివిధభాగములుగా విడిపోయెను (4). పెంపుడుగత్తెలు ఆ భాగములనన్నింటినీ నేతితో నింపబడిన కుండలలో భద్రము చేసిరి. కాలక్రమములో అవీ పెరిగి ముద్దులు ఒలికే కుమారులు జన్మించిరి (5). మహాత్ములగు ఆ పుత్రులు అందరు కపిలుని కోపాగ్నిలో భస్మము కాగా, పంచజనుడనే ఏకైకపుత్రుడు రాజు ఆయెను (6). తరువాత పంచజనునకు పరాక్రమశాలియగు అంశుమంతుడనే పుత్రుడు కలిగెను. ఆయన పుత్రుడు దిలీపుడు. దిలీపుని పుత్రుడు భగీరథుడు (7). సర్వసమర్థుడగు భగీరథుడు నదీమతల్లి యగు గంగను దివినుండి భువికి తెచ్చి సముద్రము వరకు గొని పోయి ఆమెను తన కుమార్తెనుగా చేసుకొనెను (8). భగీరథుని కుమారుడు ప్రఖ్యాతి గాంచిన శ్రుతసేన మహారాజు. ఆతని పుత్రుడు పరమధర్మాత్ముడగు నాభాగుడు (9). నాభాగుని పుత్రుడు అంబరీషుడు. అంబరీషుని కొడుకు సింధుద్వీపుడు. సింధుద్వీపునకు పరాక్రమశాలియగు అయుతా జిత్తు అనే కొడుకు గలడు (10). అయుతాజిత్తునకు గొప్ప యశస్వియగు ఋతుపర్ణుడనే పుత్రుడు గలడు. ఆ మహారాజు పాచికల జూదముయొక్క రహస్యముల నెరింగిన మహాబుద్ధిశాలి. ఆయన నలునకు మిత్రుడు ఆయెను (11).

ఋతుపర్ణసుతస్త్వాసీ దనుపర్ణో మహాద్యుతిః ।
తస్య కల్మాషపాదో వై నామ్నా మిత్ర సహస్తథా ॥
కల్మాషపాదస్య సుతస్సర్వకర్మేతి విశ్రుతః ।
అనరణ్యస్తు పుత్రో౾భూద్విశ్రుత స్సర్వకర్మణః ॥
అనరణ్యసుతో రాజా విద్వాన్ముండి ద్రుహో౾ భవత్ ।
నిషధస్తస్య తనయో రతిః ఖట్వాంగ ఇత్యపి ॥
యేన స్వర్గాదిహాగత్య ముహూర్తం ప్రాప్య జీవితమ్ ।
త్రయో౾పి సంచితా లోకా బుద్ధ్యా సత్యేన చానఘ ॥
దీర్ఘ బాహుస్సుతస్తస్య రఘుస్తస్మా భవత్సుతః ।
అజస్తస్య తు పుత్రో౾ భూత్తస్మాద్దశరథో౾ భవత్ ॥
రామో దశరథాజ్జజ్ఞే ధర్మాత్మా యో మహాయశాః ।
స విష్ణ్వంశో మహాశైవః పౌలస్త్యో యేన ఘాతితః ॥
తచ్చరిత్రం చ బహుధా పురాణేషు ప్రవర్ణితమ్ ।
రామాయణే ప్రసిద్ధం హి నాతః ప్రోక్తం తు విస్తరాత్ ॥
రామస్య తనయో జజ్ఞే కుశ ఇత్యపి విశ్రుతః ।
అతిథిస్తు కుశాజ్జజ్ఞే నిషధస్తస్య చాత్మజః ॥
నిషధస్య నలః పుత్రో నభః పుత్రో నలస్య తు ।
నభసః పుండరీకశ్చ క్షేమధన్వా తతస్స్మృతః ॥
క్షేమధన్వసుతస్త్వా సీద్దేవానీకః ప్రతాపవాన్ ।
ఆసీదహీనగుర్నామ దేవానీకాత్మజః ప్రభుః ॥

ఋతుపర్ణునకు గొప్ప తేజశ్శాలియగు అనుపర్ణుడు పుత్రుడు. ఆయనకు మిత్రరసహుడనే పుత్రుడు గలడు. మిత్ర సహునకు కల్మషపాదుడనే పేరు కూడ గలదు (12). కల్మషపాదునకు సర్వకర్ముడని ప్రఖ్యాతి గాంచిన కుమారుడుండెను. సర్వకర్మునకు ప్రసిద్ధిని పొందిన అనరణ్యుడనే కుమారుడు ఉండెను (13). అనరణ్యునకు విద్వాంసుడగు ముండి ద్రుహమహారాజు పుత్రుడు. ఆయనకు నిషధుడు, రతి, ఖట్వాంగుడు అనే పుత్రులు గలరు (14). ఓ పుణ్యాత్మా! ఆ ఖట్వాంగుడు స్వర్గములోనుండగా తన ఒక ముహూర్తకాలము మాత్రమే ఆయుర్దాయము ఉన్నదని తెలుసుకొని భూలోకమునకు వచ్చి వివేకియై సత్య జ్ఞానముతో సర్వాత్మభావమును పొందెను (15). ఆయనకు దీర్ఘబాహుడనే కుమారుడు ఉండెను. ఆయన పుత్రుడు రఘువు. రఘువు పుత్రుడు అజుడు. అజుని పుత్రుడు దశరథుడు (16). ధర్మాత్ముడు, గొప్ప కీర్తి గలవాడు అగు రాముడు దశరథుని పుత్రుడు. విష్ణువు యొక్క అంశవలన జన్మించిన, గొప్ప శివభక్తుడగు ఆ రాముడు పులస్త్యుని కుమారుడగు రావణుని సంహరించేను (17). రాముని గాథ పురాణములలో మరియు రామాయణములో విస్తారముగా వర్ణించబడియున్నది. అందువలననే, విస్తారభయముచే ఇక్కడ చెప్పబడుట లేదు (18). రామునకు కుశుడని ప్రఖ్యాతిని గాంచిన పుత్రుడు ఉండెను. కుశుని పుత్రుడు అతిథి. ఆయన పుత్రుడు నిషధుడు (19). నిషధుని పుత్రుడు నలుడు. నలుని పుత్రుడు నభసుడు. నభసుని పుత్రుడు పుండరీకుడు. పుండరీకుని పుత్రుడు క్షేమధన్వుడు (20). క్షేమధన్వునకు ప్రతాపశాలియగు దేవానీకుడనే పుత్రుడు ఉండెను. దేవానీకుని పుత్రుడు అహీనగు మహారాజు (21).

అహీన గోస్తు దాయాదస్సహస్వాన్నామ వీర్యవాన్ ।
వీరసేనాత్మజస్తస్య యశ్చేక్ష్వాకు కులోద్భవః ॥
వీరసేనస్య దాయాదః పారియాత్రో బభూవ హ ।
తతో బలాఖ్యస్తనయ సల స్తస్మాదభూత్సుతః ॥
అర్కాంశ సంభవస్తస్మాత్పుత్రో యక్షః ప్రతాపవాన్ ।
తత్సుతస్త్వగుణస్యాసీత్తస్మాద్వి ధృతిరాత్మజః ॥
హిరణ్యనాభస్తత్పుత్రో యోగాచార్యో బభూవ హ ।
స శిష్యా జైమిని మునే ర్ధ్యాత్మ విద్యా విశారదః ॥
కౌశల్యో యాజ్ఞవల్క్యోథ యోగమధ్యాత్మ సంజ్ఞకమ్ ।
యతోఽ ధ్యగాన్నృప వరాద్ధృదయగ్రంథి భేదనమ్ ॥
తత్సుతో పుష్పనామా హి ధ్రువసంజ్ఞ స్తదాత్మజః ।
అగ్నివర్ణస్సుతస్తస్య శీఘ్రనామా సుతస్తతః ॥
మరున్నామా సుతస్తస్య యోగసిద్ధో బభూవ హ ।
అసావాస్తేఽ ద్యాపి ప్రభుః కలాపగ్రామ సంజ్ఞకే ॥
తద్వాసిభిశ్చ మునిభిః కలేరంతే స ఏవ హి ।
పునర్భావయితా నష్టం సూర్యవంశం విశేషతః ॥

పృథు శ్రుతశ్చ తత్పుత్ర స్సంధిస్తస్య సుతస్స్మృతః ।

అమర్షణస్సుతస్తస్య మరుత్వాం స్తత్సుతోఽ భవత్ ॥

విశ్వసాహ్వస్సుతస్తస్య తత్సుతోఽ భూత్ప్ర సేనజిత్ ।

తక్షకస్తస్య తనయస్తత్సుతో హి బృహద్బలః ॥

ఏత ఇక్ష్వాకు వంశీయా అతీతాస్సంప్ర కీర్తితాః ।

శృణుతానాగతాన్ భూపాంస్తద్వంశ్యాన్ ధర్మవిత్తమాన్ ॥

పరాక్రమవంతుడగు సహస్వంతుడు అహీనగుని పుత్రుడు. ఇక్ష్వాకు వంశములో ప్రముఖుడగు వీరసేనుడు ఆతని పుత్రుడు (22). వీరసేనుని పుత్రుడు పారియాత్రుడు. ఆయన పుత్రుడు బలుడు. ఆయన పుత్రుడు స్థలుడు (23}. ఆయనకు సూర్యుని అంశవలన ప్రతాపశాలియగు యక్షుడనే పుత్రుడు కలిగేను. ఆయన కొడుకు అగుణుడు. ఆయన పుత్రుడు వీధృతి (24). ఆయన పుత్రుడగు హిరణ్యనాభుడు యోగవిద్యలో ఆచార్యుడు. ఆత్మవిద్యలో నిష్ణాతుడగు ఆయన జైమినీ మహర్షియొక్క శిష్యుడు (25). కౌశల్య యాజ్ఞవల్క్యుడు. బుద్ధియందలి అవిద్యా గ్రంథినీ తొలగించే అధ్యాత్మయోగమును ఆ మహారాజు వద్ద అధ్యయనము చేసెను (26). ఆయన పుత్రుడు పుష్పుడు. ఆయన కొడుకు ధ్రువుడు. ఆయన కొడుకు అగ్నివర్ణుడు. ఆయన కొడుకు శీఘ్రుడు (27). ఆయన కుమారుడగు మరుత్తు యోగములో సిద్ధిని పొందెను. ఈ మహారాజు ఈ నాటికీ కలాపమనే పేరు గల గ్రామములో జీవించియున్నాడు (28). కలియుగము అంతమైన తరువాత ఆయన వినష్టమైన సూర్యవంశమును అచట నివసించే ఋషులతో గూడి నిలబెట్టి ఖ్యాతిని పొందగలడు (29). ఆయన కొడుకు పృథుశ్రుతుడు. ఆయన కొడుకు సంధి. ఆయన కొడుకు అమర్షణుడు. ఆయన కొడుకు మరుత్వంతుడు (30). ఆయన కొడుకు విశ్వసాహ్వుడు. ఆయన కొడుకు ప్రసేనజిత్తు. ఆయన కొడుకు తక్షకుడు. ఆయన కొడుకు బృహద్బలుడు (31). ఇక్ష్వాకు వంశములో గతించిన ఈ రాజులను గురించి చెప్పడమైనది. భవిష్యత్తులో రాబోయే, ధర్మవేత్తలలో శ్రేషులగు ఇక్ష్వాకు వంశపు రాజులను గురించి వినుడు (32).

బృహద్వలస్య తనయో భవితా హి బృహద్రణః ।
బృహద్రణ సుతస్త స్యోరు క్రియో హి భవిష్యతి ॥
వత్సవృద్ధస్సుతస్తస్య ప్రతివ్యోమస్సుతస్తతః ।
భానుస్తత్తనయో భావీ దివార్కో వాహినీపతిః ॥
సహదేవసుతస్తస్య మహావీరో భవిష్యతి ।
తత్సుతో బృహదశ్వో హి భానుమాంస్తత్సుతో బలీ ॥
సుతో భానుమతో భావీ ప్రతీకాశ్వశ్చ వీర్యవాన్ ।
సుప్రతీకస్సుతస్తస్య భవిష్యతి నృపోత్తమః ॥
మరుదేవసుతస్తస్య సునక్షత్రో భవిష్యతి ।
తత్సుతః పుష్కరస్తస్యాంతరిక్షస్తత్సుతో ద్విజాః ॥
సుతపాస్తత్సుతో వీరో మిత్రచిత్త స్తదాత్మజః ।
బృహద్భాజస్సుతస్తస్య బర్హినామా తదాత్మజః ॥
కృతంజయస్సుతస్తస్య తత్సుతో హి రణంజయః ।
సంజయస్తు మయస్తస్య తస్య శాక్యో హి చాత్మజః ॥
శుద్ధో దస్తనయస్తస్య లాంగలస్తు తదాత్మజః ।
తస్య ప్రసేన జిత్పుత్ర స్తత్సుత శ్శూద్రకా హ్వయః ॥
రుణకో భవితా తస్య సురథస్తత్సుత స్స్మృతః ।
సుమిత్రస్తత్సుతో భావీ వంశనిష్ఠాంత ఏవ హి ॥
సుమిత్రాంతోన్వయోఽయం వై ఇక్ష్వాకూణాం భవిష్యతి ।
రాజ్ఞాం వై చిత్ర వీర్యాణాం ధర్మిష్ఠానాం సుకర్మణామ్ ॥
సుమిత్రం ప్రాప్య రాజానం స తద్వంశశ్శుభః కలౌ ।
సంస్థాం ప్రాప్స్యతి తద్బ్రాహ్మే వర్ధిష్యతి పునః కృతే ॥
ఏతద్వైవస్వతే వంశే రాజానో భూరిదక్షిణాః ।
ఇక్ష్వాకువంశ ప్రభవాః ప్రాధాన్యేన ప్రకీర్తితాః ॥
పుణ్యేయం పరమా సృష్టిరాదిత్యస్య వివస్వతః।
శ్రాద్ధదేవస్య దేవస్య ప్రజానాం పుష్టిదస్య చ ॥
పఠన్ శృణ్వన్నిమాం సృష్టిమాదిత్యస్య చ మానవః ।
ప్రజావానేతి సాయుజ్యమిహ భుక్త్వా సుఖం పరమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం వైవస్వత వంశోద్భవరాజవర్ణనం
నామ ఏకోన చత్వారింశోఽధ్యాయః ॥

బృహద్బలునకు బృహద్రణుడు, ఆయనకు ఉరుక్రియుడు (33), ఆయనకు వత్సవృద్ధుడు, ఆయనకు ప్రతివ్యోముడు, ఆయనకు భానుడు, ఆయనకు దివాకుడనే సేనాపతి (34), ఆయనకు సహదేవుడనే మహావీరుడు, ఆయనకు బృహదశ్వుడు, ఆయనకు బలశాలియగు భానుమంతుడు (35), ఆయనకు పరాక్రమశాలియగు ప్రతీకాశ్వుడు, ఆయనకు రాజశ్రేష్ఠుడగు సుప్రతీకుడు అను పుత్రులు కలిగెదరు (36). సుప్రతీకునకు మంచి నక్షత్రములో మరుదేవుడనే పుత్రుడు కలుగును. ఓ బ్రాహ్మణులారా ! ఆయనకు పుష్కరుడు, పుష్కరునకు అంతరిక్షుడు (37), ఆయనకు సుతపసుడు, ఆయనకు వీరుడగు మిత్రచిత్తుడు, ఆయనకు బృహద్భాజుడు, ఆయనకు బర్హి (38), ఆయనకు కృతంజయుడు, ఆయనకు రణంజయుడు, ఆయనకు సంజయుడు, ఆయనకు మయుడు, ఆయనకు శాక్యుడు (39), ఆయనకు శుద్ధోదనుడు, ఆయనకు లొంగలుడు, ఆయనకు ప్రసేనజిత్తు, ఆయనకు శూద్రకుడు (40), ఆయనకు రుణకుడు, ఆయనకు సురథుడు, ఆయనకు సుమిత్రుడు అనే పుత్రులు కలిగెదరు. సుమీత్రునితో ఆ వంశము అంతమగును (41). అనేకరకముల పరాక్రమము గలవారు, ధర్మాత్ములు, మంచి పనులను చేయువారు అగు ఇక్ష్వాకు వంశపు రాజుల వంశము సుమిత్రునితో అంతమగును (42). శుభకరమగు ఆ వంశము కలియుగములో సుమిత్ర మహారాజు వరకు కొనసాగి, తరువాత పరమేశ్వరరూపమగు సమాజములో విలీనమగును. అది మరల కృతయుగములో వర్ధిల్లగలదు (43). ఈ విధముగా సూర్యుడు కులదైవముగా గల ఇక్ష్వాకు వంశములో పుట్టి గొప్ప దక్షిణలతో కూడిన యజ్ఞములను చేసిన ప్రముఖులగు రాజుల చరిత్ర వర్ణించబడినది (44). అదితి పుత్రుడు, శ్రాద్ధదేవుడని కీర్తించబడినవాడు, ప్రకాశస్వరూపుడు, ప్రాణులకు పుష్టిని ఇచ్చువాడు అగు వివస్వానుని ఈ శ్రేష్ఠమగు వంశము పవిత్రమైనది (45). ఈ ఆదిత్య వంశమును గురించి పఠించే మరియు శ్రవణము చేసే మానవుడు ఇహలోకములో సంతానమును పొంది మహా సుఖముననుభవించి ఆదిత్యుని సాయుజ్యమును పొందును (46).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు వైవస్వత వంశోద్భవరాజవర్ణనమనే ముప్పది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (39).

40 – పితృ దేవతల ప్రభావము

వ్యాస ఉవాచ ।

ఇత్యా కర్ణ్య శ్రాద్ధదేవ సూర్యాన్వయమనుత్తమమ్ ।

పర్యపృచ్ఛన్మునిశ్రేష్ఠ శ్శౌనక స్సూతమాదరాత్ ॥

వ్యాసుడిట్లు పలికెను –

ఈ విధముగా సర్వశ్రేష్ఠమగు శ్రాద్ధదేవుడగు సూర్యుని వంశమును గురించి వినిన శౌనకమహర్షి ఆదరముతో సూతుని ఇట్లు ప్రశ్నించెను (1).

శౌనక ఉవాచ ।

సూత సూత చిరం జీవ వ్యాసశిష్య నమోఽస్తు తే ।

శ్రావితా పరమా దివ్యా కథా పరమపావనీ ॥

త్వయా ప్రోక్తః శ్రాద్ధదేవస్సూర్యస్సద్వంశ వర్ధనః ।

సంశయస్తత్ర మే జాతస్తం బ్రవీమి త్వదగ్రతః ॥

కుతో వై శ్రాద్ధదేవత్వమాదిత్యస్య వివస్వతః ।

శ్రోతుమిచ్ఛామి తత్ప్రీత్యా ఛింధి మే సంశయం త్విమమ్ ॥

శ్రాద్ధస్యాపి చ మాహాత్మ్యం తత్ఫలం చ వద ప్రభో ।

ప్రీతాశ్చ పితరో యేన శ్రేయసా యోజయంతి తమ్ ॥

ఏతచ్ఛ శ్రోతుమిచ్ఛామి పితృణాం సర్గముత్తమమ్ ।

కథయ త్వం విశేషేణ కృపాం కురు మహామతే ॥

శౌనకుడిట్లు పలికెను –

ఓ సూతా ! సూతా ! నీవు చిరకాలము జీవించుము. ఓ వ్యాసశిష్యా ! నీకు నమస్కారమగుగాక! నీవు పరమదివ్యము, పరమపావనము – అగు గాథను వినిపించితివి (2). శ్రాద్ధదేవుడగు సూర్యుడు గొప్ప వంశమును వర్ధిల్లజేసినాడనీ నీవు చెప్పియుంటివి. ఆ విషయములో నాకు సందేహము కలిగినది. దానిని నీ యెదుట చెప్పుచున్నాను (3). అదితిపుత్రుడగు వివస్వానునకు శ్రాద్ధదేవత్వము ఎట్లు కలిగినది ? నేనీ విషయమును వినగోరుచున్నాను. నీవు ప్రీతితో నా ఈ సంశయమును నిర్మూలించుము (4). ఓ ప్రభూ ! శ్రాద్ధము యొక్క మహిమను, దాని ఫలమును వివరించుము. పితృదేవతలు శ్రాద్ధముచే సంతోషించి మానవునకు శ్రేయస్సును కలుగజేసెదరు (5). ఇంతేగాక, ఉత్తమమగు పితృసృష్టిని గురించి కూడ నేను వినగోరుచున్నాను. ఓ మహా ప్రాజ్ఞా! నీవు నాయందు దయచూపి ఈ విషయమును వివరముగా చెప్పుము (6).

సూత ఉవాచ ।

వచ్మి తత్తేఽఖిలం ప్రీత్యా పితృసర్గం చ శౌనక ।
మార్కండేయేన కథితం భీష్మాయ పరిపృచ్ఛతే ॥
గీతం సనత్కుమారేణ మార్కండేయాయ ధీమతే ।
తత్తేఽహం సంప్రవక్ష్యామి సర్వకామ ఫలప్రదమ్ ॥
యుధిష్ఠిరేణ సంపృష్టో భీష్మో ధర్మభృతాం వరః ।
శరశయ్యాస్థితః ప్రోచే తచ్ఛృణుష్వ వదామి తే ॥

సూతుడిట్లు పలికెను -

ఓ శౌనకా ! భీష్ముడు ప్రశ్నించగా పితృసృష్టిని మార్కండేయుడు చెప్పెను. ఆ వివరములనన్నిటినీ నేను నీకు ప్రీతితో చెప్పెదను (7). బుద్ధిమంతుడగు మార్కండేయునకు కోరికలనన్నింటినీ ఈడేర్చే ఈ వృత్తాంతమును సనత్కుమారుడు చెప్పెను. దానిని నేను నీకు చక్కగా చెప్పగలను (8). ధర్మవేత్తలలో శ్రేష్ఠుడగు భీష్ముడు అంపశయ్యపై నుండగా ధర్మరాజు ప్రశ్నించెను. అపుడు ఆయన చెప్పిన వృత్తాంతమును నేను నీకు చెప్పెదను. వినుము (9).

యుధిష్ఠిర ఉవాచ ।

పుష్టికామేన పుంసాం వై కథం పుష్టిరవాప్యతే ।
ఏతచ్ఛ్రోతుం సమిచ్ఛామి కిం కుర్వాణో న సీదతి ॥

ధర్మరాజు ఇట్లు పలికెను -

మానవులలో పుష్టిని గోరువాడు పుష్టిని పొందే ఉపాయమేది ? మా◌ానవుడు ఏమి చేసినచో, వినాశమును పొందడు ? నేనీ విషయమును వినగోరుచున్నాను (10).

సూత ఉవాచ ।

యుధిష్ఠిరేణ సంపృష్టం ప్రశ్నం శ్రుత్వాస ధర్మవిత్ ।
భీష్మః ప్రోవాచ సుప్రీత్యా సర్వేషాం శృణ్వతాం వచః ॥

సూతుడిట్లు పలికెను -

యుధిష్ఠిరుడు వేసిన ప్రశ్నను విని ధర్మవేత్తయగు ఆ భీష్ముడు మిక్కిలి ఆనందించి అందరు వినుచుండగా, ఇట్లు పలికెను (11).

యే కుర్వంతి నరాశ్శ్రాద్ధాన్యపి ప్రీత్యా యుధిష్ఠిర ।
శ్రాద్ధైః ప్రీణాతి తత్సర్వం పితౄణాం హి ప్రసాదతః ॥
శ్రాద్ధాని చైవ కుర్వంతి ఫలకామాస్సదా నరాః ।
అభిసంధాయ పితరం పితుశ్చ పితరం తథా ॥
పితుః పితామహశ్చైవ త్రిషు పిండేషు నిత్యదా ।
పితరో ధర్మకామస్య ప్రజాకామస్య చ ప్రజామ్ ॥

పుష్టికామస్య పుష్టిం చ ప్రయచ్ఛంతి యుధిష్ఠిర ॥

భీష్ముడిట్లు పలికెను –

ఓ ధర్మరాజా ! ఏ మానవులైతే ప్రేమతో శ్రాద్ధములను చేసెదరో, వారు పితృ దేవతల అనుగ్రహము వలన శ్రాద్ధముల ప్రభావముచే సర్వులకు ప్రీతిని కలిగించేదరు (12). ఫలమును కోరు మానవులు ప్రతి సంవత్సరము తండ్రిని, తాతను, ముత్తాతను స్మరించి మూడు పిండముల నర్పించి శ్రాద్ధములను చేయుదురు. ఓ ధర్మరాజా ! పితృదేవతలు ధర్మాత్ముడగు అట్టి నరునకు సంతానమును కోరినచో సంతానమును, పుష్టిని కోరినచో పుష్టిని సర్వదా ఇచ్చుచుందురు (13–15).

యుధిష్ఠిర ఉవాచ ।

వర్తంతే పితరస్స్వర్గే కేషాంచిన్నరకే పునః ।
ప్రాణినాం నియతం చాపి కర్మజం ఫలముచ్యతే ॥
తాని శ్రాద్ధాని దత్తాని కథం గచ్ఛంతి వై పితౄన్ ।
కథం శక్తాస్త మాహర్తుం నరకస్థాః ఫలం పునః ॥
దేవా అపి పితౄన్ స్వర్గే యజంత ఇతి మే శ్రుతమ్ ।
ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం విస్తరేణ బ్రవీహి మే ॥

ధర్మరాజు ఇట్లు పలికెను –

కొందరి పితరులు స్వర్గములో నుండగా, మరికొందరి పితరులు నరకములో నుండవచ్చును. ప్రాణులు నిశ్చితముగా కర్మఫలమునను భవించెదరని చెప్పబడినది (16). మానవులు ఇచ్చే శ్రాద్ధములు పితరులకు ఎట్లు చేరును ? శ్రాద్ధఫలమును నరకములోని వారు ఎట్లు పొందగలుదురు ? (17) స్వర్గములో దేవతలు కూడ పితరులను పూజించెదరని వినియున్నాను. ఈ వివరములను నేను వినగోరుచున్నాను. నాకు చెప్పుడు (18).

భీష్మ ఉవాచ ।

అత్ర తే కీర్తయిష్యామి యథా శ్రుతమరిందమ ।
పిత్రా మమ పురా గీతం లోకాంతరగతేన వై ॥
శ్రాద్ధకాలే మమ పితుర్మయా పిండస్సముద్యతః ।
మత్పితా మమ హస్తేన భిత్త్వా భూమిమయాచత ॥
నైష కల్ప విధిర్దృష్ట ఇతి నిశ్చిత్య చాప్యహమ్ ।
కుశేష్వేవ తతః పిండం దత్తవాన విచారయన్ ॥
తతః పితా మే సంతుష్టో వాచా మధురయా తదా ।
ఉవాచ భారతశ్రేష్ఠ ప్రీయమాణో మయానఘ ॥
త్వయా దాయాదవానస్మి ధర్మజ్ఞేన విపశ్చితా ।
తారితోఽహం తు జిజ్ఞాసా కృతా మే పురుషోత్తమ ॥

ప్రమాణం యద్ధి కురుతే ధర్మాచారేణ పార్థివః ।
ప్రజాస్తదను వర్తంతే ప్రమాణాచరితం సదా ॥
శృణు త్వం భారతశ్రేష్ఠ వేదధర్మాంశ్చ శాశ్వతాన్ ।
ప్రమాణం వేదధర్మస్య పుత్ర నిర్వర్తితం త్వయా ॥
తస్మాత్తవాహం సుప్రీతః ప్రీత్యా వరమనుత్తమమ్ ।
దదామి త్వం ప్రతీక్షస్వ త్రిషు లోకేషు దుర్లభమ్ ॥
న తే ప్రభవితా మృత్యుర్యావజ్జీవితుమిచ్ఛసి ।
త్వత్తోఽభ్యనుజ్ఞాం సంప్రాప్య మృత్యుః ప్రభవితా పునః ॥
కిం వా తే ప్రార్థితం భూయో దదామి వరముత్తమమ్ ।
తద్ బ్రూహి భరతశ్రేష్ఠ యత్తే మనసి వర్తతే ॥
ఇత్యుక్తవతి తస్మింస్తు అభివాద్య కృతాంజలిః ।
అవోచం కృతకృత్యోఽహం ప్రసన్నే త్వయి మానద ।
ప్రశ్నం పృచ్ఛామి వై కంచిద్వ్యాఖ్యస్స భవతా స్వయమ్ ॥
స మామువాచ తద్ బ్రూహి యదీచ్ఛసి దదామి తే ।
ఇత్యుక్తేఽథ మయా తత్ర పృష్టః ప్రోవాచ తన్నృపః ॥

భీష్ముడు ఇట్లు పలికెను –

ఓయీ శత్రువులను సంహరించినవాడా ! ఈ విషయమును పరలోకమును పొందిన నా తండ్రిరి పూర్వము చెప్పగా నేను వినియుంటిని. నేను దానిని నీకు యథాతథముగా చెప్పెదను (19). నేను శ్రాద్దసమయములో నా తండ్రి కొరకై పిండమును సిద్దము చేసితిని. నా తండ్రి భూమిని పగులకొట్టుకొని వచ్చి చేతితో పిండమునిమ్మని కోరెను (20). కాని శ్రాద్ధకల్పమునందు పిండవిధి ఆ విధముగా చెప్పబడలేదనీ నిశ్చయించుకొని నేను వెనుకాడకుండగా పిండమును అపుడు దర్భలయందు మాత్రమే సమర్పించితిని (21), భరతవంశములో శ్రేష్టమైనవాడా! పుణ్యాత్మా ! నేను చేసిన పనికి నా తండ్రి చాల సంతోషించి, అపుడు మధురమగు వాక్కుతో నిట్లనెను (22). ఓ పురుషశ్రేష్ఠా ! ధర్మవేత్త, పండితుడు అగు నీవంటి పుత్రునిచే నేను పుత్రుడు గలవాడనైతిని. నేను నీ వలన తరింప చేయబడితిని. నేను నీ మనస్సును తెలియగోరి అట్లు చేసితిని (23). రాజు ఏ విధముగా ధర్మమునాచరించి ప్రమాణమును నెలకొల్పునో, ఆ ప్రమాణబద్ధమగు కర్మను మాత్రమే ప్రజలు సర్వదా అనుసరించేదరు (24), భరతవంశీయులలో శ్రేష్ఠమైనవాడా ! నీవు శాశ్వతములగు వేద ధర్మములను వినుము. ఓ పుత్రా ! నీవు వేదధర్మముయొక్క ప్రమాణమును నిలబెట్టితివి (25). కావున నేను నీ విషయములో మిక్కిలి ప్రీతుడనై సర్వశ్రేష్ఠమగు వరమును నీకు ఇచ్చుచున్నాను. ముల్లోకములలో పొంద శక్యము కానీ వరమును స్వీకరించుము (26). నీవు ఎంతవరకు జీవించవలెనని కోరేదవో, అంతవరకు నిన్ను మృత్యువు ఏమియూ చేయలేదు. నీ అనుమతిని పొందిన తరువాత మాత్రమే మృత్యువు నిన్ను స్పృశించగలును (27). నీవు ఇంకనూ మరియొక ఉత్తమవరమును కోరుచున్నావ్ ? కోరుకొనుము. నేను మరల ఇచ్చెదను. ఓ భరతవంశీయులలో శ్రేష్ఠమైనవాడా !

నీ మనసులోని మాటను చెప్పుము (28). ఆయన ఇట్లు పలుకగా, నేను చేతులు జోడించి ప్రణమిల్లి ఇట్లు పలికితిని. మర్యాదను నిలబెట్టు ఓ తండ్రీ ! నీవు ప్రసన్నుడవైనచో, నేను కృతార్థుడనైతిని. నేను ఒక ప్రశ్నను వేసెదను. నీవు దానికి స్వయముగా సమాధానమును చెప్పుము (29). అపుడాయన నాతో ఇట్లనెను : "నీవు దేనిని కోరినా, నేను దానిని నీకు ఇచ్చెదను. చెప్పుము". అపుడు నేను ఆ రాజును ప్రశ్నించగా, ఆయన ఇట్లు చెప్పెను (30).

శంతనురువాచ ।

శృణు తాత ప్రవక్ష్యామి ప్రశ్నం తేఽహం యథార్థతః ।
పితృకల్పం చ నిఖిలం మార్కండేయేన మే శ్రుతమ్ ॥
యత్త్వం పృచ్ఛసి మాం తాత తదేవాహం మహామునిమ్ ।
మార్కండేయమపృచ్ఛం హి స మాం ప్రోవాచ ధర్మవిత్ ॥

శంతనుడిట్లు పలికెను –

ఓ పుత్రా ! వినుము. నీ ప్రశ్నకు యథార్థమగు సమాధానమును చెప్పెదను. నేను మార్కండేయుడు చెప్పగా పితృకల్పమునంతనూ వినియుంటిని (31). ఓ కుమారా ! నీవు నన్ను వేసిన ప్రశ్ననే నేను మార్కండేయమహర్షికి వేసితిని. ఆ ధర్మజ్ఞుడు నాకు ఇట్లు చెప్పెను (32).

మార్కండేయ ఉవాచ ।

శృణు రాజన్మయా దృష్టం కదాచిత్పశ్యతా దివమ్ ।
విమానం మహదాయాంత మంతరేణ గిరేస్తదా ॥
తస్మిన్ విమానే పర్యక్షం జ్వలితాంగారవర్చసమ్ ।
మహాతేజః ప్రజ్వలంతం నిర్విశేషం మనోహరమ్ ॥
అపశ్యం చైవ తత్రాహం శయానం దీప్తతేజసమ్ ।
అంగుష్ఠమాత్రం పురుషమగ్నావగ్ని మివాహితమ్ ॥
సోఽహం తస్మై నమః కృత్వా ప్రణమ్య శిరసా ప్రభుమ్ ।
అపృచ్ఛం చైవ తమహం విద్యామస్త్వాం కథం విభో ॥
మాముఁవాచ స ధర్మాత్మా తే న తద్విద్యతే తపః ।
యేన త్వం బుధ్యసే మాం హి మునే వై బ్రహ్మణస్సుతమ్ ॥
సనత్కుమారమితి మాం విద్ధి కిం కరవాణి తే ।
యే త్వన్యే బ్రహ్మణః పుత్రాః కనీయాంసస్తు తే మమ ॥
భ్రాతరస్సప్త దుర్ధర్షా యేషాం వంశాః ప్రతిష్ఠితాః ।
వయం తు యతిధర్మాణసంయమ్యాత్మాన మాత్మని ॥
యథోత్పన్న స్తథైవాహం కుమార ఇతి విశ్రుతః ।
తస్మాత్సనత్కుమారం మే నామైతత్కథితం మునే ॥
యద్భక్త్యా తే తపశ్చీర్ణం మమ దర్శనకాంక్షయా ।
ఏష దృష్టోఽస్మి భద్రం తే కం కామం కరవాణి తే ॥

ఇత్యుక్తవంతం తం చాహం ప్రావోచం త్వం శృణు ప్రభో ।

పితౄణామాదిసర్గం చ కథయస్వ యథాతథమ్ ॥

ఇత్యుక్తస్స తు మాం ప్రాహ శృణు సర్వం యథాతథమ్ ।

వచ్మి తే తత్త్వతస్తాత పితృసర్గం శుభావహమ్ ॥

మార్కండేయుడు ఇట్లు పలికెను -

ఓ రాజా ! వినుము. ఒకనాడు నేను అంతరిక్షమును పరికించుచుండగా, పర్వ్ఁతత సమీపమునుండి వచ్చుచున్న పెద్ద విమానము కనబడినది (33). ఆ విమానములో ప్రజ్వరిల్లే అగ్నిని బోలిన మహాతేజస్సును గాంచితిని. మనోహరమగు ఆ తేజస్సును మించినది మరియొకటి ఉండబోదు (34). దానిలో అగ్నియందు ఉంచబడిన అగ్నివలే గొప్పగా ప్రకాశించే, బొటనవేలు పరిమాణము గల ఒక పురుషుని చూచితిని. ఆయన దానిలో విశ్రమించుచుండెను (35). నేనా ప్రభునకు తలవంచి నమస్కరించి, 'ఓ మహాత్మా ! మీ పరిచయమేమి ?' అని ప్రశ్నించితిని (36). ఆ ధర్మాత్ముడు నాతో నిట్లనెను. ఓ మునీ ! నన్ను తెలుసుకో గలిగే తపస్సు నీ వద్ద లేదు. నేను బ్రహ్మపుత్రుడను (37). నేను సనత్కుమారుడనని తెలుసుకో. నీకు నేను ఏమి చేయవలెను ? బ్రహ్మయొక్క ఇతరపుత్రులు నాకంటే చిన్నవారు (38). మహాతేజశ్శాలురగు నా ఏడ్గురు సోదరులు తమ వంశములను స్థాపించిరి. యతిధర్మమునననుసరించే మేము మనస్సును ఆత్మయందు నిగ్రహించి ఉండెదము (39). పుట్టినప్పుడు ఎట్లు ఉంటినో, ఇప్పటికీ అదే విధముగా నున్న నేను కుమారుడనని ప్రసిద్ధిని గాంచితిని. ఓ మునీ ! కావుననే, నాకు సనత్కుమారుడను పేరు కలిగినది (40). నీవు నన్ను చూడగోరి, భక్తితో తపస్సును చేసితివి. కావుననే, ఇదిగో ! నీకు కనబడితిని. నీకు ఏ కోరిక గలదో చెప్పుము. నేను తీర్చెదను (41). ఆయన ఇట్లు పలుకగా, నేనాయనతో "ఓ ప్రభూ ! నీవు వినుము. పితృదేవతల ఆదిమసృష్టినీ ఉన్నది ఉన్నట్లుగా చెప్పుము" అని పలికితిని (42). నేనట్లు పలుకగా, ఆయన నాతో ఇట్లనెను. ఓ వత్సా ! వినుము. శుభకరమగు పితృసృష్టిని గురించి పూర్తిగా యథాతథముగా నీకు చెప్పెదను. దాని తత్త్వమును నీకు వివరించెదను (43).

సనత్కుమార ఉవాచ ।

దేవాన్ పురాసృజద్బ్రహ్మా మాం యక్షధ్వం స చాహ తాన్ ।

తముత్సృజ్య తమాత్మానమయజంస్తే ఫలార్థినః ॥

తే శప్తా బ్రహ్మణా మూఢా నష్ట సంజ్ఞా భవిష్యథ ।

తస్మాత్కించిదజానంతో నష్టసంజ్ఞాః పితామహమ్ ॥

ప్రోచుస్తం ప్రణతాస్సర్వే కురుష్వానుగ్రహం హి నః।

ఇత్యుక్తస్తానువాచేదం ప్రాయశ్చిత్తార్థమేవ హి ॥

పుత్రాన్ స్వాన్ పరిపృచ్ఛధ్వం తతో జ్ఞానమవాప్స్యథ ।

ఇత్యుక్తా నష్టసంజ్ఞాస్తే పుత్రాన్ పప్రచ్ఛురోజసా ॥

ప్రాయశ్చిత్తార్థ మేవాథిలబ్ధ సంజ్ఞా దివౌకసః ।

గమ్యతాం పుత్రకా ఏవం పుత్రైరుక్తాశ్చ తేఽనఘ ॥

అభిశప్తాస్తు తే దేవాః పుత్రకామేన వేధసమ్ ।

పప్రచ్ఛురుక్తాః పుత్రైస్తే గతాస్తే పుత్రకా ఇతి ॥

తతస్తా నబ్రవీద్దేవో దేవాన్ బ్రహ్మా ససంశయాన్ ।

శృణుధ్వం నిర్జరాస్సర్వే యూయం న బ్రహ్మవాదినః ॥

తస్మాద్యదుక్తం యుష్మాకం పుత్రైస్తైః జ్ఞానిసత్తమైః ।

మంతవ్యం సంశయం త్యక్త్వా తథా న చ తదన్యథా ॥

దేవాశ్చ పితరశ్చైవ యజధ్వం త్రి దివౌకసః ।

పరస్పరం మహా ప్రీత్యా సర్వకామఫలప్రదా ॥

తతస్తే ఛిన్న సందేహాః ప్రీతిమంతః పరస్పరమ్ ।

బభూవుర్మునిశార్దూల బ్రహ్మవాక్యాత్సుఖ ప్రదాః ॥

తతో దేవా హి ప్రోచుస్తాన్ యదుక్తాః పుత్రకా వయమ్ ।

తస్మాద్భవంతః పితరో భవిష్యథ న సంశయః ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

పూర్వము బ్రహ్మ దేవతలను సృష్టించి , 'నన్ను పూజించుడు' అని వారితో చెప్పెను. కాని వారు ఫలములను గోరి, బ్రహ్మను విడిచిపెట్టి తమను తాము ఆరాధించుకొనిరి (44). అపుడు బ్రహ్మ వారిని, 'బుద్ధిని గోల్పోయి మూర్ఖులు కండు' అని శపించెను. ఆ శాపమువలన బుద్ధిని గోల్పోయి దేనినైననూ తెలియజాలని ఆ దేవతలు అందరు బ్రహ్మకు ప్రణమిల్లి ఆయనతో, 'మమ్ములను అనుగ్రహించుము' అని ప్రార్థించిరి. వారు అటు పలుకగా, అపుడు బ్రహ్మ వారితో, 'మీరు మీ పుత్రులను అడిగి జ్ఞానమును పొందుడు' అని ప్రాయశ్చిత్తమునుపదేశించెను. బ్రహ్మ అట్లు చెప్పినవెంటనే, బుద్ధిని గోల్పోయి ఉన్న ఆ దేవతలు ధైర్యముతో పుత్రులను ప్రాయశ్చిత్తము కొరకు ప్రశ్నించిరి. ఓ పుణ్యాత్మా ! అపుడా దేవతలతో వారి పుత్రులు, 'ఓ పుత్రులారా ! వెల్లుడు' అని పలికిరి. అపుడా దేవతలకు బుద్ధి ఏర్పడెను (45–48). శాపమును పొందియున్న ఆ దేవతలు పుత్రులచే ఆ విధముగా పలుకబడిన వారై, పుత్రులయందలి కామనతో బ్రహ్మ వద్దకు వెళ్లి, 'ఆ పుత్రులు వెళ్లిపోయినారు' అని చెప్పిరి (49). అపుడు బ్రహ్మదేవుడు సంశయమును కలిగియున్న ఆ దేవతలతో నిట్లనెను: ఓ దేవతలారా ! మీరందరు వినుడు. మీరు బ్రహ్మవాదులు కారు (50), కావున, జ్ఞానులలో శ్రేష్టులగు ఆ పుత్రులు మీకు ఏమి చెప్పిరో, దానిని సందేహములను వీడి మననము చేయుడు. వారు చెప్పిన దానికి తిరుగు లేదు (51). ఓ స్వర్గవాసులారా ! దేవతలు, పితరులు ఒకరినొకరు మహాప్రీతితో పూజించుకొనుడు. దాని వలన మీరు కోరిన ఫలములన్నియు లభించగలవు (52). ఓ మహర్షీ! అపుడు వారు బ్రహ్మయొక్క ఈ వచనము వలన తొలగిన సందేహములు గలవారై ఒకరిపై నొకరు ప్రీతిని కలిగి యుండిరి (53). అపుడు దేవతలు ఆ పుత్రులతో నిట్లనిరి. మీరు మమ్ములను 'ఓ పుత్రులారా !' అని సంబోధించినారు. కావున మీరు పితరులు అగుచున్నారు. దీనిలో సందేహము లేదు (54).

పితృశ్రాద్ధే క్రియాం కశ్చిత్కరిష్యతి న సంశయః ।

శ్రాద్ధై రాప్యాయితస్సోమో లోకానాప్యాయయిష్యతి ॥

సముద్రం పర్వతవనం జంగమాజంగమైర్వృతమ్ ।

శ్రాద్ధాని పుష్టికామైశ్చ యే కరిష్యంతి మానవాః ॥

తేభ్యః పుష్టిప్రదాశ్చైవ పితర ప్రీణితాస్సదా ।

శ్రాద్ధా యే చ ప్రదాస్యంతి త్రీన్ పిండాన్నామగోత్రతః ॥

సర్వత్ర వర్తమానాస్తే పితరం ప్రపితామహాః ।

భావయిష్యంతి సతతం శ్రాద్ధదానేన తర్పితాః ॥

ఇతి తద్వచనం సత్యం భవత్వథ దివౌకసః ।

పుత్రాశ్చ పితరశ్చైవ వయం సర్వే పరస్పరమ్ ॥

ఏవం తే పితరో దేవా ధర్మతః పుత్రతాం గతాః ।

అన్యోన్యం పితరో వై తే ప్రథితాః క్షితిమండలే ॥

ఇతి శ్రీశివమహాపురాణే ఉమాసంహితాయాం పితృప్రభావ వర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః॥

ఎవడో ఒకడు నిస్సందేహముగా పితృశ్రాద్ధములో పిండదానాది క్రియలను చేయును. ఆ శ్రాద్ధ కర్మలచే పుష్టిని పొందిన సోముడు జనులకు పుష్టిని ఈయగలడు (55). సోముడు సముద్రమును, చరాచరప్రాణులతో గూడిన పర్వతములయందలి వనములను వర్ధిల్ల జేయును. ఏ మానవులైతే పుష్టిని గోరి శ్రాద్ధములను చేయుదురో, వారికి ప్రీతిని పొందిన పితరులు సర్వకాలములలో పుష్టిని ఈయగలరు. ఎవరైతే పేర్లను, గోత్రములను చెప్పి మూడు పిండములను శ్రాద్ధమునందు సమర్పించెదరో, వారి తండ్రులు, పితామహులు, ప్రపితామహులు అట్టి శ్రాద్ధ పిండదానముచే తృప్తిని పొందినవారై సర్వకాలములలో వారిని వెన్నంటియుండి వారికి అభివృద్ధిని కలుగ జేయుదురు (56-58). ఈ దేవతల వచనము సత్యము అగు గాక ! దేవతలు పుత్రులు కాగా, పితరులు వారి తండ్రులైరి. ఈ విధముగా దేవతలు, పితృదేవతలు అగు మనమందరము పరస్పరప్రేమను కలిగియున్నాము. ఈ విధముగా ఆ పితరుల యెదుట దేవతలు ధర్మబద్ధముగా పుత్రులైరి. పితృదేవతలు తండ్రులు అయిరి. వారు పరస్పరము ఆరాధించుకొనగా, పితృదేవతల ఆరాధన భూమండలములో ప్రఖ్యాతిని గాంచినది (59,60).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు పితృదేవతల ప్రభావమును వర్ణించే నలుబదియవ అధ్యాయము ముగిసినది (40).

41- ఏడ్గురు కిరాతుల గాథ

సనత్కుమార ఉవాచ ।

సప్త తే తపతాం శ్రేష్ఠ స్వర్గే పితృగణాస్స్మృతాః ।
చత్వారో మూర్తిమంతో వై త్రయశ్చైవ హ్యమూర్తయః ॥
తాన్ యజంతే దేవగణా ఆద్యా విప్రాదయస్తథా ।
ఆప్యాయయంతి తే సర్వే సోమం యోగబలేన వై ॥
తస్మాచ్ఛ్రాద్ధాని దేయాని యోగినాం తు విశేషతః।
సర్వేషాం రాజతం పాత్రమథ వా రజతాన్వితమ్ ॥
దత్తం స్వధాం పురోధాయ శ్రాద్ధే ప్రీణాతి వై పితౄన్ ।
వహ్నేరాప్యాయనం కృత్వా సోమస్య తు యమస్య వై ॥
ఉదగాయనమప్య గ్నా వగ్న్య భావేఽప్సు వా పునః ।
పితౄన్ ప్రీణాతి యో భక్త్యా పితరః ప్రీణయంతి తమ్ ॥
యచ్ఛంతి పితరః పుష్టిం ప్రజాశ్చ విపులాస్తథా ।
స్వర్గమారోగ్య వృద్ధిం చ యదన్యదపి చేప్సితమ్ ॥
దేవకార్యాదపి మునే పితృకార్యం విశిష్యతే ।
పితృభక్తోఽసి విప్రర్షే తేన త్వ మజరామరః ॥
న యోగేన గతిస్సా తు పితృభక్తస్య యా మునే ।
పితృభక్తిర్విశేషేణ తస్మాత్కార్యా మహామునే ॥

సనత్కుమారుడు ఇట్లు పలికెను –

ఓ తపశ్శాలులలో శ్రేష్ఠమైనవాడా ! స్వర్గములో ఏడు పితృగణములు గలవనియు, వాటిలో నాలు గణములకు రూపము గలదనియు, కాని మూడు గణములు అరూపములనియు చెప్పబడినది (1). సృష్టికి మొదటివారైన దేవగణములు మరియు బ్రాహ్మణులు మొదలగు వారు వారిని ఆరాధించెదరు. వారందరు యోగబలముచే సోమునకు పుష్టిని కలిగించేదరు (2). కావున, మానవులు శ్రాద్ధకర్మలను చేసి పిండాదికమును యోగులగు ఆ పితరులకు సమర్పించవలెను. పితరులకు అందరికీ స్వధాపూర్వకముగా పిండములను సమర్పించి వెండి పాత్రను గాని, వెండిని కలిగియున్న పాత్రను గాని సమర్పించినచో పితృదేవతలు చాల సంతోషించెదరు. ఉత్తరాయణ కాలములో అగ్నిని వ్రేల్చి హోమములను చేసి, సోమునకు, యమునకు అగ్నిలో హవిస్సును అర్పించవలెను. అగ్ని లేనిచో జలములయందు సమర్పించవలెను. భక్తితో మానవుడు ఈ విధముగా ఆచరించినచో, పితృదేవతలు సంతసిల్లి, అట్టి మానవుని సంతోషపెట్టెదరు (3-5). అట్టి వారికి పితరులు పుష్టిని, అధిక సంతానమును, స్వర్గమును, ఆరోగ్యములో వృద్ధిని, మరియు మనస్సులోని ఇతరములగు కోరికలను కూడ ఇచ్చెదరు (6). ఓ మునీ! పితృశ్రాద్ధము దేవపూజ కంటే కూడా గొప్పది. ఓ మహర్షీ! నీవు తండ్రియందు భక్తి గలవాడవు. అందువలననే నీకు

జరామరణములు లేవు (7). ఓ మునీ ! పితృదేవతలయందు భక్తి గలవానికి లభించే గతి యోగము వలన లభించదు. ఓ మహర్షీ ! కావున, మానవులు విశేషించి పితృభక్తిని కలిగి యుండవలెను (8).

మార్కండేయ ఉవాచ ।

ఏవముక్త్వా తు దేవేశో దేవానామపి దుర్లభమ్ ।
చక్షుర్దత్త్వా సవిజ్ఞానం జగామ యౌగికీం గతిమ్ ॥
శృణు భీష్మ పురా భూయో భారద్వాజాత్మజా ద్విజాః ।
యోగధర్మమనుప్రాప్య భ్రష్టా దుశ్చరితేన వై ॥
వాగ్దుష్టః క్రోధనో హింస్రః పిశునః కవిరేవ చ ।
స్వసృషః పితృవర్తీ చ నామభిః కర్మభిస్తథా ॥
కౌశికస్య సుతాస్తాత శిష్యా గర్గస్య చా భవన్ ।
పితర్యుపరతే సర్వే ప్రవసంతస్తదా భవన్ ॥
వినియోగాద్గురోస్తస్య గాం దోగ్ధ్రీం సమకాలయన్ ।
సమానవత్సాం కపిలాం సర్వేఽన్యాయా గ్రతాస్తదా ॥
తేషాం పథి క్షుధార్తానాం బాల్యాన్మోహాచ్చ భారత ।
క్రూరా బుద్ధిస్సముత్పన్నా తాం గాం వై హింసితుం తదా ॥
తాన్ కవిస్స్వసృషశ్చైవ యాచేతే నేతి వై తదా ।
న చాశక్యాస్తు తాభ్యాం వా తదా వారయితుం నిజాః ॥
పితృవర్తీ తు యస్తేషాం నిత్యం శ్రాద్ధాహ్నికో ద్విజః ।
స సర్వానబ్రవీత్కోపాత్పిపితృభక్తి సమన్వితః ॥
యద్యశక్యం ప్రకర్తవ్యం పితౄనుద్దిశ్య సాధ్యతామ్ ।
ప్రకుర్వంతో హి శ్రాద్ధం తు సర్వ ఏవ సమాహితాః ॥
ఏవమేషా చ గౌర్ధర్మం ప్రాప్స్యతే నాత్ర సంశయః ।
పితౄనభ్యర్చ్య ధర్మేణ నాధర్మో నో భవిష్యతి ॥

మార్కండేయుడు ఇట్లు పలికెను -

దేవతలకు కూడ ప్రభువగు సనత్కుమారుడు ఈ విధముగా పలికి దేవతలకు కూడ దుర్లభమగు జ్ఞాననేత్రమును ప్రసాదించి యోగమార్గమును పొందెను (9). ఓ భీష్మా ! మరియొక వృత్తాంతమును వినుము. పూర్వము బ్రాహ్మణులగు భారద్వాజపుత్రులు యోగధర్మమును గురూపదేశముచే పొందియూ దుష్టమగు నడవడిచే భ్రష్టులైరి (10). వారికి వాగ్దుష్టుడు (చెడుగా మాటలాడువాడు), క్రోధనుడు (కోపిష్టి), హింస్రుడు (హింసించే స్వభావము కలవాడు), పిశునుడు (కొండెములను చేప్పువాడు), కవి (గ్రంథరచనాకుశలుడు), స్వసృషుడు (స్వయముగా సృష్టించువాడు), పితృవర్తి (పితరులను సేవించువాడు) అను సార్థకనామధేయములు గలవు (11). ఓ వత్సా ! కౌశికుని పుత్రులు గర్గునకు శిష్యులుగ నుండిరి. తండ్రి మరణించిన పిదప వారందరు యాత్రలకు పోయిరి

(12). వారు గురువుయొక్క ఆదేశముచే చక్కగా పాలను ఇచ్చే కపిల గోవును, దాని దూడతో సహా మేపుచుండిరి. అపుడు వారి ప్రవృత్తి న్యాయబద్ధముగా లేకుండెను (13). ఓ భారతా ! మార్గములో వారికి తీవ్రమగు ఆకలి వేసెను. చిన్న వయస్సు అగుట వలన, మరియు భ్రాంతి వలన వారు అపుడు ఆ గోవును హింసించవలెననే క్రూరమగు ఆలోచనను చేసిరి (14). అపుడు కవి మరియు స్వసృఘుడు అట్లు చేయవద్దని వారిని ప్రార్థించిరి. కాని వారిద్దరు తమ సోదరులను ఆ పనినుండీ నివారించలేకపోయిరి {15). వారిలో పితరులయందు భక్తిని కలిగియున్న పితృవర్తి అను బ్రాహ్మణుడు నిత్యము భక్తితో శ్రాద్ధమును చేసెడివాడు. అతడు కోపముతో వారినందరినీ ఉద్దేశించి ఇట్లు పలికెను (16). ఈ పనిని చేయుట తప్పని సరియైనచో, కనీసము పితృదేవతలను ఉద్దేశించి చేయుడు. మీరందరు మనస్సును లగ్నము చేసి శ్రాద్ధకర్మను అనుష్ఠించుడు (17). అట్లు చేయుట వలన ఈ గోవు నిస్సందేహముగా పుణ్యగతిని పొందగలదు. మనము ధర్మమునను సరించి పితృదేవతలను ఆరాధించినచో, మనకు పాపము చుట్టుకొనదు (18).

ఏవముక్త్వాశ్చ తే సర్వే ప్రోక్షయిత్వా చ గాం తదా ।
పితృభ్యః కల్పయిత్వా తు హ్యుపాయుంజత భారత ॥
ఉపయుజ్య చ గాం సర్వే గురోస్తస్య న్యవేదయన్ ।
శార్దూలేన హతా ధేనుర్వత్సా వై గృహ్యతామితి ॥
ఆర్తవత్స తు తం వత్సం ప్రతిజగ్రాహ వై ద్విజః ।
మిథ్యోపచారతః పాపమభూత్తేషాం చ గోఘ్నతామ్ ॥
తతః కాలేన కియతా కాలధర్మముపాగతాః ।
తే సప్త భ్రాతరస్తాత బభూవుస్స్వాయుషః క్షయే ॥
తే వై క్రూరతయా హైంస్రాత్వానార్యత్వాద్గురో స్తథా ।
ఉగ్రహింసా విహారాశ్చ జాతాస్సప్త సహోదరః ॥
లుబ్ధకస్య సుతాస్తావద్బలవంతో మనస్వినః ।
జాతా వ్యాధా దశార్ణేషు సప్త ధర్మవిచక్షణాః ॥
స్వధర్మ నిరతాస్సర్వే మృగయామోహ వివర్జితాః ।
ఆసన్నుద్వేగసంవిగ్నా రమ్యే కాలంజరే గిరౌ ॥
తమేవార్థమనుధ్యాయ జ్ఞానం మరణసంభవమ్ ।
ఆసన్ వనచరాః క్షాంతా నిర్ద్వంద్వా నిష్పరిగ్రహాః ॥
తే సర్వే శుభకర్మాణస్సద్ధర్మాణో వనేచరాః ।
విధర్మాచరణైర్హీనా జాతిస్మరణసిద్ధయః ॥
పూర్వజాతిషు యో ధర్మః శ్రుతో గురుకులేషు వై ।
తథైవ చాస్థితా బుద్ధౌ సంసారేఽప్య నివర్తనే ॥

ఓ భరతవంశీయుడా ! ఆతడు వారితో నిట్లు చెప్పగా, వారందరు అపుడు ఆ గోవును సంప్రోక్షించి పితృదేవతలకు నివేదించి వినియోగించిరి (19). వారందరు ఆ విధముగా గోవును వినియోగించి, గురువునకు గోవును పెద్దపులి భక్షించినదనియు, దూడను స్వీకరించవలసినదనియు మనవి చేసిరి (20). ఆ బ్రాహ్మణుడు చాల దుఃఖించి ఆ దూడను స్వీకరించెను. గోవును సంహరించిన వారందరికి గురుసేవలో మోసమును చేయుటవలన పాపము చుట్టుకొనెను (21). ఓ వత్సా! తరువాత కొంత కాలమునకు ఆయుర్దాయములు పూర్తి అగుటచే ఆ ఏడుగురు సోదరులు మరణించిరి (22). క్రూరులై గురువును మోసగించి ఘోరమగు హింసకు పాల్పడిన కారణముచే ఆ ఏడ్గురు సోదరులు దశార్ణ దేశములో ఒక కిరాతునకు పుత్రులై జన్మించిరి. బలశాలురు, అభిమానవంతులు, ధర్మశాస్త్రపండితులు అగు ఆ ఏడ్గురు కిరాతులు తమ కర్తవ్యములను శ్రద్ధతో ఆచరించుచున్ననూ వేటయందలి వ్యామోహమును విడిచియుండిరి. వారు సుందరమగు కాలంజర పర్వతమునందు దుఃఖముతో నిండిన మనస్సు గలవారై నివసించిరి (23-25). తాము పూర్వజన్మలో చేసిన ఆ పాపకృత్యమును మరియు తమ మరణమును మాత్రమే ధ్యానిస్తూ ఆ కిరాతులు సహనము గలవారై, సుఖదుఃఖములయందు సమచిత్తులై, ఇంద్రియ సుఖములకు దూరముగా జీవించిరి (26). శుభకర్మలను చేయుచూ పవిత్ర ధర్మమును పాటిస్తూ ఆ కిరాతులు అందరు పూర్వజన్మను స్మరించగలిగే సిద్ధిని పొంది అధర్మమునకు దూరముగా నుండిరి (27). వారు పూర్వజన్మలలో గురుకులములయందు నేర్చిన ధర్మము వారి బుద్ధులలో యథాతథముగా నిలిచియుండెను. వారికి మరల సంసారములోనికి రాకూడదనే ఇచ్ఛ గలదు (28).

గిరిమధ్యే జహుః ప్రాణాన్ లబ్ధాహారా స్తపస్వినః ।
తేషాం తు పతితానాం చ యాని స్థానాని భారత ॥
తథైవాద్యాపి దృశ్యంతే గిరౌ కాలంజరే నృప ।
కర్మణా తేన తే జాతాశ్శుభాశుభ వివర్జకాః ॥
శుభాశుభతరం యోనిం చక్రవాకత్వమాగతాః ।
శుభే దేశే శరద్వీపే సప్తైవాసన్ జలౌకసః ॥
త్యక్త్వా సహచరీధర్మం మునయో ధర్మధారిణః ।
నిస్సంగా నిర్మమాశ్శాంతా నిర్ద్వంద్వా నిష్పరిగ్రహాః ॥
నివృత్తి నిర్వృత్తాశ్చైవ శకునా నామతస్స్మృతాః ।
తే బ్రహ్మచారిణస్సర్వే శకునా ధర్మధారిణః ॥
జాతిస్మరాస్సు సంవృద్ధాస్సప్తైవ బ్రహ్మచారిణః ।
స్థితా ఏకత్ర సధర్మా వికారరహితాస్సదా ॥
విప్రయోనౌ తు యన్మోహాన్మిథ్యాపచరితం గురౌ ।
తిర్యగ్యోనౌ తథా జన్మ శ్రాద్ధాత్ జ్ఞానం చ లేభిరే ॥
తథా తు పితృకార్యార్థం కృతం శ్రాద్ధం వ్యవస్థితైః ।
తదా జ్ఞానం చ జాతిం చ క్రమాత్ప్రాప్తం గుణోత్తరమ్ ॥

పూర్వజాదిషు యద్దృష్టం శ్రుతం గురుకులేషు వై ।

తథైవ సంస్థితజ్ఞానం తస్మాత్ జ్ఞానం సమభ్య సేత్ ॥

సుమనాశ్చ సువాక్ శుద్ధః పఞ్చమశ్ఛిద్రదర్శకః ।

స్వతంత్రశ్చ సుయజ్ఞశ్చ కులీనా నామతస్స్మృతాః ॥

తేషాం తత్ర విహంగానాం చరతాం ధర్మచారిణామ్ ।

సువృత్తమ భవత్తత్ర తచ్ఛృణుష్వ మహామునే ॥

వారు లభించిన ఆహారమును స్వీకరిస్తూ తపస్సును చేసి ఆ పర్వతమధ్యమునందు ప్రాణములను విడిచిరి. ఓ భరతవంశీయుడా ! మహారాజా ! వారు కాలంజరపర్వతముపై ప్రాణములను విడిచిన స్థానములు ఈ నాటికీ అటులనే కొనవచ్చును. వారు ఆ జన్మలో శుభాశుభములను విడిచియున్నారు గనుక, దాని ప్రభావముచే శుభము మరియు అశుభము కాని జన్మను పొందిరి. శరద్వీపమనే పవిత్ర స్థానమునందు వారు ఏడ్గురు చక్రవాకములై జన్మించి నీటిలో నివసించిరి (29-31). వారు ఆడ పక్షులకు దూరముగా ధర్మనిష్ఠులగు మునులై, సంసారసంగమును మరియు మమకారమును విడిచిపెట్టి, ఇంద్రియభోగములకు దూరముగా, స్థిరచిత్తులై, సుఖదుఃఖములకు అతీతముగా జీవించిరి. మోక్షకాములగు ఆ ఏడ్గురు పేరుకు మాత్రమే పక్షులు, ధర్మవర్తనముగల ఆ పక్షులు అన్నీ బ్రహ్మచర్యమును పాటించెను (32,33). ఆ ఏడ్గురు బ్రహ్మచారులు పూర్వజన్మజ్ఞానము కలిగి పెద్ద వయస్సును పొందినవారై ఒకే స్థానములో నుండి సర్వకాలములలో వికారములకు దూరముగా నుండి మోక్షధర్మమును పాటించిరి (34). వారు బ్రాహ్మణ జన్మను పొంది మోహముచే గురువు విషయములో అపరాధమును చేయుటచే పక్షిజన్మను పొందిరి. కానీ శ్రాద్ధ ప్రభావముచే జ్ఞానమును కూడ పొందిరి (35). వారు శ్రాద్ధమును యథావిధిగా చేసి పితృకార్యమును నిర్వర్తించి యుండుటచే పూర్వజన్మ జ్ఞానమును కలిగియుండుటయే గాక, క్రమముగా గుణములచే శ్రేష్ఠమగు జన్మను పొందిరి (36). పూర్వజన్మలలో వారు గురుకులములలో వినియున్న బ్రహ్మజ్ఞానము వారికి యథాతథముగా తెలియుచుండెను. కావున, మానవుడు జ్ఞానమును అభ్యసించవలెను (37). సత్కులమునందు పుట్టిన ఆ పక్షులకు సుమనస్కుడు, సువాక్, శుద్ధుడు, పఞ్చముడు, ఛిద్రదర్శకుడు, స్వతంత్రుడు, సుయజ్ఞుడు అను పేర్లు ఉండెను (38). ఓ మహర్షీ! ఆ పక్షులు ధర్మబద్ధముగా అచట జీవించుచుండగా ఒక చక్కని వృత్తాంతము ఘటిల్లినది. దానిని వినుము (39).

నీపానామీశ్వరో రాజా ప్రభావేణ సమన్వితః ।

శ్రీమానంతః పురవృతో వనం తత్రావివేశ హ ॥

స్వతంత్రశ్చక్రవాకస్స స్పృహయామాస తం నృపమ్ ।

దృష్ట్వాయాంతం సుఖోపేతం రాజ్యశోభా సమన్వితమ్ ॥

యద్యస్తి సుకృతం కించిత్తపో వా నియమోఽపి వా ।

ఖిన్నోఽహముపవాసేన తపసా నిశ్చలేన చ ॥

తస్య సర్వస్య పూర్ణేన ఫలేనాపి కృతేన హి ।

సర్వసౌభాగ్య పాత్రశ్చ భవేయమహమీదృశః ॥

తతస్తు చక్రవాకౌ ద్వాసతుస్సహచారిణౌ ।

ఆవాం వై సచివౌ స్యావ తవ ప్రియహి తైషిణౌ ॥

తథేత్యుక్త్వా తు తస్యాసీత్తదా యోగాత్మనో గతిః ।

ఏవం తౌ చక్రవాకౌ చ స్వవాక్యం ప్రత్య భాషతామ్ ॥

యస్మాత్కర్మ బ్రువాణ స్త్వం యోగధర్మమవాప్య తమ్ ।

ఏవం వరం ప్రార్థయసే తస్మాద్వాక్యం నిబోధ మే ॥

రాజా త్వం భవితా తాత కాంపిల్యే నగరోత్తమే ।

ఏతౌ తే సచివౌ స్యాతాం వ్యభిచార ప్రధర్షితౌ ॥

న తానూచుస్త్రయో రాజ్యం చతురస్సహచారిణః ।

స ప్రసాదం పునశ్చక్రే తన్మధ్యే సుమనా బ్రవీత్ ॥

అంతర్యో భవితా శాపః పున ర్యోగమవాప్స్యథ ।

సర్వసత్త్వస్సుయజ్ఞశ్చ స్వతంత్రోఽయం భవిష్యతి ॥

పితృప్రసాదాద్యుష్మాభి స్సంప్రాప్తం సుకృతం భవేత్ ।

గాం ప్రోక్షయిత్వా ధర్మేణ పితృభ్యశ్చోప కల్పితాః ॥

అస్మాకం జ్ఞానసంయోగ స్సర్వేషాం యోగసాధనమ్ ।

ఇదం చ కార్యం సంరబ్ధం శ్లోకమేక ముదాహృతమ్ ॥

పురుషాంతరితం శ్రుత్వా తతో యోగమవాప్స్యథ ।

ఇత్యుక్త్వా స తు మౌనోఽ భూద్విహంగస్సుమనో బుధః ॥

లోకానాం స్వస్తయే తాత శంతను ప్రవరాత్మజ ।

ఇత్యుక్తం తచ్చరిత్రం మే కిం భూయశ్ర్శో తు మిచ్ఛసి ॥

ఇతి శ్రీశివమహాపురాణే ఉమాసంహితాయాం సప్తవ్యాధగతివర్ణనం నామ
ఏకచత్వారింశోఽధ్యాయః॥

ప్రభావశాలి, శ్రీమంతుడు అగు నీపదేశమహారాజు అంతఃపురముతో గూడి ఆ అడవిలోనికి వచ్చెను (40). రాజ్యశోభతో గూడి ఆనందముగా వచ్చుచున్న ఆ రాజును చూచి స్వతంత్రుడనే చక్రవాకము ఇట్లు కోరుకొనేను (41). నేను చేసిన పుణ్యము మిగిలియున్నదా! నేను ఏదేని తపస్సును చేసియుంటినా ! నియమమును పాటించి యుంటినా ! నేను ఉపవాసములచే మరియు స్థిరమగు తపస్సుచే అలసి యుంటిని (42). వాటన్నింటియొక్క పూర్ణఫలముచే నేను ఈ రాజువలె పూర్ణసౌ భాగ్యమునకు అర్హుడను అగుదును గాక ! (43) అప్పుడు దానికి తోడుగా నున్న రెండు చక్రవాకములు ఇట్లు పలికినవి: మేము ఇద్దరము నీకు మంత్రులమై నీకు ప్రియమును, హితమును చేకూర్చెదము గాక ! (44) యోగముచే శుద్ధిని పొందియున్న ఆ చక్రవాకము 'అటులనే యగుగాక!' అని పలికెను. దానికి సద్గతి లభించేను. అపుడు ఆ రెండు చక్రవాకములు ఈ విధముగా ప్రత్యుత్తరమునిచ్చినవి (45). స్వకర్మల నాచరించి యోగధర్మమును పొందిన నీవు ఈ విధమగు వరమును కోరుచున్నావు. కావున నా మాటను తెలుసుకొనుము (46). ఓ వత్సా ! నీవు కాంపిల్యమనే గొప్ప నగరములో రాజువు కాగలవు. వీరిద్దరు నీకు మంత్రులై నిశ్చలమగు జీవితమును గడిపెదరు (47). ఆ ముగ్గురు మిగిలిన నల్గురు సహచరులకు ఆ విషయమును చెప్పలేదు. వారిపై ఈశ్వరుడు అనుగ్రహమును మరల చూపెను (?). వారి మధ్యలో సుమనస్కుడు ఇట్లు పలికెను (48). మీ శాపమునకు అంతము రానున్నది. మీరు మరల యోగులు కాగలరు. సర్వసమర్థుడగు ఈ సుయజ్ఞుడు, మరియు స్వతంత్రుడు కూడ యోగులు కాగలరు (49). మీరు పితృదేవతల అనుగ్రహముచే పుణ్యఫలమును పొందెదరు. మీరు గోవును సంప్రోక్షణ చేసి ధర్మబద్ధముగా పితృదేవతలకు సమర్పించినారు (50). మనలకు అందరికీ జ్ఞానము లభించి యోగము సిద్ధించును. ఈ కార్యము చాల గంభీరమైనది. ఈ విషయమును బోధించే ఒక శ్లోకము గలదు (51). మీరు మనుష్య జన్మను పొంది శ్రవణము చేసి తరువాత సిద్ధిని పొందగలరు. ఇట్లు పలికి వివేకియగు సుమనస్కుడనే ఆ పక్షి మిన్నకుండెను (52). ఓ వత్సా ! శంతను పుత్రా ! శ్రేష్ఠపురుషా ! వారి చరిత్రమును మానవులకు మంగళమును కలిగించుట కొరకై చెప్పియుంటిని. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు ? (53)

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ఏడ్గురు కిరాతుల గాథను వర్ణించే నలుబది ఒకటవ అధ్యాయము ముగిసినది (41).

42 - చక్రవాక పక్షులు ఉత్తమగతిని పొందుట

భీష్మ ఉవాచ ।

మార్కండేయ మహాప్రాజ్ఞ పితృభక్తిభృతాం వర ।
కిం జాతం తు తతో బ్రూహి కృపయా మునిసత్తమ ॥

భీష్ముడు ఇట్లు పలికెను -

ఓ మార్కండేయా ! నీవు మహా ప్రజ్ఞాశాలివి. నీవు పితృభక్తి పరాయణులలో శ్రేష్టుడవు. ఓ మహర్షీ ! తరువాత ఏమి జరిగినది ? దయచేసి చెప్పుము (1).

మార్కండేయ ఉవాచ ।

తే ధర్మయోగనిరతాస్సప్త మానసచారిణః ।
వాయ్వంబుభక్షాస్సతతం శరీరముపశోషయన్ ॥
స రాజాంతః పురవృతో నందనే మఘవా ఇవ ।
క్రీడిత్వా సుచిరం తత్ర సభార్యస్స్వపురం యయౌ ॥
అనూహో నామ తస్యాసీత్పుత్రః పరమధార్మికః ।
తం వైభ్రాజస్సుతం రాజ్యే స్థాపయిత్వా వనం యయౌ ॥
తపః కర్తుం సమారేభే యత్ర తే సహచారిణః ।
స వై తత్ర నిరాహారో వాయుభక్షో మహాతపాః ॥
తతో విభ్రాజితం తేన విభ్రాజం నామ తద్వనమ్ ।
బభూవ సుప్రసిద్ధం హి యోగసిద్ధి ప్రదాయకమ్ ॥
తత్రైవ తే హి శకునశ్చత్వారో యోగధర్మిణః ।
యోగభ్రష్టా స్త్రయశ్చైవ దేహత్యాగకృతోఽ భవన్ ॥
కాంపిల్యే నగరే తే తు బ్రహ్మదత్త పురోగమాః ।
జాతాస్సప్త మహాత్మానస్సర్వే విగతకల్మషాః ॥
స్మృతిమంతోఽత్ర చత్వారస్త్రయస్తు పరిమోహితాః ।
స్వతంత్రస్యాహ్వయో జాతో బ్రహ్మదత్తో మహౌజసః ॥
ఛిద్రదర్శీ సునేత్రస్తు వేదవేదాంగ పారగౌ।
జాతౌ శ్రోత్రియదాయాదౌ పూర్వజాతి సహోషితౌ ॥
పంచాలో బహ్వృచ స్యాసీదాచార్యత్వం చకార హ ।
ద్వివేదః పుండరీకశ్చ ఛందోగోఽ ధ్వర్యు రేవ చ ॥
తతో రాజా సుతం దృష్ట్వా బ్రహ్మదత్తమ కల్మషమ్ ।
అభిషిచ్య స్వరాజ్యే తు పరం గతిమవాప్తవాన్ ॥

మార్కండేయుడు ఇట్లు పలికెను –

యోగధర్మమునందు నిమగ్నులై మానససరోవరములో సంచరించే ఆ ఏడు చక్రవాకములు వాయువును, నీటిని మాత్రమే ఆహారముగా తీసుకుంటూ సర్వకాలములలో శరీరమును శుష్కింపజేసినవి (2) అంతఃపుర పరివారముతో గూడి వచ్చిన ఆ రాజు నందనవనములో ఇంద్రునివలే ఆ అడవిలో చాల కాలము రమించి భార్యతో గూడి తన నగరమునకు వెళ్లెను (3). ఆవైభ్రాజ మహారాజునకు పరమధర్మాత్ముడగు అనూహుడనే పుత్రుడు ఉండెను. ఆయన పుత్రుని రాజుగా అభిషేకించి అడవికి వెళ్లెను (4). ఆ ఏడు పక్షులు కలిసి జీవించుచున్న స్థానములో ఆ మహారాజు ఆహారమును విడిచిపెట్టి గాలిని మాత్రమే ఆహారముగా తీసుకుంటూ గొప్ప తపస్సును చేయుటనారంభించెను (5). విభ్రాజమనే ఆ అడవి ఆ మహారాజుచే ప్రకాశింప చేయబడెను. ఆ అడవి యోగసిద్ధులనిచ్చునని పెద్ద ప్రసిద్ధి కలిగెను (6). యోగధర్మమునందు నిష్ఠ గల నాలు పక్షులు మరియు యోగమునుండి జారిపోయిన మూడు పక్షులు అచటనే ప్రాణములను విడిచెను (7). తొలగిన మాలిన్యము గల ఆ ఏడు పక్షులు కొంపిల్యనగరములో బ్రహ్మదత్తుడు మొదలగు పేర్లు గల ఏడు మహాతు.్మలుగా జన్మించినవి (8). వారిలో నలుగురికి పూర్వజన్మజ్ఞానము ఉండగా, ముగ్గురు పూర్తిగా విస్మరించిరి. స్వతంత్రుడను పేరు గల పక్షి గొప్ప తేజశ్శాలియగు బ్రహ్మదత్తుడై జన్మించెను (9). ఛిద్రదర్శీ, సునేత్రుడు అనే పక్షులు శ్రోత్రియుని కుమారులై జన్మించి వేదవేదాంగములలో నిష్ణాతులైరి. వారికి పూర్వజన్మ స్మృతి ఉండెను (10). ఒక పక్షి పంచాలుడను పేరుతో జన్మించి ఋగ్వేదమును పఠించేను. పంచాలుడు ఆచార్యుడాయెను. మరియొక పక్షి పుండరీకుడై సామవేదము, యజుర్వేదము అను రెండు వేదములనధ్యయనము చేసెను (11). ఆ దేశముయొక్క మహారాజు పరమపవిత్రుడగు బ్రహ్మదత్తుడనే తన పుత్రుని రాజ్యమునందు అభిషేకించి ఉత్తమగతిని పొందెను (12).

పంచాలః పుండరీకస్తు పుత్రౌ సంస్థాప్య మందిరే ।

వివిశతుర్వనం తత్ర గతౌ పరమికాం గతిమ్ ॥

బ్రహ్మదత్తస్య భార్యా తు సన్నితిర్నామ భారత ।

సా త్వేక భావసంయుక్తా రేమే భర్త్రా సహైవ తు ॥

శేషాస్తు చక్రవాకా వై కాంపీల్యే సహచారిణః ।

జాతాః శ్రోత్రియదాయాదా దరిద్రస్య కులే నృప ॥

ధృతిమాన్ సుమహాత్మా చ తత్త్వదర్శీ నిరుత్సుకః ।

వేదాధ్యయన సంపన్నాశ్చత్వారశ్ఛి ద్రదర్శినః ॥

తే యోగనిరతాస్సిద్ధాః ప్రస్థితాస్సర్వ ఏవ హి ।

ఆమంత్ర్య చ మిథశ్శంభోః పదాంభోజం ప్రణమ్య తు ॥

శూరా యే సంప్రపద్యంతే అపునర్భవ కాంక్షిణః ।

పాపం ప్రణాశయంత్వద్య తచ్ఛంభోః పరమం పదమ్ ॥

శారీరే మానసే చైవ పాపే వాగ్జే మహామునే ।

కృతే సమ్యగిదం భక్త్యా పఠేచ్ఛ్రద్ధా సమన్వితః ॥

ముచ్యతే సర్వపాపేభ్య శ్శివనామాను కీర్తనాత్ ।

ఉచ్చార్యమాణ ఏతస్మిన్ దేవదేవస్య తస్య వై ॥ ।

విలయం పాపమాయాతి హ్యామభాండ మివాంభసి ।

తస్మాత్తత్సంచితే పాపే సమనంతరమేవ చ ॥

జప్తవ్యమేతత్పాపస్య ప్రశమాయ మహామునే ।

నరైః శ్రద్ధాలుభిర్భూయ స్సర్వకామఫలాప్తయే ॥

పుష్ట్యర్థమిమమధ్యాయం పఠేదేనం శృణోతి వా ।

ముచ్యతే సర్వపాపేభ్యో మోక్షం యాతి న సంశయః ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే ఉమాసంహితాయాం చక్రవాకానాం ఉత్తమగతి వర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥

పంచాలుడు, పుండరీకుడు తమ పుత్రులను దేవాలయమునందు స్థాపించి అడవికి వెళ్లి అచట ఉత్తమ గతిని పొందిరి (13). ఓ భరతవంశీయుడా ! బ్రహ్మదత్తుని భార్య పేరు సన్నితి. ఆమె గొప్ప పతివ్రత, ఆమె భర్తతో గూడి విహరించెను (14). ఓ మహారాజా ! మిగిలిన చక్రవాక పక్షులు కాంపిల్య నగరములో దరిద్రుడగు శ్రోత్రియునకు పుత్రులై జన్మించి కలిసి జీవించిరి (15). ఛిద్రదర్శియే ఆ శ్రోత్రియుడు ఆయెను. ధృతిమంతుడు, సుమహాత్ముడు, తత్త్వదర్శీ మరియు నిరుత్సుకుడు అనే పేరు గల ఆ నలురు పుత్రులు వేదాధ్యయనములో నిష్ణాతులైరి(16). యోగములో నిష్ణాతులు, మరియు సిద్ధులు అగు ఆ నలురు ఒకరినొకరు సంప్రదించుకొని, శంభుని పాదపద్మములకు ప్రణమిల్లి బయలుదేరిరి (17). పునర్జన్మ లేని మోక్షమును గోరు ధీరులు శివుని పాదములను పట్టుకొనెదరు. శంభుని అట్టి పరమపదము ఈ నాడు మన పాపములను పోగొట్టుగాక ! (18) ఓ మహర్షి ! శరీరముతో గాని, వాక్కుతో గానీ, మనస్సుతో గాని ఏదేని పాపమును చేసినచో, అట్టివాడు శ్రద్ధతో గూడినవాడై దీనిని భక్తితో చక్కగా పఠించవలెను (19). దేవదేవుడగు శివుని నామమును ఉచ్చరించుటచే వెంటనే సర్వపాపములనుండి విముక్తి కలుగును (20). శివనామోచ్చారణముచే నీటియందు పారవైచిన పచ్చికుండవలె పాపము వినష్టమగును. ఓ మహర్షి ! కావున పాపమును మూటగట్టుకొని యున్న మానవుడు ఆ పాపము నశించుట కొరకై వెంటనే దీనిని జపించవలెను. మరియు శ్రద్ధావంతులగు మానవులు శివనామ జపముచే సర్వకామనలను మరియు ఫలములను పొందెదరు (21, 22). ఈ అధ్యాయమును పఠించే, మరియు శ్రవణము చేసే మానవుడు పుష్టిని పొంది, సకల పాపములనుండి విముక్తుడై మోక్షమును పొందుననుటలో సందేహము లేదు (23).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు చక్రవాక పక్షుల ఉత్తమగతిని వర్ణించే నలుబది రెండవ అధ్యాయము ముగిసినది (42).

43 - ఆచార్య పూజ

శౌనక ఉవాచ ।

ఆచార్యపూజనం బ్రూహి సూత వ్యాసగురోఽ ధునా ।

గ్రంథస్య శ్రవణాంతే హి కిం కర్తవ్యం తదప్యహో ॥

శౌనకుడు ఇట్లు పలికెను -

ఓ సూతా ! నీకు వ్యాసుడు గురువు. ఇపుడు ఆచార్యుని పూజను గురించి చెప్పు◌ప్పము. గ్రంథమును శ్రవణము చేయుట పూర్తి అయిన పిదప ఏమి చేయవలెను ? ఆ విషయమును కూడ చెప్పుము (1).

సూత ఉవాచ ।

పూజయేద్విధివద్భక్త్యాచార్యం శ్రుత్వా కథాం పరామ్ ।

గ్రంథాంతే విధివద్దద్యాదాచార్యాయ ప్రసన్నధీః ॥

తతో వక్తారమాన్య సంపూజ్య చ యథావిధి ।

భూషణైర్హస్త కర్ణానాం వస్త్రై స్సామ్యాదిభిస్సుధీః ॥

శివపూజా సమాప్తౌ తు దద్యాద్ధేనుం సవత్సికామ్ ।

కృత్వాసనం సువర్ణస్య పలమానస్య సాంబరమ్ ॥

తత్రాస్థాప్య శుభం గ్రంథం లిఖితం లలితాక్షరైః ।

ఆచార్యాయ సుధీర్దద్యాన్ముక్తస్స్యాద్భవ బంధనైః ॥

గ్రామో గజో హయశ్చాపి యథాశక్త్య పరాణి చ ।

మునే సర్వాణి దేయాని వాచకాయ మహాత్మనే ॥

విధాన సహితం సమ్యక్ శ్రుతం హి సఫలం స్మృతమ్ ।

పురాణం శౌనకమునే సత్యమేవోదితం మయా ॥

తస్మాద్విధానాదుక్తం తు శృణుయాద్భక్తితో మునే ।

పురాణం నిగమార్థాఢ్యం పుణ్యదం హృదయం శ్రుతేః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం వ్యాసపూజన ప్రకారో నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥

సూతుడు ఇట్లు పలికెను -

శ్రేష్ఠమగు కథను వినిన పిదప ఆచార్యుని యథావిధిగా పూజించవలెను. గ్రంథము పూర్తి అయిన తరువాత భక్తుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై యథావిధిగా ఆచార్యునకు దానమును చేయవలెను (2). తరువాత వివేకి యగు భక్తుడు ప్రవచనకర్తకు ప్రణమిల్లి యథావిధిగా చక్కగా పూజించి చేతులకు చెవులకు భూషణములను, నాజూకైన వస్త్రములు మొదలగు వాటిని సమర్పించవలేను (3). శివపూజ పూర్తి అయిన తరువాత వివేకియగు భక్తుడు గోవును, దూడతో సహా ఆచార్యునకు ఈయవలెను. పలము బరువు గల బంగారముతో ఆసనమును నిర్మించి దానిని మంచి వస్త్రముతో కప్పి దానిపై శుభకరమగు గ్రంథమును స్థాపించవలెను. ఆ గ్రంథము సుందరమగు అక్షరములచే వ్రాయబడి యుండవలెను. దానిని ఆచార్యునకు ఈయవలెను. ఇట్లు చేయు భక్తుడు సంసారబంధములనుండి విముక్తుడగును (4, 5). ఓ మునీ ! మహాత్ముడగు ప్రవచనకర్తకు గ్రామము, ఏనుగు, గుర్రము మొదలగు వాటిని అన్నింటినీ యథాశక్తిగా ఈయవలెను (6). ఓ శౌనకమహర్షి! పురాణమును యథావిధిగా శ్రవణము చేసినచో, ఫలము లభించునని చెప్పబడినది. నేను సత్యమును మాత్రమే చెప్పుచున్నాను (7). ఓ మునీ! కావున వేద రహస్యములతో నిండియున్నది, పుణ్యప్రదము, వేదహృదయము అగు పురాణమును వక్త యథావిధిగా చెప్పగా భక్తితో వినవలెను (8).

శ్రీ శివమహాపురాణమునందలి ఉమాసంహితయందు వ్యాస పూజాప్రకారము అనే నలుబది మూడవ అధ్యాయము ముగిసినది (43).

44 – వ్యాసుని జననము

మునయ ఊచుః ।

వ్యాసోత్పత్తిం మహాబుద్ధే బ్రూహి సూత దయానిధే ।
కృపయా పరయా స్వామిన్ కృతార్థాన్నిష్కురు ప్రభో ॥
వ్యాసస్య జననీ ప్రోక్తా నామ్నా సత్యవతీ శుభా ।
వివాహితా తు సా దేవీ రాజ్ఞా శంతనునా కిల॥
తస్యాం జాతో మహాయోగీ కథం వ్యాసః పరాశరాత్ ।
సందేహోఽత్ర మహాన్ జాతస్తం భవాన్ ఛేత్తుమర్హతి ॥

మునులు ఇట్లు పలికిరి –

ఓ సూతా ! నీవు మహాబుద్ధిశాలివి. దయానిధివి. నీవు పరమదయతో వ్యాసుడు పుఁట్టిన విధానమును చెప్పుము. ఓ స్వామీ ! ప్రభూ ! మమ్ములను కృతార్థులను చేయుము (1), సత్యవతియను మంగళ స్వరూపురాలు వ్యాసుని తల్లి అనియు, ఆ దేవి శంతను మహారాజును వివాహమాడినదనియు చెప్పబడినది (2). ఆమెయందు పరాశరుని వలన మహాయోగి యగు వ్యాసుడు జన్మించుట ఎట్లు సంభవము ? ఈ విషయములో మాకు పెద్ద సందేహము గలదు. దానిని నీవు నిర్మూలించదగును (3).

సూత ఉవాచ ।

ఏకదా తీర్థయాత్రాయాం వ్రజన్ యోగీ పరాశరః ।
యదృచ్ఛయా గతో రమ్యం యమునాయాస్తటం శుభమ్ ॥
నిషాదమాహ ధర్మాత్మా కుర్వంతం భోజనం తదా ।
నయస్వ యమునాపారం జలయానేన మామరమ్ ॥
ఇత్యుక్తో మునినా తేన నిషాదస్స్వసుతాం జగౌ ।
మత్స్య గంధామముం బాలే పారం నావా నయ ద్రుతమ్ ॥
తాపసోఽయం మహాభాగే దృశ్యంతీ గర్భ సంభవః ।
తితీర్షురస్తి మర్ధాబ్ధి శ్చతురామ్నాయపారగః ॥
ఇతి విజ్ఞాపితా పిత్రా మత్స్యగంధా మహామునిమ్ ।
సంవాహయతి నౌకాయామాసీనం సూర్యరోచిషమ్ ॥
కాలయోగాన్మహాయోగీ తస్యాం కామాతురోఽభవత్ ।
దృష్ట్వా యోఽప్సరసాం రూపం న కదాపి విమోహితః ॥
గ్రహీతుకామస్స మునిర్దాశకన్యాం మనోహరామ్ ।
దక్షిణేన కరేణైతామస్పృ శద్దక్షిణే కరే ॥
తమువాచ విశాలాక్షి వచనం స్మితపూర్వకమ్ ।
కిమిదం క్రియతే కర్మ వాచంయమ విగర్హితమ్ ॥

వసిష్ఠస్య కులే రమ్యే త్వం జాతోఽసి మహామతే ।
నిషాదజా త్వహం బ్రహ్మన్ కథం సంగో ఘటేత నౌ ॥
దుర్లభం మానుషం జన్మ బ్రాహ్మణత్వం విశేషతః।
తత్రాపి తాపసత్వం చ దుర్లభం మునిసత్తమ ॥
విద్యయా వపుషా వాచా కులశీలేన చాన్వితః ।
కామబాణ వశం యాతో మహదాశ్చర్యమత్ర హి ॥
ప్రవృత్తమప్యసత్కర్మ కర్తుమేనం న కోఽపి హ ।
భువి వారయితుం శక్త శ్శాపభీత్యాస్య యోగినః ॥

సూతుడు ఇట్లు పలికెను –

ఒకప్పుడు పరాశరయోగి తీర్థయాత్రకు వెళ్తూ, అనుకోకుండగా పవిత్రము ు, సుందరము అగు యమునా తీరమునకు వెళ్లెను (4). అపుడు ఆ ధర్మాత్ముడు భోజనమును చేయుచున్న పల్లె వానితో, 'నన్ను శీఘ్రముగా యమునయొక్క ఆవలి తీరమునకు చేర్చుము' అని పలికెను (5). ఆ మహర్షి ఇట్లు పలుకగా, పల్లెవాడు తన కుమార్తెయగు మత్స్యగంధతో, 'అమ్మాయీ ! ఈయనను వెంటనే నావపై ఆవలి ఒడ్డునకు చేర్చుము. ఓ పుణ్యాత్మురాలా ! దృశ్యంతి అను ఆమెయొక్క పుత్రుడగు ఈ తపశ్శాలి నదిని దాటగోరుచున్నాడు. నాల్గు వేదముల అంతమును చూచిన ఈ మహర్షి విజ్ఞానమునకు నిధి' (6,7), తండ్రి ఇట్లు కోరగా, ఆ మత్స్యగంధ సూర్యునితో సమానమగు కాంతి గల ఆ మహర్షి కూర్చుండియున్న నావను నడుపుచుండెను (8). ఎన్నడేనను అప్సరసల రూపమునకు కూడ మోహితుడు కాని ఆ మహాయోగి. కొలమహిమచే ఆమెయందు కామనచే పీడింపబడెను (9). ఆ ముని మనోహారిణి యగు ఆ పల్లెల్లను పట్టుకొనగోరెను. ఆయన తన కుడి చేతితో ఆమె కుడిచేతిని స్పృశించెను (10). నిడివి కన్నుల ఆ సుందరి చిరునవ్వు నవ్వి ఆయనతో నిట్లనెను: వాక్కుపై నియంత్రణ గల ఓ మహాబుద్ధిశాలీ! నీవు ఇట్టి మిక్కిలి నిందింపదగిన కర్మను ఏల చేయుచున్నావు ? నీవు సుందరమగు వసిష్ఠుని కులములో జన్మించితివి. ఓ బ్రాహ్మణా ! నేను పల్లె పిల్లను. మన ఇద్దరి సమాగమము ఎట్లు ఘటిల్లును ? (11, 12) మనుష్య జన్మ దుర్లభమైనది. బ్రాహ్మణత్వము మరింత దుర్లభము. ఓ మహర్షి ! తపశ్శాలి కాగలుట ఇంకనూ కఠినము (13). విద్య, సుందరమగు దేహము, మాటలాడే సామర్థ్యము, గొప్ప కులము మరియు మంచి శీలము అను వాటితో గూడియున్న నీవు ఇచట మన్మథబాణ పీడితుడవగుట పెద్ద ఆశ్చర్యము గదా ! (14) తప్పు పనిని చేయుటకు పూనుకున్న ఈ యోగిని వారించే సామర్థ్యము భూలోకములో ఎవ్వరికైననూ లేదు. ఏలయనగా, ఆయన శపించునేమో యను భయము గలదు (15).

ఇతి సంచింత్య హృదయే నిజగాద మహామునిమ్ ।
తావద్ధైర్యం కురు స్వామిన్ యావత్త్వాం పారయామి న॥
ఇతి శ్రుత్వా వచస్తస్యా యోగిరాజః పరాశరః।
తత్యాజ పాణిం తరసా సింధోః పారం గతః పునః ॥
పునర్జగ్రాహ తాం బాలాం మునిః కామ ప్రపీడితః ।
కంపమానా తు సా బాలా తమువాచ దయానిధిమ్ ॥
దుర్గంధాహం మునిశ్రేష్ఠ కృష్ణవర్ణా నిషాదజా ।
భవాంస్తు పరమోదారవిచారో యోగిసత్తమః ॥
నావయోర్ఘటతే సంగో కాచకాంచనయోరివ ।
తుల్యజాత్యాకృతికయోస్సంగసౌఖ్య ప్రదో భవేత్ ॥
ఇత్యుక్తేన తయా తేన క్షణమాత్రేణ కామినీ ।
కృతా యోజనగంధా తు రమ్యరూపా మనోరమా ॥
పునర్జగ్రాహ తాం బాలాం స మునిః కామపీడితః ।
గ్రహీతు కామం తం దృష్ట్వా పునః ప్రోవాచ వాసవీ ॥
రాత్రౌ వ్యవాయః కర్తవ్యో న దివేతి శ్రుతిర్జగౌ।
దివాసంగే మహాన్ దోషో నిందా చాపి దురాసదా ॥
తస్మాత్తావత్ప్రతీక్షస్వ యావద్భవతి యామినీ ।
పశ్యంతి మానవాశ్చాత్ర పితా మే చ తటే స్థితః ॥
తయోక్తమిదమాకర్ణ్య వచనం మునిపుంగవః ।
నీహారం కల్పయామాస సద్యః పుణ్య బలేన వై ॥
నీహారే చ సముత్పన్నే తమసా రాత్రి సంనిభే ।
వ్యవాయచకితా బాలా పునః ప్రోవాచ తం మునిమ్ ॥
యోగిన్నమోఘవీర్యస్త్వం భుక్త్వా గంతాసి మాం యది ।
సగర్భా స్యాం తదా స్వామిన్ కా గతిర్మే భవేదితి ॥
కన్యా వ్రతం మహాబుద్ధే మమ నష్టం భవిష్యతి ।
హసిష్యంతి తదా లోకాః పితరం కిం బ్రవీమ్యహమ్ ॥

ఆమె తన మనస్సులో నిట్లు తలపోసి ఆ మహర్షితో నిట్లనెను: ఓ స్వామీ ! నేను ు నిన్ను ఆవలి తీరమునకు చేర్చునంతవరకు ధైర్యము నవలంబించుము (16). యోగీశ్వరుడగు పరాశరుడు ఆమె యొక్క ఈ వచనమును విని వెంటనే చేతిని విడిచిపెట్టెను. ఇంతలో వారు నది ఆవలి తీరమునకు చేరిరి (17). మన్మథ పీడితుడైన ఆ ముని ఆ కన్యను మరల పట్టుకొనెను. ఆ కన్య వణికి పోతూ దయాసముద్రుడగు ఆ మహర్షితో నిట్లనెను (18). ఓ మహర్షి ! నేను చెడు వాసన గల, నల్లని దేహవర్ణము గల పల్లె పిల్లను. కాని, నీవు సర్వోత్కృష్టమగు జ్ఞానము గల యోగి శ్రేష్ఠుడవు (19). బంగారమునకు గాజు పూసతో వలె నీకు నాతో పొత్తు పొసగదు. సమానమగు జాతి మరియు ఆకారము గల వారి మధ్య పొత్తు సుఖములనిచ్చును (20). ఆమె ఇట్లు పలుకగా మరుక్షణములో ఆయన ఆమెను

మనోహరము, రమ్యము అగు రూపము గల యోజన గంధ (యోజన దూరము వరకు ప్రసరించే పరిమళము గలది) నుగా తీర్చిదిద్దెను (21). మన్మథ పీడితుడైన ఆ ముని ఆ కన్యను మరల పట్టుకొనెను. తనను పట్టుకొనగోరుచున్న ఆ మునిని గాంచి ఆ పల్లె పిల్ల మరల ఇట్లనెను (22). సంభోగమును రాత్రియందే గాని పగలు చేయరాదని వేదము చెప్పుచున్నది. పగటి సంభోగమునందు పెద్ద దోషము, మరియు అతిక్రమింప శక్యము కాని నింద గలవు (23). కావున రాత్రి వచ్చునంత వరకు వేచియుండుము. పైగా ఇచట మనుష్యులు చూడగలరు. ఒడుపై నాతండ్రి కూడ ఉన్నాడు (24). ఆమెయొక్క ఈ పలుకులను విని వెంటనే ఆ మహర్షి పుణ్య ప్రభావముచే పొగమంచును సృష్టించెను (25). పొగమంచు అంతటా నిండి రాత్రియందు వలే చీకటి అలముకొనెను. అపుడు సంభోగమునకు భయపడిన ఆ కన్య మరల ఆ మునితో నిట్లనెను (26). ఓ యోగీ ! నీ సామర్థ్యము తిరుగు లేనిది. నీవు నన్ను అనుభవించి వెళ్లిన పిదప నేను గర్భవతిని అగుదును. ఓ స్వామీ ! అపుడు నాగతి ఏమగును ? (27) ఓ మహాబుద్ధిశాలీ! నా కన్యా వ్రతము భగ్నమగును. అపుడు జనులు నన్ను పరిహసించెదరు. నేను తండ్రికి ఏమని చెప్పగలను ? (28)

పరాశర ఉవాచ।

రమ బాలే మయా సార్ధం స్వచ్ఛందం కామజై రసైః ।
స్వయాభిలాషమాఖ్యాహి పూరయామ్యధునా ప్రియే ॥
మదాజ్ఞా సత్య కరణాన్నామ్నా సత్యవతీ భవ ।
వందనీయా తథాశేషై ర్యోగిభి స్త్రిదశైరపి ॥

పరాశరుడిట్లు పలికెను –

ఓ కన్యా ! ప్రేమతో నిండిన మనో భావములతో గూడియున్న దానవై నాతో యథేచ్ఛగా రమించుము. ఓ ప్రియురాలా ! నీ కోరికను వెల్లడించుము. నేను ఇప్పుడే తీర్చెదను (29). నా ఆజ్ఞను సత్యము చేయుటచే నీకు సత్యవతి అను పేరు ప్రసిద్ధిని గాంచగలదు. మరియు సర్వయోగులు, దేవతలు కూడ నీకు నమస్కరించెదరు (30).

సత్యవత్యువాచ ।

జానతే న పితా మాతా న వాన్యే భువి మానవాః ।
కన్యాధర్మో న మే హన్యాద్యది స్వీకురు మాం తదా ॥
పుత్రశ్చ త్వత్సమో నాథ భవేదద్భుతశక్తిమాన్ ।
సౌగంధ్యం సర్వదాంగే మే తారుణ్యం చ నవం నవమ్ ॥

సత్యవతి ఇట్లు పలికెను –

నా తండ్రికి గాని, తల్లికి గాని, భూలోకములోని ఇతర మానవులకు గాని తెలియరాదు. నా కన్యాధర్మమునకు భంగము కలుగరాదు. అట్లు సంభవమైనచో, నన్ను స్వీకరించుము (31). ఓ ప్రభూ ! నాకు నీతో సమానమైనవాడు, అద్భుతమగు శక్తి గలవాడు అగు పుత్రుడు కలుగవలెను. నా శరీరమునందు పరిమళము

సర్వకాలములలో నుండవలెను. నాకు యౌవనము నిత్యనూతనముగా నుండవలెను (32).

పరాశర ఉవాచ ।

శృణు ప్రియే తవాభీష్టం సర్వం పూర్ణం భవిష్యతి ।
విష్ణ్వంశ సంభవః పుత్రో భవితా తే మహాయశాః ॥
కించిద్వై కారణం విద్ధి యతోఽహం కామపీడితః ।
దృష్ట్వా చాప్సరసాం రూపం నాముహ్యన్మే మనః క్వచిత్ ॥
మీన గంధాం సమాలక్ష్య త్వాం మోహవశగోఽ భవమ్ ।
న బాలే భాలపట్ట స్థో బ్రహ్మలేఖోఽన్యథా భవేత్ ॥
పురాణకర్తా పుత్రస్తే వేదశాఖా విభాగకృత్ ।
భవిష్యతి వరారోహే ఖ్యాత కీర్తిర్జగత్త్రయే ॥
ఇత్యుక్త్వా తాం సురమ్యాంగీం భుక్త్వా యోగవిశారదః ।
వవ్రాజ శీఘ్రం యమునా జలే స్నాత్వా మహామునే ॥
సాపి గర్భం దధారాశు ద్వాదశాత్మ సమప్రభమ్ ।
అసూత సూర్యజాద్వీపే కామదేవమివాత్మజమ్ ॥
వామే కమండలుం బిభ్రద్దక్షిణే దండముత్తమమ్ ।
పిశంగీభిర్జటాభిశ్చ రాజితో మహసాం చయః ॥
జాతమాత్రస్తు తేజస్వీ మాతరం ప్రత్య భాషత ।
గచ్ఛ మాతర్యథాకామం గచ్ఛామ్యహమతః పరమ్ ॥
మాతర్యదా భవేత్కార్యం తవ కించిద్ధృదీప్సితమ్ ।
సంస్మృతశ్చా గమిష్యామి త్వదిచ్ఛాపూర్తి హేతవే ॥
ఇత్యుక్త్వా మాతృచరణావభివాద్య తపోనిధిః ।
జగామ చ తపః కర్తుం తీర్థం పాపవిశోధనమ్ ॥
సాపి పిత్రంతికం యాతా పుత్రస్నేహాకులా సతీ ।
స్మరంతీ చరితం సూనో ర్వర్ణయంతీ స్వభాగ్యకమ్ ॥

పరాశరుడు ఇట్లు పలికెను -

ఓ ప్రియురాలా ! వినుము. నీ కోరిక పూర్తిగా నెరవేరగలదు. నీకు విష్ణువుయొక్కక అంశతో పుట్టే గొప్ప కీర్తిమంతుడగు పుత్రుడు కలుగును (33), అప్సరసల రూపమును చూచిన సమయములోనైననూ నా మనస్సు మోహమును పొందదు. అట్టి నేను మన్మథునిచే పీడింపబడుటకు ఏదో ఒక కారణము ఉండియుండునని తెలుసుకొనుము (34). మత్స్యగంధయగు నిన్ను చూచి నేను మోహమునకు వశుడనైతిని. ఓ సుందరీ ! బ్రహ్మ నుదుటిపై వ్రాసిన వ్రాతకు తిరుగు లేదు (35). నీ పుత్రుడు పురాణములను రచించి వేదమును శాఖారూపముగా విభజించగలడు. ఓ సుందరీ ! ఆతని కీర్తి ముల్లోకములలో ప్రసిద్ధిని పొందగలదు (36). యోగనిష్ణాతుడగు ఆ మహర్షి ఇట్లు పలికి ఆ సుందరమగు అవయవములు

గల యువతితో రమించి యమునా జలములో స్నానము చేసి వెంటనే వెళ్లిపోయేను. ఓ మహర్షీ! (37) ఆమె వెంటనే గర్భమును దాల్చి యమునా ద్వీపములో సూర్యునితో సమానమగు కాంతి గలవాడు, మన్మథుని వలె సుందరమైన వాడు అగు పుత్రుని కనెను (38). ఆయన ఎడమచేతిలో కమండలమును, కుడిచేతిలో గొప్ప దండమును ధరించెను. ఆ తేజోనిధి తేనె రంగు గల జటలతో ప్రకాశించెను (39). ఆ తేజశ్శాలి పుట్టిన వెంటనే తల్లితో నిట్లనెను : ఓ తల్లీ ! నీవు యథేచ్ఛగా వెళ్లుము. నేను కూడ ఇచటి నుండి వెళ్లుచున్నాను (40). ఓ తల్లీ ! నీకు నాతో ఏదేని పని కలిగినప్పుడు, నీ మనస్సులో ఏదేని కోరిక కలిగినప్పుడు నన్ను స్మరించుము. నేను వెంటనే వచ్చి నీ కోరికను పూర్తి చేయగలను (41). ఆ తపశ్శాలి ఇట్లు పలికి తల్లి పాదములకు నమస్కరించి తపస్సును చేయుట కొరకై పాపమును నిర్మూలించే తీర్థమునకు వెళ్లెను (42). పుత్రుని యందలి ప్రేమచే దుఃఖితురాలై యున్న ఆమె పుత్రుని గొప్పదనమును స్మరిస్తూ తన భాగ్యమును కొనియాడుతూ తండ్రి వద్దకు వెళ్లెను (43).

ద్వీపే జాతో యతో బాలస్తేన ద్వైపాయనోఽ భవత్ ।
వేదశాఖావిభజనాద్వేదవ్యాసః ప్రకీర్తితః ॥
తీర్థరాజం ప్రథమతో ధర్మకామార్థ మోక్షదమ్ ।
నైమిషం చ కురుక్షేత్రం గంగాద్వారమవంతికామ్ ॥
అయోధ్యాం మథురాం చైవ ద్వారకా మమరావతీమ్ ।
సరస్వతీం సింధుసంగం గంగాసాగర సంగమమ్ ॥
కాంచీం చ త్ర్యంబకం చాపి సప్త గోదావరీతటమ్ ।
కాలంజరం ప్రభాసం చ తథా బదరికాశ్రమమ్ ॥
మహాలయం తథోంకారక్షేత్రం వై పురుషోత్తమమ్ ।
గోకర్ణం భృగుకచ్ఛం చ భృగు తుంగం చ పుష్కరమ్ ॥
శ్రీ పర్వతాది తీర్థాని ధారాతీర్థం తథైవ చ ।
గత్వావగాహ్య విధినా చచార పరమం తపః ॥
ఏవం తీర్థాన్యనేకాని నానాదేశస్థితాని హ ।
పర్యటన్ కాలికాసూనుః ప్రాపద్వారాణసీం పురీమ్ ॥
యత్ర విశ్వేశ్వరస్సాక్షాదన్నపూర్ణా మహేశ్వరీ ।
భక్తానామమృతం దాతుం విరాజేతే కృపానిధీ ॥
ప్రాప్య వారాణసీతీర్థం దృష్ట్వాథ మణి కర్ణికామ్ ।
కోటి జన్మార్జితం పాపం తత్యాజ స మునీశ్వరః ॥
దృష్ట్వా లింగాని సర్వాణి విశ్వేశప్రముఖాని చ ।
స్నాత్వా సర్వేషు కుండేషు వాపీకూపసరస్సు చ ॥
నత్వా వినాయకాన్ సర్వాన్ గౌరీస్సర్వాః ప్రణమ్య చ ।
సంపూజ్య కాలరాజం చ భైరవం పాపభక్షణమ్ ॥

ఆ బాలకుడు ద్వీపమునందు పుట్టుటచే ద్వైపాయనుడనియు, వేదమును శాఖల రూ ాపములో విభజించుట వలన వేదవ్యాసుడనీయు ప్రసిద్ధిని పొందెను (44). ఆయన మున్ముందుగా ధర్మార్థకామమోక్షములనిచ్చే తీర్థములలో శ్రేష్ఠమైన నైమిషమును దర్శించి, తరువాత కురుక్షేత్రమును, గంగాద్వారమును, అవంతికను (45), అయోధ్యను, మథురను, ద్వారకను, అమరావతిని, సరస్వతిని, సింధునదీ సంగమమును, గంగ సముద్రములో కలిసే సంగమస్థానమును (46), కాంచీ, త్ర్యంబకము, గోదావరీ తీరమందలి ఏడు క్షేత్రములు, కాలంజరము, ప్రభాసము, బదరికాశ్రమము (47), మహాలయము, ఓంకారక్షేత్రము, పురుషోత్తమము, గోకర్ణము, భృగుకచ్ఛము, భృగుతుంగము, పుష్కరము, శ్రీ పర్వతము మొదలగు తీర్థములను, మరియు ధారాతీర్థమును చేరి యథావిధిగా స్నానమును చేసి, గొప్ప తపస్సును చేసెను (48,49). కాలికా శ్రీ సరస్వతీ పుత్రుడగు వ్యాసుడు ఈ విధముగా వివిధ ప్రాంతములయందు గల అనేక తీర్థములలో పర్యటిస్తూ వారాణసీ నగరమును చేరెను (50), అచట దయానిధులగు అన్నపూర్ణా విశ్వేశ్వరులు భక్తులకు మోక్షమునిచ్చుట కొరకై విరాజిల్లుచున్నారు (51). ఆ మహర్షి వారాణసీ తీర్థమును, తరువాత మణికర్ణికను సేవించి కోటి జన్మలలో చేసిన పాపమును పోగొట్టుకొనెను (52). విశ్వేశ్వరుడు మొదలగు లింగములనన్నింటినీ చూచి, కుండములు బావులు దిగుడు బావులు సరస్సులు అన్నింటియందు స్నానమును చేసి, వినాయకులకు గౌరీ దేవతలకు అందరికీ ప్రణమిల్లి, ఆయన కాలరాజును మరియు పాపములను నశింపజేసే భైరవుని దర్శించెను (53, 54).

దండనాయక ముఖ్యాంశ్చ గణాన్ స్తుత్వా ప్రయత్నతః ।
ఆదికేశవముఖ్యాంశ్చ కేశవాన్ పరితోష్య చ ॥
లోలార్క ముఖ్య సూర్యాంశ్చ ప్రణమ్య చ పునః పునః ।
కృత్వా పిండ ప్రదానాని సర్వతీర్థేష్వతంద్రితః ॥
స్థాపయామాస పుణ్యాత్మా లింగం వ్యాసేశ్వరాభిధమ్ ।
యద్దర్శనాద్భవేద్విప్రా నరో విద్యాసు వాక్పతిః ॥
లింగాన్య భ్యర్చ్య విశ్వేశప్రముఖాని సుభక్తితః ।
అసకృచ్చింతయామాస కిం లింగం క్షిప్రసిద్ధిదమ్ ॥
యమారాధ్య మహాదేవం విద్యాస్సర్వా లభే మహి ।
పురాణకర్తృతా శక్తిర్మమాస్తు యదనుగ్రహాత్ ॥
శ్రీమదోంకారనాథం వా కృత్తివాసేశ్వరం కిము ।
కేదారేశం తు కామేశం చంద్రేశం వా త్రిలోచనమ్ ॥
కాలేశం వృద్ధకాలేశం కాల శేశ్వరమేవ వా ।
జ్యేష్ఠశం జంబుకేశం వా జైగీషవ్యే స్వరం తు వా ॥
దశాశ్వమేధమీశానం ద్రుమిచండేశమేవ వా ।
దృక్కేశం గరుడేశం వా గోకర్ణేశం గణేశ్వరమ్ ॥
ప్రసన్నవదనేశం వా ధర్మేశం తారకేశ్వరమ్ ।
నందికేశం నివాసేశం పత్రీశం ప్రతికేశ్వరమ్ ॥

పర్వతేశం పశుపతిం హాటకేశ్వరమేవ వా ।

బృహస్పతీశ్వరం వాథ తిలభాండేశమేవ వా ॥

భారభూతేశ్వరం కిం వా మహాలక్ష్మీశ్వరం తు వా।

మరుతేశం తు మోక్షేశం గంగేశం నర్మదేశ్వరమ్ ॥

దండనాయకుడు మొదలగు గణములను ప్రయత్నపూర్వకముగా స్తుతించి, ఆదికేశవుడు మొదలగు కేశవులను సంతోషపెట్టి (55), లోలార్కుడు మొదలగు సూర్యదేవతలకు పలుమార్లు మొక్కి, తీర్థములన్నింటి యందు నిర్లక్ష్య భావన లేకుండగా పిండదానములను చేసి (56), ఆ పుణ్యాత్ముడు వ్యాసేశ్వరుడనే లింగమును స్థాపించెను. ఓ బ్రాహ్మణులారా ! దాని దర్శనము వలన మానవుడు విద్యలలో బృహస్పతియగును (57). ఆయన విశ్వేశ్వరుడు మొదలగు లింగములను మహాభక్తితో చక్కగా పూజించి, 'ఏ లింగము శీఘ్రముగా సిద్ధినీ కలుగజేయును ?' అని పలుమార్లు ఆలోచించెను (58). ఏ మహాదేవుని ఆరాధించినచో, మనము సకలవిద్యలను పొందగలము ? ఎవ్వాని అనుగ్రహము వలన నాకు పురాణములను నిర్మించే శక్తి కలుగును ? (59) శ్రీ మదోంకారనాథుడు, కృత్తివాసేశ్వరుడు, కేదారేశ్వరుడు, కామేశ్వరుడు, ముక్కంటియగు చంద్రేశ్వరుడు, కాలేశ్వరుడు, వృద్ధ కాలేశ్వరుడు, కాలకేశ్వరుడు, జ్యేష్ఠేశ్వరుడు, జంబుకేశ్వరుడు, జైగీషవేశ్వరుడు, దశాశ్వమేధేశ్వరుడు, ద్రుమిచండేశ్వరుడు, దృక్కేశ్వరుడు, గరుడేశ్వరుడు, గోకర్ణేశ్వరుడు, గణేశ్వరుడు, ప్రసన్నవదనేశ్వరుడు, ధర్మేశ్వరుడు, తారకేశ్వరుడు, నందికేశ్వరుడు, నివాసేశ్వరుడు, పత్రీశ్వరుడు, ప్రతికేశ్వరుడు, పర్వతేశ్వరుడు, పశుపతీశ్వరుడు, హాటకేశ్వరుడు, బృహస్పతీశ్వరుడు, తిలభాండేశ్వరుడు, భారభూతేశ్వరుడు, మహాలక్ష్మీశ్వరుడు, మరుతేశ్వరుడు, మోక్షేశ్వరుడు, గంగేశ్వరుడు, నర్మదేశ్వరుడు అను వారిలో ఎవరిని ఆరాధించవలెను ? (60-65)

కృష్ణేశం పరమేశానం రత్నేశ్వరమథాపి వా ।

యామునేశం లాంగలీశం శ్రీమద్విశ్వేశ్వరం విభుమ్ ॥

అవిముక్తేశ్వరం వాథ విశాలాక్షీశమేవ వా ।

వ్యాఘ్రేశ్వరం వరాహేశం విద్యేశ్వరమథాపి వా ॥

వరుణేశం విధీశం వా హరికేశేశ్వరం తు వా ।

భవానీశం కపర్దీశం కందుకేశమజేశ్వరమ్ ॥

విశ్వకర్మేశ్వరం వాథ వీరేశ్వరమథాపి వా ।

నాదేశం కపిలేశం చ భువనేశ్వరమేవ వా ॥

బాష్కులీశం మహాదేవం సిద్ధీశ్వరమథాపి వా ।

విశ్వేదేవేశ్వరం వీరభద్రేశం భైరవేశ్వరమ్ ॥

అమృతేశం సతీశం వా పార్వతీశ్వరమేవ వా ।

సిద్ధేశ్వరం మతంగేశం భూతీశ్వరమథాపి వా ॥

ఆషాఢీశం ప్రకామేశం కోటిరుద్రేశ్వరం తథా ।

మదాలసేశ్వరం చైవ తిలపర్ణేశ్వరం కిము ॥

కిం వా హిరణ్యగర్భేశం కిం వా శ్రీ మధ్యమేశ్వరమ్ ।

ఇత్యాది కోటిలింగానాం మధ్యేఽహం కిముపాశ్రయే ॥

ఇతి చింతాతురో వ్యాస శివభక్తిరతాత్మవాన్ ।

క్షణం విచారయామాస ధ్యానసుస్థిర చేతసా ॥

ఆ జ్ఞాతం విస్మృతం తావన్నిష్పన్నో మే మనోరథః ।

సిద్ధైస్సంపూజితం లింగం ధర్మకామార్థ మోక్షదమ్ ॥

దర్శనాత్ స్పర్శనాద్యస్య చేతో నిర్మలతామియాత్ ।

ఉద్ఘాటితం సదైవాస్తి ద్వారం స్వర్గస్య యత్ర హి ॥

అవిముక్తే మహాక్షేత్రే సిద్ధక్షేత్రే హి తత్పరమ్ ।

యత్రాస్తే పరమం లింగం మధ్యమేశ్వర సంజ్ఞకమ్ ॥

కృష్ణేశ్వరుడు, పరమేశ్వరుడు, రత్నేశ్వరుడు, యామునేశ్వరుడు, లాంగలీశ్వరుడు, శ్రీమద్విశ్వేశ్వరవిభుడు, అవిముక్తేశ్వరుడు, విశాలాక్షీశ్వరుడు, వ్యాఘ్రేశ్వరుడు, వరాహేశ్వరుడు, విద్యేశ్వరుడు, వరుణేశ్వరుడు, విధీశ్వరుడు, హరికేశేశ్వరుడు, భవానీశ్వరుడు, కపర్దీశ్వరుడు, కందుకేశ్వరుడు, అజేశ్వరుడు, విశ్వకర్మేశ్వరుడు, వీరేశ్వరుడు, నాదేశ్వరుడు, కపిలేశ్వరుడు, భువనేశ్వరుడు, బాష్కలీశుడు, మహాదేవుడు, సిద్ధేశ్వరుడు, విశ్వేదేవేశ్వరుడు, వీరభద్రేశ్వరుడు, భైరవేశ్వరుడు, అమృతేశుడు, సతీశుడు, పార్వతీశ్వరుడు, సిద్దేశ్వరుడు, మతంగేశ్వరుడు, భూతీశ్వరుడు, ఆషాఢశుడు, ప్రకామేశుడు, కోటీరుద్రేశ్వరుడు, మదాలసేశ్వరుడు, తిలపర్ణేశ్వరుడు, హిరణ్య గర్భేశుడు, శ్రీమధ్యమేశ్వరుడు మొదలగు కోటి లింగములలో నేను దేనిని ఆశ్రయించవలెను ? శివభక్తి భరితమగు హృదయముగల వ్యాసుడు ఈ విధమగు చింతచే పీడింపబడినవాడై క్షణకాలము ధ్యానమునందు స్థిరమైన మనస్సుతో విచారించేను (74). ఆ! తెలిసినది. నేను మరచితిని. నా కోరిక తీరినది. ధర్మార్థకామ మోక్షములనిచ్చునది, సిద్ధులచే చక్కగా పూజింపబడినది అగు లింగము కలదు (75). దానిని దర్శించి స్పృశించుట వలన మనస్సు నిర్మలమగును. అది సర్వదా స్వర్గద్వారమును తెరచియుంచును (76). అది సిద్ధులచే సేవింపబడే అవిముక్తమనే మహాక్షేత్రములో గలదు. ఆ శ్రేష్ఠలింగమునకు మధ్యమేశ్వరుడని పేరు (77).

న మధ్యమేశ్వరాదన్యల్లింగం కాశ్యాం హి విద్యతే ।

యద్దర్శనార్థమాయాంతి దేవాః పర్వణి పర్వణి ॥

అతస్సేవ్యో మహాదేవో మధ్యమేశ్వర సంజ్ఞకః ।

అస్యారాధనతో విప్రా బహవస్సిద్ధిమాగతాః ॥

యః ప్రధానతయా కాశ్యా మధ్యే తిష్ఠతి శంకరః ।

స్వపురీజనసౌఖ్యార్థమతోఽసౌ మధ్యమేశ్వరః ॥

తుంబురుర్నామ గంధర్వో దేవర్షిర్నారదస్తథా ।

అముమారాధ్య సంపన్నౌ గానవిద్యా విశారదౌ ॥

అముమేవ సమారాధ్య విష్ణుర్మోక్ష ప్రదోఽభవత్ ।

బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ స్రష్టృపాలకహారకాః ॥

ధనాధీశః కుబేరోఽపి వామదేవో హి శైవరాట్ ।
ఖట్వాంగో నామ భూపాలోఽ నపత్యోఽపత్యవానభూత్ ॥
అప్సరాశ్చంద్రభామాఖ్యా నృత్యంతీ నిజభావతః ।
సదేహా కోకిలాలాపా లింగమధ్యే లయం గతా ॥
శ్రీకరో గోపికా సూనుస్సేవితా మధ్యమేశ్వరమ్ ।
గాణపత్యం సమాలేభే శివస్య కరుణాత్మనః ॥
భార్గవో గీష్పతిశ్చోభౌ దేవౌ దైత్యసురార్చితౌ ।
విద్యాపారంగమౌ జాతౌ ప్రసాదాన్మధ్యమేశితుః ॥
అహమప్యత్ర సంపూజ్య మధ్యమేశ్వరమీశ్వరమ్ ।
పురాణ కర్తృతా శక్తిం ప్రాప్స్యామి తరసా ధ్రువమ్ ॥
ఇతి కృత్వా మతం ధీరో వ్యాసస్సత్యవతీసుతః ।
భాగీరథ్యంభసి స్నాత్వా జగ్రాహ నియమం వ్రతీ ॥

మధ్యమేశ్వరుని కంటే వేరొక లింగము కాశీలో లేదు. దేవతలు పర్వదినములన్నింంటియందు దానిని దర్శించుటకు వచ్చుచుందురు (78). కావున మధ్యమేశ్వరుడనే పేరు గల మహాదేవుని సేవించదగును. ఓ బ్రాహ్మణులారా ! ఆయనను సేవించి అనేకులు సిద్ధిని పొందిరి (79). శంకరుడు తన నగరమగు కాశీలోని జనుల సౌకర్యము కొరకై ప్రధానముగా ఆ నగర మధ్యములో నున్నాడు. కావుననే, అయన మధ్యమేశ్వరుడైనాడు (80). తుంబురుడనే గంధర్వుడు, దేవర్షియగు నారదుడు ఈయనను ఆరాధించి సంగీతవిద్యలో నిష్ణాతులైనారు (81). ఈయనను ఆరాధించి విష్ణువు మోక్షమునిచ్చువాడు అయినాడు. బ్రహ్మ సృష్టికర్త అయినాడు. విష్ణువు పాలకుడు, రుద్రుడు సంహారకుడు అయినారు (82). కుబేరుడు ధనాధ్యక్షుడైనాడు. వామదేవుడు శివభక్తులకు అధీశ్వరుడైనాడు. సంతానము లేని ఖట్వాంగుడనే రాజు సంతానమును పొందినాడు (83). చంద్రభామ యను అప్సరస భక్తి పూర్ణమగు మనస్సు గలదై నృత్యము చేయుచూ కోకిలవలె గానము చేయుచూ లింగ మధ్యములో దేహముతో సహా లయమును పొందెను (84). శ్రీకరుడనే గొల్లపిల్లడు మధ్యమేశ్వరుని సేవించి కరుణాహృదయుడగు శివుని గణాధ్యక్షస్థానమును పొందినాడు (85). గురు శుక్రులిద్దరు మధ్యమేశ్వరుని అనుగ్రహము వలన విద్యావిశారదులగు దేవతలై క్రమముగా దేవతలచే మరియు అసురులచే పూజింపబడుచుండిరి (86). నేను కూడ ఇచట జగన్నాథుడగు మధ్యమేశ్వరుని పూజించి పురాణములను రచించే శక్తిని శీఘ్రముగా నిశ్చయముగా పొందగలను (87). వివేకి, సత్యవతీ పుత్రుడు, వ్రతశీలుడు అగు వ్యాసుడు ఈ విధముగా నిశ్చయించుకొని గంగాజలములో స్నానమును చేసి నియమమును స్వీకరించెను (88).

క్వచిత్పర్ణాశనో భూత్వా ఫలశాకాశనః క్వచిత్ ।
వాతభుక్ జలభుగ్వాపి క్వచిన్నిరశన వ్రతీ ॥
ఇత్యాదినియమైర్యోగీ త్రికాలం మధ్యమేశ్వరమ్ ।
పూజయామాస ధర్మాత్మా నానావృక్షోద్భవైః ఫలైః ॥
ఇత్థం బహుతిథే కాలే వ్యతీతే కాలికా సుతః ।
స్నాత్వా త్రిపథగా తోయే యావదాయాతి స ప్రగే ॥
మధ్యమేశ్వరమీశానం భక్తాభీష్ట వరప్రదమ్ ।
తావద్దదర్శ పుణ్యాత్మా మధ్యే లింగం మహేశ్వరమ్ ॥
ఉమాభూషిత వామాంగం వ్యాఘ్రచర్మోత్తరీయకమ్ ।
జటాజూటచలద్గంగా తరంగైశ్చారు విగ్రహమ్ ॥
లసచ్ఛారదబాలేందు చంద్రికా చందితాలకమ్ ।
భస్మోద్ధూలిత సర్వాంగం కర్పూరార్జున విగ్రహమ్ ॥
కర్ణాంతాయతనేత్రం చ విద్రుమారుణదచ్ఛదమ్ ।
పంచవర్షాకృతిం బాలం బాలకోచిత భూషణమ్ ॥
దధానం కోటి కందర్ప దర్పహాని తనుద్యుతిమ్ ।
నగ్నం ప్రహసితాస్యాబ్జం గాయంతం సామ లీలయా ॥
కరుణాపారపాథోధిం భక్తవత్సల నామకమ్ ।
ఆశుతోషముమాకాంతం ప్రసాదసుముఖం హరమ్ ॥
సమాలోక్య స్తుతిం చక్రే ప్రేమ గద్గదయా గిరా ।
యోగినా మప్య గమ్యం తం దీనబంధుం చిదాత్మకమ్ ॥

ఒకప్పుడు ఆకులను, మరియొకప్పుడు పండ్లను, కాయలను, మరియొకప్పుడు గాలిని నీటిని మాత్రమే ఆహారముగా తీసుకొని, మరియొకప్పుడు నిరాహారవ్రతమును బూని (89), ధర్మాత్ముడు, యోగి యగు ఆ వ్యాసుడు ఈ విధమగు నియమములతో వివిధ వృక్షముల నుండి పుట్టిన ఫలములతో మధ్యమేశ్వరుని మూడు కాలములయందు పూజించెను (90). ఈ విధముగా చాల రోజులు గడిచేను. ఒకనాడు కాలికా పుత్రుడగు ఆ వ్యాసుడు ఉదయమే గంగా జలములో స్నానమును చేసి వచ్చునంతలో (91), లోకపాలకుడు, భక్తులకు అభీష్టమగు వరములనిచ్చువాడు, మహేశ్వరుడు అగు మధ్యమేశ్వరుని లింగమధ్యములో చూచేను. ఆ పుణ్యాత్ముడగు వ్యాసుడు, పార్వతిచే అలంకృతమై యున్న వామ భాగము గలవాడు, పెద్దపులి చర్మమును ఉత్తరీయముగా ధరించినవాడు, జటాజూటమునందు కదలాడే గంగయొక్క తరంగములచే సుందరమైన దేహము గలవాడు, ప్రకాశించే శరత్కాల బాలచంద్రుని వెన్నెలలచే ప్రకాశింపచేయబడే ముంగురులు గలవాడు, భస్మచే పూయబడిన సర్వాయవములు గలవాడు, కర్పూరము వలె తెల్లని దేహము గలవాడు, చెవుల వరకు వ్యాపించిన కన్నులు గలవాడు, పగడముల వలె ఎర్రనైన పెదవులు గలవాడు, అయిదేండ్ల బాలకుని రూపమును దాల్చి బాలకునకు తగిన ఆభరణములను ధరించినవాడు, కోటి మన్మథుల గర్వమునడంచే శరీర కాంతి గలవాడు,

నగ్నముగా నున్నవాడు, నవ్వులతో నిండిన పద్మము వంటి మోము గలవాడు, అవలీలగా సామగానమును చేయుచున్నవాడు, అంతములేని కరుణకు సముద్రము వంటివాడు, భక్తవత్సలుడని ఖ్యాతిని పొందినవాడు, తేలికగా ప్రసన్నమగు వాడు, పార్వతీప్రియుడు, అనుగ్రహించుటకు సుముఖముగా నున్నవాడు అగు శివుని చూచి, ప్రేమతో గద్గదమైన వాక్కుతో యోగులకైననూ పొందశక్యము కానివాడు, దీనులకు బంధువు, జ్ఞానస్వరూపుడు అగు ఆయనను స్తుతించెను (92-98).

వేదవ్యాస ఉవాచ ।

దేవదేవ మహాభాగ శరణాగతవత్సల ।
వాఙ్మనః కర్మ దుష్ప్రాప యోగినా మప్యగోచర ॥
మహిమానం న తే వేదా విదామాసురుమాపతే ।
త్వమేవ జగతః కర్తా ధర్తా హర్తా తథైవ చ ॥
త్వమాద్యస్సర్వదేవానాం సచ్చిదానంద ఈశ్వరః ।
నామగోత్రే న వా తే స్తస్సర్వజ్ఞోఽసి సదాశివ ॥
త్వమేవ పరమం బ్రహ్మ మాయాశనివర్తకః ।
గుణత్రయైర్న లిప్తస్త్వం పద్మపత్రమి వాంభసా ॥
న తే జన్మ న వా శీలం న దేశో న కులం చ తే ।
ఇత్థం భూతోఽపీశ్వరత్వం త్రిలోక్యాః కామమావహేః ॥
న చ బ్రహ్మా న లక్ష్మీశో న చ సేంద్రా దివౌకసః ।
న యోగీంద్రా విదుస్తత్త్వం యస్య తం త్వాముపాస్మహే ॥
త్వత్తస్సర్వం త్వం హి సర్వం గౌరీశస్త్వం పురాంతకః ।
త్వం బాలస్త్వం యువా వృద్ధస్తం త్వాం హృది యునజ్మ్యహమ్ ॥
నమస్తస్మై మహేశాయ భక్తధ్యేయాయ శంభవే ।
పురాణపురుషాయాద్ధా శంకరాయ పరాత్మనే ॥
ఇతి స్తుత్వా క్షితౌ యావద్దండవన్నిపపాత సః ।
తావత్స బాలో హృష్టాత్మా వేదవ్యాసమభాషత ॥
వరం వృణీష్వ భో యోగిన్యస్తే మనసి వర్తతే ।
నాదేయం విద్యతే కించిద్భక్తాధీనో యతోఽస్మ్యహమ్ ॥
తత ఉత్థాయ హృష్టాత్మా మునిర్వ్యాసో మహాతపాః ।
ప్రత్యబ్రవీత్కిమజ్ఞాతం సర్వజ్ఞస్య తవ ప్రభో ॥
సర్వాంతరాత్మా భగవాన్ శర్వస్సర్వ ప్రదో భవాన్ ।
యాచ్ఞాం ప్రతి నియుంక్తే మాం కిమీశో దైన్యకారిణీమ్ ॥

వేదవ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ దేవదేవా ! మహాత్మా ! నీవు శరణు జొచ్చిన వారియందు వాత్సల్యము గలవాడవు. నీవు వాక్కులకు, మనస్సునకు మరియు కర్మలకు అందవు. యోగులైననూ నిన్ను దర్శించలేరు (99). ఓ పార్వతీపతీ ! నీ మహిమను వేదములైననూ తెలియజాలవు. జగత్తును సృష్టించి పాలించి సంహరించువాడవు నీవే (100). సచ్చిదానంద-ఈశ్వరుడవగు నీవే దేవతలందరిలో మొదటివాడవు. ఓ సదాశివా ! సర్వమును తెలుసుకునే నీకు పేరు మరియు గోత్రము లేవు (101). మాయాబంధమును నిర్మూలించే పరంబ్రహ్మవు నీవే. తామరాకును నీరువలే నిన్ను మూడు గుణములు స్పృశించలేవు (102). నీకు జన్మ, శీలము, దేశము, కులము లేవు. ఇట్టి వాడవైననూ నీవు స్వీయమగు ఇచ్ఛచే మూడు లోకములకు ఈశ్వరుడవై ఉన్నావు (103). బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు మరియు యోగీశ్రేష్ఠులు నీ స్వరూపమును తెలియజాలకున్నారు. అట్టి నిన్ను మేము ధ్యానించుచున్నాము (104). సర్వము నీనుండి పుట్టినది. సర్వము నీవే. పార్వతీ పతివి అగు నీవు త్రిపురములను నశింపజేసినావు. బాలుడవు నీవే. యువకుడవు నీవే. వృద్ధుడవు నీవే. నిన్ను నేను హృదయములో ప్రతిష్ఠించుచున్నాను (105). మహేశ్వరుడు, భక్తులచే ధ్యానింపబడువాడు, అనాదిపురుషుడు, మంగళకరుడు అగు ఆ శంభుపరమాత్మకు అనేక ప్రణామములు (106). ఆ వేదవ్యాసుడు ఇట్లు స్తుతించి నేలపై దండమువలె పడి ప్రణమిల్లెను. అపుడా బాలకుడు సంతసించిన అంతరంగము గలవాడై ఆయనతో నిట్లనెను (107). ఓ యోగీ ! నీ మనస్సులో నున్న వరమును కోరుకొనుము. నేను భక్తులకు అధీనుడనై యుందును. కావున, నీకు ఈయదగనిది ఏమియూ లేదు (108). అపుడు మహాతపశ్శాలియగు వ్యాసముని ఆనందముతో నిండిన హృదయము గలవాడై లేచి నిలబడి ఇట్లు బదులిడేను : ఓ ప్రభూ ! నీవు సర్వజ్ఞుడవు. నీకు తెలియనిది ఏమి గలదు ? సర్వప్రాణులకు అంతరాత్మ, సర్వసంహారకుడు, సర్వమునిచ్చువాడు అగు భగవానుడు నీవే. ఈశ్వరుడవగు నీవు దైన్యహేతువు అగు యాచనయందు నన్ను ఏల నియోగించుచున్నావు ? (110)

ఇతి శ్రుత్వా వచస్తస్య వ్యాసస్యామలచేతసః ।

శుచి స్మిత్వా మహాదేవో బాలరూపధరోఽ బ్రవీత్ ॥

స్వచ్ఛమగు అంతఃకరణము గల ఆ వ్యాసుని ఈ వచనమును విని బాలుని రూపములోనున్న మహాదేవుడు స్వచ్ఛమగు చిరునవ్వుతో నిట్లనెను.

బాల ఉవాచ ।

త్వయా బ్రహ్మవిదాం శ్రేష్ఠ యోఽభిలాషః కృతో హృది ।

అచిరేణైవ కాలేన స భవిష్యత్య సంశయః ॥

కంఠే స్థిత్వా తవ బ్రహ్మన్నంతర్యామ్యహమీశ్వరః ।

సేతిహాస పురాణాని సమ్యజ్ నిర్యాపయామ్యహమ్ ॥

అభిలాషాష్టకం పుణ్యం స్తోత్రమేతత్త్వ యేరితమ్ ।

వర్షం త్రికాలం పఠనాత్కామదం శంభుసద్మని ॥

ఏతత్ స్తోత్రస్య పఠనం విద్యాబుద్ధి వివర్ధనమ్ ।
సర్వసంపత్కరం ప్రోక్తం ధర్మదం మోక్షదం నృణామ్ ॥
ప్రాతరుత్థాయ సుస్నాతో లింగమభ్యర్చ్య శాంకరమ్ ।
వర్షం పఠన్నిదం స్తోత్రం మూర్ఖోఽపి స్యాద్బృహస్పతిః ॥
స్త్రియా వా పురుషేణాపి నియమాల్లింగ సన్నిధౌ ।
వర్షం జప్తమిదం స్తోత్రం బుద్ధిం విద్యాం చ వర్ధయేత్ ॥
ఇత్యుక్త్వా స మహాదేవో బాలో లింగే న్యలీయత ।
వ్యాసోఽపి ముంచన్న శ్రూణి శివప్రేమాకులోఽ భవత్ ॥
ఏవం లబ్ధవరో వ్యాసో మహేశాన్మధ్యమేశ్వరాత్ ।
అష్టాదశ పురాణాని ప్రణినాయ స్వలీలయా ॥
బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ శైవం భాగవతం తథా ।
భవిష్యం నారదీయం చ మార్కండేయమతః పరమ్ ॥
ఆగ్నేయం బ్రహ్మవైవర్తం లింగం వారాహమేవ చ ।
వామనాఖ్యం తతః కౌర్మం మాత్స్యం గారుడమేవ చ ॥
స్కాందం తథైవ బ్రహ్మాండాఖ్యం పురాణం చ కీర్తితమ్ ।
యశస్యం పుణ్యదం నృణాం శ్రోతౄణాం శాంకరం యశః ॥

బాలకుడు ఇట్లు పలికెను -

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠమైనవాడా ! నీ హృదయములో నెలకొనియున్న అభిలాష తొందరలో నిస్సందేహముగా నేరవేరగలదు. అంతర్యామిని, ఈశ్వరుడను అగు నేను నీ కంఠమునందు ఉండి ఇతిహాసపురాణములను నీవు చక్కగా రచించునట్లు చేసెదను. నీవు చేసిన ఈ పవిత్రస్తుతికి అభిలాషాష్టకమని పేరు. దానిని శివాలయములో సంవత్సరకాలము ప్రతిదినము మూడు సంధ్యలయందు. పఠించినచో, కోరికలు నెరవేరును. ఈ స్తోత్రమును పఠించు మానవులకు విద్యాబుద్ధులు వర్ధిల్లి సర్వసంపదలు కలిగి ధర్మమోక్షములు లభించునని చెప్పబడినది. ఉదయమే లేచి చక్కగా స్నానమును చేసి శంకరుని లింగరూపమునర్చించి సంవత్సరకాలము ఈ స్తోత్రమును పఠించు మానవుడు మూర్ఖుడైననూ బృహస్పతి యగును. స్త్రీ గానీ, పురుషుడు గాని సంవత్సర కాలము లింగసన్నిధిలో నియమపూర్వకముగా ఈ స్తోత్రమును జపించినచో విద్యాబుద్ధులు వర్ధిల్లును. బాలరూపధారియగు ఆ మహాదేవుడు ఇట్లు పలికి లింగములో లీనమయ్యెను. వ్యాసుడు కూడ శివుని యందలి ప్రేమతో నిండిన హృదయము గలవాడై కన్నుల వెంబడి నీరు గార్చెను. వ్యాసుడు ఈ విధముగా మహేశ్వరుడగు మధ్యమేశ్వరుని నుండి వరమును పొంది పదునెనిమిది పురాణములను అనాయాసముగా రచించెను. బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, భవిష్య, నారద, మార్కండేయ, అగ్ని, బ్రహ్మ వైవర్త, లింగ, వరాహ, వామన, కూర్మ, మత్స్య, గరుడ, స్కాంద, బ్రహ్మాండములు అనునవి పురాణముల పేర్లు. శంకరుని కీర్తినీ వినే మానవులకు కీర్తి మరియు పుణ్యము లభించును.

సూత ఉవాచ ।

అష్టాదశపురాణానాం పూర్వం నామోదితం త్వయా ।
కురు నిర్వచనం తేషా మిదానీం వేదవిత్తమ ॥

సూతుడిట్లు పలికెను –

వేదవేత్తలలో శ్రేష్ఠుడవైన ఓ వ్యాసా ! పూర్వము నీవు పదునెనిమిది పురాణముల పేర్లను చెప్పియుంటివి. కాని వాటి నిర్వచనమును చెప్పలేదు. ఇపుడు వాటి నిర్వచనమును చెప్పుము.

వ్యాస ఉవాచ ।

అయమేవ కృతః ప్రశ్నస్తండినా బ్రహ్మయోనినా ।
నందికేశ్వరముద్దిశ్య స యదాహ బ్రవీమి తత్ ॥

బ్రహ్మపుత్రుడగు తండి నందికేశ్వరుని ఉద్దేశించి ఇదే ప్రశ్నను వేసెను. అయన చెప్పిన ప్రతి వచనమును చెప్పుచున్నాను.

నందికేశ్వర ఉవాచ ।

యత్ర వక్తా స్వయం తండే బ్రహ్మా సాక్షాచ్చతుర్ముఖః ।
తస్మాద్బ్రాహ్మం సమాఖ్యాతం పురాణం ప్రథమం మునే ॥
పద్మకల్పస్య మాహాత్మ్యం తత్ర యస్యాముదాహృతమ్ ।
తస్మాత్పాద్మం సమాఖ్యాతం పురాణం చ ద్వితీయకమ్ ॥
పరాశరకృతం యత్తు పురాణం విష్ణుబోధకమ్ ।
తదేవ వ్యాసకథితం పుత్రపిత్రో రభేదతః ॥
యత్ర పూర్వోత్తరే ఖండే శివస్య చరితం బహు ।
శైవమేతత్పురాణం హి పురాణజ్ఞా వదంతి చ ॥
భగవత్యాశ్చ దుర్గాయాశ్చరితం యత్ర విద్యతే ।
తత్తు భాగవతం ప్రోక్తం నను దేవ పురాణకమ్ ॥
నారదోక్తం పురాణం తు నారదీయం ప్రచక్షతే ।
యత్ర వక్తాఽ భవత్తండే మార్కండేయో మహామునిః ॥
మార్కండేయపురాణం హి తదా ఖ్యాతం చ సప్తమమ్ ।
అగ్నియోగాత్తదాగ్నేయం భవిష్యోక్తేర్భవిష్యకమ్ ॥
వివర్తనాద్బ్రహ్మణస్తు బ్రహ్మవైవర్తముచ్యతే ।
లింగస్య చరితోక్తత్వాత్పురాణం లింగముచ్యతే ॥
వరాహస్య చ వారాహం పురాణం ద్వాదశం మునే ।
యత్ర స్కందస్స్వయం శ్రోతా వక్తా సాక్షాన్మహేశ్వరః ॥
తత్తు స్కాందం సమాఖ్యాతం వామనస్య తు వామనమ్ ।
కౌర్మం కూర్మస్య చరితం మాత్స్యం మత్స్యేన కీర్తితమ్ ॥

గరుడస్తు స్వయం వక్తా యత్తద్గారుడ సంజ్ఞకమ్ ।
బ్రహ్మాండ చరితోక్త త్వాద్బ్రహ్మాండం పరికీర్తితమ్ ॥

నందికేశ్వరుడు ఇట్లు పలికెను -

ఓ తండి మునీ ! బ్రహ్మపురాణము మొదటిది. నాలుమోముల బ్రహ్మ స్వయముగా చెప్పుటచే, దానికి ఆ పేరు వచ్చినది. పద్మపురాణము రెండవది. పద్మకల్పము యొక్క మహిమ దానియందు చెప్పబడియుండుటచే, దానికి ఆ పేరు వచ్చినది. పరాశరుడు రచించిన పురాణము విష్ణువును బోధించును. తండ్రికి, పుత్రునకు భేదము లేదు గనుక, విష్ణు పురాణము వ్యాసప్రోక్తముగనే పరిగణించబడుచున్నది, పూర్వ, ఉత్తరఖండలలో అనేక శివగాథలను చెప్పిన పురాణము శివపురాణమని పౌరాణికులు చెప్పుచున్నారు. దుర్గా భగవతి యొక్క చరిత్రను బోధించు పురాణము భాగవతము. దానికి దేవీ పురాణమనియు పేరు గలదు. నారదుడు చెప్పిన పురాణము నారదపురాణము. ఓ తండ్రీ ! మార్కండేయ మహర్షి చెప్పినదీ మార్కండేయ పురాణము. అది ఏడవది. అగ్ని సంబంధము గలది అగ్నిపురాణము. భవిష్యత్తును గురించి చెప్పునది భవిష్యపురాణము. పరం బ్రహ్మ జగత్తునకు వివర్తోపాదానము అను విషయమును బోధించునది బ్రహ్మ వైవర్తపురాణము. లింగముయొక్క చరితమును చెప్పునది లింగపురాణమనబడును. ఓ మునీ ! వరాహావతారమును చెప్పే పురాణము వరాహపురాణము. ఇది పన్నెండవది. సాక్షాత్తుగా మహేశ్వరుడు చెప్పగా స్కందుడు స్వయముగా వినియున్న పురాణము స్కాందము. వామనుని చరితమును చెప్పునది వామనపురాణము. కూర్మావతారగాథను చెప్పునదీ కూర్మపురాణము. మత్స్యావతారరూపియగు భగవానుడు చెప్పినది మత్స్య పురాణము. గరుడుడు స్వయముగా చెప్పిన పురాణము గరుడ పురాణము. బ్రహ్మాండము యొక్క చరిత్రను చెప్పునది బ్రహ్మాండపురాణమని చెప్పబడినది.

సూత ఉవాచ ।

అయమేవ మయాఽ కారి ప్రశ్నో వ్యాసాయ ధీమతే ।
తతస్సర్వ పురాణానాం మయా నిర్వచనం శ్రుతమ్ ॥
ఏవం వ్యాసస్సముత్పన్నసత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాశ్చక్రే మహాభారతముత్తమమ్ ॥
పరాశరేణ సంయోగః పునశ్శంతనునా యథా ।
సత్యవత్యా ఇవ బ్రహ్మన్న సంశయితు మర్హసి ॥
సకారణేయముత్పత్తిః కథితాశ్చర్యకారిణీ ।
మహతాం చరితే చైవ గుణా గ్రాహ్యా విచక్షణేః ॥
ఇదం రహస్యం పరమం యశ్శృణోతి పఠత్యపి ।
స సర్వపాపనిర్ముక్త ఋషిలోకే మహీయతే ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం వ్యాసోత్పత్తి వర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥

సూతుడు ఇట్లు పలికెను -

నేను ధీశాలియగు వ్యాసుని ఉద్దేశించి ఇదే ప్రశ్నను వేసితిని. తరువాత నేను పురాణములన్నింటియొక్క నిర్వచనమును వింటిని. ఈ విధముగా సత్యవతి యందు పరాశరుని వలన జన్మించిన వ్యాసుడు పురాణములను, సంహితలను మరియు ఉత్తమమగు మహాభారతమును రచించెను. ఓ బ్రహ్మన్! సత్యవతికి పరాశరునితో సంయోగము ఉండగా, ఆమె శంతునునకు భార్య ఎట్లు అయినది? అను సందేహము నీకు వలదు. ఆశ్చర్యము కలిగించే ఈ వ్యాసుని జననమును కారణములతో సహా చెప్పితిని. వివేకులు మహాత్ముల చరిత్రలోని గుణములను గ్రహించవలెను. ఎవడైతే ఈ పరమరహస్యమును వినునో, మరియు పఠించునో, వాడు పాపములన్నింటినుండి విముక్తుడై మహర్షుల లోకములో మహిమను గాంచును.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు వ్యాస జననమును వర్ణించే నలుబది నాల్గవ అధ్యాయము ముగిసినది.

45 - మహాకాళీ ప్రాదుర్భావము

మునయ ఊచుః ।

శ్రుతా శంభోః కథా రమ్యా నానాఖ్యాన సమన్వితా ।
నానావతార సంయుక్తా భుక్తిముక్తి ప్రదా నృణామ్ ॥
ఇదానీం శ్రోతుమిచ్ఛామస్త్వత్తో బ్రహ్మవిదాం వర ।
చరిత్రం జగదంబాయా భగవత్యా మనోహరమ్ ॥
పరబ్రహ్మమహేశస్య శక్తిరాద్యా సనాతనీ ।
ఉమా యా సమభిఖ్యాతి త్రైలోక్య జననీ పరా ॥
సతీ హైమవతీ తస్యా అవతారద్వయం శ్రుతమ్ ।
అపరానవతారాంస్త్వం బ్రూహి సూత మహామతే ॥
కో విరజ్యేత మతిమాన్ గుణశ్రవణకర్మణి ।
శ్రీ మాతుర్ జ్ఞానినో యాని న త్యజంతి కదాచన ॥

మునులు ఇట్లు పలికిరి -

సుందరమైనది, అనేకములగు ఉపాఖ్యానములతో కూడియున్నది, అనేకములగు అవతారములతో ఒప్పారునది, మానవులకు భుక్తిని మరియు ముక్తిని ఇచ్చునది అగు శంభు చరితమును వింటిమి. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠమైనవాడా ! ఇపుడు నీ నుండి జగన్మాతయగు భగవతి యొక్క మనోహరమగు చరిత్రమును వినగోరుచున్నాము. పరబ్రహ్మయగు మహేశ్వరుని శక్తి స్వరూపిణి, సృష్టికి కారణము, సనాతని, ముల్లోకములకు తల్లి, సర్వోత్కృష్టురాలు అగు ఉమాదేవియొక్క సతీ-పార్వతీ అనే రెండు అవతారములను గురించి వింటిమి. ఓ సూతా ! నీవు మహాబుద్ధిశాలివి. మిగిలిన అవతారములను కూడ చెప్పుము. శ్రీ మాతయొక్క గుణములను వినుట అను పనిలో బుద్ధిమంతుడగు ఎవ్వానికి విరక్తి కలుగును ? జ్ఞానులు ఈ గాథలను ఎన్నడైననూ విడిచిపెట్టరు.

సూత ఉవాచ ।

ధన్యా యూయం మహాత్మానః కృతకృత్యాస్స్థ సర్వదా ।
యత్పృచ్ఛథ పరాంబాయా ఉమాయాశ్చరితం మహత్ ॥
శృణ్వతాం పృచ్ఛతాం చైవ తథా వాచయతాం చ తత్ ।
పాదాంబుజరజాంసీవ తీర్థాని మునయో విదుః ॥
తే ధన్యాః కృతకృత్యాస్స్యుర్ధన్యా తేషాం ప్రసూః కులమ్ ।
యేషాం చిత్తం భవేల్లీనం శ్రీ దేవ్యాం పరసంవిది ॥
యే న స్తువంతి దేవేశీం సర్వకారణ కారణామ్ ।
మాయాగుణైర్మోహితాస్స్యుర్హత భాగ్యా న సంశయః ॥
న భజంతి మహాదేవీం కరుణారసస సాగరామ్ ।
అంధకూపే పతంత్యేతే ఘోరే సంసారరూపిణి ॥

గంగాం విహాయ తృష్ణ్యర్థం మరువారి యథా వ్రజేత్ ।
విహాయ దేవీం తద్భిన్నం తథా దేవాంతరం వ్రజేత్ ॥
యస్యాస్స్మరణ మాత్రేణ పురుషార్థ చతుష్టయమ్ ।
అనాయాసేన లభతే కస్త్యజేత్తాం నరోత్తమః ॥
ఏతత్పృష్టః పురా మేధస్సురథేన మహాత్మనా ।
యదుక్తం మేధసా పూర్వం తచ్ఛృణుష్వ వదామి తే ॥
స్వారో చిషేంతరే పూర్వం విరథో నామ పార్థివః ।
సురథస్తస్య పుత్రోఽ భూన్మహా బలపరాక్రమః ॥
దానశౌండస్సత్యవాదీ స్వధర్మకుశలః కృతీ ।
దేవీభక్తో దయాసింధుః ప్రజానాం పరిపాలకః ॥

సూతుడిట్లు పలికెను :

మహాత్ములగు మీరు ధన్యులు. మీరు సర్వకాలములలో కృతకృత్యులై యున్నారు. ఏలయనగా, మీరు సర్వజగన్మాతయగు ఉమాదేవియొక్క గొప్ప చరిత్రమును గురించి ప్రశ్నించినారు. ఉమా చరితము వినువారిని, ప్రశ్నించువారిని, చెప్పించువారిని కూడ ఆమె పాదపద్మములయందలి ధూళివలె పావనము చేయునని మహర్షులు చెప్పుచున్నారు. ఎవరి మనస్సు పరమచైతన్యస్వరూపిణియగు శ్రీదేవియందు లీనమగునో, వారే ధన్యులు, కృతార్థులు అగుదురు. వారి కులము మరియు సంతానము కూడ ధన్యమగును. ఎవరైతే కారణములన్నింటికీ కారణమగు ఆ దేవదేవిని స్తుతించరో, వారు మాయయొక్క గుణములచే మోహమును పొంది నష్టభాగ్యులగుదురనుటలో సందేహము లేదు, కరుణారసమునకు నిధియగు ఆ మహాదేవిని ఎవరైతే సేవించరో, వారు భయంకరమగు సంసారమనే చీకటి నూతిలో పడేదరు. దేవిని విడిచిపెట్టి మరియొక దైవము నాశ్రయించుట, గంగను విడిచిపెట్టి దాహశాంతి కొరకై ఎండమావుల నీటిని ఆశ్రయించుట వంటిది యగును. ఏ దేవిని స్మరించుట మాత్రముచే నాలు పురుషార్థములు అనాయాసముగా సిద్ధించునో, అట్టి దేవిని ఉత్తముడగు ఏ మానవుడు విడిచిపెట్టును ? పూర్వము మహాత్ముడగు సురథుడు మేధసుని ఇదే విధముగా ప్రశ్నించగా, ఆ మేధసుడు చెప్పిన విషయమును నీకు చెప్పుచున్నాను. వినుము. పూర్వము స్వారోచిషమన్వంతరములో విరథుడనే రాజు ఉండెను. ఆయనకు గొప్ప బలపరాక్రమములు గల సురథుడనే పుత్రుడు ఉండెను, దానములో నిపుణుడు, సత్యమును పలుకువాడు, స్వధర్మములో నేర్పరి, సమర్థుడు, దేవీభక్తుడు, దయాసముద్రుడు అగు ఆ రాజు ప్రజలను చక్కగా పాలించుచుండెను.

పృథివీం శాసతస్తస్య పాకశాసనతేజసః ।

బభూవుర్నవ యే భూపాః పృథివీగ్రహణ తత్పరాః ॥

కోలానామ్నీం రాజధానీం రురుధుస్తస్య భూపతేః ।

తైస్సమం తుములం యుద్ధం సమపద్యత దారుణమ్ ॥

యుద్ధే స నిర్జితో భూపః ప్రబలైస్తైర్విపక్షగణైః ।

ఉజ్జాసితశ్చ కోలాయా హత్వా రాజ్యమశేషతః ॥

స రాజా స్వపురీమేత్యాకరో ద్రాజ్యం స్వమంత్రిభిః ।

తత్రాపి చ మహాపక్షైర్విపక్షిక్షైస్స పరాజితః ॥

దైవాచ్ఛత్రుత్వమాపన్నైరమాత్య ప్రముఖైర్గణైః ।

కోశస్థితం చ యద్విత్తం తత్సర్వం చాత్మసాత్కృతమ్ ॥

తతస్స నిర్గతో రాజా నగరాన్మృగయాఛలాత్ ।

అసహాయోఽశ్వమారుహ్య జగామ గహనం వనమ్ ॥

ఇతస్తతస్తత్ర గచ్ఛన్ రాజా మునివరాశ్రమమ్ ।

దదర్శ కుసుమారామభ్రాజితం సర్వతో దిశమ్ ॥

వేదధ్వని సమాకీర్ణం శాంతజంతు సమాశ్రితమ్ ।

శిష్యైః ప్రశిష్యైస్తచ్ఛిష్యై సమంతాత్పరి వేష్టితమ్ ॥

వ్యాఘ్రాదయో మహావీర్యా అల్పవీర్యాన్మహామతే ।

తదా శ్రమే న బాధంతే ద్విజవర్య ప్రభావతః ॥

ఉవాస తత్ర నృపతిర్మహాకారుణికో బుధః ।

సత్కృతో మునినాథేన సువచో భోజనాసనైః ॥

ఇంద్రుని వంటి తేజశ్శాలియగు ఆ రాజు భూమిని పాలించుచుండెను. ఇంతలో తొమ్మిది మంది రాజులు పరరాజ్యములను ఆక్రమించుటలో నిమగ్నమై యుండిరి. వారు ఆ మహారాజుయొక్క రాజధానియగు కోలానగరమును ముట్టడించిరి. వారితో ఆయనకు దారుణమగు సంకులసమరము జరిగెను. ఆ రాజు అధిక బలశాలురగు ఆ శత్రుమూకల చేతిలో ఓడిపోయెను. వారు ఆయన రాజ్యమునంతనూ అపహరించి కోలానగరమునుండి తరిమివేసిరి. ఆ రాజు అపుడు తన నగరమునకు వచ్చి తన మంత్రులతో గూడి రాజ్యమునేలుచుండెను. అక్కడ కూడ పెద్ద సైన్యము గల శత్రువులాయనను ఓడించిరి, విధివశముచే ఆయనకు మంత్రులు మరియు ఇతర అధికారులు శత్రువులై కోశాగారములోని ధనమునంతనూ స్వంతము చేసుకొనిరి. అపుడు నిస్సహాయుడగు ఆ రాజు వేటఅనే మిషచే నగరమునుండి గుర్రమునెక్కి బయటకు వచ్చి దట్టమైన అడవిలోనికి ప్రవేశించెను. ఆ రాజు ఇటునటు తిరుగుచూ, పుష్పోద్యానములతో అన్నిదిక్కులయందు ప్రకాశించునది, వేదధ్వనితో మారుమ్రోగుచున్నది, శాంతముగా నున్న జంతువులకు ఆశ్రయమైనది, శిష్యులచే వారి శిష్యులచే మరియు వారి శిష్యులచే అంతటా చుట్టువారబడియున్నది అగు ఒక మహర్షియొక్క ఆశ్రమమును చూచెను. ఓ మహాబుద్ధిశాలీ! ఆ మహర్షియొక్క మహిమ వలన ఆయన ఆశ్రమములో పెద్ద పులి మొదలైన మహాబలము గల

జంతువులు తక్కువ బలము గల జంతువులను బాధించుట లేదు. గొప్ప దయాశాలి, పండితుడు అగు ఆ రాజును మహర్షి మంచిమాటలతో ఆసనమునిచ్చి భోజనమునిగి సత్కరించెను. ఆ రాజు అచటనే నివసించెను.

ఏకదా స మహారాజశ్చింతామాప దురత్యయామ్ ।
అహో మే హీనభాగ్యస్య దుర్బుద్ధేర్హీనతేజసః ॥
హృతం రాజ్యమశేషేణ శత్రువర్గైర్మదోద్ధతైః ।
మత్పూర్వై రక్షితం రాజ్యం శత్రుభిర్భుజ్యతేఽ ధునా ॥
మాదృశశ్చైత్రవంశేస్మిన్న కోప్యాసీ న్మహీపతిః ।
కిం కరోమి క్వ గచ్ఛామి కథం రాజ్యం లభేమహి ॥
అమాత్యా మంత్రిణశ్చైవ మామకా యే సనాతనాః ।
న జానే కం చ నృపతిం సమాసాద్యాధునాసతే ॥
వినాశ్య రాజ్యమధునా న జానే కాం గతిం గతాః ।
రణభూమి మహోత్సాహా అరివర్గనికర్తనాః ॥
మామకా యే మహాశూరా నృపమన్యం భజంతి తే ।
పర్వతాభా గజా అశ్వా వాతవద్వేగ గామినః ॥
పూర్వపూర్వార్జితః కోశః పాల్యతే తైర్న వాధునా ।
ఏవం మోహవశం యాతో రాజా పరమధార్మికః ॥
ఏతస్మిన్నంతరే తత్ర వైశ్యః కశ్చిత్సమాగతః ।
రాజా పప్రచ్ఛ కస్త్వం భోః కిమర్థమిహ చాగతః ॥
దుర్మనా లక్ష్యసే కస్మాదేతన్మే బ్రూహి సాంప్రతమ్ ।
ఇత్యాకర్ణ్య వచో రమ్యం నరపాలేన భాషితమ్ ॥
దృగ్భ్యాం విముంచన్నశ్రూణి సమాధిర్వైశ్య పుంగవః ।
ప్రత్యువాచ మహీపాలం ప్రణయావనతాం గిరమ్ ॥

ఒకనాడు ఆ మహారాజు అతిక్రమించ శక్యము కాని మానసిక దుఃఖమును పొందెను. అయ్యో ! నేను మందభాగ్యుడను. దుష్టబుద్ధిని, క్షీణించిన తేజస్సుగలవాడను అగు నా రాజ్యమునంతనూ బలముచే గర్వించియున్న శత్రువుల మూకలు అపహరించినవి. నా పూర్వీకులచే పాలించబడిన రాజ్యమును ఈనాడు శత్రువులు అనుభవించుచున్నారు. ఈ చైత్రవంశములో నా వంటి రాజు మరియొకడు లేడు. నేనేమి చేయుదును ? ఎచటకు పోయెదను ? రాజ్యమును ఎట్లు పొందెదను ? పూర్వతరములనుండి వచ్చుచున్న నా మంత్రులు, సలహాదారులు ఇపుడు ఏ రాజును ఆశ్రయించియున్నారో నాకు తెలియకున్నది. రాజ్యమును నశింపజేసిన ఆ మంత్రులు ఇపుడు ఏ గతిని పొందినారో నాకు తెలియదు. యుద్ధభూమిలో గొప్ప ఉత్సాహమును చూపి శత్రు మూకలను దునుమాడే మహాశూరులగు నా సైనికులు ఇపుడు మరియొక రాజును సేవించుచున్నారు. నా ఏనుగులు పర్వతములవంటివి. గుర్రములు గాలితో సమముగా పరుగెత్తేవి. పూర్వజులగు రాజులచే సంపాదించబడిన ఖజానా ఇపుడు

సురక్షితముగా ఉన్నదో ? లేదో ? పరమధర్మాత్ముడగు ఆ రాజు ఈ విధముగా, మోహమునకు వశుడై యుండెను. ఇంతలో అచటకు ఒక వైశ్యుడు విచ్చేసెను. రాజు ఆయనను ఇట్లు ప్రశ్నించెను : అయ్యా ! మీరెవరు? ఇచటకు ఏల వచ్చిరి ? మీ మనస్సు ప్రసన్నముగా లేదని మీ ముఖమును బట్టి తెలియుచున్నది. ఆ విషయమును నాకిపుడు చేప్పుడు. ఆ మహారాజు పలికిన ఈ మధురమగు మాటలను విని, కన్నుల వెంబడి నీటిని గార్చుచూ, సమాధియను పేరుగల ఆ వైశ్యోత్తముడు ప్రేమ పూర్వకముగా సవినయముగా ఆ రాజుతో నిట్లనెను.

వైశ్య ఉవాచ ।

సమాధిర్నామ వైశ్యోఽహం ధనివంశ సముద్భవః ।
పుత్రదారాదిభిస్త్యక్తో ధనలో భాన్మహీపతే ॥
వనమభ్యాగతో రాజన్ దుఃఖితస్స్వేన కర్మణా ।
సోహం పుత్రప్రపౌత్రాణాం కలత్రాణాం తథైవ చ ॥
భ్రాతౄణాం భ్రాతృపుత్రాణాం పరేషాం సుహృదాం తథా ।
న వేద్మి కుశలం సమ్యక్ కరుణాసాగర ప్రభో ॥

వైశ్యుడు ఇట్లు పలికెను –

నేను వైశ్యుడను. నా పేరు సమాధి. నేను ధనికుల వంశములో పుట్టినాను. ఓ రాజా ! ధనమునందలి లోభముచే నన్ను పుత్రులు, భార్య మొదలగు వారు విడిచిపెట్టినారు. ఓ రాజా ! నేను చేసిన కర్మచే దుఃఖితుడనై అడవికి వచ్చితిని. ఓ ప్రభూ ! నీవు దయాసముద్రుడవు. అట్టి నాకు పుత్రులు, పౌత్రులు, భార్య, సోదరులు, వారి పుత్రులు మరియు ఇతరులగు మిత్రులు అను వారి క్షేమ సమాచారము చక్కగా తెలియకున్నది.

రాజోవాచ ।

నిష్కాసితో యైః పుత్రాద్యైర్దుర్వృత్తైర్ధన గర్ధిభిః ।
తేషు కిం భవతా ప్రీతిః క్రియతే మూర్ఖజంతువత్ ॥

రాజు ఇట్లు పలికెను –

ఏ పుత్రుడు మొదలగు వారు ధనమందలి లోభముచే దుష్టచేష్టులై నిన్ను నెట్టిటివేసినారో, వారియందు నీవు మూర్ఖప్రాణి వలె ఇంకనూ ప్రీతిని ఏల కలిగియున్నావు ?

వైశ్య ఉవాచ ।

సమ్యగుక్తం త్వయా రాజన్ వచస్సారార్థ బృంహితమ్ ।
తథాపి స్నేహపాశేన మోహ్యతేఽతీవ మే మనః ॥
ఏవం మోహాకులౌ వైశ్యపార్థివౌ మునిసత్తమ ।
జగ్మతుర్మునివర్యస్య మేధసస్సన్నిధిం తదా ॥
స వైశ్యరాజ సహితో నరరాజః ప్రతాపవాన్ ।
ప్రణనామ మహాధీర శ్శిరసా యోగినాం వరమ్ ॥
బద్ధ్వాంజలిమిమాం వాచమువాచ నృపతిర్మునిమ్ ।
భగవన్నావయోర్మోహం ఛేత్తుమర్హసి సాంప్రతమ్ ॥
అహం రాజశ్రియా త్యక్తో గహనం వనమాశ్రితః ।
తథాపి హృతరాజ్యస్య తోషో నైవాభిజాయతే ॥
అయం చ వైశ్య స్స్వజనైర్దారాద్యైరిష్కృతో గృహాత్ ।
తథాపేతస్య మమతా న నివృత్తిం సమశ్నుతే ॥
కిమత్ర కారణం బ్రూహి జ్ఞానినోరపి నో మనః ।
మోహేన వ్యాకులం జాతం మహత్యేషా హి మూర్ఖతా ॥

వైశ్యుడు ఇట్లు పలికెను -

ఓ రాజా ! నీవు సారవంతమగు అర్థముతో నిండియున్న వచనమును చక్కగా చెప్పితివి. అయిననూ, నా మనస్సు అనురాగము అను పాశముచే బంధింపబడి తీవ్రమగు మోహమునకు వశమై యున్నది. ఓ మహర్షీ ! ఈ విధముగా మోహవశులై దుఃఖితులై యున్న ఆ వైశ్యుడు మరియు రాజు మేధసుడు అనే మహర్షి వద్దకు ఆ సమయములో వెళ్లిరి. ప్రతాపము గలవాడు, గొప్ప వివేకి అగు ఆ మహారాజు వైశ్య శ్రేషునితో గూడినవాడై యోగివర్యుడగు ఆ మేధసునకు తలవంచి ప్రణమిల్లెను. ఆ రాజు చేతులను జోడించి మహర్షితో నిట్లనెను. ఓ పూజ్యా ! నీవు ఇపుడు మా యిద్దరి మోహమును నిర్మూలించదగును. నేను రాజ్యలక్ష్మినీ పోగొట్టుకోని దట్టమగు అడవుల పాలైతిని. అయిననూ, రాజ్యము అపహరింపబడిన నాకు సంతోషము లేశమైననూ కలుగుట లేదు. ఈ వైశ్యుని భార్య మొదలగు స్వీయజనులు ఇంటినుండి వెళ్లగొట్టిరి. అయిననూ, ఈతనికి స్వజనుల యందలి మమకారము తగ్గుట లేదు. దీనికి కారణమేమి ? చెప్పుడు. వివేకము గలవారమే అయినా మా మనస్సులు మోహమునకు వశమై దు:ఖితమై యున్నవి. ఈ మూర్ఖత చాల బలీయమైనది.

ఋషిరువాచ ।

మహామాయా జగద్ధాత్రీ శక్తి రూపా సనాతనీ ।
సా మోహయతి సర్వేషాం సమాకృష్య మనాంసి వై ॥
బ్రహ్మాదయస్సురాస్సర్వే యన్మాయామోహితాః ప్రభో ।
న జానంతి పరం తత్త్వం మనుష్యాణాం చ కా కథా ॥
సా సృజత్యఖిలం విశ్వం సైవ పాలయతీతి చ ।
సైవ సంహరతే కాలే త్రిగుణా పరమేశ్వరీ ॥
యస్యోపరి ప్రసన్నా సా వరదా కామరూపిణీ ।
స ఏవ మోహమత్యేతి నాన్యథా నృపసత్తమ ॥

ఋషి ఇట్లు పలికెను –

జగన్మాత, శక్తి స్వరూపిణి, ఆద్యంతములు లేనిది అగు ఆ మహామాయ సర్వుల మనస్సులను బలముగా ఆకర్షించి మోహపెట్టుచున్నది. ఓ రాజా ! ఆ మాయచే మోహితులైన బ్రహ్మ మొదలగు దేవతలందరు కూడ పరమతత్త్వమును తెలియకున్నారు. ఇక మానవుల గురించి చెప్పునదేమున్నది ? త్రిగుణాత్మికయగు ఆ పరమేశ్వరియే జగత్తునంతనూ సృష్టించి, పాలించి, కాలము వచ్చినప్పుడు సంహరించును. వరములనిచ్చునది, తనకు నచ్చిన రూపమును స్వీకరించునది అగు. ఆ మాయ ఎవనిపై ప్రసన్నురాలగునో, వాడు మాత్రమే మోహమునతిక్రమించును. ఓ మహారాజా ! మరియొక ఉపాయము లేదు.

రాజోవాచ ।

కా సా దేవీ మహామాయా యా చ మోహయతేఽఖిలాన్ ।
కథం జాతా చ సా దేవీ కృపయా వద మేమునే ॥

రాజు ఇట్లు పలికెను –

సర్వులను మోహింపజేసే ఆ మహామాయాదేవి ఎవరు ? ఆ దేవి ఎట్లు జన్మించినది? ఓ మునీ ! దయచేసి నాకు ఈ విషయమును చెప్పుము.

ఋషిరువాచ ।

జగత్యేకార్ణవే జాతే శేషమాస్తీర్య యోగరాట్ ।
యోగనిద్రాముపాశ్రిత్య యదా సుష్వాప కేశవః ॥
తదా ద్వావసురౌ జాతౌ విష్ణోః కర్ణమలేన వై ।
మధుకైటభనామానౌ విఖ్యాతౌ పృథివీతలే ॥
ప్రలయార్క ప్రభౌ ఘోరౌ మహాకాయౌ మహాహనూ ।
దంష్ట్రాకరాలవదనౌ భక్షయంతౌ జగంతి వా ॥
తౌ దృష్ట్వా భగవన్నాభిపంకజే కమలాసనమ్ ।
హననాయోద్యతావాస్తాం కస్త్వం భోరితి వాదినౌ ॥

సమాలోక్య తు తౌ దైత్యౌ సురజ్యేష్ఠో జనార్దనమ్ ।

శయానం చ పయోంభోధౌ తుష్టావ పరమేశ్వరీమ్ ॥

ఋషి ఇట్లు పలికెను –

జగత్తు అంతయూ జలమయమే ఉండగా, యోగీశ్వరుడగు విష్ణువు శేషునిపై పరుండి యోగనిద్రలో నుండెను. అపుడు విష్ణువుయొక్క చెవిలోని మాలిన్యము నుండి ఇద్దరు రాక్షసులు జన్మించిరి. వారికి భూలోకములో మధుకైటభులను ప్రసిద్ధి కలిగెను. ప్రళయకాలసూర్యుని వలె ప్రకాశిస్తూ కోరలు గల ముఖములతో భయమును గొల్పువారు, పెద్ద దేహములు గలవారు, పెద్ద నోళ్లను తెరచి జగత్తులను భక్షించెదరో యన్నట్లు ఉన్న ఆ ఇద్దరు విష్ణుభగవానుని నాభినుండి పుట్టిన పద్మమునందు ఉపవిష్టుడై యున్న బ్రహ్మను చూచి, 'ఓరీ ! నీవెవరు ?' అని పలికి ఆయనను సంహరించుటకు సిద్ధపడుచుండిరి. దేవతలలో మొదటివాడగు బ్రహ్మ ఆ రాక్షసులిద్దరినీ చూచి, దుష్టజనసంహారకుడగు విష్ణువు సముద్రమునందు నిద్రించుచుండుటను గాంచి, పరమేశ్వరిని స్తుతించెను.

బ్రహ్మోవాచ ।

రక్ష రక్ష మహామాయే శరణాగతవత్సలే ।

ఏతాభ్యాం ఘోరరూపాభ్యాం దైత్యాభ్యాం జగదంబికే ॥

ప్రణమామి మహామాయాం యోగనిద్రాముమాం సతీమ్ ।

కాలరాత్రిం మహారాత్రిం మోహరాత్రిం పరాత్పరామ్ ॥

త్రిదేవజననీం నిత్యం భక్తాభీష్ట ఫలప్రదామ్ ।

పాలినీం సర్వదేవానాం కరుణా వరుణాలయామ్ ॥

త్వత్ప్ర భావాదహం బ్రహ్మా మాధవో గిరిజాపతిః ।

సృజత్యవతి సంసారం కాలే సంహరతీతి చ ॥

త్వం స్వాహా త్వం స్వధా త్వం హ్రీస్త్వం బుద్ధిర్విమలా మతా ।

తుష్టిః పుష్టిస్త్వమేవాంబ శాంతిః క్షాంతిః క్షుధా దయా ॥

విష్ణుమాయా త్వమేవాంబ త్వమేవ చేతనా మతా ।

త్వం శక్తిః పరమా ప్రోక్తా లజ్జా తృష్ణా త్వమేవ చ ॥

భ్రాంతిస్త్వం స్మృతిరూపా త్వం మాతృరూపేణ సంస్థితా ।

త్వం లక్ష్మీర్భవనే పుంసాం పుణ్యాచార ప్రవర్తినామ్ ॥

త్వం జాతిస్త్వం మతా వృత్తిర్వ్యాప్తిరూపా త్వమేవ హి ।

త్వమేవ చిత్తిరూపేణ వ్యాప్య కృత్స్నం ప్రతిష్ఠితా ॥

సా త్వమేతౌ దురాధర్షావసురౌ మోహయాంబికే ।

ప్రబోధయ జగద్యోనే నారాయణమజం విభుమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహామాయా ! రక్షించుము. ఓ జగన్మాతా ! శరణు పొందిన వారియందు మాతృప్రేమను చూపే నీవు భయంకరాకారులగు ఈ రాక్షసుల బారినుండి నన్ను రక్షించుము. యోగనిద్రాస్వరూపురాలు, పార్వతీ సతీ రూపములను దాల్చినదీ, మహాప్రళయస్వరూపురాలు, ప్రళయ కాలరాత్రి స్వరూపురాలు, మోహమనే చీకటిని కలిగించునది, సర్వకారణములకు కారణమైనది, ముల్లోకములకు తల్లి, నిత్యురాలు, భక్తులు కోరిన ఫలములనిచ్చునది, దేవతలనందరినీ రక్షించునది, కరుణాసముద్రము అగు మహామాయను ప్రణమిల్లుచున్నాను. నీ ప్రభావముచే బ్రహ్మనగు నాచే సృష్టింపబడి, విష్ణువుచే రక్షింపబడే జగత్తును కాలము వచ్చినప్పుడు పార్వతీపతియగు రుద్రుడు సంహరించుచున్నాడు. దేవతలకు హవిస్సుల నర్పించే స్వాహాకారము నీవే. పితరులకు పిండములనర్పించే స్వధాకారము నీవే. వినయము నీవే. జ్ఞానుల స్వచ్ఛమగు బుద్ధి నీవేనని మహర్షులు చెప్పుచున్నారు. ఓ తల్లీ ! సంతోషము, పుష్టి, శాంతి, సహనము, ఆకలి, దయ నీ స్వరూపమే. ఓ తల్లీ ! విష్ణుమాయవు నీవే. చైతన్యము నీవేనని చెప్పబడినది. పరమశక్తివి నీవేనని మహర్షులు చెప్పుచున్నారు. కులస్త్రీ లలోని సిగ్గు, ప్రాణులలోని తృష్ణ నీ స్వరూపమే. భ్రాంతి, స్మృతి కూడ నీ స్వరూపములే. తల్లి రూపములో నీవే ఉన్నావు. పుణ్య కర్మలను చేయువారి ఇంటిలోని సంపద నీవే. జాతి (పుట్టుక) నీవే. మనోవృత్తి నీవే. వ్యాప్తి నీ స్వరూపమే. సర్వమును నీవు చైతన్య రూపములో వ్యాపించి ఉనికిని ప్రసాదించుచున్నావు. అట్టి నీవు జయింప శక్యము కాని ఈ రాక్షసులను మోహింప జేయుము. ఓ తల్లీ ! జగత్కారణము నీవే. పుట్టుక లేని వాడు, సర్వవ్యాపకుడు అగు ఈ నారాయణుని నీవు మేల్కొలుపుము.

ఋషిరువాచ ।

బ్రహ్మణా ప్రార్థితా సేయం మధుకైటభనాశనే ।
మహావిద్యా జగద్ధాత్రీ సర్వవిద్యాధిదేవతా ॥
ద్వాదశ్యాం ఫాల్గునస్యైవ శుక్లాయాం సమభూన్నృప ।
మహాకాలీతి విఖ్యాతా శక్తి స్త్రైలోక్య మోహినీ ॥
తతోఽ భవద్వియద్వాణీ మా భైషీః కమలాసన ।
కంటకం నాశయామ్యద్య హత్వాజౌ మధుకైటభౌ ॥
ఇత్యుక్త్వా సా మహామాయా నేత్రవక్త్రాదితో హరేః ।
నిర్గమ్య దర్శనే తస్థౌ బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ॥
ఉత్తస్థౌ చ హృషీకేశో దేవదేవో జనార్దనః ।
స దదర్శ పురో దైత్యౌ మధుకైటభసంజ్ఞకౌ ॥
తాభ్యాం ప్రవవృతే యుద్ధం విష్ణోరతుల తేజసః ।
పంచవర్ష సహస్రాణి బాహుయుద్ధమభూత్తదా ॥
మహామాయా ప్రభావేణ మోహితౌ దానవోత్తమౌ ।
జజల్పతూ రమాకాంతం గృహాణ వరమీప్సితమ్ ॥

ఋషి ఇట్లు పలికెను –

ఋషి ఇట్లు పలికెను -

బ్రహ్మ విద్యాస్వరూపురాలు, సర్వవిద్యలకు అధిష్టానదైవము అగు ఆ జగన్మాత ఈ విధముగా మధుకైటభుల వినాశము కొరకై బ్రహ్మచే ప్రార్థించబడి, ఫాల్గున శుద్ధ దశమినాడు ఆవిర్భవించెను. ఓ రాజా ! ముల్లోకములను మోహింపజేయు ఆ శక్తి మహాకాళియను పేరుతో ప్రఖ్యాతిని గాంచెను. అపుడు, 'బ్రహ్మ ! నీవు భయపడకుము. ఇపుడు యుద్ధములో మధుకైటభులను సంహరించి నీ కష్టమును తొలగించెదను' అని ఆకాశవాణి పలికెను. ఆ మహామాయ ఇట్లు పలికి, అవ్యక్త ప్రకృతికి అధిష్టానమగు ఈశ్వరునినుండి జన్మించిన బ్రహ్మకు దర్శనమునిచ్చెను. ఆమె విష్ణువుయొక్క కన్నులు, ముఖము మొదలగు వాటినుండి బయటకు వచ్చెను. ఇంద్రియాధిపతి, దేవదేవుడు, దుష్టజనసంహారకుడు అగు విష్ణువు లేచి నిలబడి ఎదురుగా మధుకైటభులను పేరు గల రాక్షసులను చూచెను. సాటిలేని తేజస్సు గల విష్ణువునకు వారితో యుద్ధము ఆరంభమాయెను. అపుడు ఆయన ఐదువేల సంవత్సరములు చేతులతో యుద్ధమును చేసెను. మహామాయయొక్క ప్రభావముచే మోహమును పొందిన ఆ దానవ శ్రేష్ఠులు లక్ష్మీపతియగు విష్ణువుతో, 'నీకు నచ్చిన వరమును కోరుకొనుము' అని పలికిరి.

నారాయణ ఉవాచ ।

మయి ప్రసన్నౌ యది వాం దీయతామేష మే వరః ।

మమ వధ్యావుభౌ నాన్యం యువా భ్యాం ప్రార్థయే వరమ్ ॥

నారాయణుడు ఇట్లు పలికెను -

మీరిద్దరు నాయందు ప్రసన్నులైనచో, నాకు ఈ వరమునిచ్చెదరు గాక ! మీరు ఇద్దరు నా చేతిలో మరణించవలెను. నేను మీ నుండి మరియొక వరమును కోరుట లేదు.

ఋషిరువాచ ।

ఏకార్ణవాం మహీం దృష్ట్వా ప్రోచతుః కేశవం వచః ।
ఆవాం జహి న యత్రాసౌ ధరణీ పయసాఽఽప్లుతా ॥
తథాస్తు ప్రోచ్య భగవాంశ్చ క్రముత్థాయ సూజ్వలమ్ ।
చిచ్ఛేద శిరసీ కృత్వా స్వకీయ జఘనే తయోః ॥
ఏవం తే కథితో రాజన్ కాలికాయాస్సముద్భవః ।
మహాలక్ష్మ్యాస్తథోత్పత్తిం నిశామయ మహామతే ॥
నిర్వికారాది సాకారా నిరాకారాది దేవ్యుమా ।
దేవానాం తాపనాశార్థం ప్రాదురాసీద్యుగే యుగే ॥
యదిచ్ఛా వైభవం సర్వం తస్యా దేహగ్రహః స్మృతః ।
లీలయా సాపి భక్తానాం గుణవర్ణన హేతవే ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే ఉమాసంహితాయాం మహాకాళికావతారవర్ణనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥

ఋషి ఇట్లు పలికెను –

భూమి అంతయు నీటితో నిండియుండుటను చూచి వారిద్దరు కేశవునితో, 'ఈ భూమి నీటియందు మునగకుండా తేలియున్న స్థలములో మమ్ములను సంహరించుము' అని పలికిరి. విష్ణుభగవానుడు 'అటులనే యగుగాక !' అని పలికి మిక్కిలి ప్రకాశించే చక్రమును పైకెత్తి వారిద్దరి శిరస్సులను తన ఒడిలో పెట్టుకొని నరికెను. ఓ రాజా ! ఈ తీరున కాళీ ప్రాదుర్భావమును నీకు చెప్పితిని. ఓ మహా బుద్ధిశాలీ! అదే విధముగా మహాలక్ష్మీప్రాదుర్భావమును కూడ వినుము. ఉమాదేవి వికారములు, ఆకారము మొదలగునవి లేనిదే అయిననూ, దేవతల దుఃఖమును పోగొట్టుట కొరకై ప్రతియుగములో ఆవిర్భవించెను. ఆ దేవి భక్తులు తన గుణములను వర్ణించే అవకాశమును కల్పించుట కొరకై లీలచే అవతారములను దాల్చుచుండునని మహర్షులు చెప్పిరి. ఈ జగత్తు అంతయు ఆమె యొక్క ఇచ్ఛాశక్తి విలాసము మాత్రమే. "

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మహాకాళీప్రాదుర్భావమును వర్ణించే నలుబది అయిదవ అధ్యాయము ముగిసినది.

46 – మహిషాసుర వధ

ఋషిరువాచ ।

ఆసీద్రంభాసురో నామ దైత్యవంశ శిరోమణిః ।
తస్మాజ్జాతో మహాతేజా మహిషో నామ దానవః ॥
స సంగ్రామే సురాన్ సర్వాన్ నిర్జిత్య దనుజాధిపః ।
చకార రాజ్యం స్వర్లోకే మహేంద్రాసన సంస్థితః ॥
పరాజితాస్తతో దేవా బ్రహ్మాణం శరణం యయుః ।
బ్రహ్మాపి తాన్ సమాదాయ యయౌ యత్ర వృషాకపీ ॥
తత్ర గత్వా సురాస్సర్వే నత్వా శంకరకేశవౌ ।
స్వవృత్తం కథయామాసుర్యథావదను పూర్వశః ॥
భగవంతౌ వయం సర్వే మహిషేణ దురాత్మనా ।
ఉజ్జాసితాశ్చ స్వర్లో కాన్నిర్జిత్య సమరాంగణే ॥
భ్రమామో మర్త్యలోకేఽ స్మిన్న లభేమహి శం క్వచిత్ ।
కాం కాం న దుర్దశాం నీతా దేవా ఇంద్రపురోగమాః ॥
సూర్యచంద్రమసౌ పాశీ కుబేరో యమ ఏవ చ ।
ఇంద్రాగ్నీ వాతగంధర్వా విద్యాధరసుచారణాః ॥
ఏతేషామపరేషాం చ విధేయం కర్మ సోఽసురః ।
స్వయం కరోతి పాపాత్మా దైత్యపక్ష భయంకర ॥
తస్మాచ్ఛరణమాపన్నాన్ దేవాన్న స్త్రాతుమర్హథః ।
వధోపాయం చ తస్యాశు చింతయేథాం యువాం ప్రభూ ॥
ఇతి దేవవచశ్శ్రుత్వా దామోదర సతీశ్వరౌ ।
చక్రతుః పరమం కోపం రోషాఘూర్ణితలోచనౌ ॥

ఋషి ఇట్లు పలికెను –

రాక్షసవంశములో శ్రేష్ఠుడగు రంభుడనే రాక్షసుడు ఉండెను. వానికి మహాతేజశ్శాలియగు మహిషాసురుడనే పుత్రుడు ఉండెను. ఆ రాక్షసరాజు యుద్ధములో దేవతలనందరినీ ఓడించి స్వర్గలోకములో మహేంద్రుని ఆసనముపై స్థిరముగా కూర్చుండి రాజ్యమునేలెను. అపుడు పరాజయమును పొందియున్న దేవతలు బ్రహ్మను శరణుజొచ్చిరి. బ్రహ్మ వారిని దోడ్కొని విష్ణువు, శివుడు ఉన్న స్థానమునకు వెళ్లెను. దేవతలందరు అచటకు వెళ్లి శివవిష్ణువులకు నమస్కరించి తమ వృత్తాంతమును ఉన్నది ఉన్నట్లుగా సరియగు క్రమములో చెప్పిరి. ఓ భగవానులారా ! దుర్బుద్ధియగు మహిషుడు మమ్ములనందరినీ యుద్ధరంగములో జయించి స్వర్గలోకమునుండి వెళ్లగొట్టినాడు. మేము ఈ మనుష్యలోకములో తిరుగాడుచున్నాము. మాకు ఎక్కడైననూ సుఖము లభించుట లేదు. ఇంద్రుడు మొదలగు దేవతలు పొందని దుర్దశ ఏమి గలదు ? సూర్యచంద్రులు, వరుణుడు, కుబేరుడు, యముడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, గంధర్వులు, విద్యాధరులు,

చారణులు మొదలగు వారిచే చేయబడదగిన కర్మలను పాపాత్ముడగు ఆ రాక్షసుడు స్వయముగా చేయుచున్నాడు. రాక్షస పక్షమునకు భయమును కలిగించు ఓ దేవా ! కావున శరణు పొందిన మా దేవతలను మీరిద్దరు రక్షించదగుదురు. మీరిద్దరు ప్రభువులు శీఘ్రముగా వానిని వధించే ఉపాయమును ఆలోచించుడు, దేవతల ఈ వచనములను విని శివవిష్ణువులిద్దరు అధికమగు కోపమును పొందిరి. వారి కన్నులు కోపముచే తిరుగుచుండెను.

తతోఽతి కోపపూర్ణస్య విష్ణోశ్శంభోశ్చ వక్త్రతః ।
తథాన్యేషాం చ దేవానాం శరీరాన్నిర్గతం మహః ॥
అతీవ మహసః పుంజం జ్వలంతం దశదిక్షు చ ।
అపశ్యంస్త్రి దశాస్సర్వే దుర్గాధ్యాన పరాయణాః ॥
సర్వదేవశరీరోత్థం తేజస్తదతి భీషణమ్ ।
సంఘీభూయా భవన్నారీ సాక్షాన్మహిషమర్దినీ ॥
శంభుతేజస ఉత్పన్నం ముఖమస్యాస్సు భాస్వరమ్ ।
యామ్యేన బాలా అభవన్ వైష్ణవేన చ బహవః ॥
చంద్రమస్తేజసా తస్యాస్తనయుగ్మం వ్యజాయత ।
మధ్యమైంద్రేణ జంఘోరూ వారుణేన బభూవతుః ॥
భూతేజసా నితంబోఽ భూద్బ్రాహ్మేణ చరణద్వయమ్ ।
ఆర్కేణ చరణాంగుళ్యః కరాంగుల్యశ్చ వాసవాత్ ॥
కుబేరతేజసా నాసా రదనాశ్చ ప్రజాపతేః ।
పావకీయేన నయనత్రయం సాంధ్యేన భ్రూద్వయమ్ ॥
ఆనిలేన శ్రవోర్ద్వంద్వం తథాన్యేషాం స్వరోకసామ్ ।
తేజసా సంభవః పద్మాలయా సా పరమేశ్వరీ ॥
తతో నిఖిలదేవానాం తేజోరాశి సముద్భవామ్ ।
తామాలోక్య సురాస్సర్వే పరం హర్షం ప్రపేదిరే ॥
నిరాయుధాం చ తాం దృష్ట్వా బ్రహ్మాద్యాస్త్రి దివేశ్వరాః ।
సాయుధాం తాం శివాం కర్తుం మనస్సందధిరే సురాః ॥

తరువాత అతిశయించిన కోపమును పొందియున్న శివవిష్ణువుల ముఖములనుండియు, మరియు ఇతర దేవతల శరీరమునుండియు తేజస్సు బయల్వెడలేను. దుర్గను ధ్యానించుటలో నిమగ్నులై యున్న సకలదేవతలు పదిదిక్కులలో ప్రకాశించుచున్న మహాతేజోరాశిని చూచిరి. సకల దేవతల దేహములనుండి పుట్టిన మహాభయంకరమగు ఆ తేజస్సు ఒకచోటకు ముద్దగా చేరి సాక్షాత్తుగా మహిషాసురుని మర్ధించే స్త్రీ రూపమును దాల్చెను. శివుని తేజస్సు నుండి మిక్కిలి ప్రకాశించే ఆమెయొక్క ముఖము, యముని తేజస్సుచే కేశములు, విష్ణుతేజస్సుచే బాహువులు, చంద్రుని తేజస్సుచే ఆమె స్తనద్వయము, ఇంద్రుని తేజస్సుచే నడుము, వరుణుని తేజస్సుచే ఊరువులు, భూమియొక్క తేజస్సుచే నితంబము, బ్రహ్మతేజస్సుచే రెండు పాదములు, సూర్యతేజస్సుచే కాలివేళ్లు,

ఇంద్రతేజస్సుచే చేతివేళ్లు, కుబేరుని తేజస్సుచే ముక్కు, ప్రజాపతి తేజస్సుచే దంతములు, అగ్ని తేజస్సుచే మూడు కన్నులు, సంధ్యా తేజస్సుచే రెండు కనుబొమలు, వాయుతేజస్సుచే రెండు చేవులు నిర్మాణమయ్యెను. మరియు ఇతరదేవతల తేజస్సుల కలయికచే ఆ పరమేశ్వరీ ఆవిర్భవించెను. ఆమె పద్మమునందు కూర్చుండెను. అపుడు సకల దేవతల తేజస్సుల రాశి నుండి ఆవిర్భవించిన ఆమెను చూచి దేవతలందరు మహానందమును పొందిరి. స్వర్గాధిపతులగు బ్రహ్మ మొదలగు దేవతలు ఆ శివాదేవి వద్ద ఆయుధములు లేకుండుటను గాంచి, ఆమెకు ఆయుధములను సమకూర్చుటకు నిశ్చయించుకొనిరి.

తతశ్శూలం మహేశానో మహేశాన్యై సమర్పయత్ ।
చక్రం చ కృష్ణో భగవాన్ శంఖం పాశం చ పాశభృత్ ॥
శక్తిం హుతాశనోఽయచ్ఛన్మారుతశ్చాపమేవ చ ।
బాణపూర్ణేషుధీ చైవ వజ్రఘంటే శచీపతిః ॥
యమో దదౌ కాలదండమక్షమాలాం ప్రజాపతిః ।
బ్రహ్మా కమండలుం ప్రాదాద్రోమరశ్మీన్దివాకరః ॥
కాలః ఖడ్గం దదౌ తస్యై ఫలకం చ సముజ్జ్వలమ్ ।
క్షీరాబ్ధీ రుచిరం హారమజరే చ తథాంబరే ॥
చూడామణిం కుండలే చ కటకాని తథైవ చ ।
అర్ధచంద్రం చ కేయూరాన్నూపురౌ చ మనోహరే ॥
గ్రైవేయకమంగులీషు సమస్తాస్వంగులీయకమ్ ।
విశ్వకర్మా చ పరశుం దదౌ తస్యై మనోహరమ్ ॥
అస్త్రాణ్యనేకానీ తథాఽ భేద్యం చైవ తనుచ్ఛదమ్ ।
సురమ్యసరసాం మాలాం పంకజం చాంబుధిర్దదౌ ॥
దదౌ సింహం చ హిమవాన్ రత్నాని వివిధాని చ ।
సురయా పూరితం పాత్రం కుబేరోఽస్యై సమర్పయత్ ॥
శేషశ్చ భోగినాం నేతా విచిత్రరచనాంచితమ్ ।
దదౌ తస్యై నాగహారం నానాసన్మణి గుంఫితమ్ ॥
ఏతైశ్చాన్యైస్సురైర్దేవీ భూషణైరాయుధైస్తథా ।
సత్కృతోద్చైర్ననాదాసా సాట్టహాసం పునః పునః ॥

అపుడు మహేశ్వరుడు మహేశ్వరికి శూలమును, శ్రీకృష్ణ భగవానుడు చక్రమును, వరుణుడు శంఖమును మరియు పాశమును, అగ్ని శక్తిని, వాయువు ధనస్సును మరియు బాణములతో నిండియున్న అంబుల పొదులను రెండింటిని, ఇంద్రుడు వజ్రమును మరియు గంటను, యముడు మృత్యుదండమును, ప్రజాపతి అక్షమాలను, బ్రహ్మ కమండలమును, సూర్యుడు రోమములయందు కరణములను, మృత్యుదేవత కత్తిని మరియు గొప్పగా ప్రకాశించే డాలును, క్షీరసముద్రుడు ప్రకాశించే హారమును, రెండు నూతనవస్త్రములను, చూడామణిని, కుండలముల

జంటను, హస్తాభరణములను, చంద్రవంక అనే ఆభరణమును, కేయూరములను, సుందరమగు నూపురములను, మెడలో హారమును, వ్రేళ్లకు అన్నింటికీ ఉంగరములను, విశ్వకర్మ సుందరమగు గండ్ర గొడ్డలిని, అనేకములగు అస్త్రములను, మరియు ఛేదింప శక్యము కాని కవచమును, సముద్రుడు మిక్కిలి సుందరము రసవత్తరము అగు మాలను మరియు పద్మమును, హిమవంతుడు సింహమును మరియు వివిధరత్నములను, కుబేరుడు సురతో నిండియున్న పాత్రను, సర్పములకు అధీశ్వరుడగు శేషుడు రంగు రంగుల రచనలతో ప్రకాశించునదీ మరియు అనేకములగు మంచి మణులు పొదిగినది అగు సోగహారమును సమర్పించెను. దేవతలు ఇవీయే గాక ఇతరములగు భూషణములతో మరియు ఆయుధములతో దేవిని సత్కరించిరి. ఆమె అనేకపర్యాయములు అట్టహాసమును మరియు బిగ్గరగా నాదమును చేసెను.

తస్యా భీషణనాదేన పూరితా చ నభః స్థలీ ।
ప్రతిశబ్దో మహానాసీ చ్చుక్షుభే భువనత్రయమ్ ॥
చేలుస్సముద్రాశ్చత్వారో వసుధా చ చచాల హ ।
జయశబ్దస్తతో దేవైరకారి మహిషార్దితైః ॥
తతోఽబికాం పరాం శక్తిం మహాలక్ష్మీ స్వరూపిణీమ్ ।
తుష్టువుస్తే సురాస్సర్వే భక్తి గద్గదయా గిరా ॥
లోకం సంక్షుబ్ధ మాలోక్య దేవతాపరిపంథినః ।
సన్నద్ధసైనికాస్తే చ సముత్తస్థురుదాయుధాః ॥
మహిషోఽపి చ తం శబ్దమభ్య ధావద్రుషాన్వితః ।
స దదర్శ తతో దేవీం వ్యాప్తలోకత్రయాం రుచా ॥
ఏతస్మిన్నంతరే తత్ర మహిషాసుర పాలితాః ।
సమాజగ్ముర్మహావీరాః కోటిశో ధృతహేతయః ॥
చిక్షురశ్చామరోదగ్రౌ కరాలోద్ధతబాష్కలాః ।
తామ్రోగ్రాస్యోఽ గ్ర వీర్యాశ్చ బిడాలోఽధక ఏవ చ ॥
దుర్ధరో దుర్ముఖశ్చైవ త్రినేత్రశ్చ మహాహనుః ।
ఏతే చాన్యే చ బహవశ్శూరా యుద్ధవిశారదః ॥
యుయుధుస్సమరే దేవ్యా సహ శస్త్రాస్త్ర పారగాః ।
ఇత్థం కాలో వ్యతీయాయ యుధ్యతోర్భీషణస్తయోః ॥
అరివర్గకరక్షిప్తా నానాశస్త్రాస్త్ర రాశయః ।
మహామాయా ప్రభావేణ విఫలా అభవన్ క్షణాత్ ॥
తతో జఘాన సా దేవీ చక్షుర ప్రముఖానరీన్ ।
సగణాన్ గదయా బాణై శ్శూల శక్తిపరశ్వధైః ॥
ఏవం స్వీయేషు సైన్యేషు హతేషు మహిషాసురః ।
దేవీనిశ్వాస సంభూతాన్ భావయామాస తాన్ గణాన్ ॥

ఆమె యొక్క భయంకరమగు నాదము ఆకాశమంతయు నిండి పెద్ద ప్రతిధ్వని కలిగి ముల్లోకములు క్షోభిల్లెను. నాలుగు సముద్రములు చెల్లాచెదరయ్యెను. భూమి కంపించెను. మహిషునిచే పీడింపబడియున్న దేవతలు అపుడు జయశబ్దమును చేసిరి. అపుడు ఆ దేవతలు అందరు పరాశక్తి, మహాలక్ష్మీ స్వరూపురాలు అగు జగన్మాతను భక్తితో గద్గదమైన వాక్కుతో స్తుతించిరి. బాగుగా క్షోభను పొందిన లోకమును గాంచి ఆ దేవ శత్రువులు సైన్యములను సన్నద్ధము చేసుకొని చేతులలో ఆయుధములనెత్తి పట్టుకొని యుద్ధమునకు సంసిద్ధులై నిలబడిరి. మహిషాసురుడు కోపించి ఆ శబ్దమునకు అభిముఖముగా వేగముగా పరుగెత్తాను. అపుడాతడు తన కాంతులచే ముల్లోకములను ప్రకాశింప జేయుచున్న దేవిని చూచెను. ఇంతలో మహిషాసురుని చే పాలింపబడే మహావీరులు కోట్లాదిమంది ఆయుధములను దాల్చి అచటకు విచ్చేసిరి. చక్షురుడు, చామరుడు, ఉదగ్రుడు, కరాలుడు, ఉద్ధతుడు, బాష్కలుడు, తాముడు, ఉగ్రాస్యుడు, ఉగ్రవీర్యుడు, బిడాలుడు, అంధకుడు, దుర్ధరుడు, దుర్ముఖుడు, త్రినేత్రుడు, మహాహనుడు అనువారు మాత్రమే గాక, యుద్ధ నిపుణులగు అనేక శూరులు యుద్ధరంగములో దేవితో పోరాడిరి. వారు శస్త్రాస్త్ర విద్యలలో నిష్ణాతులు. భయంకరమగు యుద్ధమును ఆ ఇరుపక్షముల వారు చేయుచుండగా ఈ తీరున కొంతకాలము గడిచేను. శత్రు సైనికుల చేతులనుండి ప్రయోగించబడిన అనేక శస్త్రాస్త్రముల సమూహములు మహామాయయొక్క మహిమచే క్షణకాలములో విఫలమైనవి. అపుడా దేవి గణములతో కూడియున్న చక్షురుడు మొదలగు శత్రువులను గద, బాణములు, శూలము, శక్తి, గొడ్డలి అను ఆయుధములతో కొట్టెను. ఈ విధముగా తన సైన్యములు సంహరింపబడుచుండగా, మహిషాసురుడు దేవియొక్క నిశ్వాసమునుండి పుట్టిన ఆ గణములతో పెనుగులాడ జొచ్చెను.

అతాడయత్ ఖురైః కాంశ్చిత్ కాంశ్చిచ్ఛృంగద్వయేన చ ।

లాంగూలేన చ తుండేన భినత్తి స్మ ముహుర్ముహుః ॥

ఇత్థం దేవీగణాన్ హత్వాభ్య ధావత్సోఽసురాధిపః ।

సింహం మారయితుం దేవ్యాస్తతోఽసౌ కుపీతాఽభవత్ ॥

కోపాత్సోఽపి మహావీర్యః ఖురకుట్టిత భూతలః ।

శృంగాభ్యాం శైలముత్పాట్య చిక్షేప ప్రణనాద చ ॥

వేగేన విష్వగ్ భ్రమతా ప్రక్షిప్తా గురవోఽ ద్రయః ।

ఆకాశతో మహీమధ్యే నిపేతుర్నృప సత్తమ ॥

శృంగభిన్నాః పయోవాహాః ఖండం ఖండమయోసిషుః ।

లాంగూలేనాహతశ్చాబ్ధిర్విష్వగుద్వేల మస్పదత్ ॥

ఏవం క్రుద్ధం సమాలోక్య మహిషాసురమంబికా ।

విదధే తద్వధోపాయం దేవానామభయంకరీ ॥

తతః పాశం సముత్థాప్య క్షిప్త్వా తస్యోపరీశ్వరీ ।

బబంధ మహిషం సోఽపి రూపం తత్యాజ మాహిషమ్ ॥

తతస్సింహో బభూవాతు మాయావీ తచ్ఛిరోంబికా ।
యావచ్ఛినత్తి తావత్స ఖడ్గ పాణిర్బభూవ హ ॥
సచర్మాసి కరం తం చ దేవీ బాణైరతాడయత్ ।
తతో గజవపుర్భూత్వా సింహం చిచ్ఛేద శుండయా ॥
తతోఽస్య చ కరం దేవీ చకర్త స్వమహాసినా ।
అధారి చ పునా రూపం స్వకీయం తేన రక్షసా ॥
తద్దైవ క్షోభయామాస త్రైలోక్యం సచరాచరమ్ ।
తతః క్రుద్ధా మహామాయా చండికా మానవిక్రమా ॥
పపౌ పునః పునః పానం జహాసోద్భ్రాం తలోచనా ।
జగర్జ చాసురస్సోఽపి బలవీర్యమదోద్ధతః ॥
తస్యా ఉపరి చిక్షేప శైలానుత్పాట్య సోఽసురః ।
సా చ బాణావలీ ఘాతై శ్చూర్ణయామాస సత్వరమ్ ॥
వారుణీమద సంజాతముఖరాగా కులేంద్రియా ।
ప్రోవాచ పరమేశానీ మేఘగంభీరయా గిరా ॥

మహిషుడు కొందరిని డెక్కలతో, మరికొందరిని రెండు కొమ్ములతో కొట్టెను. ఆతడు వారిని తోకతో మరియు ముట్టెతో పలుమార్లు కొట్టి చీల్చుచుండెను. ఆ రాక్షసరాజు ఈ విధముగా దేవీగణములను సంహరించి ముందునకు ఉరుకుచుండెను. ఆతడు సింహమును కొట్టుటకు ముందునకు ఉరకగా, దేవి చాల కోపించెను. మహాపరాక్రమశాలియగు మహిషుడు కూడ కోపించి డెక్కలతో భూతలమును తాడించుచూ కొమ్ములతో కొండను పెకిలించి విసిరి నాదమును చేసెను. ఆతడు వేగముతో అడ్డముగా తిరుగుచూ, బరువైన కొండలను ఆకాశమునుండి నేలపైకి విసిరివేయుచుండెను. ఓ మహారాజా ! ఆతని కొమ్ములచే తాకబడి మేఘములు ముక్కలు ముక్కలుగా చెల్లాచెదరు అగుచుండెను. ఆతని తోకచే కొట్టబడిన సముద్రము చెలియలికట్టను దాటి ప్రవహించెను. ఈ విధముగా కోపించియున్నను అభయమునిచ్చే ఆ జగన్మాత వానిని వధించే ఉపాయమును చేసెను. అపుడా పరమేశ్వరి వాని పైకి పాశమును విసిరి బంధించెను. వెంటనే ఆ రాక్షసుడు మహిషరూపమును విడిచి పెట్టెను. మాయావియగు ఆ మహిషాసురుడు సింహరూపమును దాల్చెను. వెంటనే జగన్మాత వాని తలను నరుక బోవునంతలో, వాడు చేతిలో కత్తిని పట్టి నిలబడెను. చేతిలో కత్తిని, డాలును పట్టియున్న ఆ రాక్షసుని దేవి బాణములతో కొట్టెను. అప్పుడు వాడు ఏనుగు దేహమును దాల్చి సింహమును తొండముతో లాగజొచ్చెను. అపుడు దేవి తన పెద్ద కత్తితో వాని తుండమును నరికివేసెను. అపుడా రాక్షసుడు మరల తన వాస్తవ రూపమును దాల్చెను. ఆతడు వెంటనే చరాచరప్రాణులతో గూడిన ముల్లోకములను క్షోభిల్లునట్లు చేసెను. అపుడు గొప్ప పరాక్రమము గలది, భయంకరమగు ఆకారముగలది అగు మహామాయ కోపించి, పలుమార్లు పానీయమును త్రాగి కన్నులను త్రిప్పుచూ నవ్వెను. బలము, పరాక్రమము, గర్వములచే కన్ను మిన్ను కనజాలని ఆ రాక్షసుడు కూడ గర్జించెను.

ఆ రాక్షసుడు కొండలను పెకిలించి ఆమె పైకి విసిరివేయుచుండగా, ఆమె వెంటనే బాణ సమూహములతో కొట్టి వాటిని పిండి జేసెను, పానీయము యొక్క మత్తు వలన ఎర్రనైన ముఖమును కలిగి ఉద్రిక్తములైన ఇంద్రియములు గల ఆ పరమేశ్వరి మేఘగర్జనవలే గంభీరమగు వాక్కుతో నిట్లనెను.

దేవ్యువాచ ।

రే మూఢ రే హతప్రాజ్ఞ వ్యర్థం కిం కురుషే హఠమ్ ।
న మదగ్రేఽసురాః కేఽపి స్థాస్నవో జగతీత్రయే ॥

దేవి ఇట్లు పలికెను –

ఓరీ మూర్ఖా ! ఓరీ వినష్టబుద్ధీ ! వ్యర్థముగా హఠమునేల చేయుచున్నావు ? ముల్లోకములలోని రాక్షసులలో ఎవ్వరైననూ నా ఎదుట నిలబడలేరు.

ఋషిరువాచ ।

ఏనమాభాష్య కూర్దిత్వా దేవీ సర్వకలామయీ ।
పదా క్రమ్యాసురం కంఠే శూలేనో గ్రేణ సాఽభినత్ ॥
తతస్తచ్చరణా క్రాంతస్స స్వకీయముఖాత్తతః ।
అర్ధనిష్క్రాంత ఏవాసీద్దేవ్యా వీర్యేణ సంవృతః ॥
అర్ధనిష్క్రాంత ఏవాసౌ యుధ్యమానో మహాధమః ।
మహాసినా శిరో భిత్త్వా న్యపాతి ధరణీతలే ॥
హాహాశబ్దం సముచ్చార్యావాఙ్ ముఖాస్తద్గణా స్తతః ।
పలాయంత రణాద్భీతాస్త్రాహి త్రాహీతి వాదినః ॥
తుష్టువుశ్చ తదా దేవీమింద్రాద్యాస్సకలాస్సురాః ।
గంధర్వా గీతముచ్చేరుర్ననృతుర్నర్తకీ జనాః ॥
ఏవం తే కథతో రాజన్ మహాలక్ష్మ్యాస్సముద్భవః ।
సరస్వత్యాస్తథోత్పత్తిం శృణు సుస్థేన చేతసా ॥

ఇతి శ్రీ శివమహాపురాణే ఉమా సంహితాయాం మహిషాసురవధో నామ షట్ చత్వారింశోఽ ధ్యాయః ॥

ఋషి ఇట్లు పలికెను -

సర్వకళా స్వరూపురాలగు ఆ దేవి ఇట్లు పలికి వానిపైకి ఉరికి కాలితో ఆ రాక్షసుని కంఠమునందు తొక్కి పెట్టి భయంకరమగు శూలముతో పొడిచెను. అపుడు ఆమె పరాక్రమముచే కప్పివేయబడి ఆమె పాదములచే త్రొక్కివేయబడియున్న ఆ మహిషుడు తన నోటినుండి బయటకు రాబోతూ సగము మాత్రమే రాగలిగెను, మహాధముడగు ఆ రాక్షసుడు నోటినుండి సగము బయటకు వచ్చియూ యుద్ధము చేయుచుండెను. అపుడామె పెద్ద కత్తితో వాని తలను నరికి నేలపై పడవేసెను. అపుడు వాని సేనలు 'అయ్యో ! అయ్యో !' అంటూ బిగ్గరగా పలికి తలలను వంచుకొని భయపడినవారై యుద్ధమునుండి పారిపోతూ 'రక్షించుడు, రక్షించుడు' అని పలుకుచుండిరి. అపుడు ఇంద్రుడు మొదలగు దేవతలందరు దేవిని స్తుతించిరి. గంధర్వులు పాటలను పాడిరి. నాట్యకత్తెలు నాట్యమాడిరి. ఓ రాజా! ఈ విధముగా నేను మహాలక్ష్మీప్రాదుర్భావమును నీకు చెప్పితిని. అదే విధముగా సరస్వతీ ప్రాదుర్భావమును స్వస్థమగు మనస్సుతో వినుము.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు మహిషాసురవధ అనే నలుబది ఆరవ అధ్యాయము ముగిసినది.

47 – ధూమ్రాక్ష–చండ–ముండ– రక్తబీజుల సంహారము

ఋషిరువాచ ।

ఆసీచ్ఛుంభాసురో దైత్యో నిశుంభశ్చ ప్రతాపవాన్ ।
త్రైలోక్యమోజసా క్రాంతం భాతృభ్యాం సచరాచరమ్ ॥
తాభ్యాం ప్రపీడితా దేవా హిమవంతం సమాయయుః ।
జననీం సర్వభూతానాం కామదాత్రీం వవందిరే ॥

ఋషి ఇట్లు పలికెను –

శంభుడు మరియు ప్రతాపశాలియగు నిశుంభుడు అనే రాక్షసులు ఉండెడివారు ు. స్థావరజంగమ ప్రాణులతో కూడియున్న ముల్లోకములు వారి ప్రతాపముచే ఆక్రమించబడెను. వారిద్దరిచే మిక్కిలి పీడించబడిన దేవతలు హిమవత్పర్వతము వద్దకు వెళ్లి సర్వప్రాణుల కోరికలనీడేర్చే జగన్మాతకు నమస్కరించిరి.

దేవా ఊచుః ।

జయ దుర్గే మహేశాని జయాత్మీయ జనప్రియే ।
త్రైలోక్య త్రాణకారిణ్యై శివాయై తే నమో నమః ॥
నమో ముక్తి ప్రదాయిన్యై పరాంబాయై నమో నమః ।
నమస్సమస్త సంసారోత్పత్తి స్థిత్యంతకారికే ॥
కాలికారూప సంపన్నే నమస్తారాకృతే నమః ।
ఛిన్నమస్తా స్వరూపాయై శ్రీ విద్యాయై నమోఽస్తు తే ॥
భువనేశీ నమస్తుభ్యం నమస్తే భైరవాకృతే ।
నమోఽస్తు బగళాముఖ్యై ధూమవత్యై నమో నమః ॥
నమస్త్రి పురసుందర్యై మాతంగ్యై తే నమో నమః ।
అజితాయై నమస్తుభ్యం విజయాయై నమో నమః ॥
జయాయై మంగళాయై తే విలాసిన్యై నమో నమః ।
దోగ్ధ్రీరూపే నమస్తుభ్యం నమో ఘోరాకృతేఽస్తు తే ॥
మనోఽరపరాజితాకారే నిత్యా కారే నమో నమః ।
శరణాగతపాలిన్యై రుద్రాణ్యై తే నమో నమః ॥
నమో వేదాంతవేద్యాయై నమస్తే పరమాత్మనే ।
అనంతకోటి బ్రహ్మాండ నాయికాయై నమో నమః ॥
ఇతి దేవైస్స్తు తా గౌరీ ప్రసన్నా వరదా శివా ।
ప్రోవాచ త్రిదశాన్ సర్వాన్ యుష్మాభిస్స్తు యతేఽత్ర కా ॥

తతో గౌరీతనోరేకా ప్రాదురాసీత్కుమారికా ।

సోవాచ మిషతాం తేషాం శివశక్తిం పరాదరాత్ ॥

దేవతలు ఇట్లు పలికిరి –

ఓ దుర్గా ! మహేశ్వరీ ! భక్తులయందు ప్రీతి గల తల్లీ ! నీకు జయమగుగాక ! జయము. ముల్లోకములను రక్షించునది, శివుని పత్ని, ముక్తిని ఇచ్చునది, జగన్మాత, సర్వజగత్తును సృష్టించి పాలించి ఉపసంహరించునది, కాలికా– తారా– ఛిన్నమస్తా– శ్రీ విద్యా అను రూపములను దాల్చినది, భువనములకు ఈశ్వరి, భయంకరమగు ఆకారము గలది, బగళాముఖి, ధూమావతి, త్రిపురసుందరి, మతంగపుత్రి, జయింప శక్యము కానిది, జయస్వరూపిణి, మంగళస్వరూపిణి, సుందరి, గోరూపిణి, క్రూరరూపము గలది, అపరాజిత (పరాజయము నెరుంగనిది) అనురూపములో నున్నది, నిత్యమగు స్వరూపము గలది, శరణు జొచ్చిన వారిని రక్షించునది, రుద్రుని పత్ని, ఉపనిషత్తులచే తెలియబడునది, పరమాత్మ, అనంతకోటి బ్రహ్మాండములకు అధీశ్వరి అగు నీకు అనేక నమస్కారములు. దేవతలు ఈ విధముగా స్తుతించగా, వరములనిచ్చే మంగళ స్వరూపురాలగు గౌరి ప్రసన్నురాలై దేవతలందరితో ఇట్లనెను : మీరీ సమయములో ఎవరిని స్తుతించుచున్నారు ? అపుడు గౌరీదేవియొక్క దేహమునుండి ఒక కుమారీ ఆవిర్భవించెను. వారు కళ్లను అప్పగించి చూచుచుండగా ఆమె పరమాదరముతో శివశక్తిని ఉద్దేశించి ఇట్లు పలికెను.

స్తోత్రం మే క్రియతే మాతస్సమస్తైస్స్వర్గవాసిభిః ।

నిశుంభశుంభ దైత్యాభ్యాం ప్రబలాభ్యాం ప్రపీడితైః ॥

శరీరకోశాద్యత్తస్యా నిర్గతా తేన కౌశికీ ।

నామ్నా సా గీయతే సాక్షాచ్ఛుంభాసురనిబర్హిణీ ॥

చైవోగ్రతారికా ప్రోక్తా మహోగ్రతారికాపి చ ।

ప్రాదుర్భూతా యతస్సా వై మాతంగీత్యుచ్యతే భువి ॥

బభాషే నిఖిలాన్ దేవాన్ యూయం తిష్ఠత నిర్భయాః ।

కార్యం వః సాధయిష్యామి స్వతంత్రాహం వినాశ్రయమ్ ॥

ఇత్యుక్త్వా సా తదా దేవీ తరసాంతర్హితాఽ భవత్ ।

చండముండౌ తు తాం దేవీమద్రాష్టాం సేవకౌ తయోః ॥

దృష్ట్వా మనోహరం తస్యా రూపం నేత్రసుఖావహమ్ ।

పేతతుస్తౌ ధరామధ్యే నష్టసంజ్ఞౌ విమోహితౌ ॥

గత్వా వ్యాజహ్రతుస్సర్వం రాజ్ఞే వృత్తాంతమాదితః ।

దృష్టా కాచిన్మయాఽపూర్వా నారీ రాజన్మనోరమా ॥

హిమవచ్ఛిఖరే రమ్యే సంస్థితా సింహవాహినీ ।

సమంతాద్దేవ కన్యాభిస్సేవితా బద్ధపాణిభిః ॥

కురుతే పాదసంవాహం కాచిత్సం స్కురుతే కచాన్ ।

పాణిసంవాహనం కాచిత్కాచిన్నే త్రాంజనం న్యధాత్ ॥

కాచిద్గృహీత్వా హస్తేనాదర్శం దర్శయతే ముఖమ్ ।

నాగవల్లీం దదాత్యేకా లవంగైలాది సంయుతామ్ ॥

ఓ తల్లీ ! శుంభనిశుంభులనే మహాబలశాలురగు రాక్షసులచే అధికముగా పీడింపబడియున్న దేవతలందరు నన్ను స్తుతించుచున్నారు. ఆమె పార్వతియొక్క దేహము అనే కోశమునుండి ఉద్భవించుటచే కౌశికి అను పేర ప్రస్తుతిని గాంచినది. ఆమె స్వయముగా శుంభాసురుని సంహరించినది. ఆమెకు ఉగ్రతారిక, మహోగ్రతారిక అను పేర్లు కూడ గలవు. తల్లియొక్క శరీరమునుండి సాక్షాత్తుగా ఆవిర్భవించుటచే, ఆమె మాతంగి యనీ లోకములో ప్రసిద్ధిని పొందినది. ఆమె దేవతలందరితో నిట్లు పలికెను : మీరు నిర్భయముగ నుండుడు. నేను ఇతరుల సహాయముతో పని లేకుండగా స్వతంత్రముగా మీ పనిని చేసి పెట్టెదను. ఆ దేవి అపుడు ఇట్లు పలికి వెంటనే అంతర్ధానమయ్యెను. శుంభనిశుంభుల సేవకులగు చండముండులు ఆ దేవిని చూచిరి. మనోహరము, కన్నులకు సుఖమును కలిగించునది అగు ఆమె యొక్క రూపమును గాంచి, వారిద్దరు విశేషమగు మోహమును పొంది తెలివిని గోల్పోయి నేలపై బడిరి. వారు వెళ్లి వృత్తాంతమునంతను మొదటినుండి తమ రాజునకు విన్నవించిరి. ఓ రాజా ! నేను మనోహరమగు ఒక అపూర్వ స్త్రీని చూచితిని. ఆమె సింహము వాహనముగా గలదై సుందరమగు హిమవత్పర్వత శిఖరముపై నున్నది. దేవకన్యలు ఆమె చుట్టూ చేతులను కట్టుకొని నిలబడి సేవించుచున్నారు. ఒకతె కాళ్లను నొక్కుచుండగా, మరియొకతే జుట్టును దువ్వుచుండెను. ఒకామె చేతులను నొక్కుచుండగా, మరియొకామె కన్నులకు కాటుకను దిద్దుచుండెను, ఒకామె అద్దమును చేతితో పట్టుకొని ముఖమును చూపుచుండెను. లవంగములు, ఏలకులు మొదలగు వాటితో చుట్టబడిన తాంబూలమును మరియొకామె ఇచ్చుచుండెను.

పతద్గ్రహం కరే కృత్వా స్థితా కాచిత్సఖీ పురః ।

భూషయత్య ఖిలాంగాని కాచిద్భూషాంబరాదిభిః ॥

కదలీస్తంభజంఘోరుః కీరనాసాఽహిదోర్లతా ।

రణన్మంజీరచరణా రమ్యమేఖలయా యుతా ॥

లసత్కస్తూరి కామోదముక్తాహార చలస్తనీ ।

గ్రైవేయకలసద్గ్రీవా లలంతీదామమండితా ॥

అర్ధచంద్రధరా దేవీ మణికుండల ధారిణీ ।

రమ్యవేణిర్విశాలాక్షీ లోచనత్రయ భూషితా ॥

సాక్షరా మాలికో పేతా పాణిరాజిత కంకణా ।

స్వర్ణోర్మికాంగులిర్భ్రాజత్పారిహార్యల సత్కరా ॥

శుభ్రవ స్త్రావృతా గౌరీ పద్మాసన విరాజితా ।

కాశ్మీరబిందుతిలకా చంద్రాలం కృతమస్తకా ॥

తడిద్ద్యుతిర్మహామూల్యాంబర చోలోన్నమత్కుచా ।

భుజైరష్టా భిరుత్తుంగైర్ధారయంతీ వరాయుధాన్ ॥

తాదృశీ నాసురీ నాగీ న గంధర్వ న దానవీ ।

విద్యతే త్రిషు లోకేషు యాదృశీ సా మనోరమా ॥

తస్మాత్సంభోగయోగ్యత్వం తస్యాస్త్వయ్యేవ శోభతే ।

నారీరత్నం యతస్సా వై పుంరత్నం చ భవాన్ ప్రభో ॥

ఇత్యుక్తం చండముండాభ్యాం నిశమ్య స మహాసురః ।

దూతం సుగ్రీవనామానం ప్రేషయామాస తాం ప్రతి ॥

గచ్ఛ దూత తుషారాద్రౌ తత్రాస్తే కాపి సుందరీ ।

సా నేతవ్యా ప్రయత్నేన కథయిత్వా వచో మమ ॥

ఇతి విజ్ఞాపితస్తేన సుగ్రీవో దానవోత్తమః ।

గత్వా హిమాచలం ప్రాహ జగదంబాం మహేశ్వరీమ్ ॥

క్రింద పడుచున్న విలాసవస్తువును చేతియందు పట్టుకొని ఒక చెలికత్తె ఆమె ఎదుట నిలబడెను. ఒకామె ఆమె అవయవములనన్నింటినీ భూషణములు, వస్త్రములు మొదలగు వాటితో అలంకరించుచుండెను. అరటి బోదెల వంటి పిక్కలు ఊరువులు గలది, చిలుక ముక్కువంటి ముక్కు గలది, పాములవంటి మరియు లతల వంటి చేతులు గలది, ధ్వనించే నూపురములతో గూడిన పాదములు గలది, సుందరమగు మేఖలను దాల్చినదీ, కస్తూరీ సుగంధముతో కూడిన స్తనములపై కదలాడుతూ ప్రకాశించే ముత్యాల హారము గలది, కంఠహారములతో ప్రకాశించు కంఠము గలదీ, విలాసముగా ధరింపబడిన మాలచే అలంకరింపబడినది, లలాటమునందు చంద్రవంక బొట్టును ధరించి ప్రకాశించునది, మణులు పొదిగిన కుండలములను ధరించినది, సుందరమగు కేశాలంకారము గలది, నిడివి కన్నులు గలది, మూడు కన్నులతో శోభిల్లునది, వినాశము లేనిది, మాలను దాల్చినది, చేతులయందు ప్రకాశించే కంకణములు గలది, బంగరు ఉంగరములతో కూడిన వ్రేళ్లు గలది, మెరిసి పోయే గాజులతో శోభిల్లు చేతులు గలది, స్వచ్ఛమగు వస్త్రమును కప్పుకొని యున్నది, పద్మాసనమునందు ప్రకాశించుచున్నది, లలాటముపై కుంకుమ బొట్టును పెట్టుకున్నది, శిరస్సుపై చంద్రవంకను అలంకరించుకున్నది, మెరుపువలె ప్రకాశించునది, మిక్కిలి విలువైన వస్త్రముతో తయారైన రవికెను ధరించి ఎత్తైన వక్షస్థలముతో ప్రకాశించునది, ఎనిమిది భుజములతో పైకి ఎత్తబడిన శ్రేష్ఠమగు ఆయుధములను పట్టుకొని యున్నది అగు ఆ గౌరి వంటి సుందరియగు యువతి రాక్షసులలో, నాగులలో, గంధర్వులలో, దానవులలో, ముల్లోకములలో ఒక్కరైననూ లేరు. కావున ఆమె పొందు నీయందు మాత్రమే శోభిల్లును. ఏలయనగా, ఆమె స్త్రీలలో శ్రేష్ఠురాలు. ఓ ప్రభూ ! నీవు పురుషులలో శ్రేష్ఠుడవు. చండముండులు చెప్పిన ఈ వచనములను విని ఆ మహారాక్షసుడు సుగ్రీవుడనే దూతను ఆమె వద్దకు పంపెను. ఓ దూతా ! వెళ్ళుము. హిమవత్పర్వతముపై ఒకానొక సుందరి గలదు. ఆమెకు నా మాటను చెప్పి జాగ్రత్తగా దోడ్కొని రమ్ము. రాక్షస శ్రేష్ఠుడగు సుగ్రీవుడు ఆయనచే ఇట్లు ఆజ్ఞాపించబడి హిమవత్పర్వతమునకు వెళ్లి, జగన్మాతయగు మహేశ్వరితో నిట్లనెను.

దూత ఉవాచ ।

దేవి శుంభాసురో దైత్యో నిశుంభస్తస్య చానుజః ।
విఖ్యాతస్త్రిషు లోకేషు మహాబల పరాక్రమః ॥
చారోఽహం ప్రేషితస్తేన సన్నిధిం తే సమాగమమ్ ।
స యజ్ఞగౌ సురేశాని తత్సమాకర్ణయాధునా ॥
ఇంద్రాదీన్ సమరే జిత్వా తేషాం రత్నాన్యపాహరమ్ ।
దేవభాగం స్వయం భుంజే యాగే దత్తం సురాదిభిః ॥
స్త్రీ రత్నం త్వామహం మన్యే సర్వరత్నోపరి స్థితమ్ ।
సా త్వం మమానుజం మాం వా భజతాత్కామజై రసైః ॥
ఇతి దూతోక్తమాకర్ణ్య వచనం శుంభభాషితమ్ ।
జగాద సా మహామాయా భూతేశ ప్రాణవల్లభా ॥

దూత ఇట్లు పలికెను –

ఓ దేవీ ! శుంభాసురుడనే దైత్యుడు గలడు. ఆతడు ముల్లోకములలో పేరు మోసి ిన గొప్ప బలపరాక్రమములు గలవాడు. నిశుంభుడు ఆతని తమ్ముడు. దూతనగు నేను ఆయన పంపగా నీ సన్నిధికి వచ్చియుంటిని. ఓ దేవేశ్వరీ ! ఇపుడు ఆతడు చెప్పిన పలుకుల నాలకించుము. నేను ఇంద్రుడు మొదలగు దేవతలను యుద్ధములో జయించి వారివద్దనున్న శ్రేష్ఠవస్తువులను లాగుకొంటిని. దేవతలకు యజ్ఞములలో ఈయబడిన హవిర్భాగములను నేను స్వయముగా అనుభవించుచున్నాను. నీవు స్త్రీలందరిలో శ్రేష్ఠురాలవని నేను తలంచుచున్నాను. అట్టి నీవు నన్ను గాని, నా సోదరుని గాని ప్రేమించి సేవించుము. శుంభుడు దూత ద్వారా పంపిన ఈ సందేశమును విని, భూతపతియగు శివునకు ప్రాణప్రియురాలగు ఆ మహామాయ ఇట్లు పలికెను.

దేవ్యువాచ ।

సత్యం వదసి భో దూత నానృతం కించిదుచ్యతే ।
పరం త్వేక కృతా పూర్వం ప్రతిజ్ఞా తాం నిబోధ మే ॥
యో మే దర్పం విధునుతే యో మాం జయతి సంగరే ।
ఉత్సహే తమహం కర్తుం పతిం నాన్యమితి ధ్రువమ్ ॥
స త్వం కథయ శుంభాయ నిశుంభాయ వచో మమ ।
యథాయుక్తం భవేదేవం విదధాతు తథాఽ త్ర సః ॥
ఇత్థం దేవీవచశ్శ్రుత్వా సుగ్రీవో నామ దానవః ।
రాజ్ఞే విజ్ఞాపయామాస గత్వా తత్ర సవిస్తరమ్ ॥
అథ దూతోక్తమాకర్ణ్య శుంభో భైరవశాసనః ।
ధూమ్రాక్షం ప్రాహ సక్రోధస్సేనాన్యం బలినాం వరమ్ ॥
హే ధూమ్రాక్ష తుషారాద్రౌ వర్తతే కాపి సుందరీ ।
తామానయ ద్రుతం గత్వా యథాయాస్యతి సాత్ర వై ॥

తస్యా ఆనయనే భీతిర్న కార్యాఽసురసత్తమ ।

యుద్ధం కార్యం ప్రయత్నేన యది సా యోద్ధుమిచ్ఛతి ॥

ఏవం విజ్ఞాపితో దైత్యో ధూమ్రలోచన సంజ్ఞకః ।

గత్వా హిమాచలం ప్రాహ భువనేశీముమాంశజామ్ ॥

భర్తుర్మమాంతికం గచ్ఛ నో చేత్త్వాం ఘాతయామ్యహమ్ ।

షష్ట్యాఽసురాణాం సహితస్సహస్రాణాం నితంబిని ॥

దేవి ఇట్లు పలికెను –

ఓ దూతా ! నీవు సత్యమును పలుకుచున్నావు. నీ పలుకులలో అసత్యము లేశమైననూ లేదు. కాని పూర్వము నేను ఒక ప్రతిజ్ఞను చేసియుంటిని. నా ఆ ప్రతిజ్ఞను గురించి తెలుసుకొనుము. ఎవడైతే నా పొగరును అడంచునో, నన్ను యుద్ధములో జయించునో, వానిని నేను భర్తగా పొందగోరెదననియు, ఇతరులు నాకు సమ్మతము కాదనియు నేను శపథమును చేసితిని. ఇది నిశ్చయము. కావున, నీవు నా మాటలను శుంభనిశుంభులకు చెప్పుము. ఈ విషయములో వారు యథాయోగ్యముగా చేయుదురు గాక ! దేవియొక్క ఈ వచనములను వీని సుగ్రీవుడనే ఆ రాక్షసుడు తన ప్రభువు వద్దకు వెళ్లి ఆ విషయమును రాజునకు విస్తారముగా విన్నవించెను. భయంకరమగు శాసనము గల శుంభుడు అపుడు దూతయొక్క వచనములను విని బలవంతులలో శ్రేష్ఠుడగు ధూమ్రాక్షుడనే సేనానాయకునితో కోపముతో నిట్లనెను. ఓ ధూమ్రాక్షా ! హిమవత్పర్వతమునందు ఒకానొక సుందరీ గలదు. నీవు వెంటనే అచటకు వెళ్లి ఆమెను దోడ్కొని రమ్ము. ఆమె అచటకు వచ్చు విధముగా చేయుము. ఓ రాక్షసవీరా ! ఆమెను ఇచటకు తెచ్చుటలో నీవు భయమును పొందకుము. ఆమె యుద్ధమును చేయగోరినచో, నీవు ప్రయత్నపూర్వకముగా యుద్ధమును చేయుము. ఈ విధముగా ఆజ్ఞాపించబడినవాడై, ధూమ్రాక్షుడనే ఆ రాక్షసుడు హిమవత్పర్వతమునకు వెళ్లి, ఉమాదేవియొక్క అంశనుండి పుట్టిన ఆ భువనేశ్వరితో నిట్లనెను. నీవు నా ప్రభువు వద్దకు నడువుము. లేనిచో, నిన్ను నేను సంహరించెదను. ఓ సుందరీ ! నా వెనుక అరవై వేలమంది రాక్షసులు గలరు.

దైత్యరాట్ ప్రేషితో వీర హంసి చేత్కిం కరోమి తే ।

పరం త్వసాధ్యం గమనం మన్యే సంగ్రామమంతరా ॥

ఇత్యుక్తస్తామన్వధావద్దానవో ధూమ్రలోచనః ।

హుంకారోచ్చారణేనైవ తం దదాహ మహేశ్వరీ ॥

తతః ప్రభృతి సా దేవీ ధూమావత్యుచ్యతే భువి ।

ఆరాధితో స్వభక్తానాం శత్రువర్గనికర్తినీ ॥

ధూమ్రాక్షే నిహతే దేవ్యా వాహనేనాతికోపినా ।

చర్వితాస్తద్గణా స్సర్వేఽపలాయంతా వశేషితాః ॥

ఇత్థం దేవ్యా హతం దైత్యం శ్రుత్వా శుంభః ప్రతాపవాన్ ।

చకార బహులం కోపం సందష్టోష్ఠ పుటద్వయః ॥

చండం ముండం రక్తబీజం ప్రైషయత్క్రమతోఽ సురాన్ ।

తేఽపి చాజ్ఞాపితా దైత్యా యయుర్య త్రాంబికాస్థితా ॥

సింహారూఢాం భగవతీమణిమాదిభిరాశ్రితామ్ ।

భాసయంతీం దిశో భాసా దృష్ట్వాచుర్దాన వర్షభాః ॥

హే దేవి తరసా మూలం యాహి శుంభని శుంభయోః ।

అన్యథా ఘాతయిష్యామస్సగణాం త్వాం సవాహనామ్ ॥

వృణీష్వ తం పతిం వామే లోకపాలాదిభిస్స్తుతమ్ ।

ప్రపత్స్యసే మహానందం దేవానామపి దుర్లభమ్ ॥

ఇత్యుక్తమాకలయ్యాంబా స్మయిత్వా పరమేశ్వరీ ।

ఉదాజహార సా దేవీ సూనృతం రసవద్వచః ॥

ఓ వీరా ! రాక్షసరాజుచే పంపబడిన నీవు కొట్టినచో. నేను నీకు ఏమి చేయగలను ? కాని, యుద్ధమును చేయకుండగా నీతో వచ్చుట అసంభవమని తలచుచున్నాను. ఆమె ఇట్లు పలుకగా, ధూమ్రాక్షుడనే ఆ రాక్షసుడు ఆమె పైకి పరుగెత్తెను. మహేశ్వరి కేవలము ఓంకారమునుచ్చరించి వానిని దహించి వేసెను. ఆనాటి నుండియు లోకములో ఆమెకు ధూమావతి అను ప్రసిద్ధి కలిగెను. ఆమె తనను ఆరాధించే భక్తుల శత్రుసమూహములను నాశనము జేయును. ధూమ్రాక్షుడు సంహరింపబడగానే, మిక్కిలి కోపమును పొందియున్న దేవియొక్క వాహనమగు సింహము వాని సేనలను నమిలి వేసెను. మిగిలినవారందరు పారిపోయిరి. ప్రతాపశాలియగు శుంభుడు ఈ విధముగా ధూమ్రాక్షుడు దేవిచే సంహరింపబడినాడని విని, పెదవులను పళ్లతో కొరుకుచూ అధికమగు కోపమును పొందెను. ఆతడు చండముండరక్తబీజులనే రాక్షసులను వరుసగా పంపెను. శుంభునిచే ఆజ్ఞాపించబడిన ఆ రాక్షసులు కూడ అంబిక ఉన్న స్థానమునకు వెళ్లిరి. సింహమునధిష్టించియున్నది, అణిమ మొదలగు సిద్ధులకు ఆశ్రయమైనది, దిక్కులను తన కాంతిచే ప్రకాశింపజేయుచున్నది అగు భగవతిని చూచి ఆ దానవవీరులు ఇట్లు పలికిరి. ఓ దేవీ ! వెంటనే శుంభనిశుంభుల పాదముల వద్ద నిన్ను, నీ అనుయాయులను, నీ వాహనమును నశింపజేసెదము. ఓ సుందరీ ! లోకపాలకులు మొదలగు వారిచే ప్రశంసింపబడే ఆ శుంభుని భర్తగా వరించుము. దేవతలకైననూ పొందశక్యము కాని మహానందమును పొందెదవు. జగన్మాత, పరమేశ్వరి అగు ఆ దేవి వారి ఈ మాటలను విని చిరునవ్వు నవ్వి మధురము, యథార్థము అగు వచనమును ఇట్లు పలికెను.

అద్వితీయో మహేశానః పరబ్రహ్మ సదాశివః ।

యత్తత్త్వం న విదుర్వేదా విష్ణ్వాదీనాం చ కా కథా ॥

తస్యాహం ప్రకృతి స్సూక్ష్మా కథ మన్యం పతిం వృణే ।

సింహీ కామాతురా నైవ జంబుకం వృణుతే క్వచిత్ ॥

కరేణుర్గర్దభం నైవ ద్వీపినీ శశకం న వా ।

మృషా వదత భో దైత్యా మృత్యువ్యాల నియంత్రితాః ॥

యూయం ప్రయాత పాతాలం యుధ్య ధ్వం శక్తిరస్తి చేత్ ।
ఇతి క్రోధకరం వాక్యం శ్రుత్వోచుస్తే పరస్పరమ్ ॥
అబలాం మనసి జ్ఞాత్వా న హన్మో భవతీం వయమ్ ।
అథో స్థిరైహి పంచాస్యే యుద్ధేచ్ఛా మానసేఽస్తి చేత్ ॥
తేషామేవం వివదతాం కలహస్సమవర్ధత ।
వవృషుస్సమరే బాణా ఉభయోర్దలయోశ్శితాః ॥
ఏవం తైస్సమరం కృత్వా లీలయా పరమేశ్వరీ ।
జఘాన చండముండాభ్యాం రక్తబీజం మహాసురమ్ ॥
ద్వేషబుద్ధిం విధాయాపి త్రిదశస్థితయోఽప్యమీ ।
అంతే ప్రాపన్ పరం లోకం యం లోకం యాంతి తజ్జనాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం ధూమ్రాక్ష చండముండ
రక్తబీజవధో నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥

మహేశ్వరుడగు సదాశివుడు అద్వయ పరంబ్రహ్మ. ఆయన తత్త్వమును వేదములు తెలియకున్న◌ి్నవి. విష్ణువు మొదలగు వారి గురించి చెప్పునదేమున్నది ? ఆయనయొక్క సూక్ష్మప్రకృతి నేను. నేను మరియొకనిని భర్తగా ఎట్లు వరించగలను ? ఆడు సింహము కామముచే పీడింపబడి ఎక్కడైననూ నక్కను వరించదు గదా ! ఏనుగు గాడిదను, పులి కుందేలును వరించవు. మృత్యువు అనే సర్పముచే నియంత్రింపబడియున్న ఓ రాక్షసులారా ! మీరు పలికినది అసత్యము. మీరు పాతాళమునకు పొండు. శక్తి ఉన్నచో యుద్ధమును చేయుడు. ఈ విధమగు కోపమును కలిగించే వాక్యములను విని వారు ఒకరితో నొకరు ఇట్లు పలికిరి. ఈ పూజ్యురాలిని అబలయను మనోభావనచే మనము వధించుట లేదు. నీకు మనస్సులో యుద్ధముపై కోరిక ఉన్నచో సింహముపై స్థిరముగా కూర్చుండి రమ్ము. ఈ విధముగా పరస్పర విరుద్ధముగా మాటలాడుచున్న ఆ రెండు పక్షముల వారి మధ్య కలహము పెరిగి పెద్దది ఆయెను. రెండు పక్షముల వారిపై యుద్ధములో వాడి బాణములు వర్షించినవి. ఆ పరమేశ్వరి ఈ తీరున వారితో లీలచే యుద్ధమును చేసి చండముండులను, రక్తబీజుడనే మహారాక్షసుని సంహరించెను, ఈ దేవశత్రువులు ద్వేషబుద్ధి కలవారే అయిననూ మరణించిన తరువాత, దేవీ భక్తులు పొందే పరమపదమును పొందిరి.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ధూమ్రాక్ష-చండ-ముండ-రక్తబీజ-వధను వర్ణించే నలుబది ఏడవ అధ్యాయము ముగిసినది.

48 – శుంభ నిశుంభ వధ

రాజోవాచ ।

ధూమ్రాక్షం చండముండం చ రక్తబీజాసురం తథా ।
భగవన్నిహతం దేవ్యా శ్రుత్వా శుంభస్సురార్దనః ॥
కిమకార్షీత్తతో బ్రహ్మన్నేతన్మే బ్రూహి సాంప్రతమ్ ।
శుశ్రూషవే జగద్యోనేశ్చరిత్రం పాపనాశనమ్ ॥

రాజు ఇట్లు పలికెను –

ఓ పూజ్యా ! ధూమ్రాక్ష-చండ- ముండ- రక్తబీజాసురులు సంహరింపబడినారని విని దేవపీడకుడగు శుంభుడు అపుడు ఏమిచేసెను? ఓ పుజ్యా ! జగన్మాతయొక్క పాపనాశకమగు చరితమును నేను వినగోరుచున్నాను. కావున ఇప్పుడు నాకు ఈ విషయమును చెప్పుడు.

ఋషిరువాచ ।

హతానిమాన్ దైత్యవరాన్మహాసురో నిశమ్య రాజన్మహనీయవిక్రమః ।
అజిజ్ఞపత్ స్వీయగణాన్ దురాసదాన్ రణాభిధోచ్చారణజాత సంమదాన్ ॥
బలాన్వితాస్సంమిలితా మమాజ్ఞయా జయాశయా కాలకవంశ సంభవాః ।
సకాలకేయాసురమౌర్య దౌర్హృదాస్తథా పరేప్యాశు ప్రయాణయంతు తే ॥
నిశుంభశుంభౌ దితిజాన్ని దేశ్య తాన్ రథాధిరూఢౌ నిరయాంబభూవతుః ।
బలాన్యనూఖుర్బలినోస్తయోర్ధరాద్వినాశవంతశ్శలభా ఇవోత్థితాః ॥
ప్రసాదయామాస మృతంగమర్దలం సభేరికాడిండిమఝర్ఝ రానకమ్ ।
రణస్థలే సంజహృషూ రణ ప్రియా అసు ప్రియాస్సంగరతః పరాయయుః ॥
భటాశ్చ తే యుద్ధపటావృతాస్తదా రణస్థలీమాపుర పాపవిగ్రహాః ।
గృహీత శస్త్రాస్త్ర చయా జిగీషయా పరస్పరం విగ్రహయంత ఉల్బణమ్ ॥
గజాధిరూఢాస్తురగాధిరోహిణో రథాధిరూఢాశ్చ తథాపరేఽసురాః ।
అలక్షయంతస్స్వపరాన్ జనాన్ముదాఽ సురేశసంగే సమరేఽ ఖరే ఖరే ॥
ధ్వనిశ్చతఘ్నీజనితో ముహుర్ముహుర్బభూవ తేన త్రిదశాస్సమేజితాః ।
మహాంధకారస్సమపద్య తాంబరే విలోక్యతే నో రథమండలం రవేః ॥
పదాతయో నిర్భరజుర్హ్వా కోటిశః ప్రభూతమానా విజయాభిలాషిణః ।
రథాశ్వగా వారణగా అథాపరేఽసురా నిరీయుః కతి కోటిశో ముదా ॥
అశుక్లశైలా ఇవ మత్తవారణా అతానిషుశ్చీత్కృతి శబ్దమాహవే ।
క్రమేలకాశ్చాపి గలద్గలధ్వనిం వితన్వతే క్షుద్రమహీధరోపమాః ॥
హయాశ్చ ప్రేషంత ఉదగ్రభూమిజో విశాలకంఠాభరణా గతేర్విదః ।
పదాని దంతావల మూర్ధ్ని బిభ్రత స్సుడిడ్యిరే వ్యోమపథా యథా ఽవయః ॥

ఋషి ఇట్లు పలికెను –

ఓ రాజా ! గొప్ప పరాక్రమశాలియగు ఆ మహారాక్షసుడు ఈ రాక్షసశ్రేష్ఠుల సంహారమును గురించి విని, జయింప శక్యము కానివారు, యుద్ధము అనే పేరు వినగానే ఉదయించే గొప్ప గర్వము గలవారు అగు తన గణముల నాజ్ఞాపించెను. కాలకవంశమునందు పుట్టిన రాక్షసులు, మౌర్యులు, దౌర్హృదులు మాత్రమే గాక, ఇతరవంశముల రాక్షసులు కూడ నా ఆజ్ఞచే సైన్యములతో సహా సన్నద్ధులై వెంటనే ఒకచోటకు చేరి శత్రువులను జయించ వలెననే ఉత్సాహముతో ప్రయాణమును చేయుదురు గాక ! శుంభనిశుంభులు ఈ విధముగా రాక్షసుల నాదేశించి తాము రథములనధిష్టించి బయలుదేరిరి. పర్వతమునుండి పైకి లేచి నిప్పుల గుండములోనికి ఉరికే మిడతలవలె ఆ సేనలు బలశాలురగు ఆ ఇద్దరు రాక్షసుల వెనుక వినాశాభిముఖముగా అనుసరించినవి. మద్దెలలు, డోళ్లు, భేరీలు, డిండిమములు, ఝర్ఝ రములు (కెమళ్లు), ఆనకములు మ్రోయించబడినవి. ఆ యుద్ధరంగములో యుద్ధప్రియులకు మహానందము కలుగుచుండెను. కాని, ప్రాణములయందు తీపిగలవారు యుద్ధము నుండి పలాయనమును చిత్తగించిరి. భటులు యుద్ధమునకు తగిన వస్త్రములను దాల్చి శస్త్రాస్త్ర సమూహములను పట్టుకొని పవిత్రమగు యుధోద్యమము గలవారై రణరంగమునకు చేరుకొనిరి. వారు ఒకరినొకరు జయించవలెననే తీవ్రమగు స్పర్ధను కలిగియుండిరి. రాక్షసులు ఏనుగులను, గుర్రములను, రథములను ఎక్కి ముందుకు సాగిరి. మరికొందరు కాలినడకతో వచ్చుచుండిరి. వారు ఆనందముచే స్వపర పక్షముల భేదమును కనలేకుండిరి. వారు యుద్ధములో ఆ రాక్షసాధీశ్వరుల సమక్షములో చాల ప్రకాశించిరి. శతఘ్నులనుండి పలుమార్లు బయల్వెడలుచున్న ధ్వనిని విని దేవతలు అధికముగా కంపించుచుండిరి. ఆకాశములో దట్టమగు చీకటి నెలకొనెను. సూర్యమండలము కానవచ్చుట లేదు, పదాతి సైన్యములు మాత్రమే గాక, రథములను, గుర్రములను, ఏనుగులను అధిష్టించియున్న రాక్షసులు కోట్ల సంఖ్యలో ఆనందముతో ఉప్పొంగుచున్నవారై విజయమును పొందవలెననే పట్టుదలతో ముందుకు సాగుచుండిరి. నల్లని పర్వతముల వలెనున్న మదించిన ఏనుగులు యుద్ధములో ఛీత్కార శబ్దమును అధికముగా అంతటా వ్యాపింప జేసినవి. చిన్న పర్వతములను పోలియున్న ఒంటెలు కూడ అంతటా గలగల ధ్వని నిండునట్లు చేసినవి. వీరభూములయందు జన్మించి పరుగెత్తుటలో నేర్పరులైన గుర్రములు తమ మెడలలో విశాలమగు ఆభరణములు గలవై సకిలించుచూ తమ గిట్టలను ఏనుగుల తలలపై మోపి పక్షులవలె ఆకాశమార్గములో ఎగురుచుండెను.

సమీక్ష్య శత్రో ర్బలమిత్థమాపతచ్చకార సజ్యం ధనురంబికా తదా ।

ననాద ఘంటాం రిపుసాదదాయినీం జగర్జ సింహోఽపి సటాం విధూనయన్ ॥

తతో నిశుంభస్తుహినాచలస్థితాం విలోక్య రమ్యాభరణాయుధాం శివామ్ ।

గిరం బభాషే రసనిర్భరాం పరాం విలాసినీ భావవిచక్షణో యథా ॥

భవాదృశీనాం రమణీయవిగ్రహే దునోతి కీర్ణం ఖలు మాలతీదలమ్ ।

కథం కరాలాహవమాతనోష్యసే మహేశి తేనైవ మనోజ్ఞవర్ష్మణా ॥

ఇతీరయిత్వా వచనం మహాసురో బభూవ మౌనీ తమువాచ చండికా ।

వృథా కిమాత్థాసుర మూఢ సంగరం కురుష్వ నాగాలయమన్యథా వ్రజ ॥

తతోఽతిరుష్టస్సమరే మహారథశ్చకార బాణావలి వృష్టిమద్భుతామ్ ।

ఘనాఘనాస్సంవవృషుర్యథోదకం రణస్థలే ప్రావృడివాగతా తదా ॥

శరైశ్శితైశ్శూలపరశ్వథాయుధైస్స భిందిపాలైః పరిఘైశ్శరాసనైః ।

భుశుండికా ప్రాసక్షురప్రసంజ్ఞకైర్మహాసభిస్సంయయుధే మదోద్ధతైః ॥

విబభ్రముస్తత్సమరే మహాగజా విభిన్నకుంభా అసితా ద్రిసన్నిభాః ।

చలద్బలాకాధవలా వికేతవో విసేతవశ్శుంభని కుంభకేతవః ॥

విభిన్నదేహా దితిజా ఝుషోపమా వికంధరా వాజిగణా భయంకరాః ।

పరాసవః కాలికయా కృతా రణే మృగారిణా చాశిషతాపరేఽసురాః ॥

విసు స్రువూ రక్తవహాస్తదంతరే సరిచ్చయాస్తత్ర విపుప్లవే హతైః ।

కచా భటానాం జలనీలికోపమాస్త దుత్తరీయం సితఫేన సన్నిభమ్ ॥

తురంగసాదీ తురగాధిరోహిణం గజస్థితానభ్యపతన్ గజారుహః ।

రథీ రథేశం ఖలు పత్తి రంఘ్రిగాన్ సమప్రతిద్వంద్వికలిర్మహానభూత్ ॥

తతో నిశుంభో హృదయే వ్యచింతయత్కరాలకాలోఽయముపాగతోఽధునా ।

భవేద్దరిద్రోఽపి మహాధనో మహాధనో దరిద్రో విపరీతకాలతః ॥

అపుడు ఈ విధముగా వచ్చి పడుచున్న శత్రు సేనలను గాంచి అంబిక ధనస్సుపై నారిత్రాటిని ఎక్కించి, శత్రువులకు దుఃఖమునిచ్చే ఘంటను మ్రోగించెను. సింహము కూడ జూలును విదల్చి గర్జించెను. అపుడు నిశుంభుడు హిమవత్పర్వతముపై నున్న శివాదేవిని చూచెను. ఆమె అందమగు ఆభరణములను, ఆయుధములను ధరించియుండెను. ఆతడు సుందరయువతుల మనోగతమునెరింగిన దిట్టవలె ఆమెను ఉద్దేశించి మాధుర్యముతో నిండియున్న శ్రేష్ఠమగు వచనమును పలికెను. ఓ సుందరాంగీ ! మల్లెపూవులను విసరిననూ నీ వంటి వారల దేహము కందిపోవును. నీవు ఈ మనోహరమగు దేహముతో సర్వసమర్థుడగు శత్రువునకు ఎదురుగా భయంకరమగు యుద్ధమును ఎట్లు చేయగలుదువు ? ఆ గొప్ప రాక్షసుడు ఇట్లు పలికి మిన్నకుండగా, చండిక వానితో నిట్లనెను : ఓ మూర్ఖ రాక్షసుడా ! వ్యర్థమగు మాటలను పలుకుచుంటివేల ?

యుద్ధమును చేయుము. లేదా, పాతాళమునకు పొమ్ము. అపుడు మహారథుడగు ఆ రాక్షసుడు మిక్కిలి కోపించి బాణపరంపరలను అద్భుతమగు వర్షముగా కురిపించెను. దట్టని మేఘములు జలధారలను వర్షించుచున్నవా యన్నట్లు బాణములు పడెను. ఆ సమయములో యుద్ధరంగమునకు వర్షకాలము వచ్చినదా యన్నట్లుండెను. బలముచే గర్వించియున్న అనుచరులతో గూడి ఆ రాక్షసుడు పొడి బాణములను, శూలములు మరియు గొడ్డళ్లు అను ఆయుధములను, భిందిపాలములను, పరిఘలను, భుశుండములను, ప్రాసలను, చురకలను, పెద్దకత్తులను వాడుతూ, ధనస్సుల నుండి బాణములను ప్రయోగిస్తూ గొప్ప యుద్ధమును చేసెను. ఆ యుద్ధములో నల్లని పర్వతముల వలెనున్న పెద్ద ఏనుగులు పగిలిన కుంభస్థలములు గలవై ఇటునటు తిరుగాడుచుండెను. శుంభనిశుంభుల తెల్లని ధ్వజములు హద్దులను దాటి కొంగలవలె రెపరెప లాడినవి. యుద్ధములో కాలిక రాక్షసుల దేహములను చేపలను వలె చీల్చి తలలను మొండెములనుండి వేరు చేసెను. ఆమెచే సంహరింపబడిన గుర్రముల గుంపులు భయమును గొల్పెను. సింహము కూడ మరికొందరు రాక్షసులను భక్షించేను. యుద్ధరంగ మధ్య భాగములో రక్తపుటేరులు పారెను. మరణించిన యోధుల దేహములు వాటిలో తేలియాడుచుండెను. భటుల కేశములు నీటి నాచును, వారి ఉత్తరీయములు తెల్లని నురగను పోలియుండెను. గుర్రపు జోదు గుర్రపు జోదుతో, ఏనుగుపై నున్న వీరుడు మరియొక అట్టి వీరునితో, రథికుడు రథికునితో, పదాతులు పదాతులతో, ఈ విధముగా వీరులు తమతో సమానమగు స్థితిలో నున్న శత్రు వీరులతో గొప్ప యుద్ధమును చేసిరి. అపుడు నిశుంభుడు తన మనస్సులో నిట్లు తలపోసెను : ఇపుడు భయంకరమగు కాలము ఆసన్నమైనది. కాలవైపరీత్యము సంప్రాప్తమైనప్పుడు దరిద్రుడు గొప్ప ధనవంతుడగను, గొప్ప ధనికుడు దరిద్రుడుగను అగుదురు.

జడో భవేత్ స్ఫీతమతిర్మహామతిర్జడో నృశంసో బహుమంతు సంస్తుతః ।
పరాజయం యాంతి రణే మహాబలా జయంతి సంగ్రామముఖే చ దుర్బలాః ॥
జయోఽ జయో వా పరమేశ్వరేచ్ఛయా భవత్యనాయాసత ఏవ దేహినామ్ ।
న కాలముల్లంఘ్య శశాక జీవితుం మహేశ్వరః పద్మజనీ రమాపతిః ॥
ఉపేత్య సంగ్రామసుఖం పలాయనం న సాధు వీరా హృదయేఽనుమన్వతే ।
పరం తు యుద్ధే కథమేతయా జయో వినాశితం మే సకలం బలం యథా ॥
ఇయం హి నూనం సురకర్మ సాధితుం సమాగతా దైత్యబలం చ బాధితుమ్ ।
పురాణమూర్తిః ప్రకృతిః పరా శివా న లౌకికీయం వనితా కదాపి వా ॥
వధోఽపి నారవిహితోఽయశస్కరః ప్రగీయతే యుద్ధరసం లిలిక్షుభిః ।
తథాప్య కృత్వా సమరం కథం ముఖం ప్రదర్శయామో ఽసురరాజసన్నిధౌ ॥
విచారయిత్వేతి మహారథో రథం మహాంతమధ్యాస్య నియంతృ చోదితమ్ ।
యయౌ ద్రుతం యత్ర మహేశ్వరాంగనా సురాంగనా ప్రార్థితయౌవనోద్గమా ॥
అవోచదేనాం స మహేశి కిం భవేదేభిర్హ్యతైర్వేతనజీవిభిర్భటైః ।
తవాస్తి కాంక్షా యది యోద్ధుమావయోస్తదా రణస్స్యాద్ధృతయుద్ధ సత్పటైః ॥

ఉవాచ కాలీం ప్రతి కౌశికీ తదో సమీక్ష్యతామేష దురాగ్రహోఽనయోః ।
కరోతి కాలో విపదాగమే మతిం విభిన్నవృత్తాం సదసత్సు వర్తకః ॥
తతో నిశుంభోఽభిజఘాన చండికాం శరైస్సహస్రైశ్చ తథైవ కాలికామ్ ।
బిభేద బాణానసుర ప్రచోదితాన్ సహస్రఖండం స్వవరో త్కరైశ్శివా ॥
తతస్సముత్థాయ కృపాణముజ్జ్వలం స చర్మ కంఠీరవమూర్ధ్న్య తాడయత్ ।
బిభేద తం చాపి మహాసినాంబికా యథా కుఠారేణ తరుం తరుశ్చిదః ॥
స భిన్నఖడ్గో నిచఖాన మార్గణం పరాంబికావక్షసి సోఽపి చిచ్ఛిదే ।
పునస్త్రిశూలం హృదయేఽ క్షిపత్తదప్యచూర్ణయన్ముష్టి నిపాతనేన సా ॥
గదాం సమాదాయ పునర్మహారథోఽ భ్యధావదంబాం మరణోన్ముఖోఽసురః ।
అచూర్ణయత్తమపి శూలధారయా పునస్త్రిశూలం విదదార సోఽన్యయా ॥
తతోంబికా భీమభుజంగమోపమై స్స్ఫురద్విషాం శోణితచూషణోచితైః ।
నిశుంభూత్మీయశిలీముఖైశ్శితైర్నిహత్య భూమీమనయద్విషోక్షితైః ॥

కాలవైపరీత్యము వచ్చినప్పుడు మూర్ఖుడు మహాబుద్ధిశాలియగును. మహాబుద్ధిశాలి మూర్ఖుడగును. క్రూరుడు మహాత్ముల ప్రశంసలనందుకొనును. మహాబలశాలురు యుద్ధములో పరాజితులై, బలహీనులు విజయమును పొందెదరు. ప్రాణులకు జయపరాజయములు పరమేశ్వరుని ఇచ్చచే మాత్రమే అనాయాసముగా లభించుచుండును. బ్రహ్మ విష్ణుమహేశ్వరులైననూ కాలమునతిక్రమించి జీవించలేరు. యుద్ధరంగమునకు వచ్చి వెనుకకు దీరుగుట మంచి పని కాదు. అట్టి పనిని వీరులు తను హృదయములో ఆమోదించరు. కాని యుద్ధములో ఈమెను జయించుట యెట్లు ? నా సైన్యమంతయు వినాశమును పొందినది. ఇది నిశ్చితముగా దేవతల పనియే. సనాతన ప్రకృతి, పరాభట్టారిక అగు శివాదేవీ రాక్షససైన్యమును పీడించి దేవకార్యమును సిద్ధింపజేయుటకు వచ్చియున్నది. ఈమె నిస్సందేహముగా సామాన్య స్త్రీ కాదు. యుద్ధమును ప్రేమించే వీరులు స్త్రీ హత్య అపకీర్తిని ఇచ్చునని నొక్కి చెప్పుచున్నారు. కాని, యుద్ధమును మానివేసినచో, రాక్షసచక్రవర్తి సమక్షములో ముఖమును ఎట్లు చూపించగలము ? మహారథుడగు నిశుంభుడు ఈ విధముగా తలపోసి సారథిచే నడుపబడే గొప్ప రథమునెక్కి, దేవతాస్త్రీలు కూడ కోరదగిన యౌవనప్రాభవము గల ఆ మహేశ్వర పత్నియగు శివాదేవి ఉన్న స్థానమునకు వేగముగా వెళ్లాను. ఆతడు ఆమెతో నిట్లనెను : ఓ మహేశ్వరీ ! జీతముతో బ్రతికే ఈ భటులను సంహరించినచో నేమగును ? నీకు యుద్ధమును చేయవలెననే ఆకాంక్ష ఉన్నచో, యుద్ధమునకు ఉచితమగు చక్కని వస్త్రములను దాల్చియున్న మనము ఇద్దరము యుద్ధమును చేసెదము గాక !అపుడా కౌశికి అను పేరు గల కాళి ఇట్లు పలికెను : వీరిద్దరి మూర్ఖపు పట్టుదలను చూచి తీరవలసినదే. ధర్మాధర్మములను ప్రవర్తిల్లజేయు కాలము, ఆపద సంప్రాప్తమైనప్పుడు జీవుని బుద్ధిని తప్పుదోవ పట్టించును. అపుడు నిశుంభుడు భయంకరాకారయగు కాళిని వేలాది బాణములతో అంతటా కొట్టెను. ఆ శివాదేవి రాక్షసునిచే ప్రయోగింపబడిన బాణములను తన బాణపరంపరలను గుప్పించి వేయి వేయి ముక్కలుగా చేసెను. అపుడాతడు లేచి నిలబడి మిరిమిట్లు

గొలిపే కత్తిని డాలును పట్టుకొని, ఆ కత్తితో సింహమును తలపై కొట్టెను. అంబిక అపుడు చెట్లను నరుకు జనులు గొడ్డలితో చేట్టును కూల్చిన విధముగా ఆ కత్తిని తన పెద్ద కత్తితో విరుగగొట్టెను. విరిగిన కత్తి గల ఆ నిశుంభుడు ఆ జగన్మాతయొక్క వక్షఃస్థలమును బాణముతో గ్రుచ్చెను. ఆ బాణము కూడ విరిగిపోయేను. ఆతడు మరల త్రిశూలమును ఆమె హృదయముపై ప్రయోగించగా, ఆమె దానిని కూడ పిడికిలితో కొట్టి నుగ్గు చేసెను. మరణమునకు అభిముఖుడై యున్న మహారథుడగు ఆ రాక్షసుడు మరల గదను చేతబట్టి జగన్మాత పైకి పరుగెత్తగా, ఆమె దానిని తన శూలము యొక్క పదునైన అంచుతో పొడి చేసెను. అపుడాతడు మరియొక గదతో మరల ఆమె త్రిశూలమును విరుగగొట్టెను. అపుడు అంబిక భయంకరమగు పాములను పోలియున్నవి, రాక్షసుల రక్తమును త్రాగుటకు సమర్ధములైనవి, విషము పూయబడినవి అగు తన వాడి బాణములతో నిశుంభుని కొట్టి నేల గూల్చెను.

నిపాతితేఽమానబలేఽ సురప్రభుః కనీయసి భ్రాతరి రోషపూరితః ।
రథస్థితో బాహుభిరష్టభిర్వృతో జగామ యత్ర ప్రమదా మహేశితుః ॥
అవాదయచ్ఛంఖ మరిందమం తదా ధనుస్స్వనం చాపి చకార దుస్సహమ్ ।
ననాద సింహోఽపి సటాం విధూనయన్ బభూవ నాదత్రయనాదితం నభః ॥
తతోఽట్టహాసం జగదంబికాఽ కరో ద్విత్రస్తసుస్తేన సురారయోఽఖిలాః ।
జయేతి శబ్దం జగదుస్తదా సురా యదాంబికోవాచ రణే స్థిరో భవ ॥
స దైత్యరాజో మహతీం జ్వలచ్ఛిఖాం ముమోచ శక్తిం నిహతా చ సోల్కయా ।
బిభేద శుంభప్రహితాన్ శరాన్ శివా శివేరితిన్ సోఽపి సహస్రధా శరాన్ ॥
త్రిశూలముత్ క్షిప్య జఘాన చండికా మహాసురం తం స పపాత మూర్ఛితః ।
విభిన్నపక్షో హరిణా యథా నగః ప్రకంపయన్ ద్యాం వసుధాం స వారిధిమ్ ॥
తతో మృషిత్వా త్రిశిఖోద్భవాం వ్యథాం విధాయ బాహూనయుతం మహాబలః ।
స కాలికాం సింహయుతాం మహేశ్వరీం జఘాన చక్రై రమరక్షయంకరైః ॥
తదస్తచక్రాణి విభిద్య లీలయా త్రిశూలముద్గూర్య జఘాన సాసురమ్ ।
శివా జగత్పావనపాణి పంకజాదుపాత్తమృత్యూ పరమం పదం గతౌ ॥
హతే తస్మిన్మహావీర్యే నిశుంభే భీమవిక్రమే ।
శుంభే చ సకలా దైత్యా వివిశుర్బలిసద్మని ॥
భక్షితా అపరే కాలీ సింహాద్యైరమరద్విషః ।
పలాయితాస్తథాన్యే చ దశదిక్షు భయాకులాః ॥
బభూవుర్మార్గవాహిన్యస్సరితస్స్వచ్ఛపాథసః ।
వవుర్వాతాస్సుఖస్సర్శా నిర్మలత్వం యయౌ నభః ॥
పునర్యాగస్సమారేభే దేవైర్బ్రహ్మర్షిభి స్తథా ।
సుఖినశ్చాభవన్ సర్వే మహేంద్రాద్యా దివౌకసః ॥
పవిత్రం పరమం పుణ్యముమాయాశ్చరితం ప్రభో ।
దైత్యరాజవధోపేతం శ్రద్ధయా యస్సమభ్య సేత్ ॥
స భుక్త్వేహాఖిలాన్ భోగాన్ త్రిదశైరపి దుర్లభాన్ ।
పరత్రో మాలయం గచ్ఛేన్మహామాయా ప్రసాదతః ॥
ఏవం దేవీ సముత్పన్నా శుంభాసురనిబర్హిణీ ।
ప్రోక్తా సరస్వతీ సాక్షాదుమాంశావిర్భవా నృప ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం నిశుంభశుంభవధో నామ
అష్టాచత్వారింశోఽధ్యాయః ॥

అంచనా వేయ శక్యము కాని బలము గల తన తమ్ముడు నేలకూలగా రోషముతో నిండియున్న రాక్షసరాజగు శుంభుడు ఎనిమిది బాహువులు గలవాడై రథమునందున్నవాడై మహేశ్వరపత్ని ఉన్న స్థానమునకు వెళ్లెను (37). అపుడాతడు శత్రువులకు పీడను కలిగించే శంఖధ్వనిని చేసి, సహింప శక్యము కానీ విధముగా ధనుష్టంకారమును చేసెను. సింహము కూడ జూలును విదల్చి నాదమును చేయగా, ఆ మూడు ధ్వనులతో ఆకాశము మారుమ్రోగెను (38). అపుడా జగన్మాత అట్టహాసమును చేయగా, రాక్షసులందరు చాల భయపడిరి. అపుడు దేవతలు జయధ్వనులను చేసిరి. అపుడు అంబిక, 'యుద్ధములో స్థిరముగా నిలబడుము' అని పలికెను (39). ఆ రాక్షసరాజు జ్వాలలతో ప్రకాశించే పెద్ద శక్తిని ప్రయోగించెను. అది ఉల్కచే భగ్నము చేయబడెను. శివాదేవి శుంభునిచే ప్రయోగింపబడిన బాణములను విరగగొట్టెను. ఆతడు కూడ ఆమెచే ప్రయోగింపబడిన బాణములను వేయి వేయి ముక్కలుగా చేసెను (40). అపుడా చండిక త్రిశూలమును పైకెత్తి ఆ గొప్ప రాక్షసుని కొట్టగా, ఆతడు మూర్ఛిల్లి క్రింద పడెను. ఇంద్రునిచే రెక్కలు తేగగొట్టబడిన పర్వతము వలె ఆతడు క్రింద బడగానే, సముద్రముతో కూడిన భూమి మరియు స్వర్గలోకము కూడ అధికముగా కంపించెను (41). అపుడా మహాబలుడగు రాక్షసుడు త్రిశూలపు దెబ్బవలన కలిగిన నొప్పికి తట్టుకొని పదివేల బాహువులు గలవాడై దేవతలను నాశమొనరే చక్రములతో మహేశ్వరియగు కాళికను, మరియు సింహమును కొట్టెను (42). వానిచే ప్రయోగించబడిన చక్రములను అవలీలగా విరుగకొట్టి ఆ శివాదేవి త్రిశూలమును పైకెత్తి ఆ రాక్షసుని దానితో సంహరించెను. లోకములను పవిత్రము చేసే, పద్మముల వంటి ఆమె చేతులలో ప్రాణములను విడిచిన ఆ రాక్షసులిద్దరు మోక్షమును పొందిరి (43). మహాబలుడగు ఆ నిశుంభుడు, మరియు భయంకరమగు పరాక్రమముగల శుంభుడు సంహరింపబడగానే, రాక్షసులందరు బలియొక్క గృహము (పాతాళము) ను ప్రవేశించిరి (44). కాళి, సింహము మొదలగు వారు కొందరు రాక్షసులను భక్షించిరి. మరికొందరు భయముచే కంగారుపడి పదిదిక్కులకు పారిపోయిరీ (45). నదులు స్వచ్ఛజలములు గలవి తమ మార్గములో ప్రవహింపజొచ్చినవి. వాయువులు సుఖమగు స్పర్శ కలుగునట్లు వీచినవి. ఆకాశము నిర్మలమయ్యెను (46). దేవతలు మరియు బ్రహ్మర్షులు మరల యజ్ఞములను చక్కగా ఆరంభించిరి. ఇంద్రుడు మొదలగు దేవతలందరు సుఖమును పొందిరి (47). ఓ రాజా! పావనము, పుణ్యప్రదము, రాక్షసరాజుల వధ అనే వృత్తాంతముతో కూడియున్నది అగు ఉమాదేవి చరిత్రను ఎవడైతే శ్రద్ధతో చక్కగా అభ్యసించునో (48), వాడు ఇహలోకములో దేవతలకు కూడ లభింప శక్యము కాని భోగముల నన్నిటినీ అనుభవించి, మరణించిన పిదప మహామాయా స్వరూపిణియగు ఉమయొక్క అనుగ్రహముచే ఆమె యొక్క ధామమును పొందును (49). ఓ రాజా ! ఈ తీరున శుంభాసురుని సంహరించిన సరస్వతీదేవి సాక్షాత్తుగా ఉమయొక్క అంశమై ఆవిర్భవించినదని చెప్పబడెను.

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు శుంభనిశుంభవధ అనే నలుబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది.

49 – ఉమా ప్రాదుర్భావము

మునయ ఊచుః ।

ఉమాయా భువనేశాన్యాసూత సర్వార్థవిత్తమ ।
అవతారం సమాచక్ష్వ యతో జాతా సరస్వతీ ॥
యా గీయతే పరబ్రహ్మ మూలప్రకృతి రీశ్వరీ ।
నిరాకరాపి సాకారా నిత్యానందమయీ సతీ ॥

మునులు ఇట్లు పలికిరి –

ఓ సూతా ! సర్వవిషయములనెరింగిన జ్ఞానులలో నీవు శ్రేష్ఠుడవు. భువనేశ్వరియగు ఉమాదేవి యొక్క అవతారమును గురించి చెప్పుము. సరస్వతి ఆమెనుండియే పుట్టినది (1). ఆమె పరబ్రహ్మయొక్క మూల ప్రకృతియగు ఈశ్వరి; ఆకారము లేకున్ననూ ఆకారముతో ఆవిర్భవించును. ఆమె నిత్యానందస్వరూపురాలగు సతీదేవి యని కీర్తింపబడుచున్నది .

సూత ఉవాచ ।

తాపసాశ్శృణుత ప్రేమ్ణా చరిత్రం పరమం మహత్ ।
యస్య విజ్ఞానమాత్రేణ నరో యాతి పరాంగతిమ్ ॥
దేవదానవయోర్యుద్ధమేకదాసీత్పరస్పరమ్ ।
మహామాయా ప్రభావేణామరాణాం విజయోఽ భవత్ ॥
తతోఽవలిప్తా అమరాస్స్వప్రశంసాం వితేనిరే ।
వయం ధన్యా వయం ధన్యాః కిం కరిష్యంతి నోఽసురాః ॥
యే ప్రభావం సమాలోక్యాస్మాకం పరమదుస్సహమ్ ।
భీతా నాగాలయం యాతా యాత యాతేతి వాదినః ॥
అహో బలమహో తేజో దైత్యవంశ క్షయంకరమ్ ।
అహో భాగ్యం సుమనసామేవం సర్వేఽ భ్యవర్ణయన్ ॥
తత ఆవిరభూత్తేజః కూటరూపం తదైవ హి ।
అదృష్టపూర్వం తద్దృష్ట్వా విస్మితా అభవన్ సురాః ॥
కిమిదం కిమిదం చేతి రుద్ధకంఠాస్స మబ్రువన్।
అజానంతః పరం శ్యామానుభావం మానభంజనమ్ ॥
తత ఆజ్ఞాపయద్దేవాన్ దేవానామధినాయకః ।
యాత యూయం పరీక్షధ్వం యాథాతథ్యేన కిన్వితి ॥
సురేంద్ర ప్రేరితో వాయుర్మహసస్సన్నిధిం గతః ।
కస్త్వం భోరితి సంబోధ్యావోచదేనం చ తన్మహః ॥
ఇతి పృష్టస్తదా వాయుర్మహసాతి గరీయసా ।
వాయురస్మి జగత్ప్రాణసాభిమానోఽ బ్రవీదిదమ్ ॥

జంగమాజంగమం సర్వమోత ప్రోతమిదం జగత్ ।

మయ్యేవ నిఖిలాధారే చాలయామ్యఖిలం జగత్ ॥

సూతుడిట్లు పలికెను -

ఓ మునులారా ! మిక్కిలి గొప్పది యగు ఈ చరిత్రను ప్రేమతో వినుడు. మానవుడు దీనిని తెలుసుకున్నంత మాత్రముచే మోక్షమును పొందును (3). ఒకప్పుడు దేవతలకు, రాక్షసులకు మధ్యలో యుద్ధము జరిగెను. దానియందు మహామాయయొక్క ప్రభావముచే దేవతలకు విజయము లభించెను (4). అపుడు దేవతలు గర్వించి తమ గొప్పదనమును అధికముగా చాటించుటకు మొదలిడిరి: మేము ధన్యులము, మేము ధన్యులము. రాక్షసులు మమ్ములనేమి చేయగలరు ? (5) వారు మిక్కిలి సహింప శక్యము కాని మా ప్రభావమును గాంచి భయపడి 'నడువుడు, నడువుడు' అనీ పలుకుతూ పాతాళమునకు పోయిరి (6). ఆశ్చర్యము ! ఆశ్చర్యము ! మన బలము, తేజస్సు రాక్షసవంశమును నాశనమొనర్చినవి. దేవతల భాగ్యము గొప్పది. ఈ విధముగా వారందరు అధికముగా వర్ణించుచుండిరి (7), అపుడు అక్కడనే ఒక రాశి రూపములో తేజస్సు ఆవిర్భవించెను. అట్టి తేజస్సును వారెన్నడూ చూడలేదు. దానిని చూచి దేవతలు చకితులైరి (8). ఇది యేమి ? ఇది యేమి ? అని వారు భయముచే అడ్డుకట్ట వేయబడిన కంఠములతో పలుకుచుండిరి. గర్వమునడంచే మహామాయా ప్రభావమును వారు తెలియలేకపోయిరి (9). అపుడు దేవప్రభువు 'మీరు వెళ్లి దీని స్వరూపమును యథాతథముగా పరిశీలించుడు' అనీ దేవతలనాజ్ఞాపించెను (10). ఇంద్రునిచే ప్రేరేపింపబడిన వాయువు ఆ తేజస్సు వద్దకు వెళ్లాను. "ఓయీ! నీవెవరు? అని సంబోధించి, ఆ తేజస్సు వాయువును ప్రశ్నించేను (11). అపుడీ తీరున మిక్కిలి పెద్దదియగు ఆ తేజస్సుచే ప్రశ్నించబడిన వాడై, వాయువు గర్వముతో ఇట్లు చెప్పెను : నేను వాయువును. జగత్తునకు ప్రాణము నేనే. కదిలే మరియు కదలని ప్రాణులతో కూడియున్న ఈ జగత్తు సర్వాధారుడనగు నాయందు మాత్రమే పడుగు- పేక వలె పూర్తిగా ఆధారపడియున్నది. జగత్తునంతనూ నడుపువాడను నేనే.

తదోవాచ మహాతేజశ్శక్తోఽసి యది చాలనే ।

ధృతమేతత్తృణం వాయో చాలయస్వ నిజేచ్ఛయా ॥

తతస్సర్వప్రయత్నేనాకరో ద్యత్నం సదాగతిః ।

న చచాల యదా స్థానాత్తదాసౌ లజ్జితోఽ భవత్ ॥

తూష్ణీం భూత్వా తతో వాయుర్జగామేంద్ర సభాం ప్రతి ।

కథయామాస తద్వృత్తం స్వకీయాభి భవాన్వితమ్ ॥

సర్వేశత్వం వయం సర్వే మృషైవాత్మని మన్మహే ।

న పారయామహే కించిద్విధాతుం క్షుద్రవస్త్వపి॥

తతశ్చ ప్రేషయామాస మరుత్వాన్ సకలాన్ సురాన్ ।

న శేకుస్తే యదా జ్ఞాతుం తదేంద్రస్స్వయమభ్యగాత్ ॥

మఘవంతమథాయాంతం దృష్ట్వా తేజోఽతిదుస్సహమ్ ।
బభూవాంతర్హితం సద్యో విస్మితోఽభూచ్చ వాసవః ॥
చరిత్రమీదృశం యస్య తమేవ శరణం శ్రయే ।
ఇతి సంచింతయామాస సహస్రాక్షః పునః పునః ॥
ఏతస్మిన్నంతరే తత్ర నిర్వ్యాజకరుణాతనుః ।
తేషామనుగ్రహం కర్తుం హర్తుం గర్వం శివాంగనా ॥
చైత్రశుక్లనవమ్యాం తు మధ్యాహ్నస్థే దివాకరే ।
ప్రాదురాసీదుమా దేవీ సచ్చిదానందరూపిణీ ॥
మహీమధ్యే విరాజంతీ భాసయంతీ దిశో రుచా ।
బోధయంతీ సురాన్ సర్వాన్ బ్రహ్మైవాహమితి స్ఫుటమ్ ॥
చతుర్భిర్దధతీ హస్తైర్వరపాశాంకుశా భయాన్ ।
శ్రుతిభిస్సేవితా రమ్యా నవయౌవనగర్వితా ॥
రక్తాంబరపరీధానా రక్తమాల్యానులేపనా ।
కోటికందర్పసంకాశా చంద్రకోటిసమప్రభా ॥
వ్యాజహీర మహామాయా సర్వాంతర్యామిరూపిణీ।
సాక్షిణీ సర్వభూతానాం పరబ్రహ్మ స్వరూపిణీ ॥

అపుడా మహాతేజస్సు ఇట్లు పలికెను : ఓ వాయూ ! నీకు కదిల్చే శక్తి ఉన్నచో, ఈ గడ్డిపోచను నీ ఇచ్ఛ వచ్చినట్లు కదల్చుము. నేను దీనిని పట్టుకోని యున్నాను (14). అపుడు వాయువు పూర్ణ ప్రయత్నమును చేసియూ దానిని ఆ స్థానమునుండి కదల్చలేక పోయెను. అప్పుడాయన సిగ్గుపడెను (15), అపుడు వాయువు మారు మాటాడక ఇంద్ర సభకు వెళ్లి తనకు జరిగిన ఆ పరాభవ వృత్తాంతమును చెప్పెను (16). మనము అందరము సర్వసమర్థులమనీ తలంచుచున్నాము. ఇది నిశ్చయముగా తప్పు. మనము అల్పమగు వస్తువునైననూ కొంచెమైననూ కదల్చలేము (17). తరువాత ఇంద్రుడు దేవతలనందరినీ పంపించేను. వారు విషయమును తెలియలేకపోయిరి. అపుడు ఇంద్రుడు స్వయముగా వెళ్లాను (18), మిక్కిలి సహింప శక్యము కాని ఆ తేజస్సు అపుడు ఇంద్రుడు వచ్చుచుండుటను గాంచి వెంటనే అంతర్ధానమయ్యెను. ఇంద్రుడు చకితుడయ్యెను (19). 'ఇటువంటి మహిమాన్వితమగు చరితము ఎవ్వానికి గలదో, వానినే నేను శరణు వేడుచున్నాను' అని ఇంద్రుడు పలుమార్లు తలపోసెను (20). అదే సమయములో నిష్కారణమగు కరుణ మూర్తీభవించినది అనదగిన ఆ పార్వతీదేవి వారి గర్వమును పోగొట్టి అనుగ్రహించుట కొరకై చైత్రశుక్ల నవమినాడు, సూర్యుడు మిట్టమధ్యాహ్న సమయములో నడినెత్తిపై నుండగా ఆవిర్భవించెను. ఆ ఉమాదేవి సచ్చిదానంద స్వరూపురాలు (21, 22). ఆమె భూమధ్యములో ప్రకాశిస్తూ దిక్కులను కాంతులతో ప్రకాశింప జేయుచూ దేవతలందరికి స్పష్టముగా ఓ 'బ్రహ్మను నేనే' అను మహావాక్యమును బోధించుచుండెను (23). ఆమె నాలు చేతులలో వరముద్రను, పాశమును, అంకుశమును, అభయముద్రను దాల్చియుండెను. నూతన యౌవనముతో

గర్వించియున్న ఆ సుందరిని వేదములు సేవించుచుండెను (24). ఆమె ఎర్రని చీరను ధరించి, ఎర్రని మాలను దాల్చి, కోటి మన్మథులను పోలియున్నదై, కోటి చంద్రులతో సమమగు కాంతిని కలిగియుండెను (25), సర్వప్రాణులలో అంతర్యామి రూపముగ నున్నదీ, సర్వప్రాణుల కర్మలకు సాక్షి మరియు పరబ్రహ్మ స్వరూపిణీ అగు ఆ మహామాయ ఇట్లు పలికెను.

ఉమోవాచ।

న బ్రహ్మ న సురారాతిర్న పురారాతిరీశ్వరః ।
మదగ్రే గర్వితుం కించిత్కా కథాన్యసు పర్వణామ్ ॥
పరం బ్రహ్మ పరం జ్యోతిః ప్రణవ ద్వంద్వరూపిణీ ।
అహమేవాస్మి సకలం మదన్యో నాస్తి కశ్చన ॥
నిరాకారాపి సాకారా సర్వతత్త్వ స్వరూపిణీ ।
అప్రతర్క్యగుణా నిత్యా కార్యకారణరూపిణీ ॥
కదాచిద్దయితాకారా కదాచిత్పురుషాకృతిః ।
కదాచిదు భయాకారా సర్వాకారాహమీశ్వరీ ॥
విరించిస్సృష్టికర్తాహం జగత్పాతాహమచ్యుతః ।
రుద్రస్సంహార కర్తాహం సర్వవిశ్వవిమోహినీ ॥
కాలికా కమలా వాణీ ముఖాస్సర్వా హి శక్తయః ।
మదంశాదేవ సంజాతాస్తథేమాస్స కలాః కలాః ॥
మత్ప్ర భావాజ్జితాస్సర్వే యుష్మాభిర్దితినందనాః ।
తామవిజ్ఞాయ మాం యూయం వృథా సర్వేశమానినం ॥
యథా దారుమయీం యోషాం నర్తయత్యైంద్రజాలికః ।
తథైవ సర్వభూతాని నర్తయామ్యహమీశ్వరీ ॥
మద్భయాద్వాతి పవనస్సర్వం దహతి హవ్యభుక్ ।
లోకపాలాః ప్రకుర్వంతి స్వస్వకర్మణ్యనారతమ్ ॥

కదాచిద్దేవ వర్గాణాం కదాచిద్దితి జన్మనామ్ ।
కరోమి విజయం సమ్యక్ స్వతంత్రా నిజలీలయా ॥
అవినాశి పరం ధామ మాయాతీతం పరాత్పరమ్ ।
శ్రుతయో వర్ణయంతే యత్తద్రూపం తు మమైవ హి ॥
సగుణం నిర్గుణం చేతి మద్రూపం ద్వివిధం మతమ్ ।
మాయాశబలితం చైకం ద్వితీయం తదనా శ్రితమ్ ॥
ఏవం విజ్ఞాయ మాం దేవాస్స్వం స్వం గర్వం విహాయ చ।
భజత ప్రణయోపేతాః ప్రకృతిం మాం సనాతనీమ్ ॥
ఇతి దేవ్యా వచశ్శ్రుత్వా కరుణా గర్భితం సురాః ।
తుష్టువుః పరమేశానీం భక్తి సంనత కంధరాః ॥
క్షమస్వ జగదీశాని ప్రసీద పరమేశ్వరి ।
మైవం భూయాత్క దాచిన్నో గర్వో మాతర్దయాం కురు ॥
తతః ప్రభృతి తే దేవా హిత్వా గర్వం సమాహితాః ।
ఉమామారాధయామాసుర్యథా పూర్వం యథావిధి ॥
ఇతి వః కథితో విప్రా ఉమా ప్రాదుర్భవో మయా ।
యస్య శ్రవణమాత్రేణ పరమం పదమశ్నుతే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం ఉమా ప్రాదుర్భావవర్ణనం నామ
ఏకోనపంచాశత్తమోఽ ధ్యాయః ॥

ఉమ ఇట్లు పలికెను -

బ్రహ్మ గాని, విష్ణువు గాని, శివుడు గాని నా యెదుట గర్వించుటకు సమర్థులు గారు. ఇతరదేవతల గురించి చెప్పునదేమున్నది ?(27) సర్వాభాసకమగు చైతన్యము, ఓంకార రూపము, సుఖదుఃఖాది ద్వంద్వములను ప్రకాశింప జేయునది, సర్వజగద్రూపము అగు పరం బ్రహ్మ నేనే. నాకంటే భిన్నముగా ఏదీ లేదు (28). వాస్తవముగా ఆకారము లేకున్ననూ ఆకారమును దాల్చునది, తత్త్వములన్నింటి యొక్క యథార్థస్వరూపము అయి ఉన్నది, ఊహింప శక్యము గాని గుణములు గలది, అవినాశి, కార్యకారణరూపములో నున్నది. ఒకప్పుడు స్త్రీ రూపములో ఇంకోసారి పురుషరూపములో మరియొకప్పుడు ఆ రెండు రూపములలో నుంటూ ఆకారములన్నియు తానే అయి ఉన్న జగదీశ్వరిని నేనే (29,30). నేను బ్రహ్మనై సృష్టిని, విష్ణువునై జగద్రక్షణమును, రుద్రుడనై సంహారమును చేయుచూ, జగత్తునంతనూ విశేషముగా మోహింపజేయుచున్నాను (31). కాళీ, లక్ష్మి సరస్వతి మొదలగు శక్తులన్నియు నా అంశనుండి మాత్రమే పుట్టినవి. మరియు ఈ కళారూపములన్నియు నానుండి పుట్టుచున్నవి (32). నా ప్రభావము చేతనే రాక్షసులందరు మీచే జయించబడిరి. అట్టి నన్ను తెలుసుకొనలేక, "మేమే గొప్పవారము' అని మీరు తలంచుట వ్యర్థము (33). ఇంద్రజాలమును చూపించు వ్యక్తి కర్ర బొమ్మచే నాట్యమును చేయించు విధముగా సర్వేశ్వరిని అగు నేను ప్రాణులనన్నింటిని నాట్యము చేయించుచున్నాను (34). నా భయము వలననే వాయువు వీచుచున్నాడు; అగ్ని సర్వమును దహించుచున్నాడు; లోకపాలకులు తమ తమ విధులను నిరంతరముగా అనుష్ఠించుచున్నారు (35). స్వతంత్రురాలనగు నేను నా లీలను ప్రకటిస్తూ ఒకప్పుడు దేవతల వర్గములకు, మరియొకప్పుడు రాక్షసులకు చక్కని విజయమును చేకూర్చుచుందును (36). వినాశము లేనిది, పరమ గమ్యము, సర్వజగత్కారణమగు మాయకు అతీతమైనది అగు ఏ పరం బ్రహ్మను వేదములు వర్ణించుచున్నవో ఆ పరం బ్రహ్మ నా స్వరూపమే (37). నా రూపము సగుణము, నిర్గుణము అని రెండు రకములుగా నున్నది. మాయ ఉపాధిగా గలది సగుణము, మాయకు అతీతమైనది నిర్గుణము (38). ఓ దేవతలారా ! మీరీ విషయమును తెలుసుకొని మీ మీ గర్వములను విడనాడి భక్తితో గూడిన వారై సనాతన ప్రకృతినగు నన్ను సేవించుడు (39). దయాపూర్ణమగు దేవియొక్క ఈ పలుకుల నాలకించి దేవతలు భక్తితో మెడలను వంచి ఆ పరమేశ్వరిని స్తుతించిరి (40). ఓ జగదీశ్వరీ ! పరమేశ్వరీ ! క్షమించుము. ప్రసన్నురాలవు కమ్ము. మాకు ఎన్నడైననూ ఈ విధమైన గర్వము కలుగకుండు గాక ! ఓ తల్లీ ! దయను చూపుము (41), ఆ దేవతలు ఆనాటి నుండియు గర్వమును విడనాడి పూర్వము నందు వలెనే ఏకాగ్ర చిత్తము గలవారై యథావిధిగా ఉమాదేవిని ఆరాధించిరి (42). ఓ బ్రాహ్మణులారా! నేను మీకు ఉమాప్రాదుర్భావ చెప్పితిని. దీనిని విన్నంత మాత్రాన పరమ పదము లభించును (43).

శ్రీ శివమహాపురాణములోని ఉమాసంహితయందు ఉమా ప్రాదుర్భావమును వర్ణించే నలుబది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

50 – దుర్గా చరితము

మునయ ఊచుః ।

శ్రోతుకామా వయం సర్వే దుర్గాచరిత మన్వహమ్ ।
అపరం చ మహాప్రాజ్ఞ తత్త్వం వర్ణయ నోఽ ద్భుతమ్ ॥
శృణ్వతాం త్వన్ముఖాంభో జాత్కథా నానా సుధోపమాః ।
న తృప్యతి మనోఽస్మాకం సూత సర్వార్థ విత్తమ ॥

మునులు ఇట్లు పలికిరి –

ఓ మహాబుద్ధిశాలీ! మేమందరము ప్రతిదినము దుర్గాచరితమును వినగోరుచున్నాము. మాకు మరియొక అద్భుతమగు తత్త్వమును వర్ణించి చెప్పుము (1). ఓ సూతా ! సర్వవిషయములు తెలిసిన వారిలో నీవు శ్రేష్ఠుడవు. నీ ముఖపద్మమునుండి అమృతము వంటి అనేక గాథలను వినుచున్న మా మనస్సులకు తృప్తి కలుగుట లేదు .

సూత ఉవాచ ।

దుర్గమః ప్రథితో నామ్నా రురుపుత్రో మహాబలః ।
బ్రహ్మణో వరదానేన చతస్రోఽ లభత శ్రుతీః ॥
దేవాజేయబలం చాపి సంప్రాప్య జగతీతలే ।
కరోతి స్మ బహూన్ పాపాన్ దివి దేవాశ్చకంపిరే ॥
సర్వా నష్టేషు వేదేషు క్రియా నష్టా బభూవ హ।
బ్రాహ్మణాశ్చ దురాచారా బభూవుస్సురాస్తదా ॥
న దానం న తపోఽ త్యుగ్రం న యాగో హవనం న హి ।
అనావృష్టిస్తతో జాతా పృథివ్యాం శతవార్షికీ ॥
హాహాకారో మహానాసీత్త్రిషు లోకేషు దుఃఖితాః ।
అభవంశ్చ జనాస్సర్వే క్షుత్తృడ్భ్యాం పీడితా భృశమ్ ॥
సరితస్సాగరాశ్చైవ వాపీకూపసరాంసి చ ।
నిర్జలా అభవన్ సర్వే సంశుష్కా వృక్షవీరుధః ॥
తతో దృష్ట్వా మహాదుఃఖం ప్రజానాం దీనచేతసామ్ ।
త్రిదశాశ్శరణం యాతా యోగమాయాం మహేశ్వరీమ్ ॥

సూతుడిట్లు పలికెను –

దుర్గముడు అను పేరుతో ప్రసిద్ధిని గాంచిన మహాబలశాలియగు రురుపుత్రుడు బ్రహ్మ ఇచ్చిన వరముల ప్రభావముచే నాలుగు వేదములను పొందెను (3). ఆతడు దేవతలచే జయింప శక్యము కానీ బలమును కూడ పొందీ భూమండలమునందు అనేక పాపములను చేయుచుండగా, స్వర్గములో దేవతలు వణికిపోయిరి (4). వేదములు అదృశ్యము కాగా వేదోక్త కర్మలన్నియు నష్టమయ్యెను. అపుడు బ్రాహ్మణులు మరియు దేవతలు దురాచారపరాయణులైరి

(5). దానము గాని, మిక్కిలి తీవ్రమగు తపస్సు గాని, యాగము కాని, హోమము గాని లేకుండెను. దాని వలన భూలోకములో వంద సంవత్సరములు అనావృష్టి కలిగెను (6). పెద్ద హాహాకారము బయలు దేరెను. ముల్లోకములలోని ప్రాణులు అందరు ఆకలిదప్పికలచే మిక్కుటమగు పీడను పొంది దుఃఖించుచుండిరి (7), నదులు, సముద్రములు, దిగుడు బావులు, నూతులు, సరస్సులు, అన్నీ ఎండిపోయెను. చెట్లు, లతలు పూర్తిగా వాడిపోయేను (8), అపుడు దైన్యముతో నిండిన మనస్సులు గల జనుల మహాదు:ఖమును చూచి దేవతలు యోగమాయాస్వరూపిణి యగు మహేశ్వరిని శరణు జొచ్చిరి .

దేవా ఊచుః ।

రక్ష రక్ష మహామాయే స్వకీయాస్సకలాః ప్రజాః ।
కోపం సంహర నూనం త్వం లోకా నంక్ష్యంతి చాన్యథా ॥
కథా శుంభో హతో దైత్యో నిశుంభశ్చ మహాబలః ।
ధూమ్రాక్షశ్చండముండౌ చ రక్తబీజో మహాబలః ॥
స మధుః కైటభో దైత్యా మహిషాసుర ఏవ చ ।
తథైవాముం కృపాసింధో దీనబంధో జహి ద్రుతమ్ ॥
అపరాధో భవత్యేవ బాలకానాం పదే పదే ।
సహతే కో జనో లోకే కేవలం మాతరం వినా ॥
యదా యదాభవద్దుఃఖం దేవానాం బ్రహ్మణాం తథా ।
తదా తదావతీర్యాశు కురుషే సుఖినో జనాన్ ॥
ఇతి విక్లబితం తేషాం సమాకర్ణ్య కృపామయీ ।
అనంతాక్షమయం రూపం దర్శయామాస సాంప్రతమ్ ॥
ధనుర్బాణౌ తథా పద్మనానామూల ఫలాని చ ।
చతుర్భిర్దధతీ హస్తైః ప్రసన్నముఖపంకజా ॥
తతో దృష్ట్వా ప్రజాస్త్రస్తాః కరుణాపూరితేక్షణా ।
రురోద నవ ఘస్రాణి నవరాత్రీస్సమాకులా ॥
మోచయామాస దృష్టిభ్యో వారిధారా స్సహస్రశః ।
తాభిః ప్రతర్పితా లోకా ఔషధ్యస్సకలా అపి ॥
అగాధతో యాస్సరితో బభూవుస్సాగరా అపి ।
రురుహుర్ధరణీ పృష్ఠే శాకమూల ఫలాని చ ॥
వితతార కరస్థాని సుమనోభ్యః ఫలాని చ ।
గోభ్యస్తృణాని రమ్యాణి తథాన్యేభ్యో యథార్హతః ॥
సంతుష్టా అభవన్ సర్వే సదేవద్విజమానుషాః ।
తతో జగాద సా దేవీ కిమన్యత్కరవాణి వః ॥

దేవతలు ఇట్లు పలికిరి -

ఓ మహామాయా ! రక్షించుము, రక్షించుము. ప్రజలందరు నీవారే. కోపము◌ును ఉపసంహరించుము. నీవు అట్లు చేయనిచో, లోకములు నశించుట నిశ్చయము (10). శుంభుడనే రాక్షసుడు సంహరింపబడి గాథగా మిగిలినాడు. మహాబలుడగు నిశుంభుడు, ధూమ్రాక్షుడు, చండుడు, ముండుడు, మహాబలుడగు రక్తబీజుడు (11), మధువు, కైటభాసురుడు మరియు మహిషాసురుడు కూడ సంహరింపబడినారు. అదే విధముగా, వీనిని కూడ శీఘ్రముగా సంహరించుము. ఓ దయానిధీ ! నీవు దీనులకు బంధురాలవు (12). పిల్లలు ప్రతి అడుగునందు అపరాధములను చేయుచునే ఉందురు. కాని ఆ అపరాధములను లోకములో తల్లిని మినహాయిస్తే, మరెవ్వరు సహించేదరు ? (13) దేవతలకు మరియు బ్రాహ్మణులకు ఏయే కాలములలో దుఃఖము కలిగినదో, ఆయా కాలములలో నీవు వెంటనే అవతరించి జనులకు సుఖమును కలిగించేదవు (14). ఈ విధమగు వారి గోడును విని దయాస్వరూపురాలగు ఉమ వెంటనే అనంతమగు నేత్రములతో నిండియున్న రూపమును చూపించేను (15). వికసించిన పద్మము వంటి ముఖము గల ఆమె నాల్గు చేతులతో ధనస్సును, బాణములను, పద్మమును, అనేకములగు దుంపలను మరియు ఫలములను పట్టుకొని యుండెను (16). దుఃఖితులై యున్న తన సంతానమును గాంచి, అపుడు దయతో నిండియున్న కన్నులు గల ఉమ దుఃఖితురాలై తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు రోదించెను (17). ఆమె కన్నులనుండి అసంఖ్యాకములగు కన్నీటిధారలను విడిచిపెట్టేను. ఆ ధారలచే జనులు, వృక్ష లతాదులు అన్నీ తడిసి తృప్తిని బడసినవి (18), నదులు మరియు సముద్రములు నీటితో నిండి అగాధములైనవి. భూతలమునందు కూరలు, దుంపలు, ఫలములు పెరిగినవి (19). ఆమె దేవతలకు తన చేతిలోని ఫలములను, గోవులకు అందమగు గడ్డిని, మరియు ఇతరులకు వారి అర్హతలను బట్టి పదార్థములను పంచిపెట్టెను (20). దేవతలు, బ్రాహ్మణులు, మరియు ఇతరమానవులు సంతోషమును పొందిరి. అపుడా దేవి, 'నేను మీకు ఇంకనూ ఏమి చేయవలెను ?' అని పలికెను .

సమేత్యోచుస్తదో దేవా భవత్యా తోషితా జనాః ।
వేదాన్ దేహి కృపాం కృత్వా దుర్గమేణ సమాహృతాన్ ॥
తథాస్త్వితి ప్రభాష్యాహ యాత యాత నిజాలయమ్ ।
వితరిష్యామి వో వేదానచిరేణైవ కాలతః ॥
తతః ప్రముదితా దేవాస్స్వం స్వం ధామ సమాయయుః ।
సుప్రణమ్య జగద్యోనిం ఫుల్లేందీవర లోచనామ్ ॥
తతః కోలాహలో జాతో దివి భూమ్యంతరిక్షకే ।
తచ్ఛ్రుత్వా రౌరవస్సద్యో న్యరుణత్సర్వతః పురీమ్ ॥
తతస్తేజోమయం చక్రం విధాయ పరితశ్శివా ।
రక్షణార్థం దేవతానాం స్వయం తస్మాద్బహిర్గతా ॥

తతస్సమభవద్యుద్ధం దేవ్యా దైత్యస్య చోభయోః ।

వవృషుస్సమరే బాణాన్ని శితాన్ కంకటచ్ఛిదః ॥

ఏతస్మిన్నంతరే తస్యాశ్శరీరా ద్రమ్యమూర్తయః ।

కాలీ తారాచ్ఛిన్నమస్తా శ్రీ విద్యా భువనేశ్వరీ ॥

భైరవీ బగలా ధూమ్రా శ్రీమత్త్రిపురసుందరీ ।

మాతంగీ చ మహావిద్యా నిర్గతా దశ సాయుధాః ॥

అసంఖ్యాతాస్తతో జాతా మాతరో దివ్యమూర్తయః ।

చంద్ర లేఖాధరాస్సర్వా స్సర్వా విద్యుత్సమ ప్రభాః ॥

తతో మాతృగణైర్యుద్ధం ప్రావర్తత భయంకరమ్ ।

రౌరవీయం హతం తాభిర్బలమక్షౌహిణీ శతమ్ ॥

జఘాన సా తదా దైత్యం దుర్గమం శూలధారయా ।

పపాత ధరణీ పృష్ఠే ఖాతమూలద్రుమో యథా ॥

అపుడు దేవతలు ఒక చోటకు గుమిగూడి ఇట్లు పలికిరి: నీవు జనులను సంతోషపెట్టినావు. దుర్గముడు పట్టుకొని పోయిన వేదములను దయచేసి ఇమ్ము (22). ఆమె ఇట్లు పలికెను: అటులనే యగుగాక ! మీరు మీ ఇళ్లకు పొండు, పొండు. మీకు అచిరకాలములోననే వేదములను ఇచ్చెదను (23). అపుడు దేవతలు చాల సంతోషించి వికసించిన కలువలవంటి కన్నులు గల, జగత్కారణమగు ఉమాదేవికి చక్కగా ప్రణమిల్లి తమ తమ గృహములకు వెళ్లిరి (24). అపుడు భూమియందు, అంతరిక్షములో మరియు స్వర్గములో కోలాహలము ఏర్పడెను. దానిని విని రురుపుత్రుడగు దుర్గముడు వెంటనే నగరమును అన్నివైపుల నుండియు ముట్టడించెను (25). అపుడు శివాదేవి దేవతల రక్షణ కొరకై తేజోరూపమగు చక్రమును చుట్టూ ఏర్పాటు చేసి, తాను స్వయముగా దానినుండి బయటకు వచ్చెను (26). అపుడు దేవికి ఆ రాక్షసునితో యుద్ధము జరిగెను. వారా యుద్ధములో ఒకరిపై నొకరు కవచములను ఛేదించే వాడి బాణములను వర్షించిరి (27). ఇంతలో ఆమె శరీరమునుండి కాళి, తార, ఛిన్నమస్త, శ్రీ విద్య, భువనేశ్వరి, భైరవి, బగల, ధూమ్ర, శ్రీ మత్త్రిపురసుందరి, మహావిద్యా స్వరూపురాలగు మాతంగీ అనే పదీ సుందరాకారులగు స్త్రీ మూర్తులు ఆయుధములను ధరించి బయల్వెడలిరి (28, 29). అపుడు దివ్యమూర్తులగు మాతృదేవతలు లెక్కలేనంతమంది ఉదయించిరి. వారందరు చంద్రవంకను దాల్చి మెరుపు తీగతో సమమగు కాంతిని కలిగియుండిరి (30). అపుడు ఆ మాతృగణములతో భయంకరమగు యుద్ధము జరిగెను. దుర్గమునీ వంద అక్షౌహిణీల సైన్యమును వారు హతమార్చిరి (31). అపుడు ఆ శివాదేవి దుర్గమాసురుని శూలాగ్రముతో కొట్టగా, ఆతడు మొదలు నరికిన చెట్టువలె నేలగూలెను .

ఇత్థం హత్వా తదా దైత్యం దుర్గమాసుర నామకమ్ ।

ఆదాయ చతురో వేదాన్ దదౌ దేవేభ్య ఈశ్వరీ ॥

అస్మదర్థం త్వయా రూపమనంతాక్షిమయం ధృతమ్ ।

మునయః కీర్తయిష్యంతి శతాక్షీం త్వామతోఽంబికే ॥

ఆత్మదేహ సముద్భూతైశ్శాకైర్లోకా ధృతా యతః ।
శాకంభరీతి విఖ్యాతం తత్తే నామ భవిష్యతి ॥
దుర్గమాఖ్యో మహాదైత్యో హతో యస్మాత్త్వతశ్శివే ।
దుర్గాం భగవతీం భద్రాం వ్యాహరిష్యంతి మానవాః ॥
యోగనిద్రే నమస్తుభ్యం నమస్తేఽస్తు మహాబలే ।
నమో జ్ఞానప్రదే తుభ్యం విశ్వమాత్రే నమో నమః ॥
తత్త్వమస్యాదివాక్యైర్యా బోధ్యతే పరమేశ్వరీ ।
అనంతకోటి బ్రహ్మాండనాయికాయై నమో నమః ॥
వాఙ్మనః కాయదుష్ప్రాపాం సూర్యచంద్రాగ్ని లోచనామ్ ।
స్తోతుం న శక్నుమో మాతస్త్వత్ప్రభావాబుధా వయమ్ ॥
మాదృశానమరాన్ దృష్ట్వా కః కుర్యాదీదృశీం దయామ్ ।
వర్జయిత్వా సురేశానీం శతాక్షీం మాతరం వినా ॥
త్రిలోకీ నాభీ భూయేత బాధాభిశ్చ నిరంతరమ్ ।
ఏవం కార్యస్త్వయా యత్నోఽస్మాకం వైరి వినాశనమ్ ॥

అపుడీ విధముగా దుర్గమాసురుడనే రాక్షసుని సంహరించి, ఆ ఈశ్వరి నాలు వేదములను తీసుకొని వచ్చి దేవతలకు ఇచ్చెను (33). అపుడు దేవతలు ఇట్లు పలికిరి : నీవు మా కొరకై అనంత నేత్రములతో గూడిన రూపమును ధరించితివి. ఓ అంబికా! కావున నిన్ను మహర్షులు శతాక్షి అని కీర్తించెదరు (34). నీవు నీ దేహము నుండి ఉద్భవించిన శాకములతో జనులను పోషించితివి. కావున నీకు శాకంభరీ అనే పేరు లోకప్రసిద్ధిని పొందగలదు (35). ఓ శివాదేవీ ! నీవు దుర్గముడనే గొప్ప రాక్షసుని సంహరించినావు గనుక, మానవులు నిన్ను దుర్గ, భగవతి, భద్ర అను పేర్లతో పిలిచేదరు (36). ఓ యోగనిద్రా ! మహా బలము గలదానా ! జ్ఞానము నిచ్చుదానా ! జగన్మాతవగు నీకు అనేక నమస్కారములు (37). ఓ పరమేశ్వరీ ! తత్త్వమసి (అది నీవే అయి ఉన్నావు) ఇత్యాది మహావాక్యములు నిన్నే బోధించుచున్నవి. అనంతకోటి బ్రహ్మాండములకు అధీశ్వరియగు తల్లికి అనేక నమస్కారములు (38). ఓ తల్లీ ! వాక్కునకు, మనస్సునకు అందనిది, కర్మచే పొంద శక్యము కానిది అగు నీ ప్రభావము మాకు తెలియదు. సూర్యుడు, చంద్రుడు, అగ్ని నేత్రములుగా గల నిన్ను మేము స్తుతించలేము (39). మా వంటి దేవతలను చూచీ, దేవదేవి మరియు శతాక్షి అగు తల్లిని మినహాయిస్తే, ఇట్టి దయను ఎవరు చూపెదరు ? (40) నీవు మా శత్రువులను వినాశనమొనర్చి ముల్లోకములకు ఏ కాలమునందైననూ బాధలు, పరాభవములు లేకుండునట్లు నీవు ఈ తీరున ప్రయత్నమును చేయదగును.

దేవ్యువాచ ।

వత్సాన్ దృష్ట్వా యథా గావో వ్యగ్రా ధావంతి సత్వరమ్ ।
తథైవ భవతో దృష్ట్వా ధావామి వ్యాకులా సతీ ॥
మమ యుష్మానపశ్యంత్యా పశ్యంత్యా బాలకానివ ।
అపి ప్రాణాన్ ప్రయచ్ఛంత్యాః క్షణ ఏకో యుగాయతే ॥
కాపి చింతా న కర్తవ్యా యుష్మాభిర్భక్తి శాలిభిః ।
భవత్యాం మయి తిష్ఠంత్యాం సంహరంత్యాం నిజాపదః ॥
యథాపూర్వం హతా దైత్యా హనిష్యామి తథాఽసురాన్।
సంశయో నాత్ర కర్తవ్యస్సత్యం సత్యం బ్రవీమ్యహమ్ ॥
యదా శుంభో నిశుంభశ్చాపరౌ దైత్యౌ భవిష్యతః ।
తదాహం నందభార్యాయాం యశోదాయాం యశోమయీ ॥
యోనిజం రూపమాస్థాయ జనిష్యే గోపగోకులే ।
హనిష్యామ్యసురౌ తన్మాం వ్యాహరిష్యంతి నందజామ్ ॥
భ్రామరం రూపమాస్థాయ వధిష్యామ్యరుణం యతః ।
భ్రామరీతి చ మాం లోకే కీర్తయిష్యంతి మానవాః ॥
కృత్వా భీమం పునా రూపం రక్షాంస్యత్స్యామ్యహం యదా ।
భీమా దేవీతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి ॥
యదా యదాఽసురోత్థైవం బాధా భువి భవిష్యతి ।
తదా తదావతీర్యాహం శం కరిష్యామ్య సంశయమ్ ॥
యా శతాక్షీ స్మృతా దేవీ సైవ శాకంభరీ మతా ।
సైవ ప్రకీర్తితా దుర్గా వ్యక్తిరేకైవ త్రిష్వపి ॥
న శతాక్షీసమా కాచిద్దయాలుర్భువి దేవతా ।
దృష్ట్వాఽరుదత్ప్రజాస్తప్తా యా నవాహం మహేశ్వరీ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం దుర్గా చరిత్ర వర్ణనం నామ
పంచాశత్తమోఽధ్యాయః ॥

దేవి ఇట్లు పలికెను -

ఆవులు దూడలను చూచి వెంటనే కంగారుగా ఎట్లు పరుగెత్తునో, అదే తీరున నేను మిమ్ములను చూచి కంగారుపడుతూ పరుగెత్తుచుందును (42). మిమ్ములను చిన్న పిల్లలనువలె సాకి మీ కొరకై ప్రాణములనైననూ ఇచ్చే నాకు మీరు కనబడనిచో క్షణము ఒక యుగము వలె నుండును (43). సమర్థురాలనగు నేను మీ పక్షాన నిలబడి మీ ఆపదలను తొలగించుచున్నాను గనుక, భక్తి సంపన్నులగు మీరు ఏ విధమైన చింతకు లోను కావద్దు (44). పూర్వములో నేను రాక్షసులను సంహరించి యుంటిని. భవిష్యత్తులో కూడ రాక్షస సంహారమును చేసెదను. ఈ విషయములో మీరు సందేహమును పెట్టుకొనవద్దు. నేను ముమ్మాటికీ సత్యమును పలుకుచున్నాను (45). శుంభనిశుంభులనే ఇంకో ఇద్దరు రాక్షసులు ఉదయించగలరు. అపుడు కీర్తిమంతురాలనగు నేను నందుని భార్యయగు యశోదయందు గొల్లపల్లెలో మనుజస్త్రీ రూపమును దాల్చి ఆ రాక్షసులనిద్దరినీ సంహరించెదను. ఆ కారణముగా నాకు నందజ అను పేరు కలుగగలదు (46,47). నేను తుమ్మెదల రూపమును దాల్చి అరుణుని సంహరించెదను. ఆ కారణముచే లోకములోని మానవులు నన్ను భ్రామరి అని కీర్తించెదరు (48). మరల నేను భయంకరరూపమును దాల్చి రాక్షసులను భక్షించేదను. అపుడు నాకు భీమాదేవి అనే పేరు ప్రసిద్ధము కాగలదు (49). ఈ విధముగా భూలోకములో ఏయే కాలములయందు రాక్షస పీడ ఉద్భవించునో, ఆయా కాలములలో నేను అవతరించి నిస్సందేహముగా సుఖమును కలిగించేదను (50). ఏ దేవి శతాక్షి యనబడునో, ఆమెయే శాకంభరి, ఆమెయే దుర్గ అని కీర్తింపబడుచున్నది. ఈ మూడు నామములు గల వ్యక్తి ఒక్కరే (51). మహేశ్వరియగు శతాక్షి తన సంతానము బాధపడుచుండుటను గాంచి తొమ్మిది రోజులు దుఃఖించినది. ఆమెతో సమానమగు దయ గల దేవత భూలోకములో మరెవ్వరూ లేరు .

శ్రీ శివమహాపురాణములోని ఉమా సంహితయందు దుర్గాచరిత్రవర్ణనము అనే ఏబదియవ అధ్యాయము ముగిసినది.

51 – యోగ నిరూపణము

మునయ ఊచుః ।

వ్యాసశిష్య మహాభాగ సూత పౌరాణికోత్తమ ।

అపరం శ్రోతుమిచ్ఛామః కిమప్యాఖ్యానమీశితుః ॥

ఉమాయా జగదంబాయాః క్రియాయోగమనుత్తమమ్ ।

ప్రోక్తం సనత్కుమారేణ వ్యాసాయ చ మహాత్మనే ॥

మునులు ఇట్లు పలికిరి –

ఓ వ్యాసశిష్యా ! మహాత్మా ! సూతా ! నీవు పురాణములను చెప్పువారిలో ఉత్తముడవు. ఈశ్వరుని మరియొక గాథను దేనినైననూ మేము వినగోరుచున్నాము (1). సనత్కుమారుడు మహాత్ముడగు వ్యాసునకు జగన్మాతయగు ఉమాదేవియొక్క సర్వశ్రేష్ఠమగు క్రియాయోగమును గురించి చెప్పియున్నాడు.

సూత ఉవాచ ।

ధన్యా యూయం మహాత్మానో దేవీభక్తి దృఢవ్రతాః ।

పరాశక్తేః పరం గుప్తం రహస్యం శృణుతాదరాత్ ॥

సూతుడిట్లు పలికెను –

మహాత్ములు, దేవీ భక్తియందు దృఢమగు నిష్ఠగలవారు అగు మీరు ధన్యులు. పరా ాశక్తి యొక్క అత్యంతరహస్యమగు ఉపనిషత్ జ్ఞానమును గురించి సాదరముగా వినుడు.

వ్యాస ఉవాచ ।

సనత్కుమార సర్వజ్ఞ బ్రహ్మపుత్ర మహామతే ।

ఉమాయా శ్రోతుమిచ్ఛామి క్రియాయోగం మహాద్భుతమ్ ॥

కీదృక్చ లక్షణం తస్య కిం కృతే చ ఫలం భవేత్ ।

ప్రియం యచ్చ పరాంబాయాస్తదశేషం వదస్వ మే ॥

వ్యాసుడు ఇట్లు పలికెను –

ఓ సనత్కుమారా ! సర్వజ్ఞా ! బ్రహ్మపుత్రుడవగు నీవు మహా బుద్ధిశాలివి. ఉమాదేవియొక్క గొప్ప అద్భుతమగు క్రియాయోగమును నేను వినగోరుచున్నాను (4). దాని లక్షణమెట్టిది ? దాని ఫలమెట్టిది ? జగన్మాతకు ప్రీతిపాత్రమైనది యేది ? ఈ విషయమును నిశ్శేషముగా నాకు చేప్పుడు .

సనత్కుమార ఉవాచ ।

ద్వైపాయన యదేతత్త్వం రహస్యం పరిపృచ్ఛసి ।
తచ్ఛృణుష్వ మహాబుద్ధే సర్వం మే వర్ణయిష్యతః ॥
జ్ఞానయోగః క్రియాయోగో భక్తియోగస్తథైవ చ ।
త్రయో మార్గాస్సమాఖ్యాతా శ్రీమాతుర్భుక్తి ముక్తిదాః ॥
జ్ఞానయోగస్తు సంయోగశ్చిత్తస్యైవాత్మనా తు యః ।
యస్తు బాహ్యార్థ సంయోగః క్రియాయోగస్స ఉచ్యతే ॥
భక్తియోగో మతో దేవ్యా ఆత్మనశ్చైక్య భావనమ్ ।
త్రయాణామపి యోగానాం క్రియాయోగస్స ఉచ్యతే ॥
కర్మణా జాయతే భక్తిర్భక్త్యా జ్ఞానం ప్రజాయతే ।
జ్ఞానాత్ప్రజాయతే ముక్తిరితి శాస్త్రేషు నిశ్చయః ॥
ప్రధానం కారణం యోగో విముక్తేర్మునిసత్తమ ।
క్రియాయోగస్తు యోగస్య పరమం ధ్యేయసాధనమ్ ॥
మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయావి బ్రహ్మ శాశ్వతమ్ ।
అభిన్నం తద్వపుః జ్ఞాత్వా ముచ్యతే భవబంధనాత్ ॥
యస్తు దేవ్యాలయం కుర్యాత్పాషాణం దారవం తథా ।
మృన్మయం వాథ కాలేయ తస్య పుణ్యఫలం శృణు ।
అహన్యహని యోగేన జయతో యన్మహాఫలమ్ ॥
ప్రాప్నోతి తత్ఫలం దేవ్యా యః కారయతి మందిరమ్ ।
సహస్రకులమాగామి వ్యతీతం చ సహస్రకమ్ ।
సతారయతి ధర్మాత్మా శ్రీ మాతుర్ధామ కారయన్ ॥
కోటిజన్మకృతం పాపం స్వల్పం వా యది వా బహు ।
శ్రీ మాతుర్మందిరారంభక్షణాదేవ ప్రణశ్యతి ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ వ్యాసా ! నీవు మహాబుద్ధిశాలివి. నీవు ప్రశ్నించిన రహస్యమునంతనూ నేను వర్ణించెదను. వినుము (6). శ్రీ మాతను చేరే మార్గములు మూడు అనియు, అవి జ్ఞాన-కర్మ- భక్తి యోగములనియు, అవి భుక్తిని మరియు ముక్తిని ఇచ్చుననియు చెప్పబడినది (7). మనస్సు ఆత్మతో కలియుట జ్ఞానయోగమనియు, బాహ్యవస్తువులతో కలియుట క్రియాయోగమనియు చెప్పబడుచున్నది (8). దేవికి, ఆత్మకు ఐక్యమును భావన చేయుట భక్తి యోగమనబడును. ఈ మూడు యోగములలో క్రియాయోగమును నేనిప్పుడు చెప్పుచున్నాను (9), కర్మ వలన భక్తి పుట్టును. భక్తిచే జ్ఞానము కలుగును. జ్ఞానము వలన ముక్తి కలుగునని శాస్త్రములు నిశ్చయించుచున్నవి (10). ఓ మహర్షి ! మోక్షమునకు ప్రధాన హేతువు యోగము. యోగముయొక్క ధ్యేయమును పొందుటకు క్రియాయోగము సర్వోత్తమమగు సాధనము (11). సర్వజగత్కారణము మాయ. ఆ మాయను వశము చేసుకొని

యున్న శాశ్వత తత్త్వము బ్రహ్మ. ఆ దేవియొక్క రూపము బ్రహ్మ కంటే భిన్నము కాదని తెలుసుకున్నవాడు సంసారబంధమునుండి విముక్తుడగును (12). ఓ వ్యాసా ! రాళ్లతో గాని, చెక్కలతో గాని, మట్టితో నైననూ దేవియొక్క ఆలయమును నిర్మించువానికి లభించే పుణ్యఫలమును వినుము. దేవీ మందిరమును కట్టించిన వానికి, ప్రతిదినము యోగముచే మనస్సును జయించువానికి కలిగే మహాఫలము కలుగును. శ్రీ మాతయొక్క మందిరమును నిర్మించే ధర్మాత్ముడు గడచిన వేయి తరములను, రాబోయే వేయి తరములను తరింపజేయును (13, 14). శ్రీ మాతయొక్క మందిరమును కట్టుట ఆరంభించిన క్షణములో, కోటి జన్మలలో చేసిన పాపము అల్పము గాని, అధికము గాని నిశ్చితముగా పూర్ణముగా నశించును.

నదీషు చ యథా గంగా శోణస్సర్వనదేషు వా ।
క్షమాయాం చ యథా పృథ్వీ గాంభీర్యే చ యథోదధిః ॥
గ్రహాణాం చ సమస్తానాం యథా సూర్యో విశిష్యతే ।
తథా సర్వేషు దేవేషు శ్రీపరాంబా విశిష్యతే ॥
సర్వదేవేషు సా ముఖ్యా యస్తస్యాః కారయేద్గృహమ్ ।
ప్రతిష్ఠాం సమవాప్నోతి స చ జన్మని జన్మని ॥
వారాణస్యాం కురుక్షేత్రే ప్రయాగే పుష్కరే తథా ।
గంగాసముద్రతీరే చ నైమిషేఽ మరకంటకే ॥
శ్రీపర్వతే మహాపుణ్యే గోకర్ణ జ్ఞానపర్వతే ।
మథురాయామయోధ్యాయాం ద్వారావత్యాం తథైవ చ ॥
ఇత్యాది పుణ్యదేశేషు యత్ర కుత్ర స్థలేఽపి వా ।
కారయన్మాతురావాసం ముక్తో భవతి బంధనాత్ ॥
ఇష్టకానాం తు విన్యాసో యావద్వర్షాణి తిష్ఠతి ।
తావద్వర్ష సహస్రాణి మణిద్వీపే మహీయతే ॥
ప్రతిమాః కారయేద్యస్తు సర్వలక్షణలక్షితాః ।
స ఉమాయాః పరం లోకం నిర్భయో వ్రజతి ధ్రువమ్ ॥
దేవీమూర్తిం ప్రతిష్ఠాప్య శుభర్తు గ్రహతారకే ।
కృతకృత్యో భవేన్మర్త్యో యోగమాయా ప్రసాదతః ॥
యే భవిష్యంతి యేఽ తీతా ఆకల్పాత్పురుషాః కులే ।
తాంస్తాంస్తారయతే దేవ్యా మూర్తిం సంస్థాప్య శోభనామ్ ॥
త్రిలోకే స్థాపనాత్పుణ్యం యద్భవేన్మునిపుంగవ ।
తత్కోటి గుణితం పుణ్యం శ్రీ దేవీస్థాపనాద్భవేత్ ॥

నదులలో గంగవలె, పశ్చిమ వాహినులగు నదములన్నింటిలో శోణము వలె, క్షమ గలవా ంటిలో పృథివి వలె, లోతైన సరస్సులలో సముద్రము వలె (16), గ్రహములన్నింటిలో సూర్యుని వలె, దేవతలందరిలో శ్రీ పరాంబ ఉత్కృష్టురాలు (17). ఆమె దేవతలందరిలో ముఖ్యురాలు. ఆమెకు దేవళమును కట్టించు వ్యక్తి జన్మ

జన్మలలో ప్రతిష్ఠను పొందును (18). వారాణసి, కురుక్షేత్రము, ప్రయాగ, పుష్కరము, శ్రీశైలము, గొప్ప పవిత్రమగు గోకర్ణము, జ్ఞాన పర్వతము, మథుర, అయోధ్య, ద్వారావతి మొదలైన పుణ్యతీర్థములలో గాని, లేదా ఏదో ఒక స్థలములో గాని తల్లికి ఆలయమును కట్టించువాడు బంధ విముక్తుడగును (19-21). ఆలయములో ఇటుకల అమరిక ఎన్ని ఏళ్లు నిలబడి యుండునో, అన్ని వేల సంవత్సరములు ఆలయనిర్మాత మణిద్వీపములో మహిమను గాంచును (22). సర్వశుభలక్షణములతో కూడియున్న దేవీ ప్రతిమలను ఎవడు చేయించునో, వాడు నిర్భయుడై నిశ్చయముగా శ్రేష్ఠమగు ఉమా లో కమును పొందును (23). శుభకరమగు ఋతువులో మంచి లగ్నములో శుభ నక్షత్రములో దేవీ మూర్తిని ప్రతిష్ఠించే మానవుడు ఆ యోగమాయయొక్క అనుగ్రహముచే కృతార్థుడగును (24). సుందరమగు దేవీ మూర్తిని స్థాపించు వ్యక్తి కల్పాదినుండి ఆ కులములో గడచిన తరముల వారందరినీ, మరియు రాబోవు తరముల వారందరినీ తరింప జేయును (25). ఓ మహర్షీ ! ముల్లోకములను సృష్టించుట వలన కలిగే పుణ్యమునకు కోటి రెట్లు పుణ్యము శ్రీదేవీ ప్రతిష్ఠ వలన కలుగును .

మధ్యే దేవీం స్థాపయిత్వా పంచాయతన దేవతాః ।
చతుర్దిక్షు స్థాపయేద్యస్తస్య పుణ్యం న గణ్యతే ॥
విష్ణోర్నామ్నాం కోటిజపాద్గ్రహణే చంద్ర సూర్యయోః ।
యత్ఫలం లభ్యతే తస్మాచ్ఛతకోటి గుణోత్తరమ్ ॥
శివనామ్నో జపాదేవ తస్మాత్కోటి గుణోత్తరమ్ ।
శ్రీదేవీ నామజాపాత్తు తతః కోటిగుణోత్తరమ్ ॥
దేవ్యాః ప్రాసాదకరణాత్పుణ్యం తు సమవాప్యతే ।
స్థాపితా యేన సా దేవీ జగన్మాతా త్రయీమయీ ॥
న తస్య దుర్లభం కించిచ్ఛ్రీమాతుః కరుణావశాత్ ।
వర్ధంతే పుత్ర పౌత్రాద్యా నశ్యత్య ఖిల కశ్మలమ్ ॥
మనసా యే చికీర్షంతి మూర్తి స్థాపనముత్తమమ్ ।
తేత్యుమాయాః పరం లోకం ప్రయాంతి మునిదుర్లభమ్ ॥
క్రియమాణం తు యః ప్రేక్ష్య చేతసా హ్యనుచింతయేత్ ।
కారయిష్యామ్యహం యర్హి సంపన్మే సంభవిష్యతి ॥
ఏవం తస్య కులం సద్యో యాతి స్వర్గం న సంశయః ।
మహామాయా ప్రభావేణ దుర్లభం కిం జగత్త్ర యే ॥
శ్రీ పరాంబాం జగద్యోనిం కేవలం యే సమాశ్రితాః ।
తే మనుష్యా న మంతవ్యాస్సాక్షాద్దేవీ గణాశ్చ తే ॥
యే వ్రజంతస్స్వపంతశ్చ తిష్ఠంతో వాప్యహర్నిశమ్ ।
ఉమేతి ద్వ్యక్షరం నామ బ్రువతే తే శివాగణాః ॥
నిత్యే నైమిత్తికే దేవీం యే యజంతి పరాం శివామ్ ।
పుష్పైర్ధూ పైస్తథా దీపైస్తే ప్రయాస్యంత్యుమాలయమ్ ॥

ఎవడైతే మధ్యలో దేవిని స్థాపించి నాల్గు దిక్కులయందు ఇతరపంచాయతన దేవతలను (శివ విష్ణు సూర్య గణపతులు) స్థాపించునో, వాని పుణ్యమునకు గణన లేదు-(27), చంద్రసూర్య గ్రహణ సమయములలో కోటి విష్ణునామములను జపించుట వలన ఏ ఫలము లభించునో, శివనామ జపమాత్రముచే దానికి వంద కోట్ల రెట్లు ఫలము లభించును. శ్రీదేవీ నామమును జపించుట వలన దానికి కోటి రేట్లు, దేవీ ఆలయమును నిర్మించుట వలన దానికి కోటి రెట్లు పుణ్యఫలము లభించును. వేద స్వరూపురాలు, జగన్మాత అగు ఆ దేవిని స్థాపించిన వానికి ఆ శ్రీమాతయొక్క కరుణా ప్రభావముచే దుర్లభమైనది ఏదీ ఉండదు. వానికి పుత్రపౌత్రాదులు వృద్ధిలోనికి వచ్చేదరు. వాని పాపములన్నియు నశించును (28-31). ఎవరైతే ఉమాదేవియొక్క ఉత్తమమగు మూర్తిని స్థాపించవలెనని మనస్సులో కోటి దుర్లభమైన, శ్రేష్ఠమగు ఉమలోకమును పొందెదరు (32). దేవాలయ నిర్మాణము జరుగుచుండగా చూచి, ఎవడైతే తన మనస్సులో, 'నేను కూడ ఇట్టి నిర్మాణమును చేయించేదను; అపుడు నాకు సంపద లభించగలదు' అని తలపోయునో (33), వాని కులము వారు నిస్సందేహముగా స్వర్గమును పొందెదరు. మహామాయయొక్క ప్రభావముచే ముల్లోకములలో దుర్లభమైనది యేది గలదు ? (34) జగత్కారణమగు శ్రీ పరాంబను మాత్రమే ఎవరు ఆశ్రయించెదరో, వారు సామాన్యమానవులు అని తలంచరాదు. వారు సాక్షాత్తుగా దేవీ గణములే (35). ఎవరైతే నడుస్తూ, నిద్రిస్తూ, లేదా నిలబడి గానీ రాత్రింబగళ్లు 'ఉమ' అనే రెండు అక్షరముల నామమును పలికేదరో వారు దేవీ గణములు అగుదురు (36). ఎవరైతే నిత్యనైమిత్తిక కర్మలలో సర్వోత్కృష్టురాలగు శివాదేవిని పుష్పములతో, మరియు ధూపదీపములతో ఆరాధించెదరో, వారు ఉమాలోకమును పొందగలరు.

యే దేవీమండపం నిత్యం గోమయేన మృదాథ వా ।
ఉపలింపంతి మార్ణంతి తే ప్రయాస్యంత్యుమాలయమ్ ॥
యైర్దేవ్యా మందిరం రమ్యం నిర్మాపితమనుత్తమమ్ ।
తత్కులీనాన్ జనాన్మాతా హ్యాశిషస్సంప్రయచ్ఛతి ॥
మదీయాశ్శతవర్షాణి జీవంతు ప్రేమభాగ్ఘనాః ।
నాపదామయనానీత్థం శ్రీమాతా వక్త్యహర్నిశమ్ ॥
యేన మూర్తిర్మహా దేవ్యా ఉమాయాః కారితా శుభా ।
నరాయుతం తత్కులజం మణిద్వీపే మహీయతే ॥
స్థాపయిత్వా మహామాయామూర్తిం సమ్యక్ ప్రపూజ్య చ।
యం యం ప్రార్థయతే కామం తం తం ప్రాప్నోతి సాధకః ॥
యస్స్నాపయతి శ్రీమాతుస్స్థాపితాం మూర్తిముత్తమామ్ ।
ఘృతేన మధునాక్తేన తత్ఫలం గణయేత్తు కః ॥
చందనాగురు కర్పూరమాంసీ ముస్తాదియుగ్ఘలైః ।
ఏకవర్ణగవాం క్షీరైస్స్నా పయేత్పరమేశ్వరీమ్ ॥

ధూపేనాష్టా దశాంగేన దద్యాదాహుతి ముత్తమామ్ ।

నీరాజనం చరేద్దేవ్యాసాజ్య కర్పూరవర్తిభిః ॥

కృష్ణాష్టమ్యాం నవమ్యాం వామాయాం వా పంచదిక్తిథౌ ।

పూజయేజ్జగతాం ధాత్రీం గంధపుష్పైర్విశేషతః ॥

సంపఠన్ జననీసూక్తం శ్రీ సూక్తమథవా పఠన్ ।

దేవీ సూక్తమథో వాపీ మూలమంత్రమథాపి వా ॥

విష్ణు క్రాంతాం చ తులసీం వర్జయిత్వాఖిలం సుమమ్ ।

దేవీప్రీతికరం జ్ఞేయం కమలం తు విశేషతః ॥

అర్పయేత్స్వర్ణ పుష్పం యో దేవ్యై రాజతమేవ వా ।

స యాతి పరమం ధామ సిద్ధకోటిభిరన్వితమ్ ॥

ఎవరైతే ప్రతిదినము దేవీమండపమును గోమయముతో గాని, మట్టితో గాని అలికీ తుడిచెదరో వారు ఉమాలయమును పొందగలరు (38). ఎవరైతే సర్వోత్కృష్టమగు సుందరమైన దేవీమందిరమును నిర్మించెదరో వారి కులస్తులగు జనులకు ఆ తల్లి ఆశీర్వచనములనిచ్చును (39). నా వారు, నా ప్రేమకు పాత్రులైన జనులు వంద సంవత్సరములు జీవించేదరు గాక ! వారికి ఆపదలు రాకుండు గాక ! అనీ ఈ విధముగా ఆ శ్రీమాత రాత్రింబగళు పలుకుచుండును (40). ఎవడైతే ఉమాదేవియొక్క శుభకరమగు మూర్తిని చేయించునో, వాని కులమునందు జన్మించిన పదివేల మంది జనులు మణిద్వీపములో మహిమను గాంచెదరు (41). సాధకుడు మహామాయయొక్క మూర్తిని స్థాపించి, దానిని చక్కగా పూజించి ఏయే కోర్కెలనో కోరునో, వాటిని అన్నింటినీ పొందును (42). ఎవడైతే శ్రీమాత యొక్క ఉత్తమమగు మూర్తిని స్థాపించి తేనెను పూసి నేతితో అభిషేకించునో, వానికి లభించు ఫలమును ఎవ్వాడు లెక్క కట్టగలును ? (43) చందనము, అగరు, కర్పూరము, మాంసీ, ముస్త గడ్డి మొదలైన సుగంధ ద్రవ్యములతో కూడియున్న నీటితో, మరియు ఒకే రంగు గల ఆవు యొక్క పాలతో పరమేశ్వరిని అభిషేకించవలెను (44). పద్దెనిమిది పదార్థములను కలిపి తయారు చేసిన ధూపద్రవ్యముతో ఉత్తమమగు ఆహుతినీయవలెను. దేవికి నేయి, కర్పూరము గల వత్తులతో నీరాజనమునీయవలెను (45), కృష్ణ పక్షములోని అష్టమి, నవమి, అమావాస్య, పంచమి, దశమి అను తిథులలో జగన్మాతను గంధముతో, పుష్పములతో విశేషముగా పూజించవలెను (46). రాత్రి సూక్తమును గాని, శ్రీసూక్తమును గాని, దేవీ సూక్తమును గాని చక్కగా పఠించి మూల మంత్రమును జపించవలెను (47). విష్ణుక్రాంతమును, తులసిని మినహాయిస్తే, పుష్పములన్నియు దేవికి ప్రీతికరములనియు, కమలమునందు దేవికి విశేషప్రీతి అనియు తెలియదగును (48). ఎవడైతే దేవికి బంగరు పుష్పమును, లేదా వెండి పుష్పమును సమర్పించునో, వాడు కోట్లాది సిద్ధులతో కూడియున్న పరమధామమును పొందును.

పూజనాంతే సదా కార్యం దాసైరేనః క్షమాపనమ్ ।
ప్రసీద పరమేశానీ జగదానందదాయిని ॥
ఇతి వాక్యైస్స్తు వన్మంత్రీ దేవీభక్తిపరాయణః ।
ధ్యాయేత్కంఠీరవారూఢాం వరదాభయపాణికామ్ ॥
ఇత్థం ధ్యాత్వా మహేశానీం భక్తాభీష్ట ఫలప్రదామ్ ।
నానాఫలాని పక్వాని నైవేద్యత్వే ప్రకల్పయేత్ ॥
నైవేద్యం భక్షయేద్యస్తు శంభుశక్తేః పరాత్మనః ।
స నిర్ధూయాఖిలం పంకం నిర్మలో మానవో భవేత్ ॥
చైత్రశుక్లతృతీయాయాం యో భవానీవ్రతం చరేత్ ।
భవబంధననిర్ముక్తః ప్రాప్నుయాత్పరమం పదమ్ ॥
అస్యామేవ తృతీయాయాం కుర్యాద్దోలోత్సవం బుధః ।
పూజయేజ్జగతాం ధాత్రీముమాం శంకరసంయుతామ్ ॥
కుసుమైః కుంకుమైర్వస్త్రైః కర్పూరాగురుచందనైః ।
ధూపైర్దీపైస్సనైవేద్యై స్స్రగ్గంధైరపరైరపి ॥
ఆందోలయేత్తతో దేవీం మహామాయాం మహేశ్వరీమ్ ।
శ్రీగౌరీం శివసంయుక్తాం సర్వకల్యాణ కారిణీమ్ ॥
ప్రత్యబ్దం కురుతే యోఽ స్యాం వ్రత మాందోలనం తథా ।
నియమేన శివా తస్మై సర్వమిష్టం ప్రయచ్ఛతి ॥
మాధవస్య సితే పక్షే తృతీయా యాఽ క్షయాభిధా ।
తస్యాం యో జగదంబాయా వ్రతం కుర్యాదతంద్రితః ॥

భక్తులు పూజ అయిన తరువాత సర్వదా అపరాధక్షమాపనమును చెప్పవలెను. ఓ పరమేశ్వరీ ! ప్రసన్నురాలవు కమ్ము, నీవు లోకములకు ఆనందమునిచ్చెదవు (50). దేవీభక్తియందు నిష్ఠగల సాధకుడు ఈ వాక్యములచే స్తుతించి మంత్రమును జపిస్తూ, సింహమునధిష్ఠించి వరద-అభయ ముద్రలను చేతియందు దాల్చిన దేవిని ధ్యానించవలెను (51). భక్తులకు అభీష్టఫలములనిచ్చే మహేశ్వరిని ఈ విధముగా ధ్యానించి పండిన వివిధఫలములను నైవేద్యమిడవలెను (52). ఏ మానవుడైతే పరమాత్మ స్వరూపురాలు, శంభుని శక్తియగు దేవి యొక్క నైవేద్యమును భక్షించునో, ఆతడు సమస్త పాపములను పోగొట్టుకొని నిర్మలుడగును (53). ఎవడైతే చైత్ర శుక్ల తదియనాడు భవానీ వ్రతమును చేయునో, వాడు సంసార బంధమునుండి వినిర్ముక్తుడై పరమపదమును పొందును (54), ఆ తదియనాడే వివేకియగు భక్తుడు శంకరునితో కూడియున్న జగన్మాతయగు ఉమాదేవిని పవళింపు సేవతో ఆరాధించవలెను (55). అపుడు మహామాయ, మహేశ్వరి, శివునితో కూడియున్నది, మంగళముల నన్నింటినీ చేయునది అగు శ్రీ గౌరీదేవికి ధూపదీపనైవేద్యములు, పుష్పమాలలు, గంధము, పుష్పములు, కుంకుమ, వస్త్రములు, కర్పూరము, అగరుబత్తి, చందనము మొదలగు ద్రవ్యములతో పవళింపు సేవను చేయవలెను (56, 57). ఎవడైతే ప్రతి సంవత్సరము ఆ తిథినాడు నియమముతో వ్రతమును, పవళింపు సేవను చేయునో, వానికి

ఉమాదేవి సకలాభీష్టములనిచ్చును (58). వైశాఖ శుక్ల తదియకు అక్షయతృతీయ అని పేరు. ఆనాడు సాధకుడు సోమరీతనము లేనివాడై జగన్మాత యొక్క వ్రతమును చేయవలెను.

మల్లికామాలతీ చంపా జపాబంధూకపంకజైః ।
కుసుమైః పూజయేద్గౌరీం శంకరేణ సమన్వితామ్ ॥
కోటి జన్మకృతం పాపం మనో వాక్కాయ సంభవమ్ ।
నిర్ధూయ చతురో వర్గానక్షయానిహ సోఽశ్నుతే ॥
జ్యేష్ఠ శుక్లతృతీయాయాం వ్రతం కృత్వా మహేశ్వరీమ్ ।
యోఽ ర్చయేత్పరమ ప్రీత్యా తస్యాసాధ్యం న కించన ॥
ఆషాఢశుక్ల పక్షీయ తృతీయాయాం రథోత్సవమ్ ।
దేవ్యాః ప్రియతమం కుర్యాద్యథావిత్తాను సారతః ॥
రథం పృథ్వీం వీజానీయాద్రథాంగే చంద్రభాస్కరౌ।
వేదానశ్వాన్ విజానీయాత్సారథిం పద్మసంభవమ్ ॥
నానామణి గణాకీర్ణం పుష్పమాలా విరాజితమ్ ।
ఏవం రథం కల్పయిత్వా తస్మిన్ సంస్థాపయేచ్ఛివామ్ ॥
లోకసంరక్షణార్థాయ లోకం ద్రష్టుం పరాంబికా ।
రథమధ్యే సంస్థితేతీ భావయేన్మతిమాన్నరః ॥
రథే ప్రచలితే మందం జయశబ్ద ముదీరయేత్ ।
పాహి దేవి జనానస్మాన్ ప్రపన్నాన్ దీనవత్సలే ॥
ఇతి వాక్యైస్తోషయేచ్చ నానావాదిత్రనిస్స్వనైః।
సీమాంతే తు రథం నీత్వా తత్ర సంపూజయేద్రథే ॥
నానాస్తోత్రైస్తతస్తు త్వాప్యానయేత్తాం స్వవేశ్మని ।
ప్రణిపాతశతం కృత్వా ప్రార్థయేజ్జగదంబికామ్ ॥

మల్లెలు, జాజి, సంపెంగలు, దాసాని, మంకెన అనే పుష్పములతో, మరియు పద్మములతో శంకరుని కూడియున్న గౌరిని పూజించవలెను (60). అట్టి వాడు మన స్సు తో, వాక్కుతో, దేహముతో కోటి జన్మలలో చేసిన పాపమును తొలగించుకొని, అక్షయువులగు ధర్మార్థకామమోక్షములను ఈ లోకములో పొందును (61). ఎవడైతే జ్యేష్ఠశుక్ల తదియనాడు వ్రతమును పూని మహేశ్వరిని మహానందముతో అర్చించునో, వానికి అసాధ్యము ఏదియు లేదు (62). భక్తుడు తన సంపదకు అనురూపముగా ఆషాడశుక్ల తదియనాడు దేవికి మిక్కిలి ప్రియమగు రథోత్సవమును చేయవలెను (63). ఆ రథము భూమి అనియు, సూర్యచంద్రులే చక్రములనియు, గుర్రములు వేదములనియు, సారథి బ్రహ్మ అనియు భావన చేయవలెను (64). అనేక మణుల సమూహములతో అంతటా ఆ రథమును అలంకరించి పుష్పమాలలతో విరాజిల్లునట్లు చేసి, దానియందు ఉమాదేవిని చక్కగా స్థాపించవలెను (65). బుద్ధిమంతుడగు మానవుడు, లోకములను రక్షించే ఉద్దేశ్యముతో ఆ జగన్మాత లోకులను చూచుట కొరకై

రథమధ్యమునందు ఉన్నదని భావించవలెను (66). రథము కదలినప్పుడు మెల్లగా జయశబ్దమును పలుకవలెను. 'ఓ దేవీ! దీనులయందు వాత్సల్యము గల ఓ తల్లీ ! నిన్ను శరణు పొందిన ఈ జనులను రక్షింపుము' అను వాక్యములతో దేవిని సంతోషపెట్టవలెను. అనేక వాద్యములను మ్రోగిస్తూ రథమును ఊరి బయట వరకు తీసుకు వెళ్లి అచట రథమునందు చక్కగా పూజించవలెను (67,68). తరువాత అనేక స్తోత్రములతో ఆ జగన్మాతను స్తుతించి, మరల స్వస్థానమునకు గొనివచ్చి, వంద పర్యాయములు నమస్కరించి, ప్రార్థించవలెను.

ఏవం యః కురుతే విద్వాన్ పూజావ్రత రథోత్సవమ్ ।
ఇహ భుక్త్వాఖిలాన్ సోఽంఽతే దేవీపదం వ్రజేత్ ॥
శుక్లాయాం తు తృతీయాయామేవం శ్రావణభాద్రయోః।
యో వ్రతం కురుతేఽబాయాః పూజనం చ యథావిధి ॥
మోదతే పుత్రపౌత్రాద్యైర్ధనాద్యైరిహ సంతతమ్ ।
సోఽంఽతే గచ్ఛేదుమాలోకం సర్వలోకోపరి స్థితమ్ ॥
ఆశ్వినే ధవలే పక్షే నవరాత్రవ్రతం చరేత్ ।
యత్కృతే సకలాః కామాస్సిద్ధ్యంత్యేవ న సంశయః ॥
నవరాత్ర వ్రతస్యాస్య ప్రభావం వక్తుమీశ్వరః ।
చతురాస్యో న పంచాస్యో న షడాస్యో న కోఽపరః ॥
నవరాత్రవ్రతం కృత్వా భూపాలో విరథాత్మజః ।
హృతం రాజ్యం నిజం లేభే సురథో మునిసత్తమాః ॥
ధ్రువసంధిసుతో ధీమానయోధ్యాధి పతిర్నృపః ।
సుదర్శనో హృతం రాజ్యం ప్రాపదస్య ప్రభావతః ॥
వ్రతం జుమిమం కృత్వా సమారాధ్య మహేశ్వరీమ్ ।
సంసారబంధనాన్ముక్తస్సమాధిర్ముక్తి భాగభూత్ ॥
తృతీయాయాం చ పంచమ్యాం సప్తమ్యామష్టమీతిథౌ ।
నవమ్యాం వా చతుర్ధశ్యాం యో దేవీం పూజయేన్నరః ॥
ఆశ్వినస్య సితే పక్షే వ్రతం కృత్వా విధానతః ।
తస్య సర్వం మనో భీష్టం పూరయత్యనిశం శివా ॥

వివేకియగు ఏ మానవుడు ఈ విధముగా పూజను, వ్రతమును, రథోత్సవము◌ను చేయునో, అట్టివాడు ఇహలోకములో భోగములన్నిటినీ అనుభవించి, మరణించిన తరువాత దేవీ లోకమును పొందును (70), శ్రావణ భాద్రపద మాసములలో శుక్ల తృతీయా తిథినాడు ఎవడైతే ఈ విధముగా అంబను యథావిధిగా వ్రతమును చేసి పూజించునో (71), అట్టివాడు ఇహలోకములో సర్వకాలములయందు పుత్రులు, పౌత్రులు మొదలగు వారితో, మరియు ధనము మొదలగు వాటితో ఆనందించి, మరణించిన పిదప లోకములన్నింటికీ పైన ఉన్న ఉమాలోకమును పొందును (72). ఆశ్వయుజ శుక్ల పక్షములో నవరాత్ర వ్రతమును చేయవలెను. దానిని చేసినచో, కోర్కెలన్నీయు సిద్ధించుననుటలో సంశయము

లేశమైననూ లేదు (73). ఈ నవరాత్రవ్రతముయొక్క మహిమను చెప్పుటకు బ్రహ్మగాని, శివుడు గాని, కుమారస్వామి గాని సమర్థులు కారన్నచో, ఇతరుల గురించి చెప్పునదేమున్నదీ ? (74) ఓ మహర్షులారా ! విరథుని కుమారుడగు సురథమహారాజు నవరాత్ర వ్రతమును చేసి, కోల్పోయిన తన రాజ్యమును పొందెను (75). దీని ప్రభావము వలన బుద్ధిశాలి,. అయోధ్యకు ప్రభువు అగు ధ్రువసంధి పుత్రుడైన సుదర్శన మహారాజు కోల్పోయిన రాజ్యమును పొందెను (76). సమాధి ఈ శ్రేష్ఠవ్రతమును చేసి మహేశ్వరిని చక్కగా ఆరాధించి సంసారబంధమునుండి విముక్తుడై మోక్షమును పొందెను (77). ఏ మానవుడైతే తదియ, పంచమి, సప్తమి, అష్టమి, నవమి, చతుర్దశి అను తిథులలో ఒకనాడు దేవిని పూజించునో (78), ఆశ్వయుజ శుక్ల పక్షములో యథావిధిగా వ్రతమును చేయునో, వాని మనోభీష్టములనన్నింటినీ శివాదేవి ఎల్లవేళలయందు నెరవేర్చును .

యః కార్తికస్య మార్గస్య పౌషస్య తపసస్తథా ।
తపస్యస్య సితే పక్షే తృతీయాయాం వ్రతం చరేత్ ॥
లోహితైః కరవీరాద్యైః పుష్పైర్ధూపైస్సు గంధితైః ।
పూజయేన్మంగలాం దేవీం స సర్వం మంగలం లభేత్ ॥
సౌభాగ్యాయ సదా స్త్రీభిః కార్యమేతన్మహా వ్రతమ్ ।
విద్యాధనసుతాప్త్యర్థం విధేయం పురుషైరపి ।
ఉమామహేశ్వరా దీని వ్రతాన్యన్యాని యాన్యపి ।
దేవీప్రియాణి కార్యాణి స్వ భక్త్యైవం ముముక్షుభిః ॥
సంహితేయం మహాపుణ్యా శివభక్తి వివర్ధినీ ।
నానాఖ్యాన సమాయుక్త భుక్తి ముక్తి ప్రదా శివా ॥
య ఏనాం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
పఠేద్వా పాఠయేద్వాపి స యాతి పరమాం గతిమ్ ॥
యస్య గేహే స్థితా చేయం లిఖితా లలితాక్షరైః ।
సంపూజితా చ విధివత్సర్వాన్ కామాన్ స ఆప్నుయాత్ ॥
భూతప్రేత పిశాచాదిదుష్టేభ్యో న భయం క్వచిత్ ।
పుత్రపౌత్రాది సంపత్తిం లభత్యేవ న సంశయః ॥
తస్మాదియం మహాపుణ్యా రమ్యోమా సంహితా సదా ।
శ్రోతవ్యా పఠితవ్యా చ శివభక్తి మభీప్సుభిః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే ఉమాసంహితాయాం క్రియాయోగ నిరూపణం నామ ఏక పంచాశత్తమోఽ ధ్యాయః ॥
॥ సమాప్తేయం పంచమ్యుమాసంహితా ॥

ఎవడైతే కార్తీక- మార్గశీర్ష- పుష్య- మాఘ- ఫాల్గుణ మాసములలో శుక్ల పక్ష తదియనాడు వ్రతమును చేయునో (80), మంగళాదేవిని ఎర్రగన్నేరు మొదలగు పుష్పములతో, ధూప గంధములతో పూజించునో, వానికి సకలమంగళములు కలుగును (81). స్త్రీలు సౌభాగ్యము కొరకై ఈ మహావ్రతమును సర్వదా చేయవలెను. పురుషులు కూడ విద్య, ధనము, పుత్రుడు అనువాటిని పొందుట కొరకై చేయదగును (82). మోక్షమును కోరువారు ఈ విధముగా మంచి భక్తితో ఉమామహేశ్వరవ్రతము మొదలగు, దేవికి ప్రీతిని కలిగించే వ్రతములను చేయవలెను (83). పరమపవిత్రమగు ఈ సంహిత శివభక్తిని విశేషముగా వర్ధిల్లజేయును. అనేక గాథలతో గూడిన, మంగళప్రదమగు ఈ సంహిత భుక్తిని ముక్తిని ఇచ్చును (84). ఎవడైతే దీనిని భక్తితో వినునో, ఏకాగ్ర మనస్కుడై వినిపించునో, చదువునో, చదివించునో, వాడు పరమగతిని పొందును సుందరమగు అక్షరములతో వ్రాయబడిన ఈ పుస్తకము ఎవని ఇంటిలో ఉండే యథావిధిగా పూజింపబడునో, వాడు సకలాభీష్టములను పొందును (86). వానికి భూతప్రేతపిశాచాది దుష్టశక్తుల వలన ఎన్నడైననూ భయము ఉండదు. వాడు పుత్రపౌత్రాది సంపదలను నిస్సంశయముగా పొందును (87). కావున, మిక్కిలి పవిత్రమైనది, సుందరమైనది అగు ఈ ఉమాసంహితను శివభక్తిని కోరు మనుజులు సర్వదా పఠించవలెను, శ్రవణము చేయవలెను .

శ్రీ శివమహాపురాణములోని ఉమా సంహితయందు క్రియా యోగనిరూపణమనే ఏబది ఒకటవ అధ్యాయము ముగిసినది.

ఉమాసంహిత ముగిసినది.

హరిః ఓం తత్సత్ శ్రీ కృష్ణార్పణమస్తు.